# అర్థ శాస్త్రం

# ద్రవ్యం, బ్యాంకింగ్

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
CM0221

డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్
1996

CM-0221
31-3-97

# రచయితల బృందం

Dr. B R.A.O.U. LIBRARY
Acc. No... CM-0221
Date...
Call No ...

**సంపాదకుడు**
శ్రీ కె. సతీష్ రెడ్డి

**సహ సంపాదకులు**
ఆచార్య పి. రామయ్య
డా ॥ బి. సుందర్ రావు

**రచయితలు**
ఆచార్య ఎస్. కిషన్ రావు
ఆచార్య వి. లక్ష్మణ రావు
ఆచార్య సి.ఎస్.ఎన్.రాజు
డా ॥ ఎ. సుదర్శన్ రెడ్డి
డా॥ సి. దేవరాజులు నాయుడు
శ్రీ జి.వి. రంగారావు
డా ॥ ఎస్. సుధాకర్
డా ॥ ఎ. నకులా రెడ్డి
డా ॥ ఎస్. లింబా గౌడ్
డా ॥ ఎం. ప్రభాకర్ రెడ్డి

**మూల్యాంకనం**
ఆచార్య తిప్పారెడ్డి

**ముఖచిత్రం**
శ్రీ చంద్ర

**గ్రాఫిక్స్**
శ్రీ ఎం. రమేశ్

ప్రథమ ముద్రణ : 1996

**© డా ॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం**

అన్ని హక్కులు విశ్వ విద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా ఉపయోగించదలచుకొంటే విశ్వ విద్యాలయ అనుమతి పొందాలి. ఈ పాఠాలు సార్వత్రిక విశ్వ విద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం. పాఠ్య ప్రణాళిక మొత్తం వివరాలు ఈ పుస్తకం చివరలో వున్నాయి.

ఇతర వివరాలకు డైరెక్టర్ (అకడమిక్), డా ॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రోడ్ నం. 46, జుబిలీ హిల్స్, హైదరాబాద్ - 500 033 ను సంప్రదించవచ్చు.

ముద్రణ
చిత్రలిపి ప్రింటర్స్, గోల్కొండ క్రాస్ రోడ్స్, హైదరాబాద్. ✆ 7631001

# పుస్తక పరిచయం

ద్రవ్యం ఆర్థిక వ్యవస్థకు గుండె వంటిది. ద్రవ్యం లేకుండా వస్తు సేవలను వినిమయం చేసుకోవడం చాలా కష్టం. పూర్వకాలంలో వస్తు మార్పిడి పద్ధతి అమలులో వున్నప్పటికీ ఆ పద్ధతిలో వున్న ఇబ్బందుల మూలంగా అనేక రూపాలలో క్రమంగా రూపాంతరం చెంది ద్రవ్యం ఏర్పడింది. వస్తు రూపం నుండి కాగిత రూపంకు, క్రెడిట్ కార్డుల స్థాయికి మార్పు చెందింది. ద్రవ్య సప్లయ్‌లో $M_1, M_2, M_3, M_4$ అను రూపాలు వున్నాయి. ద్రవ్య సప్లయ్‌ని అనేక కారకాలు నిర్ణయిస్తాయి. అదేవిధంగా ద్రవ్య డిమాండ్ కూడా వివిధ అంశాలపై ఆధారపడుతుంది. ద్రవ్య డిమాండ్‌కు సంబంధించి సంప్రదాయ వాదులు, కేన్స్, కేన్సియన్ వాదులు వారి వారి దృక్పథాలను వ్యక్త పరిచారు. ఆధునిక కాలంలో బ్యాంకింగ్ వ్యవస్థ ఎంతో అభివృద్ధి చెందింది. ద్రవ్య, మూలధన మార్కెట్లు ఏర్పడ్డాయి. వివిధ బ్యాంకింగ్ సంస్థలను కేంద్ర బ్యాంకు నియంత్రిస్తుంది. అన్ని అభివృద్ధి బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, బాంకేతర విత్త సంస్థలు విస్తరించాయి. భారతదేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను, ద్రవ్య విత్త వ్యవస్థలను, అభివృద్ధి చేయడానికి గాను, వాటిలో సంస్కరణలు తేవడానికి గాను ఏర్పరచబడిన కమిటీలు ఎన్నో సూచనలను చేసాయి. వాటిని అమలు పరిచే ప్రయత్నాలు జరిగాయి, జరుగుతున్నాయి.

ఈ పుస్తకం డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారి ఎం.ఎ. అర్థశాస్త్రం రెండవ సంవత్సర పాఠ్య ప్రణాళికలో పొందుపరచిన "ద్రవ్యం, బ్యాంకింగ్" లోని పాఠ్యాంశాలను వివరిస్తుంది. అధ్యయన సౌలభ్యం కోసం పాఠ్య ప్రణాళికను ఖండాలుగా, ఈ ఖండాలను వివిధ భాగాలుగా విభజించాం. సాధారణంగా ప్రతి ఖండం ఒక ప్రత్యేక విషయాన్ని అధ్యయనం చేస్తుంది. ప్రతి భాగం దాని విషయ సూచికతో ఆరంభమై, ఉద్దేశాలు, విషయాల వివరణతో కొనసాగి సారాంశంతో ముగుస్తుంది. మాదిరి పరీక్షా ప్రశ్నలను, సంప్రదింపు గ్రంథాలను, పదకోశాలను విద్యార్థుల సౌకర్యార్థం భాగం చివరలో ఇచ్చాం.

"ద్రవ్యం, బ్యాంకింగ్" అను ఈ కోర్సులో ఆరు ఖండాలు ఉన్నాయి. మొదటి ఖండం ద్రవ్య పరిణామ క్రమాన్ని, ద్రవ్య సప్లయ్‌ని భారత దేశాన్ని సోదాహరణంగా తీసుకొని చర్చించింది. రెండవ ఖండం ద్రవ్య డిమాండ్‌ను, దానికి సంబంధించిన వివిధ సిద్ధాంతాలను వివరించింది. మూడవ ఖండం ద్రవ్యానికి సంబంధించిన వివిధ సమస్యలను, దృక్పథాలను విశ్లేషిస్తుంది. నాల్గవ ఖండం వాణిజ్య బ్యాంకింగ్ వ్యవస్థను, అభివృద్ధి బ్యాంకులను ద్రవ్య మూలధన మార్కెట్లను, బ్యాంకేతర విత్త సంస్థలను విశదీకరిస్తుంది. ఐదవ భాగం కేంద్ర బ్యాంకు వ్యవస్థను, విధులను భారతదేశాన్ని ఉదాహరణగా తీసుకొని చర్చించింది. చివరి (ఆరవ) ఖండం విత్త వ్యవస్థను, విత్త సంస్కరణలను విశ్లేషిస్తుంది.

BRAOU

BRAOU

# విషయ సూచిక


| | భాగం పేరు | పేజీ |
|---|---|---|
| | **ఖండం I : ద్రవ్య సప్లయ్** | 1 |
| భాగం - 1 : | ద్రవ్యం : పరిణామం, స్వభావం, ప్రాధాన్యత | 3 |
| భాగం - 2 : | భారతదేశంలో ద్రవ్య సప్లయ్ కొలమానాలు | 50 |
| భాగం - 3 : | ద్రవ్య సప్లయ్‌కి సంబంధించి 'H' సిద్ధాంతం - ద్రవ్య గుణకం | 61 |
| భాగం - 4 : | ద్రవ్య సప్లయ్‌ని ప్రభావితం చేయు కారకాలు - భారతీయ రిజర్వు బ్యాంకు వివరణ | 71 |
| | **ఖండం II : ద్రవ్య డిమాండ్** | 81 |
| భాగం - 5 : | ద్రవ్యరాశి సిద్ధాంతాలు : సాధారణ ధరల స్థాయిపై ఫిషర్, కేంబ్రిడ్జ్ దృక్పథాలు | 83 |
| భాగం - 6 : | ద్రవ్య డిమాండ్ దృక్పథాలు : సంప్రదాయ వాదులు, కేన్స్ | 115 |
| భాగం - 7 : | కేన్సియన్ల, ఉత్తర - కేన్సియన్ల, ఫ్రీడ్‌మన్‌ల ద్రవ్య డిమాండ్ దృక్పథాలు | 138 |
| | **ఖండం III : ద్రవ్యం : సమస్యలు, దృక్పథాలు** | 161 |
| భాగం - 8 : | ద్రవ్యం - విత్తాభివృద్ధి | 163 |
| భాగం - 9 : | ప్రసార యంత్రాంగం | 186 |
| భాగం - 10 : | ద్రవ్యోల్బణం : సిద్ధాంతాలు, కారణాలు, ప్రభావాలు | 194 |
| భాగం - 11 : | సాధారణ ధరల స్థాయి గణన | 214 |
| భాగం - 12 : | కేన్స్ పరమైన వాదం, ద్రవ్య వాదం | 230 |
| భాగం - 13 : | హేతుబద్ధ అంచనాల పరికల్పన | 242 |


BRAOU

BRAOU

# ఖండం - I

## ద్రవ్య సప్లయ్

ఆధునిక ఆర్థిక వ్యవస్థలకు హృదయం లాంటిది ద్రవ్యం. అందుకే ఈ ఖండంలోని మొదటి భాగంలో ద్రవ్యం అంటే ఏమిటో, ద్రవ్య పరిణామ క్రమం ఏ విధంగా వుందో, ద్రవ్య లక్షణాలు, ద్రవ్య విధులు ఏమిటో చర్చిస్తూ : ద్రవ్య వర్గీకరణను, వివిధ రకాల ఆర్థిక వ్యవస్థలలో ద్రవ్య ప్రాముఖ్యతను తెలుసుకొందాం.

రెండవ భాగంలో భారతదేశంలోని ద్రవ్య సప్లయ్ కొలమానాలను, అందుకు సంబంధించిన వివిధ భావనలను వివరించాం. ద్రవ్య సప్లయ్‌కి సంబంధించి 'హెచ్' (H) సిద్ధాంతాన్ని మూడవ భాగంలో చర్చించాం. ఈ ఖండంలోని చివరిదైన నాల్గవ భాగంలో ద్రవ్య సప్లయ్‌ని ప్రభావిత పరిచే ముఖ్య కారకాలను భారతదేశాన్ని సోదాహరణంగా తీసుకొని విశదీకరించాం.

ఈ ఖండంలో గల నాలుగు భాగాలు :

1. ద్రవ్యం : పరిణామం, స్వభావం, ప్రాధాన్యత
2. భారతదేశంలో ద్రవ్య సప్లయ్ కొలమానాలు
3. ద్రవ్య సప్లయ్‌కి సంబంధించి 'హెచ్' (H) సిద్ధాంతం - ద్రవ్య గుణకం
4. ద్రవ్య సప్లయ్‌ని ప్రభావితం చేయు కారకాలు - భారతీయ రిజర్వు బ్యాంకు వివరణ

BRAOU

BRAOU

# భాగం - 1 : ద్రవ్యం : పరిణామం, స్వభావం, ప్రాధాన్యత

విషయ క్రమం


1.0 ఉద్దేశాలు

1.1 ద్రవ్య పరిచయం

1.2 ద్రవ్య పరిణామం

1.2.1 వినిమయం లేని వ్యవస్థలు

1.2.2 వస్తు వినిమయ పద్ధతి

1.2.3 ద్రవ్యం పుట్టుక

1.2.4 ద్రవ్య పరిణామ క్రమం - మార్పులు

1.3 ద్రవ్య భావన

1.3.1 ద్రవ్యం అంటే ఏమిటి ?

1.3.2 ద్రవ్య నిర్వచనాలు

1.4 ద్రవ్య లక్షణాలు

1.5 ద్రవ్య విధులు

1.5.1 విధుల వర్గీకరణ

1.5.2 విధుల విపులీకరణ

1.6 ద్రవ్య స్వభావం

1.7 ద్రవ్య వర్గీకరణ

1.7.1 వస్తువును బట్టి వర్గీకరణ

1.7.2 చట్ట బద్ధతను బట్టి వర్గీకరణ

1.7.3 జారీ చేసే విధానాన్ని బట్టి వర్గీకరణ

1.7.4 ద్రవ్య స్వభావాన్ని బట్టి వర్గీకరణ

1.8. ద్రవ్య ప్రాధాన్యత

1.9. ముగింపు

1.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

1.11 సంప్రదింపు గ్రంథాలు

1.12 పదకోశం


BRAOU

## 1.0 ఉద్దేశాలు

ద్రవ్యం అంటే ఏమిటో తెలుపటం ఈ భాగం ప్రధాన లక్ష్యం. ద్రవ్యం పుట్టుక నుండి నేడు అది ఎంతటి ప్రాధాన్యతను సంతరించుకున్నదో తెలియచేయడమే ఈ భాగం ఉద్దేశం. ద్రవ్యం పరిణతికి దారి తీసిన ద్రవ్యపు చరిత్రను తెలుసుకొనే లక్ష్యంలో భాగంగా ద్రవ్య పరిణామం, భావనలు, స్వభావం, ప్రాధాన్యతలను తెలుసుకొందాం.

## 1.1 ద్రవ్య పరిచయం

ద్రవ్యం ఆర్థిక వ్యవస్థకు గుండెలాంటిది. ద్రవ్యం లేని వ్యవస్థలు ఇబ్బందులు లేకుండా సాఫీగా లావాదేవీలు జరుపలేవు. లావాదేవీలంటే ఇవ్వడం -పుచ్చుకోవడం. దీనినే వినిమయం (exchange) అని అంటాము. ఉత్పత్తికి వినియోగానికి మధ్య పొందిక కలుగచేసేదే వినిమయం. వినిమయం లేని రోజులు కూడా ఉండేవి. 40 శతాబ్దాలకు పూర్వం ప్రాచీన శిలాయుగం తొలిదశలో వస్తువులను ఇచ్చి పుచ్చుకోవడం లేకుండేది. దొరికిందే తినేవారు. ఆ తర్వాత నవీన శిలాయుగం నాటికి పరస్పర సహకారం పెరిగింది, సమాజం రూపొందింది. అప్పుడే వస్తు వినిమయం మొదలైంది. కాని అనేక ఇబ్బందులుండేవి. ఆ ఇబ్బందులను తొలగించుకోవడానికి క్రమంగా ద్రవ్యం ఏర్పడింది. అట్టి ద్రవ్యం ఏదో ఒక రూపంలో అనేక మార్పులకు, మార్పుల వేగానికి చాలా తోడ్పడింది. 'ధన మూలం ఇదం జగత్ ' అంటున్నామంటే దాని ప్రాధాన్యత ఎంతో తెలుసుకోవచ్చు. అట్టి ద్రవ్యం అనేక రూపాలలో రూపాంతరం చెంది రూపు దిద్దుకుంటున్నది. వస్తురూపం నుండి క్రెడిట్ కార్డుల స్థాయికి చేరింది. అట్టి ద్రవ్యమే లేకుంటే ఇంత చైతన్యవంతమైన ఆర్థిక, వాణిజ్య, సంక్షేమ కార్యకలాపాలు కొనసాగేవే కావు, నాగరికత విస్తరించేది కాదు. ద్రవ్యం అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు, పరపతి కూడా ద్రవ్యమే. ఇప్పుడు మనం అంగీకరిస్తున్న ద్రవ్యపు శాతాన్ని పరిశీలిస్తే దాని అవతరణ పరిణామాలు తెలుస్తాయి. అందుకే ద్రవ్య పరిణామాన్ని మొదట తెలుసుకుందాం.

## 1.2 ద్రవ్య పరిణామం

మానవుడు సమిష్టి జీవనానికి ముందు ద్రవ్యాన్ని గురించి ఆలోచించలేదు. కేవలం తన అవసరాలను వ్యక్తిగతంగా తీర్చుకునేవాడు. ఆదిమజాతి జీవనం గడిపేవాడు.

### 1.2.1 వినిమయం లేని వ్యవస్థలు

పురావస్తు ఆధారాలను బట్టి మానవజాతి నలుబది వేల సంవత్సరాల క్రితం రూపొందింది. హోమోనిడులనబడే ఆ జాతి చెట్ల మీద, పండ్లమీద ఆధారపడేవారు. ప్రకృతి అందించే వస్తువులపై ఎక్కువగా ఆధారపడేవారు. ఆ తర్వాత కాలంలో చిన్న చిన్న జంతువులను వేటాడి తమ అవసరాలు తీర్చుకునేవారు. అలాంటి ప్రాచీన శిలాయుగంలో జీవించిన మానవ జాతి మొదట్లో వినిమయం లేకుండా జీవించి ఉండవచ్చు. పెద్ద పెద్ద జంతువులను కలసి వేటాడటం, పరస్పరం సహకరించుకోవటం అనేవి వినిమయం ఏర్పడటానికి తొలిదశలు. కుటుంబ వ్యవస్థ మొదలైనప్పటి నుండి కోరికలు పెరగసాగాయి. అంతవరకు కూడా ఉత్పత్తికాగానే వినియోగం చేయటం వల్ల వినిమయం అంతగా లేకుండేది. అందువల్లనే వినిమయానికి ఉపయోగపడే ద్రవ్య అవసరం లేకపోయేది. సమాజాలు ఏర్పడక ముందు జీవనం దుర్భరంగా, అనిశ్చితంగా ఉండేది. కలసి జీవించటం, కుటుంబాన్ని, జాతిని ఏర్పరచుకోవటం నుండి నాగరికతలు విస్తరిల్లే వరకు ప్రజల జీవన ప్రమాణాలలో మంచి మార్పు వచ్చింది. దానికి కారణం వినిమయమే. ద్రవ్యం లేని వ్యవస్థలు అంటే వినిమయం

లేనట్టుకాదు. వినిమయం ఉన్నా ద్రవ్యం లేక పోవచ్చు. కాని ద్రవ్యం ఉంటే వినిమయం ఉన్నట్లే. ఆధునిక యుగంలో నేడు కూడా కొన్ని సామ్యవాద దేశాలు ద్రవ్యం లేకుండా ఆర్థిక కార్యకలాపాలు చేపట్టవచ్చు, కాని వినిమయం లేకుండా కాదు. ధరల యంత్రాంగం ఉండదు కాని, వినిమయ సాధనాలు లేకుండా సామ్యవాద దేశాలు కూడా పనిచేయలేవు.

### 1.2.2 వస్తు వినిమయ పద్ధతి

మానవుడు మొదట్లో మనుగడకోసం కేవలం తిండి తిని, తనను తాను రక్షించుకునేవాడు. కుటుంబం, పరస్పర సహకారం పెరిగే కొద్దీ అవసరాలు పెరిగాయి. మొట్టమొదట వేటకోసం వాడే పరికరాలకు, బాణాలకు బదులు వేటాడిన జంతువునో, మాంసాన్నో ఇవ్వటం జరిగేది. పశువుల పెంపకం, పోడు వ్యవసాయం (తరలిపోతూ చేసే వ్యవసాయం) చేసే నాటికి జంతువులను, పశువులను ఇచ్చి ధాన్యాన్ని తీసుకోవటం వంటి లావాదేవీలు జరిగేవి. దాదాపు 9 వేల సంవత్సరాల క్రితం వ్యవసాయక గ్రామాలు ఏర్పడినాయి. వ్యవసాయపు ఉత్పత్తులు, పనిముట్లు, వాడకపు వస్తువులైన పెనం, తిరుగలి, కుండల వాడకం పెరిగిన కొద్దీ ప్రజల మధ్య కొత్త సంబంధాలు ఏర్పడ్డాయి. వివిధ వృత్తులు ఏర్పడి వారి మధ్య వినిమయం పెరిగింది. నాగరికతలు పెంచటానికి తోడ్పడిన ఇనుము వాడకం పెరిగే నాటికి (4 వేల సంవత్సరాల క్రితం) వస్తు వినిమయానికి బదులు ద్రవ్యం వాడకం మొదలైంది. అంతవరకు కూడా వస్తు వినిమయమే ఉండేది. భారత దేశంలో ఇప్పటికీ కొన్ని గిరిజన, కొండ ప్రాంతాల్లో వస్తువులనిచ్చి వస్తువులను తీసుకోవటం ఉంది. తేనే ఇచ్చి ఉప్పు కొనుక్కోవటం, ధాన్యం ఇచ్చి మిరపకాయలు తీసుకోవటం గమనించవచ్చు. మానవులు వస్తువులను ఇచ్చి తనకు అవసరమున్న వస్తువులను పుచ్చుకోవటాన్నే 'వస్తు వినిమయం ' అంటారు.

ధాన్యాన్ని ఇచ్చి వస్త్రాన్ని, కుండలనిచ్చి ధాన్యాన్ని పొందటంలాంటి లావాదేవీలే వస్తు వినిమయాలు లేదా వస్తు మార్పిడి. వినిమయం చేయబడే వస్తువులకు మధ్య ఏదేని సాధనం గాని, మాధ్యమం గాని, వస్తువుగాని వాడకుండా నేరుగా, ప్రత్యక్షంగా వస్తువులను ఇచ్చి పుచ్చుకునే పద్ధతే వస్తు వినిమయం పద్ధతి. రైతు తనకు కావలసిన ధాన్యాన్ని అట్టి పెట్టుకొన్న తర్వాతే తన మిగులు ఉత్పత్తిని ఇచ్చి నాగళ్ళు, బట్టల వంటి వస్తువులను తీసుకుంటాడు.

B R A O U

**వస్తు వినిమయ వ్యవస్థ లక్షణాలు**

(1) వినిమయ మాధ్యమం ఉండదు.

(2) ప్రత్యక్షంగా, నేరుగా వస్తువులనిచ్చి వస్తువులను (వేరే వాటిని) మార్చుకోవటం జరుగుతుంది.

(3) వ్యక్తుల మధ్య కోరికల సమన్వయం ఉన్నప్పుడే లావాదేవీలు జరుగుతాయి.

(4) ఇది అతి పురాతన పద్ధతి. అభివృద్ధి చెందని దశలో ఉన్న వ్యవస్థకు చెందుతుంది.

(5) లావాదేవీలు మందకొడిగా ఉంటాయి.

(6) పరిమిత మార్కెట్లు ఉంటాయి.

ఇలాంటి లక్షణాలు కలిగిన వస్తు వినిమయ పద్ధతి ద్రవ్యం, దాని ప్రత్యామ్నాయాలు లేనప్పుడు ఉండేది. ఖచ్చితంగా ద్రవ్యం ఎప్పుడు వాడబడిందనే ప్రశ్నకు, ఏరకమైన ద్రవ్యమో తెలిస్తే తప్ప జవాబు ఇవ్వలేం. ద్రవ్యం నాణేల రూపంలో క్రీ.పూ. 2000 సంవత్సరాల నాటికే వాడి ఉంటారు. త్రవ్వకాలలో బయటపడిన నాణెం

క్రీ.పూ. 700 సంవత్సరాల క్రితం 'లిడియా' (Lydia) ప్రాంతంలో బయటపడింది. రోమన్ సంస్కృతిలో అదొక భాగం. అంతకుముందు వస్తువులను ద్రవ్యంగా వాడేవారు.

వస్తువులను ప్రత్యక్షంగా మార్పిడి చేసుకోవటం వల్ల పరిమిత అవసరాలు తీరినా అందులో అనేక ఇబ్బందులుండేవి. అవసరాలు, ఉత్పత్తి, వినియోగాలు తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు మాత్రమే వస్తు వినిమయ పద్ధతి సరిపోయేది. అది కూడా ఇబ్బందిగానే ఉండేది. ఆర్థిక కార్యకలాపాలు సాఫీగా జరగాలన్నా, ఉత్పత్తి పెరగాలన్నా ఈ పద్ధతి ఉపయోగపడదు, పడలేదు. అందుకే దానికి బదులు వస్తు రూపంలో ద్రవ్యాన్ని వాడటం జరిగింది. ద్రవ్యం లేకముందు వస్తు వినిమయ పద్ధతిలో అనేక కష్టాలు ఉండేవి.

**వస్తు వినిమయ పద్ధతిలో లోపాలు - ఇబ్బందులు**

వస్తువును ప్రత్యక్షంగా ఇస్తే తప్ప తిరిగి వస్తువును పొందని వస్తు వినిమయ పద్ధతిలోని లోపాలను, ఇబ్బందులను దిగువన వివరించాం.

(1) రెండు పక్షాల (sides) మధ్య కోరికల సమన్వయం లేకపోవడం.

(2) విలువలను కొలిచే, తెలిపే ప్రామాణిక కొలమానం (standard measure) లేకపోవటం.

(3) వస్తువులను విభజించటానికి వీలు లేకపోవటం.

(4) వస్తువులను విలువ ఉంచుకోలేక పోవటం.

(5) భవిష్యత్తు చెల్లింపులకు, వాయిదా చెల్లింపులకు (deffered payment ) ఉపయోగపడకపోవటం.

(6) ప్రత్యేకీకరణ లేకపోవటం.

(7) రవాణాకు వీలులేకపోవటం.

(8) బదిలీ, మార్పు చేసే అవకాశం లేకపోవటం.

అంతేకాక వినిమయ మాధ్యమం లేకపోవటం లాంటి ఇబ్బందులుండేవి.

వస్తువులను మార్చుకునే వారి మధ్య సమన్వయం ఉండాలి. లేకుంటే వస్తు వినిమయం జరుగదు. ఒక వ్యక్తి తన వద్ద ఉన్న ఆవు (Cow) ను ఇచ్చి వేరే వ్యక్తి నుండి గుర్రాన్ని పొందాలనుకుంటాడు. కాని గుర్రం ఉన్న వ్యక్తికి తిండి గింజలు (ధాన్యం) అవసరం గాని ఆవు అవసరం లేదు. ధాన్యాన్ని తీసుకొని గుర్రాన్ని ఇవ్వటానికి సిద్ధంగా ఉండి, ఆవుని మాత్రం తీసుకోవటానికి ఇష్టపడకుంటే వినిమయం జరుగదు. కోరికల పొందిక, సమన్వయం లేకుంటే మార్పిడి ఉండదు. సంబంధిత కోరికల సమన్వయం ఉంటేనే వినిమయం సాధ్యమవుతుంది.

పైన చెప్పిన స్థితిలో, ఆ సమయంలో ఆవును ఇచ్చి ధాన్యాన్ని పొంది(తే) తిరిగి వాటిని గుర్రాన్ని కొనడం కోసం వాడాలి. దీనికి చాలా కాలం పడుతుంది. ఆ కాలంలో కోరికలే మారవచ్చు. సకాలంలో కోరికలు కూడా తీరవు.

ధాన్యాన్ని పండించే రైతుకు గుర్రాన్ని కొనాలని ఉన్నా, ప్రస్తుతం కాకుండా, కొన్ని నెలల తర్వాత మాత్రమే కొనాలని ఉంటే కూడా మార్పిడి జరుగదు. ఇద్దరి కోరికలు, ఒకే సమయంలో కలిగితే తప్ప లావాదేవీలు

BRAOU

ాగవు. ఇంతయినా ఒకే స్థలంలో ఆయా వస్తువులు అందుబాటులో లేకున్నా వస్తు మార్పిడి యుండదు. ంలో, విలువల లావాదేవీలో భేదం ఉన్నా మారకం జరగదు.

వస్తువులను పరస్పరం మార్చుకునే ప్రయత్నంలో తను ఇచ్చే వస్తువు విలువ ఎంతో, తీసుకునే వస్తువు ిలువ ఎంతో తెలిస్తే తప్ప మారకపు రేటు ఒప్పందం కుదరదు. ఖచ్చితంగా విలువ తెలియక వివాదాస్పద స్థితిలో ఇచ్చి పుచ్చుకోవటాలు కుదరవు. విలువలను కొలిచే ఏదైనా కొలమానం ఉంటే మాత్రం ఈ ఇబ్బంది తొలగుతుంది. ముఖ్యంగా వేటగాళ్ళ, లాయర్ల, డాక్టర్ల సేవల విలువలను లెక్కించటం కష్టమే.

వస్తువులను ద్రవ్యానికి అమ్మే వీలులేనప్పుడు తన వస్తువును విభజించలేక పోవటం మరొక సమస్య. గుర్రాన్ని ఇచ్చి గోధుమలు, కందులు తీసుకోవాలంటే, గోధుమలనిచ్చే రైతు వేరై, కందులను పండించే వ్యక్తి వేరైనప్పుడు, ఒకే గుర్రాన్ని రెండు భాగాలుగా విభజించటం సాధ్యం కాదు. విభాజ్యత వీలుకాకపోతే మారకం కష్టసాధ్యం. కొన్ని విలువలను పంచటానికి విభజించవచ్చు కాని అన్ని వస్తువులను విభజించలేం.

వస్తువుల స్వభావాన్ని బట్టి కూడా వస్తు మారకం ఆధారపడుతుంది. తనకు అవసరం ఉన్నప్పుడు వాడుకోవడానికి మారకం చేసి పెట్టుకోవాలంటే ఆ వస్తువు నశ్వరం (perishable) కాకూడదు, చెడిపోకుండా నిల్వ ఉండాలి. కుర్చీని ఇచ్చి పాలను, పండ్లను తీసుకుంటే ఆ పాలు, పండ్లు చాలా కాలం ఉంచుకోలేం, చెడిపోతాయి. అవసరానికి కోరికల సమన్వయం ఉండదన్న భయానికి, ముందుగానే వస్తు మార్పిడి చేసుకుందామంటే వస్తువులు కొన్ని నిల్వ ఉండకపోవచ్చు. విలువను కోల్పోయే, నిల్వ ఉండని గ్రుడ్లు, పాలు, పండ్లు, కూరగాయల విషయంలో ఈ ఇబ్బందులు కలుగుతాయి.

అవసరాలకు తగ్గ ఆదాయం లేకుంటే చేబదులుగానో, వడ్డీకో వస్తువులను తీసుకోవచ్చు. అట్టి అవకాశాల ఆధారంగానే నేటి ఉత్పత్తి అమ్మకాలు చాలా పెరిగాయి. ఆ అవకాశం లేకుంటే వ్యాపారం కూడా పరిమితంగా ఉంటుంది. వ్యాపార ఒప్పందాలను బట్టి నిర్ణీత కాల వ్యవధి తర్వాత చెల్లింపులుంటాయి. వస్తు వినిమయ పద్ధతిలో ఇది సాధ్యం కాదు. అది ఎట్లో చూద్దాం. పశువుల విషయంలో అవి 3వ ఏట (age ) నుండి 10 ఏండ్ల వరకు పని చేయగలుగుతాయి. ఒక పశువును 4వ ఏట బదులు తీసుకొని, దానినే తిరిగి 11వ ఏట వాపసు ఇస్తే అది ముసలి పశువై పనికి రానిదవుతుంది. తీసుకునేటప్పుడు ఉన్న పశువు విలువ, ఇచ్చేటప్పుడు కోల్పోవచ్చు. అందుకే వాయిదాల చెల్లింపు ఈ వస్తువుల విషయంలో కష్టం. దీనికి కారణం వస్తుసేవల నాణ్యత కాలగమనంలో మారవచ్చు, క్షీణించవచ్చు కూడా. నశ్వర వస్తువుల విషయంలో, నాణ్యత విలువలు మారే స్థితిలో, వస్తు మారక పద్ధతిలో ఈ ఇబ్బందులు తలెత్తుతాయి. కొన్ని వస్తువులు కొంత కాలం తర్వాత లభించకపోవచ్చు కూడా.

ప్రత్యేకీకరణ అంటే వస్తువుల తయారీలో ప్రత్యేక రకమైన విభజన ఉంటుంది. వస్త్రాన్ని చేయాలంటే దారాన్ని వడకటం, నేయటం, రంగుల అద్దకం మొదలైన అనేక రకాల ప్రక్రియలుగా విభజించటం, ఒక్కొక్క పని (ప్రక్రియ) లో కొందరిని నియమించటం శ్రమ విభజనయే. శ్రమ విభజనకు భారీ ఎత్తున అమ్మకాలు ఉండాలి. అట్టి విస్తృత మార్కెట్లకు ఈ వస్తు మారక పద్ధతి సరిపోదు. ఈ పద్ధతిలో సూక్ష్మ శ్రమ విభజన, ప్రత్యేకీకరణలు ఉండవు.

ద్రవ్యరూపంలో విలువ ఉంచుకునే అవకాశం ఈ వస్తు వినిమయ పద్ధతిలో ఉండదు. ఆస్తి హక్కులను బదిలీ చేయటం, సర్వజనాంగీకారాన్ని పొందటం వస్తు వినిమయ పద్ధతిలో ఉండవు. నేటి పరపతి సృష్టి, లోటు ద్రవ్యాల చలనాత్మక పాత్రలు వస్తు మార్పిడి పద్ధతికి అందని ఊహలే.

BRAOU

**పద్ధతిలో లాభ, నష్టాలు**

వస్తు మారక లేదా వస్తు వినిమయ పద్ధతి కొన్ని వందల సంవత్సరాలు కొనసాగిందంటే అప్పటి స్థితిలో అదే మెరుగైన విధానం. ఆ పద్ధతి చేసిన మేలేమిటంటే, దానిలోని లోపాలను సరిదిద్దుకోవటానికి అనేక మార్గాలను శోధించటం జరిగింది. ద్రవ్యాన్ని రూపొందించటానికి వస్తు మారకం తొలిమెట్టు. అప్పటి రోజుల్లో అదే విశిష్టంగా ఉండేది. నేరుగా తనకు కావలసిన వస్తువునే పొందటం వలన దళారీల బెడద తప్పిందనవచ్చు. కులాలు, జాతులు ఏర్పడటానికి, కొనసాగటానికి ఈ పద్ధతే కారణం. ఆదిమ జీవితానికి ఆధునిక నాగరికతలకు ఇదొక వారధి. నేటి కాలంలో ఉన్న వ్యాపార చక్రాల ఒడుదొడుకులు, ద్రవ్యోల్బణ, ఆర్థిక మాంద్య ఇబ్బందులు, ద్రవ్యం వల్ల కలిగే కష్టాలు ఆనాటి వినిమయ పద్ధతిలో లేకుండేవి. గ్రామీణ వ్యవస్థలలో దోపిడీ లేకుండేది.

లాభాల కన్న అనర్థాలు, ఇబ్బందులు ఎక్కువగా ఉండి, లావాదేవీలు, వ్యాపార వృద్ధికి అవరోధం కలగడం వల్ల ద్రవ్యం కోసం వెంపర్లాడటం జరిగింది. వృద్ధికి కావాల్సిన మూలధనం ఏర్పడటానికి, వాయిదా చెల్లింపులకుగాను, సౌకర్య, సౌలభ్యాలకుగాను మొదట వస్తురూపంలో ద్రవ్యం ఏర్పడింది.

### 1.2.3 ద్రవ్యం పుట్టుక (Origin) - లాభాలు

వస్తు వినిమయ పద్ధతిలోని ఇబ్బందులు తగ్గించటానికి వినిమయ మాధ్యమం అవసరమైంది. తమ తమ సమాజాలలో అందరికీ ఆమోద యోగ్యమై, వినిమయ సాధనంగా ఉపయోగపడే వస్తువుకోసం అన్వేషణ ప్రారంభమైంది.

జంతువులను వేటాడే సమాజాలు జంతువుల చర్మాన్ని ద్రవ్యంగా వాడితే, పశు పాలకులు పశువులను, వ్యవసాయ వ్యవస్థలు ధాన్యాన్ని ద్రవ్యంగా వాడినాయి. పెక్యూడస్ (pecudes) అనే లాటిన్ పదానికి అర్థం పశువు. దానిని ద్రవ్యంగా వాడినందున ద్రవ్యానికి పెక్యూనియరీ (pecuniary) అనే పదం వాడుతారు. పూర్వం గవ్వలు, దంతాలు కూడా సమిష్టిగా వినిమయానికి వాడబడేవి. ఒక మధ్యవర్తిలా, వినిమయానికి మాధ్యమంగా వస్తు రూపంగా ద్రవ్యం ఏర్పడింది. దీనితో పరోక్షంగా (indirect) వస్తువుల మారకం జరిగేది. వస్తువులు సామాన్య భాగాహార ఫలాలుగా (common denominator) ఉండేవి. కొలమానంగా కూడా ఉండేవి. వస్తు రూపంలోని ద్రవ్య లోటు పాట్లను తీర్చే విధంగా లోహద్రవ్యం, ఆ తర్వాత కాగితపు ద్రవ్యం రూపొందాయి. చరిత్రలో Gordon చైల్డ్, అర్థశాస్త్రంలో క్రౌథర్ అన్నట్లు ప్రతి శాస్త్రానికి కొన్ని ప్రాథమిక నవకల్పనలు ఉంటాయి. మెకానిక్స్‌లో చక్రం, రాజకీయ రంగంలో ఓటు విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. అలాగే అర్థశాస్త్రంలో మానవుని వ్యాపార సంబంధిత వ్యవహారాలలో ద్రవ్యం అతి ముఖ్య నవకల్పన.

ఇట్టి ద్రవ్యం (money) అనే పదం లాటిన్ పదమైన మొనెటా (moneta) నుండి వచ్చింది. రోమన్ దేవతయిన మొనెటా జూనో (Moneta Juno) అనేది మనం ధన లక్ష్మి అంటామే అలాంటి దేవత పేరు. సంపద, భాగ్యం, క్షేమం కోసం పూజ చేసే మొనెటా (Moneta) పేరే సుఖాన్ని, కొనుగోలు శక్తిని కలిగిన ద్రవ్యానికి వాడబడి 'మని' (money) అని పిలువబడింది. తెలుగులో ద్రవ్యత్వం కలిగిందే ద్రవ్యం. ఇది నీరువలె అత్యంత ప్రధానమైంది. నీరు ద్రవం కదా ! ఆ నీరు ఏ ఆకారం లోకి అయినా మారుతుంది. అలాగే ద్రవ్యం ఏ ఆకారంలోకి అయినా ఏ రూపంలోకైనా మారుతుంది. అలాటి ద్రవ్యంతో ఏ వస్తువైనా పొందవచ్చు. కాబట్టే మనీ (money) ని ద్రవ్యంగా, ద్రవ్యత్వం కలిగిందిగా అనువదించారు.

'మనీ' అనే పదం ఎప్పుడు పుట్టింది ? ఏ సమాజంలో మొట్టమొదట లావాదేవీలకు ద్రవ్యాన్ని వాడారో తెలుసుకోవటం చాలా కష్టమైన పని. ఇది చరిత్ర చాటున దాగిన సత్యం. కేన్స్ అభిప్రాయం ప్రకారం

ందువేల సంవత్సరాల క్రితమే శాస్త్రీయంగా ఇది రూపుదిద్దుకున్నది. టోయెన్‌బీ చరిత్రకారుడు, గ్రీకులు ద్రవ్యాన్ని ముద్రిత నాణేల రూపంలో వాడటాన్ని క్రీస్తు పూర్వం ఏడు వందల (700 BC ) సంవత్సరాలకు పూర్వమే జరిగిందని సాక్ష్యాధారాలతో తెల్పినారు. ద్రవ్యం రూపాంతరం చెంది ప్రస్తుత రూపం లోకి మారటం మానవుని మేధస్సు ఫలితం. ఇది అవసరానికి, ప్రగతికి అనుగుణ్యంగా మలచబడిన ప్రతిరూపం. ద్రవ్యవాడకం ప్రవేశపెట్టడం వల్ల వినిమయం, వ్యాపారం సులభంగా, సౌకర్యంగా మారడమేగాకుండా వినిమయ పద్ధతిలోని ఇబ్బందులను తొలగించటం జరిగింది.

ద్రవ్యాన్ని ప్రతి ఒక్కరు గుర్తించి అంగీకరించే స్థాయికి చేరింది. ద్రవ్యం వస్తువుల మారకానికి, వినిమయ సాధనంగా తోడ్పడి శ్రమ విభజన, ప్రత్యేకీకరణాలకు తోడ్పడింది. విభజించటానికి వీలుగా, రవాణాకు అనువుగా, వాయిదా చెల్లింపులకు ప్రమాణంగా, వృద్ధికి అలవాలంగా మారింది. నేడు ద్రవ్యం కేవలం నిష్క్రియా రూపంలో లేదు. ఇది వస్తూత్పత్తులను పెంచటానికి, వనరులను తరలించటానికి తోడ్పడుతున్నది. ఆదాయ సంపదల పెరుగుదలకు, పంపిణీకి, నిర్మాణాత్మక మార్పులకు, మూలధన సంచయనానికి, అంతర్జాతీయ వ్యాపార విస్తృతికి ఎంతగానో ఉపయోగపడుతున్నది. నేడు ఆర్థిక కార్యకలాపాలన్నీ ద్రవ్యం గుప్పిటిలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఇంత ప్రయోజనకారి అయిన ద్రవ్యం పరోక్షంగా వస్తు మార్పిడికి వాడబడినపుడు కలిగిన చారిత్రక మార్పులు క్రింది దశల వారీగా జరిగాయి.

### 1.2.4 ద్రవ్య పరిణామ క్రమం - మార్పులు

వస్తు మార్పిడి పద్ధతిలోని లోపాలను అంటే ప్రత్యక్షంగా వస్తువులనే ఇచ్చి వస్తువులను పుచ్చుకోవటం లోని ఇక్కట్లను తొలగించటానికి ప్రయత్నాలు మొదట ప్రారంభమయ్యాయి. జనామోదం పొందే వినిమయ సాధనంగా ఉండే ద్రవ్యం కోసం పడిన పాట్లకు మొదట వస్తు రూపంలోని ద్రవ్యం ఉపశమనం కలిగించింది.

#### (a) వస్తు రూప ద్రవ్యం (Commodity Money)

మానవుడు తాను ఉత్పత్తి చేసిన వస్తువులను, పరిసరాల్లో దొరికే వస్తువులను వినిమయ సౌలభ్యం కోసం ద్రవ్యంగా వాడినాడు. ఏ వస్తువులను వాడింది ఆయా వ్యవస్థలలో ఆర్థిక స్థాయిని బట్టి, సామాజిక సాంస్కృతిక పరిసర ప్రభావాలననుసరించి ఆధారపడేది.

సముద్ర తీరాలలో దొరికే అరుదైన గవ్వలను, పశుపోషణ గల సమాజాల్లో జంతు చర్మాన్నీ, అడవుల్లో నివసించే వారు ఏనుగు దంతాల్ని (ఆఫ్రికాలో) ద్రవ్యంగా వాడేవారు. అంతకుముందు సజీవపు జింకలను, పశువులను కూడా వినిమయ మాధ్యమంగా వాడేవారు.

జావా, బోర్నియో దీవులలో దున్నపోతులను, కంబోడియాలో జింకలను, హెబ్రూలు, గ్రీకులు, కెన్యా ప్రజలు పాడి పశువులను వస్తు ద్రవ్యంగా వాడేవారు. బార్బడాలో, ఉత్తర అమెరికాలో వ్యవసాయ వస్తువులైన పొగాకును ద్రవ్యంగా వాడేవారు. పొగాకు (tobaco) ను సులభంగా విభజించడానికి, రవాణా చేయడానికి, గుర్తించడానికి వీలుండేది. తాము అమ్మదలచుకున్న వస్తువును బ్రెజిల్‌లో బంకను (gum) అమ్మి దానితో తమకు కావలసిన మరొక వస్తువు కొనుక్కునే వారు. వస్తువులను నేరుగా మార్చకుండా ఏదైనా ఒక వస్తువు (పొగాకులాంటిది) ద్వారా మార్పిడి చేసుకునేవారు. మొదట జంతువులను ద్రవ్యంగా వాడిన వ్యవస్థలు తర్వాత నిర్జీవ, విభాజ్య యోగ్య వస్తువులను ద్రవ్యంగా వాడి ఉండవచ్చు. ఎందుకంటే జంతువులను విభజించటానికి, కనిష్ఠ పరిమాణంలోనికి మార్చుకోవటానికి, నిలువ ఉంచుకోవటానికి వీలులేదు. అందుకే వెన్న, పొగాకు, ధాన్యం లాంటి వస్తువులను వినిమయానికి మధ్యవర్తిగా, మాధ్యమంగా (medium గా ) వాడినారు. విలువను కలిగి అందరిచేత అంగీకరించబడే వస్తువునే ద్రవ్యంగా వాడినారు.

స్వతస్సిద్ధంగా ఉపయోగపడే పశువులు, గొర్రెలు కొంతకాలం ద్రవ్యంగా వాడబడ్డాయి. కాని అవి ప్రామాణికంగా ఒకే సామర్థ్యం, లావు, పొడవు, బలం కలిగి లేకపోవటం మూలాన ఇబ్బంది కలిగింది. అంతేకాక వాటిని నిల్వవుంచటం, విభజించటం, తరలించటం కష్టసాధ్యమైంది. అపుడు ధాన్యం లాంటి వస్తువులను వాడేవారు. అయినా అవి ఎంతో కాలం నిల్వఉండక పోవటం, రవాణా ఇబ్బందుల వల్ల, కావాల్సిన మేరకు అందుబాటులో అన్ని చోట్ల, అనుకున్నపుడు లభించనందువల్ల కష్టమయ్యేది. అందుకే సర్వజనాంగీకారమైన లోహద్రవ్యం ప్రవేశపెట్ట బడింది.

**(b) లోహ ద్రవ్యం (Metallic Money)**

రాగి, కంచు, బంగారం, వెండి, ఇనుము లోహాలను కనిపెట్టి గృహపరికరాలు, మూలధన వస్తువులను ఉపయోగించుకున్న మానవునికి, దానిని ద్రవ్యంగా కూడా వాడే ఆలోచన కలిగింది. ద్రవ్యంగా వెండి, బంగారు నాణేలు మాత్రమే ఎక్కువ కాలం చలామణి అయ్యాయి. మొదట మామూలు ముద్దలుగా, కడ్డీలుగా లోహాలను ద్రవ్యంగా వాడేవారు.

దేశంలోని మరియు ఖండాంతర వ్యాపారానికి లోహాలు అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేవి. కొరతగా లభించే విలువైన స్వర్ణ, రజత లోహాలకు స్వతస్సిద్ధంగా విలువ ఎక్కువగా ఉండేది. ఇవి అనశ్వరమే గాక, కాలగమనంలో విలువను కోల్పోకుండా ప్రమాణికంగా ఉండేవి. విభాజ్యతకు, రవాణాకు అనుకూలంగా ఉండటమే గాక సజాతీయత, స్థిరత్వం కలిగి ఉండటం చేత పశువులకు, అపరాలకు బదులు లోహాలు వినిమయ మాధ్యమంగా, కొలమానంగా చాలాకాలం వాడబడ్డాయి. వీటిని పంచే వీలుండటం వల్ల అవసరాన్ని బట్టి ద్రవ్యం లభించేది. అయితే వీటి పరిమాణంలో, ఆకారంలో, బరువులో సారూప్యత లేకపోయేది.

లోహాలను ద్రవ్యాలుగా వాడటం వల్ల వస్తు ద్రవ్యంలోని లోపాలు నివారించుకోగలిగాయి. బరువు, నాణ్యత, విభాజ్యత గుర్తింపులలో తేడాలు రావటం వల్ల నిర్దిష్ట బరువుతో, ముద్రలతో నాణేలను తయారు చేశారు. 700 B.C. లో లిడియా రాజు మిడాస్ నాణేలు ముద్రింప చేశాడు. దీనితో అరుగకొట్టడం, చిన్న భాగాలను తరుగు చేయటం, కత్తిరించటం తగ్గింది. అంతకు ముందు కేవలం ఏదో ఒక లోహాన్ని ప్రామాణికంగా వాడేవారు. అమెరికా సంయుక్త రాష్ట్రంలో 1933 వ సంవత్సరంలో 23.22 గ్రెన్‌ల (గ్రెన్ అంటే ధాన్యపు గింజ బరువుకు సమానమైనది) స్వచ్ఛమైన బంగారం లేదా 9/10 వన్నె కలిగిన 25.8 గ్రెన్‌ల బంగారాన్ని ఒక డాలరుగా ముద్రించేవారు. దానిని కరిగించినా, నాణేల రూపంలో ఉంచుకున్నా అంతే బంగారాన్ని కలిగి ఉండేది. అలాగే 180 గ్రైన్ల (Grain) బరువు కలిగిన (11/12 వన్నె) వెండి నాణేన్ని రూపాయగా వాడారు. స్వతస్సిద్ధ విలువ, ముఖ విలువ (face value) ఒకటే ఉండేది. మొదట బంగారాన్ని, తర్వాత వెండిని కూడా ద్రవ్యంగా వాడినారు.

రాజముద్ర లాంటి ప్రభుత్వ గుర్తింపు చిహ్నం ఉండటం వల్ల నాణేలు (అన్ని వైపుల గుర్తించ తగిన చెక్కడం ఉండటంవలన) అందరిచేత నమ్మకంగా గుర్తించబడి వినిమయ మాధ్యమంగా చలామణి అయ్యేవి. ఏక లోహ ద్రవ్యం తర్వాత, లోహ ద్రవ్య ప్రమాణం అమల్లోకి వచ్చింది. లోహ ద్రవ్య ప్రమాణాన్ని ద్విలోహ, బహు లోహ ద్రవ్య ప్రమాణం అని కూడా అంటారు. స్వర్ణ ప్రమాణం నియమిత ఆటల నియమాలను పాటించినంతవరకు జయప్రదంగా నడిచింది. కాని దానిలోని లోపాలు ప్రత్యామ్నాయ ఏర్పాటుకు దారితీసాయి.

విలువైన లోహాలు నాణేల రూపంలో చలామణి వల్ల అరిగిపోవటం, ఉత్పత్తి పెరిగినంతగా లోహాల సప్లై పెరగక పోవటం వల్ల, చౌకగా ఉండి ఆమోదయోగ్యమయ్యే కాగితపు ద్రవ్యాన్ని ప్రవేశపెట్టారు.

BRAOU

**(c) కాగితపు ద్రవ్యం లేదా కాగితపు కరెన్సీ (Paper Currency)**

లోహాలను నేరుగా ద్రవ్యంగా వాడటం వలన విలువైన లోహాలను కేవలం వినిమయానికై చాలా మేరకు వాడబడేది. వాడకం వలన, తరుగుదల వలన విలువైన లోహం వృధాగా వాడబడేది. అంతేగాక, లోహాల త్రవ్వకం ఖర్చులు ఒకవైపు, గిరాకీ మరొకవైపు వాటి స్వతస్సిద్ధ విలువను పెంచసాగాయి. ఉత్పత్తి, జాతీయాదాయం, లావాదేవీలు, పారిశ్రామికీకరణ, అంతర్జాతీయ వ్యాపారం విపరీతంగా పెరగటం జరిగింది. అంతమేరకు ద్రవ్య సప్లై లోహాల రూపంలో పెరగకపోయేసరికి చలనవేగం (velocity) పెరిగింది. వ్యాకోచత్వం కలిగిన ద్రవ్యానికై వెతికారు. స్వతస్సిద్ధ విలువ తక్కువగా ఉండి అరిగినా, చిరిగినా ఎక్కువ నష్టం, తరుగు కాకుండా ఏర్పాట్లు చేయసాగారు. గ్రేషమ్ (ఎలిజిబత్ రాణివద్ద ఆర్థిక శాఖా మంత్రి) సిద్ధాంతం ప్రకారం మంచి ద్రవ్యాన్ని తక్కువరకం ద్రవ్యం పారద్రోలుతుంది. ఏ లోహపు విలువ తక్కువవుతుందో అదే చలామణిలో ఉంటుంది. ఈ ఇబ్బందులను అధిగమించడానికి చేసుకున్న ప్రత్యామ్నాయమే కరెన్సీ నోట్ల ఏర్పాటు. ప్రభుత్వం కూడా బంగారాన్ని కడ్డీల రూపంలో, ముద్దల రూపంలో ఉంచుకొని దాని విలువ మేరకు మాత్రమే కరెన్సీ నోట్లను రసీదుల రూపంలో అంటే ' నేను నీకు బాకీ ఉన్నాను ' (I.O.U. - I Owe You) అనే రూపంలో ' పత్రధారికి చెల్లించడానికి నేను వాగ్దానం చేస్తున్నాను (I promise to pay the bearer) ' అని కాగితపు నోట్లపై ముద్రించి ఇచ్చేవారు. ఆ వాగ్దాన పత్రాలే నేటి కాగితపు కరెన్సీ నోట్లు. మొదట్లో ఈ కరెన్సీ కేవలం లోహాలను ప్రాతినిధ్యం వహించేది (బంగారం, వెండి లోహాల బదులుగా) ప్రభుత్వం ఎప్పుడంటే అప్పుడు (నిర్ణీత ప్రమాణంలో) ఎవరికైనా ఎంతైనా కరెన్సీని లోహంలోకి మార్చుకునే వీలు కలిగించినందున కాగితపు కరెన్సీపై నమ్మకం ఏర్పడి చలామణి అయింది.

ఈ కాగితపు ద్రవ్యం మొదట్లో సౌలభ్యం కోసం నిక్షిప్త రూపంలో వాడబడింది. సులభంగా మార్చుకోవడానికి, మోయడానికి, యూనిట్లుగా విభజించుకోవడానికి తోడ్పడింది. లోహాల తరుగుదల లేకుండా యుండి, తక్కువ ఖర్చుతో కరెన్సీ ఏర్పాటు జరిగింది. ద్రవ్యోల్బణం ఏర్పడే అవకాశం కాని, విదేశాలకు చెల్లింపులు చేయలేకపోవటం కాని సంభవించలేదు. ప్రభుత్వాలకు, ప్రజలకు ఇది ఒక వరంగా మారింది.

కొంతకాలానికి కేవలం నమ్మకాన్ని ఆధారంగా చేసుకొని ప్రభుత్వంపై విశ్వాసాన్ని, వ్యవస్థ పటిష్ఠతను బట్టి కరెన్సీ ముద్రించటం మొదలైంది. కరెన్సీ జారీ చేసేటప్పుడు దానికి సరిపోయే బంగారం గాని లోహాలు గాని లేకుండానే చట్టబద్ధ ద్రవ్యాన్ని, విశ్వాసాశ్రిత ద్రవ్యాన్ని ముద్రించటం జరిగింది. ప్రస్తుతం కొన్ని కనీస నిల్వలు బంగారం, విదేశీ మారకం రూపంలో ఉంచి ముద్రించటం జరుగుతున్నది. ఎంతైనా ద్రవ్యాన్ని ముద్రించే అవకాశం ఉన్నందున, అవసరాలు పెరగటంతో పాటు ద్రవ్య చలామణి పెరిగింది. కొన్నిసార్లు ఇది ద్రవ్యోల్బణానికి ఇతర ఇబ్బందులకు దారి తీస్తుంది.

చట్టబద్ధమైన ద్రవ్యాన్ని కూడా అకౌంటింగ్, లావాదేవీలను త్వరితం చేయడానికి, కనీస ఖర్చుతో క్షుణ్ణంగా, సౌకర్యంగా, భద్రతగా ఉంచే విధంగా పరపతి ద్రవ్యం సృష్టించబడింది.

**(d) పరపతి ద్రవ్యం (Credit Money)**

బంగారాన్ని నిల్వ ఉంచుకొని కరెన్సీని జారీ చేసిన విధంగానే, కరెన్సీని నిలువగా దాచి దాని ఆధారంగా పరపతి ద్రవ్యాన్ని లేదా బాంకు ద్రవ్యాన్ని సృష్టించటం జరిగింది. పూర్వం కంసాలులు తమ వద్ద దాచిన బంగారం కరెన్సీకి రసీదులు ఇచ్చేవారు. ప్రజలకు క్రమంగా రసీదులపై నమ్మకం పెరిగి వాటిని కూడా ద్రవ్యంగా వాడేవారు. ఆ తర్వాత దాచిన ద్రవ్యంపై వడ్డీ ఇవ్వడం, తమ వద్ద నిల్వగా ఉన్న డబ్బును అప్పులుగా వడ్డీకి

BRAOU

ఇవ్వడం జరిగేది. ఇలా బ్యాంకు ద్రవ్యం ఏర్పడింది. బ్యాంకులు ఇచ్చే ఋణాలు, పెట్టుబడులు పరపతి ద్రవ్యంలో భాగమే. బ్యాంకు ఖాతాదారులకు, వారి పత్రాలను తీసుకునే వ్యక్తులకు నమ్మకం ఉన్నంత వరకే బ్యాంకు లిచ్చే చెక్కులను, పరపతిని గుర్తించటం జరుగుతుంది. నమ్మకాన్ని పొందే విధంగా కనీస నిల్వలను కరెన్సీ రూపంలో ఉంచుకొని, మిగతా డబ్బుతో కొన్ని రెట్ల పరపతిని బ్యాంకులు జారీ చేస్తున్నాయి. బ్యాంకులిచ్చే పరపతి విధానంలో ట్రావెలింగ్ చెక్కులే కాకుండా, క్రెడిట్ కార్డులు కూడా ప్రాముఖ్యత వహిస్తున్నాయి. ఈరకంగా ద్రవ్యం అనేక రకాలుగా, వివిధ రూపాలతో, వినిమయానికి, దాచుకోవడానికి, పెంచుకోవడానికి, భద్రతకు తోడ్పడుతుంది. ఇప్పుడు ద్రవ్యం అంటే ఏమిటో తెలుసుకుందాం.

## 1.3 ద్రవ్య భావన

ద్రవ్య స్వభావాన్ని తెలుసుకొని దాని విధులను, రకాలను వివరించటం ద్వారా ద్రవ్యం అంటే ఏమిటో వివరంగా తెలుసుకోవచ్చు. వస్తు సేవలకు సంబంధించిన ప్రవాహ రూప కార్యకలాపాలకు తోడ్పడేదే ద్రవ్యం. కొనుగోలు శక్తి కలిగి యుండి, సర్వజన సమ్మతమై మార్పడానికి గాని, నిల్వకు గాని వాడే వినిమయ మాధ్యమమేదైనా ద్రవ్యమే. ద్రవ్యాన్ని ఉత్పత్తి చేయటం ఏ వ్యవస్థకు గాని, ప్రభుత్వానికి గాని అంతిమలక్ష్యం కాదు. ద్రవ్యాన్ని ద్రవ్యం కోసమే అనకుండా, ద్రవ్యాన్ని వినిమయానికి వాడబడే సాధనంగా చెప్పవచ్చు. ఇది వస్తువు కాదు గాని వస్తూత్పత్తికి ఉపయోగపడుతుంది. ఇది వినియోగ వస్తువు కాదు గాని వినియోగానికి తోడ్పడుతుంది. పెట్టుబడి, పొదుపుల కోసం కూడా పరోక్షంగా వాడబడుతుంది. దేశంలోని కరెన్సీ పూర్తిగా మాయమయిందని ఊహించుదాం. వస్తు సేవలు, అందుబాటులోని పదార్థాలు ఎప్పటిలాగానే ఉంటాయి. ద్రవ్యం లేకున్నా వస్తు లభ్యత నిర్దిష్ట సమయంలో తగ్గదు. కాని వాటిని వినిమయం చేయటంలో ఇబ్బందులుంటాయి. చలనాత్మక వ్యవస్థలో ద్రవ్యం చక్రీయ ప్రవాహ రూపంలో ఉంటుంది. వివిధ రంగాలయిన గృహ రంగం (Household Sector), సంస్థలు (Firms), ప్రభుత్వం, విదేశీరంగం, మూలధన రంగాల మధ్య రాబడి చెల్లింపులకు ద్రవ్యం సాధనంగా వాడబడుతుంది.




పటం - 1.1:ద్రవ్య ప్రవాహ రూప చిత్రం

B R A O U

పటం 1.1లో చూపినట్లు సంస్థల వద్ద వస్తూత్పత్తి జరగాలంటే గృహరంగం ఉత్పత్తి సాధనాలను (శ్రమ,భూమి, వ్యవస్థాపకులను) అందించాలి. మూలధన రంగం పెట్టుబడినందించాలి. అలాగే అన్ని రంగాల నుండి పొదుపును సమీకరించి మూలధన రంగం పెట్టుబడికి (విదేశాలకు, దేశీయ పెట్టుబడికి) ద్రవ్యాన్ని అందచేస్తుంది. ప్రభుత్వం వసూలు చేసిన పన్నులను ఖర్చులకైనా, పొదుపుగా చేసో వాడుకుటుంది. విదేశాల ఎగుమతి దిగుమతులు, పొదుపు పెట్టుబడులు ద్రవ్యంతోనే జరుగుతాయి. ఈ లావాదేవీలకన్నింటికి ద్రవ్యమే ప్రవాహరూపంలో వాడబడుతుంది. ఉదాహరణకు సంస్థలు, గృహ రంగం నుండి ఉత్పత్తి సాధనాలను 100 కాగితపు ముక్కలను గుర్తింపుగా (టోకెన్స్) ఇచ్చిందనుకుందాం. ఆ వంద రూపాయలు గృహ రంగానికి ఆదాయం, అది సంస్థలకు ఖర్చు (చేతి నుండి బయటికి వెళ్ళినందున). సంస్థల వద్ద తయారు చేయబడిన వస్తువులను కొనటానికి గృహ రంగం ఆ వంద కాగితపు ముక్కలను (రూపాయలను) తిరిగి ఇచ్చినట్లైతే వస్తువులను పొందుతుంది. సంస్థ ఇచ్చిన కాగితపు ముక్కలు ఉత్పత్తి వినియోగాలకు ఉపయోగ బడినాయి కదా! అందుకే ప్రవాహ రూపంలో ద్రవ్యం వాడుతారు అంటాం (పటం -1.1లో బాణపు గుర్తుల ద్వారా చూపాం).

పొదుపు పెట్టుబడిగా మారటం కూడా ప్రవాహరూపమే. నేటి కాలంలో పన్నులు వసూలు చేయాలన్నా, ప్రభుత్వం కొనుగోళ్లు, పొదుపు చేయాలన్నా డబ్బే మాధ్యమంగా వాడబడుతున్నది. వివిధ రకాల పెట్టుబడులకు (portfolios) నిల్వ విలువకు, చెల్లింపులకు, రాబడులకు ద్రవ్యం తప్పనిసరి. అట్టి ద్రవ్యం నేడు వాస్తవికతయే కాని ఊహాజనిత భావన కాదు. ద్రవ్యం అనే భావనకు అర్థం ద్రవ్యాన్ని నిర్వచించడంతో తెలుస్తుంది.

### 1.31. ద్రవ్యం అంటే ఏమిటి ?

ద్రవ్యం ఉపయోగంలేని వస్తువు కాదు. సామాజిక అవసరాలకు సృష్టించుకోబడింది. ఇప్పుడది ఒక అవశ్యకత. ఇది ఒక నిర్దిష్ట రూపం ఉన్న వస్తువు కాదు, నిరంతరం వాడబడే మారుతున్న సృష్టి. ఇది మానవుడు సృష్టించుకున్నది. దానిని ద్రవ్యం అనుకున్నన్ని రోజులు, నమ్మకం అందరికున్నన్ని రోజులు ద్రవ్యమే. నమ్మకం కోల్పోయినా, లేకపోయినా దానికి విలువే లేదు. ఒక ప్రాంతంలో కరెన్సీ, వేరే ప్రాంతంలో కాగితపు ముక్కయే కావచ్చు. లేక అంతర్జాతీయంగా గౌరవాన్ని పొందే మహోన్నత సంపద చిహ్నం కూడా కావచ్చు. ద్రవ్యం ఏ రూపంలోనైనా ఉండొచ్చు, కాని గుర్తింపు అవసరం.

ద్రవ్యం కొన్ని లక్షణాలను కలిగి యుంటుంది. వినిమయ సాధనంగా ఉండటం, కొలమానంగా ఉండి, నిల్వ చేసుకునేదిగా ఉండొచ్చు. అన్ని రకాల లక్షణాలను కలిగినా, కొన్ని విధులు నిర్వర్తించినా డబ్బు డబ్బే. ఏ ఆకారమైనా కావొచ్చు, ఏ రకమైనా కావొచ్చు. కరెన్సీ నోట్లు, కృతక నాణేలు (token coins) మాత్రమే కాకుండా ఆస్తిహక్కు పత్రాలు (assets), ద్రవ్యత్వపు బిల్లులు (liquidity bills) కూడా ద్రవ్యమే.

హర్టిలో విదర్స్ రచించిన 'ది మీనింగ్ ఆఫ్ మనీ ' అనే గ్రంథంలో 'ద్రవ్యం చేసే పనులను చేసేదే ద్రవ్యం' అన్నాడు. ఇదే అభిప్రాయాన్ని F.A. వాకర్, G. క్రౌథర్‌లు కూడా వెలిబుచ్చారు. ద్రవ్యం అంటే ద్రవ్యపు విధులు నిర్వర్తించేది. 'ద్రవ్యమంటే ఏమిటి ' ? అనే అధ్యాయంలో ("The Theory of Money " - Clarendon Press - Oxford 1978) న్యూలిన్, బూటిల్ లు చెల్లింపులకు అందరిచేత అంగీకరించబడటంలో ద్రవ్యం ఉనికి ఉంది అన్నారు.

### 1.3.2 ద్రవ్యం నిర్వచనాలు

ద్రవ్యం అంటే ఏమిటో క్లుప్తంగా, స్పష్టంగా సంపూర్ణంగా చెప్పేదే ద్రవ్య నిర్వచనం. వివిధ ఆర్థిక శాస్త్ర వేత్తలు లేదా సంస్థలు చెప్పిన వాక్యాలే నిర్వచనాలు. అవి ద్రవ్యాన్ని గురించిన అవగాహనను ఇస్తాయి. కొన్ని ప్రధాన నిర్వచనాలను దిగువన తెలుసుకుందాం.

**క్రౌథర్ నిర్వచనం**

G. క్రౌథర్ రచించిన " An Outline of Money" లో ఇచ్చిన నిర్వచనం ప్రకారం " సర్వజనాంగీకారాన్ని వినిమయ సాధనంగా పొందిన ఏ వస్తువైనా విలువను కొలవడానికి, నిల్వ చేయడానికి కూడా పనిచేస్తే అదే ద్రవ్యం ".

ఒక జాతి లేదా వ్యవస్థలో అందరూ ఏ వస్తువునైతే నమ్మకంతో వినిమయానికి ఉపయోగిస్తారో దానిని ద్రవ్యమన్నాడు. అయితే ఆ ద్రవ్యానికై వాడబడిన వస్తువునే ద్రవ్యం అంటాం. అట్టి ద్రవ్యం వస్తువుల విలువను కొలువడానికి, నిర్దేశించడానికి ఉపయోగపడాలి. ద్రవ్యాన్ని దాచుకున్నప్పటికీ కొంత కాలం తర్వాత కొనుగోలు చేసే శక్తి కోల్పోకూడదు. అంటే విలువను తనలో నిల్వ చేసుకోవాలి. ఇలా కొన్ని ప్రధానంగా ఉండాల్సిన లక్షణాలను బట్టి ద్రవ్యాన్ని పలువురు నిర్వచించడం జరిగింది.

**జాన్ హిక్స్ నిర్వచనం**

వీరు చెప్పినట్లు " ద్రవ్యం దాని విధుల చేత నిర్వచించబడుతుంది. ద్రవ్యంగా వాడబడేదే ద్రవ్యం ". ఈ నిర్వచనంలో విధులను బట్టి ద్రవ్యాన్ని తెలుపవచ్చు.

ద్రవ్యాన్ని నిర్వచించేటప్పుడు ద్రవ్యం నిర్వహించే కొన్ని విధులకు కొందరు ప్రాధాన్యత ఎక్కువ ఇస్తారు. కాని అది నిర్వర్తించే పనులను, దాని అన్ని విధులను మాత్రం అంగీకరిస్తారు. ఇర్వింగ్ ఫిషర్ ద్రవ్యాన్ని వస్తు కొనుగోలు కొరకే వాడుతారు అంటాడు. అదే రాబర్ట్సన్, పిగూల ప్రకారం ద్రవ్యాన్ని దాచుకోవడానికి (కూడా) కోరుకుంటారు.

**మిల్టన్ ఫ్రీడ్‌మన్ నిర్వచనం**

సర్వత్రా కొనుగోలు శక్తికి ప్రస్తుతం చోటు చేసుకునే విధిని ఏదైతే అందిస్తుందో అదే ద్రవ్యం అని ఫ్రీడ్‌మన్ భావించాడు. అంతటా వస్తు సేవలను కొనే శక్తి ఉన్నదే ద్రవ్యం అంటాడు. ఎప్పుడో కొనడానికి కాదు ఇప్పుడు, ప్రస్తుతం కొనడానికి తోడ్పడాలి లేదా స్థానం పొందాలి. ఈ నిర్వచనం సంప్రదాయవేత్త అయిన ఇర్వింగ్ ఫిషర్ అభిప్రాయానికి మద్దతు ఇస్తుంది. ప్రధానమైన విధులను బట్టి నిర్వచనాలను వర్గీకరణ చేసి చూపించుదాం.

**(a) సర్వజనాంగీకార ప్రాతిపదికపై నిర్వచనాలు (General Definitions)**

అందరిచేత సమ్మతింపబడి వస్తు సేవల చెల్లింపులకు వినిమయ మాధ్యమంగా తోడ్పడేదే ద్రవ్యమని ప్రతీ శాస్త్రవేత్త అంగీకరిస్తాడు. కొన్ని నిర్వచనాలు చూద్దాం.

**సెలిగ్మన్ :** " అందరిచేత అంగీకరింపబడే వస్తువే ద్రవ్యం " అని నిర్వచించాడు.

**ఎలై** వ్రాసిన " ఎలిమెంటరీ ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనామిక్స్ " లో ఏ వస్తువులైతే ఒక సమాజంలో సర్వజనాంగీకారాన్ని కలిగియుంటాయో ఆ వస్తువులతో కూడినదే ద్రవ్యం అనబడింది.

**R.P. కెంట్** " మనీ అండ్ బ్యాంకింగ్ " లో చెప్పినట్లు ' వినిమయ మాధ్యమంగా లేదా విలువను కొలిచే ప్రామాణికంగా ఏ వస్తువైతే కాని సాధారణంగా ఉపయోగించబడి, సర్వత్రా అంగీకరించబడుతుందో అదే ద్రవ్యం.

**మార్షల్, క్రౌథర్, కేన్స్** అందరు కూడా సర్వజనుల ఆమోదం పొందే వస్తువును, వినిమయానికి, విలువల కొలమానానికి, విలంబిత (వాయిదా) చెల్లింపులకు, విలువల నిధిగా వాడబడే వస్తువును ద్రవ్యమన్నారు.

**(b) వివరణాత్మక నిర్వచనాలు (Descriptive Definitions)**

సాధ్యమైనంతవరకు వాస్తవిక ప్రపంచంలో ద్రవ్యం చేసే పనులను వివరించేవే వివరణాత్మక నిర్వచనాలు. క్రౌథర్ నిర్వచనంతో పాటు కోల్, కాల్బర్న్, రాబర్ట్‌సన్ నిర్వచనాలు కూడా ద్రవ్యపు విధులతో కూడిన నిర్వచనాలే.

కోల్ (G.D.H. Cole) 'మనీ, ఇట్స్ ప్రజెన్స్ అండ్ ఫ్యూచర్ ' లో " చెల్లింపు సాధనంగా అలవాటుపడి సర్వత్రా వాడబడుతూ అప్పుల పరిష్కారానికి కూడా అందరి చేత ఆమోదింపబడే ఏ వస్తువైనా ద్రవ్యమే " అన్నాడు.

హామ్ (G.N. Halm) " మానిటరీ థీరీ "లో ద్రవ్యం అనే పదం వినిమయ మాధ్యమానికి, ప్రామాణిక విలువ తెలుపడానికి నిర్దేశింపబడింది అన్నారు. R.P. కెంట్ కూడా 'మనీ అండ్ బ్యాంకింగ్' లో ఇదే విషయాన్ని తెల్పాడు. కాల్‌బర్న్, థామస్, జాన్ హిక్స్‌లు కూడా దీన్ని ఆమోదించారు.

**(C) చట్టపరంగా ద్రవ్యాన్ని తెలిపే నిర్వచనాలు**

ప్రభుత్వంపై నమ్మకం వలన గాని, ప్రభుత్వం చేసిన చట్టం ద్వారా గాని, దేనినైతే ద్రవ్యం అంటుందో దానినే ద్రవ్యము అనాలని ఈ నిర్వచనాల ఉద్దేశం.

ఈ నిర్వచనం పరిమితంగా ఉంటుంది. 'నాప్ ' అన్నట్లు " ప్రభుత్వం చేత ఏదైతే ద్రవ్యంగా ప్రకటించబడుతుందో అది ద్రవ్యమవుతుంది ". ద్రవ్యం విలువ కోల్పోయినపుడు ప్రభుత్వం ఇబ్బందిలో పడక తప్పదు. అందుకే ప్రభుత్వం కూడా ద్రవ్యం విలువ కాపాడటం కోసం కృషి చేస్తుంది.

ఇపుడు ద్రవ్యంలో ఇమిడి వున్న అంశాలను చూద్దాం. అమెరికాకు చెందిన ఇర్వింగ్ ఫిషర్ ఉద్దేశంలో ద్రవ్యమంటే కరెన్సీయేకాక పరపతి ద్రవ్యం కూడా. రేడ్‌క్లిఫ్ **(1959)** కమిటీ ఉద్దేశంలో చలామణిలోని కరెన్సీ, ద్రవ్యత్వ ఆస్తులు (సేవింగ్ బ్యాంకుల డిపాజిట్లు, ట్రెజరీ బిల్లుల లాంటివి) కలిసి ద్రవ్యం అవుతాయి. చికాగో శాస్త్రవేత్త ఫ్రీడ్‌మన్ చెప్పినట్లు బాంకుల డిపాజిట్లు, కరెన్సీ, సేవింగ్, డిమాండ్ డిపాజిట్లు కలిసి ద్రవ్యం ఏర్పడుతుంది. గర్లీ, షా అనే శాస్త్రవేత్తలు ద్రవ్యపు ప్రతిస్థాపకాల (substitutes) ను కూడా ద్రవ్యంలో చేర్చినారు. రిజర్వుబాంకు కూడా ద్రవ్యాన్ని $M_1, M_2, M_3, M_4$ గా నిర్వచించి నివేదికలలో సమాచారాన్ని అందిస్తుంది.

మొత్తంపైన ద్రవ్యానికి ఉండవల్సిన లక్షణాలు విధులను బట్టి ఉంటాయి. అమలులో ఉన్న ద్రవ్యానికి ఉన్న లక్షణాలను బట్టి ద్రవ్యం స్వభావాన్ని తెలుసుకోవచ్చు.

## 1.4 ద్రవ్య లక్షణాలు (Characteristics of Money)

ద్రవ్యంగా ఏ వస్తువైనా వాడబడాలంటే ఆ వస్తువుకు ద్రవ్య లక్షణాలు కొన్ని అయినా వుండాలి. ఉపయోగకరమైన ఎన్ని ఎక్కువ లక్షణాలు కలిగి ఉంటే అంత మంచి ద్రవ్యంగా చెప్పవచ్చు. కొన్ని ద్రవ్య లక్షణాలను తెలుసుకుందాం.

Dr. BRAOU LIBRARY
Acc. No: CM.0221
Class No: 330
ECO

### 1.4.1 అందరిచేత అంగీకరించబడే యోగ్యత (Acceptability)

ద్రవ్యంగా వాడబడే ఏదైనా కాని అది అందరిచేత అంగీకరించబడాలి. సర్వజనాంగీకారం పొందే యోగ్యత ఉండాలంటే దానిమీద నమ్మకం సర్వత్రా ఉండాలి. కొనుగోలు శక్తి కలిగి మధ్యవర్తిగా ఉండాలంటే ద్రవ్యానికున్న విలువ కాపాడబడాలి. ద్రవ్యం విధుల నన్నింటినీ నిర్వర్తిస్తే అది మంచి ద్రవ్యం అవుతుంది. ద్రవ్యానికి స్వతస్సిద్ధ విలువ ఉన్నా, ఆచారాన్ని బట్టి విలువ పోషించబడినా అది అందరిచే ఆమోదం పొందుతుంది.

### 1.4.2 స్వచ్ఛందంగా, స్వతహాగా అంగీకరించబడే లక్షణం

ద్రవ్యాన్ని స్వచ్ఛందంగా ప్రజలు అంగీకరించినపుడు, వేరే వారి ప్రమేయం లేకున్నా ద్రవ్యంగా ఒప్పుకోబడేటప్పుడు అది మంచి ద్రవ్యంగా చెప్పుకోవచ్చు.

### 1.4.3 ప్రభుత్వపు ఆమోదం కలిగి ఉండటం

ప్రభుత్వంకాని ప్రభుత్వానికి ప్రతినిధిగా ఏ సంస్థకాని ద్రవ్యాన్ని ముద్రిస్తే అది అందరిచే అంగీకరించబడుతుంది. ప్రభుత్వపు ఆమోదం, విశ్వాసం ద్రవ్యానికి అవసరం కాని తప్పనిసరి కాదు. ప్రజల విశ్వాసం ద్రవ్యంపై ఉండటం తప్పనిసరి.

### 1.4.4 సులభంగా గుర్తించబడటం (Cognizance)

అందరు కూడా ద్రవ్యంగా వాడే వస్తువును సులభంగా గుర్తించాలి. లోహాల నాణ్యతను సామాన్యుడు గుర్తించటం కష్టం. అందుకే లోహాలను, నాణేలుగా మార్చేవారు. అంతకు ముందు వస్తువులలో సామాన్య లక్షణాలైన ప్రామాణిక నాణ్యత, బరువు, ఆకారం లేక పోవటం వల్ల మంచి ద్రవ్యం అనబడలేదు. కాగితపు కరెన్సీ కూడా తరచుగా మారుతుంటే గుర్తించటం కష్టం. చదువురానివారు కూడా గుర్తించగలిగేటట్లు ఉండాలి. అలా గుర్తించగలిగితే ద్రవ్యంగా మంచి లక్షణాన్ని కలిగినట్లు చెప్పాలి.

### 1.4.5 ప్రయోజనం (Utility)

ద్రవ్యంగా వాడే వస్తువుకు స్వతహాగా ప్రయోజనం ఉండాలి. బంగారు, వెండి నగలను కూడా వాడేవారు. అంతేగాక అవి కొరతగా ఉండటం వల్ల వినిమయ విలువ కలిగి ఉండేవి. వినిమయానికి ఉపయోగపడే ప్రయోజనం కూడా ద్రవ్యానికి ఉండే ఒక లక్షణం. చట్టబద్ధంగా గాని, మార్కెట్ శక్తుల వలన గాని, కరెన్సీకి విలువ ఒనగూర్చినపుడు, అది ప్రయోజన కారిగా ఉంటుంది. ప్రయోజనం కలిగిన వస్తువు మంచి ద్రవ్యంగా చాలా కాలం మన్నన పొందగలదు.

### 1.4.6 గమనశీలత, రవాణాకు వీలవటం (Portability)

ద్రవ్యంగా వాడే వస్తువును సులభంగా రవాణా చేసే వీలుండాలి. రవాణా చేసే ఖర్చులు ఎక్కువైనా, రవాణాలో అసౌకర్యాలున్నా, రవాణా చేయలేకున్నా దానిని ద్రవ్యంగా వాడటం చాలా కష్టం. పెద్ద పెద్ద జంతువులను బొగ్గులాంటి వాటిని ఒక చోట నుండి మరొక చోటికి తరలించటం కష్టం. గమన శీలత కరెన్సీకి ఉన్నతంగా వస్తు ద్రవ్యానికి లేనందువల్లే పేపరు ద్రవ్యం ఇతర వస్తువులకు , లోహాలకు బదులుగా వాడకంలోకి వచ్చింది.

### 1.4.7 విభాజనీయత (Divisibility)

ద్రవ్యం వస్తు విలువలను యూనిట్లలో చెప్పగలిగేటట్లుండాలి. అంతేకాక సౌకర్యాన్ని బట్టి ద్రవ్యాన్ని అనేక చిన్న భాగాలుగా విభజించే వీలుండాలి. విభజించినపుడు విలువను కోల్పోవద్దు. జంతువులను ద్రవ్యంగా వాడితే వాటిని విభజించే వీలుండదు. అలాగే బంగారం లాంటి విలువైన లోహాలను రేణువులగా విభజించి కాపాడుకోవటం, రవాణా చేయటం కష్టం. నేడు చెక్కుల ద్వారా కోట్ల రూపాయల విలువ నుండి కొన్ని పైసల విలువ కల వస్తువులను కొనవచ్చు. కరెన్సీ, నాణేల ద్వారా ఏ విలువనైనా తెలుపవచ్చు. ద్రవ్యాన్ని యూనిట్లుగా విభజించటానికి వీలుండటం మంచిది. కాగితపు ద్రవ్యాన్ని అనేక యూనిట్ల విలువ కలిగేటట్లు ముద్రించవచ్చు. అంటే విభజించవచ్చు. విభాజనీయతకు వీలులేక పోవటం వల్లనే వస్తువులు, జంతువులు ద్రవ్యంగా కొనసాగలేదు. విభాజనీయతే కాక పెద్ద మొత్తాల చెల్లింపుకు వీలుండాలి. దీనికి నేటి పరపతి ద్రవ్యం చక్కటి ప్రత్యామ్నాయం.

### 1.4.8 చెడిపోనిది - అనశ్వరతగలది (Indestructability)

చెడిపోయే వస్తువులను,ఎక్కువ తరుగుదల గలవాటిని,తొందరగా నాశనమయ్యే వస్తువులను ద్రవ్యంగా వాడబడరాదు. విలువైన లోహాలను వాడితే ఏ కొద్దిపాటి తరుగుదల అయినా చాలా విలువను కోల్పోతుంది. అందుకే చౌకగా లభించినా నమ్మకాన్ని కలిగించేదిగా ఉండాలి. పశువులను నిల్వ ఉంచుకోలేం. కొద్ది కాలానికి అవి మరణించటమో లేదా వృద్ధాప్యం వల్ల విలువ కోల్పోవటమో జరుగుతుంది. పండ్లు, పాలు మొదలైనవి త్వరగా చెడిపోయే నశ్వర వస్తువులు. అందుకే చెడిపోని అనశ్వర వస్తువులయిన లోహాన్ని గాని, పత్ర ద్రవ్యాన్ని గాని వాడాలి. పత్రద్రవ్యం చెడిపోయినా దానిని తిరిగి ప్రవేశపెట్టడం అంత ఖర్చుతో కూడింది కాదు. ఎక్కువకాలం నిల్వ ఉండి, చలామణిలో ఉండి, విలువ కోల్పోని అనశ్వరమైనవే ద్రవ్యంగా వాడబడటం మంచిది.

### 1.4.9 విలువలో స్థిరత్వం (Stability)

ద్రవ్యంగా వాడే వస్తువు కొనుగోలు శక్తిలో వేగంగా మార్పులు రాకూడదు. ప్రతికూల స్థితిలో ద్రవ్యం స్థిరత్వాన్ని కోల్పోతే తన ఉనికినే కోల్పోతుంది. డబ్బుగా వాడే వస్తువుకున్న విలువను ద్రవ్యాధికారులు కాపాడాల్సి ఉంటుంది. స్వర్ణం లాంటి లోహాల విలువల్లో స్థిరత్వం స్వతహాగా ఉండబట్టే ద్రవ్యంగా వాడబడింది. శాసనపు ద్రవ్యం (fiat money) లేదా ప్రభుత్వంపై విశ్వాసాన్ని ఆధారంగా చేసుకున్న ద్రవ్యం విలువలో స్థిరత్వం, కనీసం కరెన్సీపై నమ్మకంతో స్థిరత్వాన్ని పొందాలి.

ఏ వస్తువును ద్రవ్యంగా వాడినా ఆ వస్తువుల బరువులో, ఆకారంలో, నాణ్యతలో , స్వరూపంలో స్థిరత్వం ఉండాలి. సారూప్యత, ఏక జాతీయత లేక పోయినా, నశ్వర్యం అయినా, విలువలో నాణ్యతలో స్థిరత్వం లేకున్నా అది ద్రవ్యంగా వాడబడదు.

### 1.4.10 సజాతీయత (Homogeneity)

అన్నిచోట్ల వస్తువులు ఒకేరకంగా ఉండి గుర్తించేటట్లుంటే సజాతీయత అంటారు. లోహ నాణేలు సజాతీయంగా ఉంటాయి. కాని ధాన్యం, వస్తువులు, పశు సంపద ఒకే తీరుగా ఉండవు. ఒకే తీరుగా, ఒకే రూపంతో ఉంటే సజాతీయత అంటారు. కరెన్సీ నోట్లను ముద్రించేటప్పుడు ఒక ద్రవ్య యూనిట్ ఒకే తీరుగా ఉండి గుర్తించటంలో పొరపాటు లేకుండా చూస్తారు.

BRAOU

ద్రవ్యంగా వేరు వేరు వస్తువులను వాడటానికి బదులు ఒకే రకంగా ఉండే దానిని వాడటం మంచిది. అయితే సజాతీయత కలిగిన వస్తువులు కావలసినన్ని దొరుకునా లేదా అన్నదే సమస్య. ఇవేకాకుండా ద్రవ్యానికి ఉండే లక్షణాలు ఎన్నో ఉన్నా మరికొన్ని తెలుసుకుందాం.

### 1.4.11 మృదుత్వం (Malleability)

ద్రవ్యాన్ని విడదీయటానికే కాక ఏ ఆకారంలోనికైనా, పరిమాణానికైనా విభజించటమేకాక పెంచటానికి కూడా వీలుండాలి. లోహాలను కరిగించి సమీకరించవచ్చు, విడగొట్టి భాగాలుగా చేయవచ్చు. బంగారానికి ఉన్న మృదుత్వం ఉక్కుకు ఉండదు. అందుకే స్వర్ణం ద్రవ్య ప్రమాణంగా విరాజిల్లింది.

### 1.4.12 వ్యాకోచత్వం (Elasticity)

ద్రవ్యం అవసరమున్నపుడు పెంచటానికి, లేనపుడు తగ్గించడానికి వీలుండాలి. పెరుగుతున్న జాతీయోత్పత్తులకు తగ్గట్టుగా వినిమయ సాధనమైన కరెన్సీని మార్చే వీలుంది. కాబట్టి లావాదేవీలకు ఇబ్బంది కలగటం లేదు. ధరలు పెరగకుండా ఉండాలంటే కొన్ని ఋతువులలో ద్రవ్య సప్లై తగ్గించాల్సి ఉంటుంది. ధరల స్థిరీకరణకు గాను ద్రవ్య సప్లై వ్యాకోచతను కలిగి వుండాలి.

### 1.4.13 బదిలీకి వీలు (Transferable)

ఒక చోటి నుండి మరొక చోటికి మారటాన్ని గమనశీలత, రవాణాకు వీలుండడం అంటారు. అలాగే ఒక ఆస్థి నుండి మరొక ఆస్థిగా మార్చుకోవటానికి వీలుండాలి. ఒక వ్యక్తి లేదా సంస్థ నుండి మరొకరికి ద్రవ్యపు హక్కులను మార్చడాన్ని ద్రవ్య బదిలీ (money transfer) అంటారు. నేటి ద్రవ్యత్వపు ఆస్తులు (liquid assets) లాభాన్ని, పరివర్తనీయతను (convertibility ఇక్కడ వేరే ఆస్తుల లోనికి అనే భావనలో వాడాం) పొందటానికి కారణం బదిలీకి వీలు ఉండటమే.

### 1.4.14 చౌకగా ఉండటం (Economical)

మనం ద్రవ్యంగా వాడే వస్తువును చౌకగా, ఆర్థికంగా, లాభదాయకంగా దొరికేటట్లు చూడాలి. అందువల్ల విలువైన లోహాలను, ఖరీదైన వస్తువులను కాపాడుకోవచ్చు. ప్రమాదవశాత్తు ద్రవ్యాన్ని కోల్పోతే దానిని పున : స్థాపించగలగాలి. పాత చిరిగిన నోట్లను కేంద్ర బాంకులు రద్దుచేసి కొత్తవాటిని చలామణిలోకి తీసుకొనిరావడానికి లోటు ద్రవ్య విధానానికి ద్రవ్యాన్ని చౌకగా తయారుచేయగలగటం ఒక కారణం. ప్లాటినాన్ని, వజ్రాలను ద్రవ్యంగా వాడితే అవి ఈ లక్షణాన్ని కలిగి వుండవు.

### 1.4.15 కేటాయించడం (Allocation)

వనరులను కేటాయించటానికి, ఉత్పత్తిని పెంచటానికి కూడా ద్రవ్యం చలనాత్మకంగా ఉపయోగపడాలి. వినిమయ మాధ్యమంగా ఆదాయపంపిణీకి, వనరుల పంపిణీకి తోడ్పడే లక్షణమే కాకుండా మార్పులకు తోడ్పడాలి. పైన చెప్పిన లక్షణాలతో పాటు మన్నికను, స్వతస్సిద్ధ విలువను కలిగి ఉండటం కూడా మంచి ద్రవ్యపు లక్షణాలనవచ్చు. లక్షణాల ద్వారా ద్రవ్య విధులు కూడా కొన్ని తెలుస్తాయి.

## 1.5 ద్రవ్య విధులు

ద్రవ్యంగా వాడే వస్తువులు కనీసం నిర్వర్తించాల్సిన విధులతో పాటు మరికొన్నింటిని చేపట్టవచ్చు. కాని అన్ని విధులను అన్ని రకాల ద్రవ్యాలు నిర్వర్తించక పోవచ్చు. ద్రవ్యం విధులను బట్టే దాని పాత్ర ఎంత ప్రధానమైనదో తెలుసుకుంటాం.

BRAOU

క్రౌథర్ ద్రవ్యాన్ని విధులను బట్టే నిర్వచించాడు. ద్రవ్యానికి విధులు నాలుగు : వినిమయ మాధ్యమం, విలువ కొలమానం, విలువల నిధి, విలువల బదిలీ. ద్రవ్య విధులను వాటి ప్రాముఖ్యతను బట్టి ప్రథమ, ద్వితీయ (గౌణ) శ్రేణి విధులుగా, తదితర విధులుగా వర్గీకరించటం జరిగింది.

కిన్లీ (Kinley) వర్గీకరణలో ప్రాథమిక, గౌణ, కాంటింజెంట్ (contingent) లేదా అనిశ్చిత విధులు ఉంటాయి. పట్టిక 1.1 వాటిని తెలుపుతుంది.

**పట్టిక - 1.1 : ద్రవ్య విధుల పట్టిక (కిన్లీ వర్గీకరణ)**




BRAOU

పాల్‌ఎంజిగ్ వ్రాసిన "How Money is Managed" పుస్తకం లోని వర్గీకరణలో రెండు రకాల విధులున్నాయి.

(1) సాంకేతిక విధులు లేదా నిశ్చలాత్మక విధులు (static functions)

(2) చలనాత్మక విధులు (dynamic functions)

ఎంజిగ్ సాంకేతిక విధులలో కిన్లీ చెప్పిన ప్రాథమిక, గౌణ విధులుంటే, చలనాత్మక విధులలో ధర యంత్రాంగం, ధరల మార్పు ద్వారా ఉత్పత్తి పంపిణీలో మార్పు, లోటు ద్రవ్యం మొదలగునవి కలవు. విధులను సాంప్రదాయక, ఆధునిక విధులుగా కూడా చెప్పవచ్చు.

**పట్టిక - 1.2 : పాల్ ఎంజిగ్ ద్రవ్య విధులు**




BRAOU

న్యూలిన్, బూటిల్‌లు వినిమయ విలువ, విలువ నిధి, యూనిట్ ఆఫ్ ఆకౌంటు, భవిష్యత్తు చెల్లింపులు అనే నాలుగు విధులను ద్రవ్యానికి ఉండాలన్నారు.

కిన్లీ విధుల వర్గీకరణననుసరించి ద్రవ్యవిధులను వివరంగా తెలుసుకుందాం.

### 1.5.1 విధుల వర్గీకరణ

**I. ప్రాథమిక విధులు :** ఇవి ఏ ద్రవ్యానికైనా అవసరమే గాకుండా తప్పనిసరికూడా. ఈ విధి నిర్వర్తించని ద్రవ్యం ద్రవ్యమే కాదు. ప్రాథమికంగా ఏ వస్తువులైనా కాని, ఏ కాలంలో కాని, ఏ దశలో కాని వినిమయానికి దళారిగా, మధ్యవర్తిగా ఉంటేనే ద్రవ్యమవుతుంది. ఇది విలువకు సంకేతం. వస్తు మార్పిడి పద్ధతి తర్వాత వాడిన ఏ రకపు ద్రవ్యమైనా వినిమయ సాధనమే. మారకానికి ఉపయోగపడనిది ఏది కూడా ద్రవ్యమనబడదు. అలాగే మారకానికి వాడినపుడు దాని విలువ కూడా అంతర్థానంగా ఉంటుంది. విలువను ఖచ్చితంగా కొలవటానికి ఉపయోగపడక పోయినా, ఇచ్చి పుచ్చుకోవటానికి ఉపయోగపడితే చాలు - అది ద్రవ్యమే. అందుకే ప్రాథమిక విధుల్లో ప్రథమ స్థానం వినిమయ సాధనానికే దక్కుతుంది. విలువను కొలవలేనిది మారకానికి ఎలా ఉపయోగిస్తారనే ప్రశ్నకు జవాబు ఇప్పటికీ వెనుకబడ్డ ప్రాంతాల్లో దొరుకుతుంది. తేనేను ఇచ్చి వస్తువులను కొనుక్కునే కోయలు నేటి కాలంలో ఏదో కొంత డబ్బుకు తేనెనిచ్చి, ఆ డబ్బుతో వస్తువులను కొంటున్నారు.

ఖచ్చితంగా ద్రవ్యం విలువ వస్తురూపంలో ఇంత ఉంటుందని ఇదమిత్థంగా వారికి తెలియదు. విలువలను ఉజ్జాయింపుగా తెలుసుకోవాలన్నా సాపేక్షికంగా దాని విలువ ప్రామాణిక ద్రవ్యం రూపంలో తెలువబడాలి. కేవలం కొలమానంలాగే ఉన్నా, వినిమయానికి తోడ్పడని డబ్బు ద్రవ్యం అనబడదు.

**II. గౌణ విధులు :** మొదట్లో ద్రవ్యాన్ని కనుగొనటానికి ప్రాథమిక విధి తోడ్పడితే, దాన్ని వాడుకునే విధానంలో గౌణ విధులు మార్పుతెచ్చాయి. గౌణ విధులు ప్రాథమిక విధులంత ముఖ్యం కావు. కాని ద్వితీయ విధులుగా చెప్పబడే ఈ విధులు ద్రవ్యానికి పరిపూర్ణత తెచ్చిపెడతాయి. వినిమయ విలువ ఉంటేనే దాచుకోవటం, తర్వాత కొనుగోలుకై నిక్షిప్తం చేయటం అవుతుంది. వ్యాపారం పెరిగే కొద్ది విలువలను బదిలీ చేయాల్సి ఉంటుంది. గౌణ విధులు మాత్రమే చేయగలిగి, ప్రాథమిక విధులు చేయకుంటే ద్రవ్యమనబడదు. అలాగే గౌణ విధులను చేపట్టని ద్రవ్యం చాలాకాలం మనజాలదు. విలువలను దాచలేక పోయినా, మార్చలేకపోయినా ద్రవ్యపు అవసరంగాని, దాని క్రమపరిణామం గాని జరుగకపోయేది. లోహాల కరెన్సీల అవసరం లేకుండానే ద్రవ్య మాధ్యమంగా ఏ జంతువులనో, వస్తువులనో, వాడి ఉండేవారు. నిల్వ ఉండే ద్రవ్యం కోసం వెంపర్లాడే వారు కాదు. బొగ్గులాంటి వస్తువులు కూడా నిల్వ ఉంటాయి. కాని, వాటి బదిలీ ప్రయాసతో కూడింది కాబట్టే, కరెన్సీని దాని బదులు వాడుతున్నారు.

ప్రాథమిక విధులు చేయలేని ద్రవ్యం గౌణ విధులను నిర్వర్తించలేదు. ఉత్పత్తి చేసేటప్పుడు చెల్లింపులు చేయటమో, వాయిదా వేసి చెల్లించటమో చేసి కొంత కాలం తర్వాత ప్రతిఫలాలు పొందటం జరుగుతుంది. భవిష్యత్తులో ఉపయోగపడే వస్తువు, కేవలం తాత్కాలిక ప్రయోజనాన్ని ఇచ్చే ద్రవ్యంకన్నా మెరుగ్గా ఉంటుంది. అనాదిగా ద్రవ్యం చేసే విధులే కాకుండా ఆధునిక వ్యవస్థలలో అవసరానికి అనుగుణంగా ద్రవ్యం విధులను నిర్వర్తిస్తున్నది. అవే అనుషంగిక విదులు.

**III. అనుషంగిక విధులు :** పెట్టుబడి దారీ వ్యవస్థలలో ధరల యంత్రాంగానికి మూలం ద్రవ్యం. ఇది వ్యవస్థకు ఇరుసులాంటిది. ఉత్పత్తి, పంపిణీ విధానాలు మెరుగైన కొద్దీ ద్రవ్యం అదనపు విధులను చేపడ్తుంది. ద్రవ్యత్వం కల్గిన అనేక ఆస్తుల రూపంలోకి మారి కరెన్సీగా తిరిగి పరివర్తనీయ మవుతున్నది. ఒకప్పుడు లోహాలు కరెన్సీకి ఆధారంగా ఉంటే నేడు బాంకు పరపతికి ద్రవ్యం ప్రాతిపదిక అవుతున్నది. ఇట్టి విధులే అనిశ్చిత విధులు. ఖచ్చితంగా తెలుపజాలనివే అనిశ్చిత విధులు. అవసరాన్ని బట్టి ద్రవ్యం అదనపు విధులను నిర్వహిస్తే అవే అనుషంగిక విధులు. పాల్ ఎంజిగ్ విధుల వర్గీకరణను అనుసరించి తెల్పిన విధులను క్రింద తెలిపాం.

**IV. నిశ్చలాత్మక విధులు :** ఉత్పత్తి, పంపిణీ విషయాల్లో తలదూర్చకుండా ద్రవ్యం కేవలం వినిమయానికి వాడబడి నిష్క్రియ పాత్రను వహిస్తే వాటిని నిశ్చలాత్మక విధులంటారు. ఇవి తటస్థ వైఖరిననుసరించే విధులు. వీటివల్ల ఉత్పత్తి, పెరుగుదల, పంపిణీలు మారవు. కాని ధరలను స్థిరంగా ఉంచేందుకు ద్రవ్యం తోడ్పడుతుంది. సాంకేతికంగా నిర్ణీత సంబంధాన్ని తెలిపి, కేవలం వ్యవహారాలకే పరిమితం కావటం సాంకేతిక లక్షణాల లక్ష్యం. ద్రవ్య వినిమయానికి, కొలమానంగా ప్రామాణికతను తెలపటం, చెల్లింపుల కోసం విలువ నిధిని కాపాడుకోవటం మొదలైనవన్నీ నిశ్చలాత్మక విధులే. నిశ్చలాత్మక విధులనే సాంకేతిక విధులంటారు.

**V. చలనాత్మక విధులు :** దీర్ఘకాలానికి సంబంధించిన మార్పులకు తగ్గట్టు మారటం, తానే ఇతర రంగాలలో, వ్యవహారాలలో మార్పులను తీసుకురావటాన్ని చలనాత్మక విధులంటారు. ప్రస్తుతం అన్ని ప్రభుత్వాలకు కోశ విధానం వుంటుంది. ప్రభుత్వపు జోక్యం, పాత్ర పెరిగిన కొలది ప్రభుత్వ ఖర్చులు పెరుగుతాయి. అంతగా రాబడి రాకపోతే ఖర్చులను తగ్గించలేని స్థితిలో లోటు ద్రవ్య విధానం అవలంబిస్తారు. పన్నుల వసూళ్ళు ఆదాయాన్ని పెంచటానికే కాక కేటాయింపులకు, సక్రమ వనరుల కేటాయింపుకు కూడా తోడ్పడుతుంది.



BRAOU

ధరలలో మార్పు కొనుగోలు శక్తిలో మార్పు, ఆదాయ పంపిణీలో మార్పులు తేవటం అన్నీ చలనాత్మక విధులే. సాంప్రదాయకంగా కేవలం వినిమయ సౌకర్యం కొరకే కాకుండా ఇతర కార్యకలాపాలలో అంటే ఉత్పత్తి, పంపిణీ, వినియోగం, పెట్టుబడులను మార్చటంలో కూడా మార్పులు తేగలిగితే చలనాత్మక విధులంటారు. సంపదను (assets) మార్చుకొని ద్రవ్యంతో వ్యాపారం చేయటం, దాని వలన లాభాలు పొందటం కూడా చలనాత్మక విధియే.

పైన తెల్పిన విధులు వాటి ప్రత్యేకతలను తెలుపుతాయి. కాని అవి ఒక దానితో ఒకటి సంబంధం లేకుండా ఉండవు. ద్రవ్యం అన్ని విధులను ఒకేసారి నిర్వర్తించక పోవచ్చుకూడా. ద్రవ్యం చేయవలసిన పనులే కాకుండా, చేయగలిగే వాటిని కూడా విధులతో తెలిపాం. ఇపుడు ఒక్కొక్క విధిని వివరంగా తెలుసుకుందాం.

### 1.5.2 విధుల విపులీకరణ

1. **వినిమయ మాధ్యమం :** వస్తు మార్పిడి పద్ధతిలోని లోపాలను సరిదిద్దటానికి ద్రవ్యం పుట్టింది. ఇది అమ్మకం కొనుగోళ్ళకు మధ్య వాడే దళారిలాంటిది. అందుకే వినిమయ మాధ్యమంగా చెబుతారు. లావాదేవీలు నిర్విఘ్నంగా, సౌకర్యంగా, సులభంగా, సాఫీగా, ఇబ్బంది లేకుండా ఉండటానికే ద్రవ్యం వినిమయ మాధ్యమంగా వాడబడింది. అందుకే ఈ విధిని ప్రాథమిక విధిగా చెపుతారు. వస్తువులను ప్రత్యక్షంగా వినిమయం చేయకుండా పరోక్షంగా చేయటానికి ద్రవ్యం సహాయపడుతుంది.

వినిమయాలకు మధ్యవర్తిగా, సాధనంగా ఉండే విధియే వినిమయ మాధ్యమం. ఈ విధి నిర్వర్తించాలంటే సర్వత్రా అందరు జనులచే ఆమోదింపబడాలి. ఆమోదం అనగా నమ్మకంతో అందరూ ద్రవ్యాన్ని వాడుకోవటం, ఒప్పుకోవటం జరగాలి.

వినిమయం పెరగటం వల్లనే వస్తు ఉత్పత్తి అమ్మకాలు పెరిగాయి. అందుకు వస్తువులను భారీ ఎత్తున ఉత్పత్తి చేయటం, ప్రత్యేకీకరణాలు జరిగాయి. ఆడమ్‌స్మిత్ చెప్పిన శ్రమ విభజనకు మార్కెట్లు అవసరం. మార్కెట్లకు ద్రవ్యం తప్పనిసరి. మనం వస్తువులను ద్రవ్య రూపంలోకి మార్చుకుంటే, దానితో ఏవస్తువైనా, ఎంతైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎందుకైనా, ఎలాగైనా కొనుక్కోవచ్చు. కోరికల సమన్వయంతోగాని, అవిభాజ్యత, మన్నిక, ప్రామాణికత మొదలైన సమస్యల వల్ల లావాదేవీలు ఆగే వీలుండకుండా ద్రవ్యం పనిచేస్తుంది.

ద్రవ్యపు ప్రథమ కర్తవ్యం వస్తు కొనుగోలుకు ఉపయోగపడటం. ఇది సాంకేతికంగా తప్పనిసరి. చెల్లింపుకు ఉపయోగపడే ఏ ద్రవ్యమైనా వస్తువుకు ఎంత విలువ చెల్లించాల్సి ఉంటుందో తెలియాలి. దానికి విలువ కొలమానం కావాలి. ద్రవ్యం కొలమానంగా లేకున్నా వినిమయానికి తోడ్పడవచ్చా అంటే, అలా కొన్ని సమయాల్లో జరిగింది. జర్మనీలో రెండవ ప్రపంచ యుద్ధం జరిగినపుడు వస్తు ధరలను డాలర్లలో, పౌండ్లలో చెప్పటం జరిగేది. చెల్లింపులకు సాధనంగా మాత్రం మార్కు(జర్మనీ ద్రవ్యం) వాడబడేది. జర్మనీ కరెన్సీ విలువ మారుతున్నందున తక్కువ మార్పులకు గురయ్యే కరెన్సీలో ధరలు చెప్పేవారు. కాని ప్రజల అంగీకారం, అలవాటు, గతంలో చలమణిలో ఉన్న జర్మనీ కరెన్సీలో మాత్రమే వినిమయం జరిగేది. అందువల్ల వినిమయ మాధ్యమం వేరు, విలువ కొలమానం వేరు.

వస్తువుల లావాదేవాలకు మధ్యవర్తిగా వాడే ద్రవ్యం చారిత్రకంగా, సామాజికంగా, ఆర్థిక అవసరంగా అనేక రూపాలు మార్చుకున్నది. ఏ రకంగా ఉన్నా, ఏ రూపంలో ఉన్నా అది ఇన్ని రోజులు కూడా వినిమయానికి

BRAOU

మాధ్యమంగానే ఉంది, ఉంటుంది కూడా. ఉత్పత్తి, వినియోగ వినిమయ దార్లకు స్వేచ్ఛను, సౌకర్యాన్ని, ప్రజల్లో నమ్మకాన్ని కలిగించే ద్రవ్యం వినిమయ మాధ్యమంగా విధిని నిర్వహించుచున్నది.

2. **ప్రామాణిక - విలువ కొలమానం :** కరెన్సీని కాని, ఏ వస్తువును కాని వినిమయానికి మాధ్యమంగా వాడినపుడు, వినిమయం చేయబడే వస్తు విలువలు తెలియాలి. ఏ వస్తువునైతే కొనుగోలు చేస్తామో దాని విలువ తెలియాలి. వస్తువుల విలువను ఒక ఖచ్చితమైన యూనిట్‌లోకి మార్చి, అది ఎన్ని యూనిట్ల విలువ కలిగిందో చెప్పాలి. ఉదాహరణకు ధాన్యం విలువను ఒక చిన్న ఆవుదూడ విలువలో చెప్పామనుకోండి. కాని ఆవుదూడ విలువ ఇపుడున్నది, మరికొన్ని రోజులకు మారుతుంది. అలాంటప్పుడు ఆవు దూడను ప్రామాణికంగా తీసుకోరాదు. అందుకే లోహాలలో, కరెన్సీలలో వస్తు విలువను తెలుపుతారు.

మనం కొనటానికి గాని అమ్మటానికి గాని సిద్ధపడినపుడు ఆ వస్తువు విలువను ద్రవ్యపు యూనిట్లలో తెలుపుతారు. మరోలా చెప్పాలంటే ద్రవ్యాన్ని విలువ కొలమానంగా వాడుతారు. ఒక వస్తువు విలువను వేరొక వస్తు రూపంలో చెప్పకుండా, దాని విలువ ఎన్ని రూపాయలో చెపుతారు. ఒక బాల్ పెన్ను ధర 5 రూపాయలనుకుందాం. పెన్ను ధర 5 ద్రవ్యపు యూనిట్లుగా తెలిపాం. ఒక్కొక్క ద్రవ్యపు యూనిట్‌ను యూనిట్ ఆఫ్ అక్కౌంట్ అంటాం. ఇక్కడ రూపాయలను లెక్కల యూనిట్‌గా విలువను లెక్కించటానికి ఉపయోగించిన అంశంగా, భాగంగా చెపుతాం. వస్తు విలువలను ద్రవ్యపు యూనిట్లలో చెప్పినప్పుడు దానినే ధర అంటాం. ధర వస్తువు విలువను కొలిచి ద్రవ్యరూపంలో చెపుతుంది.

వస్తువుల విలువను యూనిట్లలో ధరగా చెప్పినంత మాత్రానా వినిమయం జరగాలని లేదు. కాని వినిమయం జరగాలంటే ధర తెలియటం మంచిది. లాభ నష్టాలను, ప్రగతిని తెలుసుకోవటానికి విలువ కొలమానం అవసరం. వస్తువుల, సేవల విలువలను కొలవడానికి, విలువలకు ప్రమాణముగా ద్రవ్యం వాడబడుతుంది. విలువలను ద్రవ్య యూనిట్లలో ప్రామాణిక యూనిట్లలో కొలవటం ద్రవ్యపు విధి. ద్రవ్యమే ప్రామాణిక యూనిట్‌గా లేకపోతే వినిమయం సక్రమంగా జరుగదు. ఏ వస్తువు విలువ ఎంతో తెలిస్తే తప్ప వినిమయానికి సిద్ధపడం. వస్తువుల విలువను తెలుసుకోవటం, పోల్చి చూడటం, వాటి మధ్య తేడాలు గమనించటం కుదిరితే వినిమయం చేస్తాం.

ద్రవ్యాన్ని వినిమయ సాధనంగా అంగీకరించగానే దాన్ని విలువల కొలమానంగా వాడుతారు. వస్తువుల, ఆస్తుల విలువలు డిమాండ్, సప్లైలలో అంచనాలు, అనుభవాలు, వాస్తవాల వల్ల మారినా, వాటి మార్పులను తెల్పేది వాటి ధరలు మాత్రమే. వస్తువు విలువ ఖచ్చితంగా, నికార్సయిన ప్రమాణంలో చెప్పడానికి ద్రవ్యం తోడ్పడుతుంది. ద్రవ్యం విలువలను కొలవడానికి, ఒక ప్రామాణిక యూనిట్‌గా ఉపయోగపడాలి. ఇదే దాని విలువ కొలమానంగా ఉండే విధి.

**విలువల కొలమానం, వినిమయ మాధ్యమం మధ్య సంబంధం :** ప్రామాణిక యూనిట్లలో వస్తువు విలువ చెప్పడం జరిగితే వినిమయం సాధ్యమవుతుంది. అప్పుడే ద్రవ్యం మాధ్యమంగా ప్రవేశిస్తుంది. అయితే అమలులో ఉన్న అంగీకరింపబడే ద్రవ్యం ఉంటేనే దాని రూపంలో ద్రవ్య విలువలు చెపుతారు. ఈ రెండు విధులు కూడా పరస్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడుతాయి. సర్వజనాంగీకారం లేని ద్రవ్యమే లేనపుడు వస్తు విలువను ఆ ద్రవ్య రూపంలో చెప్పటం అర్థ రహితంగా ఉంటుంది. అందువల్లనే జనంచే అంగీకారం పొందిన ద్రవ్య రూపంలో ధరలను చెప్పి అమ్మకాలను, కొనుగోళ్ళను కొనసాగిస్తారు.

వినిమయ మాధ్యమం వేరు, కొలమానం వేరు. అమెరికా, ఇంగ్లండులో బంగారాన్ని ప్రామాణిక ద్రవ్యంగా చేసారు. ఏ వస్తువు విలువైనా ద్రవ్య యూనిట్లలో (బంగారపు యూనిట్లలో) చెప్పబడేది.

BRAOU

అంటే ప్రామాణిక ద్రవ్యం రూపంలో విలువలు చెప్పబడేవి. కాని వెండి, కరెన్సీల ద్వారా కూడా లావాదేవీలు వినిమయం జరిగేది. విలువను కొలవటం సాధ్యపడక దానిని ఏ మాధ్యమంతోనైనా వినిమయం చేసుకోవచ్చు. అంత మాత్రాన వాటి మధ్య సంబంధం లేదని చెప్పజాలం. ఎందుకంటే విలువలను ఏదైనా ఒక ప్రామాణిక యూనిట్‌లలో చెప్పాలి. అదే ప్రామాణిక యూనిట్లుగా ఉన్న ద్రవ్యమే వినిమయానికి వాడితే వ్యవహారాలు సులువుగా, సజావుగా జరుగుతాయి.

పైన తెలిపిన విధులు ద్రవ్యానికి తప్పనిసరిగా నిర్వర్తించవలసిన కర్తవ్యాలు. అందుకే వాటిని ప్రాథమిక విధులని అంటాం. కొనుగోలు శక్తి కల్గి, విలువలను కొలవ గలిగి, మాధ్యమంగా వాడబడే ద్రవ్యాన్ని ఎప్పుడైనా వాడుకోవచ్చు. దానిని దాచుకుంటే కొనుగోలు శక్తిని, నిబిడీకృత విలువలను నిలువ చేసుకున్నట్లే. దానిని చెల్లింపులకు ఎప్పుడైనా వాడుకోవచ్చు. భవిష్యత్తులో తన ద్రవ్యానికి విలువ ఉంది అనే నమ్మకం ప్రస్తుత కొనుగోలు శక్తి , ప్రస్తుతం, గతం ద్రవ్యంపై ఉన్న నమ్మకాన్ని బట్టి ఉంటుంది. అందుకే ప్రాథమిక విధుల తర్వాత గౌణ, ద్వితీయ విధులు రూపొందుతాయి. సౌకర్యానికి తలెత్తిన విధుల్లో మూల్యనిధి (విలువ నిధి) మరొకటి.

3. **మూల్యనిధి (విలువ నిధి) :** ద్రవ్యానికి విలువల నిలువ చేసే లక్షణం ఉంది. దీనినే మూల్యనిధి అంటారు. ఏ ద్రవ్య యూనిట్ అయినా తన విలువను, కొనుగోలు శక్తిని పోగొట్టుకోకుండా భవిష్యత్తులో ఆ విలువను వాడుకుంటే విలువను నిలువ ఉంచడం అంటారు. ఈ విధిని నిర్వర్తించడానికి బంగారం లాంటి లోహాలను పశుసంపద స్థానంలో పెట్టారు. ద్రవ్యాన్ని నిలువ ఉంచటానికి ఖర్చులుగాని, నిల్వ ఉంచటం వల్ల తరుగుదల కాని ఉండదు. పైగా నిలువ ఉంచటం వల్ల ఆదాయాన్ని పెంచవచ్చు. ద్రవ్యాన్ని నిలువ ఉంచగలగటం వలన ద్రవ్యం వల్ల ఉపయోగితాపరిధి పెరిగింది.

విలువ కలిగి, దాన్ని నిల్వ చేసుకోవటం వల్ల మూలధనంగా ద్రవ్యనిధి మారుతుంది. ఏ కాలంలోనైనా నిధి రూపంలో విలువను పొందుపరచుకోవటం ద్రవ్య విధులలో ఒకటి. అలా చేయగలిగిందే మంచి ద్రవ్యం. వస్తువుల ఉత్పత్తి మిగులు ఉన్నపుడు ఆ మిగులును ద్రవ్యంలోకి మార్చుకొని విలువల నిధిగా మార్చుకోగలం. ఈ ద్రవ్యాన్ని బాండ్లు, వాగ్దాన పత్రాలు, స్థిరాస్తులు మొదలైన వాటిలోనికి మార్చుకోవచ్చు. ఉత్పత్తి చేయటానికి ప్రారంభం నుండి అమ్మకం వరకు కావలసిన కొనుగోలు శక్తిని విలువ చేసుకుంటే తప్ప ఉత్పత్తి జరుగదు. ఈ కర్తవ్యాన్ని విలువనిధిగా చేపడుతుంది.

4. **విలువల బదిలీ :** ద్రవ్యాన్ని ఒకరి నుండి మరొకరికి ఇవ్వటం అంటే విలువను, కొనుగోలు శక్తిని బదిలీ చేయుటం అంటాం. సర్వసమ్మతమైన ద్రవ్యం ఒకరి నుండి మరొకరికి బదిలీ చేసినా విలువను కోల్పోదు. పాముల వాడి చేతిలోని పామును సామాన్యుడు తీసుకుంటే దానిని ఆడించలేడు, ఆదాయం పొందలేడు. కాని వ్యక్తుల నుండి తరలించిన ద్రవ్యం ఇంకొద్ది ఆదాయాన్ని పెట్టుబడి మూలంగా తెచ్చిపెడుతుంది. నేటి వ్యాపార యుగంలో ఒక రకమైన ఆస్థిని మరొక రూపంలోకి మార్చటం, స్థలాల మార్పిడి, సంస్థల మధ్య, వ్యక్తుల మధ్య బదిలీ చేయటానికి ద్రవ్యం తోడ్పడాలి. కొన్ని వస్తువులను ద్రవ్యంగా వాడితే బదిలీ సాధ్యపడదు. ఒకవేళ బదిలీ చేసినా విలువ కోల్పోవచ్చు. ఉన్ని బట్టలకు శీతల ప్రాంతంలో ఉన్న విలువ ఉష్ణ ప్రాంతాల్లో లేనపుడు ఉన్ని విలువ వేరు వేరు ప్రాంతాలకు బదిలీ చేసినపుడు మారుతుంది. ద్రవ్యం విషయంలో రూపాయి విలువ రూపాయగానే ఉంటుంది. ద్రవ్యం విలువ కూడా పట్టణ ప్రాంతాల్లో వేరు, పల్లె ప్రాంతాల్లో వేరుగా ఉంటుందనే సందేహం రావచ్చు. కాని సాపేక్షికంగా వస్తువుల ధరలే కాకుండా పట్టణాలల్లో ఆదాయం కూడా ఎక్కువగా ఉంటుంది. అలాగే ఆదాయాలు తక్కువ (కొనుగోలు శక్తి తక్కువ)గా ఉన్నచోట ధరలు కూడా తక్కువగా ఉంటే ప్రజలు తమ ద్రవ్యంతో పొందే ప్రయోజన విలువలో ఎక్కువ తేడారాదు.

BRAOU

వస్తువులను, పశు జంతుజాలాన్ని ద్రవ్యంగా వాడినపుడు (విలువను) బదిలీ చేయటంలో సమస్యలుండేవి. కరెన్సీ వాడిన నాటి నుండి ఈ ఇబ్బందులు తగ్గినాయి. విలువల బదిలీని సౌకర్యం కోసం, లాభ ప్రయోజనాల కోసం చేయటం ద్రవ్యవిధి.

5. **విలంబిత (వాయిదా) చెల్లింపులు :** వ్యాపారం చేసేటప్పుడు జరిపే లావాదేవీలకు చెల్లింపులు కొంతకాలం తర్వాత కూడా చేస్తారు. అట్టి భవిష్యత్తు చెల్లింపులనే విలంబిత లేదా వాయిదా వేసే చెల్లింపులు అంటారు. అట్టి చెల్లింపులకు ద్రవ్యం ఉపయోగపడాలి. అలాగే పెట్టుబడికి గాని, వాడకానికి గాని డబ్బును అప్పు తీసుకుంటే వడ్డీతో సహా అసలును చెల్లించాలి. అది ద్రవ్య రూపంలో చెల్లించుతారు. ఇదే విలంబిత చెల్లింపు. రూపాయలను బదులు తీసుకుంటే చెల్లింపు కూడా రూపాయల్లోనే ఉంటుంది. ఈ చెల్లింపులు వర్తమానానికి, భవిష్యత్తుకు వంతెనలా ఉపయోగిస్తారు.

పెద్ద ఎత్తులో పెట్టుబడులు పెట్టాలన్నా, ప్రభుత్వం ఋణాలు తీర్చాలన్నా, ద్రవ్యానికి విలంబిత చెల్లింపుల శక్తి ఉండాలి. వరి ధాన్యాన్ని నేడు అప్పుగా తీసుకొని దానినే నిలువ ఉంచి పది సంవత్సరాల తర్వాత ఇవ్వలేం. విలంబిత చెల్లింపులకు ద్రవ్యమే ఎక్కువగా ఉపయోగపడుతుంది. మన్నిక లేని వస్తువులు, సజాతీయతలేని సాధనాలు ద్రవ్యంగా విలంబిత చెల్లింపులకు పనికిరావు. ఒప్పందాల ప్రకారం చెల్లింపులకు ద్రవ్యం తోడ్పడుతుంది. ద్రవ్య విలువ ఒకవేళ మారినా, ప్రకటితాభిరుచి (revealed preference) మారినా, ఋణాలకు ఇచ్చిన ద్రవ్యం విలువ మారవచ్చు. ఆ స్థితిలో ఋణాల మీద ఇచ్చే వడ్డీ ఆ తారతమ్యాన్ని తొలగించుతుంది. వాయిదాల చెల్లింపులు, విలంబిత చెల్లింపులు ఉండటం వల్లే పెద్ద ఎత్తున ఉత్పత్తి, వినిమయాలు చేపడుతున్నారు. తాత్కాలిక ఉపయోగానికే కాకుండా, దీర్ఘకాలిక ప్రయోజనాలకు కూడా ద్రవ్యం తోడ్పడాలనే దీని భావం. ఇంతవరకు తెల్పిన ముఖ్యమైన అయిదు విధులే కాక అనుషంగిక విధులు మరికొన్ని ఉన్నాయి.

6. **ఆదాయ సంపద పంపిణీ :** ఆదాయ సంపద పంపిణీకి ద్రవ్యాన్ని వాడుతాం. ఇది అనిశ్చిత విధులలో ఒకటి. ఈ విధులను నిశ్చయంగా ద్రవ్యం చేయకపోవచ్చు. ఈ విధులను అడపాదడపా చేసినా, తప్పనిసరైనవి కావు. కొన్ని వ్యవస్థలలో, కొన్ని కాలాలలో మాత్రమే ఈ విధులు చేయబడుతాయి. అయితే వ్యవస్థకు తోడ్పడే విధంగా మాత్రమే లేదా ఆ ఆశయం కోసమే అనుషంగిక విధులు పనిచేస్తాయి. వాటిలో వనరుల కేటాయింపు సంపద, ఆదాయ పంపిణీలు కొన్ని.

ప్రభుత్వం పన్నులను ద్రవ్యం రూపంలో వసూలు చేస్తారు. ధనికుల నుండి ద్రవ్యాన్ని పన్నులుగా వసూలు చేసి, పేదల కోసం ఖర్చు చేస్తుంది. ప్రత్యక్ష పన్నులు ఆదాయాన్ని తగ్గిస్తాయి. సాంఘిక భద్రత, ఖర్చులు, బదిలీ చెల్లింపులు, తక్కువ ఆదాయం ఉన్నవారి కొనుగోలు శక్తిని పెంచుతుంది. ఇలా ఆదాయ పంపిణీలో మార్పులు సమాన పంపిణీని ద్రవ్యం ద్వారా సమకూరుస్తాయి. వనరులను దేని కోసం తరలించాలో, ఎంత తరలించాలో యంత్రాంగం లేదా ప్రభుత్వం నిర్ణయించి, ద్రవ్య, పరపతి సాధనాల ద్వారా అమలు చేస్తాయి. అనుత్పాదకమైన మద్యపానం లాంటి ఉత్పత్తులపై, వాటికి వాడే మూలధనంపై పన్నులు వేసి ఆ డబ్బును ఇనుము, ఉక్కు ఉత్పత్తి చేసే సంస్థలకు సబ్సిడీలు ఇవ్వవచ్చు. మూలధన వనరులను ఇలా తరలించవచ్చు.

సంపదలో సమానత్వం కొరకు ఆస్తి పన్నులు విధించి వేరే వర్గాలకు గృహాలను కట్టించి సంపదను పంచవచ్చు. లాభాల వాటాలు, వేతనాల వాటాలు నిర్ణయించటానికి చెల్లింపులు, చట్టాలు, ధరలు, ఖర్చులు

BRAOU

- వాటిలోని మార్పులు - ద్రవ్య సహాయంచేయటానికి తోడ్పడుతాయి. ఉత్పత్తి సాధనాల ధరలు ద్రవ్య రూపంలో ఎంతెంత చెల్లిస్తున్నాయో తెలిస్తే పంపిణీ తెలుస్తుంది. సాంప్రదాయిక శాస్త్రవేత్తల దృష్టిలో ద్రవ్యం తటస్థంగా ఉండి, మార్పులు తేవటానికి అతీతంగా ఉంటుంది. కాని ఆధునికులు ద్రవ్యాన్ని మార్పులు తెచ్చే అంశంగా పరిగణిస్తారు. ఈ విధి నేడు ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటున్నది.

7. **పరపతి సృష్టికి మూలం :** బాంకు ద్రవ్యాన్నే పరపతి అంటారు. చట్టబద్ధమైన ద్రవ్యాన్ని బాంకులలో అవసరమైన మేరకు ఉంచి మిగిలిన ద్రవ్యాన్ని పరపతి ద్రవ్యంగా చలామణి చేస్తారు. ద్రవ్యమే లేకుంటే పరపతి సృష్టి కూడా ఉండదు. పరపతి ద్రవ్యంతోనే ఉత్పత్తి, వ్యాపారాలు, వస్తు కొనుగోళ్ళు కూడా జరుగుతున్నాయి. ప్రస్తుత, భవిష్యత్ చెల్లింపులకు పరపతి ద్రవ్యం, దానికి ఆధారమైన చట్టబద్ధ ద్రవ్యం చాలా కీలకపాత్ర వహిస్తాయి. ద్రవ్యానికి కొన్ని రెట్లు పరపతి సృష్టిస్తారు. కావున, ద్రవ్యాన్ని కొద్దిగా తగ్గించితే పరపతి ద్రవ్యం చాలా తగ్గుతుంది. అలాగే ద్రవ్యాన్ని పెంచటం ద్వారా పరపతి ద్రవ్యాన్ని పెంచవచ్చు.

8. **అత్యధిక సామర్థ్య వ్యవస్థ :** వ్యవస్థలో సమర్థవంతంగా ఏపని చేపట్టాలన్నా అది లాభదాయకంగా ఉండాలి, దుబారా (wastage) కాకుండా చూడాలి. వ్యవస్థలో వృద్ధి రేటును, అభివృద్ధి సూచికలను అత్యధికంగా పెంచుకోవడానికి వనరుల, వస్తువుల, మానవాది సంపదలను వేగంగా సక్రమంగా తరలించగల్గాలి. ఆ పని కేవలం ద్రవ్యంతోనే సాధ్యపడుతుంది.

9. **ధర యంత్రాంగం :** పెట్టుబడిదారీ వ్యవస్థలో స్వేచ్ఛగా, ప్రభుత్వ జోక్యం లేకున్నా, ధరల యంత్రాంగం ద్వారా వ్యవస్థ పనిచేస్తుంది. కొనుగోలుదార్లకు ఏ వస్తువు కావాలో వాటిని అమ్మకందార్లు ఉత్పత్తి చేస్తారు. కొనుగోలుదార్ల డిమాండు ఏ వస్తువుకు ఎక్కువగా ఉంటుందో దాని ధర పెరుగుతుంది. దానిని అప్పుడు ఉత్పత్తిదారుడు సప్లై చేస్తాడు. అధిక సప్లై చేస్తే ధర తగ్గుతుంది. దానికి తగ్గట్టు నిర్ణయాలు మార్చు కుంటాడు. వీటికి ధరల్లో మార్పే కారణం. ద్రవ్యమే లేకుండా దేశీయ, అంతర్జాతీయ వ్యాపారాలు కాని ఉత్పత్తులు కాని సక్రమంగా జరుగకుండేవి. వ్యవస్థను స్వయంచాలకంగా నడుపడానికి ద్రవ్యమే ప్రధానం. పెట్టుబడి దారీ విధానాన్ని సాఫీగా నడిపించడం - ధర యంత్రాంగపు ద్రవ్య సాధనపు ముఖ్య విధుల్లో ఒకటి.

**ధరల మార్పు, ధరల విధానం :** ప్రభుత్వం తన జోక్యంతో సప్లై డిమాండ్లలో మార్పు తేవడానికి ద్రవ్యాన్ని వాడుతుంది. ఆర్థిక మాంద్యం నుండి తేరుకోవడానికి ధరలు పెరగాలంటే, ద్రవ్యాన్ని, ద్రవ్య చలామణిని, పరపతి ద్రవ్యాన్ని పెంచాలి. అలాగే ధరలు తగ్గించటానికి ద్రవ్య కోశ విధానాలు ద్రవ్య సహాయంతో పనిచేస్తాయి. విదేశీ మారకపు రెట్లు మారాలన్నా, కనిష్ట లేదా గరిష్ఠ ధరలు నిర్ణయించాలన్నా ద్రవ్యాన్ని వాడు కోవాలి. దీనికి కూడా ద్రవ్యం తోడ్పడుతుంది.

10. **ఉపాంత ప్రయోజనాన్ని, ఉపాంత ఉత్పాదకతలను ధరలకు సమానం చేయటం**

వినియోగదారుడి ఉపాంత ప్రయోజనం వస్తువు ధరకు సమానమైనపుడు సమతౌల్యంలో ఉండి గరిష్ట ప్రయోజనం పొందుతాడు. సమోపాంత ప్రయోజనం ద్వారా ఏ వస్తువులను ఎన్నుకోవాలో ధరల ననుసరించి నిర్ణయించుకుంటాడు, ద్రవ్యంతో పోల్చుకుంటాడు. ఉత్పత్తి దారుడు ఉత్పత్తి సాధనాలను ఏవి వాడాలి, ఎంతెంత వాడాలి అనేది శ్రమ, మూలధనపు ఉత్పాదకత (productivity) లపై, వాటి ధరలపై ఆధారపడుతుంది. గరిష్ట లాభం, కనిష్ట ఖర్చులు పొందాలంటే ధర ఉపాంత ఉత్పాదకతలు సమానం కావాలి. ఇలా ప్రతీ రంగపు నిర్ణయాలలో ద్రవ్యం పనిచేస్తుంది. ఉత్పత్తి సాధనం వల్ల అదనపు

ఉత్పత్తి పదిరూపాయలు ఉండి, దాని ధర పదికన్న తక్కువ ఉంటే ఉత్పత్తి సాధనపు వాడకాన్ని పెంచవచ్చు. ఇలాంటి నిర్ణయాలను అంతర్జాతీయ వర్తకానికి కూడా ఉపయోగిస్తారు. ఇట్టి నిర్ణయాలకు సహాయకారిగా ఉండేది ద్రవ్యమే.

11. **ద్రవ్యత్వం - ఏకత్వం - సజాతీయతలు :** ద్రవ్యం అంటే కరెన్సీ, డబ్బు, పరపతి ఇత్యాదులు. ద్రవ్యత్వం అంటే నగదుగా, చట్టబద్ధ ద్రవ్యంగా మార్చుకోవటం. మన చేతిలో కరెన్సీ నోట్లు ఉంటే ద్రవ్యత్వం ఉన్నట్లు. అదే బ్యాంకు డ్రాఫ్టును తీసుకుందాం. దాన్ని ద్రవ్యంగా మార్చటానికి కొంతకాలం ప్రయాస అవసరం. డ్రాఫ్టుకు ద్రవ్యత్వం తక్కువ. అలాగే భవనాల కన్న బంగారానికి ద్రవ్యత్వం ఎక్కువ. వివిధ రకాల ద్రవ్యత్వం ఉన్న ఆస్తులనన్నింటినీ ఒకే రూపంలోకి మార్చాలంటే ద్రవ్యం లోకే మార్చాలి. పూర్తి ద్రవ్యత్వం ఉన్న కరెన్సీని ఏ రూపంలోకైనా మార్చవచ్చు, పెట్టుబడిగా పెట్టవచ్చు. ఆస్తులను కొనవచ్చు. కావాలంటే అన్నిటినీ ద్రవ్యంలోకి మార్చి వాటి విలువను ఏకత్వం (unify) చేయవచ్చు. ఆస్తులన్నింటిని ద్రవ్యం రూపంలో కొలిచి చెప్పి సజాతీయతను కల్పించవచ్చు. సాధారణ రూపంలోకి మార్చి చెప్పటానికి ద్రవ్యం కావాలి. వివిధ రకాల పెట్టుబడి వస్తువులను, మూలధనాన్ని సజాతీయంగా చెప్పటానికి ద్రవ్యం సహాయపడుతుంది. సంపద సమకూర్చుకోవటానికి కూడా అవసరమైన ద్రవ్యం - దాని ద్రవ్యత్వ లక్షణం, లాభదాయకత, మార్చడానికి పట్టేకాలం మొదలైనవి చూస్తారు.

12. **ఐచ్ఛిక వాడకం (Option of Bearer) :** ద్రవ్యాన్ని తన ఇష్టం వచ్చిన రీతిగా వాడుకోవచ్చు. వినియోగ వస్తువుకైనా, పెట్టుబడికైనా, విలాస వస్తువుకుగాని, అవసరానికి గాని, సంపదకై గాని , పందేలకు గాని వాడొచ్చు. యంత్రాన్ని కొంటే దానిని తినలేం. కాని ద్రవ్యాన్ని తినే వస్తువుకు గాని, యంత్ర తయారీకి గాని వాడే స్వేచ్ఛ ఉంటుంది. దీని వాడకానికి అడ్డంకులుండవు.

13. **తిరిగి చెల్లించే శక్తి - అంచనా :** ఏ వ్యాపారానికైనా పేరు ప్రతిష్ఠ, మంచి గత చరిత్ర ఉండాలి. ఆర్థికంగా దివాలుకోరుతనం లేనప్పుడే పై అంశాలుంటాయి. ద్రవ్యం రూపంలో చెల్లించే శక్తి, సకాలంలో చెల్లించేటట్లుంటే నమ్మకానికి తిరుగు ఉండదు. మార్చుకోగల్గిన ఆస్తులుంటే చాలదు, ఆస్తులను మార్చాలి. అప్పుడే తిరిగి చెల్లించే శక్తి పెరుగుతుంది. మంచి పేరు ఉంటే ఉత్పత్తిదార్లకు, వినియోగదార్లకు మంచిది.

14. **లోటు ద్రవ్యం :** ప్రభుత్వపు ఖర్చు ఆదాయాన్ని మించినపుడు తాను చేపట్టిన కార్యక్రమాలు అమలు కావాలంటే లోటు ద్రవ్యాన్ని ఆశ్రయించాలి. కరెన్సీ నోట్లను తానో, తన ఆధీనంలోని కేంద్ర బ్యాంకో ముద్రించాలి. అలాంటి ద్రవ్యం ధరలను పెంచుతుంది కూడా. ద్రవ్యం యొక్క కల్పనలో సృష్టి కార్యక్రమంలో లోటు ద్రవ్యం ఒకటి.

15. **ఆస్తి మూలధనాల రూపాంతరం :** ఈ విధి ద్రవ్యత్వాన్ని పోలి ఉంటుంది. ఆస్తి సంపద మూలధనాలు ఎంత విలువ గలవో ద్రవ్యంలోకి మార్చి పోల్చి చూస్తారు. ద్రవ్యం ఎక్కువ పొందే (లాభాల ద్వారా) అవకాశం ఊహించినా, వాస్తవికంగా ప్రస్తుత విలువ ఎక్కువ ఉన్నా ధనవంతునిగా చెప్పవచ్చు. ఈవిధంగా వ్యవస్థలను, వ్యక్తులను పోల్చటానికి, కాలగమనంలో మార్పులను తెలుపడానికి ద్రవ్యం సూచికగా ఉంటుంది.

పైన తెలిపిన విధులేకాక పాల్ ఎంజిగ్ చెప్పిన విధులు మరికొన్ని ఉన్నాయి. ద్రవ్యం మారుతున్న పరిస్థితుల్లో ఎటువంటి పాత్ర నిర్వహిస్తుందో తెలుపటానికి చలనాత్మక విధులు పనికివస్తాయి. ఎంజిగ్ తెలిపిన నిశ్చలాత్మక విధులన్నింటిని కూడా పైననే తెలిపాం.

16. **పోర్టు ఫోలియోలో మార్పులు :** వస్తు ధరల్లో, సంస్థల లాభదాయకతలో, అమల్లో ఉన్న వడ్డీ రేట్లలో

BRAOU

మార్పులు వచ్చినపుడు ద్రవ్యపెట్టుబడి కూడా మారుతుంది. అన్ని రకాల పోర్టుఫోలియో పెట్టుబడులు పెట్టటమో, ప్రధానమైన వాటిపై ఎక్కువ లాభం వచ్చేటట్లు ద్రవ్యాన్ని కేటాయించటమో జరుగుతుంది. వ్యవస్థలో మార్పులు తేవటానికి ద్రవ్యం పనిచేస్తే చలనాత్మక విధి అంటారు. పోర్టు ఫోలియో పెట్టుబడులు, మార్పులు వ్యక్తులనేకాక వ్యవస్థలను కూడా ప్రభావితం చేస్తాయి.

**17. మూలధన కల్పన :** మూలధనం పెరగాలంటే పెట్టుబడులుండాలి. ద్రవ్యాన్ని ఉత్పత్తికై, ఉద్యోగితకై, వాడటాన్నే పెట్టుబడి వ్యయం అంటాం. ద్రవ్యంపై వచ్చేలాభం, దానికిచ్చే వడ్డీ, రాబడి, వర్తమాన విలువలు, మొదలైన అంశాలు మూలధన నిర్మాణం సంచయనం వైపు లాభం చూపుతాయి.

**18. అంతర్జాతీయ ప్రవాహాలు :** వేరు వేరు దేశాల్లో కరెన్సీ యూనిట్స్, వాటి పేర్లు వేరుగా ఉండవచ్చు. అమెరికాలో డాలర్లు, ఇంగ్లాండులో పౌండ్లు, కరెన్సీ యూనిట్లుగా వుండగా, మన దేశంలో రూపాయ ప్రామాణిక ద్రవ్యంగా వుంది. మౌళికంగా వీటికున్న శక్తి ఒక్కటే. అదే కొనుగోలు శక్తి. అది కలిగిన ద్రవ్యం ఎక్కడైనా ఒప్పుకొనబడుతుంది. అమెరికాలో రూపాయలు చలామణిలో ఉండవు. కాని అమెరికా ప్రభుత్వం తన దగ్గర ఉన్న రూపాయ నిల్వలను భారతదేశం నుండి వినియోగ వస్తువుల కొనుగోలుకు గాని, పెట్టుబడులకు గాని వాడవచ్చు. వినిమయపు రేట్లు, విదేశీ వినిమయంలోని మార్పులు అంతర్జాతీయంగా ద్రవ్యపు ప్రవాహాన్ని నిర్ణయిస్తాయి. వివిధ దేశాల మధ్య వర్తకానికి, వ్యాపారానికి, మూలధనాల తరలింపుకు పనిబడే ద్రవ్యం అంతర్జాతీయ ద్రవ్య ప్రవాహాలను నిర్ణయిస్తుంది.

ద్రవ్యపు విధులను ఎన్నో రకాలుగా తెలుపవచ్చు. ద్రవ్య విధులను బట్టి మంచి ద్రవ్యానికి ఉండాల్సిన లక్షణాలను కూడా తెలుపుతారు. మానవాళికి తోడ్పడే ద్రవ్యం ఎన్ని రకాలో తర్వాత తెలుసుకుందాం.

## 1.6 ద్రవ్య స్వభావం

ద్రవ్యం మానవుడు రూపొందించుకున్న వస్తువు. సౌకర్యం కోసం ఏర్పరచుకున్న సృష్టి. అదుపులో ఉన్నంతసేపు మంచి సేవకునిగా ఉంటుంది. అదుపు తప్పితే తిప్పలు పెట్టే యజమాని (అధిపతి) అవుతుంది. మానవుని వర్తక, వ్యాపార ఆర్థిక కార్యకలాపాలకు ఉపయోగపడేదే ఈ సాధనం. ఇదొక రహదారి. వాడుకుంటే ఉపయోగపడుతుంది. లేకుంటే దానికి విలువ ఉండదు. ద్రవ్యం వస్తువులను కొనటానికి, అమ్మటానికి వాడే సాధనము మాత్రమే కాదు, వాటి విలువలను తనలోకి మార్చుకొని విలువలను నిలువ చేస్తుంది. J.W. అంజెల్ (Angell, *Quarterly Journal of Economics*, 1937) ద్రవ్యాన్ని క్రియాత్మక (active), నిష్క్రియాత్మక (idle) ద్రవ్యంగా వర్గీకరించాడు. కొంత ద్రవ్యం ఖర్చులకు వాడబడుతుంది, మరికొంత ద్రవ్యం వ్యాపార లావాదేవీలకు గాని, ముందు జాగ్రత్తకు గాని వాడబడుతుంది. కొంత ద్రవ్యం నిలువకై ఉంచుకుంటాము. అది వడ్డీ రేటు మీద, అనిశ్చిత (uncertainity) మీద, అంచనాల (speculation) మీద ఆధారపడుతుంది. ద్రవ్యాన్ని వస్తుమారకానికి (exchange of goods) వాడినా, విలువ ఉంచుకోవటానికి వాడినా అవి వేరుకావు. సర్వజన సమ్మతమై, వినిమయ మాధ్యమంగా ఇప్పుడైనా, మరెప్పుడైనా వాడబడి లాభాలను, ప్రయోజనాలను పెంచే స్వభావం కలిగినదే ద్రవ్యం. పెట్టుబడిదారీ, మిశ్రమ, సామ్యవాద వ్యవస్థలలో దీని కర్తవ్య నిర్వహణ వేరైనా, దాని అవసరం తప్పనిసరి. నిశ్చల స్థితిలో కాని, చలనాత్మక పరిస్థితిలో కాని వ్యవహారాలకు ద్రవ్యం చాలా అవసరం. ద్రవ్యం ఒక సాధనం. వస్తు రూపంలోకి మారే సాధనం. దీనితో కొనుగోలు చేసే వస్తు సేవలు లేకుంటే ఇది నిరర్థకమే. ఏమీ దొరకని ఎడారిలో ఎంత డబ్బున్నా నిష్ప్రయోజనమే కదా ! అది వస్తువుల, సేవలలోకి మార్చుకోబడినపుడే దాని ప్రయోజనం తెలుస్తుంది.

BRAOU

అంగీకరించబడినంతవరకు ద్రవ్యం ఏ రూపంలోనైనా ఉండొచ్చు. ఐచ్ఛిక ద్రవ్యంగా గాని, కరెన్సీగా గాని, పరివర్తనీయంగా గాని ఎలాగైనా ఉండవచ్చు. ద్రవ్యాన్ని దాని స్వభావాన్ని బట్టి అనేక రకాలుగా వర్గీకరించవచ్చు. ద్రవ్య వర్గీకరణను ఇప్పుడు తెలుసుకొందాం.

## 1.7 ద్రవ్య వర్గీకరణ

ద్రవ్యం ఎన్ని రకాలుగా ఉంటుందో ద్రవ్య వర్గీకరణ తెలుపుతుంది. ద్రవ్యంగా ఏ రకమైన దానిని వాడినాం అనే దాన్ని అనుసరించి దానిని వస్తు ద్రవ్యం, లోహ ద్రవ్యం, పత్ర ద్రవ్యం, పరపతి ద్రవ్యంగా వర్గీకరించవచ్చు. అలాగే ఏ వస్తువును వాడినారో ఒక్కొక్క దాన్ని వర్గీకరించి చెప్పవచ్చు. అలాగే లోహ ద్రవ్యంలో ఎన్ని రకాల లోహాలు వాడినారో దానిని బట్టి ద్రవ్యాన్ని వర్గీకరించవచ్చు. ఏక లోహ, ద్విలోహ, బహులోహ ద్రవ్యంగా, మళ్ళీ ఏకలోహ ద్రవ్యంలో బంగారమా, వెండియా, మిశ్రమ లోహమా కూడా ద్రవ్య వర్గీకరణ తెలుపుతుంది. కాగితపు ద్రవ్యంలో కూడా బంగారానికి ప్రతినిధి ద్రవ్యమా, పరివర్తనీయమా, చట్టబద్ధమా కాదా కూడా ద్రవ్యపు రకాలను తెలుపుతాయి. పట్టిక 1.3 ఆ విషయాలను వివరించుతుంది.

ద్రవ్యాన్ని వర్గీకరించడంలో ఒకరకమైన వర్గీకరణలోని అంశాలే మరొక వర్గీకరణలో కన్పించవచ్చు (overlap). ఏదో ఒక ప్రత్యేకత, విశిష్టత మాత్రం ఉంటుంది. ఈ అంశాలను విపులీకరించటానికి స్థలా భావం, పునరుక్తి దోషం కలుగుతాయి. కనుక క్లుప్తంగా తెలుపటం జరుగుతుంది. కాని వీటి పరిశీలన ద్రవ్య స్వభావాన్ని, పరిధిని తెలుపుతుంది.

### 1.7.1 వస్తువుమ బట్టి వర్గీకరణ

ఇంతవరకు వివిధ ప్రాంతాలలో, వేరు వేరు కాలాలలో వివిధ వస్తువులను ద్రవ్యంగా వాడినారు. వాటిల్లో వస్తు ద్రవ్యం ఒకటి.

**(i) వస్తు ద్రవ్యం (Commodity Money) :** తొలి ద్రవ్య దశల్లో వివిధ వస్తువులను ద్రవ్యంగా వాడినారు. అది పొగాకు, పశువులు, ఏనుగు దంతాలు మొదలైన వస్తువులు. దీని లోపాలను సరిదిద్దటానికే లోహాలను ద్రవ్యాలుగా వాడినారు.

**(ii) ఏకలోహ ద్రవ్యం (Mono Metallism) :** ఈ ద్రవ్య ప్రమాణంలో (standard of money) ఏదేని ఒక రకమైన లోహాన్ని ద్రవ్యంగా ద్రవ్య యూనిట్‌గా వాడినారు. బంగారాన్ని ద్రవ్యంగా అంగీకరించారు. కొన్ని దేశాల్లో కేవలం వెండినే ద్రవ్యంగా వాడినారు. 23.2 గ్రైన్‌ల బరువైన స్వచ్ఛమైన బంగారాన్ని డాలరుగా స్థిరీకరించి (1993 లో U.S.A. లో ) ద్రవ్యంగా వాడేవారు. ప్రపంచంలో అన్ని దేశాలు ఒకే లోహాన్ని ద్రవ్యంగా వాడితే వ్యాపారానికి లావాదేవీలకు పరిమితులుండవు. స్వేచ్ఛా వ్యాపారంవల్ల రెండు దేశాలలో కూడా బంగారం ప్రమాణం ఉంటే బంగారం ఒక దేశం నుండి మరొక దేశానికి ఎగుమతి లేదా దిగుమతి కావచ్చు. ఉదాహరణకు భారతదేశంలో వస్తు ధరలు అమెరికాలో కన్న తక్కువగా వుంటే భారతీయ వస్తువులకు గిరాకి ఎక్కువగా వుంటుంది. అమెరికన్లు భారతీయ వస్తువులను కొన్నందుకు బంగారాన్ని భారతదేశానికి పంపుతారు. అపుడు బంగారం, బంగారు నాణేలు, ద్రవ్య చలామణి పెరిగి భారతదేశంలో కూడా ధరలు పెరిగి, అన్నిదేశాలలో ధరలు సమతౌల్యాన్ని చేరుకుంటాయి. ఇలా స్వర్ణ ప్రమాణం ఆట నియమాలు (rules of game) పాటించినన్నాళ్ళు పనిచేసింది (కూడా).

అన్నిదేశాలు ఒకే లోహప్రమాణంలో ఉంటే, ప్రజలకు ద్రవ్యంపై నమ్మకం కొనసాగుతుంది. కాని కావలసినంత లోహం లభించాలి.

BRAOU

### పట్టిక -1.3: T ద్రవ్యవర్గీకరణ పట్టిక - ద్రవ్యం రకాలు

- **ద్రవ్య వస్తువును బట్టి**
  - వస్తు ద్రవ్యం
  - ఏకలోహ ద్రవ్యం
  - ద్విలోహ ద్రవ్యం
  - బహులోహ ద్రవ్యం
  - మిశ్రమ లోహ ద్రవ్యం
  - పత్ర ద్రవ్యం
  - S.D.R. పత్ర బంగారం
- **చట్ట బద్ధతను బట్టి**
  - చట్టబద్ధ ద్రవ్యం
  - చట్టబద్ధం కాని ద్రవ్యం
  - ప్రతినిధిలేదా ప్రాతినిధ్య ద్రవ్యం
  - విశ్వాసాశ్రిత ద్రవ్యం
  - సాంప్రదాయక ద్రవ్యం
  - శాసనపు ద్రవ్యం (Fiat Money)
  - నిర్వాహితద్రవ్యం(ManagedMoney)
- **జారీచేసే విధానాన్ని బట్టి**
  - కరెన్సీ పద్ధతి ద్రవ్యం
  - బ్యాంకింగ్ పద్ధతి ద్రవ్యం
  - మార్చదగిన, పరివర్తనీయ ద్రవ్యం
  - అపరివర్తనీయ ద్రవ్యం
  - సామాన్య డిపాజిట్ల ద్రవ్యం
  - స్థిర విశ్వాసాశ్రిత ద్రవ్యం
  - గరిష్ఠ విశ్వాసాశ్రిత పద్ధతి ద్రవ్యం
  - అనుపాత రిజర్వు పద్ధతి ద్రవ్యం
  - కనీస నిల్వల పద్ధతి ద్వారా కరెన్సీ
  - బాండు - డిపాజిట్ విధానం
  - స్వేచ్ఛా నాణేల విధాన ద్రవ్యం
  - పరిమిత నాణేల విధానం
- **ఇతర స్వభావాలను బట్టి**
  - సామాన్య ద్రవ్యం (Proper Money )
  - ప్రామాణిక కొలమాన (కొలమానయూనిట్) ద్రవ్యం
  - వాస్తవిక ద్రవ్యం (Real Money)
  - సమీప ద్రవ్యం (Near Money)
  - ఐచ్ఛిక ద్రవ్యం (Option Money)
  - కృతక/చిహ్న ద్రవ్యం (Token Money)
  - ప్రాథమిక లేదా వ్యవహారిక ద్రవ్యం (Primary Money)
  - అత్యధిక శక్తి వంత ద్రవ్యం (High Power Money
  - ప్రామాణిక ద్రవ్యం (Standard Money)
  - కృత్రిమ ద్రవ్యం (Artificial Money)
  - అనుషంగిక ద్రవ్యం (Contingent Money)
  - క్రియాత్మక ద్రవ్యం (Active Money)
  - నిలువ ద్రవ్యం (Idle Money)
  - క్వాజీ, తాత్కాలిక ద్రవ్యం (Quasi Money)
  - సమష్టి ద్రవ్య వనరుల ద్రవ్యం (AMR)
  - విదేశీ ద్రవ్యం (Foreign Exchange)
  - తటస్థ ద్రవ్యం (Neutral Money)
  - అంతర్గత ద్రవ్యం (Inside Money)
  - బహిర్గత ద్రవ్యం (Outside Money)

BRAOU

బంగారాన్ని (ఏక లోహానికి ఉదాహరణ ) స్వేచ్ఛగా గాని, నాణేల రూపంలో గాని వాడితే (gold currency) స్వర్ణ ద్రవ్య పద్ధతి అనేవారు. అలాకాకుండా బంగారాన్ని ప్రభుత్వం తన కోశాగారంలో డిపాజిట్టుగా దాచి అంత విలువ మేరకే పత్రాలను జారీ చేస్తే స్వర్ణ బులియన్ ప్రమాణం అన్నారు. 1925-1931 మధ్య ఇంగ్లండులో 3 పౌండ్లు - 17 షిల్లింగుల - 6 పెన్సులకు ఔన్స్ బంగారాన్ని నిల్వ ఉంచేవారు (ఔన్స్ 28.3 గ్రాములకు సమానం). భారత దేశంలో రూపాయల ముద్రణకు బంగారం నిల్వకు ప్రత్యక్షంగా సంబంధం లేకపోయేది (1900-1931 మధ్య) . మనదేశపు బంగారాన్ని ఇంగ్లండు బ్యాంకుల్లో పెట్టి, దాని విలువ పౌండ్లలో కట్టేవారు. ఆ తర్వాత ఒక్కొక్క పౌండుకు ఎన్ని రూపాయలు ముద్రించాలో మారకపు రేటు నిర్ణయించి, రూపాయలను పౌండ్ల నిలువలను బట్టి ముద్రించేవారు. దీనిని స్వర్ణ వినిమయ ప్రమాణం (gold exchange standard) అన్నారు. ఇవన్నీ స్వయం చాలకమైనవి. ప్రభుత్వ జోక్యం లేకుండా వ్యవస్థలలో కార్యకలాపాలు తామంతట తామే జరుపుతాయి. కాని జాతీయతాభావం, ప్రభుత్వజోక్యం ఇత్యాది కారణాలవల్ల స్వర్ణ ప్రమాణం నేలకూలింది.

**(iii) ద్విలోహ ప్రమాణ ద్రవ్యం (Bimetallism) :** ఏవేని రెండు లోహాల రూపంలో విడివిడిగా ద్రవ్యాన్ని తెలుపుతారు. 18వ శతాబ్దంలో ఇంగ్లండులో, 1792 ప్రాంతంలో అమెరికా (USA) లో ఈ ప్రమాణం ఉండేది. 15యూనిట్ల వెండి, ఒక యూనిట్ బంగారం విలువకు సమానంగా మింట్‌లో (కరెన్సీ, నాణేలను ముద్రించే, తయారుచేసే స్థలం) చెప్పబడేది.

ద్రవ్యం ఎంతైనా పెరిగే అవకాశం ఉంటుంది. కాని మార్కెట్‌లో రెండు లోహాల విలువల నిష్పత్తి, మింట్‌లోని అనుపాతాలకన్న వేరుగా ఉండవచ్చు. అంతేకాక చెడు ద్రవ్యం మంచి ద్రవ్యాన్ని పారద్రోలుతుంది. దీనినే గ్రేషం సూత్రం అంటారు (గ్రేషమ్ ఎలిజబెత్ రాణి సమయంలో ఆర్థిక సలహాదారుడు). పాత నాణేల స్థానే కొత్త నాణేలు క్రమంగా ప్రవేశపెట్టటానికి రాణి నిర్ణయించి కొత్త ద్రవ్యాన్ని ప్రవేశపెట్టింది. కాని మార్కెటులో కేవలం పాత నాణేలు ఎక్కువ చలామణిలో ఉండేవి. వీటికి కారణం గ్రేషమ్ తెలిపాడు. చలామణిలోకి పాతవనే, చెడ్డవనే సందేహంతో కూడిన వాటిని త్వరగా చలామణిలోకి తెచ్చి వాడటం వల్ల కొత్త వాటిని దాచుకుంటారు. అలాగే వెండి విలువ బంగారం కన్న తగ్గితే (బంగారం కొరతగా ఉంటే) బంగారం అరుదుగా చలామణి అయి, మొత్తం వెండి నాణేలు చలామణిలోకి వస్తాయి. 1776లో బంగారం, వెండి నాణేలు అరుదుగా కనబడి, కేవలం కరెన్సీయే చలామణిలో కనబడేవి. కాని నమ్మకం ఉన్నంతవరకు ఈ సమస్యలుండవు. కాని ఈ ప్రమాణ ద్రవ్యాన్ని కరెన్సీ పద్ధతి వల్ల, ఇతర నిల్వల సమస్యలవల్ల తొలగించటం అయింది. అయినా ద్రవ్యంగా ద్విలోహాలు మంచి పేరే పొందాయి.

**(iv) బహులోహ ద్రవ్యం (Multi Metallism) :** రెండుకన్న ఎక్కువ లోహాలను కూడా ద్రవ్యంగా చలామణిలో పెట్టవచ్చు. రష్యాలో ప్లాటినంను కూడా (బంగారం, వెండిలాగే) వాడినారు. ప్రతి లోహపు విలువ మిగతా వాటి విలువలతో, సాపేక్షికంగా చెప్పబడుతుంది. ఒక దేశంలో వెండి, మిగతా లోహాలకన్న చౌకగా ఉంటే ఈ లోహాన్ని వేరే దేశం వారు దిగుమతి చేసుకుంటారు. అలాంటప్పుడు ఎగుమతి అయిన దేశంలో వెండి ఖరీదైంది (costly) అవుతుంది. ఇలా ప్రవాహాలు విలువలను స్థిరీకరిస్తాయి. కాని వీటి రేటును పోషించటం కష్టం. ఈ ప్రమాణం చాలా అరుదు.

**(v) మిశ్రమ లోహ ద్రవ్యం (Symmetallism) :** రెండు వేరు వేరు లోహాలు ద్రవ్యంగా ఉన్నపుడు బంగారం గాని, వెండి గాని ఏది కొరతగా ఉన్నా దాని మార్కెట్ విలువ మింట్‌లో నిర్ణయించిన దాని కంటే ఎక్కువగా ఉంటుంది. అపుడు ఆ డబ్బును (లోహాన్ని) దాచుకుంటారు. ఈ ఇబ్బంది తొలగించటానికి రెండు లోహాలను ప్రత్యేక నిష్పత్తిలో కలిపి ఒకే (సమ్మేళనంచేసి) మిశ్రమ లోహంగా చేస్తారు. మిశ్రమ ధాతువును ద్రవ్య యూనిట్‌గా

BRAOU

చెపుతారు. కాని ఈ పద్ధతిలో కూడా గుర్తింపు సమస్యేకాకుండా, మిశ్రమంలో మార్పులు రావచ్చు. ఒక లోహం తగినంత దొరక్కపోతే ఈ ద్రవ్యం తయారు కాదు. దీనివలన ప్రయోజనం చేకూరదు. మార్షల్ 1887లో దీనిని ప్రతిపాదించాడు. కాని ఇది ఎక్కడా అమలులోకి రాలేదు.

**(vi) కాగితపు ద్రవ్యం (Paper Currency) :** చైనాలో మొదట కాగితాన్ని ద్రవ్యంగా వాడిన దాఖలాలు చరిత్రలో కన్పిస్తాయి. ఇంగ్లండులో స్వర్ణలోహానికి బదులుగా పత్ర ద్రవ్యాన్ని (కరెన్సీ నోట్లను) వాడుకోవటం జరిగింది. ఇవి (I.O.U) I Owe You వాగ్దాన పత్రాల రూపంలో ఉండేవి. ఆ తర్వాత ప్రభుత్వమే నాణేలను కాకుండా కరెన్సీని చలామణికై ప్రవేశపెట్టింది. నిర్దిష్ట స్వర్ణ లోహపు బరువును కరెన్సీ యూనిట్‌గా (పౌండ్స్, డాలర్లు) ప్రభుత్వం ప్రకటించి, బంగారాన్ని కడ్డీల రూపంలో కోశాగారంలో నిల్వవుంచి అంత విలువ మేరకు పత్ర ద్రవ్యాన్ని (Paper Currency) జారీ చేసేది. ఇలాంటి పత్ర ద్రవ్యాన్ని బంగారం లోకి మార్చుకునే వీలున్నందున దానిపై విశ్వాసం బలపడసాగింది. కొంతకాలం తర్వాత లోహ నిల్వలు కావాల్సిన మేరకు నిల్వంగా దాచి, అవసరమైనంత ద్రవ్యాన్ని ముద్రించటం జరిగింది. ప్రభుత్వ విశ్వాసంపైననే ఇపుడు కరెన్సీ ద్రవ్య ముద్రణ ఆధారపడి చలామణిలో ఉంది.

కాగితం చౌకగా, కావాల్సినంత దొరుకుతుంది. కావున జాగ్రత్తగా నకిలీ డబ్బు సృష్టించబడకుండా ముద్రణలో జాగ్రత్తతో రహస్యాన్ని పాటించడం జరుగుతున్నది. ఈ పత్ర ద్రవ్యాన్నే కరెన్సీ అంటారు. భారత దేశంలో 19వ శతాబ్దంలోనే ప్రాతినిధ్య కరెన్సీ ప్రారంభమయింది.

సామాన్య ద్రవ్య ప్రమాణంలో (general paper standard) లోహాలను నిల్వగా ఉంచుకొని దాని విలువల మేరకే ద్రవ్యాన్ని ముద్రించటం జరిగేది. ఫియట్ (fiat) లేదా శాసన బద్ధ ద్రవ్యంలో ప్రభుత్వ శాసనాన్ని అనుసరించి ద్రవ్యం అంగీకరించబడుతుంది. దీని ముద్రణకు కొన్ని కనీస బంగారపు, విదేశ మారకపు నిధులు ఉంచుకుంటే చాలు. ఇలా నిర్వహింపబడే ద్రవ్యం సరళత్వం (flexible), వ్యాకోచత్వం, పెంచే వీలు, చౌకగా, వీలుగా ముద్రించబడే లక్షణాలను కలిగి ఉంటుంది. మితి మీరిన ద్రవ్యపు ముద్రణ జరిగే ప్రమాదం కూడా పొంచి ఉంటుంది.

ఫిషర్ సూచించిన సూచీ సంఖ్య ద్రవ్య ప్రమాణంలో (index number standard) ద్రవ్య సప్లైని వస్తువుల ఉత్పత్తిలో హెచ్చు తగ్గుల సూచీని బట్టి మార్చాలి. దానివల్ల వస్తువుల ధరలు స్థిరంగా ఉంటాయి. ద్రవ్య విలువ మారదు. ఈ సూచనను ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకుంటున్నాయే తప్ప, సూచీని బట్టే పత్ర ద్రవ్య జారీ జరగడం లేదు.

**(vii) S.D.R. పత్ర బంగారం (Special Drawing Rights) :** అంతర్జాతీయంగా వివిధ దేశాలు తమ విదేశీ మారకపు సమస్యలను పరిష్కరించుకొని, అధిగమించటానికి పత్ర బంగారాన్ని (gold paper i.e. S.D.R.) రూపొందించుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (IMF) ఈ సౌకర్యాన్ని కలుగచేస్తుంది. ఆ సంస్థలోని సభ్య దేశాలు తమ శక్తిని బట్టి డిపాజిట్లు చేస్తాయి. తమ వాటాను బంగారంలో గాని, తమ యూనిట్లలో గాని, మారక ద్రవ్య రూపంలోగాని డిపాజిట్లు చేస్తాయి. వీటి అన్నింటి విలువను పత్ర బంగారం (S.D.R.)లో చెపుతారు. ఒక SDR విలువ 0.888 గ్రాముల బంగారానికి సమానం. అలాంటి పత్ర బంగారం (లేదా S.D.R. లు) అవసరమొచ్చినపుడు I.M.F. నుండి స్వల్పకాలిక సమస్యలను తీర్చుకోవటానికి అప్పుగా తీసుకోవచ్చు. ఇది కూడా ఒక రకమైన అంతర్జాతీయ కరెన్సీయే.

BRAOU

### 1.7.2 చట్టబద్ధతను బట్టి ద్రవ్య వర్గీకరణ

ప్రభుత్వాలు తమ కరెన్సీ యూనిట్లను చట్టబద్ధంగా తమ దేశంలో ఒప్పుకొనబడేటట్లు, చలామణిలో ఉండేటట్లు చేస్తాయి. కొన్ని రకాల ద్రవ్యాలను ఇది చట్టబద్ధంగా ఒప్పుకొమ్మని బలవంతం చేయదు. కొన్నింటికి మాత్రం చట్టబద్ధత కల్పిస్తుంది.

**(a) చట్టబద్ధ ద్రవ్యం (Legal Tender Money):** మనదేశంలో రూపాయ నోట్లను చట్టబద్ధ ద్రవ్యం అంటారు. అంతకన్న ఎక్కువ విలువ గలిగిన నోట్లన్నీ కూడా చట్టబద్ధ ద్రవ్యమే. వీటిని ఎవరైనా చెల్లింపులకు అంగీకరించకపోతే కోర్టులో దావా వేయవచ్చు. వీటిని నిరాకరించే వీలు స్వదేశంలో ఉండకుండా చట్టబద్ధమైన ఏర్పాట్లు చేస్తారు. దీనివలన అసలు ద్రవ్యమేమిటో, వ్యవహారాలు దేనితో చేయాలో తెలుస్తుంది.

**పరిమిత చట్ట బద్ధ ద్రవ్యం (Limited Legal Tender Money):** భారతదేశంలో వస్తువుల లావాదేవీల సౌకర్యం కోసం రూపాయలనోట్లే కాక, చిల్లర నాణేలు తయారు చేస్తారు. 50 పైసలు, 25, 20, 10, 5 పైసల నాణేలను ద్రవ్యంగా వాడుతారు. కాని (1993 తర్వాత) వీటిని 20 రూపాయల విలువ మేరకు లావాదేవీలకు ఎవరైనా అంగీకరించాలి. ఆ పరిమితి వరకు ఈ చిల్లర ద్రవ్యానికి చట్టబద్ధమైన మద్దతు ఉంటుంది. అందుకే పరిమిత చట్ట బద్ధ ద్రవ్యం అంటారు. ఇరువది రూపాయాలకన్న ఎక్కువ మేరకు చెల్లింపులు చేసేటపుడు ఈ చిల్లర నాణేలు ఎవరైనా వ్యక్తి తిరస్కరించినా చట్టబద్ధంగా చర్య తీసుకోలేం.

**అపరిమిత చట్టబద్ధ ద్రవ్యం (Unlimited Legal Tender Money):** మనదేశంలో రూపాయి, అంతకన్న ఎక్కువ విలువ కలిగిన ద్రవ్య యూనిట్ల (రూ. 2,5, 10, 20, 100, 500 విలువ కలిగిన నోట్ల) కు అపరిమిత చట్టబద్ధత కలదు. ఎన్ని కోట్ల రూపాయల లావాదేవీలైనా ఈ యూనిట్లలో చెల్లింపుచేస్తే తప్పనిసరిగా ఒప్పుకోవాలి. తిరస్కరించిన వారిపై చట్టబద్ధ చర్యలు తీసుకునే వీలున్నది. గరిష్ఠంగా దీనిని అంగీకరించడానికి పరిమితి లేనందున అపరిమిత చట్టబద్ధ ద్రవ్యం అన్నారు. ఈ చట్టబద్ధత శాసనసభలచే గాని, సంస్థలచేగాని, దేశాధినేతచేగాని చేయబడుతుంది.

**(b) చట్టబద్ధం కాని ద్రవ్యం (Non-Legal Tender Money) :** చట్టంతో ప్రమేయాలు లేకున్నా, ఇష్టాన్ని బట్టి కొన్నింటిని ద్రవ్యంగా అంగీకరించవచ్చు. బ్యాంకులు ఇచ్చే చెక్కులు తప్పనిసరిగా ఒప్పుకోవాలనే నియమం ఏమీ లేదు. డ్రాఫ్టులు, చెక్కులు, రశీదులు కూడా కరెన్సీ ద్రవ్యానికి బదులు వాడుతారు. వీటికి చట్టబద్ధమైన మద్దతు ఉండదు. అయినా ద్రవ్యంగా చాలామంది బ్యాంకు చెక్కులను వాడుతున్నారు. ఈ చెక్కు ద్రవ్యం చట్టబద్ధంకాని ద్రవ్యమే.

**(c) ప్రతినిధి ద్రవ్యం లేదా ప్రాతినిధ్య ద్రవ్యం (Full Bodied or Representative Money) :** కేంద్ర బాంకులు, ప్రభుత్వాలు 19వ శతాబ్దంలో పత్ర ద్రవ్యాన్ని కేవలం తమ వద్ద ఉన్న బంగారానికి ప్రతినిధిగా మాత్రమే జారీ చేసేవారు. ఒక పౌండును జారీ చేసినారంటే దానికి సరితూగిన విలువను ఏదైతే ప్రభుత్వం నిర్ధారణ చేస్తుందో దాన్ని తన వద్ద నిల్వ ఉంచుకున్నట్లే 113 గ్రైనుల బంగారాన్ని (స్వచ్ఛమైనది) ఒక పౌండు ((బ్రిటిష్ వారి ద్రవ్య యూనిట్)గా నిర్ణయించిరి. అలాగే 1835 నుండి 1893 వరకు భారతదేశంలో 180 గ్రైనుల వెండిని ఒక రూపాయిగా ప్రకటించారు. 180 గ్రైన్స్ బరువు కలిగిన వెండిని కోశాగారంతో దాచి దానిమేరకు ఒక రూపాయి కరెన్సీ జారీ చేశారు. రూపాయను వెండికి, వెండి నాణేనికి ప్రతినిధిగా ముద్రించేవారు. ఇలా ప్రాతినిధ్య ద్రవ్యం ముద్రించటం వలన లోహాల తరుగుదల, రవాణాలోని ఇబ్బందులు తొలగుతాయి. కాని కావాల్సినంత కరెన్సీ ముద్రించే అవకాశం (వ్యాకోచిత) ఉండదు. ఎందుకంటే వీటిలో పూర్తి విలువ కలిగిన నిలువలను (full bodied) డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

BRAOU

**(d) విశ్వాసాశ్రిత ద్రవ్యం (Fiduciary Money ) :** వ్యవస్థపైన గాని, ప్రభుత్వంపైన గాని, కేంద్ర బాంకుపైన గాని విశ్వాసాన్ని ఆధారంగా చేసుకొని ద్రవ్యాన్ని ముద్రించుతారు. ఇది చట్టబద్ధం కావచ్చు, కాకపోవచ్చు కూడా. ప్రభుత్వం తాను జారీచేసే ద్రవంపై నమ్మకం ఉండటానికి అవసరమైన నిధులను ఉంచుకోవలసిన బాధ్యత కూడా ఉంటుంది. కనీస డిపాజిట్ల (లోహ నిల్వల)తో గాని, పరివర్తనీయ కరెన్సీగా గాని ద్రవ్యాన్ని చలామణిలో ఉంచాలంటే ఆ ద్రవ్యంపై విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసాన్ని ఆశ్రయించే ద్రవ్యాన్ని జారీ చేస్తున్నారు. మన దేశంలో ప్రస్తుతం జారీ చేసే ద్రవ్యం ప్రాతినిధ్య ద్రవ్యం కాదు. కనీస నిల్వలను ఆధారంగా చేసుకున్న విశ్వాసాశ్రిత పద్ధతిని పాటిస్తున్నారు.

**(e) సాంప్రదాయక ద్రవ్యం (Customary Money ) :** చట్టబద్ధమైన హక్కులు లేకున్నా ద్రవ్యంగా కొన్ని లోహాలు సంప్రదాయాన్ని బట్టి వాడబడుతాయి. ప్రభుత్వం దీనిని ప్రత్యేకంగా శాసనబద్ధంగా చెప్పాల్సిన అగత్యం ఉండదు (స్వర్ణ ప్రమాణంలో స్వర్ణం).

**(f) శాసనబద్ధ ద్రవ్యం (Fiat Money) :** ప్రభుత్వం శాసనం ద్వారా ముద్రించదలచుకున్న ద్రవ్యానికి ఎట్టి నిల్వలు అవసరం లేదు. ఏ సెక్యూరిటీ నిల్వ లేకున్నా ఆజ్ఞాపత్రం ద్వారా ద్రవ్యం జారీ చేయవచ్చు. దీనినే ఆజ్ఞా ద్రవ్యం (Command Money) అని కూడా అంటారు. అయితే దీనిని ప్రత్యేక పరిస్థితుల్లోనే వాడుతారు. ఈ ద్రవ్యం పరివర్తనీయం కాదు.

**(g) నిర్వాహిత ద్రవ్యం (Managed Money ) :** ద్రవ్యంపై నమ్మకాన్ని సడలిపోకుండా, కొద్ది నిల్వలతోగాని అనుపాత నిల్వలతోగాని ద్రవ్యాన్ని జారీ చేస్తారు. లోహంలోనికి పూర్తిగా, పాక్షికంగా మార్చజాలకున్నా నమ్మకాన్ని ఆధారంగా చేసుకొని ద్రవ్యాన్ని, దాని సప్లైని నిర్వహించుతారు. శాసనం అవసరం లేకుండానే ద్రవ్యాన్ని నిర్వహించుకోవచ్చు.

### 1.7.3 జారీ చేసే విధానాన్ని బట్టి వర్గీకరణ

పేపర్ కరెన్సీని జారీ చేసే పద్ధతిని బట్టి చేసిన ఈ వర్గీకరణలో నోట్ల జారీ పద్ధతులే పేర్కొనబడ్డాయి.

**(i) కరెన్సీ లేదా సామాన్య డిపాజిట్ (Single Deposit ) పద్ధతి :** కరెన్సీ నోట్లను జారీ చేయటానికి బంగారపు నిల్వలు గాని ఇతరత్రా నిలువలు గాని పూర్తివిలువ మేరకు ఉంచుకొంటే సామాన్య డిపాజిట్ లేదా కరెన్సీ పద్ధతి అంటారు. ప్రాతినిధ్య ద్రవ్యం (full embodied) లో పూర్తిగా నిలువల మేరకే నోట్ల జారీ జరుగుతుంది. 113 గ్రెన్‌ల బంగారం ఒక పౌండు అయితే, 10 పౌండ్లను జారీ చేయాలంటే 1130 గ్రెన్‌ల బంగారం నిలవ ఉండి తీరాలి. అంతేగాని దాని విలువను కొన్ని రెట్లు ముద్రించలేం. దీనిలో పరివర్తనీయత ఉంది. కావున ద్రవ్యంపై పూర్తి విశ్వాసం, నమ్మకం ఉంటాయి. ద్రవ్యానికి సెక్యూరిటీయే గాక విలువలు (ద్రవ్య విలువలు) స్థిరంగా వుంటాయి. లోపం ఏమిటంటే ద్రవ్య వ్యాకోచత వుండదు. నిల్వలను వృధాగా ఉంచాల్సి ఉంటుంది.

**(ii) బాంకింగ్ పద్ధతి (పాక్షిక డిపాజిట్ల పద్ధతి) :** బాంకులు తమ వద్ద ఉంచుకొన్న ద్రవ్య రిజర్వులకు కొన్ని రెట్ల పరపతిని సృష్టిస్తుంది. ఇదే బాంకింగ్ సూత్రం. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకొని కొద్ది నిల్వలు (బంగారం సెక్యూరిటీలు) ఉన్నా దానికి కొన్ని రెట్లు పత్ర ద్రవ్యాన్ని (కరెన్సీ ద్రవ్యాన్ని) జారీ చేస్తే బాంకింగ్ పద్ధతి అంటారు. ద్రవ్యానికి మద్దతుగా డిపాజిట్లు సంపూర్ణంగా పెట్టకుండా పాక్షికంగా పెడతారు. దీనివలన లోహాలను పొదుపుగానే కాక, ద్రవ్య ముద్రణకు గరిష్ఠంగా వాడుకోవచ్చు, సులభంగా ఆచరించవచ్చు. కాని ద్రవ్యంపై విశ్వాసం సన్నగిల్లే అవకాశం ఉంటుంది. అంతేకాక ధరల్లో అస్థిరత్వం ఉంటుంది.

**(iii) మార్చదగిన (పరివర్తనీయ) ద్రవ్యం (Convertible Money ) :** కరెన్సీ నోట్లను బంగారంలోకి గాని ఇతర

BRAOU

విలువైన లోహాలలోకిగాని కేంద్ర బాంకు లేదా ప్రభుత్వ కోశాగారం (Treasury) వద్ద మార్చుకోగలిగితే పరివర్తనీయ ద్రవ్యం అంటారు. ఇది స్వర్ణలోహ (Gold Bullion), స్వర్ణ ద్రవ్య (Gold Currency) ప్రమాణంలో ఉండేది.

**(iv) అపరివర్తనీయ కరెన్సీ (Inconvertible Currency) :** ప్రభుత్వం వద్ద గాని, దాని సంస్థల వద్దగాని కరెన్సీ నోట్లను ఇచ్చి లోహాలు పొందలేక పోతే అపరివర్తనీయ కరెన్సీ అంటారు. దీనికి కారణం పాక్షిక డిపాజిట్ కావచ్చు, కనీస నిల్వలు కూడా కావచ్చు. ద్రవ్య యూనిట్‌ను లోహం రూపంలో చెప్పినా, కరెన్సీకి వెనుక కొన్ని నిల్వలు దాచబడినా కూడా కాగితపు కరెన్సీని ( ప్రభుత్వం, కేంద్ర బాంకు వద్ద) లోహాల్లోకి మార్చే అవకాశమే కల్పించకుంటే అది అపరివర్తనీయ కరెన్సీ. మన రూపాయలు ప్రస్తుతం అపరివర్తనీయమే.

కాగితపు కరెన్సీ వేరు, పత్ర ద్రవ్యం వేరు. చలామణి చేసే నోట్లు కాగితం రూపంలో ఉంటే కాగితపు కరెన్సీ అంటారు. ద్రవ్యం డ్రాఫ్ట్‌ల రూపంలో, పత్ర సెక్యూరిటీల రూపంలో ఉంటే పత్ర ద్రవ్యం అంటారు. కాగితపు కరెన్సీ నోట్లు ఎలా జారీ చేస్తారో చూద్దాం.

**(v) సామాన్య డిపాజిట్ల ద్రవ్యం (Simple Deposit Money) :** కాగితపు నోట్ల ద్రవ్యం జారీ చేయటానికి దాని విలువ మేరకు పూర్తిగా నూటికి నూరు పాళ్ళు బంగారాన్ని గాని, తత్సమాన ద్రవ్యంగా ప్రకటించిన లోహాన్ని గాని డిపాజిట్‌గా పెట్టాలి. కరెన్సీని పూర్తి నిలువలు లేకుండా చేయజాలం. ఇందులో ఉన్నన్ని డిపాజిట్లు, నిల్వలు ఇంకెందులోనూ ఉండవు.

**(vi) స్థిర విశ్వాసాశ్రిత (Fixed Fiduciary System) ద్రవ్యం :** కొంత పరిమితి మేరకు కరెన్సీ జారీ చేయటానికి లోహ నిల్వలు అవసరం లేదు. దానికి కారణం కొంత స్థిర పరిమాణం మేరకు విశ్వాసాన్ని (ప్రభుత్వపు విశ్వాసంపై) కరెన్సీ విలువపై నమ్మకాన్ని కలిగి ఉండటం వల్ల లోహ నిల్వలు పెట్టాల్సిన పనిలేదు. కాని నిర్దిష్ట పరిమితి తర్వాత మాత్రం కరెన్సీ జారీకి అదనపు మొత్తం విలువ మేరకు నిల్వలు, డిపాజిట్లు (లోహపు) పెట్టి తీరాలి. దీనివల్ల అసంబద్ధంగా ద్రవ్యాన్ని పెంచజాలం. కాని చట్టం ద్వారా నిర్దిష్ట పరిమితిని పెంచవచ్చు. భారతదేశంలో 1861 లో ఇది రూ. 4 కోట్ల మేరకు ఉండగా 1914లో రూ. 14 కోట్లకు పెంచారు.

BRAOU

**(vii) గరిష్ఠ విశ్వాసాశ్రిత పద్ధతిలో (Fixed Maximum Fiduciary System) ద్రవ్యం :** కొంత గరిష్ఠ పరిమితి వరకు ద్రవ్యం నిలువలు ఉన్నా లేకున్నా ముద్రించవచ్చు. ఆ పరిమితి తర్వాత కరెన్సీ జారీ చేయటానికి ఎట్టి స్థితిలో వీలుండదు. ఫ్రాన్సులో 1870లో ఈ పద్ధతి ప్రవేశపెట్టారు.

**(viii) అనుపాత రిజర్వు పద్ధతిలో ద్రవ్యం (Proportional Reserve System):** బంగారం గాని, సెక్యూరిటీలు గాని కరెన్సీ జారీ చేసే విలువకు కొంత శాతం (లేదా కొంత అనుపాతంలో) ఉండాలి. భారత దేశంలో 1957 వరకు కరెన్సీ నోట్లవిలువకు (ప్రభుత్వం నిర్ణయించిన విధంగా) 40% డిపాజిట్లు ఉండాలి. అంటే కేంద్ర బాంకు వద్ద పెట్టే బంగారం ఇతర లోహాల నిలువకు రెండున్నర రెట్లు మించి ద్రవ్యం జారీ చేయటానికి వీలు లేదు.

**(ix) కనీస నిల్వల (రిజర్వుల) పద్ధతి ద్వారా కరెన్సీ (Minimum Reserve System ) :** ఈ పద్ధతిలో కరెన్సీ జారీ చేయటానికి గరిష్ఠ పరిమితి లేదు. కాని ఎంత కరెన్సీ జారీ చేయాలన్నా, కేంద్ర బాంకు వద్ద మాత్రం కనీసం ఉండాల్సిన సెక్యూరిటీలు, బంగారం కనిష్ఠ లేదా కనీస నిల్వల కన్న తగ్గరాదు. 1957 సంవత్సరం తర్వాత భారత దేశంలో కనీస నిల్వలు రూ. 200 కోట్లు కేంద్ర బ్యాంకు ఉంచుకొని ఎంతైనా ద్రవ్యాన్ని ముద్రించవచ్చు. అయితే అందులో బంగారపు నిల్వ విలువ కనీసం రూ. 115 కోట్లయినా ఉండాలి. ఇలాగే చాలా దేశాల్లో కనీస నిల్వలు ఆధారం చేసుకునే ద్రవ్యాన్ని ముద్రిస్తున్నారు.

**(x) బాండు - డిపాజిట్ విధానం :** జారీ చేయదలచుకున్న నోట్లను నిలువలు, లోహాలు లేకుండా కేవలం ప్రభుత్వం జారీ చేసిన బాండ్లనే సెక్యూరిటీలుగా పెట్టి ద్రవ్యం జారీచేసే పథకం ఇది. భారతదేశంలో 1902 లో ప్రవేశపెట్టి ఈ పద్ధతిని ఉపసంహరించుకున్నారు. కాగితపు కరెన్సీలు నిర్వహించటానికి (managed currency) పూర్వం లోహాలను నాణేలుగా మార్చిన పద్ధతులు కూడా చూద్దాం.

**(xi) స్వేచ్ఛా నాణేల విధానం (Free Coinage System):** బంగారం లాంటి లోహాలను ద్రవ్యంగా వాడినపుడు వాటి విలువ స్వతస్సిద్ధంగా (intrinsic), బహిర్గత విలువకు (extrinsic value) సమానంగా ఉండేది. నాణేలలోకి ఎంతైనా లోహాన్ని మార్చుకునే వీలుండేది. నాణేలను పరిమితి లేకుండా, స్వేచ్ఛగా ఎంతమేరకైనా స్వేచ్ఛా నాణేల విధానంలో పొందుతారు. ఉచితంగా నాణేలను లోహాలకు బదులు తయారు చేసి ఇచ్చేవారు (gratuitous money). ఆ తర్వాత మాత్రం నాణేల తయారీకి అయ్యే ఖర్చుల మేరకే డబ్బు వసూలు చేసేవారు (mintage) అంటారు. ప్రభుత్వం నాణేల తయారీకి ఖర్చులే కాక కొద్ది లాభాన్ని తీసుకుంటే సీనరేజి (seignerage) అనేవారు. కొద్ది బంగారాన్ని తీసి దానికి ఇతర లోహాలను కల్పి నాణెం బరువు మారకుండా, మింట్‌కు (నాణేల తయారీకి) అయ్యే ఖర్చులు రాబట్టుకునేవారు. లోహాలు, నాణేలుగా మార్చుకున్నా నిర్దిష్ట ప్రమాణాలతో ద్రవ్యంగా చలామణి కావటం ' స్వేచ్ఛా నాణేల ' ప్రత్యేకత. స్వర్ణ ప్రమాణంలో ఈ రకమైన లక్షణాలు ఉండేవి.

**(xii) పరిమిత నాణేల విధానం (Limited Coinage) :** లోహాలను నాణేలుగా తయారు చేసే విధి కేవలం అధికారిక సంస్థకు పరిమితమైనపుడు పరిమిత నాణేల తయారీ అవుతుంది. దీనివలన నాణేలలో సజాతీయత నమ్మకం ఎక్కువ ఉంటుంది.

### 1.7.4 ద్రవ్య స్వభావాన్ని బట్టి వర్గీకరణ

ద్రవ్యం దేనికి ఉపయోగ పడుతుందో, దాని స్వభావం ఏమిటో తెలిపే ద్రవ్య రకాలను దిగువ తెలిపాం.

**సామాన్య ద్రవ్యం (Proper Money ) :** చలామణిలో వస్తు సేవల కొనుగోలుకు వాడే ద్రవ్యమే సామాన్య ద్రవ్యం. ద్రవ్యంగా ప్రజలు ఒప్పుకునేదే పరిమైన, సామాన్య ద్రవ్యంగా ఇది నాణేలుగా గాని, కరెన్సీగా గాని ఉండవచ్చు. దీనినే వ్యావహారిక ద్రవ్యం అనవచ్చు.

**వాస్తవిక ద్రవ్యం (Real Money ) :** ద్రవ్యంగా వాడబడే కరెన్సీ నోట్లను, బాంకు ద్రవ్యాన్ని కూడా వాస్తవిక ద్రవ్యం అంటారు. దీని పరిధి 'సామాన్య ద్రవ్యం ' కన్న పెద్దది, విస్తృతమైనది. ద్రవ్య సప్లైని వాస్తవిక ద్రవ్యం నిర్ణయించుతుంది.

**ప్రామాణిక కొలమాన ద్రవ్యం (Standard Money Unit - Money Account ) :** కేన్స్ దీనినే ఆవర్జా ద్రవ్యం అన్నాడు. వస్తు సేవల విలువలను ఒక దేశంలో కరెన్సీ యూనిట్ పేరుతో తెలిపి కొలుస్తారో దానినే ప్రామాణిక ద్రవ్యం అంటాం. మన దేశంలో వాడే ప్రామాణిక ద్రవ్యం రూపాయి . ఇంగ్లండులో పౌండ్, అమెరికాలో డాలరు, జర్మనీలో మార్కును ప్రామాణిక ద్రవ్యం అంటారు. ద్రవ్యపు లెక్కలకు ఆవర్జాలకు వీటిని తమ తమ దేశాల్లో వాడతారు.

**ఐచ్ఛిక ద్రవ్యం (Option Money ) :** మనం లావాదేవీలకు కరెన్సీనోట్లే కాక బాంకుల చెక్కులను వాడుతాం. కరెన్సీ నోట్లు వాస్తవిక ద్రవ్యం. కాని బాంకుల చెక్కులను, డ్రాఫ్టులను ద్రవ్యంగా అంగీకరించవచ్చు. ఇది చెక్కులను తీసుకునే వ్యక్తిపైన ఆధారపడుతుంది. అమ్మకందారుడు చెక్కును ద్రవ్యంగా ఒప్పుకోవటం అతని ఇష్టాన్ని బట్టి ఉంటుంది. అందుకే చెక్కులను ఐచ్ఛిక ద్రవ్యం అంటాం. చెక్కులను ఒప్పుకోనప్పుడు అది ద్రవ్యం కాదు, ఒప్పుకుంటే ద్రవ్యం అవుతుంది.

BRAOU

**సమీప ద్రవ్యం (Near Money) :** దీనిని ద్రవ్యంలోకి ఎప్పుడైనా మార్చుకోవచ్చు. ద్రవ్యత్వం ఎక్కువగా ఉన్న ద్రవ్య ఆస్తులు (financial assets) నన్నింటిని సమీప ద్రవ్యం అంటారు. ప్రభుత్వం జారీ చేసిన ట్రెజరీ బిల్లులు, బాండులు (వాగ్దాన పత్రాలు), డిబెంచర్లు (స్థిర వడ్డీ నిచ్చే పత్రాలు) మొదలైనవన్నీ సమీప ద్రవ్యమే. నేరుగా ప్రత్యక్షంగా ఇవి ద్రవ్యంగా వాడబడవు. కాని ద్రవ్యంలోకి వెంటనే మార్చుకోవచ్చు. ఆ వీలుంది కాబట్టే దీనిని సమీప ద్రవ్యం అంటారు. ఒక రకంగా బాంకు డ్రాఫ్టులు కూడా సమీప ద్రవ్యమే. అయితే ఇది సమీప ద్రవ్య ఆస్తులవలె వడ్డీని గాని, ఆదాయాన్నిగాని సంపాదించవు.

**ప్రాథమిక ద్రవ్యం (Primary Money) :** కరెన్సీ ద్రవ్యాన్ని ప్రాథమిక ద్రవ్యం అంటారు. దీని డిపాజిట్లను ఆధారంగా చేసుకొని పరపతిని కొన్ని రెట్లు సృష్టించుతారు.

**గౌణ లేదా డిపాజిట్ ద్రవ్యం (Secondary Money or Deposit Money) :** బ్యాంకుల పరపతి - డిపాజిట్లుగా మారటం, ఆ డిపాజిట్లే పరపతిని సృష్టించటం సంభవిస్తుంది. బ్యాంకులు సృష్టించిన పరపతే గౌణ ద్రవ్యం.

**అత్యధిక శక్తివంత ద్రవ్యం (High Power Money) :** కేంద్ర బాంకు లేదా ప్రభుత్వం జారీ చేసిన చట్ట బద్ధ ద్రవ్యమిది. ఇవి కరెన్సీ, నాణేల రూపంలో ఉంటాయి. కరెన్సీయే కాక వాణిజ్య బాంకులు, కేంద్ర బాంకు వద్ద దాచిన డిపాజిట్లు కలసి రిజర్వు, హైపవర్ ద్రవ్యం అంటారు.

**ప్రామాణిక ద్రవ్యం (Standard Money) :** స్వర్ణ ప్రమాణంలో పూర్తిగా పరివర్తనీయమైన ద్రవ్యమిది. పూర్తి నిలువల మద్దతుతో సృష్టించబడేదే ప్రామాణిక ద్రవ్యం. ప్రామాణిక కొలమాన ద్రవ్యం (standard unit of account) వేరు ప్రామాణిక ద్రవ్యం వేరు. మొదటిది యూనిట్ ద్రవ్యం - ఫ్రాంకులు, దీనారు, రూపాయ మొదలైనవి. ఇవి పరివర్తనీయం కాకపోవచ్చు (నేడు కావు కూడా). అదే ప్రామాణిక ద్రవ్యానికి నూరుశాతం లోహ నిలువలు కేంద్ర బాంకులో దాయబడుతాయి.

**కృత్రిమ ద్రవ్యం (Artificial Money) :** కృత్రిమ ద్రవ్యాన్ని ఎంతైనా పెంచుకోవచ్చు. వ్యాకోచత కలిగిన ద్రవ్యం ఇది. దీనికి పరివర్తనీయత లేకుండా, కృత్రిమంగా, ఆధారం సరిగా లేకుండా (లోహనిల్వలు లేక) ఉంటుంది.

**కృతిక ద్రవ్యం లేదా చిహ్నపు ద్రవ్యం (Token Money) :** నేడు వాడే మన రెండు రూపాయల నాణేన్ని తీసుకుందాం. దాని బహిర్గత విలువ రూ.2/-లు. అవి రెండు రూపాయల విలువగల వస్తువులను కొనగలదు. అట్టి నాణేన్ని కరుగపెట్టుదాం (melt). కరిగిన తర్వాత ఆ లోహపు విలువ 10 పైసలు కూడా ఉండకపోవచ్చు. నాణేపు అంతర్గత విలువ ముఖ విలువ కన్న తక్కువ. ఇలా తక్కువ అంతర్గత విలువ కలిగిన లోహం ఎక్కువ బహిర్గత విలువ కలిగిన నాణేంగా లేదా ద్రవ్యంగా చలామణి అయ్యే దానిని కృతకనాణేం, కృతకద్రవ్యం లేదా చిహ్నపు ద్రవ్యం అంటారు. అలాగే వివిధ కరెన్సీ నోట్లు ద్రవ్యానికి బహిర్గతంగా చిహ్నమేకాని, అంతర్గతంగా వాటి విలువ బహు స్వల్పం.

**చిల్లర ద్రవ్యం - అనుషంగిక ద్రవ్యం (Contingent Money) :** లావాదేవీల సౌకర్యం కొరకు యూనిట్ ద్రవ్యంలో (రూపాయలో) కొద్ది వంతు విలువలను, వినిమయం చేయటానికి చిల్లర నాణేలు అవసరం. 5, 10, 25, 50 పైసల నాణేలు అన్నీ కూడా చిల్లర నాణేలే. ఈ చిల్లర నాణేలు (పావలాబిళ్ళ లాంటివి) లేదా అనుషంగిక ద్రవ్యం చిన్న చిన్న వినిమయాలకు వాడుతారు. ఈ నాణేలను కూడా టోకెన్ ద్రవ్యం అంటారు. వీటి కృతక విలువ ఎక్కువ, అంతర్గత విలువ తక్కువ ఉంటుంది.

**క్రియాత్మక ద్రవ్యం (Actual money) :** ద్రవ్యం వినిమయ మాధ్యమంగా వినిమయ విలువ కలిగి లావాదేవీల కోసం వాడబడుతుంది. ద్రవ్యం వ్యవహారాలకోసం (transaction) వాడితే క్రియాత్మక ద్రవ్యం అంటాం.

BRAOU

**నిలువ ద్రవ్యం (Idle Money) :** ద్రవ్యాన్ని కేవలం నిలువ విలువ (store of value)గా వాడుతారు. ద్రవ్యాన్ని ప్రస్తుత వాడకానికి కాకుండా దాచుకోవటానికి ఉపయోగించుతారు. దాన్ని ఏదైనా ఆస్థిలోకి మార్చి ఉంచుకుంటారు.

**క్వాజీ ద్రవ్యం (తాత్కాలిక ద్రవ్యం, Quasi Money ) :** బాంకు ద్రవ్యం, ద్రవ్య ఆస్తులు, బాండ్లు, షేర్లు, ట్రెజరీ బిల్లులు మొదలైనవన్నీ కూడా క్వాజీ ద్రవ్యమే. ద్రవ్యాన్ని నిలువచేసే ఆస్తులకు సంబంధించిందే క్వాజీ ద్రవ్యం. ఇది నిలువ ద్రవ్యానికి మరో రూపం.

**సమష్టి (ద్రవ్య) వనరుల ద్రవ్యం (Aggregate Monetary Resource or AMR Money) :** రిజర్వు బాంకు ద్రవ్యాన్ని $M_1$, $M_2$, $M_3$, $M_4$ అనే రకాలుగా వర్గీకరించింది. అందులో వినిమయానికి తోడ్పడే వనరులన్నీ కలసి సమష్టి ద్రవ్య వనరులు (AMR) అనబడతాయి. బాంకుల టైమ్ డిపాజిట్లు, నాణేలు, కరెన్సీ కలసి AMR లు అంటారు.

**విదేశీ మారక ద్రవ్యం (Foreign Exchange Money) :** విదేశీ మారక ద్రవ్యం అనేది మనం విదేశాలలోని వస్తువుల కొనుగోలు చేసే శక్తి. విదేశాల కరెన్సీలుగాని, అంతర్జాతీయంగా ప్రముఖ పాత్ర వహించే డాలర్లు, యెన్‌లు, మార్కులు మొదలైన వాటిని విదేశీ మారక ద్రవ్యం అంటారు.

**తటస్థ ద్రవ్యం (Neutral Money) :** ధరలను నిశ్చలంగా ఉంచడానికి, ధరలను మార్చకుండా వినిమయానికి తోడ్పడే పరిమాణంలో ద్రవ్యాన్ని ఉంచితే తటస్థ ద్రవ్యం అంటారు. విలువ మార్పులు, ధరలో మార్పులు, అనిశ్చితత్వం లేకుండా ధరల స్థిరీకరణకు ఈ ద్రవ్యాన్ని వాడతారు. ద్రవ్యం పాత్ర నామమాత్రంగా ఉండేటట్లు ద్రవ్యాన్ని నిర్వహించితే తటస్థ ద్రవ్యం అంటారు.

**కోరిన వెంటనే వచ్చే ద్రవ్యం (Call Money) :** బ్యాంకులు ఇతరులకు అప్పులిచ్చేటప్పుడు తన అవసరాలు కూడా చూసుకుంటుంది. బాంకుకు అవసర మొచ్చినపుడు స్వల్పకాలంలో (అదేరోజు) పిలిచిన వెంటనే లేదా అడిగిన వెంటనే ద్రవ్యం తనకు తిరిగి, చెల్లించబడేటట్లు ఋణాలు ఇస్తుంది. అట్టి ద్రవ్యాన్ని కాల్‌మనీ అంటారు. వీటికి ద్రవ్యత్వం ఎక్కువ, కానీ వచ్చే ప్రతిఫలం లేదా వడ్డీరేటు చాలా తక్కువ.

**అంతర్గత ద్రవ్యం (Inside Money) :** గర్లీ,షా (Gurley, shaw) అనే శాస్త్రవేత్తలు ఈ భావనను వివరించారు. ప్రైవేట్ రంగంలో అప్పుకు (debt) బదులుగా ద్రవ్యపు ఆస్తి (assets) ఏర్పడితే నికరంగా ఏ మార్పు ఉండదు. ప్రైవేట్ రంగంలో వలనే ఆస్తిగాని, ద్రవ్యంగాని, కొంత అప్పుకు వ్యతిరేకంగా సృష్టించబడితే అంతర్గత ద్రవ్యం అంటాం. బాంకులు సృష్టించే పరపతి లేదా ఋణాలు బ్యాంకుకు ఆస్తులను తెలిపే ద్రవ్యం కూడా. కాని అంతమేరకు బాంకు బాధ్యత ద్రవ్యాన్ని ఖాతాదార్లకు అడుగగానే అందించాలి కావున అప్పు (liability) కూడా. ప్రైవేట్ రంగంలో ఆస్తి, అప్పులు అంతర్గతంగా సరిపోతాయి. ధరలు కనుక మారితే ప్రైవేట్ రంగంలోని ఆస్తుల, అప్పుల విలువలు సమానంగా మారుతాయి. కావున ప్రైవేట్ రంగంలో అంతర్గత ద్రవ్యం వల్ల మార్పులు రావు. వాస్తవిక మిగులు ప్రభావం (real balance effect), ద్రవ్య భ్రమ (money illusion) అంతర్గత ద్రవ్యం (inside money) వల్ల కలుగవు.

**బహిర్గత ద్రవ్యం (Outside Money) :** ఇది ప్రైవేట్ రంగానికి సంబంధించింది. ట్రెజరీ బిల్లులు, ప్రభుత్వానికి అప్పు (debt), కాని ప్రైవేట్ రంగానికి ఆస్తి (credit). బహిర్గత ద్రవ్యంలో మార్పువస్తే ప్రైవేట్ రంగం ఆస్తి, అప్పుల విలువలలో వారి వద్ద ఉన్న ద్రవ్యపు విలువల్లో మార్పు వస్తుంది. కాని ఒకదాన్ని మరొకటి పూరించవు (does not compensate). అందుకే వీటిని బహిర్గత ద్రవ్యం అంటారు. ఇది విదేశీ మారకం కాదని గుర్తుంచుకోవాలి.

పైన తెలిపిన ద్రవ్య వర్గీకరణ కాలక్రమణిక (chronology) ననుసరించి చెప్పలేదు. ఆర్థిక వ్యవస్థలలో మార్పులతో పాటు ద్రవ్య ప్రమాణాలలో మార్పు వచ్చింది. వస్తు రూపం నుండి, ఏక లోహ, బహులోహ, కాగితపు, పరపతి ద్రవ్య ప్రమాణాలలో వివిధ రూపాలలో ద్రవ్యం వృద్ధికి, వ్యాపార, ఉత్పత్తులకు, వినిమయానికి ఎంతో తోడ్పడింది.

## 1.8 ద్రవ్య ప్రాధాన్యత (Significance and Importance of Money)

ఆధునిక యుగంలో అన్ని వ్యవస్థలలో అత్యంత ప్రాధాన్యత కలిగి, ఆర్థిక వ్యవహారాలను చక్కదిద్దే సాధనమే ద్రవ్యం. ద్రవ్యం ప్రాధాన్యతను A.C.L. Day (డే) తన పుస్తకం "An Outline of Monetary Economics" లో వివరిస్తూ వినిమయ మాధ్యమంగా, విలువ నిధిగా వివరించాడు. న్యూలిన్ విలువనిధి ప్రాధాన్యతను వక్కాణించాడు. ఫిషర్ వినిమయ మాధ్యమానికి పెద్ద పీట వేసాడు. ద్రవ్యం పాత్రను, ప్రాధాన్యతను దశల వారీగా తెలుసుకుందాం.

వస్తు వినిమయ పద్ధతిలోని లోపాలను తొలగించి, ద్రవ్యం దిన దిన ప్రవర్థమానమై - అన్ని వ్యవస్థలకు, అన్ని వైపులా వ్యాప్తి చెందింది. దీనివల్ల కోరికల సమన్వయం సమస్య సమసిపోయింది. విలువలను ఖచ్చితంగా కొలవగలుగుతాం. కొన్ని తరాలు నిల్వ ఉంచుకునే విధంగా దీర్ఘకాలిక బాండ్ల రూపొందాయి. ద్రవ్యాన్ని తరలించటం, బదిలీ చేయటం, అంతర్జాతీయంగా (FAX, ISTD లద్వారా) నిముషాల్లో కాదు, కొన్ని సెకన్ల వ్యవధిలో అయ్యే పని.

కరెన్సీ, పరపతి ద్రవ్యాల సహాయంతో వినిమయానికి ఆదాయాల, వ్యయాల ప్రవాహాలకు, సంపద సమకూర్చుకోవటానికి, ద్రవ్య హక్కుల బదిలీకి ఎలాంటి అవాంతరాలనయినా ఎదుర్కొంటున్నాం.

### 1.8.1 ఆర్థిక కార్యకలాపాలలో ద్రవ్యం పాత్ర

కోరికలు ఆర్థిక కార్యకలాపాలకు మూలం. ప్రయోజనం, తృప్తి వాటి చివరి లక్ష్యం. కోరికలను వ్యక్తీకరించటానికి ద్రవ్యం సహాయపడుతుంది. కోరిక ఉధృతి (intensity) ఎక్కువగా ఉంటే ఎక్కువ ధరను, ద్రవ్యాన్ని చెల్లించటానికి సిద్దపడతారు. ద్రవ్యం ద్వారా ఎంత ప్రయోజనం వినియోగదారుడు పొందగలనని అంచనా వేస్తాడో తెలుపుతాం. తాను ఎక్కువ ప్రయోజనం పొందగలననుకున్నప్పుడు ఎక్కువ ధరను చెల్లిస్తాడు. అదనంగా పొందే వస్తువు నుండి తక్కువ ప్రయోజనం లభిస్తుందని అనుకుంటే తక్కువ ధర చెల్లిస్తాడు లేదా ధర తగ్గితేనే కొంటాడు. మార్షల్ అన్నట్లు అర్థం శాస్త్రంలో ద్రవ్యం కూడా ప్రయోజనాన్ని కొలిచే సాధనమే.

అనేక కోరికలను తీర్చుకోవాలంటే తాను ఉత్పత్తి చేయజాలని వస్తువులను కూడా కొనాలి. అందుకే తాను మిగులును అమ్మగా వచ్చిన ద్రవ్యంతో ఇతర వస్తువులను కొంటాడు. తాను వస్తువులను ఉత్పత్తి చేయటానికి అవసరమైన ఉత్పత్తి సాధనాలను కొంటాడు. ఉత్పత్తి చేసిన తర్వాత అమ్మగా వచ్చిన డబ్బుతో తన అవసరాలకై వినిమయం ద్వారా ఇతర వస్తువులను పొందుతాడు. ఈ రకంగా వ్యవస్థలో వస్తు సేవల పంపిణీ, వాటిపై ఆధిపత్యం, కొనుగోలు శక్తి ద్రవ్యం ద్వారా సమకూరుతుంది. చివరి చర్యగా వస్తువులను కొని వినియోగం చేయటమో, తర్వాత కాలంలో ఉత్పత్తికి పెట్టుబడిగా ద్రవ్యాన్ని వాడటమో జరుగుతుంది.

**ఉత్పత్తిలో ద్రవ్యం పాత్ర :** ఉత్పత్తి సాధనాలనందించే గృహ రంగం, ఉత్తత్తి చేసే సంస్థల రంగం నుండి ప్రతిఫలాలను (భాటకం, వేతనం, వడ్డీ, లాభాలు) ద్రవ్యరూపంలో పొందుతాయి. సంస్థలు తమ వస్తువులను

BRAOU

అమ్మి వ్యయాలు, లాభాలు వెరసి ఆదాయాన్ని పొందుతాయి. రాబడి, వ్యయాలు అన్నీ ప్రవాహ రూపంలో ఉండి, ద్రవ్యంచే మారకం చేయబడుతాయి.

ఉత్పత్తిదారుడు కనీస ఖర్చుతో గరిష్ఠలాభం పొందాలని చూస్తాడు. అందుకే ఉత్పత్తి సాధనాలను ఉపాంత ఉత్పాదకత, ధరలను బట్టి కొనుగోలు చేస్తాడు. ఉదాహరణకు శ్రామికుని ఉపాంత ఉత్పాదకత రూ.200 అయినపుడు, అతని కిచ్చే (సాధన ధర) వేతనం రూ. 150 మార్కెట్లో ఉంటే, ఇంకొద్దిమంది శ్రామికులను ఉద్యోగంలోకి తీసుకుంటాడు. ఉపాంత ఉత్పాదకత, ఉత్పత్తి సాధనపు ధరకు సమానమయితే సమతౌల్యంలో ఉంటాడు. సమతౌల్య స్థాయి నుండి కదలడానికి ప్రయత్నించడు. వివిధ ఉత్పత్తి సాధనాల, ఉత్పత్తి పద్ధతుల ఎంపికలు, ఆయా ధరలు, సాధనాల సామర్థ్యాలపై ఆధారపడుతాయి.

ఆడమ్ స్మిత్ వ్రాసిన "An Enquiry into Nature and Causes of Wealth of Nations ' లో ఇలా అన్నాడు : కసాయి వాడు కాని, రొట్టెలు చేసేవాడు కాని ఎవరైనా సరే తన కొరకే, తన మేలు కొరకే కసాయి పని, రొట్టెలు చేయటం చేస్తాడు. ఈ ఉత్పత్తే వ్యవస్థలో ఆదాయాలు పెంచుతుంది. D.H. రాబర్ట్సన్ కూడా ద్రవ్యం అనే గ్రంథంలో మానవుడు ద్రవ్యం కోసం తను ఉద్యోగం చేస్తూ ఉత్పత్తిపై దృష్టిని నిలుపుతాడు అని రాసాడు. ఈ ఉత్పత్తే సమాజం యొక్క వస్తుసేవల ప్రవాహాన్ని, ఆదాయాన్ని పెంచుతుంది. దీనివలన తెలిసేది ఏమంటే ద్రవ్యం కోసం, కొనుగోలు శక్తి పొందటం కోసం జరిగే కృషియే ఉత్పత్తి , ఆదాయాల పెరుగుదలకు మూలం.

ఏయే వస్తువులను ఎంత మొత్తంలో ఉత్పత్తి చేయాలో ద్రవ్య రాబడి వ్యయాల ద్వారా తెలుస్తుంది. ఉపాంత వ్యయం, ఉపాంత రాబడులు సమానంగా ఉండే స్థితి వద్ద ఉత్పత్తి ఆపి సమతౌల్యంలో ఉంటాడు. దానికి తగిన ధరను నిర్ణయిస్తాడు లేదా నిర్ణయించిన ధరలను అమలుపరుస్తాడు. ఉత్పత్తిదారుడు చేసే ద్రవ్య చెల్లింపులే వివిధ ఉత్పత్తి సాధనాల ఆదాయాన్ని, పంపకాన్ని నిర్ణయిస్తాయి. ద్రవ్యమే లేకుంటే ఉత్పత్తి ప్రక్రియ సాఫీగా జరుగదు.

**వినిమయంలో ద్రవ్యం పాత్ర :** తయారయిన వస్తువులకు డిమాండు (కొనుగోళ్ళు) లేకపోతే ఉత్పత్తే ఉండదు. సప్లై తనకు తాను డిమాండును సృష్టించుకున్నా లేదా ప్రభుత్వ జోక్యం వల్ల డిమాండ్ పెరిగినా సప్లై (పెరుగుదల) కొనసాగుతుంది. వినిమయం ద్వారానే వస్తు సేవల, ఉత్పత్తి సాధనాల సాపేక్షిక ధరలు నిర్ణయమవుతాయి. ప్రజలకేమీ కావాలో, ఎంత కావాలో, ఎక్కడ కావాలో ద్రవ్య వినిమయం ద్వారా, ధరల ద్వారా తెలుస్తుంది. వినిమయాలే పెద్ద ఎత్తు వ్యాపారానికి, శ్రమ విభజనకు తోడ్పడుతాయి.

వినిమయాలు పెరిగినపుడు పెద్ద ఎత్తున అమ్మకాలు కొనసాగుతాయి, విస్తృత మార్కెట్లు ఏర్పడుతాయి. భారీ ఎత్తున వస్తువులను ఉత్పత్తి చేయటానికి ప్రత్యేకీకరణ, శ్రమవిభజన అవసరం. అలాంటి శ్రమ విభజన వృత్తులలో, పరిశ్రమలలో, పారిశ్రామిక స్థానాలలో మార్పులు తెచ్చి ఉత్పత్తిని చాలా వేగంగా పెంచుతుంది.

వివిధ రంగాల మధ్య, ప్రాంతాల మధ్య ఉత్పత్తి ప్రవాహాలు నిరాటంకంగా కొనసాగటానికి ద్రవ్యమే ప్రధాన పాత్ర వహిస్తుంది. ద్రవ్యం వ్యవస్థకు ఇరుసులాంటిది.

**పంపిణీలో ద్రవ్యం పాత్ర :** మొత్తం జాతీయాదాయం ఎవరెవరికి ఎంత పంచబడిందో ద్రవ్యం ద్వారా తెలుస్తుంది. వేతనాలుగా, లాభాలుగా, భాటకాలుగా ఆదాయ పంపిణీ, ఆ ఉత్పత్తి సాధనాల వాడకం, వాటికి చెల్లించే ద్రవ్య రూపంలోని ధరపై ఆధారపడుతుంది. అలాగే వ్యక్తిగత ఆదాయాల పంపిణీ, సంపద పంపిణీలు వ్యక్తులు పొందే ద్రవ్య ఆదాయాల మీద ఆధారపడుతాయి. ఉత్పత్తి సాధనాలకు అవి అందించే వ్యక్తులకు ఎంత చెల్లించాలో, వాటి ఉపాంత ఉత్పాదకత రాబడులపై, ధరలపై తెలుస్తుంది.

BRAOU

సంక్షేమం కోసం ప్రభుత్వాలు పంపిణీలో మార్పులు తేవటానికై ధనికులపై పన్నులువేసి, పేదవారికి బదిలీ చెల్లింపులు చేస్తాయి. ద్రవ్య ధరలలో మార్పుల ద్వారా కొనుగోలు శక్తిని మార్చవచ్చు. వివిధ దేశాల మధ్య ఆదాయ పంపిణీలు కూడా ద్రవ్య సహాయంచే సునాయాసంగా చేయబడుతాయి. మూలధనం, పెట్టుబడులు సంపన్నదేశాలు వెనుకబడిన దేశాలలో పెట్టడం ద్వారా ఉత్పత్తులు మారి, పంపిణీలను మార్చుతున్నాయి. వనరుల పంపిణీ, ఆదాయ పంపిణీలు ద్రవ్య సహాయంతో సులభంగా చేయబడుతున్నాయి. ద్రవ్యమే లేకపోతే పంపిణీ అంత తేలికగా మారేది కాదు.

**వినియోగంలో ద్రవ్యం పాత్ర :** కొనుగోలుదారుడు తనవద్ద ఉన్న ద్రవ్యంతో ఎక్కువ ప్రయోజనం పొందాలని చూస్తాడు. వీటికి క్షీణోపాంత ప్రయోజన సూత్రం, సమోపాంత ప్రయోజన సూత్రాలు ఉపయోగపడతాయి. ఏ వస్తువులు ఎంత మేరకు కొనాలో ధరలపై,ఉపాంత ప్రయోజనాలపై ఆధారపడతాయి.

ధర అనేది వాస్తవంగా (ప్రయోజనానికి) చెల్లించేది. ప్రయోజనం అనేది వినియోగదారుడు చెల్లించదలచుకున్నది తెలుపుతుంది (పొందే ఉపాంత ప్రయోజనాన్ని బట్టి). ఈ రెండు సమానమయితే వస్తువుల కొనుగోలు జరుగటం, సమతౌల్యం పొందటం జరిగి గరిష్ఠ ప్రయోజనం సమకూర్చుకుంటాడు.

వివిధ వస్తువుల వినియోగం, వాడకం వాటి ధరలను బట్టి ఉంటుంది. వినియోగదారునికి కొనుగోలు స్వేచ్ఛను ద్రవ్యం కలుగచేస్తుంది. ద్రవ్యంతో తనకు ఇష్టం వచ్చిన వస్తువులను, కావలసినంత మేరకు కొని వినియోగాన్ని, తృప్తిని గరిష్ఠం చేసుకుంటాడు.

**ద్రవ్యం పరపతి సృష్టికి మూలం (Source of Credit Creation) :** వాణిజ్య బాంకుల ద్రవ్యం, పరపతి సృష్టి నేటి పారిశ్రామిక యుగానికి, ప్రగతికి పూలబాటలు. అటువంటి పరపతి సృష్టి విస్తరిల్లటానికి ద్రవ్యమే కారణం. వ్యాపార లావాదేవీలకు, ఉత్పత్తికీ, ఉత్పత్తి ప్రారంభం నుండి అమ్మకాలై ప్రతిఫలం వచ్చే వరకు వారధి నిర్మించటానికి ద్రవ్యం, పరపతి ద్రవ్యం చాలా తోడ్పడుతున్నాయి. ఈ పరపతి ద్రవ్యం వల్ల, సమీప ద్రవ్యం వల్ల లావాదేవీలు ఉత్పత్తి, వినియోగం విపరీతంగా పెరిగినాయి.

**ద్రవ్యం - వ్యాపారం, వర్తకం :** వ్యాపార వర్తకాలు దేశీయంగా కాని, అంతర్జాతీయ రంగంలో కాని జరుగాలంటే ద్రవ్యం, దాని మారకం అవసరం. తులనాత్మకంగా వ్యయాలను, ధరలను పోల్చి, ప్రత్యేకీకరణల ద్వారా వర్తకాన్ని చేస్తారు. ద్రవ్యం లేకపోతే అంతర్జాతీయంగా వ్యాపారం సులభంగా, వేగంగా, అధికంగా జరిగేది కాదు.

**మూలధన సంచయంలో ద్రవ్యం పాత్ర :** మూలధనం లేకపోతే, అది పెరుగకపోతే, ఉత్పత్తిలో పెరుగుదల ఉండదు. ప్రజల పొదుపును సమీకరించి, పెట్టుబడిదారులకు ద్రవ్యాన్ని సమకూర్చటం ద్వారా పెట్టుబడులు పెద్ద ఎత్తున పెట్టబడుతున్నాయి. అట్టి పెట్టుబడి పెరుగుదలే మూలధనం పెరగడానికి, దాని సంచయనానికి తోడ్పడుతున్నది. ద్రవ్యం వినియోగాన్నే గాకుండా మూలధనాన్ని పెంచి ప్రజల భవిష్యత్తును కూడా తీర్చి దిద్దుతుంది.

**వృద్ధి, అభివృద్ధి సూచిక, కొలమానం :** వివిధ దేశాల్లో పెరిగే ఆదాయం, తలసరి ఆదాయం, ద్రవ్య రూపంలో చెప్పబడితేనే వాటిని పోల్చి చెప్పటం జరుగుతుంది. ద్రవ్య రూపంలోని తలసరి ఆదాయాలలో మార్పులు, కొనుగోలు శక్తి పంపిణీలోని మార్పులు, వృద్ధిని, అభివృద్ధిని సూచిస్తాయి. ఉత్పత్తి, ఆదాయాల్లో మార్పును వృద్ధి తెలిపితే వ్యవస్థీకృత, సాంకేతిక, పంపిణీ మార్పులను అభివృద్ధి తెలుపుతుంది.

**ప్రభుత్వ విత్తం - ద్రవ్యం పాత్ర :** కేవలం ప్రైవేట్ రంగంలో ఉత్పత్తి, పంపిణీలే కాక, ప్రభుత్వాల జోక్యం వల్ల కొన్ని మార్పులు, చేర్పులు కలుగుతాయి. ప్రభుత్వం ప్రజలకు శాంతి భద్రతలు కల్పించడానికి, రక్షణకు, తన

BRAOU

యంత్రాంగం నడపడానికి అభివృద్ధి కార్యక్రమాలకు ద్రవ్యాన్ని ఖర్చుపెడుతుంది. దానికి తగిన రాబడిని పన్నుల ద్వారా, ఇతర రకాలుగా సమకూర్చుకుంటుంది. ఇలా ప్రభుత్వ రాబడిని, వ్యయాలను తెల్పేదే ప్రభుత్వ విత్తం. ఈ విత్తం కార్యకలాపాలన్నీ నేడు ద్రవ్య పరంగానే జరుగుతున్నాయి. అప్పులు తీసుకున్నా, లోటు ద్రవ్యాన్ని ముద్రించినా పన్నులు, మిగుళ్ళు రాబట్టినా ద్రవ్యం ద్వారానే అవి సాధ్య పడుతాయి.

**ద్రవ్యం - సాంకేతిక ప్రగతి :** కాల్డార్ తెల్పిన 'సాంకేతిక ప్రగతి ఫలం ' (technical progress function) లో ఉత్పాదకతలు పెరగడానికి కారణం పెట్టుబడులు పెరుగటయే అన్నాడు. నేడు పరిశోధనలకు, నవ కల్పనలకు, పరిశోధనాగారాలకు, వస్తు వ్యాప్తికి ద్రవ్యం చాలా అవసరం. వనరులను గరిష్ఠంగా వాడుకోవటం, ఉన్న వనరుల ఉత్పాదక శక్తి పెరగడమే సాంకేతిక ప్రగతి. దీనికి మూలధనం, దానిని సమకూర్చే ద్రవ్యం అవసరం.

**ద్రవ్యం - సాంఘీక సంక్షేమం :** ప్రజలకు తిండి, వస్త్రం, ఆశ్రయం కల్పించడానికి ; పేదరికం తొలగించి సాంఘీక సంక్షేమం పెంచడానికి ; విద్య, వైద్య, కనీస వసతులు కల్పించడానికి ద్రవ్య పరికరాన్ని వాడుకుంటున్నారు. సమాజంలో గల దృక్పథాలలో మార్పు, ముఖ్యంగా నిమ్న జాతులు, ఇతర జాతుల సంబంధాలు ద్రవ్యం వల్లనే మారుతున్నాయి. విలాసాలను తగ్గించి, అవసరమైన వస్తువుల లభ్యతను పెంచడానికి పన్నులు, ప్రభుత్వ వ్యయాలు ఎంతో తోడ్పడుతున్నాయి. పైన తెల్పిన అంశాలు ఆర్థిక ప్రగతికి సంబంధించినవే అయినా, ద్రవ్యం వీటికే పరిమితం కాలేదు.

**రాజకీయ శాస్త్రం - ద్రవ్యపాత్ర :** కౌటిల్యుని అర్థశాస్త్రం, రాజనీతితో ముడిపెట్టబడింది. రాజకీయంగా మార్పులు, ఆర్థిక స్థితి గతులపైన, ఉదార భావాల వ్యాప్తిపైన ఆధారపడుతాయి. ప్రజల పరిస్థితులను, ఆర్థిక స్థితిని మార్చలేని, మెరుగుపరచని ప్రభుత్వాలు ఎక్కువకాలం మనజాలవు. ద్రవ్యపు జోక్యం కూడా రాజకీయాలలోకి ప్రవేశించినా రాజకీయంగా ప్రభుత్వాలు ఆర్థిక స్వేచ్ఛ, స్వావలంబన, ప్రగతిని సమకూర్చాలి. లేకుంటే ఏమవుతుందో రష్యా (U.S.S.R.) విచ్ఛిన్నమే తెలిపింది.

**సామాజిక శాస్త్రం - ద్రవ్యం :** సమాజపు జీవన విధానం, సంస్కృతి, నాగరికతలను సమాజ శాస్త్రం తెలుపుతుంది. ఈ మార్పులు ద్రవ్య వాడకంలో మార్పులు తెస్తే, ద్రవ్యం వీటిల్లో మార్పులను తెచ్చింది. సామాజిక న్యాయం సమకూర్చటానికి తగిన వనరుల తరలింపుకు ద్రవ్యం ఎక్కువగా తోడ్పడింది. మానవుని హోదా, ప్రతిష్ఠలకు ద్రవ్యం ప్రతీకగా ఉంది.

BRAOU

**ఇతర శాస్త్రాలు - ద్రవ్యం :** మందుల తయారీలో ఏ మందు ఎంత ఖరీదు చేస్తుంది, ఆ మందు ఎంతవరకు రోగ నిర్మూలన చేస్తుందో తెలుసుకోవాలి. అత్యంత సమర్థవంతంగా తక్కువ ఖర్చుతో మంచి ఆరోగ్యం పొందడానికి ప్రయత్నాలు చేయాలి. అలాగే రవాణా సాధనాలలో వేగం, సౌకర్యం వాటికి చెల్లించే ధర, పొందే రాబడి కీలక పాత్రను వహిస్తున్నాయి. భౌతిక, జీవ శాస్త్రాలతోనేకాక ద్రవ్యానికి, నీతి శాస్త్రంతో కూడా దగ్గరి సంబంధం కలదు. ద్రవ్యాన్ని నీతి నిజాయితీలతో సంపాదించి, సమాజానికి మానవతా వాదంతో ఉపయోగించుకోవాలి. ఆ నియమాన్ని తప్పి స్వార్థంతో దోపిడీ, దొంగతనం, మోసాలు చేయటం ద్వారా ద్రవ్యాన్ని సంపాదించడం నైతిక పతనాన్ని చూపిస్తుంది. ద్రవ్యంలోని మంచిని పెంచుతూ, చెడును తొలగించటమే ప్రస్తుత కర్తవ్యం.

## ద్రవ్యం - చెడు ఫలితాలు

ద్రవ్య ప్రభావం వల్ల ఎంతో మంచి జరిగినా, చెడు ప్రభావాలు కూడా నీడలా ద్రవ్యాన్ని వదలటం లేదు. ఇవి ఆర్థిక పరంగా రాజకీయంగా, సామాజిక పరంగా, నైతికంగా చెడు ఫలితాలను ఇస్తూనే ఉన్నాయి.

ద్రవ్యం ముసుగులో శ్రామికుని దోపిడీ ఎలా జరిగిందో కారల్ మార్క్స్ ' దాస్ కాపిటల్ ' లో తెలిపాడు. చరిత్రలో యుద్ధాలు, ఆర్థిక మాంద్యాలు ప్రజలను ఎలా కృంగదీశాయో మనకు తెలుసు. కొన్ని ముఖ్య అంశాలను క్రింద ఉటంకించాం.

ధరలు విపరీతంగా పెరగడం వలన ద్రవ్యం నమ్మకం కోల్పోతుంది. ఆ స్థితిలో ప్రజలు అనిశ్చిత జీవితానికి, ఇబ్బందులకు గురవుతారు. వ్యాపార చక్రాలలో ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం కన్పిస్తాయి. ద్రవ్యోల్బణం పరిమిత పరిధిలో మంచిదే అయినా, ధరలు పెరగడం వలన అనేక వర్గాల కొనుగోలు శక్తి పతనమై అవకతవకలకు దారితీస్తుంది. అలాగే ధరలు తీవ్రంగా పడిపోతే నిరుద్యోగం ప్రబలుతుంది. ఆదాయాలు, జీవన ప్రమాణాలు తగ్గుతాయి. పరపతి ద్రవ్యం వల్ల ప్రజల బాంకుల స్థితిగతులు మారినా, బాంకుల మీద నమ్మకం కోల్పోయినపుడు, చాలా బాంకులు దివాలా తీసి నష్టాన్ని, బాధలను పంచినాయి.

ద్రవ్యాన్ని పెంచుకునే దిశలో అక్రమాలకు, దోపిడీకి తలబడటం వల్ల ఆర్థిక అసమానతలు పెరుగుతాయి. ధనిక పేద, యాజమాన్య శ్రామిక వర్గాల మధ్య అపార్థాలు, అపోహలు పెరగడానికి ద్రవ్యం కూడా కారణమే.

సామాజికంగా ద్రవ్యం హోదాను పెంచుతుంది. దానితో పాటు ఇతరుల శతృత్వం, అసూయలు కూడా పెరుగుతాయి. సమాజంలో దొంగతనాలు, దోపిడీలు, మోసాలు, నమ్మక ద్రోహాలు కూడా జరుగుతాయి. వీటికి కారణం ద్రవ్యంపై మోజు ఏర్పడడమే. నైతికంగా కూడా హత్యలు, దోపిడీలు, అక్రమాలు ద్రవ్యం మూలంగా చెలరేగుతాయి. అంతర్జాతీయంగా కూడా ఆర్థిక ప్రాబల్యానికై అనవసరంగా యుద్ధాలు జరుగుతున్నాయి. ప్రాణ నష్టంతో పాటు ఆస్థి నష్టం, మానవత్వం మంట కలవటం జరుగుతుంది. ఈ చెడు అన్ని రకాల వ్యవస్థల్లో ఉంది. కాని ప్రతి ఆర్థిక వ్యవస్థలో మేలైన గుణాలు లేకపోతే ఎక్కువకాలం అది కొనసాగదు. ఇపుడు వివిధ ఆర్థిక వ్యవస్థలలో ద్రవ్యం పాత్రను తెలుసుకుందాం.

### 1.8.2 పెట్టుబడిదారి వ్యవస్థలో ద్రవ్య ప్రాముఖ్యత

ప్రభుత్వ జోక్యం లేనపుడు ద్రవ్యం తనంతట తాను ఆర్థిక వ్యవస్థను సమర్థవంతంగా ఎలా నడుపుతుందో తెలుసుకోవాలంటే దాని పాత్రను పెట్టుబడిదారీ వ్యవస్థలో చూడాలి.

ఈ వ్యవస్థలో ఆర్థిక కార్యకలాపాలన్నీ ప్రైవేట్ రంగంలో జరుగుతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలకు మూలం మానవుని స్వంత లాభపుటాలోచన. ఇందులో ఉత్పత్తి సాధనాలు ప్రైవేటు పరంగా ఉంటాయి. తన ప్రయోజనాన్ని తానే కాపాడుకుంటూ వ్యవస్థలో పాలుపంచుకునే వాడే ప్రైవేట్ వ్యక్తి, పని చేసేవి సంస్థలు. అన్ని వస్తువులు, సేవలు సాధనాలు ప్రైవేట్‌రంగంలో ఉంటాయి. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ఆస్తి హక్కు, స్వేచ్ఛ ఉంటాయి. వారసత్వపు హక్కులుంటాయి. వినియోగదారుడే సార్వభౌముడు (రాజు). అతను ఏది తలచుకుంటే అది కొనుక్కోవచ్చు (డబ్బు ఉన్నపుడేలెండి). అతని అభీష్టాన్ని బట్టే ఉత్పత్తిదార్లు నిర్ణయాలు తీసుకుంటారు. వినియోగదార్లు, అమ్మకందార్లు చాలామంది ఉంటారు. పరిపూర్ణ పోటీ స్థితి ఉంటే దీర్ఘకాలంలో అవి ఖచ్చితమైన పెట్టుబడిదారీ విధానాన్ని తెలుపుతుంది. నేడు కొంత ఏకస్వామ్యం, గుత్తాధిపత్య పోటీ పరిస్థితులు వాస్తవానికి కనిపిస్తుంటాయి. అదృశ్య హస్తమేదో పని చేస్తున్నట్లు అనిపిస్తుంది. ఇందులో స్వయం చాలకంగా ఆర్థిక కార్యకలాపాలు జరుగుతాయి. దానికి మూల సాధనం ద్రవ్యం, ధరల యంత్రాంగం.

ధరలవల్ల, వాటి మార్పులను బట్టి నడిచే తతంగమే ధర యంత్రాంగం. దీని ప్రకారం ఉత్పత్తిదార్లు వస్తువు ధర పెరిగితే ఆ వస్తువు సప్లైని పెంచుతారు. A అనే వస్తువు ధర B అనే వస్తువు ధర కన్నా వేగంగా పెరిగి (ఖర్చులు మారకుండా) సాపేక్షికంగా (relatively) ఖరీదైన ధర పలికితే B కి బదులు A వస్తూత్పత్తికై పెట్టుబడి పెడ్తారు.

BRAOU

అలాగే ధర ఎక్కువ ఉన్న ప్రాంతానికి వస్తువులను, ఉత్పత్తి సాధనాలను తరలించుతారు. లాభాలు పొందినంత వరకు ఉత్పత్తిని పెంచుతారు. మూలధనాన్ని పెంచుతారు. ఇదంతా ద్రవ్యరూపంలోని ధరల సూచి వల్లే జరుగుతుంది.

వినియోగదారుల అభిప్రాయాలకు, కోరికలకు, సాపేక్షిక డిమాండుకు (సప్లై డిమాండుకన్న తక్కువ ఉంటే సాపేక్షిక డిమాండు ఎక్కువ ఉన్నట్లు) ధర ప్రతిబింబంగా వుంటుంది. వినియోగదారుడు కూడా ఉత్పత్తిలోని మార్పులు, నవకల్పనలు, ఉత్పత్తి ఖర్చులు, ప్రయోజనం, మార్కెట్లో లభించే తీరు, ధరలు మొదలగు వాటిని బట్టి తన నిర్ణయాలను, అభిరుచులను, ఫ్యాషన్లను మార్చుకుంటాడు. వస్తువుల, ఉత్పత్తి సాధనాల, ద్రవ్యపు మార్కెట్లన్నీ స్వయం చాలకంగా పనిచేస్తాయి.

ధరల సమతౌల్యం, ఉద్యోగిత, ఉత్పత్తి సమతౌల్యాలు, సమగ్ర సమతౌల్యాన్ని ధర యంత్రాంగం ఎలా సాధిస్తుందో వాల్రాస్, మార్షల్ తెలిపారు. పిగూ, ఎడ్జ్‌వర్త్‌లు ధర యంత్రాంగం ద్వారా గరిష్ఠ సాంఘిక శ్రేయస్సు ఎలా సమకూరేది తెలిపారు.

ద్రవ్య సహాయంతో నిలకడగా వృద్ధిని, సంపూర్ణ ఉద్యోగితతో గరిష్ఠంగా ఎలా పొందవచ్చో హారడ్, డోమర్, సోలో, జాన్ రాబిన్సన్ లు వివరించారు. అందుకు తగ్గ ద్రవ్య విధానాల ఎంపిక, ద్రవ్య ప్రాధాన్యతను తెలుపుతుంది.

అయితే ద్రవ్యం వల్ల ఈ వ్యవస్థల్లో ఇబ్బందులు కూడా ఏర్పడ వచ్చు. వ్యాపార చక్రాలు, నిరుద్యోగిత, ద్రవ్యోల్బణ సమస్యలు(ధరలు పెరగటంచే) ఆర్థిక మాంద్య ప్రతికూలతలు, పోటీవల్ల వృథాలు, అసమానతలు మొదలైన సమస్యలు కూడా ఈ వ్యవస్థ వల్ల, ద్రవ్యంవల్ల ఏర్పడవచ్చు. కాని పెరిగే సంక్షేమం, ఉత్పత్తి, చలనాత్మక మార్పుల ముందు సమస్యలు తీసికట్టయినపుడు ద్రవ్యాన్ని యజమానిగా చేస్తే తప్పనిపించదు, అనిపించటం లేదు కూడా.

### 1.8.3 సోషలిస్టు లేదా సామ్యవాద దేశాలలో ద్రవ్యం పాత్ర

సామ్యవాద వ్యవస్థల్లో ప్రభుత్వమే భూమి, ఆస్తులకు యజమాని. ప్రైవేట్ ఆస్తులు, సంపదలు, ఆస్తి హక్కులు, వారసత్వపు హక్కులు ఉండవు. ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా ఉత్పత్తి నిర్ణయాలను తన గుప్పిట్లో కేంద్రీకరించి తగు ఆజ్ఞల ద్వారా, ఆదేశాల ద్వారా ఉత్పత్తిని కొనసాగిస్తుంది. ధరలను గత సూచికల, మార్పుల (trial and error) దృష్టిలో పెట్టుకొని నిర్ణయిస్తుంది. వినియోగదార్లకు వినియోగ వస్తువులు, అవసర వస్తువులు ప్రభుత్వమే సమకూరుస్తుంది. కాని వారి విభిన్న రుచులకు, కోరికలకు తావు (place) తక్కువ. ఈ వ్యవస్థలో ఆదాయ, సంపద అసమానతలు తక్కువ.

సామ్యవాద దేశాల్లో ద్రవ్యాన్ని కేవలం వస్తువుల మార్పిడికి, వస్తు విలువల లెక్కించి మార్చుకోవడానికి మాత్రమే వాడుతారు. ద్రవ్యం కేవలం టోకెన్‌లాగా, మధ్యవర్తిగా, సాధనంగా పనిచేస్తుంది. ఇది ఒక సేవకునిగా పని వింటుంది. ద్రవ్యానికి ధరలను నిర్ణయించే స్వతంత్రత, అవకాశాలు లేవు. నిష్క్రియ పాత్ర వహిస్తుంది.

అందువల్లనే రష్యాలో ద్రవ్యం లేకుండా వ్యవస్థను నడిపే ప్రయత్నం చేశారు. 1918 సంవత్సరం ప్రాంతంలో యుద్ధ కమ్యూనిజం కాలంలో ద్రవ్యాన్ని తొలగించి ప్రత్యక్షంగా పంపిణీ ఉత్పత్తులను ప్రభుత్వం చేపట్టింది. కాని 1921 వరకు లెనిన్, ట్రాట్స్కీలు ద్రవ్యం లేకుంటే ఉన్న ఇబ్బందులు గుర్తించారు. ద్రవ్యాన్ని తిరిగి ప్రవేశపెట్టారు. కాని ద్రవ్యం పాత్రను కేవలం వినిమయ మాధ్యమానికే పరిమితం చేశారు.

BRAOU

ఆస్కార్ లాంజ్ అన్నట్లు ద్రవ్యం లేకుండానే సామ్యవాదంలో వనరుల పంపిణీ చేయవచ్చు. కాని ద్రవ్యం ఆ పంపిణీని సులభతరం చేస్తుంది. సామ్యవాదంలో ప్రజల కోరికలను ప్రభుత్వమే గుర్తించి ధరను నిర్ణయిస్తుంది, కోటాల ప్రకారం వస్తు పంపిణీ చేస్తుంది. సామ్యవాదంలో వినిమయదారుల అభీష్టాలకు ధర సూచిక కాదు , కేవలం నిర్ధారిత చలాంకం (given variable). సమర్థవంతంగా వ్యవస్థ పనిచేయడానికి ద్రవ్యం ధరలపై కూడా పూర్తిగా ఆధారపడరాదు. వాటిని సూచికల్లాగా చూడాలి. మార్కెట్‌లో అసంపూర్ణతలు ఉన్నా ధర సరిగ్గా వినియోగదారుని అవసరాన్ని చూపదు. అందువల్లనే మార్కెట్లకు, ధర యంత్రాంగానికి, అసమాన అవకాశాలకు మానవులను బలి చేయకుండా సామ్యవాద వ్యవస్థ తానే ఉత్పత్తి పంపిణీలను చేపడుతుంది. ఆ ఉత్పత్తి పంపిణీలకు గాను వనరుల తరలింపుకు, శ్రామిక వేతన చెల్లింపులకు, వస్తు అమ్మకాలకు ద్రవ్యాన్ని వాడుకుంటుంది. భౌతిక ప్రణాళికలు ద్రవ్య ప్రణాళికల చేత ఆచరణలోకి వస్తాయి. ద్రవ్యావాడకం సామ్యవాదానికే కాదు, అది దారి తీసే కమ్యూనిజంలో కూడా తప్పనిసరే. ఏ వ్యవస్థలోనైనా ద్రవ్యం లావాదేవీలను సులభం చేసి దేశ ప్రయోజనానికి తోడ్పడుతుంది.

### 1.8.4 మిశ్రమ ఆర్థిక వ్యవస్థల్లో ద్రవ్యం పాత్ర

భారతదేశం మిశ్రమ ఆర్థిక వ్యవస్థలకు చక్కటి ఉదాహరణ. పెట్టుబడిదారీ విధానంలోని, సామ్యవాదంలోని ప్రోత్సాహక, నిర్దేశిత ప్రణాళికలలోని మంచి లక్షణాలను ఏరి కోరి రూపొందించుకున్నదే మిశ్రమ వ్యవస్థ. ఈ వ్యవస్థలో ప్రైవేట్, ప్రభుత్వరంగాలు రెండూ ఉంటాయి. ఆస్తిహక్కు ఉంటుంది. కీలక రంగాలలో ప్రభుత్వ రంగం పాల్గొంటుంది. ప్రణాళికా సంఘం రెండు రంగాల కార్యకలాపాలను సమన్వయం చేస్తుంది. వనరుల కేటాయింపును సూచిస్తుంది. పన్నుల ద్వారా, ప్రభుత్వ వ్యయం ద్వారా, కోశ, ద్రవ్య, భౌతిక చర్యల ద్వారా ఉత్పత్తి, పంపకాల నియంత్రణ చేస్తారు. ఈ కార్యకలాపాలన్నీ ద్రవ్య సహాయంచేతనే నిర్వహింపబడుతాయి.

ప్రైవేట్ రంగంలో వినియోగదారులు గరిష్ఠ ప్రయోజనాన్ని ఉత్పత్తిదారులు గరిష్ఠ లాభాన్ని పొందటానికి ద్రవ్యాన్ని వాడుకుంటారు. ప్రభుత్వ కంట్రోళ్ళు, సబ్సిడీలు, లైసెన్సింగ్ విధానం, వ్యవసాయ, ఇతర వస్తు ధరల నిర్ణయం, కనీస వేతనాలు, ఏకస్వామ్య చట్టాలు మొదలైనవి ప్రైవేట్ రంగానికి సూచనలు ఇస్తూ పరోక్ష నియంత్రణ చేస్తాయి. ప్రైవేట్ రంగం చేయజాలని ఉత్పత్తులను ప్రభుత్వరంగం చేపడుతుంది. అసమానతలను ప్రభుత్వరంగం తగ్గిస్తుంది. సామర్థ్యాన్ని, పోటీ తత్వాన్ని పెంచుతుంది. ధరల యంత్రాంగం పనిచేస్తూ, ప్రభుత్వరంగం తన పాత్ర వహిస్తూంటే ప్రోత్సాహక ప్రణాళికలను ద్రవ్య సహాయంతో మిశ్రమ ఆర్థిక వ్యవస్థలు అమలు చేస్తాయి. ఈ వ్యవస్థలో చెడు లక్షణాలు కూడా కన్పిస్తాయి. ప్రైవేట్, ప్రభుత్వ రంగాల పోటీవల్ల వనరులు వృధాకావచ్చు. జాతీయీకరణ భయంతో ఉత్పత్తిని ప్రైవేట్ రంగం చేపట్టకపోవటం, ప్రభుత్వ రంగ సంస్థలు తగిన శ్రద్ధ వహించకపోవటంచే ఉత్పత్తి దెబ్బతినవచ్చు.

అభివృద్ధి చెందుతున్న దేశాలు నేడు చాలావరకు మిశ్రమ విధానాన్ని పాటిస్తున్నాయి. అభివృద్ధికి కావలసిన వ్యవస్థా పూర్వక మార్పులకు పారిశ్రామికీకరణ వేగంగా జరగాలి. అందుకు పెద్ద ఎత్తున పెట్టుబడులను ద్రవ్యం సమకూర్చుకోవాలి. వ్యాపార నిర్వహణకు ఉమ్మడి వాటా కంపెనీల ద్వారా ద్రవ్యాన్ని పోగు చేసుకుంటూ లాభాలను తిరిగి పెట్టుబడులు పెట్టాలి. ఆధునిక మార్కెట్లకు తగిన డిమాండు, పరపతి కావాలంటే ద్రవ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి.

BRAOU

### 1.8.5 ద్రవ్యం - విధాన సాధనాలు

దేశం యొక్క దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు తగ్గ ద్రవ్య విధానం ఉండాలి. ఏ లక్ష్యాలను సాధించాలన్నా విధానాలు, వాటిని అమలు పరిచే సాధనాలు ఉండాలి. ఆదాయాల వృద్ధి, తలసరి ఆదాయపు పెరుగుదల, సంపూర్ణోద్యోగిత, సమాన పంపిణీ, ధరల స్థిరీకరణ, విదేశీ మారక మూల్య పోషణ, మూలధన సంచయనం, సాంకేతిక ప్రగతి, సామాజిక మార్పులు మన లక్ష్యాలు. వీటిని సాధించటానికి ప్రణాళికలు (నిర్దేశిత లేదా ప్రోత్సాహక) సాధనాలను రూపొందించుతాయి. వాటిల్లో కోశ (fiscal), ద్రవ్య (monetary), భౌతిక (physical) విధాన సాధనాలు ప్రధానమైనవి. ప్రభుత్వ రాబడి, వ్యయాల కోశ విధానం తెలిపితే, ప్రజా పంపిణీ వ్యవస్థ భౌతిక విధానాన్ని తెలుపుతుంది. అతి ముఖ్యమైన మరొక విధాన సాధనం ద్రవ్య సాధనం (monetary tool).

ద్రవ్యంలోని మార్పుల ద్వారా, ధరలను, వడ్డీరేట్లను, పరపతిని మార్చి లక్ష్యాలకు తగ్గట్టు చేస్తారు. దేశంలో ఆదాయాలు పెరగాలంటే, ధరలు పెరుగుతూ, పెట్టుబడులు పెరగాలి. అపుడు ద్రవ్య సప్లై పెంచుతారు. వాణిజ్య బాంకులు తక్కువ ద్రవ్య నిల్వలతో ఎక్కువ పరపతిని సృష్టించటానికి రిజర్వు నిష్పత్తులను తగ్గిస్తారు. పరిమాణాత్మక పరపతి, గుణాత్మక పరపతి (quantitative and qualitative credits) ని లక్ష్యాలకు అనుగుణంగా మార్చుకుంటారు. వడ్డీ రేట్లను తగ్గించి పెట్టుబడిని ప్రోత్సహిస్తారు.

ద్రవ్య సప్లైలో, దాని వాడకంలో మార్పులు ద్రవ్య సాధనాలుగా వుపయోగపడుతాయి. పన్నులు, వ్యయాలు, లోటు ద్రవ్యం అనబడే కోశ విధానం కూడా ద్రవ్యం సహాయంతోనే అమలు జరుగుతుంది. ఇలా ఏ విధానాలు గాని అమలులోకి రావాలంటే ద్రవ్యాన్ని వాడవలసిందే. ద్రవ్యానికున్న డిమాండు వ్యవహారాలకు గాని, ముందు జాగ్రత్తకు లేదా అంచనా(చట్టా) వ్యాపారానికి ఏర్పడవచ్చు. వ్యవస్థలో సమష్టి డిమాండు, సప్లైలను మార్చటానికి ద్రవ్యం ఆవశ్యం. అట్టి ద్రవ్య సప్లై ఎలా జరుగుతుందో తర్వాత తెలుసుకుంటాం.

## 1.9 ముగింపు

ద్రవ్యం నేడు ఒక ఆవశ్యకత. ఒకనాడు వినిమయం లేకుండేది. సమాజాల అవతరణ వినిమయానికి జన్మ నిచ్చింది. వినిమయం మొదట ప్రత్యక్షంగా జరిగేది. అదే వస్తు మారక లేదా వస్తు వినిమయ పద్ధతి. దీనిలో అనేక లోపాలు ఉండేవి. కోరికల సమన్వయం లేకపోవటం అందులో ఒకటి. ఈ ఇబ్బందులను అధిగమించటానికి పొగాకు లాంటి వస్తువులను మొదట ద్రవ్యంగా వాడినారు. తర్వాత లోహాలను వాడినారు. వీటిలో ఏకలోహ, బహు లోహ ప్రమాణాలున్నాయి. స్వర్ణ ప్రమాణం కొన్నాళ్ళు కొనసాగింది. కాగితపు కరెన్సీని ద్రవ్యంగా వాడినారు. నేడు పరపతి ద్రవ్యం ప్రాచుర్యంలో ఉంది.

ద్రవ్యం చేసే పనులను (విధులను) నిర్వర్తించేదే ద్రవ్యం. ద్రవ్య నిర్వచనంలో వినిమయ మాధ్యమం, కొలమానం, విలువనిధి, భవిష్యత్తు చెల్లింపులకు ఉపయోగపడే సర్వజనాంగీకార వస్తువునే ద్రవ్యంగా నిర్వచించారు. మంచి ద్రవ్యానికి కొన్ని లక్షణాలుండాలి. నమ్మకం, విభాజ్యత, గుర్తింపు, స్థిరత్వం, నిలువ, కొలమానంగా ఉండటం మొదలైన వాటిలో ఎన్ని ఎక్కువ లక్షణాలుంటే అంత మంచిది. ప్రతి విధిని సంపూర్ణంగా నిర్వహించగలిగేదే మంచి ద్రవ్యం.

ద్రవ్యం కరెన్సీ నోట్ల రూపంలోనే కాక ఐచ్ఛిక ద్రవ్యంగా కూడా ఉంటుంది. ద్రవ్యాన్ని దానికై వాడే వస్తువును బట్టి, దాని చట్టబద్ధతనమసరించి, జారీ చేసే విధానాన్ని బట్టి వర్గీకరించవచ్చు. వివిధ విధుల కొరకు అనేక రకాల ద్రవ్యం సృష్టించబడుతుంది. సమీప ద్రవ్యాన్ని ద్రవ్య నిలువకు, వాస్తవిక ద్రవ్యాన్ని వస్తు కొనుగోళ్ళకు వాడుతారు.

BRAOU

ద్రవ్యం నిశ్చలాత్మకమేగాక చలనాత్మకం కూడా. ఆర్థిక కార్యకలాపాలలో ద్రవ్యం పాత్ర అతి ముఖ్యమైనది. వ్యవస్థలు పెట్టుబడిదారీ విధానాన్ని అవలంభించినా, సామ్యవాదాన్ని పాటించినా, మిశ్రమ వ్యవస్థలను రూపొందించినా ద్రవ్యం తప్పనిసరి. లావాదేవీలు సాఫీగా జరగాలంటే ద్రవ్యం తప్పకుండా అవసరమే. ద్రవ్యంతో పాటు దాని ఉనికిని మార్చే ద్రవ్య సాధనాలను అభివృద్ధి లక్ష్యాలకై వాడుతారు.

ఇంతవరకు ద్రవ్యం అంటే ఏమిటో, దాని ప్రాధాన్యత ఏమిటో తెలుసుకున్నాం.

## 1.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 40 పంక్తులలో జవాబులిమ్ము.**

1. ద్రవ్యం అంటే ఏమిటో నిర్వచించి, దాని లక్షణాలను తెలుపండి.
2. ద్రవ్యపు వివిధ విధులను వివరించండి.
3. ద్రవ్య ప్రాధాన్యతను, వివిధ వ్యవస్థలలో దాని పాత్రను తెలుపండి.
4. ద్రవ్య వర్గీకరణను వివరించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 20 పంక్తులలో జవాబులివ్వండి.**

1. వస్తు వినిమయ పద్ధతి అంటే ఏమిటి ? దానిలోని లోపాలు ఏవి ?
2. మంచి ద్రవ్య లక్షణాలు ఏమి ?
3. ద్రవ్య కరెన్సీని జారీ చేసే పద్ధతులను వివరించండి.
4. ధర యంత్రాంగంలో ద్రవ్యం పాత్ర ఎట్టిది ?
5. ద్రవ్య పరిణామ క్రమాన్ని వివరించండి.
6. సామ్యవాదంలో ద్రవ్యపాత్రను వివరించండి.
7. నిశ్చలాత్మక, చలనాత్మక ద్రవ్య విధులలోని భేదాలు ఏవి ?
8. వివిధ లోహ ప్రమాణ ద్రవ్యాలను తెలిపి, గ్రేషమ్ సిద్ధాంతాన్ని తెలుపండి.

## 1.10. సంప్రదింపు గ్రంథాలు


1. " *Money and Credit Impact and Control* " By . J.S. Dusenberry.
   III Edition ,Prentice Hall of India private Ltd., New Delhi, 1979.
2. " *Money, Banking and International made* " By M.N. Misra, Chand & Co. , 1982.
3. " *The Theory of Money and Finance* " By Richard Coghlan, The Macmillan Press Ltd., 1980.
4. " *Theory of Money* " By W.T. Newlyn and R.P. Bootle, Clarendon Press, Oxford, 1978.
5. " *Monetary Economics: Institutions Theory & Policy* " by S.B. Gupta, S. Chand and Co., 1982.
6. " *Macro Economic Themes* " Edited by Surrey, Oxford University Press, 1976.


BRAOU

7. "*Monetary Theory and Practice*" By J.L. Hanson, ELBS & Macdonald and Evans, London, 1974.
8. "Monetary Economics " by M.L. Seth, Laxmi Narayan Agarwal Educational Publishers, Agra.
9. "*Monetary and Fiscal Economics* " By P.R. Krishna Aiyar, Sterling Publishers Ltd., New Delhi, 1984.
10. "*An Outline of Money* " By Crowther.


## 1.12 పదకోశం

| | | |
|---|---|---|
| Barter system | - | వస్తు వినిమయ పద్ధతి |
| Classification | - | వర్గీకరణ |
| Coincidence of wants | - | కోరికల సమన్వయం |
| Contingent functions | - | అనుషంగిక విధులు |
| Credit money | - | పరపతి ద్రవ్యం |
| Dynamic functions | - | చలనాత్మక విధులు |
| Elasticity | - | వ్యాకోచత్వం |
| Fiduciary system | - | విశ్వాసాశ్రిత పద్ధతి |
| Real balance effect | - | వాస్తవిక మిగులు ప్రభావం |
| General acceptability | - | సర్వజనాంగీకారం |
| Homogeneity | - | సజాతీయత |
| Legal tender money | - | చట్టబద్ధ ద్రవ్యం |
| Liquidity | - | ద్రవ్యత్వం |
| Monetary standard | - | ద్రవ్య ప్రమాణం |
| Primary functions | - | ప్రాథమిక విధులు |
| Policy instruments | - | విధాన సాధనాలు |
| Secondary functions | - | గౌణ విధులు |
| Static functions | - | నిశ్చలాత్మక విధులు |
| Face value | - | ముఖ విలువ |
| Inner value | - | అంతర్గత విలువ |
| Money illusion | - | ద్రవ్య భ్రమ |
| Outside money | - | బహిర్గత ద్రవ్యం |
| Aggregate monetary resources | - | సమష్టి ద్రవ్య వనరులు |

BRAOU

| | | |
|---|---|---|
| Chronology | - | కాలక్రమణిక |
| Intensity | - | ఉదృతి, తీవ్రత |
| Flexible | - | సరళత్వం |
| Index number | - | సూచీ సంఖ్య |
| Representative money | - | ప్రాతినిధ్య ద్రవ్యం |
| Fiat money | - | శాసనబద్ధ ద్రవ్యం |
| Managed money | - | నిర్వాహిత ద్రవ్యం |
| Convertible | - | మార్చదగిన, పరివర్తనీయ |
| Inconvertible | - | మార్చలేని, అపరివర్తనీయ |
| Proportional reserve system | - | అనుపాత రిజర్వు పద్ధతి |
| Minimum reserves | - | కనీస నిల్వలు |
| Option money | - | ఐచ్ఛిక ద్రవ్యం |
| Artificial | - | కృత్రిమ |
| Contingent money | - | అనుషంగిక ద్రవ్యం |
| Transactions | - | వ్యవహారాలు |
| Neutral | - | తటస్థ |
| Financial assets | - | విత్త/ద్రవ్య ఆస్తులు |
| Credit creation | - | పరపతి సృష్టి |
| Relatively | - | సాపేక్షికంగా |
| Variables | - | చలాంకాలు, చలరాశులు |

- శ్రీ జి.వి. రంగారావు

# భాగం -2 : భారతదేశంలో ద్రవ్య సప్లయ్ కొలమానాలు

## (Measurers of Money Supply in India)

విషయక్రమం


2.0 ఉద్దేశాలు

2.1 పరిచయం

2.2.1 సంకుచిత లేదా సంప్రదాయ ద్రవ్య నిల్వ కొలమానం

2.2.2 $M_3$ కొలమానము

2.3 భారతదేశంలో $M_1$, $M_3$ ల పోకడలు

2.4 సారాంశం

2.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

2.6 సంప్రదింపు గ్రంథాలు

2.7 భావనలు

2.8 పదకోశం


BRAOU

## 2.0 ఉద్దేశాలు

ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా ద్రవ్య సప్లై పోకడలు (trends) , ఆర్థిక కార్యకలాపాల స్థాయి (జాతీయ ఆదాయపు స్థాయి), సాధారణ ధరల స్థాయి, వడ్డీరేట్లు తదితర ప్రముఖ స్థూల ఆర్థిక చలరాసులపై ఆ పోకడల ప్రభావం ఆ ఆర్థిక వ్యవస్థ ద్రవ్య సంబంధిత అనుభవం (monetary experience) లో ప్రముఖమైన అంశాలు. భారతదేశ ద్రవ్య సప్లై లేదా ద్రవ్య నిల్వల కొలమానాలను వివరంగా తెలుసుకోవడం ఈ యూనిట్ ముఖ్యోద్దేశం. ఈ సందర్భంగా గణనలోకి తీసుకోవలసిన వివిధ భావనలను విశదీకరించడం కూడా ఈ యూనిట్ లక్ష్యం. 1970-71 నుండి 1991-92 కాలంలో ద్రవ్య సప్లై పోకడలను విశ్లేషించడం కూడా ఈ యూనిట్ లక్ష్యాలలో ఒకటి.

## 2.1 పరిచయం

" ధన మూల మిదం జగత్ " అనేది ఒక జనరంజక నానుడి. మనదేశంలో నిరక్షరాస్యత శాతం అధికం కాబట్టి, సాధారణ పౌరుని దృష్టిలో ద్రవ్యం అంటే నాణేలు, కరెన్సీ నోట్లు. నిత్యం ఆర్థిక వ్యవహారలలో విరివిగా ఉపయోగించే కరెన్సీ నోట్లు, రూపాయి, ఇతర చిల్లర నాణేలు మాత్రమే అతని దృష్టిలో ద్రవ్యమవుతుంది. నిత్య లావాదేవీలలో వినిమయ మాధ్యమంగా ఉపయోగపడే నాణేలు, నోట్లనే సాధారణ పౌరుడు ద్రవ్యంగా భావించడం పరిపాటి. పేదరికం (తక్కువ స్థాయి తలసరి ఆదాయం), బాంకింగ్ అలవాటు దేశ వ్యాప్తంగా

లేకపోడం కారణంగా సాధారణ పౌరుడి దృష్టిలో ద్రవ్య నిర్వచనం కరెన్సీ నోట్లు, నాణేలకే పరిమితమవుతుంది. అసలు ఆర్థిక శాస్త్రంలో కూడా ద్రవ్య నిర్వచనం క్రమంగా విస్తృతమవుతూ వచ్చింది. ప్రారంభ దశలో వినిమయ మాధ్యమంగా ఉపయోగపడే వాటినే ద్రవ్యంగా పరిగణించడం జరిగింది. అంటే ఏవి వినిమయ మాధ్యమాలుగా ఆర్థిక లావాదేవీలలో సర్వసాధారణంగా అంగీకరింపబడతాయో వాటిని ద్రవ్యంగా పరిగణించడం జరుగుతుంది. ఆర్థిక లావాదేవీలలో వినిమయ మాధ్యమాలుగా సర్వసాధారణంగా అంగీకరింపబడేదే ద్రవ్యం అన్న నిర్వచనం ద్రవ్యపు వినిమయ మాధ్యమ (medium of exchange) విధిని వక్కాణించే నిర్వచనం. కాని ఒక ఆర్థిక వ్యవస్థలో బ్యాంకు తదితర విత్త సంస్థల అభివృద్ధితోపాటు ద్రవ్య నిర్వచనం, ద్రవ్యపు విధులు, ద్రవ్య నిల్వ కొలమానాలు క్రమంగా పరిణామం చెంది ప్రస్తుత స్థితిని చేరు కున్నాయి. స్వతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశంలో ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి కృషి కారణంగా ఆర్థిక వ్యవస్థలో ఆర్థికాభివృద్ధితో పాటు బాంకింగ్ మరియు ఫైనాన్స్ రంగ అభివృద్ధి సత్వరంగా జరుగుతూ వస్తున్నది. ఫైనాన్స్ రంగ అభివృద్ధితోపాటు " సమీప - ద్రవ్యాల " (near - money) ప్రాముఖ్యత కూడా పెరుగుతూ వచ్చి ద్రవ్య కొలమానాలలో చేర్చ తగ్గ అంశాలు కూడా ఎక్కువవుతూ వచ్చాయి. ఆర్థిక వేత్త డేవిడ్ హ్యూమ్ (David Hume) మొదలుకొని కేన్స్ (Keynes) వరకూ, ఆ తరువాత ప్రస్తుత కాలంలో మిల్టన్ ఫ్రీడ్‌మెన్ (Milton Friedman) వరకూ ద్రవ్యపు ఉనికి వలన తలెత్తిన వివిధ అంశాలు, సమస్యలు వివాదాలపై చర్చ విస్తృతంగా కొనసాగుతూ వచ్చింది. ద్రవ్యాన్ని వినిమయ మాధ్యమంగా (సంఘాలు) ఉపయోగించడం మొదలు పెట్టినప్పటి నుండి సమాజంలో అంతకు మునుపు వాడుకలో ఉండే వస్తుమార్పిడి వ్యవస్థలోని అనేక లోపాలు, అసమర్థతలు, అసౌకర్యాలు నివారింపబడ్డాయి. యూనిట్ ఆఫ్ ఎకౌంట్‌గా, వినిమయ మాధ్యమంగా వాయిదా పడ్డ చెల్లింపుల ప్రమాణాలుగా, విలువ నిధిగా ద్రవ్యపు విధులు (functions of money) గుర్తింప బడ్డాయి. వస్తు వినిమయ వ్యవస్థలో వస్తువులకు, వస్తువులకు మధ్య వినిమయం (exchange) జరిగితే, ద్రవ్య వ్యవస్థలో ద్రవ్యం వినిమయ మాధ్యమంగా, సాధారణీకరించిన కొనుగోలు శక్తి (generalised purchasing power) గా రూపొందించింది. అంటే ద్రవ్యం కొంతమేరకు వస్తువుల సేవలపై అధికారాన్ని (command over goods and services) సూచిస్తుంది. అయితే ద్రవ్యం కేవలం యూనిట్ ఆఫ్ ఎకౌంట్ వినిమయ మాధ్యమంగా మాత్రమే ఉండివుంటే ద్రవ్యం చుట్టూ గత ఎభై ఏళ్ళుగా విస్తృత చర్చలు, అభిప్రాయ భేదాలు, వివాదాలు, ఆలోచనా ప్రపంచంలో సంక్షోభాలు ఉండేవి కావు. మేధావుల దృష్టిని, ఆర్థికవేత్తల కృషిని ద్రవ్యం ఆకర్షించేది కాదు. సంప్రదాయ ఆర్థికవేత్తలు (Classical economists) చెప్పినట్లు ద్రవ్యపు పాత్ర కేవలం తటస్థమైనదే (neutral money) అయితే ద్రవ్య ఆర్థిక శాస్త్ర సాహిత్యం విస్తరిల్లేది కాదు. ద్రవ్యానికి సంబంధించి, ద్రవ్య సప్లైను కొలవడం గురించి, ప్రముఖ స్థూల ఆర్థిక చలరాసులపై ద్రవ్య సప్లై మార్పుల ప్రభావం గురించి తీవ్ర వివాదాలు, ద్రవ్య ఆర్థిక శాస్త్ర సాహిత్యంలో చోటు చేసుకున్నాయి. ఈ వివాదాలు ద్రవ్యపు ప్రాముఖ్యతను స్పష్టం చేశాయి. అసలు ఏ అంశాలను ద్రవ్య కొలమానంలో ఉంచాలి అన్నది ఇంకా వివాదాంశమే. ఈ నేపథ్యంలో ద్రవ్య నిల్వ లేక ద్రవ్య సప్లై కొలమానాలను ఈ యూనిట్‌లో వివరంగా తెలుసుకుందాం.

## 2.2 ద్రవ్య నిల్వ కొలమానాలు

భారతదేశంలో కేంద్ర బాంకు అయిన రిజర్వ్ బాంక్ ఆఫ్ ఇండియా (ఆర్.బి.ఐ.) ద్రవ్య నిల్వలకు సంబంధించి విపులమైన దత్తాంశాన్ని సేకరించి, క్రోడీకరించి తన ప్రచురణల ద్వారా అందజేస్తుంది. రిజర్వ్ బాంకు క్రమం తప్పకుండా ప్రచురించే నాలుగు ద్రవ్య నిల్వ కొలమానాలను ఇప్పుడు తెలుసుకుందాం.

### 2.2.1 సంకుచిత లేదా సంప్రదాయ ద్రవ్య నిల్వ కొలమానం (Narrow or Traditional Measure of Money Supply)

ఈ కొలమానాన్నే రిజర్వ్ బ్యాంకు $M_1$ గా వ్యవహరిస్తుంది. సాంప్రదాయ ఆర్థికవేత్తల దృష్టిలో ద్రవ్య సప్లై కొలమానం ఇదే. అంటే నిత్య ఆర్థిక లావాదేవీలలో వినిమయ మాధ్యమంగా సర్వ సాధారణంగా అంగీకరింపబడే అంశాలే ఈ కొలమానంలోకి వస్తాయి. ఈ కొలమానం ప్రకారం ద్రవ్యపు వినిమయ మాధ్యమపు పాత్ర నొక్కి వక్కాణింపబడుతుంది. సంప్రదాయ ఆర్థిక వేత్తల రచనలో ద్రవ్యపు ఈ మాధ్యమపు పాత్ర అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. వారి ఉద్దేశ్యం ప్రకారం ద్రవ్యం వస్తువులను సేవలను కొనేందుకు ఉపయోగించే మాధ్యమం మాత్రమే. ద్రవ్యాన్ని జనాలు కోరేది వస్తువులు సేవల కొనుగోలుకు మాత్రమే అన్నది ఆ ఆర్థికవేత్తల అభిప్రాయం. $M_1$ ను రిజర్వుబాంకు ఈ క్రింది విధంగా నిర్వచించింది.

$M_1$ = ప్రజల దగ్గర ఉన్న కరెన్సీ + ప్రజల డిపాజిట్ ద్రవ్యం

ప్రజల దగ్గర ఉన్న కరెన్సీ ఈ క్రింది అంశాలను కలిగి ఉంటుంది.

చలామణిలో ఉన్న నోట్లు + చలామణిలో ఉన్న రూపాయి, ఇతర చిన్న నాణేలు - బాంకులలో ఉండే నగదు.

సాధారణ భారతీయుని దృష్టిలో ద్రవ్యం అంటే కరెన్సీ మరియు నాణేలు. నిత్య ఆర్థిక కార్యకలాపాలలో, లావాదేవీలలో ఈ అంశాలే ఉపయోగించుకోవడం జరుగుతుంది.

ప్రజల డిపాజిట్ ద్రవ్యం ఈ క్రింది అంశాలను కలిగి ఉంటుంది.

బాంకులలో ఉండే ప్రజల డిమాండ్ డిపాజిట్లు + రిజర్వ్ బాంక్ ఆఫ్ ఇండియా లో ఉండే ఇతర డిపాజిట్లు.

రిజర్వు బాంకులో ఉండే ఇతర డిపాజిట్లు ఈక్రింది అంశాలను కలిగి ఉంటాయి.

1. క్వాజీ ప్రభుత్వ సంస్థల డిపాజిట్లు
2. రిజర్వు బాంకు ఉద్యోగుల సహకార పరపతి సంఘపు డిపాజిట్లు
3. విదేశీ కేంద్ర బాంకుల నిల్వలు
4. అంతర్జాతీయ ద్రవ్యనిధి నెంబర్ 2 అకౌంట్ లో నిల్వలు.

సూక్ష్మంగా చెప్పుకోవాలంటే $M_1$ లో ప్రముఖంగా ఉండేవి నోట్లు, నాణేలు, చెక్‌బుక్ బాంక్ డిపాజిట్లు. ఇవన్నీ కూడా నిత్య లావాదేవీలలో ఉపయోగించడం జరుగుతుంది. ఒక వస్తువు కొన్నప్పుడు ఆ వస్తువు ధరను నగదు రూపంలో నోట్లు, నాణాల ద్వారా, లేదా చెక్ ద్వారా చెల్లించడం జరుగుతుంది. నోట్లు, నాణేలకు న్యాయబద్ధ ద్రవ్య (legal tender money) స్థాయి ఉండటం వలన ఇవి వాడుకలో సర్వసాధారణంగా అంగీకరింపబడుతాయి.

ఈ సందర్భంగా గుర్తించుకోవలసిన అంశాలు రెండు ఉన్నాయి. ఒకటి, అత్యంత ద్రవ్యత్వ లక్షణం గలిగినవి $M_1$ లోకి వచ్చేవి. రెండు, ద్రవ్యపు వినిమయ మాధ్యమం పాత్రను $M_1$ కొలమానం స్పష్టం చేస్తుంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో $M_1$ లోని పోకడలను తరువాత తెలుసుకొంటాం.

BRAOU

రిజర్వుబాంక్ ప్రచురించే రెండవ కొలమానం $M_2$ అధ్యయనంలో గాని, పరిశోధనలో గాని ఉపయోగించని కొలమానం ఇది. అయినా చర్చ సంపూర్ణత్వం కోసం ఈ కొలమానపు అంశాలను కూడా తెలుసుకుందాం. ఈ దిగువ సమీకరణం $M_2$ ను తెలియజేస్తుంది.

$M_2 = M_1$ + పోస్ట్ ఆఫీసు పొదుపు ఖాతా డిపాజిట్లు.

$M_2$ నిర్వచనం, $M_1$ నిర్వచనం కన్న కొద్దిగా విస్తృతమైనది. వాణిజ్య బాంకులలో పొదుపు ఖాతాలవలెనే పోస్టాఫీసు పొదుపు ఖాతాల నుంచి కూడా ద్రవ్యాన్ని తీసుకుని వస్తు సేవలకొనుగోలుకు వీలు అవుతుంది. కాని సాధారణంగా పోస్టల్ కార్యాలయపు పొదుపు ఖాతాపై చెక్ వ్రాయడం సాధ్యం కాదు. కాబట్టి, $M_1$ కంటే ఈ $M_2$ లోని అంశం తక్కువ ద్రవ్యత్వపు లక్షణము కలిగి ఉంటుంది. కాని, పోస్టాఫీసు పొదుపు డిపాజిట్లను అతి తక్కువ 'సమీప- ద్రవ్యం ' గా భావించవచ్చు.

రిజర్వు బాంకు క్రమం తప్పకుండా ప్రచురించే ద్రవ్య నిల్వ మూడవ కొలమానం $M_3$, $M_1$ తో పోల్చి చూసినప్పుడు $M_3$ ని విశాలమైన ద్రవ్య నిల్వ కొలమానంగా చెప్పుకోవచ్చు. అమెరికాలో చికాగో స్కూలు ఆర్థికవేత్తలు అధ్యయనంలోనూ, పరిశోధనలోనూ $M_1$ కు బదులుగా $M_3$ ని మెరుగైన ద్రవ్య కొలమానంగా భావిస్తారు. $M_3$ ని గురించి తెలుసుకున్న తర్వాత చికాగో ఆర్థికవేత్తలు $M_3$ ని ఎందుకు మెరుగైన కొలమానంగా భావిస్తారో తెలుసుకుందాం.

### 2.2.2 $M_3$ కొలమానం

$M_3$ లోని అంశాలను ఈ దిగువ సమీకరణం తెలియజేస్తుంది.

$M_3 = M_1$ + బాంకులలో ఉండే కాలడిపాజిట్లు.

$M_1$, $M_2$ నిర్వచనాల కన్న $M_3$ విస్తృతమైనది. ఎక్కువ అంశాలను కలిగినది.

చికాగో స్కూలు ఆర్థిక వేత్తలు ద్రవ్య సప్లై $M_3$ కొలమానాన్ని $M_1$ కొలమానం కన్న మెరుగైనదిగా భావిస్తారు. వారి పరిశోధనలలో ద్రవ్య సప్లై కొలమానంగా $M_3$ నే ఉపయోగించారు. $M_3$ ని $M_1$ కన్నా మెరుగైనదిగా భావించడానికి చికాగో ఆర్థికవేత్తలు ఈ దిగువ కారణాలను పేర్కొన్నారు.

1. అర్థ శాస్త్రంలో సమీప ప్రత్యమ్నాయ వస్తువులను ఒకే వస్తువుగా పరిగణించడం ఆమోదింపబడే విషయం. డిమాండు డిపాజిట్లు, కాల డిపాజిట్లు సమీప ప్రత్యామ్నాయాలు. కాబట్టి ద్రవ్య నిల్వ కొలమానంలో డిమాండు డిపాజిట్లతో పాటు కాల డిపాజిట్లు కూడా పరిగణించాలి అనేది చికాగో ఆర్థిక వేత్తల వాదం. అతి తక్కువ కాలంలో అతి స్వల్ప వ్యయంతో కాల డిపాజిట్లను నగదుగా మార్చడం సాధ్యం కాబట్టి కాల డిపాజిట్లను కూడా ద్రవ్య నిల్వ కొలమానంలో గణనలోకి తీసుకురావాలన్నది ఆర్థికవేత్తల వాదన.

2. అమెరికా ఆర్థిక వ్యవస్థ, ద్రవ్య చరిత్ర (American Monetary History) లో $M_3$ లోని పోకడలు జాతీయాదాయపు పోకడలతో ఎక్కువ సహ సంబంధత్వం కలిగి ఉండడము వలన చికాగో ఆర్థిక వేత్తల దృష్టిలో $M_1$ కన్న $M_3$ మెరుగైన ద్రవ్య నిల్వ కొలమానం. ఈ సందర్భంగా గమనించాల్సిన విషయమొకటి వుంది. ద్రవ్య సప్లై మార్పులో స్థూల ఆర్థిక చలాంకరాశులైన జాతీయాదాయం తదితర చలాంకరాశులను ఎలా ప్రభావితం చేస్తుందో అధ్యయనం చేయడం ద్రవ్య ఆర్థిక శాస్త్ర ముఖ్యోద్దేశం. కాబట్టి, జాతీయాదాయ పోకడలతో ఎక్కువ సహ సంబంధం చూపిన $M_3$ ద్రవ్య నిల్వ కొలమానమే మెరుగైన కొలమానమని చికాగో ఆర్థిక వేత్తల వాదం.

రిజర్వు బాంకు ప్రచురించే నాలుగవ ద్రవ్య కొలమానం $M_4$. ఈ దిగువ సమీకరణం $M_4$లోని అంశాలను తెలియజేస్తుంది.

$M_4 = M_3 +$ మొత్తం పోస్టల్ కార్యాలయ డిపాజిట్లు.

ఇది అత్యంత విశాలం. విస్తృతమైన ద్రవ్య నిల్వ కొలమానం. ద్రవ్యత్వ లక్షణాలు ఉన్న అన్నింటిని ద్రవ్య నిల్వ కొలమానంలో భాగాలుగా భావించాలన్న ఆలోచనే ఈ $M_4$ నిర్వచనానికి ఆధారం. రిజర్వు బ్యాంక్ $M_3$ ని సమష్టి ద్రవ్య వనరులుగా ఇంతకుమునుపు వ్యవహరించేది. $M_4$ కొలమానము ఇంకా విస్తృతమైనది. $M_4$ కి కొలమానానికి సారూప్యత కలిగినది. రాడ్ క్లిఫ్ కమిటీ (Radcliffie Committee) నివేదికలోని ద్రవ్యత్వ భావన. ఈ విస్తృత ద్రవ్య నిల్వ కొలమానాలు ద్రవ్యత లక్షణం కలిగిన అన్నింటికి ద్రవ్య నిల్వ కొలమానం పరిగణనలోకి తీసుకోవాలి అన్న భావనను ప్రతిబింబిస్తాయి.

ఇంతకు మునుపు చెప్పుకున్నట్లు రిజర్వుబాంకు ప్రచురణలు పైన వివరించిన నాలుగు ద్రవ్య కొలమానాలను వివరంగా ఇవ్వడం జరుగుతోంది. భారతదేశ ద్రవ్య చరిత్రలో ద్రవ్యోల్బణానికి ఇతర కారకాలతోపాటు ద్రవ్య సప్లై పెరుగుదల రేటు కూడా ఒక ప్రముఖ కారణంగా గుర్తింపబడింది. ద్రవ్యానికి సంబంధించి ద్రవ్యరాశి సిద్ధాంతం ప్రకారం ద్రవ్య సప్లై పెరుగుదల రేటు , జాతీయోత్పత్తి రేటు పెరుగుదలకన్న అధికమైనప్పుడు ద్రవ్యోల్బణం తలెత్తుతుంది. రెండవ పంచవర్ష ప్రణాళిక మధ్యకాలం నుండి భారతదేశంలో ద్రవ్యోల్బణ సమస్య ఉంటూనే వస్తోంది. ఈ సమస్యకు ముఖ్యకారణం ద్రవ్య సప్లై పెరుగుదల రేటు. సాధారణంగా సాంప్రదాయ లేక సంకుచిత ద్రవ్య నిల్వ కొలమానం $M_1$, విశాల లేక చికాగో స్కూలు ద్రవ్య నిర్వచనం $M_3$ లనే విరివిగా వాడటం జరుగుతోంది. కాబట్టి మన దేశ ఆర్థిక వ్యవస్థలు $M_1$, $M_3$ పోకడలను తెలుసుకుందాం.

## 2.3 భారతదేశంలో $M_1$ , $M_3$ పోకడలు

పట్టిక 2.1 లో 1970 – 71–1991–92 కాలంలో $M_1$ , $M_3$ వాటి అంశాలలో పోకడలను విపులంగా ఇచ్చాం. ద్రవ్య నిల్వ కొలమానంలో ఏ అంశాలను చేర్చాలి అన్నది ఇంకా వివాదస్పద అంశమే. కొందరు ఆర్థిక వేత్తలు $M_1$ కొలమానాన్ని సమర్థిస్తే, మరికొందరు $M_3$ కొలమానాన్ని మెరుగైనదిగా భావిస్తారని ఇందుకు ముందే చెప్పుకున్నాం. అయితే విస్తృతంగా వాడబడుతున్న కొలమానాలు $M_1$ మరియు $M_3$ కాబట్టి, భారత ఆర్థిక వ్యవస్థలో 1970–71 – 1991– 92 కాలంలో వీటి పోకడలను పరిశీలిద్దాం. 1970-71 నుండి 1991-92 వరకు ఉన్న ఇరవై ఒక్క ఏళ్ళలో $M_1$ సాలీనా 17.7 శాతము మేరకు వృద్ధి అవుతూ వచ్చింది. ఒక్క 1977-78 సంవత్సరములోనే $M_1$ (రూ. 15,609 కోట్ల నుండి రూ. 14,388 కోట్లకు) తగ్గింది. ఇతర సంవత్సరాలలో $M_1$ పెరుగుతూనే వచ్చింది. $M_1$ పోకడలలో గమనించాల్సిన విషయం ఒకటి ఉంది. 1970-71 నుండి 1987-88 మధ్య 19 సంవత్సరాలలో (1988-89 నుండి 1991-92) $M_1$ వార్షిక వృద్ధిరేటు 18.5 శాతం అంటే 1991 ఆర్థిక సంక్షోభానికి ముందు $M_1$ వృద్ధిరేటు అత్యధికంగా జరిగిందన్నమాట. అంటే ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొనే సంక్షోభానికి ఇతర కారణాలతో పాటు ద్రవ్య నిల్వ వృద్ధి రేటు కూడా తోడు అయిందని చెప్పవచ్చు. అధిక ద్రవ్య సప్లై వృద్ధి రేటు ధరల స్థిరత్వానికి, ఆర్థిక స్థిరత్వానికి హాని కలిగిస్తుందన్నది నిర్వివాదాంశం. ద్రవ్యోల్బణాన్ని చర్చించే యూనిట్‌లో ఈ విషయం విపులంగా చర్చించబడుతుంది.

$M_1$ పోకడలను పైన చెప్పుకొన్నాం. ఇప్పుడు $M_1$ లోని అంశాల పోకడలను చెప్పుకుందాం. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో $M_1$ లో కరెన్సీ అంశం ప్రాధాన్యత కలది అవుతుంది. 1970-71లో $M_1$

లో కరెన్సీ అంశం 59.65 శాతం. అంటే కరెన్సీ అంశం $M_1$ లో అత్యంత ప్రధానమైన అంశం మొత్తం 1970-71 నుండి 1991-92 కాలం వరకు కరెన్సీ శాతం $M_1$ లో 50కి మించే ఉంది. అంటే ద్రవ్య నిల్వ కొలమానంలో కరెన్సీ అంశం అత్యంత ప్రధానంగా ఉంటూ వచ్చింది. ఈ ప్రాధాన్యత రెండు విషయాలను సూచిస్తుంది.

**పట్టిక - 2.1 భారతదేశంలో ద్రవ్య సప్లైలోని పోకడలు (కొత్త శ్రేణులు), 1970-71 ---- 1991-92**

(రూపాయలు కోట్లలో)

| సంవత్సరం | కరెన్సీ | శాతం మార్పు (%) | డిపాజిట్ ద్రవ్యం | శాతం మార్పు(%) | $M_1$ (2+4) | శాతం మార్పు (%) |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1970-71 | 4367 | - | 2954 | - | 7321 | - |
| 1971-72 | 4800 | 9.92 | 3520 | 19.16 | 8320 | 13.65 |
| 1972-73 | 5420 | 12.92 | 4264 | 21.14 | 9684 | 16.38 |
| 1973-74 | 6308 | 16.38 | 4864 | 14.07 | 11172 | 15.37 |
| 1974-75 | 6347 | 0.62 | 5561 | 14.33 | 11907 | 6.58 |
| 1975-76 | 6704 | 5.62 | 6439 | 15.79 | 13143 | 10.38 |
| 1976-77 | 7873 | 17.44 | 7736 | 20.14 | 15609 | 18.76 |
| 1977-78 | 8631 | 9.63 | 5757 | - 25.58 | 14388 | -7.83 |
| 1978-79 | 10212 | 18.32 | 7045 | 22.80 | 17257 | 19.94 |
| 1979-80 | 11687 | 14.44 | 8266 | 17.33 | 19953 | 15.62 |
| 1980-81 | 13464 | 15.20 | 9653 | 16.78 | 23117 | 15.86 |
| 1981-82 | 14492 | 7.64 | 10237 | 6.05 | 24729 | 6.97 |
| 1982-83 | 16659 | 14.50 | 11876 | 16.01 | 28535 | 15.39 |
| 1983-84 | 19553 | 17.37 | 13513 | 13.78 | 33066 | 15.88 |
| 1984-85 | 22664 | 15.91 | 16985 | 25.69 | 39649 | 19.91 |
| 1985-86 | 25168 | 11.05 | 18421 | 8.51 | 43599 | 9.96 |
| 1986-87 | 28585 | 13.58 | 22592 | 22.58 | 51177 | 17.38 |
| 1987-88 | 33650 | 17.72 | 24152 | 6.91 | 57802 | 12.95 |
| 1988-89 | 38415 | 14.20 | 27730 | 14.80 | 66607 | 15.20 |
| 1989-90 | 46300 | 20.50 | 34162 | 23.20 | 81060 | 21.70 |
| 1990-91 | 53087 | 14.07 | 39025 | 14.20 | 92770 | 14.40 |
| 1991-92 | 61232 | 15.30 | 51983 | 33.20 | 114111 | 23.0 |
| వార్షిక సగటు మార్పు (%) | | 16.6 | | 15.3 | | 17.7 |

(మిగిలిన పట్టికను ప్రక్క పేజీలో చూడండి)

BRAOU

| సంవత్సరం | కాల డిపాజిట్లు | శాతం మార్పు (%) | $M_3$ 6+8 | శాతము మార్పు (%) | $M_1$ కరెన్సీలో శాతం | డిపాజిట్ల ద్రవ్య శాతం మార్పు (%) | కాల డిపాజిట్ల శాతం (%) |
|---|---|---|---|---|---|---|---|
| | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1970-71 | 3637 | - | 10958 | - | 59.65 | 40.35 | 33.19 |
| 1971-72 | 4370 | 20.15 | 12690 | 15.81 | 57.69 | 42.31 | 34.44 |
| 1972-73 | 5349 | 22.40 | 15033 | 18.46 | 55.97 | 44.03 | 35.58 |
| 1973-74 | 6399 | 19.63 | 17571 | 16.88 | 56.46 | 43.54 | 36.42 |
| 1974-75 | 7550 | 18.00 | 19451 | 10.73 | 53.30 | 46.70 | 38.80 |
| 1975-76 | 9142 | 21.09 | 22286 | 14.54 | 51.00 | 48.99 | 41.07 |
| 1976-77 | 11671 | 27.64 | 27279 | 22.40 | 50.44 | 49.56 | 42.78 |
| 1977-78 | 18518 | 58.66 | 32906 | 20.63 | 59.99 | 39.87 | 56.28 |
| 1978-79 | 22632 | 22.22 | 39890 | 21.22 | 59.18 | 40.82 | 56.74 |
| 1979-80 | 26848 | 18.63 | 46801 | 17.33 | 58.57 | 41.43 | 57.37 |
| 1980-81 | 32241 | 20.08 | 55358 | 18.28 | 58.24 | 41.76 | 58.24 |
| 1981-82 | 37697 | 16.92 | 62426 | 12.77 | 58.60 | 41.40 | 60.39 |
| 1982-83 | 44333 | 17.60 | 72868 | 16.73 | 58.38 | 41.62 | 60.84 |
| 1983-84 | 52833 | 19.17 | 85899 | 17.88 | 59.13 | 40.87 | 61.51 |
| 1984-85 | 62308 | 17.93 | 101958 | 18.69 | 57.16 | 42.84 | 61.11 |
| 1985-86 | 74739 | 19.95 | 118338 | 16.07 | 57.73 | 42.27 | 63.16 |
| 1986-87 | 89456 | 19.69 | 140633 | 18.84 | 55.86 | 41.14 | 63.61 |
| 1987-88 | 104858 | 17.22 | 162660 | 15.56 | 58.22 | 41.78 | 64.46 |
| 1988-89 | 125478 | 19.7 | 192085 | 18.1 | 57.7 | 41.6 | 65.3 |
| 1989-90 | 149890 | 19.5 | 230150 | 20.2 | 57.1 | 42.1 | 64.9 |
| 1990-91 | 172666 | 11.5 | 265436 | 14.9 | 57.2 | 42.0 | 65.0 |
| 1991-92 | 200913 | 16.3 | 315084 | 18.7 | 53.7 | 45.6 | 63.8 |
| వార్షికసగటు మార్పు (%) | | 24.3 | | 20.8 | | | |

BRAOU

1. భారత ఫైనాన్స్ రంగం ఇంకా అభివృద్ధి చెందవలసి ఉంది. 2. నలభై ఏళ్ళకు పైబడి ఫైనాన్స్ రంగ అభివృద్ధి కొనసాగుతూ ఉన్నప్పటికీ ఇంకా లావాదేవీలు కరెన్సీ ద్వారానే జరుగుతున్నాయి. అయితే బాంకింగ్, ఫైనాన్స్ రంగాలు సత్వరాభివృద్ధి కారణంగా బాంకు డిపాజిటు మొత్తాలు కూడా పెరుగుతూ వస్తున్నాయి. $M_1$

కొలమానంలో డిమాండ్ డిపాజిట్లు 1970-71 లో 40.35 శాతం మాత్రమే. ఏడాది ఏడాదికీ సంబంధించిన మార్పులను విస్మరిస్తే మొత్తం 1970-71 - 1990-91 కాలంలో డిపాజిట్లు వృద్ధి చెందుతూనే ఉన్నాయి. 1991-92 నాటికి డిమాండు డిపాజిట్లు 45.6 శాతానికి చేరుకున్నాయి. పట్టిక 2.1 నుండి డిమాండు డిపాజిట్ల పోకడల గురించి గమనించదగ్గ ఆసక్తికరమైన అంశం ఒకటి ఉంది. 1970-71 నుండి 1975-76 కాలంలో $M_1$ లో డిమాండ్ డిపాజిట్ల సాపేక్ష ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. అయితే ఈ పోకడ 1976-77 నుండి తారుమారయింది. డిమాండ్ డిపాజిట్ల అంశం సుమారు 42 శాతం వద్ద స్థిరపడింది. కాని 1991-92 సంవత్సరంలో డిమాండ్ డిపాజిట్ల శాతం 45.6 కు పెరిగింది. 1991-92లో (పట్టికలో ఆఖరి సంవత్సరం) కరెన్సీ శాతం 53.7 డిమాండు డిపాజిట్ల శాతం 45.6. మొత్తం 1970-71 – 1991-92 కాలాన్ని పరిగణిస్తే కరెన్సీ సగటు వార్షిక వృద్ధి రేటు (15.3) కన్న అధికం. అంటే ఫైనాన్స్ రంగ వృద్ధి కొనసాగినప్పటికీ $M_1$లో కరెన్సీ ప్రాధాన్యత కొనసాగుతూనే ఉంది. విస్తృతమైన, లేదా చికాగో స్కూలు ద్రవ్య నిల్వ కొలమానం $M_3$ లోని పోకడలను తెలుసుకుందాం. మొత్తం 1970-71 - 1991-92 కాలంలో $M_3$ సగటు వార్షిక వృద్ధి రేటు 20.8 శాతం. ఈ శాతం $M_1$ వార్షిక సగటు వృద్ధి రేటు (17.7 శాతం) కన్న చెప్పుకోదగిన మేరకు అధికం. 1970-71 - 1991-92 అధ్యయన కాలంలో కాల డిపాజిట్ల వృద్ధి రేటు (20.8 శాతం), డిమాండు డిపాజిట్ల వృద్ధి రేటు (17.7 శాతం), కరెన్సీ వృద్ధి రేటు (16.6 శాతం) కంటే అధికంగా కొనసాగింది.

$M_3$ లోని అంశాల శాతాల పోకడలు పట్టిక 2.2లో ఇవ్వబడ్డాయి. అధ్యయన కాలంలో కాల డిపాజిట్లు త్వరితగతిన వృద్ధి చెంది $M_3$ లో తమ ప్రాధాన్యతను బాగా పెంచుకున్నాయి. 1970-71లో కరెన్సీ $M_3$ లో అత్యధిక శాతం (39.85). తరువాత స్థానం కాల డిపాజిట్లది (33.19), ఆ తర్వాత స్థానం కరెన్సీది (39.96). అయితే కాల డిపాజిట్ల వృద్ధి త్వరితగతిని కొనసాగిన కారణంగా 1991-92 నాటికి కాల డిపాజిట్లు 63 శాతానికి చేరుకున్నాయి. ఈ సంవత్సరంలో కరెన్సీ శాతం 39.85 నుండి 19.4 శాతానికి పడిపోతే, డిమాండ్ డిపాజిట్ల శాతం 29.96 నుండి 16.5కు పడిపోయింది. అదే కాలంలో కాల డిపాజిట్లు వీటి శాతం 33.1 నుండి 63.0 కు పెరిగింది. $M_1$ లో కరెన్సీ, డిమాండ్ డిపాజిట్లు, టైమ్ డిపాజిట్లు, టైమ్ డిపాజిట్లు –వీటి భాగాలలో మార్పు పరిశీలిస్తే ప్రజల కరెన్సీ నుండి, డిమాండు డిపాజిట్ల నుండి కాల డిపాజిట్లకు మారుతున్నట్లు స్పష్టం అవుతుంది. ఈ మార్పుకు కారణాలు ఏమిటి ? బ్యాంకింగ్ ఫైనాన్స్ రంగ సత్వర అభివృద్ధి కారణంగా ప్రజలలో బ్యాంకింగ్ అలవాటు విస్తృత మవుతూ వస్తోంది. బాంకు డిపాజిట్ల ద్వారా ధనానికి రక్షణే కాకుండా ధనంపై వడ్డీ ఇతర రూపాలలో ప్రతిఫలాలు వస్తాయని ప్రజలు గ్రహిస్తున్నారు. పై పోకడలకు బ్యాంకింగ్ అలవాటు అధికమవుతూ రావడం ఒక కారణం. కాల డిపాజిట్లు త్వరితగతిని పెరగడానికి కారణం ఏమిటి ? కరెన్సీ, డిమాండ్ డిపాజిట్లు, ధన రూపేణా ప్రతి ఫలాలను ఇవ్వవు. అందుకే వాటిని వడ్డీ ఇవ్వని ఫైనాన్స్ ఆస్తులు (non - interest yielding financial assets) గా వ్యవహరిస్తారు. కాని వాటితో పోల్చి చూస్తే కాల డిపాజిట్లు వడ్డీ ఆదాయాన్ని అందజేస్తాయి. కరెన్సీ డిమాండు డిపాజిట్లకు ద్రవ్య లక్షణం (liquidity attribute) మెండుగా ఉన్నప్పటికీ అది ధనరూపేణా ప్రతిఫలాలను ఇవ్వవు. ఈ కారణంగా ప్రజలు క్రమేణా కాల డిపాజిట్లు అంటే మోజు చూపుతున్నారు. అయితే సాపేక్షికంగా కాల డిపాజిట్లు అధిక వృద్ధి రేటుకు పైన చెప్పిన ప్రతి ఫలం కారణమే కాకుండా ఇంకేమైనా కారణం వుందా ? భారతదేశంలో స్వతంత్రం వచ్చిన తర్వాత ప్రణాళికా బద్ద ఆర్థికాభివృద్ధి కొనసాగుతూ వచ్చింది. ఆర్థికాభివృద్ధితోపాటు ఆర్థిక అసమానతలు కూడా ఎక్కువ అవుతూ ఉన్నాయి. అంటే ఆదాయపు పంపిణీలో, ఆస్తి పంపిణీ (income and wealth distribution) లో అసమానతలు పెరుగతూ, పొదుపు రేటు కూడా పెరుగుతూ వచ్చింది. ఈ పొదుపు రేటులో పెంపుదలను కాల డిపాజిట్ల పెరుగుదల ప్రతిబింబిస్తుంది. ఈ సందర్భంగా

BRAOU

గమనించాల్సిన అంశం మరొక్కటి వుంది. రెండవ పంచవర్ష ప్రణాళిక మధ్య కాలము నుండి మన ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం చోటు చేసుకుంది. ద్రవ్యోల్బణ కాలంలో కరెన్సీ, డిపాజిట్లు వాస్తవ విలువలను కోల్పోతాయి. అందుచేత నగదు ప్రతిఫలం వచ్చే కాల డిపాజిట్ల పై మోజు పెరుగుతుంది. కాల డిపాజిట్ల సాపేక్ష అధిక వృద్ధి రేటుకు ఇది కూడా ఒక కారణమని చెప్పవచ్చు.

**పట్టిక - 2.2 : $M_3$ లోని పోకడలు 1970-71 – 1991-92 : $M_3$ లోని అంశాలు - శాతాలు**

| సంవత్సరం (మార్చినెల ఆఖరి శుక్ర వారంలో | కరెన్సీ | డిమాండు డిపాజిట్లు | కాల డిపాజిట్లు | $M_3$ (2+3+4) |
|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) |
| 1970-71 | 39.85 | 29.96 | 33.19 | 100.00 |
| 1971-72 | 37.83 | 27.74 | 34.44 | 100.00 |
| 1972-73 | 36.05 | 28.36 | 35.58 | 100.00 |
| 1973-74 | 35.90 | 27.68 | 36.42 | 100.00 |
| 1974-75 | 32.62 | 28.58 | 38.82 | 100.00 |
| 1975-76 | 30.08 | 28.89 | 41.02 | 100.00 |
| 1976-77 | 28.86 | 28.36 | 42.78 | 100.00 |
| 1977-78 | 26.23 | 17.43 | 56.28 | 100.00 |
| 1978-79 | 25.60 | 17.66 | 56.74 | 100.00 |
| 1979-80 | 24.97 | 17.66 | 57.37 | 100.00 |
| 1980-81 | 24.32 | 17.44 | 58.24 | 100.00 |
| 1981-82 | 23.21 | 16.40 | 60.39 | 100.00 |
| 1982-83 | 22.86 | 16.30 | 60.84 | 100.00 |
| 1983-84 | 22.76 | 15.73 | 61.51 | 100.00 |
| 1984-85 | 22.23 | 16.66 | 61.11 | 100.00 |
| 1985-86 | 21.27 | 15.57 | 63.16 | 100.00 |
| 1986-87 | 20.33 | 16.06 | 63.61 | 100.00 |
| 1987-88 | 20.69 | 14.85 | 64.66 | 100.00 |
| 1988-89 | 20.00 | 14.04 | 65.3 | 100.00 |
| 1989-90 | 20.00 | 14.8 | 64.9 | 100.00 |
| 1990-91 | 20.00 | 14.7 | 65.0 | 100.00 |
| 1991-92 | 19.04 | 16.5 | 63.0 | 100.00 |

BRAOU

## 2.4 సారాంశం

ఈ యూనిట్‌లో ద్రవ్య సప్లై కొలమానాలను చెప్పుకున్నాం. సంప్రదాయ ద్రవ్య సప్లై కొలమానం $M_1$ కరెన్సీని డిపాజిట్ ద్రవ్యాన్ని కలిగి యుంటుంది. ఈ కొలమానం ప్రకారం ద్రవ్య వినిమయ మాధ్యమపు విధి ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. డిమాండు డిపాజిట్లతో పాటు కాల డిపాజిట్లను కూడా కరెన్సీకి కలిపితే వచ్చేది $M_1$ కొలమానం . దీన్ని విశాల లేక చికాగో స్కూలు ద్రవ్య కొలమానంగా వ్యవహరిస్తారు. భారతదేశంలో అధిక ద్రవ్య సప్లై పెరుగుదల ద్రవ్యోల్బణ సమస్యకు ముఖ్యకారణంగా చెప్పుకున్నాం. ద్రవ్య కొలమానాలు $M_1$ ,$M_3$ లలో ఏది మెరుగైనదన్న అంశం ఇంకా వివాదాస్పదమైనదే అని గుర్తుంచుకోవాలి.

## 2.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 40 పంక్తులలో జవాబులిమ్ము**

1. ద్రవ్య సప్లై ముఖ్య కొలమానాలను వివరించండి.
2. $M_3$ కొలమానాన్ని $M_1$ కొలమానం కంటే మెరుగైనదిగా భావించడానికి గల కారణాలను వివరించండి.
3. భారతదేశంలో 1970-71 తరవాత ద్రవ్య సప్లై పోకడలను వివరించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 20 పంక్తులలో జవాబులిమ్ము**

1. $M_1$ ను ద్రవ్య సప్లై కొలమానంగా వివరించి, ఈ కొలమానపు పరిమితులను వివరించండి.
2. ద్రవ్యపు విధులను వివరించండి.
3. కరెన్సీలోని అంశాలను వివరిస్తూ , భారతదేశంలో కరెన్సీ భాగపు పోకడలను తెలుపండి.

## 2.6 సంప్రదింపు గ్రంథాలు


1. Suraj B. Gupta, *Monetary Economics.*
2. A. Vasudevan, " Money Stock and its Components in India, 1950-51 to 1979 - 80 : A Statistical Account ", *Indian Economic Journal,* July - September, 1980.
3. V. Lakshmana Rao, *Essay an Indian Economy,* (New Delhi : Ashish Publishing House, 1994) pp.73-90.
4. M. Friedman, " Quantity Theory of Money - A Restatement ", in M. Friedman (ed), *Studies in Quantity Theory of Money,* (University of Chicago Press, 1956).
5. RBI , *Report on Currency and Finance,* different years.


## 2.7 భావనలు

**ద్రవ్యం (Money) :** నిత్య ఆర్థిక వ్యవహారాలలో, లావాదేవీలలో వినిమయ మాధ్యమంగా ఉపయోగ పడేది. ద్రవ్యానికి సంబంధించి ఈ భావన సంప్రదాయ ఆర్థిక వేత్తల అభిప్రాయం. ఈ భావనను విస్తృత అర్థాన్నిస్తూ ద్రవ్య కొలమానాలను తదనుగుణంగా నిర్వచించడం జరిగింది.

BRAOU

**ద్రవ్యత్వం (Liquidity) :** ఎంత సులభంగా ఒక ఆస్తి (asset) ని (కనీస వ్యయంతో - కాలరూప, ధనరూప వ్యయాలు) నగదు లోకి మార్చ సాధ్యమో అంత ద్రవ్యత్వ ఆస్తి కలిగి యుంటుంది. నగదు అత్యంత ద్రవ్యత్వం కలిగిన ఆస్తి అయితే, స్థిరాస్తి అయిన ఇల్లు అతి తక్కువ ద్రవ్యత్వం కలిగిన ఆస్తి.

**ద్రవ్య సప్లై (Money supply ) :** ద్రవ్యంలో చేర్చదగిన అన్ని అంశాల మొత్తం ద్రవ్య సప్లై అవుతుంది.

**ద్రవ్యోల్బణం (Inflation ) :** సాధారణ ధరల స్థాయిలో చెప్పుకోదగిన పరిమాణంలో కొనసాగే పెరుగుదలను ద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు.

**ద్రవ్యరాశి సిద్ధాంతం (Quantity theory of money) :** ద్రవ్య సప్లై పెరుగుదల రేటు, జాతీయోత్పత్తి పెరుగుదల రేటు కన్న అధికమైనప్పుడు ద్రవ్యోల్బణ సమస్య తలెత్తుతుందని చెప్పే సిద్ధాంతం.

## 2.8 పదకోశం

| | | |
|---|---|---|
| ద్రవ్య సప్లై లేక ద్రవ్య నిల్వకొలమానాలు | - | Measures of money supply |
| నగదు | - | Cash |
| కరెన్సీ (నోట్లు , నాణేలు) | - | Currency (notes & coins) |
| ద్రవ్యరాశి సిద్ధాంతం | - | Quantity theory of money |
| సంకుచిత | - | Narrow |
| విశాల | - | Broad |
| సంప్రదాయ ఆర్థిక వేత్తలు | - | Classical Economists |
| న్యాయ బద్ధ ద్రవ్యం | - | Legal tender money |
| ద్రవ్యత్వం | - | Liquidity |
| ఆర్‌బిఐతో ఉండే ఇతర డిపాజిట్లు | - | Other deposits with the RBI |
| స్థూల ఆర్థిక చలరాశులు | - | Macro economic variables |
| వడ్డీ ఇవ్వని ఫైనాన్సియల్ ఆస్తులు | - | Non-interest yielding financial assets |
| డిమాండు డిపాజిట్లు | - | Demand deposits |
| కాల డిపాజిట్లు | - | Time deposits |
| స్థూల ఆర్థిక నమూనాలు | - | Macro economic models |
| సమీప/దగ్గర ద్రవ్యం | - | Near money |

**- ఆచార్య వి. లక్ష్మణ రావు**

BRAOU

# భాగం -3 : ద్రవ్య సప్లయ్‌కి సంబంధించి H సిద్ధాంతం- ద్రవ్య గుణకం

**విషయక్రమం**


3.0 ఉద్దేశాలు

3.1 పరిచయం

3.2 ద్రవ్య సప్లైకి సంబంధించి H సిద్ధాంతం

3.3 భారత దేశంలో ద్రవ్య గుణక పోకడలు

3.4 సారాంశం

3.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

3.6 సంప్రదింపు గ్రంథాలు

3.7 భావనలు

3.8 పదకోశం


## 3.0 ఉద్దేశాలు

ద్రవ్య సప్లై మార్పులు జాతీయాదాయం, సాధారణ ధరల స్థాయి వంటి ప్రముఖ స్థూల ఆర్థిక చలరాశులపై తమ ప్రభావాన్ని చూపుతాయన్న విషయాన్ని ఇంతకు ముందే చెప్పుకున్నాం. అంటే ద్రవ్య సప్లై సిద్ధాంతాలను తెలుసుకోవడం చాలా అవసరం. ద్రవ్య సప్లైకి సంబంధించి H సిద్ధాంతాన్ని విపులంగా చెప్పుకోవడం ఈ యూనిట్ ముఖ్య లక్ష్యం. ఈ సిద్ధాంతంలో ప్రముఖ అంశమైన ద్రవ్య గుణకంను కూడా తెలుసుకోవడం ఈ యూనిట్ మరొక లక్ష్యం. ద్రవ్య సప్లైకి సంబంధించి సిద్ధాంతపరంగా పలు అంశాలను తెలుసుకోవడం ఈ యూనిట్ ముఖ్యోద్దేశం. భారతదేశంలో ద్రవ్య గుణకపు పోకడలను కూడా చెప్పుకుందాం.

BRAOU

## 3.1 పరిచయం

స్థూల ఆర్థిక నమూనాల (macroeconomic models) లో ద్రవ్య సప్లైని బాహ్యాంశం (exogenous) గా పరిగణించినా, ద్రవ్యానికి సంబంధించిన సిద్ధాంత రూపకల్పనలో ద్రవ్య నిల్వను నిర్ణయించే అంశాలును తెలుసుకోవడం అత్యంత అవసరం. ద్రవ్య సప్లై నిర్ధారణలో కేంద్ర బ్యాంక్ అంటే రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రముఖ పాత్ర వహించినా వాణిజ్య బ్యాంకులు, సాధారణ ప్రజలు కూడా కొంత వరకు ద్రవ్య సప్లైని ప్రభావితం చేస్తాయి. ద్రవ్య సప్లైని నిర్ణయించడంలో వివిధ సంస్థల పాత్రను తెలుసుకోవడం అవసరం. ద్రవ్య సప్లై సిద్ధాంతాన్ని విపులీకరించే ముందు రెండు రకాల ద్రవ్యాల మధ్య తేడాను గుర్తించాలి. రెండు రకాల ద్రవ్యాలలో మొదటిది సాధారణ ద్రవ్యం, రెండవది ఆధార (base) లేక అత్యంత శక్తివంతమైన ద్రవ్యం (high powered money). ఇంతకు ముందు యూనిట్‌లో ద్రవ్య కొలమానాల గురించి చెప్పుకున్నాం. ద్రవ్య సప్లైకి సంబంధించి అత్యంత శక్తివంతమైన లేదా ఆధార ద్రవ్యం అతి ముఖ్యమైనది. ఈ యూనిట్ విశ్లేషణలో ద్రవ్య సప్లై కొలమానంగా $M_1$ ను వాడతాం. $M_1$ లో ఆర్.బి.ఐ.తో ఉండే ఇతర డిపాజిట్లను

విస్మరిస్తాం. రాశి ప్రకారం చూస్తే $M_1$ లో ఇది విస్మరించ దగ్గది. $M_1$ ని "M" గా, డిమాండ్ డిపాజిట్లను DD గా భావిస్తే సప్లై సిద్ధాంత విశ్లేషణలో

$$M = C + DD \qquad (3.1)$$

పై సమీకరణంలోని 'C' కరెన్సీని తెలుపుతుంది. కరెన్సీ ని డిమాండు డిపాజిట్లను కలుపగా ద్రవ్య నిల్వ వస్తుందని పై సమీకరణం తెలియజేస్తుంది.

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఇక నుండి ఆర్.బి.ఐ. అని సంక్షిప్త రూపాన్నే వాడతాం), భారత ప్రభుత్వం కలసి ఆధార ద్రవ్యాన్ని ఉత్పత్తి చేస్తాయి. ఆధార ద్రవ్యాన్ని H గా సూచిద్దాం. ఆర్.బి.ఐ. ఈ ఆధార ద్రవ్యాన్నే రిజర్వ్ ద్రవ్యంగా వ్యవహరిస్తుంది. ఆధార ద్రవ్యాన్ని ఈ దిగువ సమీకరణం తెలియజేస్తుంది.

$$H = C + R \qquad (3.2)$$

పై సమీకరణంలో ఇంతకుముందు వలెనే, ఆర్.బి.ఐ. తో ఉండే ఇతర డిపాజిట్లను, విశ్లేషణను సరళీకృతం చేయడాన్ని విస్మరించడం జరిగింది. సమీకరణం (1), (2) లను పోల్చి చూస్తే M లోనూ, H లోనూ కూడా పదం C ఉండేదే. రెండు సమీకరణాలకు తేడా వచ్చేది రెండవ పదం కారణంగానే. ద్రవ్య సప్లై సమీకరణంలో డిమాండు డిపాజిట్లు అనే పదం ఉంటే ఆధార ద్రవ్యంలో బ్యాంకుల ద్రవ్య రిజర్వుల (R) పదం ఉంది. ఈ నగదు నిల్వలనే R గా సూచించాం. ద్రవ్య సప్లై సిద్ధాంతంలో ఈ తేడా చాలా కీలకమైనది. డిమాండు డిపాజిట్లను తయారు చేసే బ్యాంకుల ఉనికి వలన ఈ తేడా ఉత్పన్నమవుతుంది. డిమాండు డిపాజిట్లను కూడా ద్రవ్యంగా భావిస్తారన్నది ఈ సందర్భంగా స్ఫురణకు తెచ్చుకోవలసి ఉంది. కాని DD లను ఉత్పత్తి చేయడంలో బ్యాంకులు నగదు రిజర్వులను (R) కలిగి ఉండాలి. కాని ఈ నగదు రిజర్వు ఆధార ద్రవ్యంలో ఒక భాగం. భిన్న నిల్వ పద్ధతి (fractional reserve system) లో డిమాండు డిపాజిట్లు, బ్యాంకు నగదు నిల్వలను ఒక గుణకం పెట్టి గుణిస్తే వచ్చేవి. కాని బ్యాంకుల నగదు నిల్వలు H లో ఒక భాగం. ఈ సంబంధమే H కి అత్యంత శక్తివంతమైన గుణాన్ని ఇస్తాయి. బ్యాంకులు డిమాండ్ డిపాజిట్లను సృష్టించడంలో నగదు నిల్వలు ఆధారం అవుతాయి. ఈ కారణంగానే H ని ఆధార ద్రవ్యం (base money) అని కూడా వ్యవహరిస్తారు.

## 3.2 ద్రవ్య సప్లైకి సంబంధించి H సిద్ధాంతం

ద్రవ్య సప్లై నిర్ధారణను తెలిపే ద్రవ్య సప్లై సిద్ధాంతానికి సంబంధించి H ప్రముఖ పాత్ర వహిస్తుందన్న అంశాన్ని దాదాపు అందరు ద్రవ్య ఆర్థిక వేత్తలు ఒప్పుకునే విషయమే. అందుకనే ద్రవ్య సప్లై సిద్ధాంతాన్ని H సిద్ధాంతంగా వ్యవహరిస్తారు. ఎందుకలా వ్యవహరిస్తారో తర్వాత తెలుసుకుంటాం. కాని ఈ సిద్ధాంతాన్నే ద్రవ్య సప్లయ్ యొక్క ద్రవ్య గుణక సిద్ధాంతం (money multiplier theory of money supply) అని కూడా వ్యవహరిస్తారు. కాని ఈ సిద్ధాంతాన్ని H సిద్ధాంతంగానే ఈ యూనిట్‌లో చెప్పుకుంటాం. ఈ సిద్ధాంతంలో H పాత్ర కీలకమైనది. కాబట్టి దీనిని H సిద్ధాంతంగా చెప్పడమే ఉచితం. H కొరకు డిమాండు, H సప్లై కీలకమైన పాత్ర వహిస్తాయి. కాబట్టి, ఈ సిద్ధాంతాన్ని H సిద్ధాంతంగా వ్యవహరించడమే సబబు. ఈ యూనిట్‌లో ఈ సిద్ధాంతాన్ని సరళ రీతిలో ముఖ్య అంశాలను విడవకుండా విపులీకరిస్తాం. విశ్లేషణా సౌలభ్యం కొరకు H సప్లై (H.S.) ని ద్రవ్య విధానం (monetary policy) నిర్ణయిస్తుందని అనుకుందాం.

ఇలా అనుకోవడం వలన

$$H.S. = \overline{H} \quad \text{------------(3.3)}$$

పై సమీకరణములో H పైన గీత H బాహ్యాంశంగా ఇవ్వబడిందని తెలియజేస్తుంది. H కొరకు డిమాండ్ కొంత మేరకు ప్రజల నుండి (C), ఇతర మేరకు బ్యాంకుల నుండి (R) వస్తుందని ఇంతకు ముందే చెప్పుకున్నాం. H సిద్ధాంతంలో H కొరకు డిమాండ్‌కు, 'మూలాలు' "C" మరియు "R". "C" కోరకు డిమాండ్ (C) M లో భాగంగా M ను నిర్ణయించే కారకాలే "C" ని కూడా నిర్ణయిస్తాయి. ఆదాయ స్థాయి, వడ్డీ రేటు వంటివి M కొరకు డిమాండును నిర్ణయిస్తాయి అన్నది పాఠకులకు తెలిసిన అంశమే. ఈ కారకాలు D D కొరకు డిమాండు($DD^D$)ను కూడా నిర్ణయిస్తాయి. ఈ కారణముగా $C^D$, $DD^D$ లు సహసంబంధం కలిగి ఉంటాయి. అంటే $C^D$, $DD^D$ లు ఒక అనుపాతంలో ఉంటాయి అని చెప్పవచ్చు. ఈ అనుపాత సంబంధాన్నే దిగువ సమీకరణం ద్వారా చెప్పుకోవచ్చు.

$$C^D = A.DD \quad \text{------------- (3.4)}$$

$C^D$, DD నిష్పత్తి A అవుతుంది. ఈ A ని ప్రజల దృష్టిలో వాంఛనీయమైన C - DD నిష్పత్తిగా చెప్పుకోవచ్చు. డిమాండు డిపాజిట్లకు బదులు ప్రజల కరెన్సీ పై ఎక్కువ మోజు చూపితే 'A' విలువ అధికంగా ఉంటుంది. బ్యాంకింగ్ అలవాటు విస్తరిల్లుతూ కరెన్సీ నుండి డిమాండు డిపాజిట్లకు ఆసక్తిని మరలిస్తే 'A' తగ్గుతూ ఉంటుంది. అంటే కరెన్సీ, డిమాండు డిపాజిట్లకు సంబంధించి ప్రజల అభిరుచులు మారుతూ ఉంటే 'A' మారుతూ ఉంటుంది. కరెన్సీకి, డిమాండు డిపాజిట్లకు సంబంధించి సాపేక్ష లాభాలు, సాపేక్ష వ్యయాలు పబ్లిక్ అభిరుచులను ప్రభావితం చేస్తాయి. ఆ వ్యయాలు లాభాలలో మార్పులు ప్రజల అభిరుచులలోను 'A' విలువ లోను మార్పులను తీసుకొస్తాయి. అంటే 'A' లో మార్పులు దీర్ఘకాలం లోను, స్వల్ప కాలంలోను కూడా సంభవిస్తాయి. కాబట్టి, "A" ని ప్రవర్తనా నిష్పత్తి (behavioural ratio) గా చెప్పుకోవచ్చు. కాని H సిద్ధాంతాన్ని విపులీకరిస్తున్నపుడు విశ్లేషణా సౌలభ్యం కోసం "A" స్థిరంగా ఉంటుందన్న ప్రమేయం చేస్తాం.

బ్యాంకుల నగదు నిలవల కొరకు డిమాండు ($R^D$) గురించి ఏమి చెప్పగలం ? సాధారణంగా బ్యాంకుల నగదు రిజర్వులను రెండు తరగతుల క్రింద విభజిస్తాం. ఒకటి కావలిసిన నిల్వలు (required reserves), రెండవది అదనపు రిజర్వులు (excess reserves). కావలసిన రిజర్వులు చట్టరిత్యా బ్యాంకులు, రిజర్వు బ్యాంక్‌తో ఉంచాల్సిన రిజర్వులు. ఇందుకు సంబంధించి బ్యాంకుల విచక్షణకు తావులేదు. చట్టం ప్రకారంగా ఈ రిజర్వు ఎంత ఉండాలి అనేది నిర్ణయించే అధికారం రిజర్వు బ్యాంకుకు ఉంది. ప్రతి షెడ్యుల్డ్ బ్యాంకు ఈ రిజర్వు నిబంధనకు కట్టుబడాల్సి వుంది. కావలసిన రిజర్వులకు (RR) పై బడిన రిజర్వులను అదనపు రిజర్వులు (ER) అని వ్యవహరిస్తారు. అదనపు రిజర్వులను బ్యాంకులో తమతో ఉన్న నగదుగా కాని (cash on hand), రిజర్వు బ్యాంక్‌లో బాలెన్స్‌గా కాని కలిగి వుండవచ్చు. ER ను బ్యాంకులు స్వచ్ఛందంగానే కలిగి ఉంటాయి. బ్యాంకుల పై వచ్చే నగదు డిమాండు కొరకు బ్యాంకులు వీటిని కలిగి ఉంటాయి. $ER^D$ (అదనపు నిల్వల కొరకు డిమాండు) బ్యాంకుల డిమాండు, కాల డిపాజిట్లపై ఆధారపడి ఉంటాయి. కాబట్టి మొత్తం బ్యాంకుల నగదు రిజర్వులు (R) బ్యాంకుల డిమాండు, కాల డిపాజిట్లపై ఆధారపడి ఉంటాయి. కాబట్టి మొత్తం బ్యాంకుల నగదు రిజర్వులు (R) బ్యాంకుల డిమాండు, కాల డిపాజిట్లపై ఆధారపడి ఉంటాయి.

చేసుకుందాం. బాంకుల నగదు రిజర్వులకు, బ్యాంకుల మొత్తం డిపాజిట్లకు మధ్య అనుపాత సంబంధం ఉంటున్నదని ఈ ఉప కల్పన తెలుపుతుంది. ఈ అనుపాత సంబంధాన్ని దిగువ సమీకరణం తెలియజేస్తుంది.

$$RD = B.D \qquad \text{- - - - - - - - - - (3.5)}$$

పై సమీకరణంలో రిజర్వులకు, డిపాజిట్లకు మధ్య నిష్పత్తి 'B' అవుతుంది. ఈ నిష్పత్తిని రిజర్వు - డిపాజిట్ల నిష్పత్తిగా వ్యవహరిస్తాం.

H సిద్ధాంత విశ్లేషణ నమూనాలో భాగమైన డిపాజిట్లు రెండు రకాలు : 1. డిమాండు డిపాజిట్లు (DD), 2. కాల డిపాజిట్లు (TD). ద్రవ్య నిల్వ సంకుచిత నిర్వచనం (ఈ సిద్ధాంత విపులీకరణలో ఈ కొలమానాన్నే వాడుతున్నాం) లో DD ద్రవ్య నిల్వలో భాగం అవుతుంది. TD ద్రవ్య నిల్వలో భాగం కాదు. ద్రవ్య సప్లై సిద్ధాంతం మన లక్ష్యం కాబట్టి TD ని ఎలా భావించాల్సి వుంటుందో నిర్ణయించాల్సి ఉంది. మొత్తం బ్యాంకు డిపాజిట్లలో ఎంతమేరకు డిమాండు డిపాజిట్లు, ఎంతమేరకు కాల డిపాజిట్లు అన్న అంశాన్ని నిర్ణయించేది ప్రజల అభిరుచులు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని TD,DD కి మధ్య అనుపాత సంబంధం వుంటుందని ఉపకల్పన చేసుకుందాం. ఈ ఉపకల్పన ఆధారంగా ఈ దిగువ సమీకరణాన్ని వ్రాయవచ్చు.

$$TD^D = N.DD \qquad \text{- - - - - - - - - - - (3.6)}$$

పై సమీకరణంలో TD, DD ల మధ్య నిష్పత్తి " N " అవుతుంది. ఈ నిష్పత్తిని కాల డిపాజిట్ల నిష్పత్తిగా వ్యవహరిస్తారు. మొత్తం డిపాజిట్లు, డిమాండు డిపాజిట్లు, టైమ్ డిపాజిట్ల మొత్తానికి సమానం కాబట్టి (అంటే D = DD+TD ) సమీకరణం (6)ను ఈ దిగువ విధంగా వ్రాయవచ్చు.

$$TD^D = N.DD$$

$$D = DD + TD$$

$$= DD + N.DD$$

$$= DD(1+N)$$

$$D = (1+N)\,DD \qquad \text{- - - - - - - - - - - - (3.7)}$$

సమీకరణాలు (5) మరియు (7) ఆధారంగా ఈ దిగువ సమీకరణాన్ని వ్రాయవచ్చు.

$$RD^D = B.(1+N)\,DD \qquad \text{- - - - - - - - - - - - (3.8)}$$

$H^D = C^D + RD$ కాబట్టి సమీకరణాలు (4), (8) ఆధారంగా ఈ దిగువ సమీకరణాన్ని వ్రాయవచ్చు.

$$H^D = A.DD + B.(1+N)\,DD$$

$$= [A + (1+N)B]\,DD \qquad \text{- - - - - - - - - - - - (3.9)}$$

అంటే H ని DD మరియు మూడు ప్రవర్తనా నిష్పత్తులపై ఆధారపడే ప్రమేయంగా చెప్పవచ్చు. H మార్కెట్ సమతౌల్యంలో ఉండటానికి $H^D = H^N$ అవ్వాలి. అంటే సమీకరణాలు (3), (9) ఆధారంగా ఈ దిగువ సమీకరణం వస్తుంది.

$$[A + (1+N)B]\,DD = H$$

BRAOU

$$DD = \frac{H}{A+(1+N)B} \qquad (3.10)$$

పై సమీకరణం H పైన A,B,N ప్రవర్తనా నిష్పత్తులపైన ఆధారపడే DD సమతౌల్య విలువను తెలుపుతుంది. ద్రవ్య సప్లై సాహిత్యంలో $\left[\frac{1}{A}+(1+N)B\right]$ ని డిమాండు డిపాజిట్ల గుణకంగా వ్యవహరిస్తారు. కరెన్సీ కొరకు డిమాండు, సప్లై సమతౌల్యంలో ఉన్నాయి అనుకుని సమీకరణాలు (1), (4), (10) ఆధారంగా ఈ దిగువ సమీకరణాన్ని ఉత్పన్నం చేయవచ్చు.

$$M = C+DD$$
$$= A.DD + DD$$
$$= DD(1+A)$$
$$= \frac{1+A}{A+(1+N)B}.H \qquad (3.11)$$

ద్రవ్య సప్లైకి సంబంధించి H సిద్ధాంతాలు కీలకమైన సమీకరణం పైన చెప్పుకున్నది. ఈ సిద్ధాంతం ద్రవ్య సప్లై H పైన A,B,N ప్రవర్తనా నిష్పత్తులపైన ఆధారపడుతుందని చెప్తుతుంది. $\left[\frac{1+A}{A+(1+N)B}\right]$ ని ద్రవ్య గుణకం (money multiplier) గా వ్యవహరిస్తారు. ద్రవ్య గుణకాన్ని 'V'గా సూచిస్తే సమీకరణం (11) ను ఈ దిగువ విధంగా వ్రాయవచ్చు.

$$M = V.H \qquad (3.12)$$

H సిద్ధాంతపు ముఖ్య సందేశాన్ని క్లుప్తంగా వివరించేది పై సమీకరణం. పై సమీకరణపు రూపాన్ని (form) పరిశీలిస్తే ఈ H సిద్ధాంతాన్ని ద్రవ్య గుణకపు ద్రవ్య సప్లై సిద్ధాంతంగా (money - multiplier theory of money supply) తరచు ఎందుకు పరిగణిస్తారో బోధపడుతుంది. పై సమీకరణం ద్వారా తెలిసేదేమిటంటే M ని నిర్ణయించే కారకాలను అర్థవంతంగా రెండు తరగతులుగా విభజించవచ్చు.

1. " H " ని నిర్ణయించే కారకాలు,
2. " V " ని నిర్ణయించే కారకాలు.

పై సమీకరణం సిద్ధాంత దృష్ట్యా ఒక ముఖ్యమైన విధిని నిర్వహిస్తుంది. పోటీ సిద్ధాంతంలో ధర నిర్ణయానికి సంబంధించి వివిధ కారకాలను డిమాండ్ - సప్లయ్ సిద్ధాంతం వర్గీకరించినట్లు పై సమీకరణం ద్రవ్య సప్లయ్‌ని నిర్ణయించే అంశాలను వర్గీకరిస్తుంది. పై సమీకరణంలో ద్రవ్య గుణకం " V " ని నిర్ణయించే సమీప కారణాలను A,B,N అనే ప్రవర్తనా నిష్పత్తులని ఇంతకు ముందే చెప్పుకున్నాం. అలాగే ఆధార ద్రవ్యాన్ని నిర్ణయించేవి కూడా చెప్పుకున్నాం. పై చర్చ ద్వారా తెలిసేదేమిటంటే H నిర్ణయం ప్రముఖంగా, ద్రవ్య విధాన ఆధారం. అంటే ద్రవ్య విధానాన్ని నిర్ణయించే ఆర్.బి.ఐ. పై ఆధారపడుతుంది. ద్రవ్య గుణకం ప్రముఖంగా ప్రవర్తనా నిష్పత్తులపై ఆధారపడుతుంది. స్థూలంగా చెప్పాలంటే H నిర్ధారణ ప్రముఖంగా బాహ్యాంశం (exogenous) అయితే " V " (ద్రవ్య గుణకం) నిర్ధారణ ప్రముఖంగా అంతర్గతం (endogenous). విధాన రూపకల్పనలో పై తేడా ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. " V " అంతర్గతం కాబట్టి, ప్రవర్తనా నిష్పత్తులపై ఆధారపడుతుంది. కాబట్టి " V " నియంత్రణ ఆర్.బి.ఐ. కు సాధ్యం కాదు. ద్రవ్య సప్లై నియంత్రణలో ఆర్.బి.ఐ. H పైనే దృష్టి నిలపాల్సి వుంటుంది. అంటే H ను నియంత్రించడం ద్వారా ఆర్.బి.ఐ. ద్రవ్య సప్లైని నియంత్రించడం సాధ్యపడుతుంది.

H సప్లై తెలిసినప్పుడు ద్రవ్య సప్లై, అందులో ప్రముఖ అంశాల నిర్ణయం ఎలా జరుగుతుందో వివరించడానికి ఈ దిగువ పటం 3-1 ని ఉపయోగించవచ్చు.

BRAOU




పటం - 3.1 : H మార్కెట్ సమతౌల్యం

**జ్యామితీ విశ్లేషణ**

పటం 3-1 క్షితిజాక్షం (horizontal axis) పై డిమాండు డిపాజిట్లను, శీర్షాక్షం (vertical axis) పై ఆధార ద్రవ్యంను కొలవడం జరిగింది. H సప్లై బాహ్యాంశంగా తెలుసునునుకున్నాం. కాబట్టి, $H^D$ ని H కు సమానం అనుకుందాం. దీనిని ఆర్.బి.ఐ. నిర్ణయిస్తుంది. పటంలో H రేఖను H ఎత్తు క్షితిజంగా గీయడం జరిగింది. అంటే DD కి సంబంధించి H సంపూర్ణ అవ్యాకోచత్వం (perfect inelasticity) కలిగి ఉంటుంది. H మార్కెట్‌లో డిమాండు వక్రరేఖలు క్రింది నుండి పైకి పోయే సరళరేఖలుగా సమీకరణాలు (4), (8), (9) ఆధారంగా గీయడం జరిగింది. $C^D$ వక్రరేఖ వాలు సమీకరణం (4) ఆధారంగా " A " అవుతుంది. భారతదేశములో " A " విలువ సుమారు ఒకటి కాబట్టి $C^D$ సరళరేఖ క్షితిజ అక్షంతో $45^0$ చేసేటట్లు ఆ సరళరేఖను పటంలో గీయడం జరిగింది. $R^D$ సరళరేఖ (సమీకరణం 8) వాలు B(1+N) పటంలో $H^D$ సరళరేఖ, $C^D$, $R^D$ సరళ రేఖల శీర్ష కూడిక ద్వారా వచ్చినది. HD, HS సరళరేఖల ఖండన బిందువు H మార్కెట్ సమతౌల్యాన్ని తెలుపుతుంది. అంటే ఈ బిందువు వద్ద ద్రవ్య అధికారులు సప్లై చేసే H ని ఉంచుకోవడానికి ప్రజలు, బ్యాంకులు పూర్తి సుముఖత చూపుతారు. ఈ సమతౌల్య స్థితిలో DD సమతౌల్య విలువ $DD_O$ అంటే ప్రజల $C_O$ కరెన్సీని ఉంచుకొని మిగతాది ($H-C_O=R_O$) బ్యాంకులు నగదు నిల్వలుగా ఉంచుకోనేటట్లు వీలు కల్పిస్తుంది.

పై చర్చనే మరో పటం ద్వారా కూడా వివరించవచ్చు.




పటం - 3.2 : R మార్కెట్ సమతౌల్యం

నగదు నిల్వలు మార్కెట్ సమతౌల్యాన్ని పటం 3.2 చూపుతుంది. ఈ మార్కెట్‌లో పాల్గొనే వారు కూడా ప్రజలు, ఆర్.బి.ఐ., ఇతర బ్యాంకులు. బ్యాంకుల నుండి వచ్చే రిజర్వుల కొరకు డిమాండ్‌ను $R^D$ సరళరేఖ తెలుపుతుంది. R యొక్క సప్లైని $R^S$, బ్యాంకుల నుంచి వచ్చే రిజర్వుల కొరకు డిమాండును $R^D$ సరళరేఖ తెలుపుతుంది. R యొక్క సప్లై $R^S$ ని బ్యాంకులు, ఆర్. బి. ఐ. సంయుక్తంగా నిర్ణయిస్తాయి. H మొత్తాన్ని నిర్ణయించడం ద్వారా ఆర్‌బిఐ తన పాత్రను పోషిస్తుంది. ఆర్‌బిఐ నిర్ణయించే H(H) తెలిసినది అవుతుంది. కాబట్టి అందులో ఎంత భాగం కరెన్సీ రూపంలో ఉంచుకోవాలో, ఎంత భాగం బ్యాంకుల నగదు నిల్వలకై వదలి వేయాలో సాధారణ ప్రజలు నిర్ణయిస్తారు. సాధారణంగా H పై మొదటి అధికారం ప్రజలకు వుంటుంది కాబట్టి, ప్రజల దగ్గర ఉండే కరెన్సీ, కరెన్సీ కొరకు వారి డిమాండుకు సమానం అవుతుందన్న ప్రమేయం చేసుకోవచ్చు. అంటే బ్యాంకులు నగదు నిల్వలకు సంబంధించి శేష అధికారాలు (residual claimants) అవుతాయి. కాబట్టి $R^S$ ను ఈ క్రింది విధముగా వ్రాయవచ్చు.

$R^S = H^S - C^D$

పై సప్లైని పటం 3.2లో క్రిందికి వాలుతున్న $R^S$ సరళరేఖగా చూపడం జరిగింది. ఈ రెండు రేఖలు ($R^S$, $R^D$) పరస్పరం ఖండించుకొన్న బిందువు 'E' నగదు నిల్వల మార్కెట్ సమతౌల్యాన్ని తెలుపుతుంది. సమతౌల్య స్థితిలో $DD = DD_O$. పటం 3.1లో కూడా ఇదే ముగింపుకు వచ్చాం.

## 3.3 భారతదేశంలో ద్రవ్య గుణక పోకడలు

ద్రవ్య సప్లై మార్పులలో ఆధార ద్రవ్యంలో మార్పులు ప్రముఖపాత్ర వహిస్తాయని ఇంతకు ముందే చెప్పుకున్నాం. ద్రవ్య గుణకపు విలువ తెలుసుననుకుంటే ఆధార ద్రవ్యం ఎంత అధికమైతే ద్రవ్య సప్లై అంత అధికమవుతుంది. భారతదేశంలో ద్రవ్య సప్లై పెరుగుదలలో ఆధార ద్రవ్యంలో పెరుగుదల ప్రముఖ పాత్ర వహిస్తుందని ఇంతకు ముందు యూనిట్‌లో చెప్పుకున్నాం. ద్రవ్య గుణకపు పోకడలను ఇప్పుడు చెప్పుకుందాం. కింది పట్టికలో ఆధార ద్రవ్య అంశాలలోను, $M_3$ లోను పోకడలను ఇచ్చాం.

BRAOU

## 3.6 సంప్రదింపు గ్రంథాలు


1. Suraj B. Gupta, *Monetary Economics.*
2. Lloyd B. Thomas J r., *Money, Banking and Economic Activity.*
3. R.B.I, *Report in Currency and Finance*, different years.
4. V. Lakshmana Rao, *Essays an Indian Economy*, pp. 73-90.


## 3.7 భావనలు

1. **ఆధార ద్రవ్యం :** కరెన్సీని, బ్యాంకుల ద్రవ్య రిజర్వులను కలుపగా వచ్చేది ఆధార ద్రవ్యం. బ్యాంకులు పరపతిని సృష్టించడంలో ఇది తోడ్పడుతుంది.
2. **ప్రవర్తనా నిష్పత్తి :** ప్రజల, బ్యాంకులు మొదలైన ఆర్థిక ఏజంట్ల ప్రవర్తన ను ప్రతిబింబించే నిష్పత్తి . ఉదాహరణకు కరెన్సీ, డిమాండు నిష్పత్తి కరెన్సీకి డిమాండ్ డిపాజిట్లకు సంబంధించి ప్రజల అభిరుచులను తెలుపుతుంది.
3. **ద్రవ్య గుణకం :** ఆధార ద్రవ్యానికి ద్రవ్య సప్లైకి మధ్య గల సంబంధాన్ని తెలిపేది ద్రవ్య గుణకం.

## 3.8. పదకోశం

| | | |
|---|---|---|
| స్థూల ఆర్థిక నమూనాలు | : | Macro economic models |
| అత్యంత శక్తివంతమైన ద్రవ్యం | : | High powered money |
| భిన్న నిల్వ పద్ధతి | : | Fractional reserve system |
| ఆధార ద్రవ్యం | : | Base money |
| ద్రవ్య గుణక ద్రవ్య సప్లై సిద్ధాంతం | : | Money multiplier theory of money supply |
| ద్రవ్య విధానం | : | Monetary policy |
| ప్రవర్తనా నిష్పత్తి | : | Behavioural ratio |
| కావలసిన నిల్వలు | : | Required reserves |
| అదనపు నిల్వలు | : | Excess reserves |
| ఉపకల్పన | : | Hypothesis |
| బాహ్యాంశం | : | Exogenous |
| క్షితిజాక్షం | : | Horizontal axis |
| శీర్షాక్షం | : | Vertical axis |
| సంపూర్ణ అవ్యాకోచత్వం | : | Perfect inelasticity |
| శీర్ష కూడిక | : | Vertical summation |
| శేష అధికారాలు | : | Residual claimants |

- ఆచార్య వి. లక్ష్మణ రావు

BRAOU

# భాగం- 4 : ద్రవ్య సప్లైని ప్రభావితం చేయు కారకాలు - భారతీయ రిజర్వ్ బ్యాంక్ వివరణ

విషయక్రమం


4.0 ఉద్దేశాలు

4.1 పరిచయం

4.2 $M_3$ లోని మార్పులు - $M_3$ మూలాలు : 1970-71 — 1991-92

4.3 ఆర్‌బిఐ వివరణ - విమర్శ

4.4 సారాంశం

4.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

4.6 సంప్రదింపు గ్రంథాలు

4.7 భావనలు

4.8 పదకోశం


## 4.0 ఉద్దేశాలు

ద్రవ్య సప్లై వివిధ కొలమానాలను ఇంతకు ముందు యూనిట్‌లో చెప్పుకున్నాం. ద్రవ్య సప్లైకి సంబంధించి H - సిద్ధాంతాన్ని కూడా ఇంతకు ముందు యూనిట్‌లో వివరించాం. ఈ యూనిట్‌లో ద్రవ్య సప్లైని ప్రభావితం చేసే ముఖ్య కారకాలను చెప్పుకుందాం. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (R.B.I.) ప్రచురణలలో ఉండే వివరణల ఆధారంగా ద్రవ్య సప్లైని ప్రభావితం చేసే కారకాల గురించి వివరంగా తెలుసుకోవడం ఈ యూనిట్ ముఖ్య ఉద్దేశం.

## 4.1 పరిచయం

ద్రవ్య సప్లైలో మార్పులు ఇతర స్థూల ఆర్థిక చలరాశులపై తమ ప్రభావాన్ని చూపుతాయి. జాతీయాదాయం, వడ్డీరేటు, సాధారణ ధరల స్థాయి, ఉద్యోగిత తదితర స్థూల ఆర్థిక చలరాశులపై ద్రవ్య సప్లై మార్పులు తమ ప్రభావాన్ని చూపుతాయి. ఆర్థిక స్థిరత్వం కోసం, ఆర్థికాభివృద్ధి కోసం కూడా ద్రవ్య విధానాన్ని రూపొందించి, అమలు చేయడం రిజర్వు బ్యాంకు విధులలో ముఖ్యమైనది. ద్రవ్యంను, పరపతులను సక్రమంగా నియంత్రించడం ద్వారా ద్రవ్య విధాన లక్ష్యాలను సాధించడానికి రిజర్వు బ్యాంకు కృషి చేస్తుంది.

ఆర్థిక వ్యవస్థలో మాంద్య పరిస్థితులు నెలకొన్నప్పుడు విస్తరణాయుత ద్రవ్య విధానాన్ని (expansionary monetary policy ) రూపొందించి అమలు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ మాంద్యం నుంచి కోలుకుని ప్రగతి పథంలో ముందుకు పోవడానికి ద్రవ్య విధానం ఉపయోగించబడుతుంది. అలాగే ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ పరిస్థితులు చోటు చేసుకున్నప్పుడు ద్రవ్య పరపతి సప్లైని తగ్గించేందుకు అనుగుణమైన

ద్రవ్య విధానాన్ని రూపొందించి అమలు చేయడానికి ప్రయత్నిస్తుంది. భారతీయ రిజర్వు బ్యాంకు విస్తరణ, కుదింపు ద్రవ్య విధానం (contractionary monetary policy) లను విజయవంతంగా రూపొందించి అమలు చేయడంలో ద్రవ్య సప్లైలో మార్పులను తీసుకొచ్చే కారకాలపై సంపూర్ణ అవగాహన ఎంతో అవసరం. ఈ యూనిట్‌లో ఇందుకు సంబంధించి భారతీయ రిజర్వు బ్యాంక్ క్రమం తప్పకుండా తమ ప్రచురణలలో ఇచ్చే వివరాలను చెప్పుకుందాం.

## 4.2 $M_3$ లోని మార్పులు - $M_3$ మూలాలు - 1970-71 - 1991-92

$M_3$ ని ద్రవ్య నిల్వ కొలమానాలలో ఒక ముఖ్యమైన దానిగా ఇంతకు ముందు యూనిట్‌లో చెప్పుకున్నాం. ఈ కొలమానాన్ని విశాలమైన లేదా చికాగో స్కూలు కొలమానంగా కూడా చెప్పుకున్నాం. ఈ దిగువ సర్వసమీకరణం $M_3$ ని ప్రభావితం చేసే కారకాలను తెలుపుతుంది.

$M_3$= ప్రభుత్వం అందుకొన్న నికర బ్యాంకు పరపతి + వాణిజ్య రంగం తీసుకున్న బ్యాంకు పరపతి +బ్యాంకింగ్ రంగపు నికర విదేశీ మారక ద్రవ్య ఆస్తులు + ప్రభుత్వపు కరెన్సీ లయబిలిటీస్ - బ్యాంకింగ్ రంగపు నికర ద్రవ్యేతర లయబిలిటీస్ (బ్యాంకులలోని కాల డిపాజిట్లు మినహాయించి).

పై సర్వ సమీకరణంలో కుడిచేతివైపు మొదటి నాలుగు పదాలు ద్రవ్య సప్లైని ధనాత్మకంగా ప్రభావితం చేస్తే, ఆఖరిది ఋణాత్మకంగా ప్రభావితం చేస్తుంది. ద్రవ్యసప్లైలో మార్పులకు సంబంధించి సంఖ్యాత్మకంగా మొదటి మూడు పదాలు ముఖ్యమైన కారకాలు. వాణిజ్య రంగం అందుకున్న బాంకు పరపతి, ప్రభుత్వం తీసుకునే బ్యాంకు పరపతి, బ్యాంకింగ్ రంగపు నికర విదేశీ మారక ద్రవ్యఆస్తులు $M_3$ పరిమాణాన్ని నిర్ణయించే ముఖ్య అంశాలు. వాటిలో ఒకటిగాని, ఒకటి కంటే ఎక్కువగాని పెరిగినప్పుడు, $M_3$ కూడా పెరుగుతుంది. మన దేశంలో ద్రవ్యోల్బణం ప్రముఖ సమస్యగా మారింది. మొదలు ఆ ద్రవ్యోల్బణానికి ఒక ముఖ్యకారణం ప్రభుత్వం తీసుకునే బ్యాంకు పరపతి అన్న అభిప్రాయం ప్రముఖంగా వ్యక్తమవుతూ వస్తోంది.

పట్టిక 4 - 1 లో $M_3$ ద్రవ్యనిల్వ మూలాలు ఇవ్వబడ్డాయి. 1970 - 71లో $M_3$ ని నిర్ణయించిన మూడు ముఖ్యాంశాలలో వాణిజ్య రంగం అందుకున్న బ్యాంకు పరపతి అత్యంత ముఖ్యమైనది (51 శాతం). ప్రాధాన్యతననుసరించి రెండవది ప్రభుత్వ రంగం అందుకున్న బ్యాంకు పరపతి (41.6 శాతం). తరువాతది బ్యాంకింగ్ రంగపు నికర విదేశీ మారక ద్రవ్య ఆస్తులు(4.4 శాతం). 1991 - 92 సంవత్సరంలో కూడ ఈ మూడు కారకాలే ప్రాధాన్యత వహించాయి. అయితే ఈ మూడింటిలో ప్రభుత్వ రంగం అందుకున్న బ్యాంకు పరపతి అత్యంత ప్రధాన కారకమైనది (51.6 శాతం). తరువాత వరుసగా వాణిజ్య రంగం అందుకున్న బ్యాంకు పరపతి (42.7శాతం), బ్యాంకింగ్ రంగపు నికర విదేశీ మారకపు ద్రవ్య ఆస్తులు (5.3 శాతం) తమ తమ స్థానాలను ఆక్రమించాయి.

ద్రవ్యసప్లైలో మార్పు రావడానికి అధిక శక్తివంతమైన లేదా ఆధార ద్రవ్యం ముఖ్య కారణమని ఇంతకు ముందు యూనిట్‌లో చెప్పుకున్నాం. ఈ అధిక ద్రవ్యం బ్యాంకుల పరపతి పెంపుకు మూలంగా ఉంటుంది. అయితే ఈ ఆధార ద్రవ్యంలో ఉండే భాగాలను ఈ దిగువ సమీకరణం చెబుతుంది.

ఆధార ద్రవ్యం = ప్రజలతో ఉండే కరెన్సీ + ఆర్‌బిఐతో ఉండే ఇతర డిపాజిట్లు + బ్యాంకులతో ఉండే నగదు + ఆర్‌బిఐతో ఉండే బ్యాంకుల డిపాజిట్లు.

పట్టిక - 4 .1:ద్రవ్య నిలువ మూలాలు

(రూ. కోట్లలో)

| సంవత్సరం (మార్చినెలఆఖరి శుక్ర వారం) | బి.సి.జి. | శాతం (12 లో) | బి.సి.సి. | శాతం (12లో) | ఎన్.ఎఫ్.ఎ. | శాతం (12లో) | జి.సి.ఎల్. | శాతం (12లో) | ఎన్.ఎమ్. ఎల్.బి. | $M_3$ (2+4+6+8 -10) | మొత్తం (2+4+6+8) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) | (11) | (12) |
| 1970-71 | 5264 | 41.6 | 6455 | 51.0 | 559 | 4.4 | 384 | 3.0 | 1764 | 10958 | 12662 |
| 1971-72 | 6444 | 43.4 | 7368 | 49.6 | 619 | 4.2 | 411 | 2.3 | 2152 | 12690 | 14842 |
| 1972-73 | 7770 | 44.3 | 8729 | 49.8 | 577 | 3.3 | 457 | 2.6 | 2500 | 15033 | 17533 |
| 1973-74 | 8726 | 42.4 | 10701 | 51.9 | 674 | 3.3 | 502 | 2.4 | 3032 | 17571 | 28603 |
| 1974-75 | 9533 | 41.0 | 12671 | 54.6 | 489 | 2.1 | 531 | 2.3 | 3766 | 19457 | 23223 |
| 1975-76 | 10112 | 37.2 | 15392 | 56.6 | 1094 | 4.0 | 555 | 2.0 | 4847 | 22286 | 27153 |
| 1976-77 | 11019 | 33.8 | 18503 | 56.7 | 2525 | 7.7 | 567 | 1.7 | 5335 | 27279 | 32614 |
| 1977-78 | 13470 | 34.0 | 21221 | 53.6 | 4499 | 11.4 | 593 | 1.5 | 6878 | 32905 | 39583 |
| 1978-79 | 15391 | 32.9 | 25347 | 54.2 | 5420 | 11.6 | 663 | 1.3 | 6871 | 39890 | 46761 |
| 1979-80 | 19230 | 34.4 | 30633 | 54.8 | 5401 | 9.7 | 592 | 1.1 | 9055 | 46801 | 55856 |
| 1980-81 | 24731 | 37.4 | 36236 | 54.7 | 4665 | 7.0 | 619 | 0.9 | 10893 | 55358 | 66251 |
| 1981-82 | 30139 | 39.0 | 42913 | 57.1 | 1684 | 1.9 | 657 | 0.8 | 15407 | 72868 | 88276 |
| 1982-83 | 34748 | 39.3 | 51162 | 56.3 | 2579 | 3.4 | 682 | 0.1 | 13862 | 62426 | 76288 |
| 1983-84 | 40505 | 39.4 | 59992 | 58.3 | 1580 | 1.5 | 719 | 0.7 | 16894 | 85899 | 102796 |
| 1984-85 | 48950 | 39.6 | 70801 | 57.3 | 3279 | 2.6 | 777 | 0.6 | 21850 | 101957 | 123801 |
| 1985-86 | 58522 | 40.4 | 81852 | 56.5 | 3474 | 2.4 | 940 | 0.6 | 26450 | 118338 | 144788 |
| 1986-87 | 71298 | 41.8 | 91346 | 54.7 | 4788 | 2.8 | 1192 | 0.7 | 29791 | 140633 | 170429 |
| 1987-88 | 84109 | 42.8 | 105535 | 53.7 | 5470 | 2.8 | 1380 | 0.7 | 33834 | 162660 | 196494 |
| 1988-89 | 96880 | 41.7 | 127222 | 54.8 | 6669 | 2.9 | 1474 | 0.6 | 40161 | 192085 | 232246 |
| 1989-90 | 117151 | 42.3 | 151704 | 54.8 | 6651 | 2.4 | 1555 | 0.6 | 46111 | 230950 | 277061 |
| 1990-91 | 140193 | 43.5 | 171769 | 53.8 | 8672 | 2.7 | 1621 | 0.5 | 56427 | 265828 | 322255 |
| 1991-92 | 158294 | 42.7 | 191065 | 51.6 | 19527 | 5.3 | 1696 | 0.5 | 55498 | 315084 | 370582 |

బి.సి.జి. = ప్రభుత్వం తీసుకున్న నికర బ్యాంకు పరపతి ; బి.సి.జి. = వ్యాపార రంగం తీసుకున్న బ్యాంక్ పరపతి ; ఎన్.ఎఫ్. ఎ. = బ్యాంకింగ్ రంగపు నికర విదేశీయ మారక ఆస్తులు ; జి.సి.ఎల్. = ప్రభుత్వ కరెన్సీ లయబిలిటిస్ (పబ్లిక్‌కు) ; ఎన్.ఎమ్.ఎల్.బి. = బ్యాంకింగ్ రంగపు ద్రవ్యేతర లయబిలిటీస్.

పట్టిక 4.2 ఆధార ద్రవ్య భాగాలకు సంబంధించి గణాంకాలను చెబుతుంది. ప్రజలలో ఉండే కరెన్సీని, రిజర్వు బ్యాంకులో ఉండే బ్యాంకు డిపాజిట్లు, ఆధార ద్రవ్యంలో ముఖ్య భాగాలు. సంఖ్యాత్మకంగా రిజర్వు బ్యాంకుతో ఉండే ఇతర డిపాజిట్లు ప్రాధాన్యత కలిగినవికావు. పట్టికలో చూపిన అధ్యయన కాలంలో ఆధార ద్రవ్యం రూ. 4,814 కోట్ల నుండి రూ.9,509 కోట్లకు పెరిగింది. 1980 - 81 – 1991 - 92 కాలంలో ఆధార ద్రవ్యం విపరీతంగా పెరిగింది. పై కాలంలో ఆధార ద్రవ్యం సుమారు 9 రెట్లు పెరిగింది (రూ. 4,947 కోట్ల నుండి రూ. 34,882 కోట్లకు).

పట్టిక 4.3 లో ఆధార ద్రవ్య మూలాలను గురించిన గణాంకాలు ఇవ్వబడ్డాయి. ఆధార ద్రవ్యాన్ని నిర్ణయించే కారకాలు ఈదిగువ చెప్పబడ్డాయి.

1. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఆర్‌బిఐ పరపతి.
2. వాణిజ్య మరియు సహకార బ్యాంకులు తీసుకున్న ఆర్‌బిఐ పరపతి.
3. ఆర్‌బిఐ నికర విదేశీ మారక ఆస్తులు.
4. ప్రభుత్వపు కరెన్సీ లయబలిటీస్.
5. ఆర్‌బిఐ యొక్క నికర ద్రవ్యేతర లయబిలిటీస్.

ఆధార ద్రవ్యంపై మొదటి నాలుగు అంశాలు ధనాత్మక ప్రభావం చూపితే, ఐదవది ఋణాత్మక ప్రభావం చూపుతుంది. పట్టిక 4.3 నుండి స్పష్టంగా తెలిసే అంశం ఏమిటంటే ప్రభుత్వం ఆర్‌బిఐ నుండి తీసుకునే పరపతి ఆధార ద్రవ్యాన్ని నిర్ణయించే ప్రముఖ కారకం. 1970 - 71 లో ఆధార ద్రవ్యంలో ఈ కారకం 8.9 శాతం అయితే 1991 -92 కి ఈశాతం 9.4కు పెరిగింది. ఆధార ద్రవ్యాన్ని నిర్ణయించే తర్వాతి ప్రధానాంశం ఆర్‌బిఐ విదేశీ మారక ద్రవ్య ఆస్తులు. ఇది 1970-71 లో రూ. 538 కోట్లు, 1991-92లో ఈ ఆస్తులు రూ. 18,838 కోట్లు. పట్టిక 4.3 పరిశీలిస్తే ప్రభుత్వం తీసుకున్న ఆర్.బి.ఐ. పరపతి, ఆర్.బి.ఐ. విదేశీ మారక ద్రవ్య ఆస్తులు, బ్యాంకులు వాణిజ్య రంగం ఆర్.బి.ఐ. నుంచి పొందిన పరపతి, ప్రభుత్వ కరెన్సీ 'లయబిలిటీస్' (అదే వరుసలో) ఆధారద్రవ్యాన్ని నిర్ణయించే అంశాలని బోధపడుతుంది. ఆధార ద్రవ్య పెంపులో ప్రభుత్వ లోటు బడ్జెట్ పాత్ర ఎంత ముఖ్యమైనదో పట్టికలోని ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుంచి పొందిన పరపతి గణాంకాల పెరుగుదల ద్వారా తెలుస్తుంది.

BRAOU

## 4.3 ఆర్.బి.ఐ. వివరణ - విమర్శ

ఆర్.బి.ఐ. ద్రవ్య సప్లై మార్పుకు సంబంధించి వివరణను సూరజ్ గుప్తా తీవ్రంగా విమర్శించాడు. ఈ విమర్శనాంశాలను సంగ్రహంగా ఈ దిగువ పొందుపరచాం.

1. ఆర్.బి.ఐ విశ్లేషణ కేవలం ఎకౌంటింగ్ లేదా సంఘటన సంభవించిన తర్వాత స్వభావం (accounting or expost) కలది. కాబట్టి ఆ విశ్లేషణకు విశదపరచే శక్తి (explonatory power) లేదు. అంటే పై విశ్లేషణ వివిధ విధాన, విధానేతర మార్పుల వలన ద్రవ్యసప్లై ఎలా మారేదీ వివరించలేదు. ఉదాహరణకు న్యాయ సమ్మత నగదునిల్వ అవసరం (statutory reserve requirement), బహిరంగ మార్కెట్ చర్యలు (open market operations) చర్యలు మొదలైనవి ద్రవ్య సప్లైలో మార్పులు ఎలా తెస్తాయో ఆర్.బి.ఐ. విశ్లేషణ వివరించలేదు. ద్రవ్య సప్లైలో మార్పు వచ్చిన తర్వాత ఆ మార్పులను కేటాయించడం మాత్రమే పై విశ్లేషణ చేసేది.

పటం - 4.2

(రూ. కోట్లలో)

| సంవత్సరం (మార్చిలో ఆఖరి శుక్రవారం) | కరెన్సీ (పబ్లిక్‌తో) | ఆర్‌బిఐ లో ఉండే ఇతర డిపాజిట్లు | నగదు నిల్వలు | ఆర్.బి.ఐ.తో ఉండే బ్యాంకుల డిపాజిట్లు | నిల్వ ద్రవ్యం Reserve Money (2+3+4+5) |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 1970-71 | 4367 | 44 | 186 | 217 | 4814 |
| 1971-72 | 4800 | 79 | 205 | 296 | 5380 |
| 1972–73 | 5420 | 51 | 247 | 297 | 6015 |
| 1973-74 | 6308 | 45 | 277 | 630 | 7260 |
| 1974-75 | 6347 | 78 | 332 | 631 | 7787 |
| 1975-76 | 6704 | 54 | 343 | 631 | 7732 |
| 1976-77 | 7873 | 100 | 395 | 1136 | 9544 |
| 1977-78 | 8631 | 70 | 521 | 1719 | 10941 |
| 1978-79 | 10212 | 202 | 615 | 2686 | 13716 |
| 1979-80 | 11687 | 411 | 682 | 3685 | 16465 |
| 1980-81 | 13464 | 317 | 844 | 4163 | 18788 |
| 1981-82 | 14492 | 150 | 874 | 4947 | 20463 |
| 1982-83 | 16659 | 186 | 980 | 5285 | 23110 |
| 1983-84 | 19553 | 318 | 1054 | 7899 | 28823 |
| 1984-85 | 22664 | 603 | 1202 | 7088 | 31477 |
| 1985-86 | 25168 | 251 | 1291 | 11148 | 37858 |
| 1986-87 | 28585 | 352 | 1369 | 14507 | 44813 |
| 1987-88 | 33650 | 297 | 1541 | 17808 | 53296 |
| 1988-89 | 38415 | 462 | 1788 | 21712 | 62371 |
| 1989-90 | 46300 | 598 | 1986 | 28707 | 77591 |
| 1990-91 | 53087 | 658 | 2181 | 31823 | 87749 |
| 1991-92 | 61232 | 896 | 2499 | 34882 | 99509 |



BRAOU
Dr. BRAOU LIBRARY Acc. No: CM.0221 Class No: 330 ECM

## పట్టిక - 4.3

(రూ.కోట్లలో)

| సంవత్సరం (సంవత్సరము లో ఆఖరి శుక్రవారంనాటి) | ప్రభుత్వం నుండి | శాతం (12లో) | అందరి నుంచి | శాతం (12లో) | నికర విదేశీ మారక ఆస్తులు ఆర్.బి.ఐ.వి | శాతము (12లో) | ప్రభుత్వ కరెన్సీ లయబిలిటీస్ | శాతము (12లో) | నికర ద్రవ్యత్వ లయబిలిటీస్ ఆర్.బి.ఐ. | నిల్వ ద్రవ్యం Reserve Money | (10) + (11) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) | (11) | (12) |
| 1970-71 | 3807 | 68.9 | 4614 | 83.3 | 538 | 9.7 | 384 | 6.9 | 714 | 4814 | 5528 |
| 1971-72 | 4689 | 72.5 | 5494 | 84.9 | 608 | 9.4 | 411 | 6.4 | 1091 | 5380 | 8471 |
| 1972-73 | 6489 | 75.9 | 6244 | 86.4 | 563 | 7.8 | 452 | 6.3 | 1219 | 6015 | 7234 |
| 1973-74 | 6234 | 71.7 | 7778 | 89.4 | 672 | 7.7 | 502 | 5.8 | 1437 | 7260 | 8697 |
| 1974-75 | 1570 | 71.8 | 8319 | 91.9 | 391 | 4.3 | 531 | 5.9 | 1670 | 7287 | 9057 |
| 1975-76 | 6697 | 65.0 | 8676 | 84.2 | 1078 | 10.5 | 555 | 5.3 | 2577 | 7732 | 10309 |
| 1976-77 | 6926 | 56.0 | 9452 | 76.4 | 2542 | 20.5 | 560 | 4.6 | 2833 | 9544 | 12377 |
| 1977-78 | 7387 | 51.3 | 9484 | 65.2 | 4532 | 31.5 | 593 | 4.1 | 8452 | 10941 | 14393 |
| 1978-79 | 8568 | 50.3 | 11250 | 64.7 | 5506 | 32.3 | 603 | 3.5 | 3312 | 13716 | 17028 |
| 1979-80 | 11534 | 56.6 | 14308 | 70.2 | 5494 | 26.9 | 592 | 2.9 | 3930 | 16465 | 20395 |
| 1980-81 | 15232 | 64.7 | 18199 | 77.3 | 4710 | 20.0 | 619 | 2.6 | 4741 | 18788 | 23528 |
| 1981-82 | 19667 | 74.0 | 23298 | 87.7 | 2623 | 9.9 | 657 | 2.4 | 6161 | 20463 | 26579 |
| 1982-83 | 22324 | 77.8 | 26263 | 91.6 | 1729 | 6.1 | 682 | 2.4 | 5565 | 23110 | 28675 |
| 1983-84 | 26625 | 78.5 | 31586 | 93.1 | 1624 | 4.8 | 719 | 2.1 | 5105 | 28823 | 33927 |
| 1984-85 | 29774 | 76.0 | 35342 | 90.2 | 3044 | 7.8 | 777 | 2.1 | 7686 | 31477 | 39163 |
| 1985-86 | 38901 | 80.3 | 44252 | 91.3 | 3343 | 6.9 | 940 | 1.9 | 10677 | 34858 | 48535 |
| 1986-87 | 45768 | 79.4 | 51886 | 90.1 | 4594 | 8.0 | 1192 | 2.1 | 12860 | 44813 | 57673 |
| 1987-88 | 52793 | 78.6 | 60528 | 90.1 | 5278 | 7.8 | 1380 | 2.1 | 13879 | 53296 | 67175 |
| 1988-89 | 60018 | 76.3 | 71292 | 90.7 | 5904 | 7.5 | 1475 | 1.9 | 16294 | 62377 | 78671 |
| 1989-90 | 73683 | 77.5 | 87504 | 92.0 | 6068 | 6.4 | 1555 | 1.6 | 17536 | 77591 | 95127 |
| 1990-91 | 80848 | 77.3 | 105197 | 91.5 | 7983 | 6.3 | 1607 | 1.4 | 27038 | 87949 | 114987 |
| 1991-92 | 94016 | 74.0 | 106378 | 83.8 | 18838 | 14.8 | 1696 | 1.3 | 27403 | 99509 | 126912 |

BRAOU

జాతీయాదాయపు లెక్కలవలెనే ఆర్.బి.ఐ. వివరణ కూడా కేవలం ఎకౌంటింగ్ స్వభావం కలదేకాని, ద్రవ్య సప్లై మార్పులకు సంబంధించి వివరణ నిచ్చే సిద్ధాంతం ఏదీ లేనిది. ద్రవ్యసప్లై మార్పులను విశ్లేషించాలంటే ఇంతకు ముందు యూనిట్‌లో చెప్పుకున్న ద్రవ్య సప్లై సిద్ధాంతం అవసరమవుతుంది.

2. ఆర్.బి.ఐ. ఎకౌంటింగ్ విశ్లేషణ H లో ఉండే అంశాలను ద్రవ్య సప్లై అంశాలను కలుపుతుంది. ఈ కలపడంలో ద్రవ్య సప్లై అంశాలు H పై ఆధారపడి ఉంటాయన్న సూత్రం విస్మరించబడుతుంది. ఇలా విస్మరించడం ద్రవ్య గుణకం వలన ద్రవ్య సప్లైలో వచ్చే మార్పుల్ని విస్మరించడం అవుతుంది. ఇలా విస్మరించడం కొన్ని తప్పు ప్రతిపాదనలకు దారి తీస్తుంది.

3. ఆర్.బి.ఐ. విశ్లేషణ విమర్శించే మరొక ముఖ్యాంశం ఆర్.బి.ఐ. నుంచి బ్యాంకులు తీసుకునే పరపతి. ఈ పరపతి వలన H పెరిగి తత్ఫలితంగా ద్రవ్య సప్లై పెరుగుతుంది. ఈ అంశాన్ని ఆర్.బి.ఐ. విశ్లేషణ విస్మరిస్తుంది.

ఆధార ద్రవ్య పెరుగుదల తత్ఫలితంగా ద్రవ్య సప్లైలో పెరుగుదల భారతదేశంలోని ద్రవ్యోల్బణ పరిస్థితిని జటిలం చేస్తోందని స్పష్టంగా తెలుస్తుంది. 1970-71–1991-92 కాలంలో $M_1$ సగటు వార్షిక వృద్ధి రేటు 17.7 శాతం. ఆదేకాలంలో సగటు వాస్తవిక ఆదాయ వృద్ధి రేటు 8.5 శాతం. ఈ రెండు రేటుల మధ్య తేడా సుమారుగా ద్రవ్యోల్బణ రేటుకు సమానం. అంటే భారతదేశ ద్రవ్యోల్బణానికి ముఖ్యకారణం ద్రవ్య సప్లై వృద్ధిరేటు. ఈ ద్రవ్య సప్లై వృద్ధి రేటు వెనుక ప్రముఖ కారణం ఆధార ద్రవ్య వృద్ధిరేటు. ఈ ఆధార ద్రవ్య వృద్ధి రేటు వెనుక ప్రముఖపాత్ర ఆర్.బి.ఐ. నుండి ప్రభుత్వం తీసుకున్న పరపతి. ఈ పరపతి పెరుగుదలకు ముఖ్య కారణం కొనసాగుతున్న, అధికమవుతున్న బడ్జెట్ లోటులు. ఈ సందర్భంగా చక్రవర్తి సంఘపు నివేదిక (Report of the Committee to Review the Working of the Monetary System, 1985) లోని ఈ క్రింది విషయాలు గమనార్హం :

"ప్రభుత్వం అధికమేరకు లోటు బడ్జెట్లకు పాల్పడుతుండడం అవాంఛనీయ పోకడ. కాబట్టి ఆర్.బి.ఐ. నుంచి ప్రభుత్వం తీసుకునే పరపతి రూపంగా కొలవబడే బడ్జెటు లోటు క్షేమకరమైన అవధులు (safe limits) దాటకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. అంటే ప్రణాళికా వ్యయాన్ని (Plan expenditure) ద్రవ్యోల్బణ రహిత పద్ధతిలో, అంటే పబ్లిక్ నుంచి ఇంతకుముందు కంటె ఎక్కువ మొత్తంలో సేకరించిన పొదుపు ద్వారానూ, పబ్లిక్‌రంగ పొదుపును అధికం చేయడం ద్వారానూ, ప్రభుత్వ రాబడిని సేకరించడంలోను, వ్యయంలోను అధిక సమర్థతను సాధించడం ద్వారానూ అవసరమైన నిధులను ఏర్పాటు చేసుకోవలసింది. ఆ విధంగా చేసినప్పుడే ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి త్వరితగతిని కొనసాగించడానికి, ఆ అభివృద్ధి ఫలాలు లక్ష్య వర్గాల (target groups)కు అందేటట్లు చేయడానికి, ఆ ఫలాలు ద్రవ్యోల్బణం వలన తరిగి పోకుండా చూడడానికి సాధ్యమవుతుంది".

చక్రవర్తి సంఘపు నివేదిక సమర్పణ తరువాత చాలా మార్పులు జరిగాయి. ఆ సంఘపు సిఫార్సులలో చాలా వాటిని ప్రభుత్వం / ఆర్.బి.ఐ. అంగీకరించింది. వాస్తవిక వడ్డీ రేట్లను అమలుచేయడం, నూతన ద్రవ్య మార్కెటు సాధనాల (new money market instruments) ను సృష్టించడం, ద్రవ్యోల్బణ అదుపు చర్యలు చేపట్టడం మొదలైన విధాన మార్పుల కారణంగా ద్రవ్యోల్బణం 1991 తరువాత అదుపులోకి వచ్చింది. 1991 ఆర్థిక సంక్షోభం కారణంగా ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాన్ని రూపొందించి అమలు చేస్తోంది. ఈ నూతన విధాన అమలుకు అవసరమైన సహాయాన్ని అంతర్జాతీయ ద్రవ్యనిధి మొదలైన సంస్థల నుంచి ప్రభుత్వం పొందుతోంది. ఆర్థిక స్థిరీకరణ (economic stabilization), నిర్మాణాత్మక సర్దుబాటు (structural adjustment) విధానాల అమలులో ప్రభుత్వం నిమగ్నమయి ఉంది. ఈ ఆర్థిక సరళీకరణ (economic liberalization) విధానాలు, వాటిలో భాగంగా అనుసరిస్తున్న కోశ క్రమశిక్షణ ఆర్థిక వ్యవస్థను సుకరమైన వృద్ధి పథంపై నడిపిస్తాయని విశ్వసించవచ్చు.

BRAOU

## 4.4 సారాంశం

ఈ భాగంలో ద్రవ్య సప్లైని ప్రభావితం చేసే కారకాలను గురించి తెలుసుకున్నాం. ఆర్.బి.ఐ. ద్రవ్య సప్లైలో మార్పుల గురించి తన అకౌంటింగ్ వివరణలో ఏ ద్రవ్య సప్లై సిద్ధాంతాన్ని అనుసరించదు. అలా సిద్ధాంతాన్ని అనుసరించకుండా ప్రతినెలా "ఆర్.బి.ఐ. బులిటెన్" (RBI Bulletin) అనే తన ప్రచురణలో స్పష్టమైన అకౌంటింగ్ విశ్లేషణలో ద్రవ్య సప్లైని ప్రభావితం చేసే కారకాల (factors affecting money supply) ను లేదా ద్రవ్య సప్లై మార్పులకు మూలాలు (sources of changes in money supply) ను ఒక పట్టిక రూపంగా ఇస్తోంది. ఈ అకౌంటింగ్ వివరణను ఈ దిగువ సంక్షిప్తంగా ఇస్తున్నాం.

**ద్రవ్య సప్లై మార్పులకు మూలాలు**

1. ప్రభుత్వం తీసుకునే నికరబ్యాంకు పరపతి (ఎ+బి)

ఎ. ప్రభుత్వం ఆర్.బి.ఐ. నుంచి తీసుకున్న పరపతి (i - ii)

(i) ఆర్.బి.ఐ. నుంచి ప్రభుత్వం పొందిన పరపతి

(ii) ఆర్.బి.ఐ. తో ఉన్న ప్రభుత్వ డిపాజిట్లు

బి. ఆర్‌బిఐ కాక ఇతర బ్యాంకుల నుండి ప్రభుత్వం పొందిన పరపతి

2. వ్యాపార రంగం అందుకున్న బ్యాంకు పరపతి (i + ii )

(i) వ్యాపార రంగం ఆర్.బి.ఐ. నుంచి పొందిన పరపతి

(ii) ఆర్.బి.ఐ. కాక ఇతర బ్యాంకుల నుండి వ్యాపార రంగం పొందిన పరపతి

3. బ్యాంకింగ్ రంగపు నికర విదేశీ మారక ఆస్తులు (i + ii )

(i) ఆర్.బి.ఐ. నికర విదేశీ మారక ఆస్తులు

(ii) ఆర్.బి.ఐ. కాకుండా ఇతర బ్యాంకుల నికర విదేశీ మారక ఆస్తులు

4. పబ్లిక్‌కు సంబంధించి ప్రభుత్వ కరెన్సీ లయబిలిటీస్

5. బ్యాంకింగ్ రంగపు నికర ద్రవ్యేతర లయబిలిటీస్ (i + ii + iii)

(i) బ్యాంకులతో ఉన్న కాల డిపాజిట్లు

(ii) ఆర్.బి.ఐ. యొక్క నికర ద్రవ్యేతర లయబిలిటీస్

(iii) బ్యాంకుల యొక్క (ఆర్.బి.ఐ.ని మినహాయించి) నికర ద్రవ్యేతర లయబిలిటీస్

పై కారకాల ఆధారంగా $M = 1+2+3+4 - 5$

ఆర్.బి.ఐ. పద్ధతిని అనుసరించి ద్రవ్య సప్లై మార్పు కారకాలనే కాకుండా ఆధార ద్రవ్యంలో మార్పులు తెచ్చే కారకాలను కూడా చెప్పుకున్నాం. ఆర్.బి.ఐ. పద్ధతిని గురించిన విమర్శలను కూడా తెలుసుకున్నాం. భారతదేశంలో ద్రవ్య పోకడల వెనుక కారకాలకు సంబంధించిన గణాంకాలను కూడా చెప్పుకున్నాం.

BRAOU

## 4.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 40 పంక్తులలో జవాబు లిమ్ము**

1. $M_3$ లో మార్పులు తెచ్చే వివిధ కారకాలను వివరించండి.
2. ఆధార ద్రవ్యంలోని అంశాలను వివరించి ఆధార ద్రవ్యంలో మార్పులు తెచ్చే కారకాలను వివరించండి.
3. భారతదేశంలో ద్రవ్య సప్లై పోకడలను నిర్ణయించు కారకాలను వివరించండి.

**II ఈ క్రింది ప్రశ్నలకు సుమారు ఇరవై పంక్తులలో జవాబులిమ్ము**

1. $M_3$ లోని అంశాలను వివరించండి.
2. ఆధార ద్రవ్యంలోని అంశాలను వివరించండి.
3. "భారత దేశ ద్రవ్యోల్బణానికి ప్రముఖ కారణం ప్రభుత్వ లోటు బడ్జెట్లు" - వివరించండి.

## 4.6 సంప్రదింపు గ్రంథాలు


1. Suraj B. Guptta, *Monetary Economics*
2. V. Lakshmana Rao, *Essays on Indian Economy*, pp. 73-90
3. R.B.I. *Report on Currency and Finance*, for different years


## 4.7 భావన

**ద్రవ్య విధానం :** ఆర్థిక వ్యవస్థలో స్థిరమైన వృద్ధిని సాధించుటకు అనుకూలంగా ద్రవ్యసప్లై పరపతులను నియంత్రించు విధానం.

## 4.8 పదకోశం

| | | |
|---|---|---|
| విస్తరణాయుత ద్రవ్య విధానం | - | Expansionary monetary policy |
| కుదింపు ద్రవ్య విధానం | - | Contractionary monetary policy |
| బహిరంగ మార్కెట్ చర్యలు | - | Open market operations |
| ప్రణాళికా వ్యయం | - | Plan expenditure |
| నిర్మాణాత్మక సర్దుబాటు | - | Structural adjustment |
| ఆర్థిక సరళీకరణ | - | Economic liberalization |
| నూతన ద్రవ్య మార్కెట్ సాధనాలు | - | New money market instruments |

**- ఆచార్య వి. లక్ష్మణ రావు**

BRAOU

BRAOU

# ఖండం - II

# ద్రవ్య డిమాండ్

ద్రవ్య డిమాండ్‌కు సంబంధించిన వివిధ సిద్ధాంతాలను, వివిధ దృక్పథాలను ఈ ఖండంలో చర్చించుకొందాం. భాగం - 5 లో ద్రవ్యం విలువ ఏ విధంగా నిర్ణయింపబడుతుందో, ఫిషర్, మార్షల్, పిగూ, రాబర్ట్సన్, కేన్స్, మిల్టన్ ఫ్రీడ్‌మన్‌లు వెలుబుచ్చిన వివిధ ద్రవ్య రాశి సిద్ధాంతాలేమిటో తెలుసుకొందాం. భాగం - 6 లో సంప్రదాయ వాదుల మరియు కేన్స్ ద్రవ్య డిమాండ్ దృక్పథాలను వివరించాం. భాగం - 7 లో కేన్సియన్ల, ఉత్తర - కేన్సియన్ల, ఫ్రీడ్‌మన్‌ల ద్రవ్య డిమాండ్ దృక్పథాలను చర్చించుకుందాం.

ఈ ఖండంలో మూడు భాగాలున్నాయి. అవి :

5. ద్రవ్య రాశి సిద్ధాంతాలు : సాధారణ ధరల స్థాయిపై ఫిషర్, కేంబ్రిడ్జ్ దృక్పథాలు

6. ద్రవ్య డిమాండ్ దృక్పథాలు : సంప్రదాయ వాదులు మరియు కేన్స్

7. కేన్సియన్ల, ఉత్తర - కేన్సియన్ల, ఫ్రీడ్‌మన్‌ల ద్రవ్య డిమాండ్ దృక్పథాలు

BRAOU

BRAOU

# భాగం - 5 : ద్రవ్యరాశి సిద్ధాంతాలు : సాధారణ ధరల స్థాయిపై ఫిషర్, కేంబ్రిడ్జ్ దృక్పథాలు

విషయక్రమం


5.0 ఉద్దేశాలు

5.1 ద్రవ్యరాశి సిద్ధాంతాల పరిచయం

5.2 ఫిషర్ ద్రవ్యరాశి సిద్ధాంతం

5.2.1 ఫిషర్ సిద్ధాంత ప్రమేయాలు

5.2.2 ఫిషర్ సమీకరణం - సిద్ధాంత వివరణ

5.2.3 ఫిషర్ సిద్ధాంత విమర్శలు

5.2.4 ఫిషర్ సిద్ధాంత సమీక్ష

5.3 కేంబ్రిడ్జ్ ద్రవ్యరాశి సిద్ధాంతాలు

5.3.1 మార్షల్ సమీకరణం

5.3.2. పిగూ సమీకరణం

5.3.3 రాబర్ట్సన్ సమీకరణం

5.3.4 మార్షల్, పిగూ, రాబర్ట్సన్ సిద్ధాంతాల సమన్వయం

5.3.5 కేన్స్ ద్రవ్య నిల్వల సిద్ధాంతం

5.3.6 కేంబ్రిడ్జ్ సమీకరణాలపై విమర్శలు

5.4 ద్రవ్యరాశి సిద్ధాంతాల సమీక్ష : ఫిషర్ - కేంబ్రిడ్జ్ సమీకరణాల పోలికలు

5.4.1 కేంబ్రిడ్జ్, ఫిషర్ సమీకరణాల తేడాలు

5.4.2 ఫిషర్ సిద్ధాంతంపై కేంబ్రిడ్జ్ వారి ఆధిక్యత

5.5 ఆదాయ వ్యయ సిద్ధాంతం : ధరల నిర్ణయం

5.5.1 ఆదాయ నిర్ణయంలో సార్థక సమష్టి డిమాండులు - ధరల స్థాయి

5.5.2 పొదుపు - పెట్టుబడి సిద్ధాంతాలు

5.6 ఫ్రీడ్‌మన్ పునర్వ్యవస్థీకరణ సిద్ధాంతం

5.7 ముగింపు

5.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

5.9 సంప్రదింపు గ్రంథాలు


B R A O U

5.10 భావనలు

5.11 పదకోశం

## 5.0 ఉద్దేశాలు

ద్రవ్యం విలువ ఎలా నిర్ణయింపబడుతుందో తెలుపడమే ఈ యూనిట్ లక్ష్యం. అందుకుగాను సాధారణ ధరల స్థాయి నిర్ణయం తెలియాలి. అంతేకాని సాపేక్షిక ధరలు కాదు. నిరపేక్ష ధర (absolute price) వస్తువుకున్న ధరను తెల్పుతుంది. సాధారణ ధరలస్థాయిని మాత్రం అన్ని వస్తువుల నిరపేక్ష ధరల సగటుగా గుర్తుంచుకోవాలి. ఇట్టి సాధారణ ధరల స్థాయిలో మార్పులు సంపూర్ణోద్యోగిత స్థితిలో ద్రవ్య పరిమాణంపై ఆధారపడతాయి. ద్రవ్య పరిమాణం అంటే మొత్తం ద్రవ్యమా లేక అందులో కొనుగోలుకై ఉపయోగించే ద్రవ్యమా అనే విషయాన్ని అమెరికన్, చికాగో సిద్ధాంతాలు, ఇంగ్లండ్‌కు చెందిన కేంబ్రిడ్జ్ వారి సిద్ధాంతాలు ఎలా వివరించాయో తెలుసుకుందాం. ఈ సిద్ధాంతాలకు కేన్స్ ఆదాయ వ్యయ సిద్ధాంతం, ఫ్రీడ్‌మన్ పునర్నిర్మాణ సిద్ధాంతాలు మెరుగులు దిద్దాయి. ద్రవ్యరాశిలో మార్పు వలన ద్రవ్య విలువ ఎలా, ఎందువల్ల మారుతుందో, ఎంతమేరకు మారుతుందో తెల్పటమే ఈ భాగం ఉద్దేశం.

## 5.1 ద్రవ్యరాశి సిద్ధాంతాల పరిచయం

ద్రవ్యరాశి సిద్ధాంతం (Quantity Theory of Money) సాధారణ ధరల స్థాయిని నిర్ణయించే కారకాలను, ధరలోని మార్పుకు కారణాలను తెలుపుతుంది. ఇది పరోక్షంగా ద్రవ్య విలువలో మార్పులను తెలుపుతుంది. ద్రవ్య యూనిట్‌తో ఎన్ని వస్తువులను కొనుగోలు చేస్తామో తెలిపే కొనుగోలు శక్తే ద్రవ్యం విలువను తెల్పుతుంది. ద్రవ్య యూనిట్ (రూపాయి)తో ఎక్కువ వస్తువులు కొనుక్కోగలిగి, ఎక్కువ వస్తువులపై అదుపు అజమాయిషీ పొంది, సొంతం చేసుకోగల్గితే రూపాయి విలువ ఎక్కువ అని అర్థం. వేరు వేరు ప్రాంతాల్లో, వివిధ కాలాల్లో ద్రవ్యం విలువ వేరు వేరుగా ఉండవచ్చు. సగటున అన్ని ప్రాంతాలలో ఒకే సమయంలో ద్రవ్యపు కొనుగోలు శక్తి అంచనా వేసి ద్రవ్యపు సగటు విలువ లేదా ధరలస్థాయిని తెల్పుతాం.

BRAOU

ఏదైనా వస్తు విలువను ద్రవ్య రూపంలో చెపితే ధర అంటాం. ద్రవ్యంతో ఎక్కువ వస్తువులను కొనాలంటే వస్తు ధరలు తగ్గాలి. ధరలకు, ద్రవ్య విలువకు విలోమ సంబంధం ఉంటుంది. ధర తగ్గితే రూపాయితో ఎక్కువ వస్తువు పరిమాణం కొనుక్కోవచ్చు. అపుడు ద్రవ్యం విలువ పెరిగినట్టే. ద్రవ్య విలువలో మార్పులు తెలుసుకోవటానికి ధరల స్థాయిలో మార్పులు తెలియాలి. అందుకు ధర సూచీ సంఖ్యలు ఉపయోగపడుతాయి. ఒక వస్తువు ధరను (price) P అనుకుంటే, ద్రవ్య విలువ P కి వ్యుత్క్రమం (reciprocal) అంటే $\frac{1}{P}$ కి సమానం. ఏ కారణాల వల్ల, ఏ స్థితిలో ద్రవ్య విలువ ఎందుకు మారిందో ధరల సూచీ తెలుపదు. ఈ సూచీ సంఖ్యలు ధరల మార్పులను నిర్దిష్టంగా కొలిచి, పోల్చి మాత్రం చెపుతాయి.

వస్తు సేవల ధరల్లో మార్పులు ఏ కారణాల వల్ల వచ్చినా ద్రవ్య విలువలో మార్పు ఏర్పడుతుంది. ద్రవ్యరాశిలో, ద్రవ్య సప్లైలో మార్పులవల్ల ధరలు మారతాయని కొందరు భావించితే, దానికున్న డిమాండును బట్టి మారుతుందని మరికొందరు భావించారు. ఇక్కడ వస్తువులకున్న డిమాండ్, సప్లైలను బట్టి కాకుండా ద్రవ్య సప్లై , డిమాండులను బట్టి ధరలు మారుతాయని తెల్పారు. వస్తు ధరలు అనేక కారణాల వల్ల మారవచ్చు. కాని ఇతర పరిస్థితులు మారనపుడు ద్రవ్యరాశిలో మార్పులు ధరలనెంతమేరకు ప్రభావితం చేస్తాయో తెల్పటమే

ద్రవ్యరాశి సిద్ధాంతాల ఉద్దేశం. మిగతా పరిస్థితులు మారకపోవటం (*ceterus paribus* — other things being constant) అనే ప్రమేయం ఇక్కడ గమనించదగ్గది.

ఏ సిద్ధాంతానికైనా కొన్ని ప్రమేయాలు ఉంటాయి. అవి వాస్తవికతకు దగ్గరగా ఉంటే సిద్ధాంతాల అంచనాలు, విశ్లేషణ, ఫలితాలు సరిగా ఉంటాయి. ప్రమేయాలే అసమంజసంగా, వాస్తవికతకు దూరంగా ఉంటే దాని మీద ఆధారపడ్డ సిద్ధాంతం కూడా బలహీన పునాది మీద నిర్మింపబడ్డ భవనంలా కుప్పకూలుతుంది. సిద్ధాంతాన్ని, విషయాన్ని సులభంగా, క్లుప్తంగా, ఖచ్చితంగా అర్థం చేసుకోవడానికే ప్రమేయాలు వాడుతాం. అనేక అంశాలు ఒక మార్పుకు కారణమయినపుడు ఒక్కొక్క అంశపు ప్రాముఖ్యత తెలుపటానికి, దానిని విడదీసి (isolate), దాని కార్యకారణ సంబంధం చెప్పటానికే ప్రమేయాలు సహాయపడతాయి.

వస్తువుల నిరపేక్ష ధరలు ద్రవ్య, ద్రవ్యేతర శక్తులపై ఆధారపడతాయి. 'ద్రవ్యేతర శక్తులు మారనప్పుడు' అనే ప్రమేయం చేసి ద్రవ్యంలో మార్పులు ధరలనెలా మారుస్తాయో ద్రవ్యరాశి సిద్ధాంతాలు తెల్పాయి. నిశ్చల సంపూర్ణోద్యోగిత స్థితిలో, జే.బి.సే అభిప్రాయం ప్రకారం సప్లై మారనందున డిమాండు మారదు. ధరల స్థాయి కూడా మారదు. ఇట్టి సంపూర్ణోద్యోగితా స్థితిలో ద్రవ్యంలో మార్పులు వస్తే ధరల స్థాయి మారుతుంది. అట్టి ధరల స్థాయి మార్పుకు కారణమైన ద్రవ్య అంశాలను తెల్పేదే ద్రవ్యరాశి సిద్ధాంతం.

ద్రవ్యరాశి సిద్ధాంతాలలోకెల్ల ప్రముఖంగా, అమెరికాకు చెందిన ఫిషర్ సిద్ధాంతం ఒకప్పుడు ప్రాచుర్యంలో ఉండేది. ఆ తర్వాత ద్రవ్య నిలువల సిద్ధాంతం, కేంబ్రిడ్జ్ శాస్త్రవేత్తలచేత చెప్పబడి ద్రవ్య విలువలో మార్పుకు, ద్రవ్యానికున్న డిమాండులో మార్పులే కారణం అని చెప్పింది. మొత్తం ద్రవ్యానికున్న డిమాండే కాకుండా, పొదుపు పెట్టుబడులలోని మార్పులు ధరల స్థాయినెలా మార్పుగల్గుతాయో కేన్స్ సిద్ధాంతం వివరించింది. అయితే ఇంతవరకు సిద్ధాంతాలను కేవలం నిగమన పద్ధతి (deductive method) ద్వారా తెల్పితే వాటికి ఆగమనం (inductive) పద్ధతిని ఫ్రీడ్‌మన్ సిద్ధాంతం జోడించింది. మిల్టన్ ఫ్రీడ్‌మన్ పునర్వ్యవస్థీకరణ లేదా రీస్టేట్‌మెంట్ ద్రవ్య విలువల మార్పు కారణాన్ని విశేషణాత్మకంగా వివరించింది. మొదట ఫిషర్ సిద్ధాంతాన్ని, తర్వాత మిగతా వాటిని చర్చిద్దాం.

## 5.2 ఫిషర్ ద్రవ్యరాశి సిద్ధాంతం

ద్రవ్య వ్యవహారాల సిద్ధాంతంగా, అమెరికన్ ద్రవ్య సిద్ధాంతంగా ఇర్వింగ్ ఫిషర్ ద్రవ్యరాశి సిద్ధాంతం పేరు పొందింది. ఫిషర్ 1911వ సంవత్సరంలో "ది పర్చేజింగ్ పవర్ ఆఫ్ మనీ" అనే గ్రంథంలో ద్రవ్య విలువ మార్పులను సూచించే అంశాలు తెల్పాడు. ఫిషర్ సమీకరణానికి, అతని ద్రవ్యరాశి సిద్ధాంత వివరణకు పూర్వం కూడా ద్రవ్యరాశి సిద్ధాంతాన్ని చర్చించినవారిని విస్మరించరాదు. 1752వ సంవత్సరంలో డేవిడ్ హ్యూమ్ ద్రవ్యరాశి సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ధరల స్థాయి, ద్రవ్య సప్లై ఆధారపడుతుందని, ద్రవ్య సప్లై పెరిగిన వెంటనే కాకున్నా, కొంతకాలానికి ద్రవ్య సప్లై పెరిగిన అనుపాతంలోనే ధరల స్థాయి పెరుగుతుందని చెప్పాడు. హ్యూమ్ తన "పొలిటికల్ డిస్కోర్సెస్" లో ద్రవ్య సప్లై పెరిగితే ధరల స్థాయి పెరుగుతుందని, అలాగే ద్రవ్య సప్లై తగ్గితే ధరల స్థాయి తగ్గుతుందని అన్నాడు. హ్యూమ్ కంటే ముందుగా వ్యాపార వాదులు (Mercantalists) 16వ శతాబ్దంలో, ద్రవ్యం ఏ దేశంలో ఎక్కువగా ఉంటుందో, అక్కడ ధరల స్థాయి ఎక్కువగా ఉంటుందని భావించారు. స్వర్ణం, రజత నిల్వలు, నాణేలు కలసి ద్రవ్య సప్లైని నిర్ణయించే రోజుల్లో, లోహాల సప్లై పెరిగితే ధరల స్థాయి కూడా పెరుగుతుందని, తగ్గినప్పుడు ధరల స్థాయి తగ్గుతుందని నమ్మినారు. నిజానికి అలా కొంతకాలం జరిగింది కూడా. లాకె, జీన్ బోడిన్, కాంటిలాన్, మిల్, సిడ్వీ, ఫిషర్‌లు ద్రవ్యరాశి సిద్ధాంతాన్ని ప్రతిపాదించటం, సమర్థించటం జరిగింది.

1588వ సంవత్సరంలో ఇటాలియన్ ఆర్థిక శాస్త్రవేత్త దావన్ జట్టి (Davan Zatti) దీనిని మొట్ట మొదట ప్రతిపాదించినట్లు తెలుస్తున్నది. ఆ పిదప హ్యూమ్, మిల్‌లు సిద్ధాంతాన్ని ఒప్పుకోవటం, కొన్ని ప్రతిపాదనలు క్రొత్తగా చేయటం కూడా జరిగింది. ఈ సిద్ధాంతాన్ని మెరుగుపరిచే ప్రక్రియకు చక్కటి రూపాన్ని ఇర్వింగ్ ఫిషర్ ఇవ్వటం జరిగింది. వారి సమీకరణాన్ని చూద్దాం.

$MV = PT$

ద్రవ్య సప్లైని ఎడమ వైపున (MV గా), ద్రవ్య డిమాండును కుడివైపున (PTగా) ఈ ఫిషర్ సమీకరణం చూపుతుంది. 'M' చలామణిలో ఉన్న ద్రవ్య పరిమాణాన్ని, 'V' ద్రవ్య చలామణి వేగాన్ని, 'P' సాధారణ ధరల స్థాయిని, 'T' లావాదేవీల సంఖ్యని తెలుపుతాయి. పై సమీకరణం ద్వారా ఫిషర్ తన ఉద్దేశాలను వివరించాడు. ద్రవ్య పరిమాణం ఎంత పెరిగితే, ధరలు కూడా అదే అనుపాతంలో పెరుగుతాయన్నాడు. ఇదివరకు ఉన్నదాని కన్న ద్రవ్య పరిమాణం రెట్టింపయితే ధరలు కూడా ఇదివరకు కంటే రెట్టింపు అవుతాయన్నాడు. ఒక నిశ్చల స్థితిలో ధరల స్థాయి ఎంత ఉంటుందో ఫిషర్ సమీకరణం తెలుపుతుంది. తులనాత్మక నిశ్చల (comparative static) స్థితులలో ద్రవ్య విలువల్లో, ధరలలో వచ్చే మార్పులను తెల్పుతుంది. ద్రవ్య (యూనిట్ యొక్క) విలువ మారకుండా ఉండాలంటే ద్రవ్య పరిమాణంలో మార్పులు రాకూడదని ఫిషర్ అంటాడు. ద్రవ్య పరిమాణాన్ని ఏ అనుపాతంలో మార్చితే విలోమంగా (inversely), అదే నిష్పత్తిలో ద్రవ్య విలువ మారుతుంది. ద్రవ్య సప్లై ఎక్కువయితే ధరలస్థాయి పెరుగుతుంది, పర్యవసానంగా ద్రవ్య విలువ తగ్గుతుంది. ఫిషర్ సిద్ధాంతపు ముఖ్య ఉద్దేశం ఏమంటే ద్రవ్యపు కొనుగోలు శక్తి లేదా ద్రవ్య విలువ ద్రవ్యరాశి సప్లైపై ఆధారపడుతుంది. ఎటువంటి ద్రవ్యరాశి అని ప్రశ్నించినప్పుడు వస్తు కొనుగోళ్ళకై ఉపయోగించే ద్రవ్య వ్యవహారాల ద్రవ్యంపై ఆధారపడుతుందని తెలుస్తుంది. అందుకే ఈ సిద్ధాంతాన్ని ద్రవ్య వ్యవహారాల సిద్ధాంతం అంటారు. అమెరికాకు చెందిన ఫిషర్ సిద్ధాంతాన్ని అమెరికన్ ద్రవ్యరాశి సిద్ధాంతమని, సాంప్రదాయక ద్రవ్యరాశి సిద్ధాంతమని అంటారు. వ్యాపార వాదులు, ప్రకృతి ధర్మవాదులు (Physiocrats), సాంప్రదాయక శాస్త్రవేత్తల్లో చాలామంది ద్రవ్యరాశి సిద్ధాంతాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఒప్పుకున్నవారే.

J.L.హాన్సన్ తన 'మానిటరీ థియరీ అండ్ ప్రాక్టీస్' అనే గ్రంథంలో ద్రవ్య విలువను గురించి 16వ శతాబ్దం చివర్లో 'బోడిన్' అనే శాస్త్రవేత్త తెలిపాడని చెప్పాడు. ద్రవ్య సప్లై పెరిగితే ధరలు అదే అనుపాతంలో పెరుగుతాయి అన్నాడు. దీనిని ఫిషర్ మెరుగుపర్చి ద్రవ్య సప్లైతోపాటు ద్రవ్య చలన వేగం ధరలనెలా మారుస్తుందో తెలిపాడు. అంతేకాక బ్యాంకు ద్రవ్యాన్ని కూడా ద్రవ్య సప్లైలో అంతర్భాగంగా వివరించి మెరుగుపరిచాడు. అతని సిద్ధాంతాన్ని ప్రమేయాలతో సహా తెలుసుకుందాం.

### 5.2.1 ఫిషర్ ద్రవ్యరాశి సిద్ధాంత ప్రమేయాలు

ఒక సిద్ధాంతాన్ని కాని, సాధారణ సూత్రాలను కాని తెలుసుకున్నప్పుడు ప్రమేయాలు తెలియకుంటే ఆ సిద్ధాంతం అనేక విమర్శలకు అనవసరంగా గురికావచ్చు. అందుకే ప్రమేయాలను వివరిస్తూ సౌకర్యానికి, సౌలభ్యానికి విడదీసి కార్యకారణ సంబంధాన్ని కొన్ని చలాంకాల వరకే పరిమితం చేయటం జరుగుతుంది. అప్రకటితమైన, స్పష్టంగా ప్రకటించబడిన కొన్ని ప్రధాన ప్రమేయాలు క్రింద ఇవ్వబడ్డాయి.

సంపూర్ణోద్యోగితతో కూడిన స్థితికి మాత్రమే ఈ సిద్ధాంతం వర్తిస్తుందన్నది ఒక ప్రమేయం. అలాగే ధరల స్థాయి నిష్క్రియ చలాంకం (passive factor) అని భావించాడు. ధరల స్థాయి ఇతర చలాంకాలచే (M,V,T లచే) ప్రభావితం అవుతుంది. కాని అది ఇతర చలాంకాలను ప్రభావితం చేయదని భావించాడు. $M \rightarrow P$ కాని $P \nrightarrow M$ అంటే ద్రవ్యరాశి మార్పుకు ధర కారణం కాదు కాని ద్రవ్యరాశే ధరలను మారుస్తుంది. ధర ఆధారిత (dependent) చలాంకం. ద్రవ్యపరిమాణం ద్రవ్యాధికారులచే నిర్ణయించబడే స్వతంత్ర చలాకం.

ప్రతి అంతిమ వస్తువు ద్రవ్యంచే కొనబడి లావాదేవీ చేయబడాలి. ద్రవ్యాన్ని కేవలం వ్యవహారాలకే వాడాలి. లావాదేవీల సంఖ్య (T) సమీకరణంలోని M, M', V, V' లతో గాని, P చేతగాని ప్రభావితం కాజాలని చలాంకమని ప్రమేయం చేయబడింది. అంతేకాక అది మారని పరామితి (parameter); జాతీయాదాయం, (నిజ) ఉత్పత్తి మారకుంటే, లావాదేవీలు (T) మారదని, అది ధరచేత కూడా ప్రభావితం కాదని భావించాడు. ద్రవ్య చలామణి వేగం (V) లేదా V' ల విలువలు మారకుండా స్థిరంగా ఉంటాయన్నారు.

దీర్ఘకాలానికి వర్తించే స్థితిలో వివిధ చలాంకాలు స్థిరంగా ఉంటాయి. కేవలం ద్రవ్యరాశి మార్పే ధరలను మారుస్తుందని ; ద్రవ్యేతర అంశాలు, వస్తు సప్లై, అలవాట్లు, అభిరుచులు, సాంకేతికాంశాలు స్థిరంగా ఉండి ధరలను మార్చవని ప్రమేయం చేయబడింది. సాపేక్షిక ధరలను కాక నిరపేక్ష ధరలకే ప్రాముఖ్యతనిచ్చారు.

### 5.2.2 ఫిషర్ సమీకరణం - సిద్ధాంత వివరణ

MV = PT సమీకరణంలో ఎడమవైపు ద్రవ్యరాశి సప్లైని కుడివైపు ద్రవ్యానికున్న డిమాండును తెలుపుతుంది. ఏదేని ఒక సమయంలో (time), ద్రవ్య సప్లై సంపూర్ణోద్యోగిత వద్ద, ద్రవ్య డిమాండుకు సమానంగా ఉంటుంది. ఇది వాస్తవికత. ద్రవ్య సప్లై డిమాండ్ల మధ్య సమతౌల్యం ఉన్నపుడు ధరలు ఏ స్థాయిలో ఉండేది, ద్రవ్య పరిమాణంపై ఎలా ఆధారపడేది ఈ సమీకరణం తెల్పుతుంది. కార్యకారణ సంబంధం ద్వారా ధరల స్థాయిలో మార్పునకు, ద్రవ్య సప్లై మార్పు ఎలా తోడ్పడుతుందో కూడా ఫిషర్ సమీకరణం విడిగా తెల్పుతుంది.

MV = PT

M = ద్రవ్య పరిమాణం లేదా ద్రవ్యరాశి (quantity of money)

V = ద్రవ్య చలామణి వేగం (velocity of money)

P = సాధారణ ధరల స్థాయి (general price level)

T = చేసిన వస్తు సేవల వ్యాపార లావాదేవీల సంఖ్య.

బ్యాంకు ద్రవ్యాన్ని విడిగా చూపనప్పుడు, M అనేది నోట్లు, నాణేలు, నగదు ద్రవ్యాన్ని ప్రాథమిక డిపాజిట్లను అంటే ప్రాథమిక ద్రవ్యాన్ని ద్రవ్యరాశిగా తెల్పుతుంది. ఇక V అనేది చలామణి వేగాన్ని చెపుతుంది. ఒక హోటల్లో 20 కప్పులు ఉన్నాయనుకొందాం. కాని ఒక రోజులో 60 కప్పుల టీ అమ్మబడింది. అలాగే 20 కప్పులనే కడిగి, తిరిగి వాటితోనే టీ సప్లై చేయటం జరిగిందన్నమాట. సగటున ఒక్కొక్క కప్పు 3సార్లు వాడబడింది. దీనినే కప్పుయొక్క చలామణి వేగం (లేదా చలన వేగం) అంటాం. కొన్ని కప్పులను ఒకసారి వాడవచ్చు. కొన్నింటిని 10 సార్లు వాడవచ్చు. సగటు చలామణి వేగం మాత్రం మూడు (3) కు సమానం. దీనినే ద్రవ్యానికి వర్తింపచేసి, V ని ద్రవ్య చలామణి వేగంగా తెలిపాం. న్యూలిన్, బూటిల్‌లు వ్రాసిన "థియరీ ఆఫ్ మనీ" లో ద్రవ్యపు టర్నోవర్ వేగాన్నే కొంతకాల వ్యవధికి సంబంధించిన ద్రవ్య చలామణి వేగం అన్నారు.

ఒక వ్యవస్థలో అంతిమ వస్తు సేవల విలువలే కాక వాటి ఉత్పత్తికి వాడిన మధ్యంతర వస్తువుల, ఉత్పాదక వస్తువుల (inputs and intermediate goods) విలువలు కూడా కలిపితే మొత్తం వ్యవహారాల (total transactions) విలువలను తెలుపుతాయి. అట్టి మొత్తం వ్యవహారాల విలువను ద్రవ్యరాశితో భాగిస్తే ద్రవ్య వ్యవహారాల చలామణి వేగం (transaction velocity of money) Vt ని పొందుతాం (V కాదు). ఆదాయ ద్రవ్య చలామణి వేగం (income velocity of money) లేదా V ని పొందాలంటే జాతీయోత్పత్తి విలువ (అంతిమ వస్తు విలువలు మాత్రమే) ను ద్రవ్యరాశితో భాగించాలి.

B R A O U

ఉదాహరణకు ఒక దేశంలో ఒక్కొక్క రూపాయి కాగితాలు 10 ఉండి, రూ. 20ల విలువ కలిగిన రొట్టెలను (అంతిమ వస్తువు) కొనడానికి వాడితే V అనేది 2 అవుతుంది.

$$V = \text{ఆదాయ ద్రవ్య చలన వేగం} = \frac{\text{జాతీయోత్పత్తి విలువ}}{\text{వాడిన ద్రవ్యరాశి}} = \frac{20}{10} = 2 .$$

ఇప్పుడు ద్రవ్య వ్యవహారాల చలామణి వేగాన్ని $V_t$ తెలుసుకుందాం. రొట్టెలు నేరుగా తయారుకావు కదా! గోధుమలను రూ. 14 కు కొని, పిండిని రూ. 16 కు అమ్మడం, తర్వాత పిండిని కొని రూ. 20 లకు రొట్టెలు చేసి అమ్మటానికి పదిరూపాయల ద్రవ్యాన్నే వాడినామనుకొందాం. అంటే ద్రవ్యంతో చేసిన మొత్తం వ్యవహారాల విలువ 14 + 16 + 20 = రూ 50 కు సమానం. అప్పుడు మొత్తం లావాదేవీల చలామణి వేగం ($V_t$) అయిదు అవుతుంది.

$$Vt = \frac{\text{మొత్తం లావాదేవీల విలువ}}{\text{ద్రవ్యరాశి}} = \frac{50}{10} = 5 .$$

జాతీయదాయపు ద్రవ్య విలువను (money value of income) Y అందాం. ఇది P T లకు సమానం (ఇక్కడ T మొత్తం లావాదేవీలను తెలపదు, అంతిమ వస్తు లావాదేవీలకే పరిమితం).

$$V = \frac{Y}{M}$$

V ని ఆదాయ ద్రవ్య చలామణి వేగం (income velocity of money) అంటాం. దీనినే ద్రవ్య చలామణి వేగంగా (V గా) ఫిషర్ సమీకరణంలో వాడుతున్నాం.

ఆదాయ ద్రవ్య చలన వేగం (V) ఎల్లప్పటికీ వ్యవహారాల చలన వేగం ($V_t$) కన్న తక్కువగా ఉంటుంది. ఇంగ్లండ్‌లో 1957వ సంవత్సరంలో వెల్హామ్, ఫేల్ప్స్, బ్రౌన్‌ల లెక్క ప్రకారం (పారిశ్రామిక) వ్యవహారాల చలన వేగం (Vt) 9.45 ఉంటే ఆదాయ ద్రవ్య చలన వేగం (V) 2.70 గా ఉండేది.

ఇంతవరకు తెల్పిన MVలు ద్రవ్య పరిమాణాన్ని, ద్రవ్య చలామణి వేగాన్ని తెలిపేవిగా ఫిషర్ సూచించాడు. మొత్తం ద్రవ్య సప్లై MV ల ఫలానికి (product కు) సమానం. ఒక్క రూ. 5 నోటు 3 సార్లు చేతులు మారితే రూ. 15 విలువగల వివిధ వస్తువులను కొనగలదు. అంటే ద్రవ్యరాశి అయిదు రూపాయలే అయినా ద్రవ్య సప్లై రూ. 15కు సమానం. అంటే ద్రవ్య సప్లై M, V లచే నిర్ణయింబడుతుంది.

ఫిషర్ సమీకరణంలో MV భాగం ద్రవ్య సప్లైని ద్రవ్యానికున్న డిమాండును తీర్చడానికి చేస్తారు. ఫిషర్ ఉద్దేశంలో ద్రవ్యాన్నికున్న డిమాండు P T ల లబ్దానికి సమానం.

P అనేది సగటు ధరను తెలిపే సాధారణ ధరల స్థాయి. అది కూడా కేవలం అంతిమ వస్తువుల ధరల సగటు. వస్తు లావాదేవీ సంఖ్యను (T) అంతిమ వస్తు సంఖ్యకు వాడుతాం. ఏ వస్తువులైతే ద్రవ్యం చేత కొనబడవో వాటిని వ్యవహారాల క్రింద (T గా) పరిగణించరాదు.

ఫిషర్ సమీకరణానికి కుడివైపు ద్రవ్య డిమాండు (P T) గా చూపి, ద్రవ్య సప్లై (MV) ని ఎడమవైపు చూపినప్పుడు అవి ఎప్పుడైనా నిర్వచనం మూలంగా సమానంగా ఉంటాయి.

M V = PT కావున

PT = MV అప్పుడు

$$P = \frac{MV}{T}$$

ఫిషర్ సమీకరణం ప్రకారం ధరలస్థాయి (P) అనేది ద్రవ్య సప్లై (MV) పై, T అనే వస్తు సేవల సంఖ్యపై ఆధారపడుతుంది.

అంతిమ వస్తు లావాదేవీలు (T) దేశంలోని వనరులపై, ఉపయోగిత, ఉపయోగితా విధానం, సామర్థ్యాలపై ఆధారపడతాయి. అయితే ఒక గరిష్ఠస్థాయి తర్వాత సాంకేతిక ప్రగతి శ్రామికోత్పాదకతను మార్చలేకపోయినప్పుడు, మార్పులేని శ్రామిక శక్తి వల్ల T కూడా మారదు.

ద్రవ్యచలన వేగం (V), ద్రవ్య (పరపతి) లావాదేవీల సౌకర్యాన్ని బట్టి ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశాలలో వస్తు కొనుగోళ్ళకు ద్రవ్యాన్ని ఎక్కువగా వాడటం వల్ల ఋణాలు ఎక్కువ పొందటం, తీర్చివేయటంవల్ల లావాదేవీలు (T) ఎక్కువగా ఉంటాయి. ఆదాయ వ్యయాలలో పౌనఃపున్యం (frequency) ఎక్కువగా ఉంటే ద్రవ్య చలన వేగం ఎక్కువగా ఉంటుంది. పొందే ఆదాయ పరిమాణం, దానిలో నిశ్చలత (stability), క్రమబద్ధత (regularity) పైన కూడా చలన వేగం ఆధారపడుతుంది. ద్రవ్యాన్ని బదిలీ చేసే అవకాశాలు ఎంత ఎక్కువగా ఉంటే ద్రవ్య చలన వేగం కూడా అంత ఎక్కువగా ఉంటుంది. ద్రవ్యాన్ని వాడే అలవాటు, జన సాంద్రత, వ్యాపార సరళులు, రవాణా, సాంకేతికాంశాలు, వస్తు కొనుగోళ్ళకు ద్రవ్య చెల్లింపులు ద్రవ్య మూల్యాన్ని బట్టి, వ్యాపార వాణిజ్యాలు, ద్రవ్య మార్కెట్లు, ఉత్పత్తి పంపిణీలు మొదలైనవన్ని ద్రవ్య చలన వేగాన్ని ప్రభావితం చేస్తాయి.

అట్టి స్థితిలో ధరల స్థాయి నేరుగా M పై ఆధారపడుతుంది. ద్రవ్యరాశి (M) ని నిర్ణయించే అంశాలు ద్రవ్య కోశవిధానాన్ని నిర్ణయించే అధికారుల నిర్ణయాలపై ఉంటుంది. ఫిషర్ ద్రవ్య పరిమాణాన్ని స్వతంత్ర చలాంకంగా తీసుకున్నాడు. ద్రవ్య పరిమాణం (M) రూ. 100 , చలన వేగం (V) 2, లావాదేవీల సంఖ్య (T) 50 వస్తువులు అయినప్పుడు

$$P = \frac{MV}{T} = \frac{100(2)}{50} = \frac{200}{50} = \text{రూ. } 4 .$$

పైన చూపినట్లు ద్రవ్యం పరిమాణం ధరల స్థాయిని నిర్ణయిస్తుంది. ద్రవ్యాధికారులు M ను రూ. 200 కు పెంచితే MV అనేది 200 × 2 = 400 అవటం, ధర రూ. 8 కు పెరగటం జరుగుతుంది. ద్రవ్యరాశి ఏ అనుపాతంలో పెరిగితే ధరల స్థాయికూడా అదే అనుపాతంలో పెరుగుతుందని ఫిషర్ తెలిపాడు. ద్రవ్య విలువ కూడా అదే అనుపాతంలో వ్యతిరేక దిశలో మారటం గమనించవచ్చు.

ఫిషర్ సాంప్రదాయకమైన ద్రవ్యరాశి సిద్ధాంతంలో కొన్ని సవరణలు, మార్పులు చేశాడు. ద్రవ్యరాశి M కేవలం నాణేలు, కరెన్సీ నోట్లు, డిపాజిట్లుగా చెప్పుకునేవారు. ఆధునిక ప్రపంచంలో పరపతి, బ్యాంకు ద్రవ్యాల వాడకం గణనీయంగా పెరిగింది. అందుకే పరపతి ద్రవ్యాన్ని M′ (దీనినే M prime అంటారు), పరపతి ద్రవ్య చలామణి వేగాన్ని V′ (V ప్రైమ్) ని కూడా పరిగణనలోకి ఫిషర్ తీసుకొని క్రింది సమీకరణాన్ని రూపొందించాడు.

$$PT = MV + M'V'$$

PT లు ద్రవ్యానికున్న డిమాండును, $MV + M'V'$ లు అన్ని రకాల ద్రవ్య సప్లైని తెలుపుతాయి. ద్రవ్య పరిమాణం $M + M'$ కాగా ద్రవ్య సప్లై $MV + M'V'$ అని గుర్తించాలి. ధరల స్థాయి అప్పుడు క్రింది సమీకరణంలోని చలాంకాలపై ఆధారపడుతుంది.

BRAOU

$$P = \frac{MV + M'V'}{T} = \frac{100(2) + 200(1)}{50} = \frac{400}{50} = \text{ రూ.8.}$$

ద్రవ్యరాశిలో ప్రాథమిక ద్రవ్యం M 100 ఉన్నప్పుడు పరపతి ద్రవ్యం M′ 200గాతీసుకున్నాం. M′ అనేది M కు ఎన్ని రెట్లుంటుందో వ్యవస్థ స్వరూపాన్ని, ద్రవ్య సంస్థలను, నిబంధనలను, విధానాలను బట్టి ఉంటుంది. ఇలాంటి అంశాలు మారనంతవరకు M కు M′ కు ఒకే అనుపాతంలో సంబంధం ఉంటుందని ఫిషర్ భావించాడు. $\frac{M'}{M}$ నిష్పత్తి మారనప్పుడు M ఎన్ని రెట్లు పెరిగితే మొత్తం ద్రవ్యరాశి (లేదా పరిమాణం)కూడా అన్ని రెట్లే పెరుగుతుంది.

ద్రవ్యరాశి M వంద నుండి మూడు వందల రూపాయలకు పెరిగితే, V, V′, T లలో మార్పులేనప్పుడు మొత్తం ద్రవ్య సప్లై రూ. 1200 కు ధరలు రూ. 24 వరకు అంటే 3 రెట్లు పెరుగుతాయి.

పై వివరణ ప్రకారం ద్రవ్యరాశి పరిమాణమే సాధారణ ధరల స్థాయిని నిర్ణయిస్తుందని ఫిషర్ సిద్ధాంతం చెపుతుంది. ద్రవ్యానికి, ధరల స్థాయికి ఉన్న సహ సంబంధం (correlation) తెల్పటమేకాక కార్యకారణ సంబంధాన్ని (causation)వక్కాణించటం జరిగింది. 'పర్చేసింగ్ పవర్ ఆఫ్ మనీ' అనే తన గ్రంథంలో ద్రవ్యరాశి సిద్ధాంతాన్ని సమర్థిస్తూ, ఫిషర్ ద్రవ్యరాశి ధరల స్థాయిలో అదే అనుపాతపు మార్పు తెస్తుందన్నాడు. ద్రవ్యరాశి లేదా ద్రవ్య పరిమాణం (quantity of money) కరెన్సీ, బ్యాంకు ద్రవ్యాలపై ఆధారపడుతుంది. ద్రవ్య సప్లై (supply of money) మాత్రం ద్రవ్యరాశిని చలామణి వేగంతో గుణించితే వస్తుంది.

అభివృద్ధి చెందిన వ్యవస్థలలో ప్రతీ లావాదేవీ ద్రవ్యంతోనే చేసినప్పుడు, ద్రవ్యాన్ని కూడా లావా దేవీలకు మాత్రమే వాడినప్పుడు ద్రవ్య పరిమాణం (M) రెట్టింపు అయితే ద్రవ్య సప్లై కూడా (MV) రెట్టింపవుతుంది. అనుకోకుండా ఒక ద్వీపంలో కరెన్సీ నోట్ల వర్షం కురిస్తే ఏమవుతుంది ? వస్తువుల సప్లై మారకుండా, వర్షించిన కరెన్సీని వస్తు కొనుగోళ్ళకై వాడితే, ధరలు పెరుగుతాయి.

P, M ల సంబంధాన్ని ఈ క్రింది సమీకరణాలు తెల్పుతాయి.

$P = f(M)$

$P = \beta M$

P అనేది M చేత ప్రభావితం అవుతుందని మొదటి సమీకరణం తెల్పితే ఎంత మేరకు అనేది రెండో సమీకరణం వివరిస్తుంది.

$P = \beta M$లో $\beta$అనే గుణకం (coefficient), ద్రవ్యేతర, ద్రవ్య పరిమాణేతర అంశాలపై ఆధారపడుతుంది. $\beta$ ని 0.08 అనుకుందాం. M శూన్యమైనప్పుడు ద్రవ్యరూపంలో ధరల స్థాయి శూన్యమే. ద్రవ్య పరిమాణం రూ. 100 ఉంటే P= 0.08 (100) అయిన స్థితిలో ధరల స్థాయి రూ. 8 ఉంటుంది. ద్రవ్యరాశి రూ. 300 కు మారితే సగటు ధర రూ. 24 ఉంటుంది. ద్రవ్యరాశి మార్పులే ధరలను పూర్తిగా ప్రభావితం చేస్తున్నట్లు $(M \rightarrow P)$, ద్రవ్య సప్లైలో ఎంత శాతం మార్పు వస్తే ధరల స్థాయిలో కూడా అదే శాతం మార్పు వస్తుంది. అందువల్లనే

$$E_P = \frac{P_1 - P_0}{P_0} + \frac{M_1 - M_0}{M_0} = 1$$ లేదా యూనిట్‌గా ఉంటుంది.

$E_P$ = ద్రవ్య ధరల వ్యాకోచత్వం

$P_1$ = ప్రస్తుత ధరల స్థాయి

BRAOU

$P_0$ = గతంలోని ధరల స్థాయి, $M_1$ = ప్రస్తుత ద్రవ్య పరిమాణం, $M_0$ = గతంలోని ద్రవ్య పరిమాణం.

ద్రవ్య పరిమాణంపై ఆధారపడే ధరలస్థాయి వ్యాకోచత్వ యూనిట్‌కు సమానమని ఫిషర్ తెలిపినాడు.

$$\text{ద్రవ్య ధరల వ్యాకోచత్వం} = \frac{\text{ధరల స్థాయిలో వచ్చిన మార్పు శాతం}}{\text{ద్రవ్య రాశిలో వచ్చిన మార్పు శాతం}}$$

యూనిటరీ ద్రవ్య ధరల వ్యాకోచత్వాన్ని పటం 5.1 రూపంలో $E_p$ రేఖ ద్వారా చెప్పవచ్చు.




పటం - 5.1 : యూనిటరీ ద్రవ్య ధరల వ్యాకోచత్వం

BRAOU




పటం - 5.2 :

పటం 5.1 కేవలం ద్రవ్యరాశి మారిన శాతంలోనే ధరల స్థాయి మారుతుంది అనే విషయాన్ని తెల్పుతుంది. ద్రవ్యరాశి 10% పెరిగితే ధరలు కూడా 10% పెరిగినట్లు A బిందువు తెలుపుతుంది. AB రేఖ వాలు మారకపోవటాన్ని గమనించవచ్చు. కాని ద్రవ్యరాశి వేర్వేరు స్థాయిల వద్ద ఉన్న ధరల స్థాయిని తెలుపదు. అలా తెలుసుకోవటానికి $P = \beta M$ రేఖను రూపొందించాం.

పటం 5.2 లో చూపినట్లు D, E, F బిందువుల వద్ద ద్రవ్య పరిమాణం వరుసగా రూ. 100, రూ. 200, రూ. 300 ఉన్నప్పుడు అదే వరుసలో ధరలు రూ. 8, రూ. 16, రూ. 24 ఉంటాయి. ధరలు పెరిగిన కొలది ద్రవ్యం విలువ తగ్గుతుంది. పటం 5.2 b ను చూడండి. ద్రవ్యం విలువ (యూనిట్ ద్రవ్యం అంటే రూపాయ విలువ) $\frac{1}{8}$ వంతు నుండి $\frac{1}{16}$ వస్తు రూపంలో $\frac{1}{24}$ వ వంతుకు వరుసగా తగ్గటానికి కారణం ధరల పెరుగుదల (D నుండి E, E నుండి F కు), దానికి కారణం తిరిగి ద్రవ్యరాశిలో మార్పేనని తెలుస్తుంది.

ద్రవ్యం విలువ తగ్గటానికి, ధరలను పెంచే ద్రవ్య రాశిలోని పెరుగుదల ప్రధాన కారణమని ఫిషర్ ద్రవ్య వ్యవహారాల సిద్ధాంతం తెలుపుతుంది.

### 5.2.3 ఫిషర్ ద్రవ్యరాశి సిద్ధాంతంపై విమర్శలు

ఇందులోని ప్రమేయాలన్నీ వాస్తవికతకు దూరంగా ఉండడమే గాకుండా అవాస్తవాలు కావటంచేత, ఈ సిద్ధాంతం సరి అయినది కాదనేది, ఉపయోగపడదనేది ప్రధాన విమర్శ. ఇతర పరిస్థితులు మారకుండా ఉండవు.

1. సంపూర్ణోద్యోగిత లేని వ్యవస్థలలో (కేన్స్ చెప్పిన అసంపూర్ణోద్యోగితలో) ఉత్పత్తి అంటే T మారే అవకాశముంది. కావున సంపూర్ణోద్యోగిత లేనప్పుడు ఈ సిద్ధాంతం పనిచేయదు, నిరర్థకము అవుతుంది.

2. ఇది ద్రవ్యేతర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ద్రవ్యరాశిలో మార్పులు వచ్చినా (పెరిగినా) వనరుల సామర్థ్యం, సాంకేతిక మార్పు నిర్వహణ సామర్థ్యం పెరిగి ఉత్పత్తి ఖర్చులు తగ్గితే ధరలు పెరగకపోవచ్చు.

3. ద్రవ్యరాశి ఎందుకు మారుతుందో, ద్రవ్యాధికారులచేత స్వతంత్ర చలాంకంగా ఎందుకు మార్చబడుతుందో తెలుపని ఈ సిద్ధాంతం నిరుపయోగమే.

4. వ్యాపార చక్రాలు, ధరల్లో ఒడుదొడుకులు ఎందుకు వస్తాయో తెలుపదు. వ్యాపార చక్రాలే M ను నిష్క్రియాంశంగా చేయవచ్చు.

5. జే. యం. కేన్స్, నికల్సన్లు అన్నట్లు ఫిషర్ సమీకరణం సమానత్వాన్ని, సత్యాన్ని (truism) మాత్రమే తెల్పుతుంది. కాని విశ్లేషణలో క్రొత్తదనంగాని, ప్రత్యేకతగాని లేదన్నారు.

6. చలనవేగం (V) ముఖ్యంగా ద్రవ్య పరిమాణం ఎక్కువయినప్పుడు, T మారకుంటే తగ్గుతుంది. V మారకుండా ఉండదు, చలనాత్మక స్థితులలో పెరుగుదల రేటు మారకపోవచ్చు. కాని T మారకుండా ఉండదు.

7. అంచనాలకు, భవిష్యత్తు సంబంధిత ఊహలకు ఈ సిద్ధాంతం స్థానం కల్పించలేదు. M మారకున్నా, V, P లు మారకపోయినా అంచనాల దృష్ట్యా T మారుతుంది.

BRAOU

8. మిచెల్ (Mitchell), G. క్రౌథర్ విమర్శించినట్లు ధర మార్పులు ద్రవ్య సప్లైలో మార్పులను తెస్తాయి (P → M). వస్తు ధరలు పెరిగినప్పుడు, ద్రవ్య అవసరాలు పెరిగినప్పుడు ద్రవ్యాధికారులు ద్రవ్యాన్ని పెంచుతారు. అంటే M కూడా P చేత నిర్ణయింపబడే ఆధారిత (dependent) చలాంకం కావచ్చు. ఈ సిద్ధాంతం ద్రవ్యానికి ధరలకు సంబంధం ఎలా ఉంటుందో, ఎలా పనిచేస్తుందో తెల్పుతుంది కాని, క్రౌథర్ అన్నట్లు, ఎందుకు చేస్తుందో తెలుపదు.

9. కాల వ్యవధి, విలంబనాలను తెలుసుకుంటే తప్ప, ద్రవ్యరాశి ప్రభావం ధరలపై ఎలా ఉంటుందో నిర్దిష్టంగా చెప్పలేమని ఫ్రీడ్‌మన్, చికాగో శాస్త్రవేత్తలు అన్నారు. కొల్బర్న్ అన్నట్లు స్వల్పకాలంలో దీని పాత్ర పరిమితమని, ద్రవ్యం పెంచిన కొంతకాలం తర్వాతే ధరలు పెరుగుతాయన్నది నిజం.

10. ఈ సిద్ధాంత రూపమే లోపభూయిష్టమని హామ్ (Halm) తన "మానిటరీ థియరీ" అనే గ్రంథంలో తెలిపాడు. ద్రవ్యరాశి (M) ఒక నిర్దేశిత సమయానికి చెందితే, V కొంతకాలానికి, వ్యవధికి సంబంధించినది. ఈ రెండిటిని గుణించటం సరిఅయిన పద్ధతికాదు. ఎందుకంటే ఇవి వేర్వేరు అంశాలు. అంతేకాక కాలగమనంలో V యే కాక M కూడా మారవచ్చు.

11. అభివృద్ధి చెందుతున్న వ్యవస్థల్లో వస్తు వినిమయం ఇంకా కొనసాగుతున్నప్పుడు ద్రవ్యంతో వినిమయం కాని వస్తువుల సంగతి చూద్దాం. వాటి విషయంలో ద్రవ్యరాశి ప్రభావం ధరలపై ఉండదు. ద్రవ్యం మారినా అదే అనుపాతంలో ధరలు మారవుకూడా.

12. సాధారణ ధరల స్థాయిని అన్ని రకాల అంతిమ వస్తు ధరలను పరిగణించినప్పుడు, వాటిని ఉత్పత్తి చేయడానికి వాడిన ఉత్పాదక రాశి ధరలు (input prices) కూడా ద్రవ్యరాశిపై ఆధారపడుతాయి. కాని ఉత్పాదక రాశి ధరలు అన్నీ ఒకే మోస్తరుగా పెరిగినా తరహానుసరించిగాని, చరానుపాత ప్రతిఫలాలననుసరించి గాని, ఉత్పత్తి చేయబడిన వస్తుధరలు, ఉత్పాదక రాశి ధరలకన్న వేగంగా గాని, తక్కువ వేగంగా గాని పెరుగవచ్చు. అంటే ద్రవ్యం పెరిగిన అనుపాతంలోనే ఉత్పాదక రాశి, ఉత్పత్తి రాశి ధరలు పెరగాలంటే అది స్థిర ప్రతిఫలాలున్నప్పుడే సాధ్యపడుతుంది.

13. హాయెక్ (Hayek) అన్నట్లు సాపేక్షిక ధరల్లో మార్పును తెల్పని ఈ సిద్ధాంతం పరిమిత పరిధి (limited scope) కల్గి ఉంటుంది. అంతేకాక ధరల మార్పు ప్రక్రియ, మార్పు విధానం (transmission) వాటి పని తీరును తెల్పలేదు. జోన్ రాబిన్సన్ అన్నట్టుగా వడ్డీరేట్లు, ఇతర మార్పుల ద్వారా పరోక్షంగా ధరలను ద్రవ్యం మారుస్తుంది గాని ప్రత్యక్షంగా మాత్రం కాదు.

14. అంచనాలే కాక భూత, వర్తమాన పరిస్థితులు కూడా ధరలను ప్రభావితం చేస్తాయి.

15. P ని నిష్క్రియాంశంగా, T, V లను స్వతంత్ర పరామితులుగా తీసుకున్నా పరపతి ద్రవ్యానికి, ప్రాథమిక ద్రవ్యానికి (M' మరియు M) మధ్య నిష్పత్తి స్థిరంగా ఉంటుందనేది నిజంకాదు. ప్రాథమిక ద్రవ్యాన్ని ఎంత పెంచినా, పరపతి ద్రవ్యం ఒక్కొక్కసారి పెరుగకపోవచ్చు. అప్పుడు M, M' ల మధ్య నిష్పత్తి దెబ్బతింటే, ఫిషర్ సవరించిన సమీకరణాన్ని తిరిగి సవరించాల్సి వస్తుంది.

16. ప్రొఫెసర్ ఛాండ్లర్ (Prof. Chandler) చెప్పినట్లు, ద్రవ్య విలువను నిర్ణయించే అంశాలు సమీకరణంలో లేవు. సమీకరణంలోని M, V, T లను నిర్ణయించే ఇతర అంశాలు బహిర్గతం కాకుండా గుప్తంగా ఉన్నాయి. ద్రవ్యాన్ని దాచుకోవడానికి డిమాండ్ చేస్తారని, ఆ ద్రవ్య నిలువలే ధరలను నిర్ణయిస్తాయని కేంబ్రిడ్జ్‌కు చెందిన మార్షల్, పిగూ తెలిపినారు.

17. ఇది కేవలం నియమిత వ్యవస్థకే (closed economy) వర్తిస్తుంది. అంతర్జాతీయ, స్వేచ్ఛా వ్యాపార పరిస్థితుల్లో ధరలు దిగుమతులపై కూడా ఆధారపడి, మిగతా ధరలను ప్రభావితం చేస్తాయి.

18. డాన్ పాటిన్కిన్, పిగూల ప్రకారం వాస్తవిక నిల్వల ప్రభావం (real balance effect) పాత్రను ఫిషర్ చెప్పలేదు. ద్రవ్యం తగ్గి తాత్కాలిక ధరలు తగ్గగానే నిజ ఆదాయం పెరిగిందన్న భావంతో ఖర్చు ఎక్కువ పెట్టటంతో, V లో మార్పులు వచ్చి, ధరలు తిరిగి పెరిగే పరిస్థితి ఏర్పడుతుంది.

19. ద్రవ్య సప్లైతో పాటు, సంపద, పెట్టుబడి పోర్టుఫోలియోలు (వివిధ రకాల ఆస్తులపై పెట్టుబడులు), కాల వ్యవధులు కూడా ధరలనెలా మార్చేది నూతన లేదా నవీన ద్రవ్య సిద్ధాంతాలు తెలిపాయి.

అవాస్తవిక ప్రమేయాలతో, అపరిపూర్ణ విశ్లేషణా లోపాలతో కూడిన సిద్ధాంతాన్ని కూడా పూర్తిగా తిరస్కరించలేం. గతంలో ద్రవ్య సప్లై మారినపుడల్లా ధరలు మారటమే దీనికి కారణం.

### 5.2.4 ఫిషర్ సిద్ధాంత సమీక్ష

ఫిషర్ ద్రవ్య వ్యవహారాల సిద్ధాంతం సులభంగా, నేరుగా, వేరుగా (isolate చేసి) ద్రవ్య ధరల సంబంధాలను తెలపడానికి చాలా తోడ్పడింది. వాస్తవానికి కూడా ద్రవ్యాధికారులచేతిలో ఉన్న విధాన సాధనాలలో ద్రవ్య సాధనం ప్రధానమైనది. ద్రవ్య సప్లై మారినప్పుడు ధరలు అదే దిశలో సహ సంబంధాన్ని కలిగి ఉండటం మాత్రం నిజం. అందుకే దీని ప్రాధాన్యతను ఫ్రీడ్‌మన్ సిద్ధాంతం గుర్తించి వివరించింది. ఇప్పుడు ఫిషర్ సిద్ధాంతం కన్నా కేంబ్రిడ్జ్ సిద్ధాంతాలు మెరుగైనవేమో చూద్దాం.

## 5. 3 కేంబ్రిడ్జ్ ద్రవ్యరాశి సిద్ధాంతాలు లేదా నగదు నిలువల సిద్ధాంతాలు

ఇంగ్లాండుకు చెందిన కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అందరూ కూడా ఫిషర్ సిద్ధాంత పరిమితులను గుర్తించి క్రొత్త సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. పెట్టీ (Petty), లాకె (Locke), కాంటిలాన్ (Cantillon) ల చేత ప్రభావితులైన నవ్య సాంప్రదాయపు శాస్త్రవేత్తలు మార్షల్, పిగూ, రాబర్ట్సన్, మొదలగువారు నగదు నిల్వల సిద్ధాంతాలను (cash balance approaches) రూపొందించారు.

కరెన్సీని అదనంగా ముద్రించినా, ద్రవ్య పరిమాణం పెరిగినా, అదనపు ద్రవ్యరాశి కన్న ఎక్కువ భాగాన్ని వస్తువులను ప్రస్తుతం కొనుక్కోకుండా నగదు నిలువలుగా ప్రజలు దాచుకుంటే ధరలు తగ్గుతాయి, ద్రవ్య విలువ పెరుగుతుంది. నగదు నిల్వల అనుపాతం (నగదు నిల్వలు/జాతీయాదాయపు విలువ) పెంచుకున్నారంటే ద్రవ్యచలామణి తగ్గించినారని అర్థం. ద్రవ్యరూపంలో కొనుగోలు శక్తిని భవిష్యత్తుకై దాచుకోవడానికి కూడా ద్రవ్యాన్ని ప్రజలు కోరుకుంటారు. ద్రవ్యానికి వినిమయ మాధ్యమంగానే కాక విలువ నిధి (store of value) లక్షణం కూడా ఉంది. కనుక ద్రవ్యాన్ని నేడు కాకుండా రేపెప్పుడో ఖర్చు పెట్టుకోవడానికి దాచుకుంటారు. ద్రవ్యం విలువ నిధి సాధనంగా వాడుకోవటం కోసం నగదు నిల్వలను కోరుకుంటారు. ఇలాంటి కోరికనే ద్రవ్యానికున్న డిమాండుగా చెప్తారు.

కేంబ్రిడ్జ్ సిద్ధాంతకర్తల దృష్టిలో దాచుకోవటానికి ఎంత నగదు ద్రవ్య నిలువనుంచుకుంటారో అదే ద్రవ్యానికున్న డిమాండ్ మొత్తం. ఎంత ద్రవ్యాన్ని నిల్వచేయటం, దాచుకోవటం చేస్తారనేది వారి స్థాయి, ఆర్థిక స్థితి, కోరికలపై ఆధారపడుతుంది.

ద్రవ్యానికి రెండు లక్షణాలుంటాయి. ఒకవైపు వెంటనే ఖర్చు చేయటానికై (వినిమయానికి), రెండో వైపు

తర్వాత ఖర్చుపెట్టటానికై (నిల్వ చేయటానికి) ఉపయోగపడే విధులున్నాయి.

నాణేన్ని (coin) గుండ్రంగా దాని అంచుల వెంట పరుగెత్తించవచ్చు, లేదా చదునుగా ఒకే చోట స్థిరంగా ఉంచవచ్చు. అలాగే ద్రవ్యాన్ని చలామణిలో పెట్టవచ్చు లేదా దాచుకోవచ్చు (నిల్వచేయవచ్చు). రాబర్ట్సన్ ద్రవ్యాన్ని ఆర్థిక వ్యవస్థకు (economy కి) ఉన్న పక్షి రెక్కలతో పోల్చాడు. విహంగం (పక్షి) తన రెక్కలతో ఎగురగలదు. అలాగే ఒకచోట స్థిరంగా ఆకాశంలో ఉండటానికి అవే రెక్కలను చదునుగా పరుస్తూ నిలకడగా ఉండగలదు. వ్యవహారాలకు ఉపయోగపడటం ఎంత ప్రధానమో ద్రవ్యం విలువనిధిగా వాడబడటం కూడా అంత ప్రధానమే.

ఏదేని ఒక సమయం వద్ద ధరల స్థాయిని ప్రభావితం చేసే అంశాలలో ద్రవ్య నిల్వల నిష్పత్తి (K) ముఖ్యమైనదని ద్రవ్య డిమాండులోని మార్పుల వల్ల ధరలు మారతాయని కేంబ్రిడ్జ్ వారి నమ్మకం. ద్రవ్య సప్లైకన్నా ఇది ప్రధానమైన కారకం. ద్రవ్య సప్లైమారనప్పుడు (కూడా) ద్రవ్యానికున్న డిమాండు పెరిగితే ధరలు తగ్గుతాయి. బేరమాడే శక్తిని భవిష్యత్తులో పెంచుకోవటానికి, తాము నమ్మకానికి, భవిష్యత్తుకై సౌకర్యానికి, లాభోద్దేశంతో కొంత ద్రవ్యం నిల్వ ఉంచుకుంటారు. అట్టి నగదు ద్రవ్యాన్ని చేతిలో ఎక్కువ ఉంచుకుంటే, ఖర్చు వెంటనే చేయటం తగ్గుతుంది. అలాంటప్పుడు వస్తువుల ధరలు తగ్గుతాయి. వివిధ శాస్త్రవేత్తలు కొన్ని సమీకరణాల ద్వారా తమ సిద్ధాంతాలు తెలిపారు. వాస్తవిక ప్రమేయాలతో ఈ సిద్ధాంతం నిల్వల ప్రాముఖ్యతను చాటి చెప్పింది.

### 5. 3. 1 మార్షల్ నగదు నిలువల సిద్ధాంతం

మార్షల్ వ్రాసిన "మనీ, క్రెడిట్ అండ్ కామర్స్" గ్రంథంలో ధరలస్థాయి ఎలా నిర్ణయింపబడుతుందో తెలిపాడు. నిర్ణీత సమయం వద్ద (నిశ్చల స్థితిలో) ద్రవ్య సప్లై స్థిరంగా ఉంటుంది. ద్రవ్య సప్లై అంటే నాణేలు, కరెన్సీ, బాంకు డిపాజిట్లు మొదలైనవి. ఇట్టి ద్రవ్య సప్లై స్థిరంగా ఉన్నాకూడా ధరలస్థాయిలు వేరువేరుగా ఉండే అవకాశముంది. అవి ద్రవ్యానికున్న డిమాండుపై పరోక్షంగా, ప్రజలకు, సంస్థలకు, ప్రభుత్వాలకు ఒక్కమాటలో చెప్పాలంటే వ్యవస్థలోని ద్రవ్యానికున్న మొత్తం డిమాండుపై ఆధారపడతాయి. ద్రవ్యానికున్న డిమాండు అంటే డబ్బును దాచుకోవటానికి ఉన్న కోరిక. మార్షల్ చెప్పిన ద్రవ్య డిమాండ్ కేన్స్ చెప్పిన ద్రవ్యత్వాభిరుచికి తోడుగా మరికొంత డబ్బును కూడా ఇతర అవసరాల, ఉద్దేశాల దృష్ట్యా ఖర్చుచేయకుండా దాచుకుంటారు. అది మానసిక, ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై ఆధారపడుతుంది.

నిర్దిష్టంగా చెప్పాలంటే ఎప్పుడయినా ద్రవ్యాన్ని దాచుకోవచ్చు లేదా వెంటనే ఖర్చు పెట్టవచ్చు. ఇప్పుడున్న ద్రవ్యంలో ఎంత ఖర్చుపెట్టేది మనం దాచుకునే ద్రవ్యస్థాయిని బట్టి ఉంటుంది. ఆదాయంలో ఎంత దాచుకోవాలో మొదట నిర్ణయాలు చేసుకున్నాకే ఖర్చుపెట్టటం జరుగుతుంది. అంతేకాని ఖర్చు పెట్టాక, ఎంత మిగుల్చుకోవాలో ఆలోచించడం జరుగదు (తక్కువ ఆదాయం ఉన్న పేదవాళ్ళేమి చేస్తారనే ఆలోచన వస్తుంది కదూ! వాళ్ళ ఆలోచనలో మిగులుకు, దాచుకోవటానికి తావు ఉండకపోతే అంతా ఖర్చుకే వాడుతారు). ఎక్కువ ద్రవ్యాన్ని దాచుకుంటే ఉన్న వస్తురాశిని కొనడానికి మిగిలే వ్యవహారాల ద్రవ్యం, ఖర్చుకు వాడే ద్రవ్యం తక్కువగా ఉంటుంది. ద్రవ్య సప్లై ఎంత ఉన్నా, వస్తు కొనుగోళ్ళకు ప్రస్తుత సమయం వద్ద ఎంత ద్రవ్యాన్ని చలామణిలో ఉంచామనే దానిపై ధరలు ఆధారపడతాయి. ద్రవ్యాన్ని కొనుగోళ్ళకు తక్కువ వాడితే ధరల స్థాయి తక్కువగా ఉంటుంది.

నగదు నిల్వలు అంటే ద్రవ్యానికున్న డిమాండు (దాచుకోవటానికి), కొనుగోలు శక్తి కొరకు ఎంత ద్రవ్యాన్ని డిమాండు చేసేది ఉత్పత్తిలో ఎంత భాగాన్ని తదుపరి కాలంలో పొందాలనుకుంటారో దానిపై ఆధారపడుతుంది.

BRAOU

ఒక దేశంలో వెయ్యి (1000) వస్తువులు లేదా వాస్తవిక ఉత్పత్తి ఉందనుకుందాం. అందులో 60 శాతం మేరకు ( $\frac{3}{5}$ వ వంతు లేదా 0.6) వస్తువులను తర్వాత కొందామని దానికి తగిన డబ్బును లేదా ద్రవ్యాన్ని దాచుకుంటే దాన్నే 'K' గా చెప్పుకుంటాం. ఇది ఆదాయంలో ఎంతభాగం నగదు రూపంలో పెట్టుకుంటారో తెలుపుతుంది. మిగతా భాగాన్ని నగదుగా చేతిలో దాచి ఉంచకుండా, ప్రస్తుతం ఖర్చు చేస్తారు.

జాతీయాదాయంలో నగదు నిల్వగా ఎంత భాగం ఉంచుకుంటారో దానిని K తో తెల్పినప్పుడు కొన్ని సందేహాలు తలెత్తుతాయి. నగదు అనేది ద్రవ్యరూపంకదా! జాతీయాదాయం కూడా ద్రవ్యరూపంలో తెలియాలంటే ఉత్పత్తి, సగటు ధరలు తెలియాలి. ఉత్పత్తి 1000 వస్తువులుంటే అందులో $\frac{3}{5}$ వంతు తర్వాత కొందామనుకుంటే అంతమేరకు డబ్బు ఖర్చుచేయరు. వస్తు సగటు ధర రూ. 5 ఉంటే జాతీయాదాయం రూ. 5000 ఉంటుంది. అందులో $\frac{3}{5}$ వంతు తర్వాత కొందామనుకుంటే రూ. 3000 దాచుకోవాలి. ఇక్కడ ద్రవ్య రూపంలోని నగదును (మూడువేలను) జాతీయాదాయ భాగంగా చెప్పినా $\frac{3}{5}$ మాత్రమే ఉంటుంది (రూ. 3000 ను రూ. 5000తో భాగించితే). అందుకే ధరలతో K కు నిమిత్తం లేదు. ధరలు K ని ప్రభావితం చేయవు కాని "K" ధరలను ప్రభావితం చేస్తుంది.

మార్షల్ ద్రవ్య విలువల సిద్ధాంతాన్ని దిగువ సమీకరణం ద్వారా తెలుసుకోవచ్చు.

$M = K Y$

M = నిర్ణీత సమయంలో (point of time) ఉన్న ద్రవ్య సప్లై లేదా ద్రవ్యరాశి.

K = జాతీయాదాయంలో ఎంత భాగాన్ని నగదు రూపంలో నిల్వలుంచుకుంటారో తెల్పేది.

Y = ద్రవ్యరూపంలో జాతీయాదాయం.

Y ని జాతీయాదాయంగా, O ను ఉత్పత్తిగా, P ని ధరల స్థాయిగా తెల్పితే,

$M = K.P.O$ అవుతుంది.

$K.P.O = M$ అని కూడా అనవచ్చు.

సగటు ధరను తెలుసుకుంటే దాని వ్యుత్క్రమ విలువే ద్రవ్య యూనిట్ విలువగా చెప్పవచ్చు.

$P = \frac{M}{KO}$ అవుతుంది.

M = రూ. 3000, O = 1000 వస్తువులు, $K = \frac{3}{5}$ వంతు ఉంటే (0.6 ఉంటే), P = ?

$P = \frac{3000}{0.6(1000)} = \frac{3000}{600} =$ రూ. 5.

K మారకుంటే ధర మారదు. K మారి 75% గా $\left(\frac{3}{4}\right)$ ఉంటే ఏమవుతుంది ?

ఇప్పుడు ప్రజలు ఇంతకు ముందుకన్నా ఎక్కువ నగదును నిల్వగా ఉంచుకుంటారు. దాని వల్ల ద్రవ్యం ప్రస్తుతం చలామణిలో తక్కువగా ఉంటుంది. కావున ధరలస్థాయి రూ. 4కు తగ్గుతుంది. ద్రవ్య విలువ పెరుగుతుంది. ద్రవ్య సప్లై మారినా K మారితే ధరల స్థాయి మారవచ్చు.

ద్రవ్య సప్లై రూ. 3000 ఉన్న స్థితిలో ధరలస్థాయి రూ. 5 ఉండేది. ఒకవేళ ద్రవ్య సప్లై రూ. 4000 కి మారితే సాధారణ స్థితిలో ధర పెరగాలి. కాని ధర పెరగటమనేది కేవలం M పైన ఆధారపడదు. అది K పైననే ఎక్కువ

ఆధారపడుతుందంటారు.

$M = 4000,\ K = 0.8$ ఉంటే $P = \frac{4000}{\left(\frac{4}{5}\right).1000} = \frac{4000}{800}$ = రూ. 5.

ఇక్కడ ద్రవ్య సప్లై రూ. 3000 ల నుండి రూ. 4000 లకు పెరిగినా ధర కేవలం రూ. 5 మాత్రమే ఉంది. దానికి కారణం K 0.6 నుండి 0.8కి పెరగటమే. K విలువ 0.8 కన్న కూడా ఎక్కువ వుంటే ధరల స్థాయి ఇంతకు ముందు కన్న తగ్గుతుంది కూడా. ద్రవ్య సప్లై పెరిగినా, అంతకు మించిన అనుపాతంలో K పెరిగితే ధరలు తగ్గుతాయి. అంటే ద్రవ్య సప్లై కన్న ద్రవ్య డిమాండులో వచ్చిన మార్పులే ధరల నిర్ణయంలో ప్రధాన పాత్ర వహిస్తాయని మార్షల్ ఉద్దేశం. ద్రవ్య సప్లై పెరిగినా ధరలు తగ్గటానికి, ఆర్థిక మాంద్యానికి కారణం ద్రవ్య డిమాండులో, ద్రవ్య నిల్వల డిమాండు (K) లో పెరుగుదల అని తెలుస్తున్నది.

అలాగే ద్రవ్యానికి ఉన్న విలువను $\frac{1}{P}$ గా తెలిపితే

$\frac{1}{P} = \frac{K.O}{M}$ = ద్రవ్య విలువ

ద్రవ్య విలువ = $\frac{0.8(1000)}{4000} = \frac{800}{4000} = \frac{1}{5}$ వస్తువు.

ఇక్కడ ఒక యూనిట్ ద్రవ్య విలువ వస్తువు రూపంలో, వస్తువు యొక్క ఐదవ వంతుకు సమానం. నగదు నిల్వలకున్న డిమాండు జాతీయాదాయాన్ని బట్టి మాత్రమే కాక, ఆస్తుల విలువలు వాటిలో ఎంత భాగం భవిష్యత్తులో కొనడానికి నగదు దాస్తున్నామో అనే అంశంపై కూడా ఆధారపడుతుంది.

$M = KY + K'A$

M = ద్రవ్య సప్లై (ఇక్కడ ద్రవ్యరాశి కూడా)

K = ఆదాయంలో భాగంగా నగదు నిల్వలను తెల్పే కారకం

Y = జాతీయాదాయం

K′ = ఆస్తుల విలువలో నగదు నిల్వలుగా ఉంచుకునే భాగం

A = అన్ని ఆస్తుల విలువ.

భారితాల (weightages) ద్వారా K, K′ లను కలిపి నగదు నిల్వలకున్న డిమాండును తెలుసుకోవచ్చు. కాని సులభంగా అర్థం చేసుకోవడానికి ఆస్తులను (A), దానికై డిమాండ్ (K′) ను తొలగించి సామాన్య సమీకరణం M = KY ని వాడుకోవటం జరుగుతుంది. ద్రవ్యాన్ని కేవలం ఈ సంవత్సరం ఉత్పత్తి అయిన వస్తు సేవలను భవిష్యత్తులో కొనుగోలు చేయటానికే కాక వివిధ రూపాల్లో ఉన్న ఆస్తులను కొనుక్కోవటానికి కూడా కొంత నగదు నిల్వలు దాచుకుంటారు. ఆస్తులు అంటే భవనాలు, షేర్లు, బాండ్లు మొదలైనవి ఏవైనా కావచ్చు. సౌలభ్యానికై K′, A ను తొలగించటం జరిగింది.

### 5.3.2 A. C. పిగూ ద్రవ్య విలువ సిద్ధాంతం

పిగూ నవంబర్ 1917లో 'క్వార్టర్లీ జర్నల్ ఆఫ్ ఎకనామిక్స్' కు వ్రాసిన 'ద్రవ్యం యొక్క విలువ' అనే వ్యాసంలో ద్రవ్య విలువ ఎలా మారుతుందో తెలిపాడు. పిగూ సమీకరణాన్ని చూద్దాం.

$P^* = \frac{KR}{M}$

P* (P ఆస్టరిక్) = ద్రవ్యం యొక్క కొనుగోలు శక్తి లేదా ద్రవ్యం విలువ.

K = వాస్తవిక ఆదాయంలో ఎంత భాగాన్ని చట్టబద్ధ ద్రవ్యరూపంలో నగదును చేతిలో పెట్టుకుంటారో తెలుపుతుంది.

R = వాస్తవిక ఆదాయం. ఇది నిలకడ ధరల్లో చెప్పిన ఆదాయంగా లేదా మార్షల్ చెప్పిన ఓ.(O)కి సమానం.

M = చట్ట బద్ధ ద్రవ్యం లేదా ద్రవ్యరాశి.

పిగూ సమీకరణంలో P గా ఉన్నా, దానిని P* (P ఆస్టరిక్) గా సమీకరణం ఇచ్చాం. ఎందుకంటే పిగూ తప్ప మిగిలిన వారంతా సామాన్యంగా 'P' ని ధరల స్థాయికే వాడతారు. పిగూ దానిని ద్రవ్య విలువగా, ధరల స్థాయికి వ్యుత్క్రమంగా వాడినాడు. అందుకే P గురించి సందేహంలో పడకుండా పిగూ తెల్పిన P ని P* గా వ్రాస్తాం. ఇది పిగూ సమీకరణంలోని ప్రత్యేకత.

R = 100 వస్తువులు, K = 0.6, M = రూ. 3000 గా తీసుకుంటే

$P^* = \frac{0.6(1000)}{3000} = \frac{600}{3000} = \frac{1}{5}$ వస్తువుకు సమానం.

ఒకవేళ K కేవలం 20 శాతం లేదా 0.2 గా ఉంటే ధరల స్థాయి పెరిగి $\frac{1}{15}$ వస్తువుకు సమానం. పిగూ ద్రవ్య విలువలను కేవలం చట్టబద్ధ ద్రవ్యం ప్రజల వద్ద ఉన్నదే కాక, బ్యాంకుల వద్ద ఉన్న డిపాజిట్లను, అది సృష్టించే పరపతి ద్రవ్యాన్ని గురించి కూడా తెలిపి, సమీకరణాన్ని వాస్తవికతకు దగ్గరగా చేర్చాడు.

$P^* = \frac{KR}{M}[C + h(1-C)]$

P*, K, R, M లు మామూలే. ప్రజలు దాచుకునే నగదు నిల్వలు రెండు రకాలు - ఒకటి ద్రవ్యరూపంలో చట్టబద్ధ ద్రవ్యంగా ఉంచిన నిల్వలు, రెండవది బ్యాంకు ద్రవ్యం రూపంలో ఉంచుకొన్నది. బ్యాంకు ద్రవ్యాన్ని ఎంత మేరకు (ఎన్నిరెట్లు) పరపతి సృష్టించగలరనే దానిపై ఆధారపడుతుంది. అంటే h పైన, (1-C) ల పైన ఆధారపడుతుంది.

బ్యాంకుల నగదు రిజర్వు (cash reserve ratio) నిష్పత్తిపైన పరపతి గుణకం ఆధారపడుతుంది. $h = \frac{1}{4}$ (నగదు రిజర్వు) ఉంటే బ్యాంకులు తమవద్దకు వచ్చిన రూ. 100 డిపాజిట్లతో రూ. 400 పరపతి సృష్టించగలవు. ఇట్టి పరపతి రూపంలో దాచుకున్న నగదు భారం - K R (1 - C) h లపై, నగదు రూపంలో దాచుకున్నది, KR (C) లపైన ఆధారపడుతుంది. C ద్రవ్య రూపంలో దాచిన నగదుకు సంబంధించిన చట్టబద్ధ ద్రవ్యం;మొత్తం దాచుకోదలచిన ద్రవ్యంలో చేతిలోని C పోగా మిగిలింది. బ్యాంకుల వద్ద ప్రాథమిక డిపాజిట్ల రూపంలో దాచిన నగదు (1-C) అంటారు. మొత్తం ద్రవ్యానికున్న డిమాండ్ KR [C + (1 - C) h] కు సమానం. ఆ స్థితిలో

K = 0.6 = నగదు నిల్వల నిష్పత్తి

R = 1000 వస్తువులు = నిజ ఆదాయం లేదా ఉత్పత్తి

C = 0.4 = దాచుకున్న చట్టబద్ధ ద్రవ్యంలో, బ్యాంకుల వద్ద కాకుండా చేతిలోనే ఉంచుకున్న భాగం

1-C = 0.6 = బ్యాంకుల వద్ద దాచుకున్న నగదు నిల్వలుగా ఉన్న (చట్ట బద్ధ) ద్రవ్యంలోని భాగం

$h = \frac{1}{6}$ = బ్యాంకుల కాష్ రిజర్వు నిష్పత్తి (బ్యాంకు నగదు - రిజర్వు నిష్పత్తి)

M = 3000 = చట్ట బద్ధ ద్రవ్యం.

ద్రవ్య డిమాండు సమీకరణంలోకి విలువల ప్రతిక్షేపించగా

ద్రవ్యం విలువ $P^* = \frac{0.6(1000)\left[0.4+(1-0.4)\frac{1}{6}\right]}{3000}$

$$P^* = \frac{600\left[0.4+\frac{6}{10}x\frac{1}{6}\right]}{3000} = \frac{600(0.5)}{3000} = \frac{1}{10}$$ వస్తువు

ధరల స్థాయి $P = \frac{1}{P^*}$ కావున $\frac{1}{1/10}$ = రూ. 10 .

పిగూ దృష్టిలో ద్రవ్య విలువ ఒక సమయంలో M మారనప్పుడు, K అనే ద్రవ్య నిల్వల భాగంపైననే ఎక్కువగా ఆధారపడుతుంది.

ధరలు పెరుగుతుంటె ప్రజలు ద్రవ్య విలువ ఇంకా పడిపోతుందన్న భయంతో డబ్బును సాధ్యమైనంతవరకు ఇప్పుడే ఖర్చు పెట్టి, తక్కువ భాగాన్ని నగదు నిల్వలుగా ఉంచుకుంటారు. దానివల్ల ఇంకా ధరలు వేగంగా పెరుగుతాయి. ఈరకంగా Kఎందుకు మారుతుందో, ఎప్పుడు మారుతుందో తెలిపి వాస్తవికతకు ఈ సిద్ధాంతం దగ్గరగా ఉండేటట్లు చేసాడు




BRAOU

పటం - 5.3

పటం 5.3 లో చూపినట్లు M(ద్రవ్యరాశి మారకుండా ఉండి (MMరేఖ), ద్రవ్యనిల్వల డిమాండ్ K పెరిగితే ద్రవ్య డిమాండు KRనుండి K'R కు పెరుగుతుంది. దాని ఫలితంగా ధరల స్థాయి తగ్గి ద్రవ్య విలువ $P^*_0$ నుండి $P^*_1$ పెరుగుతుంది. డిమాండు (ద్రవ్యానికి) తగ్గితే ద్రవ్య విలువ తగ్గుతుంది.

### 5. 3. 3 D. H. రాబర్ట్సన్ సమీకరణం

ఒకే మూసలో పోసిన విధంగా రాబర్ట్సన్ 1959లో వ్రాసిన "మనీ" గ్రంథంలో కూడా ద్రవ్య నిల్వలకున్న డిమాండ్ ఒక నిర్ణీత సమయం వద్ద ధరల స్థాయిని నిర్ణయిస్తుందన్నాడు. ద్రవ్యాన్ని నిల్వగా పెడుతూ పోవచ్చని (pile up) అన్నాడు. ద్రవ్యాన్ని నిల్వచేసుకోవటం కూడా పక్షి తన రెక్కలను కూర్చోవడానికి, వాలడానికి కూడా ఉపయోగించుకోవటంలా ఉంటుందన్నాడు.

రాబర్ట్సన్ సమీకరణంలో P ధరల స్థాయిని, M ద్రవ్య రాశిని, T వ్యాపార పరిమాణం ఒక సంవత్సర కాలంలో ఎంత ఉందో వస్తు రూపంలో తెలుపుతుంది. K, కేంబ్రిడ్జ్ సిద్ధాంతాలలో ముందు మాదిరిగా నగదు

రూపంలో ఎంత భాగం వ్యాపార పరిమాణాన్ని కొనుక్కోవటానికి ఉంచుకుంటారో తెలుపుతుంది.

$$P = \frac{M}{KT}$$

M = రూ. 3000, T = 1000 వస్తువులు, K =0.2 ఉంటే ధరలస్థాయి రూ. 15 ఉంటుంది. అప్పుడు ద్రవ్యం విలువ $\frac{1}{15}$ వస్తువుకు సమానం.

### 5. 3. 4 మార్షల్, పిగూ, రాబర్ట్‌సన్ సిద్ధాంతాల సమన్వయం

కేంబ్రిడ్జ్‌కు చెందిన పై మూడు సిద్ధాంతాలు కూడా ధరలు కాని ద్రవ్యం విలువ కాని M, Tలపై మరియు K అనే ద్రవ్య నిల్వలపై ఆధారపడుతుందన్నాయి.

మార్షల్ $P = \frac{M}{KY}$

పిగూ $P^* = \frac{KR}{M}$

రాబర్ట్‌సన్ $P = \frac{M}{KT}$

మార్షల్ సమీకరణంలో Y ని వాస్తవిక ఆదాయంగా తీసుకుంటే, పిగూ R ని, రాబర్ట్‌సన్ T ని వాస్తవిక ఆదాయంగా తీసుకున్నారు. M అంటే ద్రవ్య సప్లై, K అంటే ద్రవ్య నిల్వల డిమాండని అన్నారు.

మార్షల్, రాబర్ట్సన్ సమీకరణాలు నేరుగా ధరల స్థాయిని Pరూపంలో తెలిపాయి. పిగూ తెల్పిన P(మనం P* గా గుర్తించాం) మాత్రం ద్రవ్య విలువను తెల్పింది. ద్రవ్య విలువ P* ని వ్యుత్క్రమం చేద్దాం.

$$P = \frac{1}{P^*} = \frac{M}{KR}$$

ధరల స్థాయిని, వీరందరు కూడా నిర్ణీత సమయంలో ద్రవ్య సప్లైకాకుండా ద్రవ్యానికున్న (ద్రవ్య నిల్వల) డిమాండే నిర్ణయిస్తుందన్నారు.

### 5. 3. 5 జె. యం. కేన్స్ ద్రవ్య నిల్వల సిద్ధాంతం (Cash Balances Theory)

కేన్స్ సార్వత్రిక సిద్ధాంతాన్ని (1936) వ్రాయటానికి ముందు నవ్య సంప్రదాయులచేత, మార్షల్ చేత ప్రభావితుడై యున్నాడు. అందుకే 1923లో జె. యం. కేన్స్ వ్రాసిన A Tract on Monetary Reform లో కొద్ది మార్పులతో కేంబ్రిడ్జ్ సమీకరణాలను అంగీకరించాడు. ధరల స్థాయిని, ద్రవ్యం విలువను లెక్కించేటప్పుడు కేవలం వినియోగ వస్తు ధరలను మాత్రమే లెక్కలోకి తీసుకోవలెనని భావించాడు. అతని సమీకరణ ప్రకారం

$$n = PK$$

$$P = \frac{n}{K}$$

n = నిర్దిష్ట సమయంలో మొత్తం ద్రవ్య సప్లై

P = వినియోగ వస్తువుల ధరల స్థాయి

K = ఎన్ని వినియోగ వస్తువులనుకొనడానికి నగదు లేదా ద్రవ్యాన్ని దాచుకుంటారో తెల్పుతుంది. దీనిని వాస్తవిక నిల్వలు (real balances) అని కూడా అనవచ్చు.

BRAOU

నిర్దిష్ట సమయంలో ద్రవ్య సప్లై మారనప్పుడు, ద్రవ్య నిల్వల శాతంపై వినియోగ వస్తు ధరలు ఆధారపడతాయి. ఇందులోని అంశాలలో P వినియోగవస్తు ధరని మాత్రమే తెలుపుతుంది. వినియోగ వస్తువులకు కేన్స్ వర్తింపచేసిన సిద్ధాంతం, అన్ని విధాలా కేంబ్రిడ్జ్ (సమీకరణ) సిద్ధాంతాలనే పోలి ఉంది. కేన్స్ సమీకరణంలో చట్టబద్ధ ద్రవ్యమే కాక వినియోగవస్తువులు కొనడానికి పరపతి ద్రవ్యాన్ని కూడా వాడితే క్రింది సమీకరణాన్ని పొందుతాం.

$$P = \frac{n}{(K + IK_t)}$$

r = నగదు రిజర్వు (వాణిజ్య బ్యాంకుల) నిష్పత్తిని తెల్పుతుంది.

$K_I$ = బ్యాంకు ద్రవ్యంతో వస్తువులను కొనడానికి నగదు నిల్వలు బ్యాంకులో పెట్టినవి.

n = ద్రవ్య సప్లై

P = వినియోగ వస్తు ధరల స్థాయి.

ఉదాహరణకు n = రూ. 240, K = 10 వస్తువులకు సమానమైన నగదు, $K_I = 8$ వస్తువుల కొనడానికి సమానమైన నగదు నిల్వ బ్యాంకుల్లో డిపాజిట్ చేసింది, $r = \frac{1}{4}$ లేదా 0.25 ఉన్నప్పుడు

ధరల స్థాయి $P = \frac{240}{\left[10 + \frac{1}{4}(8)\right]} = \frac{240}{10 + \frac{2}{1}} = \frac{240}{12}$ = రూ. 20.

కేన్స్ దృష్టిలో K, $K_I$ లు n చేత ప్రభావితం కావు. ప్రజల అలవాట్లపై, అవసరాలపై, అంచనాలపై ఆధారపడతాయి. దాదాపు కేంబ్రిడ్జ్ సమీకరణాలన్నీ కూడా ద్రవ్యానికున్న డిమాండు ప్రాధాన్యతను (కూడా) నొక్కి చెప్పాయి. కేవలం ద్రవ్య సప్లై కాకుండా ధరలను నిర్ణయించటంలో ద్రవ్య నిల్వల డిమాండు ఎంత ప్రధానమైనదో తెలుపుతాయి.

B R A O U

### 5. 3. 6 కేంబ్రిడ్జ్ సమీకరణాలపై (సిద్ధాంతాలపై) విమర్శలు

1. ఏదేని ఒక సమయం వద్ద ఉన్న ధరల స్థాయి కేవలం ద్రవ్య నిల్వలకున్న డిమాండు పైననే ఆధార పడుతుందనటం సరికాదు.

2. నగదు నిల్వల సిద్ధాంతంలో కూడా అసంఖ్యాక, అవాస్తవిక ప్రమేయాలు ఉండటంచే వీటి విశ్వసనీయత కూడా పరిమితమే.

3. ద్రవ్య నిల్వల స్థాయి కూడా వాస్తవిక జాతీయాదాయ స్థాయిపై (Kఅనేది, OTలపై) M పై (ద్రవ్య సప్లైపై) ఆధారపడితే ద్రవ్య నిల్వల పాత్రను విడదీసి ప్రత్యేకంగా చెప్పలేం.

4. ఫిషర్ సిద్ధాంతంలాగే ఇదికూడా మిగతా చలాంకాలను స్థిరంగా భావించి, సంపూర్ణోద్యోగితాస్థితికే పరిమితమయింది. అలాగే ద్రవ్య వ్యవహారాలకు మొత్తం ద్రవ్యాన్ని వాడితే సిద్ధాంతాలన్నీ ఒక్కటే అవుతాయి.

5. ద్రవ్యాన్ని వస్తు కొనుగోళ్ళకు ప్రస్తుతం వాడుతున్నప్పుడు ద్రవ్య చలామణి వేగం (V), ద్రవ్య నిలువలను పరోక్షంగా సూచిస్తుంది. చలనవేగాని (V) కి, నిల్వల నిష్పత్తి (K) కి సంబంధం ఉన్నప్పుడు కేవలం V కి బదులు K వ్యుత్క్రమంగా వాడినట్లు తెలుస్తుంది. ఆ స్థితిలో ప్రత్యేకంగా ధరల మార్పుకు ఏది కారణమో

చెప్పలేకపోతుంది. అంచనాలలోని, ఆదాయ నిర్ణయాంశాలలో మార్పులు ఏవిధంగా K ని మారుస్తాయో తెలుపక కేవలం K అనేది స్వతంత్ర చలాంకంగా భావించారు.

6. ఏ ప్రక్రియ ద్వారా K(ద్రవ్య నిల్వలు) ధరలను ప్రభావితం చేస్తాయో తెలుపదు. ద్రవ్యాన్ని ఎక్కువ దాస్తే వడ్డీరేటు తగ్గుతుందా; పెట్టుబడులు, ఉత్పత్తి, డిమాండులు తగ్గి ధరలు తగ్గుతాయా; ధరల మార్పు ఎలా, ఎందుకు, ఎంత మారుతుందో చెప్పజాలదు.

7. చట్టబద్ధ ద్రవ్యాన్ని తక్కువ భాగం ఖర్చుకుంచుకొని, ఎక్కువ భాగం బ్యాంకులలో నిల్వగా దాచినప్పుడు, బ్యాంకులు పరపతి ద్వారా ఎక్కువ ద్రవ్యాన్ని (ఖర్చుకోసం పరపతిని) సృష్టించవచ్చు. అప్పుడు దాచిన నిల్వలను దాని పాత్రను తెలుపటం సాధ్యం కాదు. ద్రవ్యాన్ని ఎక్కువ దాస్తే ధరలు (పరపతి సృష్టిచే) పెరుగవచ్చు. ఇది వైపరీత్య పరిస్థితి (paradox). ఏరకమైన డిపాజిట్లను దాచుకున్న ద్రవ్యంగా పరిగణించాలో కూడా కచ్చితంగా తెలుపలేదు.

8. ఉత్పత్తి ఖర్చులు, సాంకేతిక స్థితి మారినప్పుడు, ద్రవ్య, ద్రవ్యేతర అంశాలు మారినప్పుడు, నిజ ఆదాయాలు, స్పెక్యులేషన్, మానవ సంపద (ఫ్రీడ్‌మన్ అన్నట్లు), పోర్టుఫోలియో మార్పులు ద్రవ్యానికున్న డిమాండును ఎలా ప్రభావితం చేసి, తామే ప్రధాన పాత్ర ఎలా వహిస్తాయో తెలుపజాలదు.

9. కేన్స్ చెప్పిన ద్రవ్యరాశి సిద్ధాంతం ప్రకారం కేవలం వినియోగ వస్తు ధరల నిర్ణయం మాత్రమే తెలుపబడింది. నిజానికి వ్యవస్థలో పెరుగుదల ఉన్నప్పుడు పెట్టుబడి, వినియోగ వస్తు నిష్పత్తి పెరుగుతుంది. అందువల్ల పెట్టుబడి వస్తు ధరల నిర్ణయం, దాని ప్రభావం మరవటం మంచిది కాదు.

10. వస్తు మార్కెట్లో డిమాండు సప్లైలు ధరలను మార్చగలిగితే, కేవలం ద్రవ్య డిమాండుకే దాన్ని ముడిపెట్టడం, సరియైన పద్ధతికాదు.

11 నగదు నిల్వల సిద్ధాంతంలో చక్రీయ కార్య కారణ సంబంధం (circular causation) ఉండటంచే దేన్నీ సరిగ్గా చెప్పజాలదు. ఎంత ద్రవ్యాన్ని చేతిలో నగదుగా ఉంచుకోవాలో తెలియాలంటే, తాను కొనబోయే వస్తువుల పరిమాణమే (quantity) గాక, ధరలు (prices) కూడా తెలియాలి. ధరలు తెలియనిది ఎంత డబ్బు (ద్రవ్యం) నిల్వచేయాలో తెలియదు. అట్టి ద్రవ్య విలువలు తెలియకుంటే (ఈ సిద్ధాంతం ప్రకారం)ధరల స్థాయి తెలియదు. ఒక్క మాటలో చెప్పాలంటే P తెలియనిది K తెలియదు. K (ద్రవ్య విలువ) తెలియకుంటే P (ధరల స్థాయి)ని నిర్ణయించలేం.

12. ఈ సిద్ధాంతాలు నిగూఢమైనవి (Abstract), ఊహాత్మకమైనవే తప్ప చారిత్రాత్మక, అనుభవ పూర్వకమైన (empirical) సిద్ధాంతాలు కావు.

13. నిరుద్యోగిత, ఆర్థిక మాంద్యం సంభవించినప్పుడు, ద్రవ్య సప్లై పెంచినా ధరలు పెరగనందున ఫిషర్ సిద్ధాంతం నిరుపయోగమైంది. కచ్చితంగా K ని తగ్గించి ధరలను పునరుద్ధరించడంలో కేంబ్రిడ్జ్ సిద్ధాంతాలు విఫలమయ్యాయి. కావున A. C. L. Day అన్నట్లు ఇవి ఉపయోగంలేని సిద్ధాంతాలుగా పేరుగాంచాయి.

14. ధరల స్థాయిలో (K మార్పులవల్ల) ఏ అనుపాతంలో మార్పులు ఖచ్చితంగా వస్తాయో ఈ సిద్ధాంతాలు తెలుపలేదు. సమీకరణాల లక్షణాలను బట్టి ఈ సంబంధాలు మారతాయి. ఏరకమైన సమీకరణం మేలైనదో (best fit), సరియైనదో తెలిపే ప్రయత్నం చేయక సామాన్య సమీకరణం ద్వారా అనుపాత సంబంధాన్ని తెలుపటం జరిగింది.

15. వడ్డీ చేత ద్రవ్య డిమాండ్ ఎలా ప్రభావితం చేయబడుతుందో తెలుపనిచో అది అసంపూర్ణమని డాన్ పాటిన్కిన్ అంటాడు.

## 5. 4 ద్రవ్యరాశి సిద్ధాంతాల సమీక్ష : ఫిషర్ - కేంబ్రిడ్జ్ సమీకరణాల మధ్య పోలికలు

ద్రవ్య విలువను నిర్ణయించటంలో ద్రవ్యం మాత్రమే ప్రముఖ పాత్ర వహిస్తుందని ద్రవ్యరాశి సిద్ధాంతాలు తెలిపాయి. ఫిషర్ సిద్ధాంతం ప్రకారం ద్రవ్య వ్యవహారాలకు వాడే ద్రవ్య సప్లై పెరిగితే ధరలు పెరిగి, ద్రవ్య విలువలు తగ్గుతాయి. అదే కేంబ్రిడ్జ్ వారు ద్రవ్యాన్ని దాచుకోవటానికి నగదు నిలువలు ఉంచుకున్నందున అవి మారినప్పుడు ద్రవ్య వ్యవహారాలకు మిగిలే ద్రవ్యం మార్పులకు లోనయి ద్రవ్య విలువలు మారుతాయి. రెండు సిద్ధాంతాలు కూడా ధరలు మిగతా అంశాలను ప్రభావితం చేయవని, ఇతర అంశాలే ధరలను ప్రభావితం చేస్తాయని తెలిపినాయి.

ఫిషర్ సిద్ధాంతం, కేంబ్రిడ్జ్ సిద్ధాంతాల మార్గాలు వేరైనా ధరలను నిర్ణయించటంలో ద్రవ్య అంశాలే ప్రధాన పాత్ర వహిస్తాయి.

ఫిషర్ సిద్ధాంతంలో $P = \frac{MV}{T}$.

రాబర్ట్సన్ (కేంబ్రిడ్జ్) సిద్ధాంతంలో $P = \frac{M}{KT}$.

పై రెండింటిలోనూ M అంటే ద్రవ్య సప్లై , P అంటే ధరలస్థాయి, T అంటే వస్తువుల సంఖ్య. ఫిషర్ సిద్ధాంతంలోని V కి కేంబ్రిడ్జ్ వారి K కి దగ్గరి సంబంధం దాదాపు ఒకటే అన్నంతగా ఉంటాయి. K పెరగడం అంటే ద్రవ్యాన్ని వాడకుండా దాచుకోవటం. దాని అర్థం ఖర్చును, ద్రవ్య చలామణిని తగ్గించుకోవటమే. అందుకే K పెరిగితే V తగ్గుతుంది. V అనేది K కి వ్యుత్క్రమం, విభిన్నం.

$V = \frac{1}{K}$ అయినప్పుడు

$P = \frac{M}{T}.V$ బదులుగా $\frac{M}{T}\cdot\frac{1}{K}$ అని కూడా వ్రాయవచ్చు.

కావున $\frac{M}{T}\cdot\frac{1}{K} = \frac{M}{KT} = P =$ ధరలస్థాయి అని రాబర్ట్సన్ కూడా తెలిపాడు. కావున ఈ రకంగా రెండూ ఒకే అంశాన్ని తెల్పాయి.

ఫిషర్ సమీకరణంలో M, M′ లను చట్టబద్ధ, బ్యాంకు ద్రవ్యాలుగా చెప్పితే, కేంబ్రిడ్జ్ సమీకరణంలో M ను మొత్తం ద్రవ్య సప్లైగా $K, K_1$ ల ద్వారా చట్టబద్ధ, బ్యాంకు ద్రవ్యాల రూపంలో ఉంచుకోదలచుకున్న నగదును తెలిపారు.

$MV = PT$ ఫిషర్ చెప్పిన సమీకరణం కాగా హాన్సెన్ (Hansen) అన్నట్లు $M = PT\left(\frac{1}{V}\right)$ లేదా $M = PTK$ అనేది కేంబ్రిడ్జ్ సమీకరణం కావున రెండూ ఒకటే అంటాడు.

ఫిషర్ సిద్ధాంతం ప్రకారం ద్రవ్యాన్ని కేవలం వాడుకోవడానికే (money on wings) అంటే, కేంబ్రిడ్జ్ వారు దాన్ని కొంత దాచుకోవడానికి (money sitting or filing up) డిమాండ్ చేస్తారని అంటారు. దాచుకునే భాగం శూన్యంగా ఉన్నప్పుడు, ద్రవ్యం వాడకానికేదైతే ఉంటుందో అదే ధరలను నిర్ణయిస్తుంది. రెండు సిద్ధాంతాల ప్రమేయాలు ఒకే తీరుగా ఉండటమే గాక, సంపూర్ణోద్యోగితలో ద్రవ్య వ్యవహారాలకు గాని, నిల్వలకు గాని వాడే ద్రవ్యమే కారకాంశంగా (cause), P ని నిష్క్రియాంశంగా (passive) తెల్పాయి. రెండు సిద్ధాంతాలలో కూడా చక్రీయ కార్యకారణ సంబంధ దోషమున్నది. ఉదాహరణకు తీసుకుంటే, ధరలను బట్టే T, M, K, $K_1$, V, V′ లు

B R A O U

నిర్ణయింపబడినప్పుడు M, K, V లు ధరలను నిర్ణయిస్తాయనటం, విడదీయరాని వృత్తానికి అంచులను, కొసలను (ends) వెతికినట్లవుతుంది.

పై రెండు సిద్ధాంతాలు కూడా అనుకూల వాతావరణంలో (fair weather) పనిచేసేవే. ఆర్థిక మాంద్యం, ఇతర సంక్లిష్ట సమయాల్లో వీటి పనితీరును తెలుపలేక పోయాయి. వాస్తవిక వస్తు మార్కెట్లను (goods market), ద్రవ్య మార్కెట్‌ను (money market) సమన్వయ పరచని అన్ని సిద్ధాంతాలు పరిమిత పరిధి కల్గినవే.

### 5. 4. 1 కేంబ్రిడ్జ్ - ఫిషర్ సమీకరణాల మధ్య తేడాలు

ఈ రెండు సిద్ధాంతాల లక్ష్యాలు ఒకటే అయినా వాటి పంథాలు వేరు. అవి వాడిన భావాలు, పదాలు, అర్థాలు వేరుగా ఉంటాయి.

**పట్టిక -5.1: ఫిషర్ - కేంబ్రిడ్జ్ సమీకరణాల మధ్య గల భేదాలు**

| ఫిషర్ సమీకరణం | కేంబ్రిడ్జ్ సమీకరణం |
|---|---|
| 1. కొంత కాలానికి, ప్రవాహ రూపానికి చెందినది. | 1. ఒక నిర్ణీత సమయానికి చెందినది. |
| 2. దీర్ఘ కాలానికి వర్తిస్తుంది. | 2. కాలంతో ప్రమేయం లేదు. ఉత్పత్తి మారని దీర్ఘ, స్వల్ప కాలాలలో కూడా వర్తిస్తుంది. |
| 3. ద్రవ్యం వస్తువుల కొనుగోలుకు, వ్యవహారాలకు వాడబడుతుంది. ద్రవ్యం రెక్కలతో ఎగురుతూ ఉన్న పక్షిలా ఉండి లావాదేవీలకై పూర్తిగా వాడబడుతుంది. | 3. ద్రవ్యం వస్తువులను భవిష్యత్తులో కొనడానికి, దాయటానికి, నిలువ విలువకై వాడబడుతుంది. ద్రవ్యం నిలువగా ఉండి కూడుతూ (filing up) ప్రస్తుత లావాదేవీలకు ప్రతిగా, వ్యతిరేకంగా పనిచేస్తుంది. |
| 4. అన్ని వస్తువులు ద్రవ్యంచే కొనబడుతాయి. ద్రవ్యం పూర్తిగా వ్యవహారాలకు వాడబడి ప్రవాహరూపంలో ఉంటుంది. | 4 అన్ని వస్తువులు కూడా దాచగా మిగిలిన ద్రవ్యంచే కొనుక్కోబడతాయి. ద్రవ్యం నిలువ రూపంలో ఉంటుంది. |
| 5. ద్రవ్యం విలువ ఏ ప్రక్రియ ద్వారా మారుతుందో చెప్పలేదు. | 5. దాచుకోగా మిగిలిన ద్రవ్యం ఖర్చుచేయబడే పరిమాణాన్ని బట్టి, చలన వేగంలో మార్పును తెచ్చి ద్రవ్య విలువను మార్చుతుందని తెల్పుతాయి. కాని సక్రమరీతిలో మార్పు ప్రక్రియ చెప్పబడలేదు. |
| 6. కేవలం ద్రవ్య సప్లైలోని మార్పు ధరలను మార్చుతుంది. | 6. కేవలం ద్రవ్యానికి ఉన్న డిమాండు ధరలను మార్చుతుంది. |
| 7. అన్ని అంతిమ వస్తువుల సగటు ధరలను తెల్పుతుంది. | 7. కేవలం వినియోగ వస్తు ధరల (కేన్సు ప్రకారం) స్థాయిని తెల్పుతుంది. |
| 8. భవిష్యతును, అంచనాలను బట్టి మార్పులను తెలుపదు. | 8. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుంది. కాని అంచనాలు, నష్ట భయాలు తెలుపబడలేదు. |
| 9. చలనాత్మక, సంపూర్ణోద్యోగిత వ్యవస్థలో (కూడా) పనిచేస్తుంది. | 9. నిశ్చలాత్మక వ్యవస్థకే వర్తిస్తుంది. |
| 10. చలామణి వేగం కొంత కాల వ్యవధికి సంబంధించింది. | 10. ద్రవ్య నిలువ నిర్ణీత సమయానికి సంబంధించింది. |
| 11. ప్రమేయాన్ని బట్టి V మారదు. | 11 V లేదా $\frac{1}{K}$ మారుతుంది. |
| 12. సాంకేతిక, పరిమాణాత్మక అంశాలు ప్రాముఖ్యత పొందినాయి. | 12. మానసికాంశాలు, ఆలోచనా వైఖరులు ప్రాధాన్యత కల్గి యుంటాయి. |
| 13. వ్యాపార చక్రాలను తెలుపదు. | 13. వ్యాపార చక్రాల మార్పులకు కారణం తెలుపుతుంది. |
| 14. M స్వతంత్ర చలాంకం. | 14. $K_0$ స్వతంత్ర చలాంకం. |

BRAOU

### 5.4. 2 ఫిషర్ సిద్ధాంతంపై కేంబ్రిడ్జ్ వారి ఆధిక్యత

ద్రవ్యాన్ని కేవలం వ్యవహారానికే వాడతారని ఫిషర్ భావిస్తే, నిల్వలకు కూడా వాడతారని కేంబ్రిడ్జ్ వారు అనటం మెరుగైన విధానం. సరియైన హేతుబద్ధత (rationale) లేకుండా M మారితే P మారుతుందన్నారు అమెరికన్ శాస్త్రవేత్తలు. కాని M మారకున్నా K మారితే P మారవచ్చని, M మారినా, K మార్పుల గతి, పరిమాణాన్ని బట్టి ఉంటుందని కేంబ్రిడ్జ్ సిద్ధాంతాలు తెలిపినారు. మానవుని ప్రవర్తన, ఆలోచనలు ఎలా (K లో) మార్పులు తెస్తాయో కేంబ్రిడ్జ్ వారు తెల్పి ధరల మార్పు గురించి తెలిపినారు. చికాగో సిద్ధాంతాలు చారిత్రాత్మకమైనవే కాకుండా ఉపయోగిత కల్గి ఉంటాయి. ఫిషర్ సిద్ధాంతం వ్యాపార చక్రాల ఉనికిని తెలియచేయదు. కాని కేంబ్రిడ్జ్‌వారు అవి ఎలా, ఎందుకు ఉంటాయో (మాత్రం) తెలిపారు.

ఫిషర్ సమీకరణంలో M, V ల అనుసంధానం సరియైనది కాదు. M ఒక నిర్దిష్ట సమయానికి చెందిన నిశ్చలాంశం. అది V కాల ప్రవాహానికి చెందిన అనిశ్చల చలాంకం. ఈరెండింటిని గుణించటం సరియైన పద్ధతికాదు. అదే కేంబ్రిడ్జ్ సమీకరణ విషయంలో M తో పాటు K కూడా ఒక నిర్ణీత సమయానికే చెందటం వలన వాటి అనుసంధానం సరియైనది.

ద్రవ్యాన్ని దాచుకోవటంలో మార్పులేకాక, పరోక్షంగా ఉత్పత్తి అయిన వస్తువులలో కొన్నింటిని తర్వాత వాడుకుందామనే అభిమతంతో అన్ని వస్తువులపై ఖర్చు చేయకుండా కొన్నింటిని కొనడానికే ఆ ద్రవ్యం వాడితే ధరలు ఏమవుతాయో నిలువల సిద్ధాంతం తెల్పుతుంది. ద్రవ్యాన్ని దాచుకోవటానికి బదులు, వస్తు రూపంలోనే T (వస్తువుల) ని దాచుకుంటే ఏమవుతుందో రాబర్ట్సన్ సిద్ధాంతం తెల్పుతుంది. అంటే M ను కూడా ద్రవ్య వ్యవహారాలకు వాడుతున్నారా లేదా అనేది K పైన ఎలా ఆధారపడుతుందో, T లో కూడా ఎంత భాగం కొనుగోళ్ళు ప్రస్తుతం చేస్తున్నారు అనే దానిపై ధరలు ఆధారపడతాయనటం దీని భావం.

ఫిషర్ సిద్ధాంతంలో V ని స్థిరంగా వుంటుందనే ప్రమేయం చేయాల్సి వచ్చింది. నిజానికి కరెన్సీ నోట్లు అందుబాటులో ఎక్కువ ఉంటే చలామణి వేగం తగ్గుతుంది. అలాగే V పెరిగితే M తక్కువ అవసరం ఉంటుంది. ద్రవ్యోల్బణ స్థితిలో (M) ద్రవ్యరాశి తగ్గినా ద్రవ్య సప్లై తగ్గదు. ఈ మార్పులను కేవలం ప్రమేయాలతో మరుగున పెట్టారు. కాని పిగూ అన్నట్లు K ప్రభావం ద్రవ్యరాశిపై (M) ఎట్టి స్థితిలో కూడా ఉండదు. కావున, ఇది వాస్తవికతకు దగ్గరగా ఉంది. అలాగే M ప్రభావం V పై ఉంటుంది. కాని, K పై సామాన్య స్థితిలో ఉండదు.

దీర్ఘకాలానికి తన సిద్ధాంతాన్ని వర్తింపచేయటం వల్ల ఫిషర్ ఉత్పత్తి మారదన్నాడు. ఆ ప్రమేయం లేకుండా, ఏదేని సమయం వద్ద ఉన్న వస్తు రాశి ధరల స్థాయిని నిశ్చిత ద్రవ్య డిమాండ్ (K. T) ఎలా ప్రభావితం చేస్తాయో కేంబ్రిడ్జ్ సిద్ధాంతం తెలిపింది. సమీకరణాలలో కేన్స్, పిగూలు తెలుపకున్నా, K మారినప్పుడు, వడ్డీరేట్ల ద్వారా సార్థక డిమాండులో మార్పుల ద్వారా, పరోక్షంగా ఎలా ద్రవ్యం విలువ మారుతుందో తెలిపే అవకాశం, భావి సిద్ధాంతాల నిర్మాణానికి పునాది కల్పించారు.

ద్రవ్యేతర అంశాల పరోక్ష ప్రమేయాన్ని K ద్వారా తెలిపి కేంబ్రిడ్జ్ శాస్త్రవేత్తలు, ఫిషర్ సిద్ధాంతం కన్న మెరుగైన సిద్ధాంతాన్ని తెలిపినారనటానికి పైన తెల్పినవి కొన్ని మచ్చుతునకలు (sample) మాత్రమే. క్రమేపీ ద్రవ్య సిద్ధాంతాలు, ద్రవ్యరాశిలోని మార్పులేకాక, ఆదాయ మార్పులు, పెట్టుబడి మార్పులు, డిమాండ్‌లోని మార్పుల ప్రాధాన్యత గుర్తించి కొత్త సిద్ధాంతాలను వివరించటం జరిగింది. అలా రూపొందించిన వాటిలో కేన్స్ ఆదాయ సిద్ధాంతం, ఫ్రీడ్‌మన్ రీస్టేట్‌మెంట్ సిద్ధాంతం మొదలైనవి కలవు. వాటిని ముందు ముదు వివరిస్తాం. కావున వాటిని క్లుప్తంగా తెలుసుకుందాం.

BRAOU

## 5. 5 ఆదాయ - వ్యయ సిద్ధాంతం : ధరల నిర్ణయం

ద్రవ్యరాశి సిద్ధాంతాలు కేవలం ద్రవ్యానికి సంబంధించిన అంశాలకే ప్రాముఖ్యతనిచ్చాయి. అందుకుగాను అనేక ప్రమేయాలను చేసాయి. వాస్తవ పరిస్థితులకు అన్వయించిన ఫిషర్, కేంబ్రిడ్జ్‌ల సిద్ధాంత పరిమితులు, లోపాలు 1930 ఆర్థిక మాంద్యంలో తెలిసివచ్చాయి. ద్రవ్య సప్లైని పెంచి ధరలు పెరిగేటట్లు చూడటానికి ఎంత ప్రయత్నించినా ధరలు పెరగలేదు. సనాతన ద్రవ్యరాశి సిద్ధాంతాలలోని లోపాలు సవరించటానికి, అవసరమైన చోట్ల వాస్తవిక పరిస్థితులను బట్టి కొత్త సిద్ధాంతాలు రూపొందించటం జరిగింది. అందులో కేన్స్ సార్వత్రిక సిద్ధాంతం ఒకటి. కేన్స్ వ్రాసిన "జనరల్ థీరీ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్, ఇంటరెస్ట్ అండ్ మనీ" లో ద్రవ్య సిద్ధాంతాలకు, వస్తు విలువలకు మధ్య సంబంధం తెలిపినాడు. కేన్స్ దీర్ఘకాలానికి కాకుండా స్వల్పకాలానికి ప్రాధాన్యత ఇచ్చాడు. ద్రవ్యం ప్రభావం ధరలను ఏమేరకు పెంచగల్గుతుందో రెండు రకాలుగా చెప్పవచ్చు. ఒకటి, సంపూర్ణోద్యోగిత స్థితిలో ఉత్పత్తి మారనందున ద్రవ్య సప్లై ఏ అనుపాతంలో పెరిగితే ధరలు కూడా అదే అనుపాతంలో పెరగటం. రెండవది, వ్యవస్థలో సంపూర్ణోద్యోగిత లేకుండా ఉండి, ద్రవ్య సప్లై పెరిగినప్పుడు, వస్తువులకు డిమాండు పెరిగి, దాని ఫలితంగా వస్తు సప్లై కూడా పెరిగినందున ధరలు వివిధ అనుపాతాల్లో మారటం లేదా మారకపోవటం.

సంపూర్ణోద్యోగితా స్థితిలో ద్రవ్య సప్లై పెరిగితే, సమష్టి డిమాండు పెరుగుతుంది. వస్తు సప్లై వ్యాకోచత్వం శూన్యంగా ఉన్నందున సమష్టి డిమాండు పెరిగినప్పుడు ధరలు ద్రవ్యరూపంలో పెరుగుతాయి. సవరించిన ద్రవ్య సిద్ధాంతం ప్రకారం, నిరుద్యోగిత ఉన్నప్పుడు, సమష్టి డిమాండ్ పెరిగిన అనుపాతంలో ఉద్యోగిత పెరుగుతుంది. కావున ధరలు మారకపోవటానికి కారణం ఉత్పత్తి కూడా పెరగటం.

కేన్స్ ద్రవ్యానికి ధరలకు ప్రత్యక్షంగా కాకుండా పరోక్ష సంబంధం తెలిపాడు. వడ్డీ రేట్లకు, ద్రవ్యానికి, ఉద్యోగితకు ఉన్న పరస్పర సంబంధం తెలిపి వాటిలోని మార్పులు ఆదాయాన్ని, సమష్టి డిమాండును, ధరల స్థాయిని స్థూలంగా ఎలా నిర్ణయిస్తాయో తెలిపాడు. వస్తువుల డిమాండ్, సప్లైలు సాపేక్షిక విలువలను నిర్ణయిస్తాయి. అదే ద్రవ్య సప్లై డిమాండులు నిరపేక్ష వస్తు ధరలను నిర్ణయిస్తాయి. మొదటిది వస్తు విలువను, రెండవది ద్రవ్య విలువలను తెల్పుతాయి. కాని వస్తు ఉత్పత్తి, వినిమయాలకు ద్రవ్య సప్లై , డిమాండులతో సంబంధం ఉంటుంది. కావున వాటిని వేరు వేరుగా చెప్పటం (dichotomy) తప్పిదం అవుతుంది. ఆ తప్పిదం సాంప్రదాయక ఫిషర్, కేంబ్రిడ్జ్ సమీకరణాలలో కన్పిస్తుంది.

BRAOU

కేన్స్, హాన్సెన్లు ఆ రెండు రంగాలను సమన్వయ పరచి, ఆదాయ ఉద్యోగితా సిద్ధాంతంతో ద్రవ్య సిద్ధాంతాన్ని అవాస్తవిక ప్రమేయాలను తొలగించి, సమన్వయ పరిచాడు. విక్సెల్, ఆస్ట్రేలియన్, కేలస్కీల చేతిలో రూపుదిద్దుకొంటున్న స్థూల సిద్ధాంతాలకు కేన్స్ సార్వత్రిక సిద్ధాంతం ప్రాణం పోసింది. 1929లో " A Treatise on Money" లోని అభిప్రాయాలకు అదే కేన్స్ 1936లో వ్రాసిన వాటికి బేధం ఉంది. మొదటి గ్రంథంలో దాదాపు సంప్రదాయ ద్రవ్యరాశి సిద్ధాంతాల మాదిరిగానే (కేవలం) నిజాన్ని (truism)తెలిపే సమీకరణాలు వాడి ప్రత్యేకంగా ద్రవ్యం ధరలనెలా పెంచుతుందో చెప్పలేకపోయాడు.

దేశంలోని ఆదాయం (E) నుండి పొదుపును (S) తీసివేయగా వినియోగ వ్యయం వస్తుంది. దానిని వినియోగ వస్తువుల ఉత్పత్తిచే (R) భాగిస్తే వినియోగ వస్తు ధర ($P_c$) పొందవచ్చు.

జాతీయాదాయం (E) మొత్తం వ్యయానికి సమానం.

$$P_C = \frac{E - S}{R}$$

పై సమీకరణం వినియోగ వ్యయాన్ని, వినియోగ వస్తువులచే భాగించగా వచ్చే ధరల స్థాయిని తెల్పుతుంది.

అన్ని రకాల వస్తు ధరలను కూడా ఇలాగే తెల్పుతారు. వినియోగ పెట్టుబడి వస్తువులను అమ్మగా వచ్చిన రాబడిని 'E' అనుకొని, అన్ని వస్తువుల జాతీయ ఉత్పత్తిని 'O' అనుకుందాం. E ని ఉత్పత్తిచే భాగించితే అన్ని రకాల వస్తు సగటు ధర 'P' లభిస్తుంది (I = S ఉంటే)

$$P = \frac{E}{O} + \frac{I - S}{O}$$

వస్తువులను అమ్మితే లాభాలు వస్తాయనుకోండి. అప్పుడు పెట్టుబడి (I) పొదుపు కన్న (S) ఎక్కువ ఉంటుంది (నేటి పెట్టుబడికి డబ్బు లాభాలపై, గత ఉత్పత్తి చేసిన ఖర్చు అందుబాటులోని S పైన ఆధారపడుతుంది). నష్టాలు రావడమంటే ఉత్పత్తి కోసం కేటాయించిన పొదుపు (S అంటే ex ante saving) కన్న పెట్టుబడి (ex post saving) తక్కువ ఉండటమే. వాటిని క్రింది విధంగా చెప్పవచ్చు.

I - S > zero ..... లాభాలు (సామాన్య లాభాలకన్న ఎక్కువ)

I - S = zero. . . . . సామాన్య లాభాలు

I - S < zero . . . . నష్టాలు (ఋణాత్మక లాభాలు)

P లేదా ధర = $\frac{E}{O} + \frac{I - S}{O}$ ప్రకారం వస్తువుల ధర తెలుసుకోవాలంటే E ని ఉత్పత్తిచే భాగించి, ఒక్కొక్క యూనిట్‌పై వచ్చే నికర లాభాలు కలపాలి. E అనేది ఇక్కడ వస్తువుల నుండి ఉత్పత్తి ఖర్చులకు సమానమయిన రాబడిని తెలుపగా, I మరియు S ల మధ్య బేధం లాభాలను తెలుపుతుంది. పొదుపు చేసి వాడగా లభించే పెట్టుబడి వల్ల రాబడి ఎక్కువగా ఉంటే (S కన్న I ఎక్కువ) లాభాలు వస్తాయి. అలాగే పొదుపు చేసి ఉత్పత్తికి వాడితే వచ్చే రాబడి తక్కువగా ఉంటే (I < S) నష్టాలు వస్తాయి (S > I అనవచ్చు).

E = రూ. 200 , I = రూ 100 , S = రూ. 100 , O = రూ. 50 వస్తువులు ఉంటే

ధర $P = \frac{200}{50} + \frac{(100 - 100)}{50} = \frac{200}{50} =$ రూ. 4 ఉంటుంది.

అలాకాకుండా I కి లభించిన ప్రస్తుత మొత్తం రూ. 200 ఉంటే (మిగతావి మారకుండా) ధరలు పెరుగటమో, ఎక్కువ ఉండటమో జరుగుతుంది.

$$P = \frac{200}{50} + \frac{(200 - 100)}{50} = \frac{200 + 100}{50} = \text{ రూ. } 6.$$

దీనివల్ల తెలిసేది ఏమంటే S కన్న I ఎక్కువ ఉంటే ధరలు ఎక్కువ, I కన్న S ఎక్కువ ఉంటే ధరలు తక్కువకావటం జరుగుతుంది. I, S విలువలను బట్టి ధరల మార్పు సంభవిస్తుందని ఆదాయ సిద్ధాంతం వివరించకముందే కేన్స్ అన్నాడు. ద్రవ్యంలోని మార్పులకన్న ఆదాయంలోని మార్పులే ధరల స్థాయిలో మార్పులు తెస్తాయని కేన్స్ సిద్ధాంతం తెల్పుతుంది.

### 5. 5. 1 ఆదాయ నిర్ణయంలో పార్థక, సమష్టి డిమాండులు - ధరల స్థాయి

స్థూలంగా పరిశీలిస్తే ధరల స్థాయి ఎక్కడైనా కనీస ఉత్పత్తి ఖర్చులు రాబట్టుకునేంత ఉంటే తప్ప వస్తువులను సప్లై చేయరు. వస్తు సప్లై పెరగాలంటే స్వల్పకాలంలో ఉత్పత్తి, ఉద్యోగితలు పెరగాలి. ఎంత విలువ కల వస్తువులను ఉత్పత్తి చేసేది సమష్టి డిమాండుపై ఆధారపడుతుంది. నిర్ణీత ఆదాయం వద్ద అన్ని వస్తువులకున్న డిమాండును (అన్ని వర్గాల ఖర్చు నుండి లభించే డిమాండును) సమష్టి డిమాండు అంటారు.

సమష్టి డిమాండు, సమష్టి సప్లై కన్న ఎక్కువ ఉంటే ధరలు పెరిగే వత్తిడి పరిస్థితి ఏర్పడుతుంది. కాని

ఉత్పత్తిని పెంచటం ద్వారా ధరలు పెరగకుండా ఉత్పత్తి పెరుగుతుంది. ఈ స్థితిలో సమష్టి డిమాండుకు తగ్గట్టుగా సమష్టి సప్లై ఉంటే ఆదాయ స్థాయి (ఉత్పత్తి కూడా) సమతౌల్యంలో ఉంటుంది. అట్టి సమతౌల్యాన్ని ఇచ్చే సమష్టి సప్లైకి తగ్గ సమష్టి డిమాండును సార్థక డిమాండ్ అంటారు.

నిజానికి సమష్టి డిమాండ్, సమష్టి సప్లై కన్న ఎక్కువ ఉన్నంత వరకు ద్రవ్యోల్బణ విరామం ఏర్పడి ధరలను పెంచే వత్తిడి తెస్తుంది. దీనిని పటం 5.4 ద్వారా చూద్దాం.




పటం - 5.4 : సమష్టి డిమాండ్, సప్లైలు

OA ఉత్పత్తి స్థాయి వద్ద వస్తువులకున్న డిమాండ్ AC ఉన్నట్లు C + I అనే సమష్టి డిమాండు రేఖ తెల్పుతుంది. కాని సప్లై మాత్రం OA లేదా AB. అప్పుడు BC భేదం ద్రవ్యోల్బణ విరామాన్ని చూపుతుంది. ఈ స్థితిలో ధరలు పెరుగుతాయి.

ఇక్కడ కేన్స్ ద్రవ్య - ఆదాయ సిద్ధాంత ప్రత్యేకత కన్పిస్తుంది. ప్రభుత్వం ద్రవ్యాన్ని పెంచటం ద్వారా వడ్డీ రేటు తగ్గి పెట్టుబడి పెరగవచ్చు. అప్పుడు సమష్టి డిమాండు పెరుగుతుంది. అలాగే లోటు ద్రవ్యం ద్వారా కూడా ప్రభుత్వ వ్యయం పెరిగి సమష్టి డిమాండు పెరుగుతుంది. మారిన డిమాండ్ వల్ల గాని, సమష్టి డిమాండు స్థాయి వల్లగాని ధరల స్థాయి పెరుగుతుంది. ఇది ద్రవ్యోల్బణ విరామం వల్ల ఏర్పడుతుంది. కాని ఉత్పత్తి కూడా వెంటనే పెరిగితే ధరలు పెరగవు. ఒక వేళ ఉత్పత్తి 'Q' వరకు పెరిగితే సమష్టి డిమాండ్, సమష్టి సప్లైలు QE వద్ద సమానంగా ఉన్నాయి. ఇక్కడ సార్థక డిమాండ్ వద్ద ధరలు స్థిరంగా ఉంటాయి. అదే AG స్థాయికి ఉత్పత్తి పెరిగితే సప్లై G.D ఉంటుంది. కాని సమష్టి డిమాండు G.L ఉండటంచే 'DL' విరామం ప్రతిద్రవ్యోల్బణ విరామాన్ని తెల్పుతుంది.

BRAOU

దీనివల్ల గుర్తుంచుకోవలసింది ఏమిటంటే, ద్రవ్య సప్లై వల్ల వడ్డీ, పెట్టుబడి, ప్రభుత్వ వ్యయం మారి సమష్టి డిమాండు మారుతుంది. అట్టి సమష్టి డిమాండుకు తగినంతగా సమష్టి సప్లై పెరగకపోతే ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. ధరలు పెరిగినప్పుడు ద్రవ్యం విలువ తగ్గుతుంది. ఈ విధంగా ఆదాయ - వ్యయ సిద్ధాంతం ధరల స్థాయిలో మార్పుకు కారణాలను తెలుపుతుంది. కాని కొన మెరుపు ఏమిటంటే స్వల్పకాల వ్యవధిలో ధరలు మారవనే ప్రమేయం చేసి ఉద్యోగితలో మార్పులు ఎలా వస్తాయో తెలపడానికే కేన్స్ తన సిద్ధాంతంలో ప్రాముఖ్యత ఇచ్చాడు.

### 5. 5. 2 కేన్స్ పొదుపు పెట్టుబడి సిద్ధాంతం - ధరల స్థాయి

ఆదాయాన్ని వినియోగానికి (C కి) ఉపయోగించగా మిగిలింది పొదుపు (S) అంటారు. ఈ పొదుపు రేఖను ధనాత్మక వాలు కలిగిన రేఖగా చూపుతాం. అదే పెట్టుబడి పెట్టే నిర్ణయాలు ఊహించిన లాభాలపై, గత అనుభవాలపై, వడ్డీ రేట్లపై, స్వయంప్రేరిత పెట్టుబడి, ప్రేరిత పెట్టుబడి నిర్ణయాలపై ఆధారపడతుంది. ఒకవేళ

పొదుపుకు సమానంగా (Y–C=S) పెట్టుబడి పెట్టినట్లయితే (Y–C=I), పొదుపు, పెట్టుబడుల సమానత్వం ఏర్పడి ధరలను నిలకడగా ఉంచుతుంది. పొదుపు కన్న పెట్టుబడి ఎక్కువగా ఉంటే సమష్టి డిమాండు, ధరలు పెరుగుతాయి. ధరలు పెరగకుండా ఉద్యోగిత, సప్లైలు పెరగవచ్చని కేన్స్ అంటాడు. దానికి భిన్నంగా I<S ఉంటే వస్తువుల సప్లైకి ఉన్న డిమాండు తక్కువై ధరలు తగ్గుతాయి.

పటం 5.5లో చూపినట్లు OA ఆదాయం వద్ద పొదుపు $AS_0$ గా ఉంటే పెట్టుబడి OB ఉన్నప్పుడు (I > S) సమష్టి డిమాండు సమష్టి సప్లై కన్నా ఎక్కువ ఉండి ధరలు పెరగటం, ఉత్పత్తి పెరగటం సంభవిస్తుంది.




పటం- 5.5

పొదుపు G $S_G$ స్థాయిలో ఉండి పెట్టుబడి GD మేరకే ఉంటే సమష్టి డిమాండు సాపేక్షికంగా సప్లై కన్నా తక్కువ ఉంటే ధరల స్థాయి తక్కువగా ఉంటుంది. ద్రవ్య పెట్టుబడిని పెంచిన స్థితిలో ఆదాయాలు కొన్ని రెట్లు పెరిగి, పొదుపు చేసే శక్తిని కూడా పెంచుతాయి. కాని ఈ సిద్ధాంతంలోని లోపం ఏమిటంటే అనుద్యోగిత ఉంటుందను కోవటం.

ద్రవ్య సప్లై మారినప్పుడు ద్రవ్యత్వాభిరుచి, ఆదాయ స్థాయిలను బట్టి వడ్డీరేటు మారుతుందని కేన్స్ తెలిపినాడు. హాన్సెన్ (Hansen) వడ్డీరేటు, వాస్తవిక పొదుపు పెట్టుబడులు, ద్రవ్యత్వాభిరుచి, ద్రవ్య సప్లైలపైన ఎలా ఆధారపడేది IS, LM రేఖల ద్వారా తెలిపినాడు. పాటిన్కిన్, పిగూలు వాస్తవిక నిలువల ప్రభావాన్ని తెలపగా, ఫ్రీడ్‌మన్ ద్రవ్య డిమాండును కొద్ది మార్పులతో సనాతన సిద్ధాంతాన్నే తెలిపినాడు.

## 5. 6 ఫ్రీడ్‌మన్ పునర్వ్యవస్థీకరణ సిద్ధాంతం - ధరలస్థాయి

మిల్టన్ ఫ్రీడ్‌మన్, సైమన్, మింట్, నైట్‌ల సిద్ధాంతాలు ద్రవ్యరాశి సిద్ధాంతాన్ని, సాధారణ ధరల సిద్ధాంతాలతో సమన్వయ పరిచాయి. దీనినే నవీన ద్రవ్యవాదం (New Monetarism), ద్రవ్యవాద విప్లవం (Monetarist Revolution) అంటారు. 1956వ సంవత్సరంలో తన 'The Quantity Theory of Money - A Restatement' ద్వారా పునర్వ్యవస్థీకరణ చేసాడు. ధర నిర్ణయంలో ద్రవ్య సప్లై పాత్ర ఎక్కువని తెలిపినాడు. ద్రవ్యపు సప్లై, డిమాండులు రెండు సామాన్యంగా ధరలను నిర్ణయిస్తాయి.

సంపదను వివిధ రూపాలలో ఉంచుకోవటానికి, ఆస్తుల ధరలు విభిన్నంగా ఉండటంవల్ల, ప్రతిఫలాలు, అభిరుచులు, అలవాట్లు, ఇతర ప్రాధాన్యతలను బట్టి ద్రవ్యాన్ని డిమాండు చేస్తారని తెలిపాడు. ద్రవ్యాన్ని దాచుకోవటం వలన ఇదొక మూలధనంగా కూడా పనిచేస్తుంది. ద్రవ్య డిమాండు స్థిరంగా ఉన్నప్పుడు ద్రవ్య సప్లై

BRAOU

ధరలను నిర్ణయించటాన్ని ఆగమన పద్ధతి ద్వారా గణాత్మకంగా (empirical) నిరూపించాడు.

ఫ్రీడ్‌మన్ ద్రవ్య సప్లై పెరిగితే ధరల స్థాయి పెరిగి నిజ ఆదాయం తగ్గుతుందంటాడు. ద్రవ్యానికున్న డిమాండును వడ్డీ రేట్లు, ధరలు కూడా మారుస్తాయని క్రింది సమీకరణం ద్వారా తెలిపాడు.

$$M = f\left(Y, P, r_b r_e, \frac{1}{p} \cdot \frac{dP}{dt}, W, U\right)$$

M = ద్రవ్యం (కరెన్సీ, డిపాజిట్లు, ద్రవ్యరాశికున్న మొత్తం డిమాండుకు సమానం)

$f$ = ప్రమేయం (function)

Y = శాశ్వత ఆదాయం

P = ధరల స్థాయి

$r_b$ = బాండ్లపైన ప్రతిఫలం రేటు

$r_e$ = ఈక్విటీలపై ప్రతిఫలం రేటు

$\frac{1}{P} \cdot \frac{dP}{dt}$ = ఊహించిన ధరల మార్పు

W = మానవేతర - మానవ సంపద నిష్పత్తి

U = అభిరుచులు, ప్రాధాన్యతలు.

పై సమీకరణం మొత్తం ద్రవ్యానికున్న డిమాండును తెలుపుతుంది. వ్యవస్థలోని ప్రతి వ్యక్తి ద్రవ్యాన్ని ఎంత డిమాండు చేస్తాడో తెలుసుకొని అందరినుండి వచ్చిన మొత్తం డిమాండును తెలుపుతుంది. ద్రవ్యం నుండి పెట్టుబడి ద్వారా లాభాలు ఎక్కువ వస్తాయని ఊహించితే తక్కువ డబ్బును తమ వద్ద దాచుకుంటారు.

BRAOU

ద్రవ్య సప్లై డిమాండుకు తగినంతగా లేకపోయినప్పుడే ధరలు మారినవని నిరూపించాడు. ద్రవ్య సప్లైలో మార్పు ఉత్పత్తిలో మార్పు తేవటం స్వల్ప కాలంలో మాత్రమే సాధ్యమంటాడు. ప్రభుత్వము ధరల స్థిరత్వం తేవాలంటే ఉత్పత్తి రేటులో వచ్చే పెరుగుదలకు సమానమయిన ద్రవ్య సరఫరా సప్లై పెంచాలి. స్వల్పకాలంలో ద్రవ్యం, ఆర్థిక కార్యకలాపాల మధ్య సంబంధాన్ని అంచనా వేయలేనప్పుడు స్వల్పకాలికంగా ధరల స్థాయిలో వచ్చే మార్పులను సరిదిద్దడానికి కేవలం ద్రవ్య విధానం చాలదంటాడు. ఫ్రీడ్‌మన్ ద్రవ్య విధానాలకే ప్రాముఖ్యత ఇచ్చాడు. ద్రవ్యరాశి సిద్ధాంతాన్ని ద్రవ్య డిమాండుగా అర్థంచేసుకోవాలంటాడు. ధరల స్థాయి, నిజ ఆదాయాలు, వడ్డీ రేట్లు, మొదలైనవి ద్రవ్య డిమాండును నిర్ణయిస్తాయి. ధరలు, ఆదాయాలు పెరిగితే ద్రవ్యానికి డిమాండు ఎక్కువగా ఉంటుంది. ఆదాయ ద్రవ్య వ్యాకోచత్వం 1.8 ఉంది అంటే ఆదాయం 10% పెరిగితే ద్రవ్యానికున్న డిమాండు దాదాపు 18% పెరుగుతుంది. దానికి తగ్గట్టుగా ద్రవ్య సప్లై చెయ్యలేకపోతే ధరలు మారుతాయంటాడు. అలాగే వడ్డీరేట్లు ఎక్కువ ఉంటే తక్కువ నగదు తమ వద్ద ఉంచుకుంటారు.

చికాగో సిద్ధాంతంగా పేరు పడిన ఈ ఫ్రీడ్‌మన్ పునర్నిర్వచన సిద్ధాంతం (Restatement Theory) లో, గణాత్మకంగా (empirical) ద్రవ్య సప్లై మారిన దిశలోనే, అదే అనుపాతంలోనే, వివిధ కారణాల వల్ల ధరల స్థాయి మారుతుందంటాడు. అయితే ఆధునిక ద్రవ్యరాశి సిద్ధాంతం, ద్రవ్యానికున్న డిమాండును తెలిపే ఈ సిద్ధాంతం, ధరలను మాత్రమే తెలుపదు. ఇందులో ద్రవ్యం కేవలం వినిమయానికే కాకుండా (ఫిషర్ లాగా కాక)ఇతర ఉపయోగాలకు కూడా వాడబడుతుంది. తాత్కాలిక కొనుగోలు శక్తికి ద్రవ్యం ఆవాసం (bode) మాత్రమే. కేన్స్

ద్రవ్యాన్ని పట్టించుకోలేదు. కాని ఫ్రీడ్‌మన్ ద్రవ్యం పాత్ర తప్పదన్నాడు (Money does not matter). ద్రవ్యానికి ఆదాయానికి ఉన్న సంబంధం పెట్టుబడి ఆదాయాలకు కూడా లేదంటాడు.

ఫ్రీడ్‌మన్ కూడా ద్రవ్య (రాశి) సప్లైలో మార్పులు జాగ్రత్తగా రూపొందిస్తే ధరలో మార్పులను తగ్గట్టుగా తేగలుగుతామని చెప్పాడు. వివరాలు మరో అధ్యాయంలో తెలుపబడ్డాయి.

## 5. 7 ముగింపు

ద్రవ్యరాశి సిద్ధాంతాలు ధరల స్థాయిని తెలుపటానికి రూపొందిచబడ్డాయి. ద్రవ్యరాశి సప్లైలో మార్పులు ధరలపై, ద్రవ్య విలువలపై ఎలా, ఎంత మేరకు ఉంటాయో తెలిపినాయి. సనాతన సిద్ధాంతాలు స్థూల దృష్టితో సంపూర్ణోద్యోగిత ఉన్నప్పుడు ధరలను నిర్ణయించేది ద్రవ్యరాశే అన్నాయి. దీర్ఘకాలంలో స్వయం ప్రేరితంగా సంపూర్ణోద్యోగిత ఏర్పడుతుందని వారి నమ్మకం. ఆ స్థితిలో సాధారణ ధరల స్థాయిని నిర్ణయించటానికి ద్రవ్యాధికారులు చేసే ద్రవ్య సప్లై ప్రధానమని అంటారు.

చలన వేగం, లావా దేవీలు స్థిరంగా ఉండి Mను ఎంత పెంచితే ధరలు అదే అనుపాతంలో పెరుగుతాయని ఫిషర్ లేదా అమెరికన్ సాంప్రదాయక ద్రవ్యరాశి సిద్ధాంతం తెలిపింది. అనవసరమైన, అవాస్తవికమైన ప్రమేయాలతో కూడిన ఫిషర్ సిద్ధాంతం వాస్తవిక, ప్రాపంచిక మార్పులను గుర్తించలేకపోయింది. కేంబ్రిడ్జ్ శాస్త్రవేత్తలు ద్రవ్య సప్లై పెరిగినా ధరలు అదే అనుపాతంలో పెరగకపోవటం కొన్ని సార్లు ధరలే మాత్రం మారకపోవటం గమనించారు. వారి నిగూఢ పరిశీలనలో ద్రవ్యం కేవలం ప్రస్తుత వస్తు కొనుగోళ్ళకే కాక, భవిష్యతులో విలువ నిలువ ఉంచుకోవటానికికూడా వాడబడుతుందని తేలింది. వస్తువులను భవిష్యత్తులో కొనుక్కోవటానికి కావలసిన కొనుగోలు శక్తిని ద్రవ్యం రూపంలో దాచుకుంటారు. అలా ద్రవ్యాన్ని కొంత దాచుకోవటం (K లోని మార్పుల) వల్ల ధరలు మారతాయి.

ద్రవ్యరాశికి ఫిషర్ ప్రాముఖ్యతనిస్తే, ద్రవ్య డిమాండుకు కేంబ్రిడ్జ్ వారు ప్రాముఖ్యతనిచ్చారు. మొదట్లో కేన్స్ వినియోగ వస్తువుల ధరల స్థాయికి, ద్రవ్య డిమాండుకు ఉన్న సంబంధం తెలిపాడు. ధరల మార్పు ఏ విధంగా ద్రవ్య సప్లై డిమాండు మార్పులతో అనుసంధానం చేయాలో సనాతన సిద్ధాంతాలు తెలుపలేదు. అందుకే ఆధునిక సిద్ధాంతాలు అనవసర ప్రమేయాలను తొలగించి, ఆగమన పద్ధతిని అవలంభించాయి.

BRAOU

1936వ సంవత్సరంలో కేన్స్ ఆదాయ ఉద్యోగితను తెలిపే సార్వత్రిక సిద్ధాంతంలో ద్రవ్య పాత్రను గుర్తించాడు. ద్రవ్య సప్లై పెరిగితే వడ్డీ రేట్లు తగ్గటం, పెట్టుబడి పెరగటం, ఆదాయాలు పెరగటం, దాని వల్ల డిమాండు, కొనుగోలు శక్తి పెరిగి ధరలు పెరుగుతాయంటాడు. ఆదాయం పెరుగుదల పెట్టుబడికి కొన్ని రెట్లు గుణకం ద్వారా పెరిగి, డిమాండు పెరుగుతుందంటాడు. అలాగే ద్రవ్యాన్ని దాచుకోవటానికి కారణం ముందు జాగ్రత్త కోసం, అంచనా వ్యాపారం కోసం అని గుర్తించాలి. దీన్ని ద్రవ్యానికున్న డిమాండు అంటారు. ద్రవ్య సప్లై పెరిగి ద్రవ్యత్వాభిరుచి మారకున్నా వడ్డీరేటు తగ్గి, పెట్టుబడి ఆదాయాలను పెంచుతుంది. అలాగే ద్రవ్య సప్లై మారక ద్రవ్యానికున్న డిమాండు (ద్రవ్యత్వాభిరుచి) తక్కువ ఉంటే వడ్డీరేటు తక్కువ ఉంటుంది. వడ్డీ రేటు పెరిగితే నగదు చేతిలో ఉంచుకోవాలనే కోరిక తగ్గుతుంది (మరియు vice versa). కాని నగదు చేతిలోనే ఎక్కువ ఉంచుకుంటే వడ్డీ రేటు పెరుగవచ్చు. వడ్డీరేటును నిర్ణయించే అంశాలుగా ద్రవ్యత్వాభిరుచి, ఆదాయ స్థాయిలను కేన్స్ పేర్కొన్నాడు. ఎందుకంటే పెట్టుబడి నిర్ణయాలు వడ్డీరేటు,ఉపాంత మూలధన సామర్థ్యాలపై ఆధారపడతాయి. కేన్స్ లక్ష్యం ధరలను నిర్ణయించే అంశాలు వివరించటం కాదు. పెట్టుబడి పొదుపును మించితే ధరల స్థాయి పెరిగే అవకాశం ఉందని, అలా పెట్టుబడులు పొదుపుల అసమతౌల్యం, ధరల ఆదాయ మార్పులని తెలిపాడు.

ద్రవ్య సప్లైలోని మార్పులను గణాత్మకంగా (empirical) తీసుకొని చారిత్రాత్మకంగా ధరలను అది ఎలా ఒకే దిశలో (same direction) మార్చిందో మిల్టన్ ఫ్రీడ్‌మన్ ఆధునిక ద్రవ్యరాశి సిద్ధాంతం తెలుపుతుంది. ద్రవ్యానికున్న డిమాండు స్థిరంగా ఉన్నప్పుడు ద్రవ్యంలో మార్పులు ధరలలో మార్పులను తెస్తాయంటాడు. అయితే ద్రవ్యాధికారులు తమ నిర్ణయాలు చేసేటప్పుడు ద్రవ్య సప్లై పెరిగినా ఎంత కాలానికి ధరలను పెంచగలుగుతాయో తెలుసుకుంటే తప్ప వారి చర్యలు సఫలీకృతం కాజాలవంటాడు. ద్రవ్యోల్బణ స్థితులలో కాల విలంబన సరిగ్గా తెలుసుకోకపోవటం, కావల్సిన మేరకు సప్లైలో (ద్రవ్యపు) మార్పులు తేవకపోవటం ధరల పెరుగుదలకు కారణమంటాడు. ఫ్రీడ్‌మన్ చెప్పినట్లు ద్రవ్యానికున్న డిమాండు అన్ని అంశాల పరస్పర ప్రభావం వల్ల స్థిరంగా ఉంది, ఉంటుంది. కావున ధర స్థాయి నిర్ణయించేది ప్రధానంగా ద్రవ్య సప్లయే అని తెల్పి ఫిషర్ ఈ సిద్ధాంతానికి మెరుగులు దిద్దాడు. ద్రవ్యరాశి సిద్ధాంతాలు, విధాన నిర్ణయాలకు, ప్రభుత్వ చర్యలకు సంపూర్ణంగా కాకున్నా, పాక్షికంగా, అన్ని వెరగుల కాకున్నా కొన్ని ప్రాంతాలలో ఎంతగానో తోడ్పడ్డాయి. పైన తెలిపిన ద్రవ్యరాశి సిద్ధాంతాలు ద్రవ్య ప్రాముఖ్యతకే అద్దం పట్టాయి.

## 5.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి సుమారు 40 పంక్తులలో జవాబులిమ్ము.**

1. ఫిషర్ ద్రవ్యరాశి సిద్ధాంతాన్ని వివరించి, దాని లోపాలను తెలపండి.
2. కేంబ్రిడ్జ్ సమీకరణాలు ద్రవ్య విలువలను తెలుసుకోవటానికి ఎలా తోడ్పడతాయి ?
3. సనాతన ద్రవ్యరాశి సిద్ధాంతాలలో ఏది మెరుగైనదో, ఎందుకో తెలపండి.
4. కేన్స్ ఆధునిక ఆదాయ సిద్ధాంతంలో ప్రత్యేకతలు, ద్రవ్యరాశివల్ల ఫలితాలు అందులో ఎలా ఉంటాయి?

**II. ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి సుమారు 20 పంక్తులలో జవాబులు ఇవ్వండి.**

1. ఒక నియమిత వ్యవస్థలో, ఉత్పత్తి మారని స్థితిలో, కరెన్సీ వర్షం కురిస్తే ధరలపై ప్రభావం ఎలా ఉంటుందో వివరించండి.
2. ఫిషర్, కేంబ్రిడ్జ్ సిద్ధాంతాలలో ఉన్న సారూప్యత, భేదాలను తెలపండి.
3. మిల్టన్ ఫ్రీడ్‌మన్ ఆధునిక ద్రవ్యరాశి సిద్ధాంతం ఫిషర్ సిద్ధాంతాన్ని యథాతథంగా అంగీకరిస్తుందా ? తెల్పండి.

## 5. 9 సంప్రదింపు గ్రంథాలు


1. CROWTHER, G. *"An Outline of Money"*
2. DAY, A. C.L . *"An Outline of Monetary Economics"*
3. HANSEN, J. C. *"Monetary Theory and Practice"*
4. KEYNES, J. M. *"General Theory of Employment, Interest and Money"*
5. MISHRA, M. N. *"Money, Banking and International Trade"*
6. NEWLYN , W. T. and BOOTLE, R. P. *"Theory of Money"*
7. Seth, M. L. *"Monetary Economics".*


BRAOU

## 5. 10 భావనలు

**ద్రవ్యరాశి** → దీనినే ద్రవ్య పరిమాణం అంటారు. నాణేలు, కరెన్సీ నోట్లు,బ్యాంకుల వద్ద ఉన్న డిపాజిట్లు మొదలైనవి. ఇది ద్రవ్య సప్లై కావాలంటే చలన వేగం యూనిట్‌గా ఉండాలి.

**ద్రవ్య సప్లై** → ఇది ద్రవ్యరాశి లేదా పరిమాణంపై మరియు ద్రవ్య చలన వేగంపై ఆధారపడుతుంది (అంటే M V). కాని ఫ్రీడ్‌మన్ సిద్ధాంతాలు ద్రవ్య సప్లైని (నిర్దిష్ట కాలంలో) M గా తెల్పాయి.

**ద్రవ్య చలన వేగం** → ద్రవ్యపు యూనిట్ లావాదేవీలకుగాను ఎన్ని చేతులు మారిందో, ఎన్ని దశల్లో మారకం జరిపిందో తెల్పుతుంది (ఇదే ద్రవ్య చలామణి వేగం).

**ద్రవ్య డిమాండ్** → ఫిషర్ దృష్టిలో ద్రవ్యాన్ని వ్యవహారాలకు కోరుకుంటారు లేదా డిమాండు చేస్తారు (P. T). కాని కేంబ్రిడ్జ్ వారి దృష్టిలో నగదుగా దాచుకునే ఆదాయం (లో భాగాన్ని) ద్రవ్య డిమాండ్ (KR).

**ద్రవ్యత్వాభిరుచి** → స్పెక్యులేషన్ కొరకు ఎంత ద్రవ్యాన్ని చేతిలో నగదుగా (నిర్ణీత వడ్డీ రేటు, ఆదాయ స్థాయిల వద్ద) ఉంచుకుందామని అనుకుంటారో తెల్పేది.

## 5. 11 పదకోశం

| | | |
|---|---|---|
| Abstract | = | నిగూఢ |
| Aggregate demand | = | సమష్టి డిమాండ్ |
| Aggregate supply | = | సమష్టి సప్లై |
| Assumptions | = | ప్రమేయాలు |
| Bode | = | ఆవాసం |
| Cash balances | = | నగదు (లేదా ద్రవ్య) నిలువలు |
| Cash transactions | = | ద్రవ్య వ్యవహారాలు |
| Deflation | = | ప్రతిద్రవ్యోల్బణం |
| Effective demand | = | సార్థక డిమాండ్ |
| Empirical | = | గణాత్మక, అనుభవ పూర్వక |
| Inflation | = | ద్రవ్యోల్బణం |
| Inflationary gap | = | ద్రవ్యోల్బణ విరామం |
| Liquidity preference | = | ద్రవ్యత్వాభిరుచి |
| Modern theories | = | ఆధునిక సిద్ధాంతాలు |

BRAOU

| | | |
|---|---|---|
| Quantity theory of money | = | ద్రవ్యరాశి సిద్ధాంతం |
| Real balance effect | = | వాస్తవిక నిల్వల ప్రభావం |
| Traditional Theories | = | సాంప్రదాయక సిద్ధాంతాలు |
| Transactions | = | లావాదేవీలు, వ్యవహారాలు |
| Velocity | = | చలన వేగం |
| Variables | = | చలాంకాలు, చలరాశులు |
| Coefficient | = | గుణకం |
| Correlation | = | సహ సంబంధం |
| Causation | = | కార్యకారణ సంబంధం |
| Inputs | = | ఉత్పాదకాలు |
| Intermediate goods | = | మధ్యంతర వస్తువులు |
| Product | = | ఉత్పత్తి ; లబ్దం |
| Frequency | = | పౌన : పున్యం |
| Stability | = | నిశ్చలత, స్థిరత్వం |
| Regularity | = | క్రమబద్ధత |
| Dependent variable | = | ఆధారిత చలాంకం |
| Closed economy | = | నియమిత వ్యవస్థ |
| Weightage | = | భారితం |
| Point of time | = | నిర్ణీత సమయంలో |
| Paradox | = | వైపరీత్యం |
| Money market | = | ద్రవ్యమార్కెట్ |
| Goods market | = | వస్తు మార్కెట్ |
| Fair weather | = | అనుకూల వాతావరణం |
| Rationale | = | హేతుబద్ధత |
| New monetarism | = | నవీన ద్రవ్యవాదం |
| Monetarist revolution | = | ద్రవ్యవాద విప్లవం |

- శ్రీ జి.వి. రంగారావు

BRAOU

# భాగం - 6 : ద్రవ్య డిమాండు దృక్పథాలు : సంప్రదాయ వాదులు, కేన్స్
## (Classical & Keynesian Approaches to Demand for Money)

విషయ క్రమం


6. 0 ఉద్దేశం

6.1 పరిచయం

6.2 ద్రవ్య డిమాండు ప్రాముఖ్యత

6.3 సంప్రదాయ వాదుల ద్రవ్య డిమాండు సిద్ధాంతం

6.4 కేన్స్ ద్రవ్య డిమాండు సిద్ధాంతం

6.5 దైనందిన వ్యవహారాల ఉద్దేశం

6.5.1 ఆదాయంచే నిర్ణయింపబడే దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు

6.5.2 దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు – వడ్డీ రేటు ప్రభావం

6.6 ముందు జాగ్రత్త కోసం చేసే ద్రవ్య డిమాండు

6.7 భ్రామికమైన ద్రవ్య డిమాండు

6.7.1 వడ్డీరేటు - సెక్యూరిటీల ధరలు

6.7.2 సంభావ్యతలు - వడ్డీరేటు

6.8 ద్రవ్యం మొత్తం డిమాండు

6.9 సంప్రదాయ వాదుల ద్రవ్య డిమాండు సిద్ధాంతం, కేన్స్ ద్రవ్య డిమాండు సిద్ధాంతం

6.10 ద్రవ్య మార్కెటు సమతౌల్యం

6.11 సారాంశం

6.12 సంప్రదింపు గ్రంథాలు

6.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

6.14 పదకోశం


## 6. 0 ఉద్దేశం

ఈ భాగంలో సంప్రదాయ వాదుల మరియు కేన్స్ ద్రవ్య డిమాండు దృక్పథాలను సవివరంగా తెలుసుకొందాం.

BRAOU

## 6.1 పరిచయం

ద్రవ్య డిమాండు సిద్ధాంతాలను ప్రధానంగా నాలుగు భాగాలుగా విభజించవచ్చు. అవి : 1. సంప్రదాయ వాదుల ద్రవ్య డిమాండు సిద్ధాంతం; 2. కేన్స్ ద్రవ్య డిమాండు సిద్ధాంతం; 3 కేన్సియన్ల మరియుఉత్తర - కేన్సియన్ల ద్రవ్య డిమాండు సిద్ధాంతాలు; 4. ఫ్రీడ్‌మన్ (Friedman) ఆధునిక ద్రవ్య డిమాండు సిద్ధాంతం. ఫిషరు (Irving Fisher) మహాశయుడు సంప్రదాయ ద్రవ్య డిమాండు సిద్ధాంతాన్ని మొదట రూపొందించాడని చెప్పవచ్చు. తరువాత, ఈ సిద్ధాంతాన్ని కొన్ని మార్పులతో, కేంబ్రిడ్జ్ సమీకరణ రూపంలో మార్షల్ (Alfred Marshall), పిగూ (A. C. Pigou), రాబర్ట్ సన్ (D. H. Robertson)మొదలగు కేంబ్రిడ్జ్ అర్థశాస్త్రవేత్తలు అభివృద్ధి చేసినారు. తరువాత, కేన్స్ మహాశయుడు సంప్రదాయ వాదుల ద్రవ్య డిమాండు సిద్ధాంతాన్ని నిశితంగా విమర్శిస్తూ, ప్రత్యామ్నాయ ద్రవ్య డిమాండు సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. ఈ కేన్స్ సిద్ధాంతాన్ని 1936లో ప్రచురించబడిన కేన్స్ యొక్క "General Theory" అను పుస్తకంలో చూడవచ్చు.

## 6.2 ద్రవ్య డిమాండు ప్రాముఖ్యత

ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య మార్కెటు సమతౌల్య స్థాయిని తెలుసుకోవడం కోసం, ద్రవ్య డిమాండును అధ్యయనం చేయడం ఎంతో అవసరం. ద్రవ్య డిమాండుకు, సప్లయికి మధ్యగల సమతౌల్యాన్ని ద్రవ్య మార్కెటు సమతౌల్యమని అంటారు. రెండవది, ద్రవ్య, కోశ విధానాలను రూపొందించి అమలు చేసే ముందు, ఆర్థిక వ్యవస్థలోని ద్రవ్య డిమాండు, సప్లైలను తెలుసుకోవడం చాలా అవసరం. కొన్నిసార్లు ద్రవ్య డిమాండును నియంత్రించడానికి స్థూల ఆర్థిక విధానాలను కూడ పాటించడం జరుగుతుంది. కాబట్టి, సంపూర్ణ ఉద్యోగితా స్థాయి వద్ద, ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచడం కొరకు అవసరమయ్యే ఆర్థిక విధానాలను రూపొందించే ముందు, ఆర్థిక వ్యవస్థలోని ద్రవ్య డిమాండును అంచనా వేయడం చాలా అవసరం. ఆర్థికంగా వెనుకబడిన దేశాలలో సంతులిత వృద్ధిని సాధించడానికి కూడ ద్రవ్య డిమాండును అంచనా వేయడం చాలా అవసరమని గుర్తించాలి.

BRAOU

## 6.3 సంప్రదాయ వాదుల ద్రవ్య డిమాండు సిద్ధాంతం

ద్రవ్య డిమాండును విశ్లేషించే ప్రముఖ సిద్ధాంతాలలో సంప్రదాయవాదుల ద్రవ్య డిమాండు సిద్ధాంతం ఒకటి. ఫిషరు (Irving Fisher) ప్రవేశ పెట్టిన ద్రవ్య డిమాండు సమీకరణాన్ని ఈ క్రింది విధంగా వ్యక్తపరచవచ్చు.

$$MV = PT \qquad \text{.......................(1)}$$

ఇక్కడ, M = ద్రవ్య సప్లై ; V = దైనందిన వ్యవహారాల కోసం ఉపయోగించే ద్రవ్య చలామణి వేగం; T = దైనందిన వ్యవహారాల విలువ మొత్తం; P = ధరల స్థాయి.

పై సమీకరణంలో, PT ద్రవ్య డిమాండును తెలియజేస్తుంది. సమీకరణం - 1 ని

$$MV = PY \qquad \text{.......................(2)}$$

గా కూడ వ్రాయవచ్చు. ఇక్కడ, Y = వాస్తవిక ఆదాయ స్థాయి. PY ద్రవ్యాదాయాన్ని తెలియజేస్తుంది. ద్రవ్య చలామణి వేగం (V - velocity of money circulation) వ్యవస్థాపరమైన అంశాలచే నిర్ణయింపబడుతుందని ఫిషరు భావించాడు. ఇంకా, సంపూర్ణోద్యోగితా స్థాయి వద్ద ఆర్థిక వ్యవస్థ యొక్క జాతీయోత్పత్తి స్థిరంగా

ఉంటుందని కూడ భావించాడు. ఫిషరు ద్రవ్య సిద్ధాంతం దైనందిన వ్యవహారాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ద్రవ్య డిమాండును క్రింది విధంగా తెలియజేయవచ్చు.

$$M_d = \frac{PY}{V} \qquad \ldots\ldots\ldots (3)$$

Md = ద్రవ్య డిమాండు.

Y స్థిరంగా ఉంటే ద్రవ్య డిమాండు, ధరల స్థాయితో పాటు నేరుగా, అనులోమానుపాతంగా మార్పు చెందుతుందని సమీకరణం - 3 సూచిస్తుంది. ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణోద్యోగిత ఉందనే ప్రమేయంతో, సంప్రదాయవాదుల ద్రవ్య డిమాండు వ్యాకోచత్వం విలువ ఒకటి ఉంటుందని చెప్పవచ్చు. ఇది ధరల స్థాయికి, నామమాత్రపు ద్రవ్య డిమాండుకు మధ్య అనులోమ సంబంధం ఉంటుందని సూచిస్తుంది. పటం - 6.1 లో దీనికి సంబంధించిన డిమాండు రేఖను చూపించాం.




ద్రవ్య సప్లయి

పటము - 6.1

ఇంతవరకు, నామమాత్రపు ద్రవ్య నిలువలను (nominal cash balances) గూర్చి మాత్రమే ఆలోచించాం. వాస్తవానికి, ప్యాటింకిన్ (Patinkin) అను అర్థశాస్త్రవేత్త వ్యాఖ్యానించినట్టుగా, ద్రవ్య డిమాండు అన్నది వాస్తవిక ద్రవ్య డిమాండు $\left(\frac{M}{P}\right)$ అని చెప్పాలి. ఈ విధంగా, సంప్రదాయ ద్రవ్య డిమాండును వాస్తవిక ద్రవ్య డిమాండుగా తెలియజేస్తే, సమీకరణం - 3 ఈ క్రింది విధంగా ఉంటుంది.

$$\frac{M}{P} = \frac{Y}{V} \qquad \ldots\ldots\ldots (4)$$

వాస్తవిక ద్రవ్య డిమాండు, ఆర్థికవ్యవస్థలోని వాస్తవిక ఆదాయ స్థాయితో నేరుగా, అనులోమానుపాతంగా మార్పు చెందుతుందని సమీకరణం - 4 సూచిస్తుంది. ఫిషరు వినిమయ సమీకరణంలోని ద్రవ్య డిమాండు, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఫిషరు ద్రవ్య డిమాండు దృక్పథం (approach) కు ప్రత్యామ్నాయంగా, కేంబ్రిడ్జ్ (Cambridge) అర్థ శాస్త్రవేత్తలు, కేంబ్రిడ్జ్ ద్రవ్య నిలువ దృక్పథం (Cambridge Cash Balance Approach) ను అభివృద్ధి చేసినారు. దీనిని సమీకరణ రూపంలో క్రింది విధంగా తెలియ జేయవచ్చు.

$$M_d = k.\ PY \qquad \ldots\ldots\ldots (5)$$

ఇక్కడ, k = ద్రవ్య రూపంలో ఉంచుకొన్న వాస్తవిక ఆదాయ శాతం. ఇది $\frac{1}{V}$ కి సమానం. ఫిషరు సమీకరణంలో చూసినట్లుగా, నామమాత్రపు ద్రవ్య డిమాండు ద్రవ్య చలామణి వేగం (V) తో విలోమ సంబంధం కలిగియుంటుంది, అదేవిధంగా T లేదా Y ధరలతో అనులోమ సంబంధం కలిగియుంటుంది. ద్రవ్య

BRAOU

చలామణి వేగం (V) పెరిగితే ద్రవ్య డిమాండు తగ్గుతుంది. కేంబ్రిడ్జ్ సమీకరణం కొంత మార్పు చేయబడిన ఫిషరు సమీకరణం నుండి వేరుకాదు. k అన్నది ద్రవ్య చలామణి వేగం యొక్క వ్యుత్క్రమం $\left(\frac{1}{V}\right)$ అయినప్పటికీ, ఇది వాస్తవం. ద్రవ్య డిమాండుపై ఫిషరు, కేంబ్రిడ్జ్ సమీకరణాలను కలిపి క్రింది సమీకరణ రూపంలో తెలియజేయవచ్చు.

$$k.PY = M_d = \frac{PY}{V} \qquad \text{.................... (6)}$$

ద్రవ్య డిమాండును, వాస్తవిక ద్రవ్య డిమాండు $\left(\frac{M_d}{P}\right)$ గా చూపినట్లైతే, కేంబ్రిడ్జ్ ద్రవ్య సమీకరణం ఈ క్రింది విధంగా ఉంటుంది.

$$\frac{M_d}{P} = k.Y = \frac{1}{V}.Y \qquad \text{.................... (7)}$$

సంప్రదాయవాదుల సిద్ధాంతంలో ద్రవ్య డిమాండు, జాతీయాదాయపు ద్రవ్యం విలువతో నేరుగా మారుతుంది. సంప్రదాయ వాదుల ద్రవ్య డిమాండు సమీకరణాన్ని క్రింది విధంగా వ్రాయవచ్చు.

$$M_d = f(Y, P) \qquad \text{.................... (8)}$$

సంప్రదాయ వాదుల సిద్ధాంతంలో, వాస్తవిక ద్రవ్య నిలువల డిమాండు ఆదాయ స్థాయి యొక్క ఫలం. వాస్తవిక ఆదాయ స్థాయి ఎక్కువగా ఉంటే, వాస్తవిక ద్రవ్య డిమాండు ఎక్కువగా ఉంటుంది. వాస్తవిక ఆదాయ స్థాయి తక్కువగా ఉంటే, వాస్తవిక ద్రవ్య డిమాండు తక్కువగా ఉంటుంది. రెండవది, ధరల స్థాయి రెండింతలైతే, నామ మాత్రపు ద్రవ్య డిమాండు కూడ రెండింతలౌతుంది. మూడవది, సంప్రదాయ వాదులు మాధ్యమం అను ద్రవ్యపు ఒక్క విధిని మాత్రమే గుర్తించడం జరిగింది. మరో విధంగా చెప్పాలంటే, సంప్రదాయవాదుల సిద్ధాంతం ఒక్క దైనందిన వ్యవహారాల ఉద్దేశ్యాన్ని మాత్రమే గుర్తించింది. ఈ సిద్ధాంతం ద్రవ్యం విలువ నిధి (store of value) ని ఉపేక్షించింది. నాల్గవది, నామమాత్రపు ద్రవ్య డిమాండు ఫలం, ధరలకు సంబంధించి ఏకత్వ వ్యాకోచత్వపు విలువను కలిగియుంటుంది.

## 6.4 కేన్స్ ద్రవ్య డిమాండు సిద్ధాంతం

సంప్రదాయ వాదుల ద్రవ్య డిమాండు సిద్ధాంతం ప్రకారం, సమాజంలోని వ్యక్తులు ద్రవ్యాన్ని వినిమయ సాధనంగా భావించి దానిని డిమాండు చేస్తారని పైన తెలుసుకున్నాం. కేన్స్ ద్రవ్య డిమాండు సిద్ధాంతం, ద్రవ్యాన్ని ఒక వినిమయ సాధనంగా మాత్రమే కాకుండా, విలువ నిధి (store of value) గా కూడ పరిగణించింది. అందువలన కేన్స్ సిద్ధాంతం ప్రకారం, ద్రవ్య డిమాండు ద్రవ్యత్వాభిరుచి చేత నిర్ణయించబడుతుంది. ద్రవ్యత్వాభిరుచి తిరిగి మూడు ఉద్దేశాలచే (motives) నిర్ణయించబడుతుంది. ఆ ఉద్దేశాలు : 1. దైనందిన వ్యవహారాల ఉద్దేశం; 2. ముందు జాగ్రత్త ఉద్దేశం; 3. భ్రామికమైన ఉద్దేశం (speculative motive). మొదటి ఉద్దేశం ద్రవ్యపు చురుకైన చలామణికి ప్రతి రూపంగా నిలుస్తుంది. చివరి రెండు ఉద్దేశాలలో, ద్రవ్యాన్ని క్రియాశూన్యత నిల్వగా అట్టిపెట్టుకోవడం జరుగుతుంది. ఇప్పుడు, మూడింటిలోని ప్రతి ఒక్క ఉద్దేశాన్ని సవివరంగా పరిశీలిద్దాం.

## 6.5 దైనందిన వ్యవహారాల ఉద్దేశం (Transactions Motive)

దైనందిన వ్యవహారాలను నిర్వహించడం కొరకు వ్యక్తులు, సంస్థలు వారి వద్ద ఉంచుకొనే సగటు ద్రవ్యం, వారి ఆదాయ/రాబడి యొక్క పౌనః పున్యం (frequency), వారి వ్యాపార లావాదేవీల విలువ మొత్తం మీద ఆధారపడి ఉంటుంది. వారి ఆదాయ/రాబడి పౌనః పున్యం పెరిగిన కొలది, వారి వద్ద ఉంచుకొనే సగటు ద్రవ్యం

విలువ తగ్గుతుంది. ఇంకా వారి వ్యాపార లావాదేవీల విలువ మొత్తం పెరిగిన కొలది వారి ద్రవ్య డిమాండు అనులోమానుపాతంలో పెరుగుతుంది. వేరే విధంగా చెప్పాలంటే, ఒక నిర్ణీత సమయంలో, వ్యక్తుల లేదా సంస్థల దైనందిన వ్యవహారాలను నిర్వహించడానికి కావలసిన ద్రవ్యం వారి రాబడులకు చెల్లింపులకు మధ్యనున్న సమయం తగ్గితే, తగ్గుతుంది. దైనందిన వ్యవహారాల మొత్తం విలువ పెరిగితే, ద్రవ్యం అవసరం పెరుగుతుంది.

సాధారణ దైనందిన వ్యవహారాలను నిర్వహించడానికి ప్రతి వ్యక్తి కొంత ద్రవ్యాన్ని కలిగియుండడం అవసరం. ఒక నిర్ణీత సమయాన, ఒక వ్యక్తికి వచ్చే రాబడి ద్రవ్యం మొత్తం అదే సమయాన అతడు చెల్లించవలసిన మొత్తానికి సమానమైతే, అతడు తన దైనందిన వ్యవహారాల కొరకు ద్రవ్యాన్ని నిలువ ఉంచుకోవలసిన అవసరం ఉండదు. కానీ, ప్రతి వ్యక్తి అతని రాబడి మరియు చెల్లింపుల సమయం మీద నియంత్రణా శక్తి కలిగి యుండినా, ఆ వ్యక్తి పై పరిమితి గల స్థితి (limiting case) ని నిజ జీవితంలో చేరుకోవడం జరగదు. కాబట్టి, ప్రతివ్యక్తి తనకు చేకూరే రాబడికి, చెల్లింపులకు మధ్యనున్న సమయ వ్యత్యాసాన్ని పూడ్చడానికి కొంత ద్రవ్యాన్ని నిలువ ఉంచుకోవలసిన అవసరం ఉంటుంది.

ఏ ఇద్దరు వ్యక్తులు ఒకే విధమైన చెల్లింపుల సమయ సరళి (time - pattern) ని కలిగి ఉండరు. కొందరు వ్యక్తుల విషయంలో మాత్రమే, వారి ఒక నెలలోని మొత్తం చెల్లింపులు ఆ నెల ఆద్యంతం సమానంగా పంపిణీ జరిగే అవకాశం ఉంటుంది. ఆ నెలలోని కొన్ని రోజులలోని చెల్లింపులు సగటు చెల్లింపును అధిగమించడం జరుగుతుంది. ఉదా : ఇది ఇంటి కిరాయ చెల్లించే రోజు సంభవిస్తుంది. అయినప్పటికీ, మొదటి ఉజ్జాయింపుగా (as a first approximation), చెల్లింపుల పంపిణీ, నెల ఆద్యంతమూ సమానంగా ఉంటుందని ప్రమేయం చేద్దాం. ఈ చెల్లింపుల సరళితో, ఒక వ్యక్తి నెల మొత్తం రాబడి ఆ నెలలోని మొదటి రోజు అతని చేతికందితే, ఆ నెల ఆద్యంతం అతనికి ఎక్కువ సగటు ద్రవ్య నిలువలు అవసరమౌతాయి. ఒకవేళ, అదే మొత్తం అతనికి ఆ నెల అంతటా కొన్ని విరామాలలో చేకూరితే, అతనికి తక్కువ సగటు ద్రవ్య నిలువలు అవసరమౌతాయి.

ఉదాహరణకు, ఒక వ్యక్తికి నెలకు రూ. 1000/- ఆదాయం వస్తుందనుకుందాం. ఆ నెలలో అతని చెల్లింపులు కూడ అదే మొత్తం ఉంటుందనుకుందాం. ప్రతి నెలను ఖచ్చితంగా నాలుగు వారాలుగా విభజించవచ్చునుకొందాం. అతనికి చేకూరే నెలసరి ఆదాయం రూ. 1000 ఆదాయం వివిధ కాల సరళులలో సంభవించవచ్చు. నెలలో మొదటి రోజు రూ. 1000 ఆదాయం రావచ్చు. లేక నెలలో ప్రతివారపు మొదటి రోజు రూ. 250/- చొప్పున ఆదాయం రావచ్చు. ఒకవేళ, ఈ వ్యక్తి రూ. 1000 ఆదాయం ప్రతినెలలోని మొదటి రోజు తీసుకుని ఆ మొత్తాన్ని నెల ఆద్యంతం సమానంగా వెచ్చిస్తే (disburse), అతని వద్ద ఆ నెలలోని మొదటి వారం ప్రారంభంలో రూ. 1000 ద్రవ్యం నిలువ, రెండవ వారం ప్రారంభంలో రూ. 750 ద్రవ్యం నిలువ, మూడవ వారం ప్రారంభంలో రూ. 500 ద్రవ్యం నిలువ, ఇక నాల్గవ వారం ప్రారంభంలో రూ. 250 ద్రవ్యం నిలువ కలిగి యుంటాడు. అతని ద్రవ్యం నిలువ నాల్గవ వారాంతం శూన్యమవుతుంది. కాని, తరువాత రోజున మళ్ళీ అతని ద్రవ్యం నిలువ రు. 1000 కు పెరుగుతుంది. ఈ సందర్భంగా, అతని సగటు ద్రవ్యం నిలువ ఆ నెల కొరకు రూ. 500 ఉంటుంది. ఇది అతని నెలసరి ఆదాయంలో సగానికి సమానం అవుతుంది [i. e; (రూ. 1000 + రూ. 750 + రూ. 500 + రూ. 250 + రూ. 0.00) ÷ 5 = రూ. 500]. నెల ఆద్యంతంలోని ప్రతి సమయంలో అతని వాస్తవ ద్రవ్య నిలువలను పటం 6.2 A భాగంలోని రేఖచే చూపించడం జరిగింది.

BRAOU




పటం - 6.2 : ద్రవ్యానికి సంపాదన యోగ్యమైన ఆస్తులకు మధ్య వ్యక్తి యొక్క దైనందిన వ్యవహారాల ద్రవ్య నిలువల ఆధార రహిత కేటాయింపు

ఈ వ్యక్తి అతని నెలసరి ఆదాయం రూ. 1000 ప్రతివారం మొదటిరోజున రూ. 250/- చొప్పున తీసుకుంటాడనుకుందాం. ఇంతకు ముందు వలెనే, అతని ఆదాయం, అతని చెల్లింపులకు సమానంగా ఉంటుందనే ప్రమేయం చేద్దాం. ఈ ప్రమేయంతో, ప్రతివారం మొదటి రోజు ప్రారంభంలో అతని ద్రవ్యం నిలువ రూ. 250, రెండవ రోజు ప్రారంభంలో ద్రవ్యం నిలువ రూ. 214.29 మరియు పరిమితి వరకు, ఒక వారానికి అతని సగటు ద్రవ్యం నిలువ రూ. 125 ఉంటుంది. ఈ సగటు ద్రవ్యం నిలువ మొత్తం అతని వారం ఆదాయంలో సగానికి సమానం [(i. e., రూ. 250 + రూ. 214.29 + రూ. 178.58 + రూ. 142.87 + రూ. 107. 16 + రూ. 71.45 + రూ. 35.74 + రూ. 0.00) ÷ 8 = రూ. 125.00]. ఒక వ్యక్తి నెలసరి ఆదాయ మొత్తాన్ని, ఆ నెలారంభంలో స్వీకరించే ఏర్పాటు నుండి అదే మొత్తాన్ని, ప్రతివారం ప్రారంభంలో స్వీకరించే ఏర్పాటుకు పోవడం అనగా, ఆదాయ స్వీకరణ పౌనఃపున్యం (frequency) నాలుగు రెట్లు పెరగడం అని అర్థం. అలాగే అతని సగటు ద్రవ్యం నిలువ 1/4 వ వంతు (రూ. 1000 కు బదులుగా రూ. 250 కు) తగ్గిందని చెప్పవచ్చు. దీనిని పటం 6.2 B-భాగంలో చూపించాం.

B R A O U

### 6.5.1 ఆదాయంచే నిర్ణయించబడే దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు

దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు పరిమాణం, స్థూల జాతీయాదాయ వాస్తవ వృద్ధిచే అను సందించబడుతుంది. ప్రతి నిర్ణీత కాల వ్యవధిలో, సెక్యూరిటీలకు నిజ ఆస్తులకు సంబంధించిన అన్నిరకాల లావాదేవీలు, దైనందిన వ్యవహారాల ద్రవ్య పరిమాణంలో ఇమిడి ఉంటాయి. కాబట్టి, ప్రతి నిర్ణీత కాల వ్యవధిలో ఈ లావాదేవీల పరిమాణం, స్థూల జాతీయాదాయ పరిమాణాన్ని మించిపోతుంది. అయినప్పటికీ జాతీయాదాయానికి దైనందిన వ్యవహారాల పరిమాణం విలువ మొత్తానికి మధ్యనున్న నిష్పత్తి సహేతుకంగా, నిలకడగా ఉంటుందనే నమ్మకంతో దాదాపుగా దైనందిన వ్యవహారాల కోసం, ప్రజలు తమ వద్ద ఉంచుకోవాలనే ద్రవ్యం నిలువల మొత్తం జాతీయాదాయం మీద ఆధారపడుతుందని చెప్పవచ్చు. తత్ఫలితంగా, ద్రవ్యం నిలువలకు జాతీయాదాయంతో సంబంధం కలదని ప్రతిపాదించవచ్చు.

ఈ బాంధవ్యంలో, ఒక ఉత్పత్తి స్థాయితో సాహచర్యం గల దైనందిన వ్యవహారాలను నిర్వహించడం కొరకు, ప్రజలు తమ వద్ద ఉంచుకునే వాస్తవ ద్రవ్యం మొత్తం ధరల స్థాయితో ధనాత్మకంగా మార్పు చెందుతుంది. ఒక వస్తువు ధర రూ. 50 ఉన్నప్పటికంటే, రూ. 100 ఉన్నప్పుడు వస్తువును కొనడానికి రెండింతల ద్రవ్యం అవసరమౌతుంది. అదేవిధంగా, ఆర్థిక వ్యవస్థలోని కొనుగోలుల పరిమాణం, Y చే పేర్కొనబడిన విషయంలో

కూడా నిజమవుతుంది (P= ధరల స్థాయి, Y= నిజ జాతీయాదాయం). PY లో ఎలాంటి మార్పు వచ్చినా దైనందిన వ్యవహారాల కొరకు ఉంచబడే ద్రవ్యం నిలువలో కూడా అదే విధమైన మార్పు అవసరమవుతుంది. PYలోని మార్పు, Pలో వచ్చే మార్పు వలన కాని, Yలో వచ్చే మార్పు వలన కాని, ఈ రెండింటిలో వచ్చే మార్పుల వలన కాని సంభవించవచ్చు. ఉదా: ప్రతి రూ. 4/- ఆదాయానికి దైనందిన వ్యవహారాలను నిర్వహించడం కొరకు ప్రజలకు రూ. 1/- అవసరమైతే రూ.400 కోట్లు ఆదాయం ఉంటే, దైనందిన వ్యవహారాల నిర్వహణ నిమిత్తం రూ. 100 కోట్లు అవసరమవుతాయి. ఆ PY స్థాయి, రూ. 4 × రూ. 100 కోట్లు, రూ. 2 × రూ. 200 కోట్లు లేక రూ. 400 కోట్లకు సమానమయ్యే ఏ PY సంయోగమైనా కావచ్చు.

ఈ సంబంధాన్ని $M_t = k(PY)$ సమీకరణ రూపంలో తెలియజేయవచ్చు. ఇక్కడ, $M_t$ అన్నది దైనందిన వ్యవహారాల కొరకు డిమాండు చేసే ద్రవ్యం మొత్తానికి సమానం. $M_t$ కి, PY కి మధ్య ఏకఘాత (linear) సంబంధం ఉందనే ప్రమేయంతో, k అన్నది ప్రజలు దైనందిన వ్యవహారాల నిమిత్తం ద్రవ్యాదాయంలో కొంత భాగం తమ వద్ద ఉంచుకోవడాన్ని సూచిస్తుంది. పై వివరణ ప్రకారం , $k = 1/4$ అను ప్రమేయంతో, ఎప్పుడైతే PY =రూ. 400 కోట్లు ఉంటుందో, $M_t$ =రూ. 100 కోట్లు ఉంటుంది. అదేవిధంగా, PY =రూ. 500 కోట్లు అయితే $M_t$ = రూ. 125 కోట్లు ఉంటుంది. దైనందిన వ్యవహారాల నిర్వహణ నిమిత్తం డిమాండు చేసే ద్రవ్యాన్ని నామమాత్రపు లేక వాస్తవిక రూపంలో తెలియజేయవచ్చు. పై $M_t = k(PY)$ అను సమీకరణం నామమాత్రం రూపంలో తెలియజేయబడింది. దీనినే $M_t = P.k(Y)$గా కూడ వ్రాయవచ్చు. Pలో మార్పు వచ్చినప్పుడు, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండులో కూడ అనుపాత (proportionate) మార్పు వచ్చు సంప్రదాయ ప్రమేయం ఆధారంగా ఈ సమీకరణాన్ని వ్రాయవచ్చు. ఈ సమీకరణాన్ని వాస్తవిక ద్రవ్య నిలువల డిమాండులోకి మార్పు చేయాలంటే, $M_t = P.k(Y)$ ని Pచే భాగించగా $M_t$ $P = k(Y)$ అను సమీకరణాన్ని పొందుతాం. ఇక్కడ, $M_tP$ అన్నది దైనందిన వ్యవహారాల కొరకు డిమాండు చేసే వాస్తవిక ద్రవ్య నిలువల మొత్తాన్ని తెలుపుతుంది. ఈ మొత్తాన్ని $m_t$ చే నిర్దేశిద్దాం.

ఆదాయ స్థాయిలోని (Y) మార్పు వలన లేక k పరిమాణంలోని మార్పు వలన, వాస్తవిక ద్రవ్య నిలువల మొత్తంలో ఏవిధంగా మార్పు వస్తుంది అను విషయాన్ని పటం 6.3 ద్వారా తెలుసుకోవచ్చు.




పటం - 6.3 : దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు

పటం 6.3 లో k(Y)లేబుల్‌తోనున్న రేఖ, $k = 1/4$ అను ప్రమేయంతో, వివిధ ఆదాయ స్థాయిల వద్ద $m_t$ మొత్తాన్ని సూచిస్తుంది. ఆదాయం (Y)రూ. 400 కోట్లు అనుకుంటే, $m_t$ రూ. 100 కోట్లు ఉంటుంది; ఆదాయం

BRAOU

రూ. 500 కోట్లు అనుకుంటే, $m_1$ రూ. 125 కోట్లు ఉంటుంది. $k=1/5$ అనుకుంటే, పై పటంలో $k'(Y)$ అను రేఖ ఏర్పడుతుంది. రూ. 400 కోట్ల మరియు రూ. 500 కోట్ల నిజ ఆదాయ స్థాయిల వద్ద, రూ. 80 కోట్ల మరియు రూ. 100 కోట్ల ద్రవ్యం దైనందిన వ్యవహారాల నిమిత్తం అనుక్రమంగా డిమాండు చేయబడుతుంది.

ఆర్థిక వ్యవస్థలో k పరిమాణం సంస్థాపరమైన (institutional), నిర్మాణాత్మకమైన (structural) పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఈ పరిస్థితులు, ఒక వ్యక్తి లేక సంస్థ ఆదాయం, ఖర్చుల మధ్య సమకాలిక దశ (degree of synchronisation) ను కలిగి ఉంటాయి. ఒకచోట జనించే చెల్లింపులు (payments) వేరొకచోట వసూళ్ళు (receipts) గా మారడం కొరకు కావలసిన సమయం లేదా ద్రవ్య చలామణి వేగం; పరిశ్రమ యొక్క సమగ్రతా స్థాయి మరియు ఇతర అంశాలను కూడ ఈ పరిస్థితులు కలిగి ఉంటాయి. ఇందులోని కొన్ని అంశాలు ఒక దశాబ్దం వరకు ప్రధానంగా (significantly) మార్పు చెందవు. కాని ద్రవ్య చలామణి వేగం మార్పు చెందునట్లుగా అగుపిస్తుంది. అయినప్పటికీ, ప్రస్తుత విశ్లేషణ సులభంగా అర్థమయ్యేటట్లు చేయడానికి, స్వల్ప కాలంలో k స్థిరంగా ఉంటుందని ప్రమేయం చేయాలి. ఇంకో విధంగా చెప్పాలంటే, దైనందిన వ్యవహారాల నిమిత్తం డిమాండు చేసే వాస్తవిక ద్రవ్య నిలువల మార్పులను, వాస్తవిక ఆదాయంలోని మార్పులు ప్రధానంగా నిర్ణయిస్తాయి. పై పటం రూపంన, $m_1$లోని మార్పులు ప్రధానంగా k (Y)లాంటి రేఖ గూడా చేసే ప్రయాణ ఫలితం అని ప్రమేయం చేయవలసి ఉంటుంది. కాని, k (Y) రేఖ వాలులోని (slope) మార్పుల ద్వారా ఎంత మాత్రం కాదు.

### 6.5.2 దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు - వడ్డీ రేటు ప్రభావం

దైనందిన వ్యవహారాల కొరకు డిమాండు చేసే వాస్తవిక ద్రవ్య నిలువల మొత్తం, వాస్తవిక ఆదాయంలోని మార్పులతో నేరుగా మార్పు చెందుతుందని పైన తెలుసుకున్నాం. ఈ మొత్తం వడ్డీరేటుతో విలోమానుపాతంగా (inversely) కూడ మార్పు చెందవచ్చు. మళ్ళీ ఒక వ్యక్తికి ప్రతినెల మొదటి రోజున రూ. 1000 ఆదాయం చేతికి అందుతుందని అనుకుందాం. అదే వ్యక్తి, ఆ మొత్తాన్ని 28 రోజులలో సరిసమానంగా ఖర్చుపెడతాడు. ఇంతకుముందే గుర్తించినట్లుగా, నెలలో ఏ సమయం వద్దనైనా ఆ వ్యక్తి యొక్క దైనందిన వ్యవహారాల ద్రవ్య నిలువలు పటం - 6.1 లోని A భాగంలో చూపించినట్లు ఉంటాయి. ఈ వ్యక్తికి, నెలలోని మొదటి వారంలో రూ. 750 ద్రవ్యం పూర్తిగా నిరుపయోగంగా ఉంటుంది; రెండవ వారంలో రూ. 500; మూడవ వారంలో రూ. 250 నిరుపయోగంగా ఉంటాయి. కాబట్టి, ఈవ్యక్తికి అతని వద్ద నిరుపయోగంగా ఉన్న ద్రవ్యాన్ని, వడ్డీని సంపాదించి పెట్టే ఆస్తి రూపంలోకి మార్చుకోవడానికి అవకాశం లేదా అనే ప్రశ్న ఉదయిస్తుంది. పటం 6.2 లోని B, C భాగాలు ఈ వ్యక్తి ఏమి చేయగలడనే దానిని వివరిస్తాయి. నెలలో మొదటి వారంలోని మొదటి రోజున ఈవ్యక్తి, ఆ వారానికి సరిపడే చెల్లింపులకు రూ. 250 తన వద్ద ఉంచుకొని (B భాగాన్ని చూడండి), రూ. 750 ను వడ్డీ యోగ్యమైన ఆస్తుల రూపంలోకి మార్చుకోవడానికి ఉపయోగిస్తాడు (C భాగాన్ని చూడండి). రెండవ వారంలోని మొదటి రోజున, తన రూ. 750 విలువగల ఆస్తిలో రూ. 250 ను ద్రవ్యరూపంలోకి మార్చుకుంటాడు. ఎందుకంటే, రెండవ వారంలో అవసరమయ్యే ద్రవ్య చెల్లింపులకు సరిపడే మొత్తం రూ. 250 కనుక. మూడవ మరియు నాల్గవ వారాలలో కూడ అదే విధంగా చేస్తాడు. అటు తర్వాత, అదే చక్రం పునశ్చరణం (repeat) చేస్తాడు. ఈ విధంగా ఆ వ్యక్తి అతని దైనందిన వ్యవహారాల సగటు ద్రవ్య నిలువలను నెలకు రూ. 125 కు తగ్గించుకుంటాడు (B భాగాన్ని చూడండి). అదేవిధంగా ఆ నెల కొరకు అతడు రూ. 375 విలువల గల వడ్డీ యోగ్యమైన సగటు ఆస్తి నిలువలను తయారుచేసుకొంటాడు (C భాగాన్ని చూడండి). ఈ రెండు రకాల నిలువల మొత్తం రూ. 500. ఈ మొత్తం అతని సగటు నిలువల మొత్తానికి సమానం (A భాగాన్ని చూడండి).

BRAOU

నిజ జీవితంలో ప్రజలు ఈ విధంగా చేస్తారా అనే ప్రశ్నకు, అలా చేస్తారు అనే సమాధానం వస్తుంది. వాస్తవంగా, కొన్ని పరిస్థితులలో కనీసం కొందరు వ్యక్తులు ద్రవ్యం మరియు దీర్ఘకాలిక బాండుల సాధారణ ఎంపికకు మధ్య చాలా ప్రత్యామ్నాయాలు కలిగియుంటారు. ఒక వ్యక్తి, నిరుపయోగంగా ఉన్న ద్రవ్య నిలువలను స్వల్పకాలిక బాండులు (ట్రెజరీ బిల్లులు, వ్యాపార పత్రాలు మొ॥) గా గాని ద్రవ్యరూపంలో గాని ఉంచుకోవచ్చు. ఒక్కొక్క కొనుగోలుకూ, అమ్మకానికీ అవసరమయ్యే వ్యయం పోను దైనందిన వ్యవహారాల ఉద్దేశం నిరుపయోగంగా ఉన్న ద్రవ్య నిలువలను వడ్డీ యోగ్యమైన ఆస్తులుగా మార్చుకుని ఆ వ్యక్తి తప్పకుండా లాభసాటి వడ్డీరేటును సంపాదించగలడు. ఈ నిలువలను, కొన్ని రోజులకు కానీ, కొన్ని వారాలకు కానీ ఆస్తుల రూపంలోకి మార్చుకోవచ్చు. వడ్డీ రేటు పెరిగిన కొలది స్వల్ప కాల బాండులలోకి మార్చుకోవడానికి ఉపయోగించే నిరుపయోగ ద్రవ్య నిలువలలోని భాగం పెరుగుతుంది.

ఆర్థిక వ్యవస్థలో ఆదాయ స్థాయి, వడ్డీరేటు, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండులకు మధ్యనున్న సంబంధాన్ని పటం 6.4లో వర్ణించాం. ఈ రేఖా పటంలో రూ. 100 కోట్ల వద్ద గీసిన $Y_1$ లేబులులో నున్న రేఖ, వడ్డీ రేటు 6 శాతం కన్నా ఎక్కువ ఉన్నంత వరకే సరియైనది. ఉదా: వడ్డీరేటు 6శాతం కన్నా ఎక్కువైనకొలది దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు వడ్డీ రేటుతో వ్యాకోచం చెందుతుంది. వడ్డీరేటు 6శాతం కన్నా ఎక్కువగా ఉన్నప్పుడు దైనందిన వ్యవహారాల ద్రవ్యం నిలువలలో కొంత భాగాన్ని బాండులలోకి మార్చితే తగినంత లాభం చేకూరుతుందని ఈరేఖ సూచిస్తుంది. ఇంకా వడ్డీ రేటు ఎక్కువైనకొలదీ బాండులలోకి మళ్ళించిన ద్రవ్యం మొత్తం ఎక్కువ అవుతుంది. దీనిని వెనుకకు వాలుతున్న $Y_1$ రేఖచే సూచించాం. ఆదాయ స్థాయి రూ. 500 కోట్లకు పెరిగితే, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు రేఖ $Y_2$కు కదులుతుంది. కానీ, మళ్ళీ ఈ రేఖ కూడా 6శాతం కన్నా ఎక్కువ వడ్డీ రేటు వద్ద వెనుకకు వాలుతుంది. $Y_1$, $Y_2$రేఖలు పటం 6.3లో నున్న k(Y)రేఖ మీద రూ. 400 కోట్లు, రూ. 500 కోట్ల ఆదాయ స్థాయిలకు పోలి వుంటుంది.




పటం - 6.4 : వడ్డీ - వ్యాకోచత్వం - కలిగిన దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు

దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు యొక్క వడ్డీ వ్యాకోచత్వం, ఆర్థిక వ్యవస్థ మొత్తానికి సాధారణీకరణం (generalisation) చేయడం చాలా కష్టం. ఒక పెద్ద కార్పోరేషన్ వద్ద కొన్ని మిలియన్ల ద్రవ్యం ఒక వారం వరకు నిరుపయోగంగా ఉంటే తప్పకుండా ఆ కార్పోరేషన్ ఆ డబ్బును వడ్డీరేటు తగినంతగా ఉంటే, తగినంత లాభాలను సంపాదించిపెట్టే ఆస్తి రూపంలో ఉంచుతుంది. అదే ఒక వ్యక్తి వద్ద నున్న కొంత దైనందిన వ్యవహారాల సగటు ద్రవ్య నిలువను, వడ్డీ యోగ్యమైన ఆస్తుల రూపంలోకి మార్చకపోవచ్చు. కావున, అతని దైనందిన

వ్యవహారాల ద్రవ్య డిమాండు అవ్యాకోచత్వం కలిగి ఉంటుంది. బహుశా, అత్యధిక వడ్డీ రేటు వద్ద మాత్రమే అతడు ఆ నిలువలను స్వల్పకాలిక బాండులలోకి మార్చుతాడు.

ఒక వడ్డీ రేటు వద్ద దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు రేఖ వెనుకకు వాలుతుందని చాలామంది అర్థ శాస్త్రవేత్తలు ఒప్పుకున్నారు. దీనిని పటం 6.4లో చూపించాం. దీని అర్థం దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు కొరకు ఉపయోగించిన సమీకరణం $m_t = f(Y, r)$ అవుతుంది. mt, Y ల మధ్య ఎంత మాత్రం ఏకఘాత (linear) సంబంధం ఉండదని తెలుస్తుంది. అయినప్పటికీ, మన విశ్లేషణను సులభతరం చేయడానికి వడ్డీరేటు విషయంలో దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు అవ్యాకోచత్వం కలిగి ఉంటుందని అనుకోవాలి. కాబట్టి, ఈ డిమాండు యొక్క సులభ సమీకరణం $m_t = k(Y)$ను యథాస్థానం వద్ద ఉంచుదాం. రేఖచిత్రం 6.3 యొక్క పరిభాషలో దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు కేవలం ఆదాయ స్థాయిచే నిర్ణయించబడుతుంది. ఆదాయ స్థాయిలోని మార్పులు ఈ డిమాండు రేఖను $Y_1$ నుండి $Y_2$కు కదులుస్తుంది. కాని, వడ్డీ రేటు విషయంలో ఈరేఖ సంపూర్ణ అవ్యాకోచత్వం కలిగియుంటుందని భావిద్దాం.

## 6.6 ముందు జాగ్రత్త కొరకు చేసే ద్రవ్య డిమాండు

దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు ఎక్కువగా రాబడులు, వ్యయాలు ఏక కాలమందు సంభవించకపోవడం వల్ల ఉద్భవిస్తుంది. అదేవిధంగా, ముందు జాగ్రత్త కోసం చేసే ద్రవ్య డిమాండు ప్రధానంగా భవిష్యత్తులోని ఆదాయ, వ్యయాల అనిశ్చిత స్థితి నుండి ఉద్భవిస్తుంది. ముందు జాగ్రత్త కోసం చేసే ద్రవ్య నిలువలు ముందుగానే ఊహించ లేని ఖర్చులను భరించడానికి వ్యక్తులకు ఉపయోగపడతాయి. అంతేకాకుండా, రాబడుల విషయంలో కూడా ముందుగానే ఊహించలేని జాప్యం జరుగవచ్చు. ఈ సమయంలో కూడ అటువంటి నిలువలు వ్యక్తులకు చాలా ఉపయోగపడతాయి.

ఈ రకం ద్రవ్య డిమాండు కొంతవరకు వ్యక్తుల ఆదాయ స్థాయితోపాటు మారుతూ ఉంటుంది. ఆదాయ స్థాయి ఎక్కువగా ఉంటే, వ్యక్తులు ఈ ఉద్దేశం కోసం ఎక్కువ ద్రవ్యాన్ని తమవద్ద ఉంచుకోగలుగుతారు. ముందు జాగ్రత్త కోసం చేసే ద్రవ్య డిమాండు వడ్డీరేటుకు విలోమానుపాతంలో మారుతూ ఉంటుంది. దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు మాదిరి కాకుండా ముందు జాగ్రత్త చర్యకోసం చేసే ద్రవ్యం నిలువ ఒక వ్యక్తికి రానున్న చిక్కు పరిస్థితులను ఎదుర్కోవడానికి సహకరిస్తుంది. తగినంత ఎక్కువ వడ్డీరేటు వద్ద తక్కువ ముందు జాగ్రత్త ద్రవ్య నిలువతో సాహసం చేయడానికి వ్యక్తి ప్రేరేపించబడవచ్చు. ఎక్కువ వడ్డీరేటు వద్ద వ్యక్తి ముందు జాగ్రత్త కోసం చేసే ద్రవ్యపు నిలువ నుండి కొంత భాగాన్ని వడ్డీ యోగ్యమైన ఆస్తిగా మార్చుకొనే సాహసం చేయడానికి పూనుకుంటాడు.

ముందు జాగ్రత్త కోసం చేసే ద్రవ్యం డిమాండును, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు నుండి లాంఛనప్రాయంగా వేరుపరచగలిగినప్పటికీ, ఈ రెండు రకాల డిమాండులను తృప్తిపరచడం కోసం ఉంచుకొనే ద్రవ్యం మొత్తం ప్రధానంగా ఆదాయ స్థాయిచే నిర్ణయించబడుతుందని భావించాం. దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు విషయంలో వలెనే సౌలభ్యం కొరకు ముందు జాగ్రత్త కోసం చేసే ద్రవ్య డిమాండు కూడా వడ్డీరేటు విషయంలో అవ్యాకోచత్వంగా ఉంటుందని ప్రమేయం చేయాలి. అనగా, ముందు జాగ్రత్త కోసం చేసే ద్రవ్య డిమాండు పూర్తిగా ఆదాయ స్థాయి పైనే ఆధారపడి ఉంటుంది. ఈరెండు రకాల డిమాండులు ఆదాయ స్థాయిచే నిర్ణయించబడితే, ఈ రెండింటిని కలిపి, $m_t = k(Y)$ సమీకరణ రూపంలో తెలియజేయవచ్చు. కాబట్టి, $m_t = k(Y)$ సమీకరణంలో ఈ రెండు రకాల డిమాండులను చేర్చినట్లుగా అర్థం చేసుకోవాలి.

BRAOU

## 6.7 చట్టా వ్యాపార (భ్రామికమైన) ద్రవ్య డిమాండు (Speculative Demand for Money)

ద్రవ్యాన్ని దైనందిన వ్యవహారాల కోసం, ముందు జాగ్రత్త కోసం ఉంచుకోవడం అనే ప్రతిపాదన సంప్రదాయ వాదుల అభిప్రాయానికి విరుద్ధం కాదు. దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు ద్రవ్యం యొక్క వినిమయ మాధ్యమం విధి కన్నా అన్యం కాదు అని గుర్తించాలి. సంప్రదాయ వాదుల ద్రవ్య సిద్ధాంతపు మౌలిక భావనకు భంగం కలిగించకుండా ముందు జాగ్రత్త ద్రవ్య నిలువలను ఆ సిద్ధాంతంతో జోడించవచ్చు. ఇది సంప్రదాయ వాదుల సిద్ధాంతానికి సంబంధించినంత వరకు సమంజసంగానే ఉంటుంది. కాని, కేన్స్ సిద్ధాంతంలోని ద్రవ్య డిమాండు యొక్క క్రమబద్ధమైన భాగం చట్టా వ్యాపార (భ్రామిక) ద్రవ్య డిమాండు అని చెప్పవచ్చు.

సంప్రదాయవాదుల సిద్ధాంతం, ఒక వ్యక్తి తన దైనందిన వ్యవహారాలను నిర్వహించడం కోసం కావలసిన ద్రవ్యం మొత్తం కన్నా ఎక్కువ మొత్తం నిలువ ఉంచుకోడని ప్రమేయం చేసింది (ముందు జాగ్రత్త ద్రవ్య డిమాండుతో సహా). ఒకవేళ, ఆ విధంగా చేయక, అదనపు ద్రవ్యాన్ని బాండులోకి మార్చితే ఎంతైతే వడ్డీని సంపాదించేవాడో ఆ వడ్డీని త్యాగం చేయవలసి ఉంటుంది. వడ్డీరేటు తక్కువగా ఉన్నప్పటికీ, అదనపు ద్రవ్యాన్ని బాండులలోకి మార్చి కొంత వడ్డీని పొందడం ఉత్తమమని సంప్రదాయ వాదులు తర్క సహితంగా వాదించారు. అయినప్పటికీ, ఒక వ్యక్తి బాండును కొన్నాడంటే అతడు ఆ బాండును తన వద్ద ఉంచుకున్న సమయంలో వడ్డీరేటు పెరుగదని భ్రామిక ఉద్దేశం కలిగియుంటాడని కేన్స్ సూచించాడు. ఒకవేళ, అతడు వడ్డీరేటు పెరుగుతుందని భావిస్తే ఆ వ్యక్తి ద్రవ్యాన్ని కలిగియుండడం తెలివైన పని అని కేన్స్ భావించాడు. భవిష్యత్తులో వడ్డీరేటు అనిశ్చితంగా ఉండడం వలన ప్రజలు చట్టా వ్యాపార ఉద్దేశంతో తమ వద్ద ద్రవ్యాన్ని కలిగి యుంటారు. ఒకవేళ, భవిష్యత్ వడ్డీరేటు నిశ్చితంగా తెలిసియుంటే, చట్టా వ్యాపార ద్రవ్య డిమాండు ఉండటానికి వీలులేదు. అటువంటప్పుడు, సంప్రదాయ వాదుల ద్రవ్య డిమాండు భావనకు ఏ మాత్రం అభ్యంతరం ఉండదు.

### 6.7.1 వడ్డీరేటు మరియు సెక్యురిటీల ధరలు

చట్ట వ్యాపార డిమాండును అర్థం చేసుకోవడానికి వడ్డీరేటుకు, సెక్యురిటీల మార్కెటు ధరల మధ్యనున్న సంబంధాన్ని పరిశీలించాలి. ఉదా : బాండు కొనుగోలుదారుకు ఏమాత్రం ఆ బాండు విషయంలో నిర్ణీతకాలానికి డబ్బు చెల్లించలేకపోయే ప్రమాదం ఉండదని అనుకుందాం. కేంద్ర ప్రభుత్వ బాండుల విషయంలో విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఎంతమాత్రం ఉండదు. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం తలచుకుంటే, ద్రవ్యాన్ని సృష్టించి బాండు యొక్క పరిపక్వ కాలం (maturity period)తర్వాత బాండుదారుకు అవసరమైన ద్రవ్యాన్ని చెల్లించగలదు. ప్రభుత్వం చాలా రుణాల విషయంలో కూడ ట్రెజరీ విడుదల చేసే బాండులు అమ్ముడు పోవనే భయం (marketability risk) కాని, ద్రవ్యత్వం పోగొట్టుకొనే ప్రమాదం (liquidity risk) చాలా అల్పం. దేశం మొత్తంలో విస్తరించిన వ్యవస్థాపరమైన (organised) మార్కెట్ ఈ బాండులను కలిగి యుంటాయి. బాండు హోల్డరు ఏ సమయంలోనైనా చివరగా ప్రకటించబడిన (quoted) ధరకు అతి చేరువలోని ఏ ధరకైనా బాండును అమ్ముకోవచ్చు. మిగతా సెక్యూరిటీల మార్కెట్లవలె గాక, వరుసక్రమానుగత (successive) లావాదేవీలలో, ఈ బాండుల ధరలలోని మార్పులు సాధారణంగా స్వల్పంగా ఉంటాయి. ఏదైనప్పటికీ ప్రభుత్వ బాండ్లకు వాస్తవానికి అమ్ముడుపోవనే ప్రమాదంకాని, నిర్ణీత సమయంలో డబ్బు చెల్లించలేకపోయే ప్రమాదము కానీ లేకపోయినప్పటికీ, ప్రభుత్వ బాండు మార్కెట్ నష్ట భయానికి గురి చేయబడుతుంది. మార్కెట్ నష్ట భయం అనగా మార్కెట్ వడ్డీరేటులో మార్పు రావడం అని గ్రహించాలి.

ఇతర బాండుల వలె, ప్రభుత్వ బాండులతో, మార్కెట్ స్వేచ్ఛగా వర్తకం చేయవచ్చు. ఈ ప్రభుత్వ

BRAOU

బాండులు కూపను రేటును కలిగి ఉంటాయి. ఈ కూపను రేటును ఋణ బాండు పేపరు మీద ముద్రిస్తారు. ఈ బాండు మీద వార్షికంగా చెల్లించవలసిన మొత్తాన్ని బాండును విడుదల చేసినవారు చెల్లిస్తారు. ఈ చెల్లించవలసిన మొత్తం కూపను రేటును ఆ బాండు ముఖ విలువతో గుణించగా వచ్చే మొత్తానికి సమానం. ఉదా: ప్రభుత్వం రూ. 1000 బాండును, 5 శాతం వడ్డీరేటుతో, 25 సం॥ల తర్వాత చెల్లింపుకు సిద్ధంతో, 1965 సం॥లో విడుదల చేసిందని ప్రమేయం చేద్దాం. ప్రభుత్వ ట్రెజరీ 1966 నుండి 1990 వరకు ప్రతి సంవత్సరం రూ. 50 చెల్లించే వాగ్దానం చేస్తుంది. రూ. 1000 ముఖ విలువగల బాండును 1990 తర్వాత చెల్లిస్తానని వాగ్దానం చేస్తుంది. ప్రస్తుతం, 1985 సం॥ అని ప్రమేయం చేస్తే ఈ బాండు మార్కెట్‌లో ఎంతకు అమ్ముడుపోతుంది? వేరే విధంగా చెప్పాలంటే, 1986 నుండి 1990 వరకు, ప్రతి సం॥ రూ. 50 వడ్డీని చెల్లిస్తూ వుండి 1990 లో రూ. 1000 మూలధనం (principal) చెల్లిస్తే, ఈ బాండు యొక్క ప్రస్తుత మార్కెట్ ధర ఎంత ఉంటుంది? ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి, ప్రభుత్వ ట్రెజరీ 5 సం॥ల తర్వాత చెల్లింపుకు సిద్ధంతో ఋణం తీసుకుంటే, 1985 సం॥లో చెల్లించవలసిన వడ్డీరేటును ప్రవేశపెట్టాలి. మిగతా అంకెలు (figures)కూడ భవిష్యత్ ఆదాయ ప్రవాహపు ప్రస్తుత విలువను పొందడం కోసం ఉపయోగించే సాధారణ (general) సమీకరణంలో ప్రవేశపెడదాం.

ఈ సమీకరణాన్ని అభివృద్ధి చేయటానికి సాధారణ చక్రవడ్డీ సమీకరణంతో ప్రారంభిద్దాం. మార్కెట్ వడ్డీరేటు 5 శాతం అనుకుందాం. ఒక వ్యక్తి 5 శాతం వడ్డీరేటుకు ఒక సం॥ కొరకు రూ. 95.24 అప్పుగా ఇస్తే, అతడు ఆ సంవత్సరాంతం రూ. 100 పొందుతాడు [i. e. 95.24 + (0.05 x 95.24) = 95.24 ( 1 + 0.05) = రూ. 100] సాధారణంగా, ఒక సంవత్సరాంతం, అప్పుదారుడు $P_1 = P_0 (1 + r)$ ను తిరిగి పొందుతాడు. ఇక్కడ, $P_1$ = సంవత్సరాంతం తిరిగి పొందే మొత్తం; $P_0$ = అప్పుగా ఇచ్చిన మొత్తం; r = వడ్డీరేటు. ఒకవేళ, అతడు $P_1$ మొత్తానికి రెండవ సం॥ కొరకు అప్పుగా ఇస్తే, రెండవ సంవత్సరాంతం అతను $P_2 = P_0 (1 + r)(1 + r) = P_0 (1+r)^2$ ను తిరిగి పొందుతాడు. నియమం ఏమిటంటే, $P_0$ అను మొత్తానికి, r అను వడ్డీరేటుకు, n సంవత్సరాల కొరకు అప్పుగా ఇస్తే n సంవత్సరాల తర్వాత ఆ మొత్తం $P_n = P_0 (1 + r)^n$ కు వృద్ధి చెందుతుంది.

భవిష్యత్ మొత్తపు ప్రస్తుత విలువను కనుగొనే ప్రక్రియ సంకలన ప్రక్రియకు వ్యతిరేకమైంది. ఉదా : 5 శాతం మార్కెటు వడ్డీరేటు ఉన్నప్పుడు, ఈ రోజునుండి ఒక సం॥ తర్వాత వాపసు తీసుకొనే రూ. 100 ప్రస్తుత విలువ ఎంత ? మనకు ఇవ్వబడిన $P_1$ = రూ. 100, r = 0.05 వివరాలతో $P_0$ ను కనుక్కొందాం. $P_1 = P_0 (1 + r)$ సమీకరణంలో ఆయా విలువలను ప్రతిక్షేపించగా

$$P_O = \frac{P_1}{1 + r} = \frac{100}{(1 + 0.05)} = \text{రూ. } 95.24.$$

ఈ రోజునుండి రెండు సం॥ల తర్వాత స్వీకరించే రూ. 100 ప్రస్తుత విలువ ఎంత ? $P_2 = Po (1 + r)^2$ సమీకరణం ద్వారా ఈ క్రింది ఫలితాన్ని పొందుతాం.

$$P_o = \frac{P_2}{(1 + r)^2} = \frac{100}{(1 + 0.05)^2} = \text{రూ. } 90.70.$$

సర్వసాధారణంగా, ఔచిత్యమైన వడ్డీరేటు చేత అనుక్రమంలోని ప్రతి భాగాన్ని భూత కాలంనుండి వర్తమానంనకు డిస్కౌంటు చేస్తూ, బాండుచే జనించబడిన భవిష్యత్ ప్రవాహం మొత్తం యొక్క ప్రస్తుత విలువను

కనుగొనవచ్చు. ప్రస్తుత విలువ కొరకు V ని ఉపయోగిస్తూ, $R_1, R_2, \ldots\ldots, R_n$ లను వడ్డీవల్ల వచ్చే ఆదాయ ప్రవాహపు ఒక్కొక్క భాగానికి ఉపయోగిస్తూ A ను n సం॥లలో చెల్లించబడే ముఖ విలువ మొత్తానికి ఉపయోగిస్తూ క్రింది సమీకరణాన్ని పొందవచ్చు.

$$V = \frac{R_1}{(1+r)} + \frac{R_2}{(1+r)^2} + \ldots\ldots + \frac{R_n}{(1+r)^n} + \frac{A}{(1+r)^n}$$

1965 లో విడుదల చేయబడిన బాండు 1990లో తిరిగి చెల్లించే నిబంధనతో కూడిన ప్రభుత్వ బాండును గూర్చి వివరిద్దాం. ఈరోజు 1985 సం॥ అనే ప్రమేయంతో బాండు యొక్క ప్రస్తుత విలువ ఎంత? ఇక్కడ, 1986 నుండి 1990 వరకు ప్రతి సం॥ రూ. 50, 1990 లో రూ. 1000 చెల్లించుటకు 1985లో ట్రెజరీ వాగ్దానం చేసిందని గుర్తుపెట్టుకోవాలి. 1985లో ఈ 5 సం॥లకు ట్రెజరీ చెల్లించే వడ్డీరేటు 8శాతం అనుకుందాం. ఇంతకు ముందు తెలిపిన ప్రస్తుత విలువ సమీకరణం ద్వారా 8 శాతం వడ్డీరేటు మొదలగు వివరాలతో మిగిలిన బాండు యొక్క ప్రస్తుత విలువను కనుగొనవచ్చు.

$$V = \frac{50}{(1+0.08)} + \frac{50}{(1+0.08)^2} + \frac{50}{(1+0.08)^3} + \frac{50}{(1+0.08)^4} + \frac{50}{(1+0.08)^5} + \frac{1000}{(1+0.08)^5}$$

$=46.29 + 42.87 + 39.69 + 36.75 + 34.03 + 680.58 =$ రూ. 880.21.

ఇక్కడ, ముఖ విలువ రూ. 1000 నుండి దాదాపు 12 శాతం డిస్కౌంటు వద్ద బాండు అమ్మబడుతుంది. ఒకవేళ వడ్డీరేటు 8 శాతం కన్నా ఎక్కువ ఉండి ఉంటే బాండు యొక్క ప్రస్తుత విలువ ఇంతకు ముందు కన్నా తక్కువగా ఉండేది లేక బాండు యొక్క డిస్కౌంటు ఇంతకు ముందు కన్నా ఎక్కువగా ఉండేది. అలాకాకుండా, ఒకవేళ వడ్డీరేటు 5శాతం ఉండి ఉంటే బాండు ప్రస్తుత విలువ రూ. 1000 కన్నా ఎక్కువగా ఉండేది. వడ్డీ రూపంలోని ఆదాయ ప్రవాహం మరియు చెల్లింపుకు సిద్ధంగా ఉన్న మూలధనం మొత్తం ఇచ్చినట్లైతే ట్రెజరీ బాండు ప్రస్తుత విలువ అత్యావశ్యకంగా ఒకే కారణం వలన మార్పు చెందుతుంది. ఆ కారణం వడ్డీరేటులోని మార్పు అని గ్రహించాలి. దీనికి విరుద్ధంగా కార్పోరేటు, స్టేటు మరియు స్థానిక ప్రభుత్వ బాండుల ధరలు, మార్కెటుచే విలువ కట్టబడిన పరపతి నష్ట భయంలో మార్పువచ్చిన కొలది, మార్పు చెందుతాయి. ఇంకొక విధంగా చెప్పాలంటే, ఇటువంటి బాండుల విషయంలో వడ్డీ (R) మరియు మూలధనం (A) ను వాగ్దానం చేసినట్లుగా చెల్లించని ప్రమాదముంది. ఇటువంటి బాండుల విషయంలో చెప్పుకోదగిన అమ్మకం కాక పోవచ్చునన్న భయం (marketability risk)ఉంది. కొన్నిసార్లు మార్కెటు పరిస్థితులు సరిగ్గా లేకపోతే బాండు గత ధరకు దగ్గరగా ఉండే ధరకు కూడ ఆ బాండు అమ్ముడుపోకపోయే ప్రమాదముంది. ఏదైనప్పటికీ, కేంద్ర ప్రభుత్వ బాండులకే పరిమితమైతే వాస్తవానికి బాండు ధరలలోని మార్పులకు, వడ్డీరేటులోని మార్పులు మాత్రమే కారణమౌతాయి. బాండు ధరకు, వడ్డీరేటుకు మధ్యనున్న గణాంక సంబంధాన్ని (arithmatic relationship) కన్సోల్ (consol)అనే బాండు ద్వారా స్పష్టంగా ప్రకటించవచ్చు. కన్సోల్ అన్నది బ్రిటిషు ప్రభుత్వం విడుదల చేసే ఒక విధమైన సెక్యూరిటీ. ఈ సెక్యూరిటీ మీద ప్రతీ సంవత్సరం స్పష్టంగా నిర్దేశించబడిన ద్రవ్యాన్ని వడ్డీరూపంలో చెల్లించుటకు వాగ్దానం చేయడం జరుగుతుంది. ఈ సెక్యూరిటీ పరిణతి తేదిని కలిగి యుండదు. పెట్టుబడిదారు ఈ సెక్యూరిటీని వేరొక పెట్టుబడిదారుకు అమ్మి మాత్రమే డబ్బులోకి మార్చుకోవడానికి వీలుంటుంది. ఒకవేళ మార్కెటు పరిస్థితులు అనుకూలిస్తే ఈ సెక్యూరిటీ మీద 5 శాతం వడ్డీని సంపాదించగలుగుతూ, ప్రతి సం॥ రూ. 50 వడ్డీ చెల్లిస్తే ఈ సెక్యూరిటీ రూ. 1000 కు అమ్ముడు పోతుంది. కొనుగోలుదారుడు రూ. 1000 చెల్లిస్తే, ఆ మూలధనం మీద అతనికి 5 శాతం ప్రతిఫలం వస్తుంది. ఈ సెక్యూరిటీల విషయంలో, ప్రస్తుత విలువ సమీకరణం ఈ క్రింది విధంగా రూపాంతరం చెందుతుంది.

$$V = \frac{R}{r} \quad \text{లేదా} \quad 1000 = \frac{50}{(0.05)}$$

అలా జరిగినప్పటికీ, ఆ సమయంలో 5 శాతం (వడ్డీరేటు) ఉత్పాదన ఎంత ఆకర్షణీయంగా ఉన్నా ఒకవేళ భావి (prospective)కొనుగోలుదారుడు వడ్డీరేటు పెరుగుతుందని నమ్మితే అతడు సెక్యూరిటీని కొనడం కన్నా ఈ రూ. 1000 ను తన వద్దనే నిరుపయోగంగా (భ్రామిక నిలువగా) అట్టి పెట్టుకొనడం ఉత్తమమైనది. ఉదా : అతడు ఒక సం॥లో వడ్డీరేటు 5.26 శాతం పెరుగుతుందనే నమ్మకంతో ఉన్నాడని అనుకుందాం. అప్పుడు ఈ సెక్యూరిటీ 5.26 శాతం ఉత్పాదనకు తగిన విధంగా తక్కువ ధరకు అమ్ముడుపోతుంది.

$$V = \frac{50}{0.0526} = \text{రూ. } 950.$$

అనగా, ఈసెక్యూరిటీ రూ. 950 లకే అమ్ముడుపోతుంది. ఈ సెక్యూరిటీని ఈరోజు కొని ఒక సం॥ వరకు తన వద్ద ఉంచుకుంటే అతనికి వడ్డీరూపంలో రూ. 50 ఆదాయం వస్తుంది. అంతేగాకుండా అతనికి రూ. 50 ల మూలధన నష్టం జరుగుతుంది. పన్నుల విషయం ప్రక్కకుపెడితే, అతనికి నికర లాభం కాని లేక నికర నష్టం కాని ఉండదు. ఇంకో విధంగా చెప్పాలంటే, భావి కొనుగోలుదారుడు తన వద్ద రూ. 1000 ను నిరుపయోగంగా ఒక పూర్తి సం॥ ఉంచుకొని, అప్పుడు ఆ సెక్యూరిటీని కొనుగోలు చేస్తే ఈ రోజు కొన్న సంపన్నుని వలెనే అతడు సంపన్నుడు అవుతాడు. వాస్తవంగా, వడ్డీరేటు 5.26 శాతానికి పెరిగితే ఇది నిజమౌతుంది. ఒకవేళ భావి కొనుగోలుదారుడు ఒక సంవత్సరం తర్వాత వడ్డీరేటు 5.26 శాతం కన్నా ఎక్కువ పెరుగుతుందని ముందుగానే ఊహిస్తే, సెక్యూరిటీ కొనడం కన్నా రూ. 1000 ను ద్రవ్య రూపంలో ఉంచుకొంటేనే అతనికి లాభం జరుగుతుంది. ఒకవేళ, ముందుగా ఊహించిన వడ్డీరేటు 5.26 శాతం కన్నా తక్కువగా ఉంటే, ద్రవ్యం ఉంచుకోవడం కన్నా సెక్యూరిటీని ఇప్పుడే కొనడం అతనికి లాభసాటిగా ఉంటుంది. ఉదా: ఊహించిన వడ్డీరేటు 6 శాతం ఉంటే, బాండు ధర రూ. 833.33 కు పడిపోతుంది. దీనివల్ల కొనుగోలుదారుకు సంవత్సరానికి రూ. 116.66 నష్టం వాటిల్లుతుంది. ఆ విధంగా కాకుండా, ఊహించిన వడ్డీరేటు 4 శాతం ఉంటే బాండు ధర రూ. 1250 కు పెరుగుతుంది. దీని వలన కొనుగోలుదారుడికి సంవత్సరానికి రూ. 300 లాభం వస్తుంది. వడ్డీరేటు మరియు మూలధనం లాభాన్ని / నష్టాన్ని చేర్చితే, వడ్డీరేటులో 1% పెరుగుదల 11.66 శాతం ఉత్పాదనను తగ్గిస్తుంది. ఒకశాతం తగ్గుదల వల్ల సంవత్సరానికి 30 శాతం ఉత్పాదనను పెంచుతుంది. వడ్డీరేటుకు, బాండు ధరకు మధ్యనున్న విలోమ సంబంధం స్పష్టంగా నిర్దేశించిన పరిణతి (maturity)తేదీలతో కూడిన లోకరూఢమైన ఋణ బాండులకు వర్తిస్తుంది. ఏమైప్పటికీ, కన్సోల్ యథార్థ స్థితికి విరుద్ధంగా, లోకరూఢమైన బాండు మీద స్పష్టంగా నిర్దేశించబడిన పరిణతి తేది సమీపించిన కొలది వడ్డీరేటులోని మార్పులకు దాని ధరయొక్క ప్రతిక్రియ (sensitivity)తక్కువగా ఉంటుంది. వడ్డీరేటు 5 శాతం నుండి 6 శాతానికి పెరిగినప్పుడు, కన్సోల్ మార్కెటు ధర రూ. 1000 నుండి రూ. 833.33 కు తగ్గుతుంది. ప్రతి సంవత్సరం రూ. 50 వడ్డీ చెల్లించబడే 10 సంవత్సరాలలో పరిణతి చెందే రూ. 1000 బాండు విషయంలో కూడ వడ్డీరేటులో అదే పెరుగుదల బాండు యొక్క మార్కెటు విలువ రూ. 926.39 కు తగ్గుతుంది. ఒకవేళ అదే బాండు 5 సంవత్సరాలలో పరిణతి చెందితే దాని విలువ రూ. 957.88 కు తగ్గుతుంది. ఒకవేళ అదే బాండు ఇప్పటి నుండి ఒక సంవత్సరంలో పరిణతి చెందితే, దాని విలువ రూ. 990.57 కు తగ్గుతుంది.

సంక్షిప్తంగా చెప్పాలంటే వడ్డీరేటును, పరిణతి కాలాన్ని, మార్కెటు విలువను కలిపితే ఋణ బాండు యొక్క మార్కెటు విలువ వడ్డీరేటుతో విలోమ సంబంధం కలిగి యుంటుంది. బాండు పరిణతి కాలం ఎక్కువ దూరస్థంగా ఉంటే దాని మార్కెటు విలువ మీద వడ్డీరేటులోని మార్పు అధిక ప్రభావాన్ని కలిగిస్తుంది.

BRAOU

### 6.7.2 సంభావ్యతలు, వడ్డీరేటు (Expectations and Interest Rate)

ఎవరైనా దీర్ఘకాలిక బాండు కొంటే వారు తప్పకుండా భవిష్యత్ వడ్డీరేటులో వచ్చే మార్పులను కొంతవరకు విధిగా స్పెక్యులేటు చేస్తారు. ఆ మార్పుల వల్ల వచ్చే నష్టం కాని లేక లాభం కాని వచ్చే సంభావ్యతను (possibility) తప్పకుండా ఎదుర్కొంటారు. ఇతర ఆలోచనలు వారి నిర్ణయాలను ప్రభావితం చేసినప్పటికీ, ఎవరైతే తమ వద్దనున్న ద్రవ్యాన్ని బాండు రూపంలోకి మార్చుకుంటున్నారంటే వడ్డీరేటు పడిపోతుందనీ, బాండు ధర పెరుగుతుందనీ వారు భావిస్తారన్నమాట. ప్రస్తుత వడ్డీరేటు ఎక్కువగా ఉన్నట్లు ప్రస్తుత బాండు ధరలు తక్కువగా ఉన్నట్లు వారు భావిస్తారు. ఎవరైతే వారి బాండులను ద్రవ్య రూపంలోకి మారుస్తారో వారు విరుద్ధమైన సంభావ్యతలు (expectations) కలిగియుంటారు. ప్రస్తుత వడ్డీరేటు తక్కువగా, ప్రస్తుత బాండు ధరలు ఎక్కువగా ఉన్నట్లు వారు భావిస్తారు. స్పష్టంగా చెప్పాలంటే ఎవరైతే ప్రస్తుత వడ్డీరేటు ఎక్కువగా కాని లేదా తక్కువగా కాని ఉందని భావిస్తారో, ప్రస్తుత వడ్డీరేటుతో పోల్చుకోవడం కొరకు వారు సాధారణ (normal) వడ్డీరేటును వారి మనస్సులో కలిగియుంటారు. ఈ సాధారణ రేటు కూడ ఎల్లప్పుడూ మారుతూ ఉంటుంది. ఈ రేటు ద్రవ్యోల్బణం వలన మారుతూ ఉంటుంది. ద్రవ్యోల్బణం, ఇతర కారకాలు సంపన్నులు, సాధారణ వడ్డీరేటు పై వారి భావనలు సరిచేసుకోవడానికి కారణమైనప్పటికీ ఒక సమయంలో ప్రస్తుత వడ్డీరేటు, సాధారణ రేటుకన్నా ఎక్కువగా కాని లేదా తక్కువగా కాని ఉన్నట్లు వారు నిర్ణయించుకోవచ్చు.

సంపన్నులు, సాధారణ వడ్డీ రేటుకన్నా ప్రస్తుత వడ్డీరేటు ఎక్కువగా ఉందని భావిస్తే, అప్పుడు ఈ ప్రస్తుత రేటు పడిపోయి మళ్ళీ సాధారణ రేటు తిరిగి వస్తుందని వారు ముందుగానే ఊహిస్తారు. ఈ ఎక్కువ ప్రస్తుత వడ్డీరేటు వద్ద, పేర్కొన్న పరిస్థితులు సూచించినట్లుగా నిజానికి సంపన్నులు ద్రవ్యానికి బదులు బాండులను ఉంచుకుంటారు. తత్ఫలితంగా, బాండుల ద్వారా వచ్చే ఎక్కువ లాభం రేటును ప్రస్తుతం అనుభవించుటయే గాక, బాండు ధరలు పెరుగుతున్న కొలదీ; వడ్డీరేటు, సాధారణ రేటుకు పడిపోవుచున్నకొలదీ; వారు మూలధన లాభాలు (capital gains) కూడా ముందుగానే ఊహించగలరు. అలా కాకుండా, సంపన్నులు ప్రస్తుత వడ్డీరేటు తక్కువగా ఉందని భావిస్తే, ఆ రేటు మళ్ళీ సాధారణ రేటుకు పెరుగుతుందని ముందుగానే ఊహిస్తారు. ఆ ప్రకారంగా, వారు బాండులకు బదులుగా ద్రవ్యాన్ని తమవద్ద అట్టిపెట్టుకుంటారు. ఎప్పుడైతే ప్రస్తుత వడ్డీరేటు తక్కువగా ఉంటుందో, నష్టపోయిన వడ్డీరూపంలో చెల్లించిన జుర్మానా సాపేక్షికంగా తక్కువగా ఉంటుంది. ఒకవేళ, ముందుగానే ఊహించినట్టుగా, ప్రస్తుత వడ్డీరేటు సాధారణ రేటుకు పెరిగితే, దానివల్ల వచ్చే మూలధన నష్టం (capital loss) సాపేక్షికంగా ఎక్కువగా వుంటుంది. అందువలన ద్రవ్యాన్ని నిరుపయోగంగా ఉంచుకోవడం విత్త పరంగా (financially) వివేకమైన విధానం అవుతుంది.

ప్రజలు తమ వద్ద ఉంచుకోవాలనే భ్రామిక ద్రవ్య నిలువల మొత్తం, వడ్డీరేటుతో విలోమానుపాతంగా మారుతూ ఉంటుంది. దైనందిన వ్యవహారాల కొరకు, ముందుజాగ్రత్త ఉద్దేశాల కొరకు చేసే ద్రవ్య డిమాండు ఉపయోగించిన $m_t = k(Y)$ అను సమీకరణాన్ని, భ్రామిక (చట్టా వ్యాపార) ద్రవ్య డిమాండుతో జోడించాలంటే, చట్టా వ్యాపార (భ్రామిక) ద్రవ్య డిమాండు కొరకు ఒక సమీకరణం వ్రాయవలసి ఉంటుంది. భ్రామిక ఉద్దేశం కొరకు డిమాండు చేసే నామ మాత్రపు ద్రవ్య నిలువల మొత్తాన్ని $M_{sp}$ చే నిర్దేశిస్తే, $M_{sp} = P.h(r)$ అను సమీకరణం వస్తుంది. దైనందిన వ్యవహారాల సమీకరణంలో వలె Y కు, $M_t$ కి మధ్య నున్న ధనాత్మక (positive) సంబంధం వలె కాక, ఈ సమీకరణంలో $M_{sp}$ కి, r కు మధ్య విలోమ (inverse) సంబంధం ఉంటుంది. దైనందిన వ్యవహారాల సమీకరణానికి అనుకూలంగా, భ్రామిక ద్రవ్య నిలువల డిమాండు $M_{sp} = P.\ h(r)$ సమీకరణాన్ని P చేత భాగించి, దానిని వాస్తవిక రూపంలో వ్యక్తీకరించవచ్చు. ఇది, $\frac{Msp}{P} = h(r)$ అను

BRAOU

సమీకరణాన్ని ఇస్తుంది. ఇంకోవిధంగా చెప్పాలంటే, భ్రామిక వాస్తవిక ద్రవ్య నిలువల మొత్తం డిమాండు వడ్డీరేటుచే నిర్ణయించబడుతుంది. $\frac{Msp}{P}$ ని సంక్షిప్తంగా $m_{sp}$'గా పేర్కొందాం.

దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు విషయంలో, నామమాత్రపు ద్రవ్య నిలువల మొత్తం డిమాండు, ధరలతో పాటు $M_t = P.k(Y)$ సమీకరణంలో చూపినట్లుగా అనుపాతంగా (proportionally) మారుతుంటుంది. మిగతా కారకాలు మారకుండా ఉంటే, ఉత్పత్తి ధరలు పెరిగితే, ఆ ఉత్పత్తికి సంబంధించిన వ్యవహారాలను నిర్వహించడానికి కేవలం అనుపాతంగా ఎక్కువ నామమాత్రపు ద్రవ్య నిలువలు ప్రజలకు అవసరమౌతాయి. అయినప్పటికీ, $M_{sp} = P.h(r)$ చేత పేర్కొన్నట్టుగా, ధరలతోపాటు భ్రామిక నామమాత్రపు ద్రవ్య నిలువలు మారుతాయని ముందుగానే ఊహించుదామా ? దీనికి సమాధానం స్పష్టంగా లేదు. దీనిలోని క్లిష్టతను చూడడానికి ధరలు ఒకేసారి రెండింతలు అయినవని అనుకుందాం. ఒకవేళ, సంపన్నుల ఆదాయం, సంపద కూడ ద్రవ్య రూపంలో రెండింతలు అయితే, వాస్తవిక అంశాలలో ఏ మాత్రం మార్పు ఉండదు. భ్రామిక వాస్తవిక ద్రవ్య నిలువలలో మార్పు రాకుండా ఉండేందుకు సంపన్నులు ఒక నిర్ణీత వడ్డీరేటు వద్ద ఉంచుకున్న ద్రవ్యానికి రెండింతల ద్రవ్యాన్ని ఉంచుకుంటారు. దీనిని ధరలలోని మార్పులకు అనుగుణంగా ఉంచుకుంటారు. ఇది తగినంత సహేతుకంగా కనిపించినప్పటికీ, అందరి సంపన్నుల యొక్క నామమాత్రపు ఆదాయం, సంపద సాధారణ ధరల స్థాయితోపాటు అనుపాతంగా పెరగదని గ్రహిస్తుంటాం. చివరకు (at the extreme) ఒక వ్యక్తి యొక్క సంపద సంపూర్ణంగా కరెన్సీ మరియు కన్సోల్లలో ఉండి, అతని ఆదాయం కన్సోల్ల నుండి వచ్చే వడ్డీరూపంలో మాత్రమే ఉంటుందని అనుకుందాం. ధరల స్థాయి రెండింతలైతే, అతని నామమాత్రపు ఆదాయంలో మార్పు ఉండదు, కాని అతని నిజ ఆదాయం సగానికి తగ్గుతుంది. ఇది అతని సంపద యొక్క నామ మాత్రపు విలువలో మార్పు రానీయదు. కాని ఆదాయం తగ్గిన స్థాయిలోనే దాదాపు సంపద యొక్క వాస్తవిక విలువ కూడా తగ్గుతుంది. ఈ పరిస్థితులలో, సంపన్నుల భ్రామిక ద్రవ్య డిమాండు ఎంత ఉన్నప్పటికీ, ధరల మార్పుతోపాటు అనుపాతంగా వారి భ్రామిక ద్రవ్య నిలువల పరిమాణమంలో సర్దుబాటు చేసుకుంటారని ఊహించడం సహేతుకం కాదు.

సహజంగానే, కొంతమంది సంపన్నులు పై విధంగా ఉంటారు. ఒక నిర్దిష్ట వడ్డీరేటు వద్ద, సంపన్న వర్గాలు భ్రామిక ఉద్దేశం కొరకు చేసే ద్రవ్య డిమాండు ఒక దశ వరకు ధరల స్థాయి మీద ఆధారపడి ఉంటుంది. కాని, ఆ మొత్తం ధరల స్థాయితో అనుపాతంగా మార్పు చెందక పోవచ్చు. ఏమైనప్పటికీ, $M_{sp} = P.h(r)$ సమీకరణం సూచించినట్టుగా భ్రామిక నిలువలు మారుతాయని చూపించడం ఈ రోజులలో సాధారణమైంది. భ్రామిక వాస్తవిక నిలువల మొత్తం డిమాండును $\frac{Msp}{P} = m_{sp} = h(r)$ రూపంలో చూపిస్తూ, ఈ సంబంధాన్ని రేఖా చిత్రం 6.5 లోని రేఖ ద్వారా చూపించవచ్చు.




పటం - **6.5 :** భ్రామిక ద్రవ్య డిమాండు

మార్కెటు వడ్డీరేటు ఎక్కువగా ఉంటే, భ్రామిక ఉద్దేశం కొనసాగించడం కొరకు సంపన్నులు వాస్తవిక ద్రవ్య నిలువల మొత్తాన్ని తక్కువగా ఉంచుకుంటారు. కొంత ఎక్కువ వడ్డీరేటు వద్ద సంపన్నులు భ్రామిక ఉద్దేశం కోసం ఏ మాత్రం ద్రవ్య నిలువలను ఉంచుకోరని పటం 6.4 లోని రేఖ సూచిస్తుంది. ఇక్కడ చిత్రించినట్టుగా, **14** శాతం వడ్డీరేటు వద్ద లేక దాని కన్నా ఎక్కువ రేటు వద్ద భ్రామిక డిమాండు రేఖ క్షితిజ రేఖకు లంబంగా నున్న అక్షంతో (vertical axis) కలిసిపోయింది. అనగా $m_{sp}$ శూన్యం అవుతుంది. ఈ రేటు ఎంత ఎక్కువగా ఉందంటే, అది భవిష్యత్తులో తగ్గుతుందే గానీ, ఎంత మాత్రం పెరగదని సంపన్న వర్గాలు భావిస్తాయని చెప్పడానికి ఇది సరిపోతుంది. ఒకవేళ ఈ రేటు పెరిగినా, మూలధన నష్టం కన్నా, ఈ వడ్డీరేటు వలన వచ్చే లాభం ఎక్కువగా ఉంటుంది. ఈరేటు వద్ద, డబ్బుకు బదులుగా బాండులను ఎంచుకుంటారు. బాండులు సంపూర్ణ భద్రతను కలుగజేస్తాయి. ఈరేఖ యొక్క వేరే చివర, భ్రామిక ద్రవ్య డిమాండు సంపూర్ణ వ్యాకోచత్వాన్ని కలిగి ఉంది. ఈ ప్రస్తుత రేఖాచిత్రంలో, సంపూర్ణ వ్యాకోచత్వం 4 శాతం వడ్డీరేటు వద్ద సంభవిస్తుంది. భిన్న పరిస్థితులలో, 4 శాతం వడ్డీ రేటు తక్కువ రేటుగా భావింపబడనప్పటికీ ఆ సమయంలో ఉన్న పరిస్థితులలో వడ్డీరేటు తగ్గదని సంపన్నవర్గాలు నమ్ముతారని ప్రమేయం చేయడం జరుగుతుంది. ఈ వడ్డీరేటు వద్ద, డబ్బుకు బదులుగా బాండులను ఉంచుకొంటే, వడ్డీరేటు పెరుగుతున్న కొలది, మూలధన నష్టం (capital loss) ను ఎదుర్కోవలసి వస్తుంది. తక్కువ వడ్డీ రేటు వద్ద సమకూర్చబడే ఆదాయం, మూలధన నష్టాన్ని పాక్షికంగా పూడ్చుతుంది. రేఖ యొక్క ఈ భాగాన్ని ద్రవ్యత్వ వల (liquidity trap) అని అంటారు.

## 6.8 ద్రవ్యపు మొత్తం డిమాండు (Total Demand for Money)

ఇంతవరకు చేసిన ద్రవ్య డిమాండు విశ్లేషణను అనుసరించి, దైనందిన వ్యవహారాల డిమాండును (ముందు జాగ్రత్త కోసం చేసే ద్రవ్య డిమాండుతో సహా) $m_t = k(Y)$ గా, చట్టా వ్యాపార(భ్రామిక) ద్రవ్య డిమాండును $m_{sp} = h(r)$ గా పేర్కొనవచ్చు. అలాగే, ద్రవ్యం మొత్తం డిమాండును వాస్తవిక అంశాలలో $m_d$ చే పేర్కొనవచ్చు. అప్పుడు $m_d = m_t + m_{sp}$ అవుతుంది. అందువలన, $m_t = k(Y)$ అను సమీకరణాన్ని $m_{sp} = h(r)$ సమీకరణంతో కలుపగా ద్రవ్యం మొత్తం డిమాండు సమీకరణం వస్తుంది. దీనిని $m_d = k(Y) + h(r)$ సమీకరణంగా పేర్కొనవచ్చు.

ఏదేని ఒక ధర స్థాయి వద్ద, ప్రతీ ఆదాయ స్థాయి వద్ద $m_t$ ఎంత ఉంటుందని, k నుండి తెలుసుకుంటాం. అదే విధంగా, ఏదేని ఒక ధర స్థాయి వద్ద, ప్రతి r స్థాయి వద్ద $m_{sp}$ ఎంత ఉంటుందని h నుండి తెలుసు కుంటాం. అందువలన ప్రతి Y & r యొక్క సంభావ్యమైన (possible) సంయోగం (combination) వద్ద ద్రవ్యం మొత్తం డిమాండు ఎంత ఉంటుందని k మరియు h ల నుండి తెలుస్తుంది. దీనిని పటం 6.6 ద్వారా చూపించాం.



A. దైనందిన వ్యవహారాల డిమాండ్ B. భ్రామికమైన డిమాండు C. మొత్తం డిమాండు

పటం - 6.6 : ద్రవ్యం మొత్తం డిమాండు

k = 1/4 అనే ప్రమేయంతో, ఎప్పుడైతే ఆదాయ స్థాయి రూ. 400 కోట్లు ఉన్నప్పుడు, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు రూ. 100 కోట్లు ఉంటుందని పటం 6.5 A-భాగం చూపిస్తుంది. చట్టా వ్యాపార (భ్రామిక) ద్రవ్య డిమాండు, వడ్డీరేటుతో విలోమ సంబంధం కలిగియున్నట్టుగా B-భాగం చూపిస్తుంది. మొత్తం ద్రవ్య డిమాండు రేఖను C-భాగం చూపిస్తుంది. ద్రవ్యం మొత్తం డిమాండు A, B భాగాల ప్రత్యేక డిమాండుల కూడిక లేక $m_t$ మరియు $m_{sp}$ ల కూడిక అని చెప్పవచ్చు. ఉదా : రూ. 400 కోట్ల ఆదాయం వద్ద 8 శాతం వడ్డీరేటు ఉన్నప్పుడు ద్రవ్యం మొత్తం డిమాండు రూ. 110 కోట్లు ఉంటుంది. అదే ఆదాయ స్థాయి వద్ద, 10 శాతం వడ్డీరేటు ఉన్నప్పుడు ద్రవ్యం మొత్తం డిమాండు రూ. 105 కోట్లు ఉంటుంది.

## 6.9 కేన్స్ ద్రవ్యత్వాభిరుచి సిద్ధాంతం, సంప్రదాయవాదుల ద్రవ్య డిమాండు సిద్ధాంతం

సంప్రదాయ వాదుల మాదిరిగానే, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు వడ్డీరేటు మీదకాకుండా ఆదాయ స్థాయిమీదనే ఆధారపడుతుందని కేన్స్ విశ్వసించాడు. కేన్స్ ప్రకారం, Mt = P. k (Y). ఏమైనప్పటికీ, భ్రామిక ద్రవ్య డిమాండును కలుపడంచే, $M_{sp}$ = P. h (r), కేన్స్ $M_d = M_t$ ను నిరాకరించాడు. అందువలన, $M_s$ (ద్రవ్య సప్లయి), $M_d$ మధ్య సమతౌల్యాన్ని Ms = P. k (Y) ప్రకటించడం అనే ప్రతిపాదన (proposition) ను కేన్స్ తిరస్కరించాడు. ఫలితంగా, కేన్స్ సిద్ధాంతం నుండి వచ్చే సారాంశాలతో, సంప్రదాయవాదుల సిద్ధాంతం చాలా భిన్నంగా ఉంటుంది. ఇప్పుడు, ద్రవ్య సప్లయికి, డిమాండుకు మధ్య సమతౌల్యాన్ని ఈ క్రింది సమీకరణం ద్వారా చూపవచ్చు.

$$M_s = P.\,k\,(Y) + P.\,h\,(r)$$

అందువలన, ద్రవ్య సప్లై పెరుగుదలలోని కొంత భాగాన్ని భ్రామిక ద్రవ్య డిమాండు తనలో లీనం

చేసుకుంటుంది. ఏది ఏమైనప్పటికీ, $k = 1/4$ గా ప్రమేయం చేసి, ద్రవ్య సప్లయి పెరిగితే, PYలోని పెరుగుదల, ద్రవ్య సప్లయిలోని పెరుగుదలకు **4** రెట్లు పెరిగినట్లు అర్థం చేసుకోకూడదు. దీని వలన వ్యక్తులు $(1/4)x(PY)$కి సమానమైన దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండును చేస్తారని అర్థం చేసుకోకూడదు. కేన్స్ సిద్ధాంతంలో, ద్రవ్య సప్లయి ($M_s$) లోని పెరుగుదల, వడ్డీరేటు (r) ను తగ్గించినంత మేరకు మాత్రమే PY ని ప్రభావితం చేస్తుంది. వడ్డీరేటు తగ్గడం వలన పెట్టుబడి వ్యయం పెరిగినంతమేరకు, ఆ వడ్డీరేటు PY ని ప్రభావితం చేస్తుంది. సంపూర్ణ వ్యాకోచత్వం కన్నా తక్కువ భ్రామిక ద్రవ్య డిమాండు ఫలాన్ని తీసుకుంటే, $M_s$లోని పెరుగుదల, rలోని తగ్గుదలకు దారితీస్తుంది. సంపూర్ణ అవ్యాకోచత్వం కన్నా తక్కువ వ్యాకోచత్వం కలిగిన పెట్టుబడి డిమాండు రేఖను తీసుకుంటే, rలోని తగ్గుదల పెట్టుబడిలోని పెరుగుదలకు దారి తీస్తుంది. అందువలన, PY లో కొంత పెరుగుదలకు దారితీస్తుంది. PY లోని పెరుగుదలకు $M_s$ లోని పెరుగుదలకు మధ్య నిష్పత్తి నాలుగు కన్నా తక్కువగా ఉంటుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే, PYలోని మార్పులను Msలోని మార్పుల ద్వారా నిర్ణయించుటకు ఎంతమాత్రం వీలుకాదు. దైనందిన వ్యవహారాల డిమాండును, ద్రవ్య మొత్తం డిమాండుగా పరిగణించినప్పుడు ఇది నిజం అవుతుంది. ఈ సారాంశపు ప్రాముఖ్యతను అతిగా నొక్కి వక్కాణించలేం. సంప్రదాయ వాదుల ద్రవ్య డిమాండు సమీకరణానికి , భ్రామిక ద్రవ్య డిమాండును కలపడం వలన, $M_s$ కు PY కు మధ్యనున్న అనుపాత సంబంధం క్రమబద్ధం కాదని త్రోసిపుచ్చవచ్చు. ఈ విధంగా త్రోసి పుచ్చడం వలన, $M_s$ లోని మార్పుల ద్వారా మొత్తం డిమాండులోని మార్పులను, PY మార్పులను సంతృప్తికరంగా వివరించలేం. ఇది ప్రత్యామ్నాయ ఆదాయ నిర్ణాయక సిద్ధాంతాన్ని, సమష్టి డిమాండు (Aggregate Demand) సిద్ధాంతాన్ని కోరుతుంది. ఈ సిద్ధాంతాన్ని కేన్స్ అందించాడు. ఈసిద్ధాంతం దృష్ట్యా చూస్తే దైనందిన వ్యవహారాల డిమాండుకు, భ్రామిక ద్రవ్య డిమాండు కలయిక యొక్క అత్యధిక ప్రాముఖ్యతను గమనించవచ్చు. కేన్స్, దైనందిన వ్యవహారాల (మరియు ముందు జాగ్రత్తకోసం) ద్రవ్య డిమాండును వడ్డీ - అవ్యాకోచత్వ డిమాండుగా వ్యవహరించినప్పటికీ, తగినంత ఎక్కువ వడ్డీరేటు వద్ద, ఈ డిమాండు వాస్తవానికి వడ్డీ - వ్యాకోచత్వం కలిగి ఉంటుందని ఇది వరకే చూసాం. వడ్డీరేటుచేత మాత్రమే భ్రామిక ద్రవ్య డిమాండు నిర్ణయించబడుతుందని కేన్స్ చెప్పాడు. కాని, కొన్ని పరిస్థితులలో, ఈ డిమాండు ఆదాయంచేత కూడ నిర్ణయించబడవచ్చు. దైనందిన వ్యవహారాల, ముందు జాగ్రత్త , భ్రామిక ఉద్దేశాల ద్రవ్య డిమాండులు అన్నీ కొంత వరకు వడ్డీరేటు మీద, ఆదాయం మీద ఆధారపడితే, $M_t$ మరియు $M_{sp}$ల భిన్న డిమాండు ఫలంలను కలిపి ఈ క్రింది విధంగా చూపించవచ్చు.

$$Md = P. f(Y, r).$$

ఈ విధంగా సంఘటిత పరిచిన డిమాండు ఫలం, కేన్స్ ప్రకటించిన మూడు భాగాలలోకి వేరుచేసిన ద్రవ్య మొత్తం డిమాండు కృత్రిమత్వం (artificiality)ను తొలగించుతుంది. ప్రజలు, స్పష్టంగా, మూడింటిలోని ప్రతి ఉద్దేశాన్ని సంతృప్తి పరచడంకోసం, వారియొక్క ద్రవ్యపు నిల్వలను మూడు స్వచ్ఛమైన అరలలోనికి విభజించినారు. సంఖ్యాశాస్త్రపరంగా, మొత్తం ఆర్థిక వ్యవస్థకోసం, హేతుబద్ధం కాని ప్రమేయాలపై ఆధారపడకుండా, ద్రవ్య సప్లయిని చురుకైన; నిరుపయోగ నిల్వలుగా వేరు చేయుటకు ఏ పద్ధతి లేదు. ఈ సంఘటిత సమీకరణం సార్వత్రికమైనప్పటికీ, అన్ని ఉద్దేశాల కొరకు చేసే ద్రవ్య డిమాండు ఆదాయ స్థాయి, వడ్డీరేటు ఫలంగా చూపించే అవకాశం కలిగియుంది.

## 6. 10 ద్రవ్య మార్కెటు సమతౌల్యం (Money Market Equilibrium)

ద్రవ్య సప్లయి, డిమాండులు సమానంగా ఉన్నప్పుడు, ద్రవ్య మార్కెటు సమతౌల్య స్థితిలో ఉంటుంది.

ఒకవేళ, $M_s$ నామమాత్రపు ద్రవ్య సప్లయికి ప్రాతినిధ్యం వహిస్తే, $M_s = M_d$ గా ఉన్నప్పుడు ద్రవ్య మార్కెట్ సమతౌల్య స్థితిలో వుంటుంది. వాస్తవిక అంశాలలో, Ms=md గా వున్నప్పుడు, ద్రవ్య మార్కెట్ సమతౌల్య స్థితిలో వుంటుంది. కేంద్ర బ్యాంకు చర్యల వలన నామ మాత్రపు ద్రవ్య సప్లయ్‌లో మార్పులు వస్తాయి. నామ మాత్రపు ద్రవ్య సప్లయ్‌కి అనుగుణంగా వుండు వాస్తవిక ద్రవ్య సప్లయ్‌లోని మార్పులు ధరల స్థాయితో బాటు సంభవిస్తాయి. వాస్తవిక ద్రవ్య సప్లయ్ స్థిరంగా వుంటుందని అనుకొన్నట్లయితే ద్రవ్య డిమాండ్ పటం 6.7 లో చూపించినట్లుగా వుంటుంది. ద్రవ్య డిమాండ్ ($m_d = m_t + m_{sp}$) తో పాటు సంపూర్ణ అవ్యాకోచత్వ సప్లయ్ రేఖ గా చూపించాం.



పటం - 6.7 : ద్రవ్య సప్లయి, డిమాండుల మధ్య సమతౌల్యం

పటం 6.7లో 8 శాతం వడ్డీరేటు, రూ. 110 కోట్ల ద్రవ్య సప్లయి, డిమాండుల వద్ద ద్రవ్య మార్కెటు సమతౌల్య స్థితిలో ఉంది. ద్రవ్య సప్లయిని ఆదాయ స్థాయిని ఇచ్చినట్లైతే ఒక ప్రత్యేకమైన వడ్డీరేటు వద్ద దైనందిన వ్యవహారాల మరియు చట్టా వ్యాపార (భ్రామికమైన) ద్రవ్య డిమాండుల మొత్తం, ద్రవ్య సప్లయికి సమానంగా ఉంటుంది. ద్రవ్య సప్లయి డిమాండులను సమానం చేసే వడ్డీరేటును సమతౌల్య వడ్డీరేటు అంటారు. పటం - 6.6 లో చూపించినట్టుగా 8 శాతం వడ్డీరేటు వద్ద ద్రవ్య డిమాండు, ద్రవ్య సప్లయికి సమానంగ ఉంది. కేంద్ర బ్యాంకు చర్యల వలన ద్రవ్య సప్లయి రూ. 110 కోట్ల నుండి రూ. 120 కోట్లకు పెరిగితే, వడ్డీరేట 8 శాతం నుండి 6 శాతానికి తగ్గుతుంది. దీనిని పటం 6.8 లో చూపించాం.



పటం - 6.8 : ద్రవ్య సప్లయిలోని మార్పు - వడ్డీరేటు

ద్రవ్య సప్లయి చట్టా వ్యాపార (భామికమైన) ద్రవ్య డిమాండు స్థిరంగా ఉందనుకుంటే, వడ్డీరేటు ఆదాయ స్థాయితో నేరుగా మారుతుంది. ఆదాయ స్థాయి ఎక్కువగా ఉంటే, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు ఎక్కువగా ఉంటుంది. k=1/4 అని ప్రమేయం చేస్తే రూ. 400 కోట్ల ఆదాయం వద్ద $m_t$ రేఖ పటం - 6.9 లో చూపినట్లుగా ఉంటుంది. ఇప్పుడు ఆదాయ స్థాయి రూ. 400 కోట్ల నుండి రూ. 420 కోట్లకు పెరిగితే, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు రూ. 100 కోట్ల నుండి, రూ. 105 కోట్లకు పెరుగుతుంది. భామిక ద్రవ్య డిమాండులో మార్పు లేనంతవరకూ ద్రవ్య మొత్తం డిమాండు $m_{d1}$ రేఖను ఉత్పన్నం చేయడానికి, ప్రతీ వడ్డీరేటు వద్ద ద్రవ్య డిమాండు రేఖ రూ. 5 కోట్లకు కుడివైపుకు కదులుతుంది. ద్రవ్య డిమాండు పెరగడంతో ద్రవ్య సప్లయిలో ఎలాంటి మార్పు లేక వడ్డీరేటు 10 శాతం వద్ద కొత్త సమతౌల్య స్థాయిని చేరుతుంది.




పటం - 9 : ఆదాయ స్థాయిలోని మార్పులు - వడ్డీరేటు.

## 6.11 సారాంశం

సంప్రదాయ ద్రవ్య డిమాండు సిద్ధాంతం ప్రకారం ప్రజలు ద్రవ్యాన్ని వినిమయ సాధనంగా భావించి దానిని డిమాండ్ చేస్తారు. ఈ సిద్ధాంతం ప్రకారం వాస్తవిక ద్రవ్య డిమాండు, వాస్తవిక ఆదాయంపై ఆధారపడుతుందని తెలుసుకొన్నాం. వాస్తవిక ద్రవ్య డిమాండు ధరలతో, వాస్తవిక ఆదాయంతో నేరుగా మరియు అనులోమానుపాతంలో మార్పు చెందుతుంది. కాని ద్రవ్య డిమాండు ద్రవ్య చలామణి వేగంతో విలోమ సంబంధం కలిగియుంటుంది. అలాకాకుండా, కేన్స్ సిద్ధాంతం ప్రకారం ద్రవ్య డిమాండు ద్రవ్యత్వాభిరుచిచేత నిర్ణయింపబడుతుంది. ద్రవ్యత్వాభిరుచి తిరిగి మూడు ఉద్దేశాలపై ఆధారపడుతుంది. ఆ ఉద్దేశాలు : 1. దైనందిన వ్యవహారాల ఉద్దేశం ; 2. ముందు జాగ్రత్త ఉద్దేశం ; 3. భామికమైన ఉద్దేశం దైనందిన వ్యవహారాల ఉద్దేశం కోసం చేసే సగటు ద్రవ్య డిమాండు, ఆదాయ /రాబడి పౌనఃపున్యం పెరిగిన కొలది తగ్గుతుంది, ఉత్పత్తి స్థాయి పెరిగిన కొలది పెరుగుతుంది. దైనందిన వ్యవహారాల, ముందు జాగ్రత్త ద్రవ్య డిమాండులు ఆదాయ స్థాయితో ప్రధానంగా అనులోమానుపాత సంబంధం కలిగియుంటాయి. అలాకాకుండా, భామికమైన ద్రవ్య డిమాండు వడ్డీరేటుతో విలోమ సంబంధం కలిగి యుంటుంది. ఏదేమైనప్పటికీ, ఈమూడు ఉద్దేశాల ద్రవ్య మొత్తం డిమాండు, ఆదాయ స్థాయి వడ్డీరేటుచే నిర్ణయింపబడుతుందని గ్రహించాలి. రాబోయే పాఠంలో భారత దేశంతో సహా పెక్కు దేశాలలో వ్యవహారికంగా, చారిత్రక దత్తాంశాల ఆధారంగా చేసిన పరిశోధనల ద్రవ్య డిమాండు ఫలాల ఫలితాలు సమీక్షించాం.

## 6.12 సంప్రదింపు గ్రంథాలు


1. Edward Shapiro (1984), *Macroeconomics Analysis*, 5th edition, Galgotia Publications, Delhi.

B. B. N. Ghosh & Rama Ghosh (1993), *Modern Macroeconomics : Theory & Policy*, Himalaya Publishing House, Bombay.

3. J. M. Keynes (1936), *The General Theory of Employment, Interest & Money*, Harcourt Brace Jovanovich, London.

4. S. B. Gupta, (1986), *Monetary Economics*, S. Chand, Delhi.

5. S. B. Gupta (1986)*Monetary Planning for India*, Oxford University Press, Delhi.


## 6.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 40 పంక్తులలో జవాబులు రాయండి.**

1. సంప్రదాయ కేన్సు ద్రవ్య డిమాండు సిద్ధాంతాలను పోల్చి వాటి మధ్యనున్న విశిష్ట భేదాన్ని తెలుపండి.
2. కేన్సు ద్రవ్య డిమాండు సిద్ధాంతాన్ని గూర్చి విపులంగా చర్చించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 20 పంక్తులలో జవాబులు రాయండి.**

1. సంప్రదాయ ద్రవ్య డిమాండు సిద్ధాంతాన్ని గూర్చి తెలుపండి.
2. బాండు ధరకు, వడ్డీరేటుకు ఉన్న సంబంధాన్ని వివరించండి.
3. కేన్సు ద్రవ్య డిమాండు సిద్ధాంతంలో భ్రామికమైన ద్రవ్య డిమాండు ప్రాముఖ్యతను తెలుపండి.

## 6.14 పదకోశం

| | | |
|---|---|---|
| Accompany | = | అనుసంధింపబడుట |
| Conventional | = | లోకరూఢమైన |
| Accumulation | = | సంకలనం |
| Successive | = | వరుసగా, క్రమానుగతంగా |
| Graphically | = | చిత్రరూపంగా |
| Institutional | = | సంస్థాపరమైన |
| Synchronisation | = | ఏక కాలమందు జరుగుట |
| Structural | = | నిర్మాణాత్మకంగా |
| Repeat | = | పునశ్చరణం |
| Frequency | = | పౌనఃపున్యం |
| Reason | = | తర్కసహితం |

BRAOU

| | | |
|---|---|---|
| In terms of | = | పరిభాషలో |
| Linear | = | ఏకఘాత |
| Speculative motive | = | భ్రామికమైన ఉద్దేశం, చట్టా వ్యాపార ఉద్దేశం |
| Precautionary motive | = | ముందు జాగ్రత్త ఉద్దేశం |
| Transactions motive | = | దైనందిన వ్యవహారాల ఉద్దేశం |
| Expectations | = | సంభావ్యతలు |
| Prospective | = | భావి |
| Proportionately | = | అనుపాతంగా |
| Inversely | = | విలోమానుపాతంగా |
| Sensitivity | = | ప్రతిక్రియ / ప్రతిస్పందన |
| Risk | = | నష్ట భయం |
| Marketability risk | = | అమ్మకం కాకపోవచ్చునన్న నష్ట భయం |
| Maturity | = | పరిణతి, పరిపక్వత |
| Classicals | = | సంప్రదాయ వాదులు |
| Circulation | = | చలామణి |
| Nominal | = | నామ మాత్రపు |
| Approach | = | దృక్పథం |
| Motives | = | ఉద్దేశాలు |
| Approximate | = | ఉజ్జాయింపు |
| Pattern | = | సరళి, ధోరణి |
| Significantly | = | ప్రధానంగా |
| Slope | = | వాలు |
| Generalisation | = | సాధారణీకరణ |
| Liquidity risk | = | ద్రవ్యత్వం పోగొట్టుకొనే ప్రమాదం |

- డా॥ ఎస్. సుధాకర్

BRAOU

# భాగం - 7 : కేన్సియన్ల, ఉత్తర-కేన్సియన్ల, ఫ్రీడ్‌మన్ ల ద్రవ్య డిమాండు దృక్పథాలు

**విషయ క్రమం**


7.0 ఉద్దేశం

7.1 పరిచయం

7.2 ద్రవ్య డిమాండు పై గుర్లే & షా(Gurley & Shaw) ల అభిప్రాయాలు

7.3 భౌమోల్ ఇన్వెంటరీ సిద్ధాంతపరమైన దృక్పథం (వడ్డీ-వ్యాకోచత్వం - దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు)

7.3.1 భౌమోలు (Baumol) విశ్లేషణలోని సాపేక్షమైన యోగ్యతలు

7.4 టోబిన్ (Tobin) పెట్టుబడుల పట్టిక నమూనా

7.4.1 టోబిన్ (Tobin) విశ్లేషణలోని సాపేక్షమైన యోగ్యతలు

7.5 ఫ్రీడ్‌మన్ (Friedman) ద్రవ్య డిమాండు ఫలం (సంప్రదాయ ద్రవ్య ఫలంను తిరిగి వ్యాఖ్యానించుట

7.5.1 సంప్రదాయ సిద్ధాంతంపై ఫ్రీడ్‌మన్ ద్రవ్య డిమాండు సిద్ధాంతం సాధించిన ప్రగతి

7.5.2 ఫ్రీడ్‌మన్ సిద్ధాంతపు విమర్శనాత్మక మదింపు

7.6 ద్రవ్య డిమాండు విశ్లేషణలో ఇటీవలి పరిణామాలు

7.7 భారత దేశంలో ద్రవ్య డిమాండు - ప్రయోగాధార అంచనాలు

7.8 సారాంశం

7.9 సంప్రదింపు గ్రంథాలు

7.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

7.11 పదకోశం


BRAOU

## 7.0 ఉద్దేశం

గత పాఠంలో, సంద్రాయ కేన్స్ ద్రవ్య డిమాండు ఫలాలను అధ్యయనం చేసాం. ఈ పాఠంలో, కేన్సియన్ల, ఉత్తర-కేన్సియన్ల, ఫ్రీడ్‌మన్ (Keynesian, Post-Keynesian & Friedman) ల ద్రవ్య డిమాండు ఫలాలను తెలుసుకొందాం.

## 7.1 పరిచయం

కేన్స్ ద్రవ్య డిమాండు సిద్ధాంతం ప్రకారం ద్రవ్య డిమాండు క్రీయశూన్యత , చురుకైన ద్రవ్య నిలువల వలన ఏర్పడుతుందని గత పాఠంలో తెలుసుకొన్నాం. దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు సాంకేతికపరంగా (technologically) నిర్ణయించబడుతుంది. భ్రామిక ద్రవ్య డిమాండు ఆర్థికంగా లాభం పొందడం కోసం చేసే డిమాండుగా వ్యవహరించబడింది. కేన్స్ ద్రవ్య డిమాండు సిద్ధాంతంలోని ఈ అసంతృప్తికరమైన ద్వైవిధ్యాన్ని (dichotomy) తొలగించేందుకు రెండు దృక్పథాలను (approaches) సూచించాం. అవి :

1. ద్రవ్య డిమాండు అవిభాజ్యమైనది. ఈ డిమాండును, ఒకవైపు, దైనందిన వ్యవహారాల డిమాండ్ , ముందు జాగ్రత్త ద్రవ్య డిమాండులుగా, మరొకవైపు, భ్రామికమైన ద్రవ్య డిమాండుగా వేరు చేయడానికి వీలులేదు.

2. భౌమోల్ , టోబిన్ (Baumol & Tobin) అను అర్థశాస్త్రవేత్తలు దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు సిద్ధాంతాన్ని మూలధన సిద్ధాంతం ఆధారంగా వివరించారు. ద్రవ్యమనేది చరమూలధనం లేక ఇన్వెంటరీ (inventory) ల ఒక రూపం. ఇది నిజమైతే దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు వడ్డీరేటుతో విలోమ (inverse) సంబంధం కలిగియుంటుంది. వాస్తవానికి దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు భ్రామికమైన ద్రవ్య డిమాండుకు ఎక్కువ భిన్నమైనది కాదు. ఇచ్చట, కేవలం ద్రవ్యం బాండులు అను రెండు రకాల ఆస్తులు ఉండవు (కేన్స్ ప్రమేయం చేసినట్లుగా). చాలా ఇతర రకాల వడ్డీ యోగ్యమైన ఆస్తులు కూడ ఉన్నవి. ప్రజలు దీర్ఘకాలిక డిమాండులకు బదులుగా స్వల్పకాలిక బాండులను ఎన్నుకోవచ్చు.

టోబిన్ పరిశీలన ప్రకారం, సంపద అనేది ద్రవ్య డిమాండును నిర్ణయించే ఒక ముఖ్యమైన నిర్ణాయక చలాంకం. సాధారణంగా, ఒక వ్యక్తి ఎక్కువ మొత్తంలో సంపద కలిగియుంటే అతని ద్రవ్య డిమాండు ఎక్కువగా ఉంటుంది. ఆ విధంగా, ద్రవ్య డిమాండును ఈ క్రింది సమీకరణం రూపంలో పేర్కొనవచ్చు.

$Md = f(Y, r, W, U, r')$.

ఇచ్చట, $Y$ = ఆదాయ స్థాయి; $r$ = వడ్డీరేటు; $W$ = సంపద; $U$ = అనిశ్చిత స్థితి; $r'$ = ముందుగానే గ్రహించిన వడ్డీరేటులోని మార్పు.

బ్యాంకేతర విత్త సంబంధ మధ్యవర్తులు (Non-Banking Financial Intermediaries - NBFIs) ద్రవ్య డిమాండును చెప్పుకోదగిన రీతిలో ప్రభావితం చేస్తారని గుర్లే & షా (Gurley & Shaw) అభిప్రాయపడినారు. కేన్స్ ద్రవ్య డిమాండు సిద్ధాంతాన్ని గుర్లె & షా మెరుగు పరిచారు. కాబట్టి, వీరిని కేన్స్‌వాదులు (Keynesians) అని పిలువవచ్చు.

లటానె (Latane), ఫ్రీడ్‌మన్ , మెల్జర్ (Meltzer) అను అర్థశాస్త్రవేత్తలు మిగతా అర్థశాస్త్రవేత్తలతోపాటు ద్రవ్య డిమాండు ఫలాలను అమర్చుట (fit)కు కృషి చేసారు. లటానె ద్రవ్య-ఆదాయ రాశుల నిష్పత్తి, దీర్ఘకాలిక వడ్డీరేటుచే నిర్ణయించబడుతుందనే ఒక మామూలు ద్రవ్య డిమాండు ఫలాన్ని అమర్చాడు. ఫ్రీడ్‌మన్ శాశ్వత ఆదాయ పరికల్పన (Permanent Income Hypothesis) ను ఉపయోగించి, వడ్డీ అవ్యాకోచత్వం కలిగిన ద్రవ్య డిమాండు ఫలాన్ని సాధించాడు. మెల్జర్ ద్రవ్య డిమాండుకు ఆదాయంతో కాకుండా సంపదతో సంబంధాన్ని స్థాపించాడు. ద్రవ్య డిమాండు వడ్డీరేటుతో ఎక్కువగా వ్యాకోచత్వం చెందుతుందని అతడు కనుగొన్నాడు.

ద్రవ్య డిమాండు వడ్డీ వ్యాకోచత్వం లేక వడ్డీ అవ్యాకోచత్వం అనే వివాదం ద్రవ్య విధానం రూపొందించడం కొరకు చాలా సార్థకమైనదని చెప్పవచ్చు. ద్రవ్య డిమాండు వడ్డీ అవ్యాకోచత్వం అను భావన సంప్రదాయ ద్రవ్య సిద్ధాంతానికి (స్థిరమైన ద్రవ్య చలామణి వేగంతో కూడిన) మళ్ళిస్తుంది. ఇది, ఆర్థిక వ్యవస్థను సంపూర్ణ ఉద్యోగితా స్థాయి వద్ద స్థిరపరచడం కోసం, ద్రవ్య విధానం చాలా పటిష్టంగా పనిచేస్తుందని సూచిస్తుంది. ద్రవ్య డిమాండు వడ్డీ వ్యాకోచత్వం అను భావన కేన్స్ అల్పోద్యోగితా సమతౌల్య వలయం (under - employment equilibrium trap) ను వివరించడానికి చాలా ప్రాధాన్యమైనది. ఈ భావన ప్రకారం, ద్రవ్య సప్లయి పెరిగినప్పటికీ సంపూర్ణ వ్యాకోచత్వం కలిగిన ద్రవ్య డిమాండు ఫలం, ఆదాయ స్థాయిలో కాని లేక

BRAOU

వ్యయ స్థాయిలో కాని పెరుగుదలను అనుమతించదు. అందువలన, సంపూర్ణోద్యోగిత అన్నది ఒక సుమారు సంభావ్యతగా నిలిచిపోతుంది. ద్రవ్య డిమాండును వివరించడానికి చాలా మంది అర్థశాస్త్రవేత్తలు అనేక దృక్పథాలను (approaches) సూత్రీకరించారు. గుర్లే & షా (Gurley & Shaw, 1956) బౌమోల్ (Baumol, 1952), టోబిన్ (Tobin 1956 & 58), ఫ్రీడ్‌మన్ (Friedman, 1956) మొదలగు వారి దృక్పథాలను మనము తెలుసుకుందాం.

## 7.2 ద్రవ్య డిమాండుపై గుర్లే & షా (Gurley & Shaw on the Demand for Money) ల అభిప్రాయాలు

ద్రవ్య ఉపాంత ప్రతిఫలాన్ని బట్టి దాని విలువ అంచనా వేయబడుతుంది. ద్రవ్య ఉపాంత ప్రతిఫలాలు దానిని అట్టిపెట్టుకోవడాన్ని ప్రోత్సహిస్తాయి. వడ్డీరేట్లు పెరిగిన కొలదీ, వస్తువుల ధరలు తగ్గిన కొలదీ సంభవించే మూలధన నష్టం నుండి ద్రవ్యం రక్షణ కల్పిస్తుంది. ద్రవ్య డిమాండు, మూలధనపు ఇతర ఉపయోగాలపై వచ్చే రాబడులతో, డిపాజిట్ల వడ్డీరేటును ఉపాంతంగా పోల్చడంపై ఆధారపడి ఉంటుంది. ద్రవ్య డిమాండు, ప్రాథమిక బాండుల (primary securities) మధ్య నుండే తారతమ్యం (differentiation) చే ప్రభావితం అవుతుంది. అటువంటి తారతమ్యం ద్రవ్య డిమాండును కొన్నిసార్లు పెంచవచ్చు లేదా తగ్గించవచ్చు. ఒక నిర్దిష్టమైన వడ్డీరేటు వద్ద ద్రవ్య వాస్తవిక డిమాండు దాని వాస్తవిక నిలువకు సమానంగా ఉంటుందని గుర్లే & షా లు నిరూపించారు. ఈ నిర్దిష్ట వడ్డీరేటు కన్నా ఏదేని అధిక వడ్డీరేటు వద్ద ద్రవ్యం నిలువలు మితిమీరి (excess) ఉంటాయి. ఈ నిర్దిష్ట వడ్డీరేటు కన్నా ఏదేని తక్కువ వడ్డీరేటు వద్ద ద్రవ్య డిమాండు మితిమీరి ఉంటుంది. వాంచించిన ద్రవ్యం నిలువల విత్తసంబంధమైన మొత్తం ఆస్తుల (పెట్టుబడుల) పట్టిక మధ్య నిష్పత్తి వడ్డీరేటుతో విలోమానుపాతంలో మారుతూ ఉంటుంది.

గుర్లే & షా ప్రకారం కనీస మొత్తంలో ద్రవ్యత్వాన్ని కొనసాగించడం ఆవశ్యకం. ద్రవ్య డిమాండు ఎక్కువ వడ్డీరేటు వద్ద క్షితిజ రేఖకు లంబంగా ఉంటుంది. ద్రవ్య వాస్తవిక డిమాండు ఎక్కువ వడ్డీరేటువద్ద సాపేక్షికంగా తక్కువగా, తక్కువ వడ్డీరేటు వద్ద ఎక్కువగా ఉంటుంది. ఆర్థిక మాంద్య పరిస్థితులను ముందుగా ఊహిస్తే, ద్రవ్యం నుండి బాండులకు మార్పు జరుగవచ్చు. ద్రవ్య డిమాండు పట్టిక అనేది ఒక నిర్దిష్ట వాస్తవిక ఆదాయ స్థాయి వద్ద బాండులకు ద్రవ్యానికి మధ్య వ్యయం చేసే వారి అభిరుచిని తెలుపుతుంది. వాస్తవిక ఆదాయంలోని పెరుగుదల వలన దైనందిన వ్యవహార ద్రవ్య డిమాండు పెరిగితే, మితిమీరిన ద్రవ్య డిమాండును నిరోధించేందుకు ద్రవ్య మార్కెటులో వడ్డీరేటు తక్షణమే పెరుగుతుంది.

ద్రవ్య సప్లయిలో మార్పు లేకపోతే ధరల తగ్గుదలచే మితిమీరిన బాండుల సప్లయి మితిమీరిన ద్రవ్య డిమాండు నిర్దేశింపబడవచ్చు. ఏమైనప్పటికీ, విత్తపరమైన ఆస్తుల సంచయనం (accumulation of financial assets) ద్రవ్య నిలువల వాస్తవిక డిమాండును తీవ్రతరం చేస్తుంది. ప్రాథమిక రుణ రూపంలో (primary debt) అప్పు చేయకపోతే, ద్రవ్య వాస్తవిక డిమాండు తగ్గుతుంది. బాండులకు బదులుగా ట్రెజరీ బిల్లులను ప్రత్యామ్నాయంగా ఉపయోగించినట్లైతే, ప్రతి వడ్డీరేటు వద్ద ద్రవ్య డిమాండు తగ్గుతుంది. ఒక నిర్దిష్ట విత్తపరమైన ఆస్తుల నిలువలను, ట్రెజరీ బిల్లులను, బాండులను, ద్రవ్యాన్ని కలిగియుంటే, ద్రవ్య డిమాండు సాపేక్షికంగా వ్యాకోచత్వం చెందుతుంది. ట్రెజరీ బిల్లుల ఉనికి (presence) ద్రవ్య డిమాండును కొంత వరకు మాత్రమే తగ్గిస్తుంది.

BRAOU

ద్రవ్య డిమాండును ప్రభావితం చేసేందుకు ప్రభుత్వ ఋణ నిర్వహణ (public debt management) ను ఒక సాధనంగా ఉపయోగించవచ్చు. నామమాత్రపు బాండుల స్థానంలో వాస్తవిక బాండులను పునఃస్థాపిస్తే (replace) ద్రవ్య డిమాండు ప్రభావితం అవుతుంది. ప్రాథమిక సెక్యూరిటీల అమ్మకం, కొనుగోలుకు సంబంధించిన వ్యయానికి వ్యతిరేకంగా ద్రవ్యం కొంత రక్షణ కల్పిస్తుంది. ఇంకా ద్రవ్యం, ధరల తగ్గుదల లేక వడ్డీరేటు పెరుగుదల యొక్క సంభావ్యతలకు వ్యతిరేకంగా కూడా రక్షణను ఇస్తుంది.

ఎప్పుడైతే ఉత్పాదక నిబంధన కల్గిన వాస్తవిక బాండులు ఉండి, వైవిధ్యంగల విత్త సంబంధమైన ఆస్తులు, వాంఛించిన పెట్టుబడుల పట్టిక అధిరోహణ క్రమం (scale) ను పెంచినట్లైతే, సంపద ప్రభావం ద్రవ్య డిమాండును ప్రేరేపించవచ్చు. విత్త సంబంధమైన ఆస్తుల పట్టిక (financial asset portfolio)లోని ద్రవ్యానికి ప్రత్యామ్నాయంగా అట్టిపెట్టుకున్న సెక్యూరిటీల మార్కెటు యోగ్యతలో ఏ విధమైన మార్పు వచ్చినా, ద్రవ్య డిమాండు ప్రభావితంగావింపబడుతుంది. విత్తసంబంధమైన ఆస్తుల పట్టికపై ముందుగా ఊహింపబడిన వడ్డీరేటును అత్యధికం చేసే ఉద్దేశం కల్గిన వారి ద్రవ్య డిమాండును, విత్తపరమైన ఆస్తుల సంచయనం ప్రేరేపిస్తుంది. ద్రవ్య డిమాండు ద్రవ్యత్వం (liquidity)పై మాత్రమే ఆధారపడకుండా, ధర మరియు ఇతర ఆస్తుల ఆయా ధరల సాపేక్ష ఆకర్షణపై కూడ ద్రవ్యం ఆధారపడుతుంది.

గుర్లే & షా ప్రకారం, బ్యాంకేతర విత్త సంబంధమైన మధ్యవర్తులు (Non-Bank Financial Intermediaries - NBFIs) ప్రాథమిక సెక్యూరిటీలను కొని, పరోక్ష సెక్యూరిటీలను సృష్టిస్తారు. అంతేగాకుండా వీరు మితిమీరిన ద్రవ్య సప్లయి, డిమాండులను కూడ సృష్టించగలరు. బ్యాంకేతర విత్త సంబంధ మధ్యవర్తుల (NBFIs) యొక్క ఆస్తుల వృద్ధి వలన ద్రవ్య డిమాండులో నికర పెరుగుదల సిద్ధించితే, ముందుగా వడ్డీరేటు పెరుగుతుంది. బ్యాంకేతర విత్త సంబంధ మధ్యవర్తులు కూడ, ప్రజలకు పెద్ద మొత్తంలో ద్రవ్యాన్ని ఋణంగా ఇస్తారు. ఆర్థికవ్యవస్థలో పరపతి నియంత్రణ (credit restriction) విధానం కొనసాగినప్పుడు బ్యాంకేతర విత్త సంబంధ మధ్యవర్తులు పెద్ద మొత్తంలో ఋణాలు ఇవ్వడం జరుగుతుంది.

గుర్లే & షాల ప్రకారం బ్యాంకేతర విత్తసంబంధ మధ్యవర్తులు ద్రవ్య డిమాండును గమనార్హమైన రీతిలో ప్రభావితం చేస్తారు. చిట్టచివరి ఋణదాతల కోసం ప్రాథమిక సెక్యూరిటీలను పరోక్ష సెక్యూరిటీలుగా మార్చడం వీరి ప్రధాన విధి. చిట్టచివరి ఋణదాతలకు అవసరమయ్యే విభిన్న రకాల విత్త సంబంధ ఆస్తులను ఈ మధ్యవర్తులు సమకూర్చుతారు. వీరు ధరావత్తుదారుల (depositors) కు ఎక్కువ వడ్డీరేటుతో సహా ఆకర్షణీయమైన ఒప్పందపు నియమ నిబంధనలను కూడ ప్రకటిస్తారు. ఈ ఆకర్షణీయమైన ఒప్పందపు నియమ నిబంధనల వలన, వీరి ఆస్తులను ప్రజలు ఎక్కువగా డిమాండు చేస్తారు. ఈవిధంగా, సర్వ సాధారణంగా, ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య డిమాండు తగ్గడానికి వీరు దోహదం చేస్తారు. వీరి ఆదాయ యోగ్యమైన ఆస్తులు, ద్రవ్యానికి ప్రత్యామ్నాయంగా పని చేస్తాయి. ద్రవ్య డిమాండు తగ్గడం, వీరి ఋణాలు పెరగడంతో సమానం. వీరిని ప్రవేశపెట్టినందువలన, ద్రవ్య డిమాండుపై ఏర్పడే ప్రభావాన్ని పటం - 7.1 ద్వారా చూపించవచ్చు.

BRAOU




పటం - 7.1 : NBFIs – ద్రవ్య డిమాండులోని మార్పు

పటం - 7.1 (A) ద్రవ్య మార్కెటు సమతౌల్యాన్ని చూపిస్తుంది. సమతౌల్య వడ్డీరేటు ($r_o$)ను నిర్ణయించే ద్రవ్య సప్లయి, డిమాండు రేఖలు ఖండించుకున్న చోట ఈ సమతౌల్యం ఏర్పడుతుంది. పటం - 7.1 B బ్యాంకేతర విత్త పరమైన మధ్యవర్తుల ఉనికి ప్రభావాన్ని చూపిస్తుంది. వీరి ద్రవ్యత్వం కల్గిన ఆస్తులు, ద్రవ్యానికి సమీప ప్రత్యామ్నాయాలు కాబట్టి, ప్రజల మధ్య అటువంటి ఆస్తుల చలామణి (circulation) ద్రవ్య డిమాండును తగ్గిస్తుంది. దీనిని ఎడమ వైపు కదిలే DD రేఖగా చూపించాం. ఈవిధంగా బాంకేతర విత్త పరమైన మధ్యవర్తులను ప్రవేశపెట్టడం వలన క్రొత్త ద్రవ్య డిమాండు రేఖ D′ D′రేఖ అవుతుంది. అప్పుడు, ద్రవ్య డిమాండు $r_o$ వడ్డీరేటు వద్ద OM నుండి $OM_1$ కు తగ్గుతుంది. ఏదేమైనప్పటికీ, ధరల స్థాయి స్థిరంగా ఉండి, ఇంకా నామమాత్రపు ద్రవ్య నిలువలో ఎటువంటి మార్పు లేదు కాబట్టి, వడ్డీరేటు $r_o$ నుండి $r_1$ కు తగ్గుతుంది.

BRAOU

ఇదంతా, ద్రవ్యసంబంధమైన అర్థశాస్త్రంలో ముఖ్యమైన చిక్కులను సృష్టిస్తుంది. గుర్లే & షా ల ప్రకారం బ్యాంకేతర విత్త పరమైన మధ్యవర్తులు పరోక్షంగా ద్రవ్యంను (పరోక్ష సెక్యూరిటీలు) ప్రజలకు సమకూర్చడం వలన వ్యక్తమగు ప్రభావం (apparent effect), ద్రవ్యత్వ వలయం (liquidity trap) వద్దకూడ వడ్డీరేటును తగ్గిస్తుంది. ఈవిధంగా, ఎక్కడైతే ఈమధ్యవర్తులు ఉంటారో, కేన్స్ భావించిన దానికన్నా తక్కువ వడ్డీరేటు వద్ద, ద్రవ్యత్వ వలయము సృష్టించబడుతుంది. వారు లేని పక్షంలో కన్నా ఉండిన సమక్షంలో బాండు ధరలు ఎక్కువగా పెరుగుతాయి. మధ్యవర్తులు కూడా వారి ఆస్తులను వదులుకోకుండా, ధనాన్ని ఎక్కువగా ప్రోగు (accumulate) చేసుకోగలుగుతారు. అందువలన, వడ్డీరేటు చాలా తక్కువ స్థాయికి వస్తుందని దీనివల్ల స్పష్టం అవుతుంది.

ఈ మధ్యవర్తుల పరిచయంతో, ద్రవ్యం నిలువ మొత్తం ఆస్తుల మొత్తంలో అతి చిన్న భాగం అవుతుంది. ఈవిధంగా, ద్రవ్య చలామణి వేగం పెరుగుతుంది. కాని, ద్రవ్య చలామణి వేగం వడ్డీరేటు యొక్క అంతగా విశ్వసనీయమైన సూచిక (index) గా పనిచేయదు. కేన్స్ విశ్లేషణలో వడ్డీరేటు పెరిగితే, ద్రవ్యం అవకాశ వ్యయం (opportunity cost) కూడ పెరుగుతుంది. ఈ విధంగా, దైనందిన వ్యవహారాల ద్రవ్యం నిలువలను ప్రజలు ఆదా చేస్తారు. ఇంకా, భ్రామికమైన ద్రవ్య డిమాండు పడిపోతుంది. ఈ విధంగా, ద్రవ్య చలామణి వేగానికి, వడ్డీరేటుకు మధ్య ధనాత్మక (positive) సంబంధం ఉంటుంది. పటం 7.2 లో చూపించినట్టుగా, ఈమధ్యవర్తుల విషయంలో అనుమానం లేకుండా ద్రవ్య చలామణి వేగం పెరుగుతుంది. కాని ద్రవ్య చలామణి వేగంకు, వడ్డీరేటుకు మధ్యనున్న సంబంధం బలహీనమౌతుంది.




పటం - 7.2 : NBFIs - ద్రవ్య చలామణి వేగం, వడ్డీరేటు మధ్య సంబంధం

బ్యాంకేతర పరమైన మధ్యవర్తుల ఉనికి, ద్రవ్య చలామణి వేగ ఫలాన్ని (పటం 7.2 లో చూపించినట్టుగా) కుడివైపుకు కదల్చటం ద్వారా వడ్డీరేటు ద్రవ్య చలామణి వేగం మధ్యనున్న సంబంధంలో మార్పుకు కారణం అవుతుంది. ఈ మధ్యవర్తులు ద్రవ్యానికి సమీప ప్రత్యామ్నాయంగా ఉపయోగపడే వారి ఆస్తులను ఎక్కువ మొత్తంలో చలామణిలో ఉంచుతారు. కావున మధ్యవర్తులు వాస్తవానికి పరిమిత ద్రవ్య విధానం (restrictive monetary policy) పటిష్ఠంగా పనిచేయకుండా అవరోధాలు సృష్టిస్తారు. ఇంతేగాకుండా మధ్యవర్తుల వద్దనున్న ప్రభుత్వ బాండులను వదిలించుకొని, వారు ఇచ్చే ఋణాలను పెంచుకోగలరు. ఈ విధంగా కూడ, మధ్యవర్తులు పరిమిత ద్రవ్య విధానం సరిగ్గా పనిచేయకుండా అడ్డుకోగలుగుతారు.

BRAOU

## 7.3 భౌమోల్ ఇన్వెంటరీ సిద్ధాంతపరమైన దృక్పథం (వడ్డీ - వ్యాకోచత్వం - దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు) (Baumol's Inventory Theoretic Approach : Interest Elasticity of Transactions Demand for Money)

కేన్స్ ప్రకారం, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు ఆదాయ స్థాయి యొక్క ఫలం. దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు ఆదాయ స్థాయి యొక్క ఫలం. దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండుకు, ఆదాయస్థాయికి మధ్య ఏకఘాత (linear) మరియు అనుపాత (proportional) సంబంధం ఉంటుంది. భౌమోల్ ప్రకారం, పైన పేర్కొన్న కేన్స్ ప్రకటనలు నిజం కావు. భౌమోల్ దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండుకు, ఆదాయ స్థాయికి మధ్య ఏకఘాత మరియు అనుపాత సంబంధము ఉండదని చూపిస్తాడు.

భౌమోల్ దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు కూడ భ్రామిక ద్రవ్య డిమాండు వలె వడ్డీరేటుచే ప్రభావితం అవుతుందని సూచించాడు. ఒకవేళ వడ్డీరేటు ఎక్కువగా ఉంటే, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు తక్కువగా ఉంటుంది. అదేవిధంగా, వడ్డీరేటు తక్కువగా ఉంటే, ముఖ్యంగా ఆక్షేపణీయ (critical) వడ్డీరేటుకన్నా, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు ఎక్కువగా ఉంటుంది. ఈ విధంగా దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు రేఖ రెండు వంపులను కలిగియుంటుంది. దీనిని పటం 7.3 లో చూడవచ్చు.




పటం - 7.3 : దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు - వడ్డీ వ్యాకోచత్వం

పటం 7.3 లోని రేఖ పైభాగం, వ్యాకోచత్వం కలిగియుంటుంది. రేఖ క్రింది భాగం నిటారుగా ఉంటుంది. ఆక్షేపణీయ వడ్డీరేటు (critical interest rate) X% కు తక్కువ స్థాయిలో, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు అదే స్థాయిలో ఉంటుంది. ఆక్షేపణీయ వడ్డీరేటుకు పైస్థాయిలోని వడ్డీరేటు వద్ద, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు రేఖ ఋణాత్మక (negative) వాలు కలిగియుంటుంది. దీని అర్థం, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండుకు, వడ్డీరేటుకు మధ్య విలోమ సంబంధం ఉన్నట్టు తెలుస్తుంది.

భౌమోల్ దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండుకు మూలధన సిద్ధాంత విశ్లేషణను అనుసంధించాడు. ఆస్తుల యొక్క వ్యాపార నిర్వహణకు సంబంధించిన సర్వ సాధారణ సమస్య నుండి భౌమోల్ ప్రోత్సాహం పొందాడు. దీనిని అభిలషణీయ (optimum) ముడి సరుకుల ఇన్వెంటరీల నిర్ణయ సమస్య అని కూడ అంటారు. ఈవిధంగా మూలధన సిద్ధాంతాన్ని దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు విశ్లేషణకు అనుసంధించడం జరిగింది. ఈ పరిస్థితిలో వ్యయంకోసం ఉంచుకొనే ద్రవ్య నిలువలను ఒక రకమైన ఇన్వెంటరీలుగా వ్యవహరించడం జరిగింది. ఈ విషయంలో ఇన్వెంటరీలతో సాహచర్యం (associated) కలిగిన వ్యయాన్ని మిక్కిలి తక్కువ స్థాయికి తగ్గించడం వ్యక్తి యొక్క ముఖ్య లక్ష్యం అని చెప్పవచ్చు.

BRAOU

ఎప్పుడైతే, వ్యయం కోసం ద్రవ్యాన్ని అట్టిపెట్టుకోవడం జరుగుతుందో, ద్రవ్యాన్ని అట్టిపెట్టుకొన్న వ్యక్తి రెండు రకాల వ్యయాలను భరించాల్సి ఉంటుంది. అవి :

i) బాండులను ద్రవ్యరూపంలోకి మార్చే సమయంలో బ్రోకరు ఇచ్చే కమీషను;

ii) వడ్డీ రేటు త్యాగం.

వడ్డీరేటును త్యాగం చేయడం అన్నది అవకాశ వ్యయం (opportunity cost) గా పిలువవచ్చు. బ్రోకరు కమీషను, తపాలా ఖర్చులు మొదలగు వాటిని ఇతర ఖర్చులంటారు. అందువలన, ఏ ద్రవ్య మొత్తాన్ని అట్టిపెట్టుకోవాలన్నా, ఈ వ్యయాల మొత్తాన్ని తగ్గించే విధంగా వ్యక్తికాని సంస్థకాని నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విశ్లేషణలో క్రింది ప్రమేయాలు చేయబడినాయి.

i) బాండులు సంపూర్ణ మార్కెటును కలిగియుంటాయి.

ii) దైనందిన వ్యాపార నిర్వహణ మొత్తం స్థిరమైన రీతిలో కొనసాగుతుంది. ఈ వ్యాపార నిర్వహణ ప్రవాహాన్ని ముందుగానే తెలుసుకొనవచ్చు.

iii) వ్యక్తి ఒక నిర్ణీత సమయంలో స్థిరమైన వ్యయాన్ని చేస్తాడు.

iv) బాండును ద్రవ్యంలోకి, ద్రవ్యంను బాండులోకి మార్చుకోవడం సాధ్యం అవుతుంది.

v) ఒక నిర్ణీత సమయంలో వడ్డీరేటు (r) స్థిరంగా ఉంటుందని ప్రమేయం చేయబడింది.

vi) ఒక నిర్ణీత సమయంలో బ్రోకరు కమీషను (b) కూడ స్థిరంగా ఉంటుంది.

ఇంతేకాకుండా వ్యక్తి ఒక నిర్ణీత సమయంలో మార్పులేని వ్యయం చేస్తాడని, Kఅన్నది ద్రవ్యం యొక్క ఉపసంహారణ (withdrawal) పరిమాణమని ప్రమేయం చేద్దాం. అప్పుడు, (Y/K)అన్నది ఒక సమయ కాలంలో చేసిన ఉపసంహారణల సంఖ్యను సూచిస్తుంది (సాధారణంగా ఒక సంవత్సరం). సగటు రొక్కం ఉపసంహారణ ($t_1, t_2$ ల సమయకాలంలో (K/2) కాబట్టి, ద్రవ్యం నిలువ చేయడం వలన త్యాగం చేసే వడ్డీరేటు మొత్తం r.(K/2) కు సమానం. ద్రవ్యం ఉపసంహారణల కొరకు చేయవలసిన ఇతర ఖర్చులు (వడ్డీయేతర వ్యయాలు) .(Y/K)సమానం. ఇప్పుడు, ద్రవ్యం అట్టిపెట్టుకోవడంతో సాహచర్యం గల ఈ రెండు రకాల వ్యయాల మొత్తాన్ని తగ్గించుకోవడం ఒక వ్యక్తి ముందున్న సమస్య.

లేక $C = r.\left(\frac{K}{2}\right) + b.\left(\frac{Y}{K}\right)$ . . . (i)

మొత్తం వ్యాపార నిలువ వ్యయ్యాన్ని (C) తగ్గించుట ద్వారా, K అభిలషణీయ (optimum) విలువను కనుగొనవచ్చు. K కు సంబంధించి, C ని అవకలనం (differentiate) చేస్తూ, K అభిలషణీయ విలువను కనుగొనవచ్చు. వ్యుత్పన్నం (derivative) $\left(\frac{\partial C}{\partial K}\right)$ ను శూన్యంకు సమానం చేసి, పై సమీకరణం (i) కు సమాధానం కనుగొనవచ్చు. ఈవిధంగా

$C = r.\left(\frac{K}{2}\right) + b.\left(\frac{Y}{K}\right)$ ను తగ్గించుతూ,

$$\frac{\partial C}{\partial K} = \frac{r}{2}.bYK^{-1-1} = 0$$

$$= \frac{r}{2} - \frac{bY}{K^2} = 0$$

$$= \frac{r}{2} = \frac{bY}{K^2}$$

$$= K^2 r = 2\,(bY)$$

లేక $K^2 = \frac{2(bY)}{r}$

$K = \sqrt{\frac{2(b)Y}{r}}.$ . . . (ii)

బౌమోల్ విశ్లేషణ నుండి ఈ క్రింది ప్రధానాంశాలు స్పష్టం అవుతాయి (సమీకరణం (ii)ను చూడండి).

a) అభిలషణీయ రొక్కం నిలువ (దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు) వడ్డీరేటుపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ వడ్డీరేటును పెంచితే, సాధ్యమైనంత తక్కువగా , ఆలస్యంగా ద్రవ్య నిలువలను ఉపసంహరించడం లాభసాటిగా ఉంటుంది. ఒకవేళ వడ్డీరేటును తగ్గించితే, దీనికి వ్యతిరేకంగా జరుగుతుంది. దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు వడ్డీరేటుతో విలోమ సంబంధం కలిగి యుంటుంది. ఈ విధంగా,

BRAOU

దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండుకు భ్రామికమైన ద్రవ్య డిమాండుకు (ఆస్తుల డిమాండుకు) మధ్య నున్న ద్వైవిధ్యం (dichotomy) అర్థరహితమని తెలియుచున్నది.

b) బ్రోకరుకు ఇచ్చే కమీషను పెరిగితే, సంస్థ లేక వ్యక్తి తక్కువ సంఖ్యలో రొక్కాన్ని ఉపసంహరించు కుంటాడు. ఆ విధంగా జరిగినచో, అభిలషణీయ ద్రవ్య నిలువలు పెరుగుతాయి. ఎప్పుడైతే, బ్రోకరుకిచ్చే కమీషను తగ్గుతుందో దీనికి వ్యతిరేకంగా జరుగుతుంది. ఎప్పుడైతే "b" (బ్రోకరు కమీషను మొదలగునవి) పెరుగునో, సంస్థలు ఒకే సమయంలో ఎక్కువ ద్రవ్యాన్ని ఉపసంహరించుకుంటారు. దీని వలన ద్రవ్యం ఉపసంహరణల సంఖ్య తగ్గుతుంది.

c) ఆదాయ స్థాయి పెరిగిన కొలది, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు పెరుగుతుంది, కాని ఆదాయ స్థాయి పెరిగిన రేటు కన్నా తక్కువ రేటులో పెరుగుతుంది. భౌమోల్ విశ్లేషణలో, ద్రవ్య డిమాండు ఆదాయ వ్యాకోచత్వం 1/2 అని తేలింది. ఆదాయ స్థాయి పెరిగిన కొలది, వ్యాపార నిర్వహణ వల్ల ఏర్పడే సగటు వ్యయం (బ్రోకరు ఫీజులు, మొ॥), తరహానుసరించి వచ్చే ఆదాల వలన, క్రమేపీ తగ్గుతూ ఉంటుంది. దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండులోని పెరుగుదల, ఆదాయ స్థాయిలోని పెరుగుదల కన్నా తక్కువగా ఉంటుంది.

d) బౌమోల్ విశ్లేషణలో, ద్రవ్య డిమాండును వాస్తవిక రూపంలో తెలియజేయడం జరిగింది. అతడు, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండుకు (transactions demand for money), ధరల స్థాయికి (P) మధ్య అనులోమానుపాత సంబంధం ఉన్నట్లు కనుగొన్నాడు. ఒక సంవత్సరాంతం, సగటు ద్రవ్య నిలువల విలువను $\left(\frac{TM}{P}\right)$ గా అనుకుంటే, దైనందిన వ్యవహారాల వాస్తవిక ద్రవ్య నిలువల మొత్తం $\left(\frac{TM}{P}\right)$ ను క్రింది విధంగా వ్రాయవచ్చు.

$$\frac{TM}{P} = \frac{K}{2} = \frac{1}{2}\sqrt{\frac{2bY}{r}}$$

లేక $$TM = \frac{1}{2}\sqrt{\frac{2bY}{r}} x P \quad \text{.... (iii)}$$

వ్యాపార నిర్వహణ కొరకు ఉపయోగించే ద్రవ్య విలువలోని, బ్రోకరుకు ఇచ్చే కమీషన్ (b)లోని పెరుగుదల ధరల స్థాయిలోని మార్పుకు ఖచ్చితంగా అనులోమానుపాతంలో అభిలషణీయ ద్రవ్య డిమాండు పెరగడానికి దారితీస్తుంది.

B R A O U

### 7.3.1 భౌమోల్ విశ్లేషణలోని సాపేక్షమైన ప్రయోజనాలు (Relative Merits of Baumol's Analysis)

భౌమోల్ దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు విశ్లేషణ సంప్రదాయ, కేన్స్ విశ్లేషణల కంటే క్రింది విధంగా మెరుగైనదని చెప్పవచ్చు.

i) భౌమోల్ వాస్తవికంగా, మూలధన సిద్ధాంతాన్ని (ఆస్తులను, వాటి నిర్వహణకు సంబంధించిన వ్యయాలను పరిగణలోనికి తీసుకుంటూ) దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు సిద్ధాంతంతో సంఘటిత (integrate) పరిచాడు.

ii) భౌమోల్ దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు వడ్డీ - వ్యాకోచత్వాన్ని నిరూపించాడు. ఇది, కేన్స్ దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు వ్యాకోచత్వ విశ్లేషణ కన్నా అర్థవంతమైనదిగా చెప్పవచ్చు. ఎందుకంటే కుటుంబాలు కూడా కొన్నిసార్లు వ్యాపారస్తులుగా ప్రవర్తిస్తుంటాయి.

iii) భౌమోల్ దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండుకు, ఆదాయ స్థాయిలోని పెరుగుదలకు మధ్య సంబంధం అనులోమానుపాతం కన్నా తక్కువ విలువ కలిగి యుంటుందని ప్రయోగ ఆధారంగా (empirically) చూపించాడు.

iv) భౌమోల్ దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు విశ్లేషణను వాస్తవిక ద్రవ్య నిలువల డిమాండు విశ్లేషణ అని చెప్పాలి. కాబట్టి, ఈ విశ్లేషణలో, ద్రవ్య భ్రమ (money illusion) కు తావులేదని ప్రస్ఫుటంగా కనపడుతుంది.

## 7.4 టోబిన్ పెట్టుబడుల పట్టిక నమూనా - ద్రవ్యత్వాభిరుచి అన్నది ఒక నష్టభయ అయిష్టతగా భావించడం. (Tobin's Portfolio Model - Liquidity Preference as a Behaviour Towards Risk Aversion)

కేన్స్ ప్రాథమికమైన ద్రవ్య డిమాండును, ద్రవ్యత్వాభిరుచిని నష్ట భయం (risk) నిమిత్తం ప్రవర్తించే తీరుగా వివరించుతూ టోబిన్ మెరుగుపరచాడు. ఇక్కడ, మూడు రకాల పెట్టుబడిదారులను గుర్తించవచ్చు : (1) సంపద మొత్తాన్ని జూదం మీద పెట్టి రిస్కు తీసుకొవడానికి ఇష్టపడేవారు ; (2) సంపదను బాండుల రూపంలో లేక ద్రవ్యం రూపంలో గాని ఉంచి దుడుకుగా ప్రవర్తించే పెట్టుబడిదారులు; (3) బాండుల నుండి ఏర్పడే అనుకోని నష్టానికి భిన్నతను సంపాదించుటకు (diversify) ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ రిస్కును నివారించేవారు. వీరు అదనపు లాభానికి బదులుగా మాత్రమే అదనపు రిస్కును తీసుకొంటారు. వీరు, లాభాన్ని అధికం, నష్టాన్ని తక్కువ చేయడానికి ప్రయత్నిస్తారు. చాలామంది పెట్టుబడిదారులు ఈ మూడవ కోవకు చెందినవారై ఉంటారు.

ఎప్పుడైతే, ఫలితపు సంభావ్యతా పంపిణీ (probability distribution) గూర్చి తెలుస్తుందో, అప్పుడే రిస్కు ఉద్భవిస్తుంది. కాని, ప్రత్యేక చర్య యొక్క నిర్దిష్ట ఫలితం తెలియదు (లేక జరుగబోవు దానిని ఖచ్చితంగా చెప్పజాలం). ఏమైనప్పటికీ, అనిశ్చిత స్థితిలో సంభావ్యతా పంపిణీ గూర్చి పూర్తిగా తెలియదు. కేన్సు ద్రవ్యత్వాభిరుచి సిద్ధాంతాన్ని అనిశ్చిత సిద్ధాంతం నుండి నష్టభయం సిద్ధాంతానికి మార్పు చేయడం టోబిన్ ముఖ్య ఉద్దేశం. టోబిన్ ప్రకారం, ద్రవ్యత్వాభిరుచిని తక్కువ రిస్కు కలిగియున్న పెట్టుబడిని కోరుకోవడంగా భావించవచ్చు.

రిస్కును నివారించే పెట్టుబడి దారులకు ద్రవ్యత్వాభిరుచి సిద్ధాంతం చాలా సంగతమైనది (relevant) అని చెప్పవచ్చు. బాండులను అట్టిపెట్టుకోవడం వలన మూలధన నష్టం సంభవించే ప్రమాదం ఉంది. కాని ద్రవ్యాన్ని అట్టి పెట్టుకోవడం వలన అటువంటి నష్టం జరిగే అవకాశం లేదు. కాని, అదే సమయంలో, ద్రవ్యాన్ని అట్టిపెట్టుకోవడం వడ్డీరూపంలో వచ్చే ఆదాయ త్యాగాన్ని సూచిస్తుంది. సర్వ సాధారణంగా, సంపదను వివిధ ఆస్తుల రూపాలలో ఉంచి నష్టం తగ్గించుకొనే పెట్టుబడిదారులు, విభిన్న భాగాలు (mixed) గల పెట్టుబడుల పట్టికను ఉంచుకోవాలని అభిలషిస్తారు. అనగా, వీరు, వారి సంపదను కొంత రొక్కం రూపంలో, కొంత బాండుల రూపంలో ఉంచుకోవాలని అభిలషిస్తారు. ప్రతి పెట్టుబడిదారుడు, పెట్టుబడి వలన కలిగే లాభనష్టాల సంభావ్యతా పంపిణీకి సంబంధించి అతని ఆత్మాశ్రయ అంచనాల (subjective estimates) ఆధారంగా చర్యలు తీసుకొంటాడు. టోబిన్ వడ్డీయోగ్యమైన బాండులు/అస్తులు అట్టిపెట్టుకోవడం వలన ఊహించిన మూలధన నష్టం లేక లాభం (G) ఎల్లప్పుడూ శూన్యంగా ఉంటుందని ప్రమేయం చేస్తాడు. పెట్టుబడిదారుని పెట్టుబడుల పట్టిక రొక్కం (C)ను, బాండుల (B)ను కలిగియుంటుంది. ఇంకా, రొక్కం,

BRAOU

బాండుల నిష్పత్తుల కూడిక విలువ ఒకటికి సమానమౌతుంది.

r = వడ్డీరేటు. U = పెట్టుబడుల పట్టికపై వచ్చే ప్రతిఫలం. U = B (r+G)

G విలువ శూన్యం అనుకొంటే, ఊహించిన ప్రతిఫలం (U) 'B', 'r' లపై ఆధారపడి ఉంటుంది. వడ్డీరేటు స్థిరంగా ఉంటే, అనుకోని నష్టం వచ్చే ప్రమాదం లేదు. కేవలం, మూలధన నష్టం లేక లాభం సంభవించే అవకాశం ఉంది. ప్రతిఫలం (U) ప్రమాణ విచలనం [standard deviation (σ)]చే రిస్కును చూపించగలం. పెట్టుబడిదారుడు ఎంత రొక్కాన్ని, ఎంత బాండుల మొత్తాన్ని అట్టిపెట్టుకోవాలి అనే ప్రశ్న ఉదయిస్తుంది. దీనిని పటం 7.4 సహాయంతో వివరించాం.




పటం - 7.4

BRAOU

పటం 7.4 లో సమతలం (horizontal) గా ఉన్న అక్షంపై నష్ట భయం కొలవబడింది, క్షితిజరేఖకు లంబం (vertical) గా ఉన్న అక్షంపై ప్రతిఫలం (U) కొలవబడింది. OR పెట్టుబడిదారుని బడ్జెటు రేఖ. పెట్టుబడుల పట్టిక (investment portfolio) రొక్కాన్ని (C), బాండులను (B) కలిగియుంటుంది. ఉదాసీనతా వక్రరేఖలు (indifference curves) అదనపు రిస్కుకు బదులుగా ఎక్కువ ప్రతిఫలం కొరకు రిస్కును నివారించే పెట్టుబడిదారుల పెరుగుతున్న డిమాండును సూచిస్తుంది. ఉదాసీనతా వక్రరేఖ (నం.1) కు బడ్జెటు రేఖ (OR) కు మధ్య స్పర్శ బిందువు (P) వద్ద, రిస్కును నివారించే పెట్టుబడిదారుడు, తన సమతౌల్య పెట్టుబడుల పట్టికను (equilibrium portfolio) నిశ్చయించుకొంటాడు. OQ రేఖ రిస్కుకు, పెట్టుబడుల పట్టికలో బాండుల శాతానికి అనులోమానుపాత సంబంధాన్ని చూపిస్తుంది. P బిందువునుండి OQ రేఖపైకి లంబరేఖ (perpendicular) ను గీసినప్పుడు, పెట్టుబడి పట్టికలోని రొక్కానికి (C), బాండుల (B) కు మధ్య విభజనను నిర్ణయించే L బిందువు ఏర్పడుతుంది. ఈ విధంగా పెట్టుబడిదారుడు OM సంపదను బాండుల (B) రూపంలో, MN సంపదను రొక్కం (C) రూపంలో అట్టిపెట్టుకొంటాడు. ON అన్నది రిస్కును నివారించే పెట్టుబడిదారులు పెట్టుబడి రూపంలో పెట్టే సంపద మొత్తాన్ని సూచిస్తుంది.

వడ్డీరేటు స్థిరంగా ఉన్నంతవరకు, పెట్టుబడిదారుని సమతౌల్యం (P) అస్థిరం కావింపబడదు. వడ్డీరేటు ఎక్కువగా ఉంటే, బాండులకు డిమాండు ఎక్కువగా, రొక్కానికి డిమాండు తక్కువగా ఉంటుంది. వడ్డీరేటు తక్కువగా ఉన్నట్లైతే, దీనికి వ్యతిరేకం (opposite) గా జరుగుతుంది. వడ్డీరేటు పెరిగిన సందర్భంలో, బడ్జెట్‌రేఖ (OR) పైకి వెళుతుంది. చివరకు ఈ రేఖ ఉన్నతంగా ఉన్న ఉదాసీనతా వక్రరేఖకు స్పర్శరేఖగా

మారుతుంది. రిస్కుకి సంబంధించి, ప్రతిఫలాలు పెరుగుతాయని దీని అర్థం, ఇంకా, ద్రవ్యం శాతం తగ్గి వున్న, బాండుల శాతం పెరిగి ఉన్న పెట్టుబడుల పట్టికను పెట్టుబడిదారుడు ఎన్నుకొంటాడు. దీనిని రేఖాపటం 7.5 లో చూపించాం.




పటం - 7.5 : రిస్కు, ప్రతిఫలాలు మరియు పెట్టుబడిదారుని సమతౌల్యం

పటం 7.5 ప్రకారం, వడ్డీరేటు పెరుగుతున్న కొలది బడ్జెటురేఖ $OR_1$ నుండి $OR_3$కి వెలుతుంది, సమతౌల్య బిందువు $P_1$నుండి $P_3$కి వెలుతుంది. ఇంకా, అట్టిపెట్టుకొనే బాండుల మొత్తం OB నుండి $OB_3$కి పెరుగుతుంది. ఇంకా, అట్టిపెట్టుకొనే ద్రవ్యం $B_1N$ నుండి $B_3N$ కి తగ్గుతుంది. ఈ విధంగా, వడ్డీరేటు పెరిగిన కొలది ద్రవ్య డిమాండు తగ్గుతుందని పటం 7.5 ద్వారా గ్రహించాం. ఈ విలోమ సంబంధాన్ని రేఖాపటం ద్వారా చూపించితే, సాధారణంగా అవిచ్ఛిన్నమైన భ్రామిక ద్రవ్య డిమాండు పట్టికను పొందగలం.

BRAOU

### 7.4.1 టోబిన్ విశ్లేషణలో గల ప్రయోజనాలు (Relative Merits of Tobin's Analysis )

టోబిన్ పెట్టుబడుల పట్టిక ఎంపిక యొక్క విశ్లేషణ, కేన్స్ భ్రామిక ద్రవ్య డిమాండు సిద్ధాంతం ద్రవ్యత్వాభిరుచి విశ్లేషణ కన్నా శ్రేష్ఠమైనది. ఈ క్రింది కారణాల వలన టోబిన్ విశ్లేషణ శ్రేష్ఠమైనదని చెప్పవచ్చు.

(i) టోబిన్ తన విశ్లేషణలో, పెట్టుబడిదారునిచే అట్టిపెట్టుకొనబడే ద్రవ్యాన్ని, బాండులను పరిగణనలోకి తీసుకుంటాడు. కానీ, కేన్సు మాదిరి రొక్కంనో లేక బాండునో పరిగణనలోకి తీసుకోలేదు. ఈ విధంగా, టోబిన్ విశ్లేషణ ఎక్కువ వాస్తవమైనదే గాకుండా విశాలమైనది అని చెప్పవచ్చు.

(ii)కేన్స్ ద్రవ్యత్వాభిరుచి సిద్ధాంతం భావి వడ్డీరేటు యొక్క అవ్యాకోచత్వ సంభావ్యతా సరళి (inelasticity of expectation pattern)పై ఆధారపడి ఉంటుంది. వడ్డీ యోగ్యత గల ఆస్తుల నుండి ఏర్పడే మూలధన లాభ, నష్టాల సంభావ్యత విలువ ఎల్లప్పుడూ శూన్యంగా ఉంటుందనే ప్రమేయంతో టోబిన్ విశ్లేషణ సాగిపోతుంది.

(iii) టోబిన్ విశ్లేషణ, సంపూర్ణ వ్యాకోచత్వ ద్రవ్య డిమాండు ఫలం సైద్ధాంతిక వ్యాజ్యపు (theoretical controversy) నుండి స్వేచ్ఛను కలిగియుంటుంది. టోబిన్ అత్యంత తక్కువ వడ్డీరేటు వద్ద ద్రవ్యత్వ వల (liquidity trap) సంభవాన్ని చర్చించలేదు.

## 7.5 ఫ్రీడ్‌మన్ ద్రవ్య డిమాండు ఫలం (సంప్రదాయ ద్రవ్య ఫలంను తిరిగి వ్యాఖ్యానించుట) [(Friedman's Demand for Money Function ( Friedman's Restatsment of Quantity Theory )]

కేన్స్ "General Theory of Employment, Interest & Money" అను గ్రంథం 1936లో ప్రచురింపబడి నప్పటినుండి, అర్థశాస్త్రవేత్తలు సంప్రదాయ ద్రవ్య సిద్ధాంతాన్ని త్రోసిపుచ్చినారు. సంప్రదాయ సిద్ధాంతం ద్రవ్య సప్లయికి, ధరల స్థాయికి మధ్య ప్రత్యక్ష (direct) అనులోమ సంబంధం ఉన్నదని నొక్కి వక్కాణించింది. కేన్సు ద్రవ్య సప్లయికి,ధరల స్థాయికి మధ్యనున్న ప్రత్యక్ష సంబంధాన్ని ఖండించాడు. కేన్సు ప్రకారం ద్రవ్యం, వడ్డీరేటు, పెట్టుబడిలోని మార్పుల ద్వారా ఆర్థిక కార్యకలాపాలను, ధరల స్థాయిని పరోక్షంగా ప్రభావితం చేస్తుంది. ఏమైనప్పటికీ, కేన్సుయొక్క ఈ ప్రతిపాదనను, ఫ్రీడ్‌మన్ 1956 లో సవాలు చేసినాడు. ఫ్రీడ్‌మన్, సంప్రదాయవాదుల ద్రవ్య సిద్ధాంతపు ప్రాధాన్యతను తిరిగి స్థాపించాడు. ఫ్రీడ్‌మన్, తన అభిప్రాయాలకనుగుణంగా చికాగో ఆర్థిక విజ్ఞాన శాఖను స్థాపించాడు. ఇప్పుడు, సంప్రదాయ సిద్ధాంతంపై ఫ్రీడ్‌మన్ అభిప్రాయాలను చర్చించుకుందాం.

ఫ్రీడ్‌మన్ సంప్రదాయ ద్రవ్య సిద్ధాంతాన్ని ప్రధానంగా, ద్రవ్య డిమాండు సిద్ధాంతమని వ్యాఖ్యానించాడు. ఇది, ఉత్పత్తి లేక ద్రవ్యాదాయ లేదా ధరల సిద్ధాంతం కాదు. ద్రవ్యం ప్రాధాన్యతను ఫ్రీడ్‌మన్ నొక్కి వక్కాణించాడు. ద్రవ్యం కూడ ఒకరకమైన ఆస్తి కాబట్టి, ద్రవ్య డిమాండు సిద్ధాంతం, మూలధన సిద్ధాంతంలో ఒక ప్రత్యేకమైన విచారణాంశం అవుతుంది. ద్రవ్య డిమాండుచే ద్రవ్య సప్లయి ప్రభావితం కాకుండా, స్వతంత్రంగా ఉంటుంది. ద్రవ్య సప్లయి అస్థిరంగా ఉంటుంది, కాని ద్రవ్య డిమాండు స్థిరంగా ఉంటుంది.

ఒక వ్యక్తి అట్టిపెట్టుకొనే ద్రవ్యం మొత్తం, ద్రవ్యంను అట్టిపెట్టుకోవడం వల్ల ఏర్పడే అవకాశ వ్యయం (opportunity cost) పై,అతడు కలిగియున్న సంపద పై ఆధారపడి ఉంటుంది. ఏ వ్యక్తికూడా అనంతమైన ద్రవ్యం నిలువను కలిగియుండలేడు (సంపద పరిమితంగా ఉంటుంది కాబట్టి). ఫ్రీడ్‌మన్, ఆదాయం లేక సేవల సర్వమూలాధారాలు చేర్చబడిన సంపదయొక్క విశాలమైన భావనను అందించాడు. అతడు సంపదను మానవ, మానవేతర సంపదలుగా విభజించాడు. సంపద నిలువ, దాని నుండి ప్రవహించే ఆదాయం మధ్యనున్న సంబంధాన్ని వడ్డీరేటు వ్యక్తం చేస్తుంది. సంపద (W), వడ్డీరేటు (r), ఆదాయం (Y) మధ్యనున్న సంబంధాన్ని ఈ క్రింది సమీకరణం ద్వారా తెలియ జేయవచ్చు.

$$W = \frac{Y}{r} \quad \text{or} \quad W.r = Y$$

ఫ్రీడ్‌మన్ తన విశ్లేషణలో శాశ్వతాదాయ (Y) భావనను ఉపయోగించాడు. ఎందుకంటే, జాతీయాదాయ గణనలో మామూలు సంవత్సర ఆదాయం (measured income) కన్నా, శాశ్వతాదాయం (permanent income) స్థిరంగా ఉంటుంది. శాశ్వతాదాయం, నిరంతరంగా కొనసాగే ఊహించబడిన గత ఆదాయాల సగటు ఆదాయం అని చెప్పవచ్చు.

ఫ్రీడ్‌మన్ ప్రకారం, ఒకవ్యక్తి, తన సంపదను ఐదు ప్రత్యామ్నాయ రూపాల (alternative forms) లో అట్టి పెట్టుకొనవచ్చు. అవి : (a) ద్రవ్యం ; (b) బాండులు ; (c) ఈక్విటీలు ; (d) భౌతిక రూపంలోని మూలధనం ; (e) మనుష్య సంబంధమైన మూలధనం (human capital).

ఫ్రీడ్‌మన్, తన విశ్లేషణను సర్వసాధారణ సూక్ష్మ డిమాండు సిద్ధాంతంతో ప్రారంభిస్తాడు. వినియోగ సేవల (consumption services) మాదిరిగానే ద్రవ్యడిమాండును కూడ వివరించవచ్చని ఫ్రీడ్‌మన్ వ్యాఖ్యానిస్తాడు.

ద్రవ్య డిమాండు మొత్తం, ఇతర రూపాలలో నున్న సంపదపై చేకూరే సాపేక్ష ప్రతిఫలాలు సంపన్నుని (wealth holder ) అభిరుచుల సరళిపై ఆధారపడి ఉంటుంది. ఫ్రీడ్‌మన్ ద్రవ్య డిమాండు ఫలాన్ని క్రింది విధంగా వ్యక్తపరచవచ్చు.

$$M = f(Y, P, r_b, r_e, \frac{1}{P}\cdot\frac{\partial P}{\partial t}, W, U)$$

ఇచ్చట, $M$ =ద్రవ్య డిమాండు; $Y$ =శాశ్వతాదాయం ; $P$ =ధరల స్థాయి; $r_b$ =బాండులనుండి వచ్చే ప్రతిఫలం; $r_e$ = ఈక్విటీ నుండి వచ్చే ప్రతిఫలం ; $\frac{1}{P}\cdot\frac{\partial P}{\partial t}$ = ముందుగా ఊహించిన ధరల స్థాయిలోని మార్పు రేటు; $W$ =మనుష్య సంపద (human wealth),భౌతిక సంపద పై వచ్చేఆదాయాల నిష్పత్తి ; $U$ =సంపన్నుల అభిరుచులు.

ఏదేమైనప్పటికీ, ద్రవ్య డిమాండు అనేది వాస్తవిక ద్రవ్య నిలువల డిమాండు కాబట్టి, ఫ్రీడ్‌మన్ ద్రవ్య డిమాండు ఫలాన్ని ఈ క్రింది సమీకరణం ద్వారా తెలియజేయవచ్చు.

$$\frac{M}{P} = f\left(\frac{Y}{P}, r_b, r_e, \frac{1}{P}\cdot\frac{\partial P}{\partial t}, W, U\right)$$

అత్యావశ్యకంగా, క్రింది నాలుగు ప్రధాన కారకాలు ద్రవ్య డిమాండును ప్రభావితం చేస్తాయి.

(i) ద్రవ్య డిమాండు, ద్రవ్యాన్ని అట్టిపెట్టుకోవడం వలన ఏర్పడే అవకాశ వ్యయం (opportunity cost)చే ప్రభావితం అవుతుంది. ఫ్రీడ్‌మన్ ప్రకారం, వడ్డీరేటు, ద్రవ్య డిమాండు పై అనుకున్న దిశలో క్రమబద్ధమైన ప్రభావం చూపదు, కాని ప్రభావం యొక్క పరిమాణం చాలా స్వల్పం. వేరే విధంగా చెప్పాలంటే, ద్రవ్య డిమాండు యొక్క వడ్డీ - వ్యాకోచత్వపు విలువ ధనాత్మకం (positive), కాని అది చాలా స్వల్పం.

(ii) ద్రవ్య డిమాండు, వాస్తవిక ఆదాయంలోని మార్పులచే ప్రభావితం అవుతుంది. ఈ రెండింటి మధ్యనున్న సంబంధం ప్రత్యక్షమైంది, కాని అనులోమానుపాతం కాదు. వస్తు సేవల ఉత్పత్తి పెరిగితే ద్రవ్య డిమాండు నిశ్చితంగా (invariably)పెరుగుతుంది. అదే విధంగా, వస్తు సేవల ఉత్పత్తి తగ్గితే ద్రవ్య డిమాండు తగ్గుతుంది. ద్రవ్య డిమాండు యొక్క వాస్తవిక ఆదాయ వ్యాకోచత్వం విలువ ఒకటికన్నా ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే, వాస్తవిక ఆదాయంలోని పెరుగుదల, అధిక జీవన ప్రమాణాన్ని సూచిస్తుంది. ద్రవ్యం దీర్ఘకాలం మనగలిగే వినియోగ వస్తువుల గుణాన్ని కలిగియుంటుంది. కాబట్టి, వాస్తవిక జీవన ప్రమాణంలోని పెరుగుదలకన్నా, ద్రవ్య డిమాండులోని పెరగుదల ఎక్కువ రేటులో ఉంటుంది. వాస్తవానికి, ద్రవ్యం ఒక విలాస వస్తువు.

(iii) ఫ్రీడ్‌మన్ ప్రకారం, ద్రవ్య డిమాండు సాధారణంగా ధరల స్థాయి (general price level) లోని మార్పులతో ప్రత్యక్షంగా, అనులోమానుపాతంలో మార్పు చెందుతుంది. ఈ అభిప్రాయం సంప్రదాయవాదుల అభిప్రాయముతో ఏకీభవిస్తుంది. ధరల స్థాయి పెరిగిన (తగ్గిన) కొలదీ ద్రవ్య డిమాండు అనులోమానుపాతంలో పెరుగుతుంది (తగ్గుతుంది).

(iv)ధరల స్థాయిలోని మార్పు రేటు కూడ ద్రవ్య డిమాండుపై చెప్పుకోదగినంత ప్రభావం చూపుతుంది. ఎప్పుడైతే, ధరల స్థాయిలోని మార్పురేటు ఎక్కువగా, అవిచ్ఛిన్నంగా ఉంటుందో ద్రవ్యం కొనుగోలు శక్తి చాలా వేగంగా పడిపోతుంది. అందువలన, తక్కువ ద్రవ్యం డిమాండు చేయబడుతుంది. అట్లా జరిగినచో, ద్రవ్యాన్ని అట్టిపెట్టుకొనే వ్యయం పెరుగుతుంది. అందువలన, ప్రజలు ఇంతకు ముందుకన్నా తక్కువ రొక్కం నిల్వలను అట్టిపెట్టుకొంటారు. కాని, ధరలస్థాయి మెల్లగా, తక్కువ రేటులో తగ్గితే ప్రజలు ఇంతకు ముందుకన్నా ఎక్కువ మొత్తంలో రొక్కాన్ని నిలువ ఉంచుకొంటారు. ఈ విధంగా, ద్రవ్య డిమాండు

BRAOU

పెరుగుతుంది. ఈవిధంగా, ద్రవ్య డిమాండుకు, ధరల స్థాయిలోని మార్పు రేటుకు మధ్య విలోమ (inverse) సంబంధం ఉంటుంది.

ఏదేమైనప్పటికీ, దీర్ఘకాలిక ద్రవ్య డిమాండు ఫలం ఎక్కువ స్థిరంగా ఉంటుందని ఫ్రీడ్‌మన్ వ్యక్తం చేస్తాడు. ద్రవ్య డిమాండు ఫలం స్థిరంగా ఉంటుంది కాబట్టి, ఆర్థిక కార్యకలాపాలలోని మార్పులన్నీ, అత్యావశ్యకంగా , సప్లయి యొక్క యదార్థ స్థితిని దృష్టిలో ఉంచుకొంటాయని ఫ్రీడ్‌మన్ చెప్తాడు. అంటే, ద్రవ్య సప్లయి ఎల్లప్పుడూ ప్రధాన కారకంగా కొనసాగుతూ ఉంటుంది. ద్రవ్య డిమాండు ఫలం స్థిరంగా ఉన్నట్లైతే ఆదాయం (Y), ద్రవ్య డిమాండు (M), ధరల స్థాయి (P)చలాంకాల మధ్య భావి సంబంధాన్ని దీర్ఘకాలం కొరకు, ఖచ్చితంగా ఊహించి చెప్పవచ్చు. ఫ్రీడ్‌మన్ ప్రకారం, ఉత్పత్తి వృద్ధి రేటుతో ద్రవ్యం వృద్ధిరేటు దాదాపుగా సమానంగా ఉంటే, ఆర్థిక వ్యవస్థలో ధరల స్థిరత్వాన్ని కొనసాగించవచ్చు. కాని స్వల్పకాలంలో, ఆర్థిక కార్యకలాపాలకు, ద్రవ్యానికి మధ్యనున్న భావి సంబంధాన్ని ఊహించడం చాలా కష్టమైన పని. ఈ విధంగా, ద్రవ్య విధానం, స్వల్పకాలంలో సమర్థవంతంగా పనిచేయదు. ఫ్రీడ్‌మన్ ప్రకారం, ద్రవ్యానికి సమష్టి డిమాండుకు మధ్య సంబంధం ప్రత్యక్షంగా చాలా స్పష్టంగా ఉంటుంది. ఏమైనప్పటికీ ఫ్రీడ్‌మన్, కేన్స్ యొక్క ద్రవ్యత్వ వల పరికల్పన (liquidity trap hypothesis) ను ఖండించాడు.

### 7.5.1 సంప్రదాయ సిద్ధాంతంపై ఫ్రీడ్‌మన్ ద్రవ్య డిమాండు సిద్ధాంతం సాధించిన ప్రగతి (Improvement of Friedman's Money Demand Theory over the Classical Theory)

సంప్రదాయ సిద్ధాంతాన్ని ఫ్రీడ్‌మన్ క్రింది విధంగా అభివృద్ధి చేసినాడు : (i) సంప్రదాయ ద్రవ్య సిద్ధాంతాన్ని, ద్రవ్య డిమాండు సిద్ధాంతంగా విశ్లేషించాడు; (ii) ద్రవ్య సిద్ధాంతాన్ని మూలధన సిద్ధాంతాన్ని సమగ్రం చేసినాడు; (iii) ద్రవ్య డిమాండు యొక్క ఆదాయ - వ్యాకోచత్వం విలువ ఒకటి కన్నా ఎక్కువ ఉంటుందని సూచించాడు; (iv) ద్రవ్య డిమాండు యొక్క వడ్డీ- వ్యాకోచత్వం చెప్పుకోదగినంతగా ఉండదని నొక్కి వక్కాణించాడు; (v) ధరల స్థిరత్వం కోసం ద్రవ్య విధానాన్ని రూపొందించాలి; అంటే ద్రవ్య సప్లయి, ఉత్పత్తిలోని వృద్ధిరేట్లు సమానంగా ఉండేటట్లు చూడాలి. ఫ్రీడ్‌మన్ సంప్రదాయ ద్రవ్య సిద్ధాంతాన్ని కొన్ని ముఖ్యమైన మార్పులతో తిరిగి వ్యాఖ్యానించాడు. దీర్ఘకాలంలో, అన్నీ వాస్తవిక పరిమాణాలు వాటి సగటు స్థాయికి చేరుకొంటాయని ఫ్రీడ్‌మన్ విశ్వసించాడు. ఆర్థిక కార్యకలాపాలను ప్రభావితం చేయడానికి ద్రవ్య సప్లయిలో వృద్ధి అవసరం ఉంటుంది. ఈ విధంగా సంప్రదాయ ద్రవ్య సిద్ధాంతాన్ని ఫ్రీడ్‌మన్ సంస్కరించాడని చెప్పవచ్చు.

BRAOU

### 7.5.2 ఫ్రీడ్‌మన్ సిద్ధాంతపు విమర్శనాత్మక మదింపు (Critical Appraisal of Friedman's Theory of Money Demand)

ఫ్రీడ్‌మన్ సిద్ధాంతపు ముఖ్యలక్షణాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

(i) ఫ్రీడ్‌మన్ తన సిద్ధాంతంలో, మూలధన సిద్ధాంతం ముఖ్యమైన సూత్రాన్ని ప్రవేశపెట్టినాడు. మూలధనంపై వచ్చే ప్రతిఫలమే ఆదాయం అని చెప్పాడు. ఇంకా, మూలధనం అనేది ఆదాయం యొక్క ప్రస్తుత విలువ అని కూడా చెప్పాడు. ద్రవ్య సిద్ధాంతంతో, మూలధన సిద్ధాంతం సమగ్రత, ద్రవ్యానికి సంబంధించిన అర్థశాస్త్ర రంగంలో ఒక ముఖ్యమైన, చెప్పుకోదగిన అభివృద్ధి అని చెప్పవచ్చు.

(ii) ఆదాయం, సంపద యొక్క భావనాత్మక సమగ్రం (conceptual integration) అన్నది ఫ్రీడ్‌మన్ విశ్లేషణ యొక్క ఇంకొక ముఖ్యమైన లక్షణమని చెప్పవచ్చు. ఫ్రీడ్‌మన్, ఇంతకు ముందు అశ్రద్ధ చేసిన మనుష్య సంపదను గూర్చి ప్రత్యేకంగా నొక్కి వక్కాణించాడు.

(iii) శాశ్వతాదాయ భావన ఫ్రీడ్‌మన్ విశ్లేషణ యొక్క ఒక కొత్త సుప్రసిద్ధమైన లక్షణం. ఇది, సంపద నుండి వచ్చే భావి ఊహా ప్రతిఫల భావం. ద్రవ్య డిమాండు ఎక్కువగా శాశ్వతాదాయ ఫలం.

(iv) ఫ్రీడ్‌మెన్ భావనలో, ద్రవ్యం అన్నది, రొక్కం, డిమాండు డిపాజిట్లు, సేవింగు డిపాజిట్లు , కాల డిపాజిట్లను కలిగి యుంటుంది. ఈ విధంగా, ఇతడు, కొనుగోలు శక్తియొక్క తాత్కాలిక ఆవాసం (abode) గా, ద్రవ్యపు ఒక క్రొత్త భావనను ఉపయోగించాడు. ఇది, నిజంగా, ద్రవ్యపు చాలా విశాలమైన నిర్వచనం.

(v) ఫ్రీడ్‌మన్ ఒక ద్రవ్య నియమాన్ని సూత్రీకరించాడు. అది ఏమంటే, ఆర్థిక వ్యవస్థ ఏ రేటుతో వృద్ధిచెందుతుందో అదే రేటుతో ద్రవ్య సప్లయి వృద్ధి చెందాలి. ఇది ధరల స్థిరత్వాన్ని కొనసాగిస్తుంది.

(vi) ఫ్రీడ్‌మన్ విశ్లేషణ, కేన్స్ విశ్లేషణ కన్నా శ్రేష్ఠమైనది. ఎందుకంటే, ఫ్రీడ్‌మన్ ప్రకారం, ప్రజలు వారి ద్రవ్య నిలువలను చురుకైన, క్రియాశూన్యత నిలువలుగా విభజింపరు. ఫ్రీడ్‌మన్ వివిధ రకాల ఆస్తులను గూర్చి యోచిస్తాడు. కాని, కేవలం, బాండుల మరియు రొక్కం గూర్చి మాత్రమే ఆలోచింపడు.

ఏది ఏమైనప్పటికీ, ఫ్రీడ్‌మన్ సిద్ధాంతంపై ఈ క్రింద తెలుపబడిన విమర్శలు చేయడం జరిగింది.

a)ఫ్రీడ్‌మన్ విశ్లేషణలో ఆదాయమన్నది ఒక సంపద చలాంకం. ఈ భావన చికాగో శాస్త్రవేత్తల వ్రాతలలో నిలువ (stock), ప్రవాహం (flow) అనే భావనల మధ్య కొంత తికమకను సృష్టించింది. శాశ్వతాదాయాన్ని, గత ఆదాయం నుండి గణనం చేయడం జరిగింది. ఇది, ముందుగా ఊహించిన ఆదాయానికి దారి తీస్తుంది. ఆదాయం, సంపద, వడ్డీ రేట్ల మధ్యనున్న అంతర్గత సంబంధాల (inter-relations) దృష్ట్యా, ఇటువంటి ఆదాయ గణన ఒక సమస్యగా పరిణమిస్తుంది.

(b) ఇది, ద్రవ్యరంగంపై మాత్రమే ఆధారపడిన అసంపూర్ణ సమతౌల్య విశ్లేషణ.

(c) ఇతని సిద్ధాంతంలో, వడ్డీరేటు ఎటువంటి పాత్రను నిర్వహించదు. కొంతవరకు ఇది కేన్స్ విశ్లేషణకు వ్యతిరేకం. ఫ్రీడ్‌మన్ ద్రవ్య డిమాండును ప్రభావితం చేసే బ్యాంకేతర విత్త సంబంధ మధ్యవర్తుల (Non-Bank Financial Intermediaries) పాత్రను పరిగణనలోకి తీసుకోలేదు.

(d) ఫ్రీడ్‌మన్ దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండును అశ్రద్ధ చేసినాడు.

(e) ఇతడు భావి ధర ఏవిధంగా ఊహించబడుతుందో చూపలేక పోయినాడు.

(f) ఇతనిది కాలంతో సంబంధంలేని నిశ్చల (static) విశ్లేషణ.

పైన చెప్పబడిన విమర్శలు ఉన్నప్పటికీ, ఫ్రీడ్‌మన్ ద్రవ్య డిమాండు విశ్లేషణకు ఒక కొత్త రూపాన్ని ఇచ్చాడు. ఇంకా, ఇది చాలా కొత్త తరహా లక్షణాలను కలిగియుంది.

## 7.6 ద్రవ్య డిమాండు విశ్లేషణలో ఇటీవలి పరిణామాలు (Recent Developments in the Demand for Money Analysis)

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ద్రవ్య డిమాండు విశ్లేషణకు సంబంధించిన అనేక వివాదాస్పదమైన అంశాలను మెరుగుపరచడం జరిగింది. సిద్ధాంత పరంగా వివాదాస్పదమైన చాలా అంశాలను ప్రయోగాధారంగా (empirically) పరీక్షించడం జరిగింది. ఇటీవలి కాలంలో, ద్రవ్య డిమాండు విశ్లేషణలో, అన్నింటికన్నా ముఖ్యమైన వివాదాంశం, స్థిరత్వంతో కూడిన ద్రవ్య డిమాండు ఈ అంశం, 1970 మధ్య కాలం వరకు ప్రయోగాధార అధ్యయనాల (empirical studies) లో అత్యంత ప్రముఖ పాత్ర వహించింది. ద్రవ్య డిమాండు స్థిరత్వం

BRAOU

చాలా స్థిర ప్రయోగాధార సంబంధంగా ఉండింది. కాని, ఇప్పుడు U.S.A.,U.K. లాంటి దేశాలలో ఈ సంబంధం ప్రశ్నించబడుతుంది. ద్రవ్య సంబంధమైన సిద్ధాంతం (monetarist theory), ఆదాయ నిర్ణాయకంలో, ద్రవ్యానికి చెప్పుకోదగినంత పాత్రను ఇస్తుంది. కాబట్టి, ద్రవ్య డిమాండు స్థిరత్వం, ద్రవ్య సిద్ధాంతంలోని చాలా ప్రధానమైన భాగం. ఈ దిశలో, కార్ల్ బ్రునర్ (Karl Brunner), మెల్జర్ (Meltzer) అను అర్థశాస్త్రవేత్తలు చేసిన అధ్యయనం చాలా చెప్పుకోదగింది. ఈ అధ్యయనం ద్రవ్య డిమాండు ఫలం స్థిరంగా ఉంటుందని కనుగొన్నది. ఈ డిమాండు భవిష్యత్తులో ఏవిధంగా ఉంటుందో కూడ చెప్పవచ్చు. ద్రవ్య డిమాండు ప్రవర్తన అస్థిరంగా ఉంటుందని కీన్స్ సూచించాడు. మెల్జర్ ద్రవ్య డిమాండుకు కేవలం ఆదాయంతో కాకుండా, సంపద మొత్తంతో సంబంధాన్ని స్థాపించాడు. అతడు, ద్రవ్య డిమాండు ఎక్కువ వడ్డీ - వ్యాకోచత్వం కలిగి యుంటుందని కనుగొన్నాడు. లటానె (Latane) తన 1956 లోని ద్రవ్య డిమాండు విశ్లేషణలో, ద్రవ్య ఆదాయ నిష్పత్తికి దీర్ఘకాలిక వడ్డీరేటుతో సంబంధాన్ని స్థాపించాడు. కీన్స్ తన ద్రవ్య డిమాండును విశ్లేషించేటప్పుడు, ధరలలోని మార్పులను అశ్రద్ధ చేశాడని పాటింకన్ (Patinkin) విమర్శించాడు. పాటింకన్ ప్రకారం ధరలు పెరిగినప్పుడు, ఋణాత్మక వాస్తవిక ద్రవ్య నిలువల ప్రభావం (negative real balance effect) వలన, ద్రవ్య డిమాండు కూడ పెరుగుతుందని చెప్పాడు. ఏమైనప్పటికీ, ద్రవ్య డిమాండు విశ్లేషణలో, ముందుగానే ఊహించబడిన ద్రవ్యోల్బణ రేటు పాత్ర చెప్పుకోదగినంతగా ఉండదని రెండవ ప్రపంచ యుద్ధానంతరం కనుగొనడం జరిగింది.

ఇటీవలి కాలంలో, ద్రవ్య డిమాండు విశ్లేషణ విభిన్నమైన ముఖ్య వ్యాకోచత్వాల పరిణామాలను ఆలోచిస్తున్నది. వ్యాకోచత్వాల అధ్యయనం ప్రయోగాధార (empirical) వివాదాస్పద అంశం. ఈ సందర్భంగా, అన్నిటికన్నా ముఖ్యమైన వ్యాకోచత్వాలు వడ్డీరేటు, ధరలు ఆదాయ స్థాయిలకు సంబంధించినవని చెప్పవచ్చు. ఒకవైపు, కీన్స్ ద్రవ్య డిమాండు ఆదాయ వ్యాకోచత్వం ఒకటి కన్నా ఎక్కువ ఉంటుందని చెప్పినాడు. ఇంకొకవైపు, సంప్రదాయ వాదులు, ద్రవ్య సిద్ధాంతవాదులు (monetarists) ద్రవ్య డిమాండు ఆదాయ వ్యాకోచత్వం విలువ ఒకటిగా ఉంటుందని సూచించారు. ఒకటి కన్నా ఎక్కువ ఆదాయ వ్యాకోచత్వం కలిగియున్న ద్రవ్యాన్ని ఒక విలాస వస్తువుగా, రెండవ ప్రపంచ యుద్ధానంతర దత్తాంశాలతో నిరూపించడం చాలా కష్టమని చెప్పాలి. ఏమైనప్పటికీ, చాలా ప్రయోగాధార అధ్యయనాలచే కనుగొనబడిన విధంగా, ద్రవ్య డిమాండు వ్యాకోచత్వపు క్రిందకు కదలిక, ద్రవ్య విధానపు ప్రభావాన్ని బలపరుస్తుంది.

BRAOU

రెండవ ప్రపంచ యుద్ధానంతరం, ద్రవ్య డిమాండు విశ్లేషణ, చాలా రకాల ఆస్తులను ఉపయోగించే ప్రవృత్తి (tendency) సాక్షిగా నిలిచింది. టర్వే (Turvey) విశ్లేషణ, వివిధ రకాల ఆస్తులను గూర్చి యోచిస్తూ, ఆస్తులను అట్టిపెట్టుకొనే సాధారణీకరించిన (generalised) సిద్ధాంతాన్ని సూత్రీకరించడంపై దృష్టి కేంద్రీకరించింది. ఏది ఏమైనప్పటికీ, రెండవ ప్రపంచ యుద్ధానంతరం, ద్రవ్య డిమాండు విశ్లేషణకు సంబంధించి ప్రయోగాధార అధ్యయనాలలో నాలుగు సమస్యలను ఎదుర్కోవడం జరిగింది. మొదటిది, గుర్తింపు (identification) సమస్య. ద్రవ్య డిమాండు అనేది పరిశీలించలేని ఒక భావన. అందువలన, ద్రవ్య డిమాండుపై జరిపిన చాలా ప్రయోగాధార అధ్యయనాలు ద్రవ్య సప్లయికి సంబంధించిన దత్తాంశాలను ఉపయోగించాయి. ఈ దృక్పథం (approach) లో ఎలాంటి పొరపాటు లేదు. ఎందుకంటే, ద్రవ్య సప్లయి దాని డిమాండు చేత నిర్ణయింపబడుతుందని ప్రమేయం చేయబడింది. చాలా అధ్యయనాలు వడ్డీరేటు యొక్క స్థిరమైన ఫలం ద్రవ్య డిమాండు అని ప్రమేయం చేసినాయి. కాఫ్‌మన్, లట్టా (Kaufman & Latta) ల అధ్యయనం (1966) అభివృద్ధిచెందిన ద్రవ్య మార్కెటు కలిగిన దేశాలలో, ద్రవ్య డిమాండు ఫలం యొక్క వడ్డీ వ్యాకోచత్వం చెప్పుకోదగినంతగా ఉండదని కనుగొన్నది. అనేక అధ్యయనాలు, ద్రవ్య మార్కెటులో సమతౌల్యం ఉంటుందని ప్రమేయం చేసినాయి. రెండవది, సంప్రదాయ అంచనా పద్ధతి చే పొందిక కలిగిన ద్రవ్య డిమాండు సమీకరణంలో

ఆదాయం, వడ్డీరేటు ఆ సమీకరణానికి బాహ్యంగా నిర్ణయింపబడవలసిన అవసరం ఉన్నది. ఒకవేళ, వడ్డీరేటు అంతర్గతంగా నిర్ణయింపబడితే, సమతౌల్యం పక్షపాత ఫలితాన్నిస్తుంది. మూడవది, ద్రవ్య నిర్వచనం అనేది ద్రవ్య డిమాండు విశ్లేషణలో ఒక సమస్యగా పరిణమించింది. ఇక్కడ, ద్రవ్యాన్ని నిర్వచించుటకు ఇరుకైన (narrow), విశాలమైన (broad) రెండు నిర్వచనాలు ఉన్నవి. ఇరుకైన ద్రవ్య నిర్వచనం కేవలం కరెన్సీ, డిమాండు డిపాజిట్లను కలిగి యుంటుంది. విశాలమైన ద్రవ్య నిర్వచనం, వివిధ రకాల ఆస్తులను కూడ కలిగి యుంటుంది. కేన్స్ ద్రవ్యవాదులు (monetarists), ద్రవ్య డిమాండును, వాస్తవిక ద్రవ్య నిలువల డిమాండుగా ఆలోచిస్తారు. వారు ద్రవ్య డిమాండు యొక్క ధర వ్యాకోచత్వం ఒకటి అని ప్రమేయం చేస్తారు. ఏదేమైనప్పటికీ, ఇది పరీక్షించవలసిన ప్రతిపాదన (testable proposition). నాల్గవది, ద్రవ్య డిమాండుపై జరిగే ఇటీవలి చర్చల్లో వడ్డీరేటును గూర్చి ఒక ముఖ్యమైన ప్రశ్నను అడగడం జరిగింది. ఇక్కడ, స్వల్పకాలిక వడ్డీరేటు, దీర్ఘకాలిక వడ్డీరేటు అని రెండు రేట్లు ఉన్నాయి. ఈ రెండింటిలో దేనిని ద్రవ్య డిమాండు విశ్లేషణలో పరిగణనలోకి తీసుకోవాలి అనేది ఈ ప్రశ్న. ద్రవ్య భావన సమస్య వలెనే, ఈ సమస్య కూడ ఇంతవరకు పరిష్కరింప బడలేదు. కేన్స్ దీర్ఘకాలిక వడ్డీరేటును, ద్రవ్యాన్ని అట్టిపెట్టుకొనే ప్రత్యామ్నాయ వ్యయంగా ఆమోదించాడు. ఫ్రీడ్‌మన్ ద్రవ్య డిమాండు ఫలం అవ్యాకోచత్వంగా ఉంటుందని కనుగొన్నాడు.

ఇటీవలి ద్రవ్య డిమాండు విశ్లేషణలో పరిశీలించవలసిన ఇంకొక ముఖ్యమైన ప్రశ్న ఆదాయ భావన. శాశ్వతాదాయం (permanent income) ను ఉపయోగించవలెనా లేక సంవత్సర ఆదాయాన్ని ఉపయోగించవలెనా? గ్రే (Grey) మొదలగు వారి అధ్యయనాలలో శాశ్వతాదాయం నాసిరకం (inferior) అయినదని చూపించడం జరిగింది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో చేసిన అధ్యయనాలలో సంవత్సరాదాయం (measured income) నాసిరకమైనదని రుజువు పరచడం (confirm) జరిగింది. లేడ్లర్ (Laidler), పార్కిన్ (Parkin) చేసిన అధ్యయనంలో శాశ్వతాదాయ భావన సంవత్సరాదాయ భావన కన్నా మెరుగైనదని చూపించడం జరిగింది.

ఇంతకు ముందు సూచించినట్టుగా, స్థిరమైన ద్రవ్య డిమాండును ప్రయోగాధారంగా (empirically) కనుగొనడాన్ని చాలామంది అర్థశాస్త్రవేత్తలు సవాలు చేయడం జరిగింది. ఈ శాస్త్రవేత్తలలో ఆర్టిస్ట్ (Artist), హంబర్గర్ (Hamberger), హాకే (Hacche), మిల్లర్ (Miller) మొదలగువారు ఉన్నారు. అదే సమయంలో ఇంగ్లాండ్, అమెరికాలలో ఈ సవాలును కనుగొనవచ్చు.

ద్రవ్య డిమాండు పై U.K. లో చేయబడిన అన్ని అధ్యయనాలలో వడ్డీరేటు పాత్ర చెప్పుకోదగినదని గమనించడం జరిగింది. లేడ్లర్, పార్కిన్ (Laidler & Parkin, 1970) లు చేసిన అధ్యయనాన్ని దీనినుండి మినహాయించవచ్చు. బౌమోల్ (Baumol) నమూనాలో ద్రవ్య డిమాండు యొక్క వడ్డీ - వ్యాకోచత్వం ప్రయోగాధారంగా ధృవీకరింపబడలేదు. వడ్డీరేటుకు, ద్రవ్య డిమాండుకు మధ్య విలోమ సంబంధం అను యాదార్థ ఘటన ప్రతీచోట సుస్థాపితం కాలేదు. ఎప్పుడైతే, వడ్డీరేటు కొంతమేరకు తగ్గుతుందో ద్రవ్య డిమాండు చెప్పుకోదగినంతగా పెరుగుతుందనేది ప్రయోగాధారంగా నిరూపించడం సత్యదూరం. కేన్స్ ద్రవ్యత్వ వల పరికల్పన (liquidity trap hypothesis) ను ప్రయోగాధారంగా తిరస్కరించడం ఇటీవల కాలంలో జరిగింది. ఏమైనప్పటికీ, ద్రవ్య డిమాండు విశ్లేషణలో వడ్డీరేటును ఒక చలాంకంగా ఉపయోగించిన అధ్యయనాలలో చాలా లోపాలున్నాయి.

ఇటీవలి కాలంలో ద్రవ్య డిమాండు విశ్లేషణ అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలలో వివిధ రకాల ఆస్తులను పరిగణనలోకి తీసుకుంది. అభివృద్ధి చెందిన దేశాలలో వేసిన అంచనాల తీరులోనే, అభివృద్ధి చెందుతున్న దేశాలలో కూడ ద్రవ్య డిమాండు ఫలాల స్థిరత్వాన్ని అంచనా వేయవచ్చని కనుగొనడం

BRAOU

జరిగింది. ఈ అధ్యయనాలలో వడ్డీరేట్లకన్నా, నిజానికి ముందుగా ఊహించిన ధరల మార్పులు చాలా ముఖ్యమైనవని గుర్తించడం జరిగింది. ఆధునిక అధ్యయనాలలో ద్రవ్య మార్కెట్ల వివిధ అభివృద్ధి స్థాయిల ప్రభావం కూడా ప్రతిబింబించింది. ప్రత్యేకంగా ఆదాయ, ద్రవ్య చలామణి వేగం గూర్చి పరిశోధించిన అధ్యయనాలలో ఇది ప్రతిబింబించింది.

## 7.7 భారత దేశంలో ద్రవ్య డిమాండు - ప్రయోగాధార అంచనాలు (Demenad for Money in India - Empirical Estimates)

సమష్టి డిమాండు నిర్వహణలో ద్రవ్య వ్యవహారాల నిర్వహణ ఒక భాగమని గ్రహించాలి. ద్రవ్య మార్కెటు నుండి వస్తువుల మార్కెటులో ద్రవ్యోల్బణం లేక ఆర్థిక మాంద్య పరిస్థితులు జనించకుండా ద్రవ్య నిలువలలోని మార్పులను నిర్వహించడం ద్రవ్య వ్యవహారాల నిర్వహణ యొక్క లక్ష్యం. ఇందుకు, సాధ్యమైనంత ఎక్కువ ఉత్పత్తి వద్ద, స్థిరమైన ధరల వద్ద ద్రవ్య మార్కెటును దీర్ఘకాలిక సమతౌల్యంలో ఉంచవలసిన అవసరం ఉంది. ద్రవ్యడిమాండు ద్రవ్య వ్యవహారాల అధికారులచే నేరుగా నియంత్రించబడదు. అయినప్పటికీ, ద్రవ్య వ్యవహారాల అధికారులు, ద్రవ్య డిమాండును కొంత వరకు నియంత్రించగలరు. ఇందుకు విరుద్ధంగా, ద్రవ్య వ్యవహారాల అధికారులు ద్రవ్య సప్లయిని చాలావరకు నియంత్రించగలరు. కావున, ద్రవ్య డిమాండుకు అనుగుణంగా, ద్రవ్య సప్లయిని మార్చుతూ, ద్రవ్య మార్కెటు సమతౌల్యాన్ని చేరుకోవచ్చు. పై నియమం ప్రకారం, ద్రవ్య మార్కెటు సమతౌల్య స్థితిలో ఉందనుకుంటే, ఒక నిర్ణీత సమయంలో, ద్రవ్య డిమాండు ఏ రేటులో పెరిగితే, అదే రేటులో ద్రవ్య సప్లయి పెరగవలసిన అవసరం ఉంటుంది. ఎప్పుడైతే ఆర్థిక వ్యవస్థ సాధ్యమైనంత ఎక్కువగా వృద్ధి చెందుతుందో, అప్పుడు పై నియమం సరియైనదిగా భావించాలి.

పైన సూచించిన నియమం కింది ప్రమేయాలతో కూడి యున్నది.

(1) ద్రవ్య డిమాండు కొన్ని నిర్దిష్ట చలాంకాల స్థిరమైన ఫలం. కాబట్టి, ఈ ద్రవ్య డిమాండు ఫలంలోని భావి మార్పులను సహేతుకమైన నమ్మకంలో ఊహించి చెప్పవచ్చు.

(2) కేంద్ర బ్యాంకు అధికారులు కోరుకుంటే, వారు ద్రవ్య నిలువలలోని వాస్తవిక మార్పులను ఇరుకైన పరిమితులలో, విజయవంతంగా నియంత్రించగలరు.

ఈ సందర్భంగా, ఇక్కడ, భారత దేశానికి సంబంధించిన, శ్రేష్టమైన పొందిక గలిగిన ద్రవ్య డిమాండు యొక్క **1950-51** నుండి **1975-76** సమయ కాలానికి ప్రయోగాధారంగా వేయబడిన ఒక ప్రతిగమన సమీకరణం (regression equation) ఈ క్రింది నివేదించబడినది.

$$\text{Log}\left(\frac{M}{P}\right)^d = -1.680 + 1.019\,\text{Log}\,y - 0.119\,\text{Log}\,P - 0.026\,r_{12}$$

$$\qquad (-1.390)\quad (7.620)\qquad (-1.697)\qquad (-1.077)$$

$$\bar{R}^2 = 0.939\ ;\ d = 1.455 \qquad \ldots (i)$$

పై సమీకరణంలో, M/P = వాస్తవిక ద్రవ్య నిలువలు; Y = వాస్తవిక జాతీయాదాయం (మార్కెటు ధరలలో); P = టోకు ధర సూచీ సంఖ్య; $r_{12}$ = వాణిజ్య బ్యాంకులు టైం డిపాజిట్లపై ఇచ్చే 12 నెలల వడ్డీరేటు; $\bar{R}^2$ = నిర్ణయగుణకం (co-efficient of determination) ; d = డర్బిన్-వాట్సన్ స్టాటిస్టిక్ (Durbin-Watson statistic); బ్రాకెట్లలో నున్న అంకెలు t - విలువలను తెలుపుతాయి.

BRAOU

ద్రవ్య డిమాండు పై, ఆదాయ గుణకం (1.019) విలువ చెప్పుకోతగినంతగా ప్రభావం చూపుతుందని పై సమీకరణం ద్వారా తెలుస్తుంది. అలాకాకుండా, వడ్డీరేటు ($r_{12}$) ద్రవ్య డిమాండుపై చాలా తక్కువ ప్రభావం చూపుతున్నట్లుగా పై సమీకరణం ద్వారా తెలుస్తుంది. ధరల స్థాయి (P) ప్రభావం కూడా అంతంత మాత్రమే ఉన్నది.

పైన నివేదించబడిన ప్రతిగమన సమీకరణం (regression equation) నుండి, భారతదేశంలో ద్రవ్య డిమాండును గూర్చి ఈ క్రింది తాత్కాలిక అంశాలను రాబట్టవచ్చు.

(1) భారత దేశంలో ద్రవ్య డిమాండు ఎక్కువ స్థిరంగా ఉన్నది.

(2) వాస్తవిక ఆదాయం, ద్రవ్య డిమాండును, సంఖ్యా శాస్త్ర ఆధారంగా, చెప్పుకోదగినంతగా నిర్ణయించే చలాంకం అని చెప్పవచ్చు.

(3) ద్రవ్య డిమాండు యొక్క ఆదాయ వ్యాకోచత్వం విలువ ఒకటి లేదా దానినుండి భిన్నంగా ఉండదు.

(4) ద్రవ్యేతర ఆస్తుల (non-money assets), వడ్డీరేటు ($r_{12}$), ప్రజల వాస్తవిక ద్రవ్య డిమాండులోని మార్పులను సంఖ్యాశాస్త్ర ఆధారంగా చెప్పుకోదగినంతగా వివరించలేదు.

ఇంకా, $r_{12}$ లోని పెరుగుదలని ద్రవ్యోల్బణానికి ఆపాదించవచ్చు. ధరలు స్థిరంగా ఉంటేనే వడ్డీరేట్లు స్థిరంగా ఉంటాయని ఊహించవచ్చు. ఇది ద్రవ్య డిమాండుపై వడ్డీరేటు ప్రభావాన్ని మరింత తగ్గిస్తుంది.

పై సాక్ష్యం అభిప్రాయాలు ఒకవేళ (broadly) నిజమైతే, భారతదేశంలో ద్రవ్యాన్ని నియంత్రించే పని చాలా సులభం అవుతుంది. ధరలు స్థిరంగా ఉంటాయని అనుకొని, సామాన్య ద్రవ్య డిమాండు ఫలాన్ని ఈ క్రింది విధంగా తెలుపవచ్చు.

$$\left(\frac{M}{P}\right)^d = k.Y \qquad \ldots (ii)$$

ఇక్కడ, k=కాలం యొక్క స్థిరరాశి అని ప్రమేయం చేయబడింది. పై సమీకరణం (ii), ఒక నిర్దిష్ట సమయంలో యుక్తంగా ఉంటుందనుకొంటే, స్థిరమైన ధరల వద్ద, ద్రవ్య డిమాండు, వాస్తవిక ఆదాయంతో పాటు అనులోమానుపాతంలో పెరుగుతుంది. స్థిరమైన ధరలతో సాధ్యమైనంత ఎక్కువ ఉత్పత్తిని ఆర్థిక వ్యవస్థ లో సాధించుటకు, ఉత్పత్తి ఏ రేటులో పెరుగుతుందో, అదే రేటులో ద్రవ్య సప్లయ్ కూడా పెరగవలసి వుంటుంది. సంకేత రూపకంగా (symbolically) సామాన్య ద్రవ్య సప్లయ్ వృద్ధి నియమాన్ని ఈ క్రింది విధంగా తెలియజేయవచ్చు.

$$g_m = g_{yf} \qquad \ldots (iii)$$

ఇచ్చట, $g_m$ = ద్రవ్య సప్లయ్ వృద్ధి రేటు ; $g_{yf}$ =సంపూర్ణ ఉత్పాదకత వద్ద మున్న ఉత్పత్తి వృద్ధి రేటు.

పై సమీకరణం (iii) వాస్తవిక ద్రవ్య డిమాండుకు, వాస్తవిక ఆదాయానికి మధ్య అనులోమానుపాత సంబంధాన్ని తెలియజేస్తుంది. పై సమీకరణంలో, ద్రవ్య డిమాండు యొక్క ఆదాయ వ్యాకోచత్వం విలువ ఒకటిని ఉత్పాదిస్తుంది.

## 7.8 సారాంశం

ఈ భాగంలో కేన్సియన్ల, ఉత్తర-కేన్సియన్ల, ఫ్రీడ్‌మన్‌ల ద్రవ్య డిమాండు ఫలాలను తెలుసుకొన్నాం.

ద్రవ్య డిమాండుపై గుర్లే, షా (Gurely & Shaw)ల అభిప్రాయాలను, కేన్సియన్ల అభిప్రాయాలుగా భావించవచ్చు. గుర్లే & షా (Gurley Shaw) ల ప్రకారం, బ్యాంకేతర విత్త సంబంధ మధ్యవర్తుల (non-bank financial intermediaries)ఉనికి, ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య డిమాండు తగ్గడానికి దోహదం చేస్తుంది. వాటి ఉనికి మితిమీరిన ద్రవ్య సప్లయిని పెంచి, పరిమిత ద్రవ్య విధానాన్ని (restrictive monetary policy) పటిష్టంగా అమలు చేయకుండా అవరోధాలను సృష్టిస్తుందని గుర్లే & షా (Gurley & Shaw) లు పేర్కొన్నారు.

భౌమోల్ (Baumol) దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండుకు మూలధన సిద్ధాంత విశ్లేషణను అనుసంధించాడు. భౌమోల్ ద్రవ్య డిమాండు విశ్లేషణ ప్రకారం, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండు కూడ వడ్డీ వ్యాకోచత్వం కలిగి యుంటుంది. ఆక్షేపణీయ (critical)వడ్డీరేటుకు పై స్థాయిలోని వడ్డీరేటు వద్ద దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండురేఖ ఋణాత్మక వాలు కలిగి యుంటుంది. ఈ విధంగా, భౌమోల్ ప్రకారం, దైనందిన వ్యవహారాల ద్రవ్య డిమాండుకు, వడ్డీరేటుకు విలోమ సంబంధం ఉంటుంది.

టోబిన్ (Tobin) తన ద్రవ్య డిమాండు విశ్లేషణలో పెట్టుబడిదారుడు, తనవద్ద అట్టిపెట్టుకొనే ద్రవ్యం, బాండులను పరిగణలోకి తీసుకొంటాడు. టోబిన్ తన విశ్లేషణలో భ్రామిక ద్రవ్య డిమాండుకు, వడ్డీరేటుకు మధ్య విలోమ సంబంధాన్ని స్పష్టంగా చూపిస్తాడు. అంతేగాక పెట్టుబడిదారుడు, తన పెట్టుబడుల పట్టికలోని ద్రవ్యం, ద్రవ్యేతర ఆస్తుల మధ్య వడ్డీరేటులోని మార్పుల ఆధారంగా సమతౌల్యాన్ని ఏవిధంగా సాధిస్తాడో టోబిన్ స్పష్టంగా చూపిస్తాడు.

ఫ్రీడ్‌మన్, 1956లో సంప్రదాయ ద్రవ్య సిద్ధాంతాన్ని తిరిగి వ్యాఖ్యానించి సిద్ధాంతం ప్రాధాన్యతను పునఃస్థాపించాడు. సంప్రదాయ ద్రవ్య సిద్ధాంతాన్ని ద్రవ్య డిమాండు సిద్ధాంతంగా వ్యాఖ్యానించాడు. మూలధన సిద్ధాంతంలో, ద్రవ్య డిమాండు సిద్ధాంతం ఒక ప్రత్యేకమైన విచారణాంశమని ఫ్రీడ్‌మన్ చెప్పాడు. ద్రవ్య డిమాండు ఫలం స్థిరంగా ఉంటుందని చెప్పినాడు. ద్రవ్యాన్ని కూడా ఒక ఆస్థిగా భావించాడు. ద్రవ్య డిమాండు $Y, P, r_b, r_e, \frac{1}{P}\cdot\frac{\partial P}{\partial t}, W, U$ చలాంకాల ఫలమని సూత్రీకరించాడు. ద్రవ్యం ఆర్థిక కార్య కలాపాలను ప్రభావితం చేస్తుందని నొక్కి వక్కాణించాడు. కావున, ధరల స్థిరీకరణకు ద్రవ్య విధానాన్ని రూపొందించవలసిన అవసరం ఉందని చెప్పాడు.

భారతదేశంలో ద్రవ్యడిమాండును ప్రయోగాధారంగా 1950-51 — 1975-76 మధ్య కాలానికి, అంచనా వేయడం జరిగింది. ఈ అంచనాలో, ఆదాయ స్థాయి, ద్రవ్య డిమాండుపై చెప్పుకోదగినంత ప్రభావాన్ని కలిగియుందని నిరూపించడం జరిగింది. ద్రవ్య డిమాండుపై వడ్డీరేటుకాని, ధరల స్థాయికాని ఎక్కువగా ప్రభావం చూపలేదు. దీనిని బట్టి, ద్రవ్య సప్లయిలోని వృద్ధిరేటు ఉత్పత్తిలోని వృద్ధిరేటుతో సమానంగా ఉండాలనే నియమం ఏర్పాటు చేయడం జరిగింది.

BRAOU

## 7.9 సంప్రదింపు గ్రంథాలు


1. B.N. Ghosh & Rama Ghosh (1993), *Modern Macro Economics :* Theory & Policy, Himalaya Publishing House, Bombay.
2. S.B. Gupta (1986), *Monetary Economics,* S. Chand, Delhi.
3. S.B. Gupta (1986), *Monetary Planning for India,* Oxford University Press, Delhi.

## 7.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 40 పంక్తులలో జవాబులు రాయండి.**

1. కేన్సియను, ఉత్తర కేన్సియన్ల ద్రవ్య డిమాండు సిద్ధాంతాలను వివరించండి.
2. సంప్రదాయ ద్రవ్య సిద్ధాంతాన్ని ఫ్రీడ్‌మన్ ఏవిధంగా మెరుగుపరచినాడు?

**II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 20 పంక్తులలో జవాబులు రాయండి.**

1. ద్రవ్య డిమాండుపై గుర్లే, షాల అభిప్రాయాలను తెలుపండి.
2. టోబిన్ పెట్టుబడుల పట్టిక నమూనా గూర్చి వివరింపండి.
3. ఫ్రీడ్‌మన్ ద్రవ్య డిమాండు ఫలాన్ని విమర్శనాత్మకంగా మదింపు చేయండి.
4. భారతదేశంలో ద్రవ్య డిమాండుపై ప్రయోగాధార అంచనాలు ఏవిధంగా ఉన్నాయి ?

## 7.11 పదకోశం

| | | |
|---|---|---|
| Technologically | = | సాంకేతికపరంగా |
| Dichotomy | = | ద్వైవిధ్యం |
| Approach | = | దృక్కోణం; దృక్పథం |
| Fit | = | అమర్చుట, పొందిక |
| Hypothesis | = | పరికల్పన |
| Permanent income | = | శాశ్వతాదాయం |
| Measured income | = | లెక్కింపబడిన ఆదాయం లేదా సాంవత్సరిక ఆదాయం |
| Significant | = | సార్థకమైన |
| Portfolio | = | పెట్టుబడుల పట్టిక |
| Velocity | = | చలామణి వేగం |
| Accumulation | = | సంచయనం |
| Accumulate | = | ప్రోగు చేయుట, సంకలనం చేయుట |
| Positive | = | ధనాత్మక |
| Negative | = | ఋణాత్మక |
| Opportunity cost | = | అవకాశ వ్యయం,ప్రత్యామ్నాయ వ్యయం |
| Liquidity trap | = | ద్రవ్యత్వ వల |
| Index | = | సూచిక |

BRAOU

| | | |
|---|---|---|
| Critical | = | ఆక్షేపణీయ |
| Optimum | = | అభిలషణీయ |
| Differentiate | = | అవకలనం చేయు |
| Empirically | = | ప్రయోగాధారంగా |
| Diversify | = | భిన్నత నాపాదించుట |
| Probability distribution | = | సంభావ్యతా పంపిణీ |
| Subjective estimate | = | ఆత్మాశ్రయ అంచనా |
| Relevant | = | సంగతం |
| Vertical axis | = | లంబంగా నున్న అక్షం |
| Horizontal axis | = | సమతలంగా నున్న అక్షం |
| Indifference curve | = | ఉదాసీనతా వక్రరేఖ |
| Opposite | = | వ్యతిరిక్తం, వ్యతిరేకం |
| Human wealth | = | మనుష్య సంపద |
| Conceptual integration | = | భావనాత్మక సమగ్రం |
| Static | = | నిశ్చలమైన |
| Proposition | = | ప్రతిపాదన |
| Regression equation | = | ప్రతిగమన సమీకరణం |
| Presence | = | ఉనికి |
| Depositors | = | ధరావత్తుదారులు |
| Non-bank financial intermediaries | = | బ్యాంకేతర విత్త సంబంధ మధ్యవర్తులు |
| Under-employment | = | అల్పోద్యోగిత |
| Equilibrium | = | సమతౌల్యం |
| Replacement | = | పున : స్థాపన |
| Restrictive | = | పరిమితమైన |
| Symbolically | = | సంకేత రూపంగా |

-డా ॥ ఎస్. సుధాకర్

BRAOU

# ఖండం - III

## ద్రవ్యం : సమస్యలు, దృక్పథాలు

ఈ ఖండంలో ద్రవ్యానికి సంబంధించిన వివిధ సమస్యలను, వివిధ దృక్పథాలను చర్చించడం జరిగింది. భాగం-8లో విత్త వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ద్రవ్యం ఏ విధంగా దోహదపడుతున్నదో తెలుసుకొంటారు. వివిధ స్థూల ఆర్థిక చలాంక రాశులపై ద్రవ్య సప్లయ్‌లోని మార్పులు ఏవిధంగా ప్రభావం చూపుతాయో భాగం -9 అధ్యయనం చేస్తుంది. ద్రవ్యోల్బణ రకాలను, ద్రవ్యోల్బణానికి గల కారణాలను, ద్రవ్యోల్బణ ప్రభావాలను భాగం -10లో చర్చించడం జరిగింది. ధరల సూచీ సంఖ్యలను గణించే పద్ధతులను, ఇమిడివున్న సమస్యలను భాగం-11లో వివరించాం. కేన్స్‌పరమైన వాదాన్ని, ద్రవ్య వాదాన్ని భాగం -12లో చర్చించాం. ఇక చివరిదైన భాగం-13లో హేతువాద అంచనాల పరికల్పనను తెలుసుకుందాం.

ఈ ఖండంలో గల ఆరు భాగాలు

భాగం - 8 : ద్రవ్యం - విత్తాభివృద్ధి

భాగం - 9 : ప్రసార యంత్రాంగం

భాగం -10 : ద్రవ్యోల్బణం : సిద్ధాంతాలు, కారణాలు, ప్రభావాలు

భాగం - 11 : సాధారణ ధరల స్థాయి గణన

భాగం - 12 : కేన్స్ పరమైన వాదం, ద్రవ్య వాదం

భాగం - 13 : హేతుబద్ధ అంచనాల పరికల్పన

B R A O U

BRAOU

# భాగం - 8 : ద్రవ్యం - విత్తాభివృద్ధి

విషయ క్రమం


8.0 ఉద్దేశం

8.1 పరిచయం

8.2 ద్రవ్యం : పరిణామ క్రమం, ప్రధాన విధులు

8.2.1 ద్రవ్య పరిణామ క్రమం

8.2.2 ద్రవ్యం ప్రధాన విధులు

8.3 ద్రవ్యం - సమీప ద్రవ్యం

8.4 ద్రవ్య సరఫరా

8.4.1 ద్రవ్య సరఫరా భాగాలు

8.4.2 ద్రవ్య సరఫరాను నిర్ణయించు అంశాలు

8.4.3 భారత దేశంలో ద్రవ్య సరఫరా

8.4.4 బాంకుల ద్రవ్య సృష్టి : ద్రవ్య గుణకం

8.5 ఆర్థికాభివృద్ధిలో విత్త సంబంధమైన మార్కెట్ల పాత్ర

8.6 భారతదేశంలో విత్త మార్కెట్లు

8.6.1 విత్త అభివృద్ధిలో వివిధ దశలు

8.6.2 సరళీకృత విధాన చర్యలు

8.7 ద్రవ్యం - ఆర్థికాభివృద్ధి

8.8 సారాంశం

8.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

8.10 సంప్రదింపు గ్రంథాలు

8.11 పదకోశం


BRAOU

## 8.0 ఉద్దేశం

విత్త మార్కెట్ల అభివృద్ధికి, ఆర్థికాభివృద్ధికి ద్రవ్యం ఏవిధంగా దోహదం చేస్తుందో చర్చించడమే ఈ పాఠం ప్రధాన ఉద్దేశం. ద్రవ్యం గురించి ఇంతకు క్రితమే వివిధ పాఠాలలో వివరంగా చర్చించినప్పటికీ ఈ పాఠంలో మొదట ద్రవ్య పరిణామ క్రమాన్ని, ద్రవ్య ప్రధాన విధులను, ద్రవ్య సరఫరా భాగాలను సంక్షిప్తంగా తెలుసుకొందాం.

## 8.1 పరిచయం

వినిమయ మాధ్యమంగా గాని లేక విలువ కొలమానంగా గాని ఉపయోగపడు ఏవస్తువునైనా సాధారణ పరిభాషలో ద్రవ్యంగా నిర్వచించవచ్చు. ద్రవ్యం విలువ కొలమానంగా ఉండటం వల్లనే ఏ వస్తువుకైనా ధర నిర్ణయింపబడుతుంది. ద్రవ్యం ఒక కొలబద్ద వంటిది. దాని సహాయంతో వస్తువుల, సేవల విలువలను కొలవవచ్చు లేక పోల్చవచ్చు. ద్రవ్యం వస్తు సేవల మార్పిడిని సులభతరం చేస్తుంది. ద్రవ్యం వాడుకలో లేనట్లయితే, మనం తయారుచేసిన వస్తువులను తీసుకొని, మనకు కావలసిన వస్తువులను యిచ్చే వ్యక్తులను వెదకడం కొరకే రోజులో ఎక్కువ భాగం వెచ్చించవలసి వచ్చేది. అందరూ ఒకే రకమైన తిండిని తిని, ఒకే రకమైన బట్టను ధరించి, ఒకే రకమైన కార్యకలాపాలలో నిమగ్నమై వుండే అతి సామాన్యమైన సమాజంలో ఇటువంటి వస్తుమార్పిడి విధానం సంతృప్తికరంగా ఉండవచ్చు. అయితే ప్రస్తుతం మనం ఒక నాగరిక సమాజంలో వుంటున్నాం. నేటి సమాజంలో నివసించే వ్యక్తి అనేక కోర్కెలను, అవసరాలను కలిగి వున్నాడు. ఆ కోర్కెలన్నీ తీర్చుకోవడానికి అతడు అనేక వస్తువులను, సేవలను వినియోగించుకొంటాడు. కాబట్టి పరిమిత వస్తువులు కలిగివుంటే వస్తుమార్పిడి విధానం అసౌకర్యంగా ఉంటుంది. తయారైన వస్తువులు అవసరం ఉండవచ్చు, ఉండకపోవచ్చు. అంతేకాక ఈ విధానంలో ఎక్కువ సమయాన్ని వెచ్చించవలసిన అవసరం కూడా వుంది. కాబట్టి వస్తుమార్పిడి విధానం నాగరిక సమాజానికి అనువైంది కాదని భావింపబడుతుంది.

ద్రవ్యం సహాయంతో ప్రతివ్యక్తి తనకు కావలసిన వస్తువులు, సేవలు సులభంగా పొందవచ్చు. కాబట్టి ద్రవ్యం ప్రతి ఒక్కరికీ అవసరమైనది. సరిపడినంత ద్రవ్యం ఒక వ్యక్తి దగ్గర ఉన్నట్లయితే అతడు ఏవిధమైన వృత్తిని చేపట్టవలసిన అవసరం లేదు. అతడు ఆర్థిక వ్యవహారాలను నియంత్రించటమే కాక ఆర్థికాభివృద్ధికి కూడా సహకరిస్తాడు. వస్తుమార్పిడి విధానం నుండి ఆధునిక ద్రవ్యం వరకు కల పరిణామ క్రమంలో ద్రవ్యం అనేక రూపాంతరాలు చెంది, చివరకు పరపతి మరియు కంప్యూటర్ పరపతి విధానం వరకు అభివృద్ధి చెంది, అతి విశాలంగా విస్తరించింది. ద్రవ్య మార్కెట్, మూలధన మార్కెట్, సెక్యూరిటీ (హామీ) మార్కెట్, విదేశీ మారక ద్రవ్య మార్కెట్ మొదలగు రకాలుగా వ్యాప్తి చెందింది. విత్తాభివృద్ధి ఒకదేశ ఆర్థికాభివృద్ధి స్థాయిని ప్రతిబింబిస్తుంది.

## 8.2 ద్రవ్యం : పరిణామ క్రమం, ప్రధాన విధులు

### 8.2.1 ద్రవ్య పరిణామ క్రమం

మన దైనందిన జీవితంలో ద్రవ్యానికి ఎంత ప్రాముఖ్యం వుందంటే, ద్రవ్యం అంటే ఏమిటో తెలుసుకోకుండానే దానిని సంపాదించటానికి నిరంతరం కృషి చేస్తుంటాం. ప్రస్తుతం అమలులో ఉన్న విత్త విధానం హఠాత్తుగా ఒక్కరోజులోనే అభివృద్ధి చెందినది కాదు. ద్రవ్య వినిమయ క్రమంలో మానవ సమాజం మొట్టమొదట వస్తుమార్పిడి విధానంతో ప్రారంభమై వస్తు ద్రవ్యం (commodity money), కాగితపు ద్రవ్యం (paper money), బ్యాంకు ద్రవ్యంగా రూపాంతరం చెందింది. నేడు మనం వాడుతున్న ద్రవ్యం ద్రవ్య పరిణామ క్రమంలో అనేక మార్పులు చెందిన తరువాతనే ప్రస్తుత రూపంలోకి వచ్చింది. ఈ పరిణామ క్రమంలోని వివిధ దశలను మొదటి పాఠంలోనే చర్చించుకోవడం జరిగింది. అయినప్పటికీ ఈ పాఠ్యాంశాన్ని దృష్టిలో పెట్టుకొని వాటి గురించి ఇక్కడ ఇంకొకసారి సంక్షిప్తంగా తెలుసుకొందాం.

**వస్తు మార్పిడి విధానం** : పురాతన సాంప్రదాయంలో వస్తువులను ఇతర వస్తువులతో మార్పిడి చేసుకొనే వారు. వారికి ఏరకమైన ద్రవ్యం లేదు. అయితే వారు వస్తువులను మరొక వస్తువుతో మార్పిడి చేసేవారే గాని ఒక వస్తువును వినిమయ మాధ్యమంగా వాడేవారు కాదు. ఈ విధానం ఎంతో కష్టంతో కూడుకొన్నది. ఒక వ్యక్తి తన వృత్తిలో ఎంతో నైపుణ్యం కలిగి వుండి, వస్తువులను ఉత్పత్తి చేసినపుడే వస్తుమార్పిడి విధానం విజయవంతమవుతుంది. అందుచేత ఈ విధానంలో ప్రతివ్యక్తి తన రంగంలో మంచి నిపుణుడవుతాడు. పెద్ద మొత్తంలో శ్రమ విభజనను అమలు చేయాలన్నా ఒక నవకల్పన అనగా ద్రవ్యం అవసరమవుతుంది. అంతేకాక, ఒక వస్తువును మరొక వస్తువుతో, ఒక సేవను మరొక సేవతో మార్పిడి చేసుకోవటం నాగరిక సమాజంలో అసాధ్యం. ఆ విధానం నాగరికత అభివృద్ధి చెందుతున్న తొలిరోజులకు మాత్రమే పరిమితమని చెప్పవచ్చు. వస్తు మార్పిడి విధానంలో సమయం, వస్తువులు, సేవలు వ్యర్థమైపోవడం జరుగుతుంది. నశ్వర వస్తువుల విషయంలో నష్టం యింకా ఎక్కువగా ఉంటుంది. సేవల విషయానికొస్తే, దీర్ఘకాలిక నిరుద్యోగం మరియు తక్కువ వేతనాలు ఉంటాయి. వీటితో బాటు యింకా ఎన్నో కష్టాలు ఉండటం వలన ఈ వస్తుమార్పిడి విధానం త్వరలోనే అంతరించిపోయి, దాని స్థానంలో వస్తు ద్రవ్యం చోటు చేసుకొంది.

**వస్తు ద్రవ్యం (Commodity Money)**: కొన్ని సాంప్రదాయ సమాజాలు ద్రవ్యంగా వాడడానికి వస్తువులను కనుగొనడం జరిగింది. "మానవుని అవసరమే అతనిని అన్వేషణకు పురికొల్పుతుంది" అనే నానుడి ఉంది. అదే ద్రవ్యం విషయంలో కూడా జరిగింది. వస్తు మార్పిడి విధానంలోని లోపాలను సవరించడానికి వస్తు ద్రవ్యం కనుక్కోబడింది. వస్తు ద్రవ్య విధానంలో అరుదైన వస్తువులు ద్రవ్యంగా చెలామణిలోకి వచ్చి ద్రవ్య విధులను నిర్వహించడం జరిగింది. వస్తు ద్రవ్యంలో ప్రధానంగా రాగి, ఇనుము, వెండి, బంగారం, వజ్రాలు మొదలగు వస్తువులు ఉండేవి. అంతేగాక ఒక్కొక్కసారి కొరతగా వున్న వస్తువులు కూడా ద్రవ్యంగా చెలామణి అయ్యేవి. ఉదాహరణకు, నూనె, సిగరెట్లు, పొగాకు, మత్తు పానీయాలు, జంతువులు మొదలగునవి ద్రవ్యానికి ప్రత్యామ్నాయంగా వచ్చాయి. వీటిలో జంతువులు ద్రవ్యంగా చెలామణి అయ్యేవి. కాని జంతువులను చిన్న చిన్న భాగాలుగా విభజించుటకు సాధ్యమయ్యేది కాదు. మత్తు పానీయాలు ద్రవ్యంగా చెలామణి అయ్యేవి గాని, కొంత కాలానికి చెడిపోయేవి. నూనెలు ద్రవ్యంగా చెలామణి అవుతూ వినిమయ మాధ్యమంగా ఉన్నా వాటిని ఒకచోట నుండి మరొక చోటికి తమతో బాటు తీసుకొని పోవడం కష్టంగా వుండేది. సిగరెట్ల విషయానికొస్తే అవి జైలు జీవితం అనుభవించే ప్రజలకు ద్రవ్యంగా ఉపయోగపడేవి కాని సమాజంలో నివశించే ప్రజలకు కాదు. కాబట్టి పైన తెలిపిన వస్తువులన్నీ ద్రవ్యంగా ఉండటం వల్ల చాలా ఇబ్బందులు వచ్చాయి. అందుచేత 19వ శతాబ్దం నాటికి వస్తు ద్రవ్యం కేవలం లోహాలకు మాత్రమే పరిమితమై పోయింది. వెండి ద్రవ్యంగా ఉండటం మంచిదే కాని కొంతకాలానికి వెండి మెరుపు పోయి, కాంతి విహీనం అవుతుంది. బంగారానికి బదులు వేరే లోహాన్ని ఉపయోగించినపుడు, బంగారానికున్న అధిక విశిష్ఠ గురుత్వం వల్ల అనుకరణలను సులభంగా గుర్తించవచ్చు. అయినప్పటికీ అధిక మొత్తంలో బంగారాన్ని మార్పిడి చేయటం కష్టమైపోయింది. అందుచేత వస్తు ద్రవ్యం స్థానంలో మరొక రకమైన ద్రవ్యం యొక్క అవసరత ఏర్పడింది.

**కాగితపు ద్రవ్యం (Paper Money)** : వస్తు ద్రవ్యంలోని లోపాలను సవరించడానికి కాగితపు ద్రవ్యం అమలులోకి వచ్చింది. "ద్రవ్యం ఒకవస్తువుగా ఉండటం కన్నా ద్రవ్యంగానే ఉండాలి. ద్రవ్యం దాని స్వప్రయోజనం కొరకు కాక దాని ద్వారా వస్తువులు, సేవలు కొనుటకు అనుకూలంగా ఉండాలి." ఆస్థిలో ద్రవ్యం ఎక్కువగా ఉండటం ఒక కృత్రిమమైన, సాంఘిక ఒడంబడికగా రూపొందింది. అందరి ఒప్పందం మీద ద్రవ్యం ద్రవ్యంగా అంగీకరించబడింది. కాగితపు ద్రవ్యాన్ని ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తీసుకొనిపోవడం, వినిమయ

BRAOU

మాధ్యమంగా ఉపయోగించుకోవటం చాలా సులభమైపోవటం వల్ల కాగితపు ద్రవ్య ఉపయోగం బాగా పెంపొంది, ప్రజాదరణ పొందింది. కాగితపు ద్రవ్యాన్ని ప్రతి ఒక్కరూ ముద్రించడం అసాధ్యం. అంతేకాక ఈ ద్రవ్యాన్ని ఏ ఒక్క వ్యక్తి లేక సంస్థ నియంత్రించడం కష్టం. భారతదేశంలో కాగితపు ద్రవ్యం, నాణేలు ప్రభుత్వం చేత, భారతీయ రిజర్వు బ్యాంకు చేత ముద్రించబడతాయి.

**బ్యాంకు ద్రవ్యం (Bank Money):** నేడు మనం బ్యాంకు ద్రవ్య యుగంలో ఉన్నాం. ఈ విధానంలో బ్యాంకుల ద్వారా జారీచేయబడుతున్న చెక్కులు, ఇతర సంప్రదింపుల సాధనాలు ద్రవ్యంగా చెలామణి అవుతున్నాయి. ప్రస్తుతం ఉద్యోగస్థులు కూడా తమ జీత భత్యాలను బ్యాంకు ద్వారానే పొందుతున్నారు. మనం చెల్లించే అద్దెలు, టెలిఫోన్ బిల్లులు, వినియోగ వస్తువుల కొనుగోలు మొదలైన వాటిని కూడా బ్యాంకు చెక్కుల రూపంలోనే చెల్లిస్తున్నాం. చిన్న చిన్న చిల్లర ఖర్చులు మినహా మిగిలిన వినియోగమంతా చెక్కుల ద్వారానే జరుగుతుంది. కేవలం కూరగాయలు, లాండ్రి, సినిమా ఖర్చులకు తప్ప వారివద్ద ఎక్కువ ద్రవ్యం (నగదు) ఉండనవసరం లేదు. అనేక కుటుంబాల్లో క్రెడిట్ కార్డులు, ప్రయాణీకుల చెక్కులు (travellors cheques) విరివిగా ఉపయోగిస్తున్నారు. సమీప భవిష్యత్తులో దాదాపు అందరు పౌరులు బ్యాంకు ద్రవ్య సహాయంతోనే తమ ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించుకొనే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతి రంగంలో కంప్యూటర్లు ప్రవేశ పెట్టబడటం వల్ల ఇది అంత కష్టసాధ్యం కాదని చెప్పవచ్చు.

### 8.2.2 ద్రవ్యం - విధులు

మన దైనందిన జీవితంలో కోర్కెలను తీర్చుకోవడానికి ద్రవ్యం ముఖ్యంగా ఉపయోగ పడుతుంది. ఇది ద్రవ్యం నిర్వహించే నాలుగు ప్రాథమిక విధుల్లో ఒకటి మాత్రమే. అంటే ద్రవ్యం కొన్ని ప్రత్యేక విధులను కలిగి వుంది. అవి :

1. చెల్లింపు సాధనం (లేక వినిమయ మాధ్యమం)
2. విలువల కొలమానం
3. వాయిదా చెల్లింపుల ప్రమాణం
4. విలువల నిధి.

B R A O U

వీటిని విపులంగా పరిశీలించడం ఎంతో అవసరం.

**(a) చెల్లింపు సాధనం లేక వినిమయ మాధ్యమం :** అనేక రకాలైన కొనుగోలులకు, అమ్మకాలకు ద్రవ్యం మధ్యవర్తిగా ఉండటం వలన ద్రవ్యాన్ని అమ్మకందారులు కొనుగోలుదారుల నుండి ధరగా పొందుతున్నారు. కొన్ని సందర్భాలలో వస్తు మార్పిడి విధానాన్ని అనుసరించనప్పటికీ, ద్రవ్యాన్ని మాత్రమే చెలామణి సాధనంగా వాడుతున్నారు. ద్రవ్య వినియోగంలో పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండటం వల్ల ఎక్కువ సందర్భాలలో ఇది అనుకూలమైన వినిమయ సాధనంగా ఉపయోగపడుతుంది. మనం ఏదైనా ఒక వస్తువును కొనుగోలు చేయాలని తలంచినట్లయితే, మన దగ్గర తగినంత ద్రవ్యం ఉంటే, మనం కోరిన వస్తువును ఆ ద్రవ్యం సహాయంతో పొందవచ్చు. ప్రజలు సాధారణంగా చెల్లింపులను ఒక వస్తువు రూపంలో కన్న ద్రవ్యం రూపంలో పొందడానికే ఇష్టపడతారు. ఎందుకంటే ఇతరుల నుండి చెల్లింపుగా వస్తువును పొందినట్లయితే ఆ వస్తువుతో మనకు అవసరం లేనపుడు దానిని యితర వస్తువులతో మార్పిడి చేసుకోవలసి ఉంటుంది. దానివలన అనేక ఇబ్బందులు ఉంటాయి కాబట్టి ద్రవ్యాన్ని మాత్రమే కోరుతారు. అంతేకాక ద్రవ్యంతో తమకు కావలసిన వస్తువులు లేక సేవలను ప్రత్యక్షంగా పొందవచ్చు.

**b) విలువల లేక మూల్య కొలమానం**

వస్తు మార్పిడిలో ఏ వస్తువుకూ ధర నిర్ణయింపబడి ఉండదు. ఒక వస్తువును మరొక వస్తువుతో మార్పిడి చేసుకోవడం వల్ల వస్తువుకు ధర ఉండవలసిన అవసరం కూడా లేదు. ప్రస్తుత ద్రవ్య విధానంలో ప్రతి వస్తువు ఒక ధరను కలిగి ఉంటుంది. ధరను కలిగివున్న వస్తువును మార్పిడి చేసుకోవడం ఎంతో తేలిక. అంతేకాక సమయం కూడా ఆదా అవుతుంది. ఉదాహరణకు ద్రవ్యం ఆచరణలో లేకపోతే ఒక దుప్పటి ఎన్ని గ్రుడ్ల విలువ చేస్తుందో చెప్పటం చాలా కష్టం. అందుచేత వస్తువు విలువను లేక ధర నిర్ణయించడానికి ద్రవ్యం అవసరం. ద్రవ్యం విలువల కొలమానంగా పనిచేయడం వల్లనే ఒక వస్తువు ధరను చెల్లించి, దానిని పొంది, మన కోరికలను తీర్చుకోగలుగుతున్నాం. ద్రవ్యం ఒక సాధారణ ప్రమాణంగా ఉండి అన్ని వ్యాపార వ్యవహారాలను నిర్వహించు సాధనంగా ఉపయోగపడుతుంది. ద్రవ్యం విలువ ద్వారానే స్థిరాస్థులు, ఉత్పత్తి సాధనాలైన యంత్రాలు మొదలైన వాటిని కొనుగోలు చేయగలుగుతున్నాం. ద్రవ్యం విలువ ద్వారానే ఒక సంస్థయొక్క ధరను నిర్ణయించగలుగుతున్నాం. ప్రజలు ద్రవ్యం విలువను ఒప్పుకోనట్లయితే, ఒక వస్తువు ధర ఇంత అని కచ్చితంగా చెప్పటం అసంభవం.

ద్రవ్యం విలువల కొలమానంగా ఉపయోగపడాలంటే ఒక స్థిరమైన కొనుగోలు శక్తిని కలిగి ఉండాలి. మనం ఒక రూపాయి విలువను సమ్మతించక పోయినట్లయితే విలువల కొలమానంగా దాని ఉపయోగం తగ్గుతుంది. వాస్తవిక ప్రపంచంలో ద్రవ్యం విలువ స్థిరంగా ఉండటం కష్టం. ద్రవ్యం విలువ అది దేనినైతే కొనుగోలు చేయగలదో దానిపై ఆధారపడి ఉంటుంది. వస్తువుల ధరలు స్థిరంగా ఉండక పెరుగుతూ తగ్గుతూ ఉంటాయి. కాబట్టి ద్రవ్యం విలువ కూడా మార్పు చెందుతూ ఉంటుంది. ద్రవ్యం విలువలో సంభవించే మార్పు వస్తువు ధరలలో సంభవించే మార్పు యొక్క సగటుతో సత్సంబంధాన్ని కలిగి ఉంటుంది. కొన్ని వస్తువుల ధరలు త్వరగా పెరుగుతూ ఉంటాయి. కొన్ని వస్తువుల ధరలు స్థిరంగా ఉంటాయి, మరికొన్ని వస్తువుల ధరలు తగ్గుతూ ఉంటాయి. అయినప్పటికీ ఆర్థిక వ్యవస్థలో వస్తువుల ధరలలో సగటు మార్పును మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది.

**c) వాయిదా చెల్లింపుల ప్రమాణం**

ద్రవ్యం ఒక వస్తువు యొక్క ప్రస్తుత విలువను నిర్ణయించడానికే కాక భవిష్యత్తులో దాని ధరను నిర్ణయించడానికి కూడా ఉపయోగపడుతుంది. ద్రవ్యం వాయిదా చెల్లింపులకు ప్రమాణంగా ఉంటుంది. ఒక వ్యక్తికి సంబంధించిన ఆస్థి, అద్దె వ్యవహారాలు, జీతపు ఒడంబడికలు, ప్రకృతి వనరుల అమ్మకం, కొనుగోలు హక్కులు మొదలైనవి భవిష్యత్తులో ఎలా ఉంటాయో ప్రస్తుత ధరల సహాయంతో ద్రవ్యం నిర్ణయిస్తుంది. ఈ విధంగా ద్రవ్యం వాయిదా చెల్లింపులకు ప్రమాణంగా ఉండటం వలన, ద్రవ్యం విలువలో వచ్చే మార్పుల వలన, ధరలు పెరగడం లేదా తరగడం వలన కొంత మంది లాభం పొందడం, మరి కొందరు నష్ట పోవడం జరుగుతుంది.

వస్తువుల ధరలు పెరగడం వలన ద్రవ్యం విలువ తగ్గిపోతుంది. దీని వలన ఏ వ్యక్తి అయినా భవిష్యత్తులో తాను ద్రవ్యాన్ని వాయిదాల రూపంలో చెల్లించడానికి ఒప్పుకుంటే, అది అతనికి లాభకరంగా ఉంటుంది. ఒక వ్యక్తి మరొక వ్యక్తికి పది సంవత్సరాల తరువాత రూ. 1000 చెల్లించడానికి ఒప్పుకొన్నట్లయితే, అతడు పది సంవత్సరాల తర్వాత వాస్తవంగా చెల్లించు మొత్తం తక్కువగానే ఉంటుంది. ఎందుకంటే ఈ పది సంవత్సరాల కాలంలో వస్తువుల ధరలు పెరగడం వల్ల అతడు ద్రవ్య రూపంలో చెల్లించే రూ. 1000 విలువ తక్కువగా ఉంటుంది. దీని వలన అప్పు చేసినవాడు లాభం పొందగా అప్పు ఇచ్చినవాడు నష్టపోతాడు. ఆధునిక కాలంలో ధరలు

BRAOU

క్రమంగా పెరగడం మనం చూస్తున్నాం. కాబట్టి వాయిదా చెల్లింపుల వలన చెల్లించే మొత్తం తక్కువగానే వుంటుంది. ఈ విధంగా వచ్చే నష్టాలను పూరించడానికి బ్యాంకులు అప్పులు తీసుకొన్న వారిపై విధించిన వడ్డీరేటును పెంచి, తద్వారా మిగిలిన మొత్తాన్ని రాబట్టుకొంటాయి. రూపాయి విలువను స్థిరంగా ఉంచి వాటి స్వలాభాల కోసం స్థిరమైన ద్రవ్య విధానాన్ని ఏర్పరచడానికి బ్యాంకులు కృషి చేస్తున్నాయి.

**d) విలువల (లేక మూల్య) నిధి**

ద్రవ్యం మూల్య నిధిగా ఉపయోగపడుతుంది. అంటే ద్రవ్య రూపంలో సంపదను నిల్వచేసుకోవచ్చు. అయితే ఈ విధానంలో లాభాలతోపాటు నష్టాలు కూడా ఉన్నాయి. ఎందుకంటే ఈ పద్ధతిలో సంపదను ద్రవ్యత్వంగా మదుపు చేయవలసి ఉంటుంది. ద్రవ్యత్వం అంటే ఒక సంపదను ఏ విధమైన కాలయాపన లేకుండా ఏదైనా ఇతర విలువలోకి మార్చుకొనే వీలు కలిగి ఉండటం. కాబట్టి ద్రవ్యం సహాయంతో చాలా సులభంగా నిధులను విలువ రూపంలో దాచుకొనవచ్చు. అంతేకాక అవసరాన్ని బట్టి అవసరమైన విధంగా దాన్ని మార్చుకోడానికి వీలుంటుంది.

అప్పులవైపు నుండి ద్రవ్యాన్ని చూస్తే విడిగా ఉండే ద్రవ్యం దొంగలను ఆకర్షిస్తుంది. ద్రవ్యాన్ని నగదు పరిశీలన అకౌంట్‌లో ఉంచుట వలన ఏవిధమైన వడ్డీని బ్యాంకు చెల్లించకపోవటం మరొక నష్టం. సంపదను ద్రవ్యం రూపంలో ఉంచుకోవాలంటే కొంత ఆదాయాన్ని తప్పక త్యాగం చెయ్యవలసి ఉంటుంది. పొదుపు ఖాతాలు, బాండ్లు, ద్రవ్యం కన్నా తక్కువ ద్రవ్యత్వాభిరుచి కలిగి ఉంటాయి. ఎందుకంటే, పొదుపు ఖాతాలను, బాండ్లను మొదట ద్రవ్య రూపంలోకి మార్చుకొని ఆ తరువాత మాత్రమే అవసరాలకు వినియోగించుకోవడం జరుగుతుంది. పైన తెలిపిన రెండూ ఖాతాదారునికి కొంత వడ్డీని సంపాదిస్తాయి. ఈ వడ్డీని ఖాతాదారుడు ద్రవ్యత్వాభిరుచిని త్యాగం చేసినందుకు లభించే ప్రతిఫలంగా చెప్పవచ్చు.

## 8.3 ద్రవ్యం - సమీప ద్రవ్యం

కచ్చితంగా ఏది ద్రవ్యమో ఏది కాదో చెప్పటం అంత సులభమైన విషయం కాదు. కొంత మంది ఆర్థిక శాస్త్రవేత్తలు కొన్ని రకాలైన ఆస్తులను ద్రవ్యంగా పరిగణించవచ్చని భావించారు. కానీ వీరు తాము అంగీకరించిన ఆస్తులు తప్ప మిగిలిన ఆస్తులను ద్రవ్యంగా గుర్తించడానికి ఒప్పుకోలేదు. ఆర్థిక శాస్త్రవేత్తలు ద్రవ్యాన్ని గురించి చర్చించే సందర్భంలో అనేకమంది ఆర్థిక శాస్త్రవేత్తలు రెండు రకాలను ప్రధానంగా ఆమోదించారు. అవి : (1) ద్రవ్యం, (2) సమీప ద్రవ్యం. సాధారణంగా నాణేలు, కరేన్సీ నోట్లు, డిమాండ్ డిపాజిట్లు మొదలైన వాటిని ద్రవ్యంగా భావించవచ్చు. ఎందుకంటే ఈ రకమైన ద్రవ్యం ద్రవ్య విధులన్నింటినీ నెరవేరుస్తుంది. ప్రధానంగా ఈ ద్రవ్యం వాయిదా చెల్లింపులకు ప్రమాణంగా ఒప్పుకొనబడుతుంది. ఈ ద్రవ్యాన్ని సులభంగా మార్చుకోవడానికి వీలుంటుంది. ఈ తరగతికి చెందిన ద్రవ్యాన్ని $M_1$ ద్రవ్యం అంటారు. కొన్ని రకాలైన ఆస్తులు మన ఇష్టం వచ్చిన రూపంలోకి వెంటనే మార్చుకొనే వీలుండదు. ఆ విధమైన ఆస్తులను ద్రవ్యం యొక్క విశాల నిర్వచనంలోకి చేర్చవచ్చు. కాని, అది నిజమైన ద్రవ్యం కాదు. అటువంటి ద్రవ్యాన్ని లేక ఆస్తులను సమీప ద్రవ్యం అంటారు.

కొన్ని విత్త సంబంధమైన ఆస్తులు ఎక్కువ ద్రవ్యత్వం కలిగి ఉండి, సులభంగా ద్రవ్యంలోకి మార్చుకోవడానికి అవకాశం కలిగి ఉంటాయి. ఈవిధమైన ఆస్తులను 'సమీప ద్రవ్యం' అంటారు. ప్రభుత్వ బాండ్లు, బ్యాంకులు, ఇతర సంస్థల ద్వారా జారీచేయబడి ఖాతాదారులకు వడ్డీని సంపాదించు డిపాజిట్లు ఈ సమీప ద్రవ్యం యొక్క ముఖ్య రూపాలుగా చెప్పవచ్చు. సాధారణంగా ఖాతాదారులకు వడ్డీని సంపాదించి పెట్టు డిపాజిట్లను కాలపరిమితి డిపాజిట్లు (time deposits) అంటారు. వీటిని అవసరమైనప్పుడు వెంటనే కాలయాపన లేకుండా ద్రవ్యంగా మార్చుకోవడానికి వీలు ఉండక పోయినా వీటికి ద్రవ్యత్వం అధికంగా వుంటుంది. వీటిని కొన్ని రోజుల వ్యవధిలో

ద్రవ్యంగా మార్చుకోవచ్చు. అందుచేత కొంతమంది ఆర్థిక శాస్త్రవేత్తలు ఈ రకమైన ద్రవ్యాన్ని 'ద్రవ్య సప్లయ్'లో భాగంగా గుర్తించగా మరి కొంత మంది ఈ ఉద్దేశాన్ని తిరస్కరించారు.

**నాణేలు - కరెన్సీ :** చిన్న పిల్లలకు నాణేలు చాలా ప్రాముఖ్యమైన ద్రవ్యరూపం. వారు పెద్దవాళ్ళయిన తర్వాత వారి బిల్లులు వారే చెల్లించవలసి వచ్చినప్పుడు నాణేలు కొంచెం తక్కువ విలువైనవిగా కనిపిస్తాయి. నాణేలు లోహంతో చేయబడినవి. కనుక వాటి మీద ముద్రించబడిన విలువలో కొంత విలువను కలిగి ఉండగా, కాగితపు ద్రవ్యానికి భారతీయ రిజర్వు బ్యాంకు వీటిమీద ముద్రించిన విలువ తప్ప మరే విలువ కలిగి ఉండవు.

**డిమాండ్ డిపాజిట్లు :** బ్యాంకులలో ద్రవ్యాన్ని దాచుకొన్నవారు వారి పేరిట లావాదేవీలు జరుపుకోవటం కోసం ఒక ఖాతాను సంబంధిత బ్యాంకులో తెరుస్తారు. ఈవిధంగా వాణిజ్య బ్యాంకులలో చెకింగ్ ఖాతాలో ఉన్న నిధులను డిమాండ్ డిపాజిట్లు అంటారు. భారత దేశంలో సరఫరాలో ఉన్న ద్రవ్యంలో మూడింట రెండువంతులు 'డిమాండ్ డిపాజిట్ల' రూపంలోనే ఉంది. ఆర్థిక వ్యవస్థలో ఈరకమైన ద్రవ్యం చాలా ప్రాముఖ్యమైనదని చెప్పవచ్చు. ఇది అదృశ్యరూపంలో ఉండటం వల్ల ఈ వ్యాఖ్యానం వింతగా అనిపించవచ్చు. ఈద్రవ్యం ఒక వ్యక్తి ఖాతాలో మాత్రమే ద్రవ్యంగా గుర్తింపబడుతుంది. అంటే డిమాండ్ ఖాతాకు స్పష్టమైన ద్రవ్యరూపం లేదన్నమాట. అయితే ఖాతాదారుడు తన అవసరానికి లేక కోర్కెలను తీర్చుకోవడానికి చెక్కు వ్రాయటం ద్వారా ఒక నిబంధన ప్రకారం ద్రవ్యం స్థానంలో 'చెక్కు' స్వేచ్ఛగా చెలామణి అయ్యి అతని అవసరాలు తీర్చగలదు. 'చెక్కు' మీద నిర్దేశింపబడిన ద్రవ్యపు మొత్తం చెల్లింపుకు బ్యాంకు ఇచ్చిన వాగ్దానాన్ని 'చెక్కు' సూచిస్తుంది. ప్రజలకు బ్యాంకు విధానంపై ఉన్న నమ్మకం వల్ల ఇటువంటి వాగ్దానాలు ఆమోదించబడతాయి.

**క్రెడిట్ కార్డులు :** ఇటీవలి కాలంలో క్రెడిట్ కార్డులు ద్రవ్య విధానంలో విస్తృతంగా వ్యాప్తి చెందాయి. ఈ కార్డులు తమ యజమానులకు అప్పును ఏర్పాటు చేయడానికి సహకరిస్తాయి. అమ్మకందారుడు క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోలుదారునికి అప్పును మంజూరు చేసి, తద్వారా అతనికి కావలసిన వస్తువులను సరఫరా చేస్తాడు. ఈ క్రెడిట్ కార్డు పద్ధతి ద్రవ్యం లేక సమీప ద్రవ్యం కోవకు చెందినది కాదు. ఇది కేవలం ఒక వ్యక్తిని "నేడు కొనుగోలు చెయ్యండి, అనంతరం చెల్లించండి" అని మాత్రమే అనుమతిస్తుంది. కాబట్టి క్రెడిట్ కార్డును ద్రవ్యంగా చెలామణి చేసుకోవడం ఒక ఇష్టపూర్వకమైన ఉపాయం మాత్రమే. క్రెడిట్ కార్డు యొక్క క్రెడిట్ నిజానికి ద్రవ్య సరఫరాను పెంచకపోయినా, పెంచిన ప్రభావాన్ని చూపిస్తుంది. సమష్టి డిమాండ్, ఉద్యోగి స్థాయి, వస్తువుల ధరలపై ఈ ప్రభావం చాలా ముఖ్యమైనది.

BRAOU

## 8.4 ద్రవ్య సరఫరా

### 8.4.1 ద్రవ్య సరఫరా భాగాలు

నగదు, నాణేలు, డిపాజిట్లు, రిజర్వులు ద్రవ్య సరఫరాలో భాగాలు. వీటిలో నగదు, కరెన్సీ, డిపాజిట్లను నామ మాత్రపు ద్రవ్య సరఫరాగా భావిస్తే, నాణేలు, రిజర్వులు, కరెన్సీలు చాలా శక్తివంతమైన ద్రవ్యంగా చెప్పవచ్చు. ద్రవ్య సరఫరా సమీప నిర్ణాయకాలను వివరంగా తెలుసుకొందాం.

**నాణేలు :** నాణేలను చిన్న చిన్న కొనుగోలులకు వినియోగిస్తారు. చిన్న వినియోగానికి నాణేలు ఎంతో అనువైన ద్రవ్యంగా చెప్పవచ్చు. నాణేలను మొట్టమొదట 'లిడియా' దేశంలో క్రీస్తు పూర్వం 700 సం॥లో జారీచేయడం జరిగింది. నాటి నుండి ద్రవ్యంలో భాగంగా ఇవి చెలామణి అవుతున్నాయి. భారతదేశం ఏప్రిల్ 1వ తేది, 1957 సం॥ నుండి దశాంశ పద్ధతి ద్వారా నాణేలను ముద్రించి చెలామణి చేయడం ప్రారంభించింది.

దశాంశ పద్ధతిననుసరించి భారతదేశపు రూపాయి 100 పైసలుగా విభజింపబడింది. దాని ప్రకారం 100, 50, 25, 20, 10, 5, 3, 2, 1 పైసల నాణేలు ముద్రించబడి సరఫరా చేయబడ్డాయి. ఇటీవలి కాలంలో 3, 2, 1 పైసల నాణేలను ఉపసంహరించుకోవడం జరిగింది. మనదేశంలో నాణేలన్నీ కూడా భారతీయ రిజర్వు బ్యాంకు చేత ముద్రించ బడతాయి. 5, 2 రూపాయల నాణేలను కూడా రిజర్వు బ్యాంకు ముద్రిస్తున్నది. మనదేశంలో సాంప్రదాయంగా వస్తున్న 16 అణాల విధానానికి స్వస్తి చెప్పబడటమే కాకుండా దశాంశ పద్ధతిలో నాణేలు జారీ చేయడం వల్ల అన్ని రకాల లెక్కింపులు, చిన్న చిన్న లావాదేవీలు సులభతరం అయినాయి. ఒక్క నాణేల విషయంలోనే కాక తూనికల, కొలతల విషయంలో కూడా దశాంశ పద్ధతి అమలు లోకి వచ్చింది. ఈ నాణేల విలువ స్థిరీకరణ, ప్రభుత్వ అధికారం చేత సంరక్షింపబడుతూ ఉంటుంది.

**కరెన్సీ నోట్లు :** భారతదేశంలో చెలామణి అవుతున్న కరెన్సీ దాదాపు పూర్తిగా కాగితపు నోట్ల రూపంలోనే ఉంది. ఈనోట్లు అనేక విలువలను (denominations)కలిగి ఉన్నాయి. అవి ఒక రూపాయి, రెండు రూపాయలు, ఐదు రూపాయలు, పది రూపాయలు, ఇరవై రూపాయలు, యాభై రూపాయలు, వంద రూపాయలు. భారతీయ రిజర్వు బ్యాంకు వారు 1987-88లో మొట్టమొదటి సారిగా 96కోట్ల విలువగల 500 రూపాయిల నోట్లను ముద్రించి చెలామణి చెయ్యటం జరిగింది. ఒక్క రూపాయి నోట్లు తప్ప మిగిలిన నోట్లన్నింటినీ ఒక్క రూపాయి నోట్లలోకి మార్చుకోవచ్చు. రూపాయి నాణేలు కూడా చెలామణిలో ఉన్నాయి. స్వాభావికంగా భారతదేశం అంతరంగిక మార్పిడికి అనుకూలత లేని విధంగా కాగితపు కరెన్సీ కలిగి ఉంది. ఎందుకంటే భారతదేశపు రూపాయిని అంతర్గతంగా ఏ విధమైన రూపంలోకి మార్చుటకు వీలులేదు. 'రూపాయి' ప్రమాణ ద్రవ్యం కాబట్టి దాని రూపంలోనే ద్రవ్యం ఉంటుంది. ఒక్క రూపాయి నోటు మినహాయించి, మిగిలిన నోట్లన్నీ కూడా భారతీయ రిజర్వు బ్యాంకు ద్వారా ముద్రించబడతాయి. ఒక్క రూపాయి నోట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ద్వారా సరఫరా చేయబడతాయి. చెలామణి ద్రవ్యాన్ని ముద్రించడానికి ప్రత్యేకంగా ఒక విభాగాన్ని రిజర్వు బ్యాంకు నెలకొల్పుకోవడంతో ఆ విభాగం ద్వారానే ఈ కార్యకలాపాలన్నీ జరుగుతాయి. కరెన్సీ నోట్లు జారీ చేయడంలో భారతీయ రిజర్వు బ్యాంకుకు గుత్తాధిపత్యం వుంది.

**డిపాజిట్లు :** సగటు డిపాజిట్లను వివిధ రకాలుగా విభజించవచ్చు. అవి : కరెంట్ డిపాజిట్లు, పొదుపు డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు మరియు ఇతర డిపాజిట్లు. కరెంట్ డిపాజిట్లలో ఈ క్రింది రకాలు ఉంటాయి.

(i) ఈ రకమైన డిపాజిట్లు ఖాతాదారుడు తాను కోరినప్పుడు వెంటనే తిరిగి తీసుకోవచ్చు. ఫిక్స్‌డ్ డిపాజిట్ల విషయంలో కాలపరిమితి ఇంకా 15 రోజులలో ముగుస్తుందనగా బ్యాంకుకు తెలియజేసి కాల పరిమితి ముగిసిన తర్వాత పొందవచ్చు, లేక 15 రోజుల లోపల నోటీసు ఇచ్చి ఖాతాదారుడు తన సొమ్మును తాను పొందవచ్చు.

(ii) కాల్ డిపాజిట్లు 14 రోజుల లోపల తిరిగి తీసుకొనడానికి అవకాశం ఉంటుంది.

(iii) దావా లేని డిపాజిట్లు.

(iv) గడువు మించిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు.

(v) నగదు అప్పుల ఖాతాలో క్రెడిట్ బ్యాలెన్స్.

(vi) అనిశ్చయ సవరింపు లేని ఖాతాలు.

పొదుపు ఖాతాల విషయంలో బ్యాంకు నుండి ఎప్పుడైనా పొందవచ్చు. ఈ పొదుపు ఖాతాలు

BRAOU

నియమ నిబంధనలననుసరించి స్పెషల్ డిపాజిట్లుగా కూడా చెప్పబడుతున్నాయి. వీటిని తిరిగి పొందాలంటే ఏ విధమైన నోటీసు ఇవ్వనవసరం లేదు. ఫిక్స్‌డ్ డిపాజిట్ల విషయంలో 15 రోజులు ముందుగా నోటీసు ఇవ్వవలసి ఉంటుంది. మదింపు డిపాజిట్లు, రికరింగ్ (recurring) డిపాజిట్లు, క్యాష్ పత్రాలు, చిట్ డిపాజిట్లు మొదలైనవి కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లలో భాగాలుగా ఉంటాయి. ఇవికాక ఉద్యోగ భద్రత డిపాజిట్లు (staff security deposits), మార్జిన్ డిపాజిట్లు (margin deposits), ఉద్యోగ ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లు మొదలైనవి ఇతర రకాల డిపాజిట్లు.

**సంచితములు (Reserves) :** సంచిత ద్రవ్యాన్ని కేంద్ర బ్యాంకు ప్రభుత్వపు వ్యాపార వ్యవహారాల కొరకు వినియోగించుకోవడం జరుగుతుంది. సాధారణంగా కరెన్సీ లావాదేవీలు, ముఖ్యంగా కేంద్ర బ్యాంకు, ప్రభుత్వం లావాదేవీలు జరపడానికి కొంత సంచిత ద్రవ్య సెక్యూరిటీగా ఉంటుంది. ఆ సెక్యూరిటీ ద్వారా మాత్రమే ద్రవ్యాన్ని సృష్టించడం జరుగుతుంది. బ్యాంకు సంచితాలు, కరెన్సీ మొదలైన వాటి ద్వారానే ద్రవ్య లావాదేవీలు జరుగుతాయి. ఇవన్నీ కూడా భారతీయ రిజర్వు బ్యాంకులో డిపాజిట్ రూపంలో ఉంటాయి. సంచితాలు వ్యక్తుల చేతుల్లో ఉండే ద్రవ్యం , బ్యాంకుల్లోని ద్రవ్యం, అన్నీ భద్రంగా రిజర్వు బ్యాంకులో డిపాజిట్ చేయబడి ఉంటాయి. ఈ సంచిత ద్రవ్యాన్ని ఎక్కువ శక్తివంతమైన ద్రవ్యంగా చెప్పవచ్చు. అంతేకాక ఇది ఆధారిత ద్రవ్యం (base money), ప్రాథమిక ద్రవ్యం (primary money) లేక ప్రభుత్వ ద్రవ్యం (Government money) అని కూడా పిలువబడుతుంది.

### 8.4.2 ద్రవ్య సరఫరాను నిర్ణయించు అంశాలు

ఇప్పటివరకు ద్రవ్య సరఫరాలోని రకాలను పరిశీలించాం. ఇప్పుడు ద్రవ్య సరఫరా ఏవిధంగా నిర్ణయింపబడుతుందో తెలుసుకొందాం.

అందుబాటులో ఉన్న రిజర్వు ద్రవ్యం పైనా, దానిలో ప్రజలు కరెన్సీ రూపంలో ఉంచుకోదలచే భాగంపైనా బ్యాంకింగ్ విధానం సృష్టించే పరపతి ద్రవ్యం ఆధారపడి ఉంటుంది. అయితే ఈ విధమైన పరపతి ద్రవ్యాన్ని సృష్టించేటప్పుడు బ్యాంకు ఖాతాదారుల అవసరాలను తీర్చడానికి కొంత డిపాజిట్ ద్రవ్యాన్ని అందుబాటులో ఉంచి మాత్రమే చేయగలదు. ఖాతాదారులు తమ పొదుపు ఖాతాలోని ద్రవ్యం, అవశిష్టమైనదిగా ఉంటుందని భావిస్తారు. అందువలననే వారు తమ ఖాతాలో ద్రవ్యాన్ని ఉంచడానికి సిద్ధపడతారు. ప్రజలు తమ ఖాతాలో ద్రవ్యాన్ని ఉంచడానికి వేరే కారణాలు కూడా ఉన్నాయి. అవి : ఆర్థిక వ్యవస్థలో చెల్లింపు అలవాట్లు , బ్యాంకుల సేవలు అందుబాటులో ఉండటం, చట్టబద్ధమైన భద్రతను కలిగి ఉండటం, కొన్ని చెల్లింపులను చట్టం ద్వారా బ్యాంకు సహాయంతో చెల్లించడం మొదలైనవి. అంతేకాక ద్రవ్యత్వాభిరుచితో ముందు జాగ్రత్త చర్యగా కొంత ద్రవ్యాన్ని బ్యాంకు ఖాతాలో ఉంచడానికి ఇష్టపడతారు. ఈ విధమైన కారణాలే కాకుండా అనేక ఆర్థిక పరమైన కారణాల వల్లకూడా ప్రజలు బ్యాంకుల్లో కొంత ద్రవ్యాన్ని తమపేర ఖాతాలలో ఉంచుతారు. అవి : ద్రవ్యోల్బణం రేటు, ఆదాయ స్థాయి, ప్రత్యక్ష పరోక్ష పన్నుల స్థాయి, బదిలీ చెల్లింపులు, కాలగమనంలోని అంశాలు, ప్రజల ఇష్టం మొదలైనవి. ఒక కాలవ్యవధిలో ప్రజల అభీష్టాన్ని అనుసరించి వారి దృష్టిలో ఎంత కరెన్సీ ఉండటం అవసరమో దానిని బట్టి కరెన్సీ, డిపాజిట్‌ల నిష్పత్తి ఆధారపడి ఉంటుంది.

ద్రవ్య సరఫరా బ్యాంకింగ్ విధానం యొక్క శక్తి సామర్థ్యాల ద్వారా డిపాజిట్లను సేకరించడంపై కూడా ఆధారపడి ఉంటుంది. అంటే ఇది ద్రవ్యత్వ గుణకంపై ఆధారపడి ఉంటుందన్నమాట. వాణిజ్య బ్యాంకులు, భారతీయ రిజర్వు బ్యాంకులో రిజర్వుగా ఉంచిన మొత్తంపై ఆధారపడి ద్రవ్యాన్ని అంటే పరపతి ద్రవ్యాన్ని



BRAOU

సృష్టించడం అనవాయితీ. బ్యాంకు యొక్క సూక్ష్మమైన రిజర్వు విధానం ద్వారా ఈ పనిని చేయగలదు. ద్రవ్య గుణకం, రిజర్వు ద్రవ్యం, ద్రవ్య సరఫరాలు, కరెన్సీ, డిపాజిట్ ద్రవ్యం మొదలైనవి కరెన్సీ ద్రవ్య నిష్పత్తి ద్వారా ప్రభావితమౌతాయి. కొన్నిసార్లు డిపాజిట్ ద్రవ్య గుణకం కూడా వీటిని ప్రభావితం చేస్తుంది.

### 8.4.3 భారతదేశంలో ద్రవ్య సరఫరా

భారతీయ రిజర్వు బ్యాంకు చేత 1977వ సంవత్సరంలో రెండవ పని బృందం ( Second Working Group) ద్రవ్య సరఫరా కోసం నియమింపబడింది. ఈ బృందం ప్రధాన బాధ్యత ద్రవ్య సరఫరాకు సరిపోయే వివిధ భావనలను, నిర్వచనాలను పరిశీలించడం. ఈ బృందం ఆయా అంశాలను పరిశీలించిన అనంతరం ద్రవ్యం సరఫరాను నాలుగు భాగాలుగా విభజించడం జరిగింది. అవి $M_1$, $M_2$, $M_3$ , $M_4$. $M_1$ లేక ప్రజల ద్రవ్య సరఫరాను రెండవ పని బృందం ప్రజల వద్దగల కరెన్సీ నోట్లు, నాణేలు, డిమాండ్ డిపాజిట్లు (బ్యాంకులలోని), వేతన సంపాదనలు (salary earnings), భారతీయ రిజర్వు బ్యాంకు వద్ద ఉన్న ప్రజల సెక్యూరిటీలు, ఇతర డిపాజిట్లుగా నిర్వచించడం జరిగింది. ఎక్కువ ద్రవ్యత్వాభిరుచి కలిగి, ఎక్కువ మంది ప్రజలు తమ చెల్లింపులకు ఒప్పుకొనేది, వినిమయ మాధ్యమంగా ఒప్పుకొనబడేది, చెల్లింపుల కొలమానంగా అందరిచేత అంగీకరింపబడే ద్రవ్యం కూడా $M_1$. ఈ ద్రవ్యం ప్రధానంగా వినిమయ మాధ్యమ లక్షణాలను కలిగి ఉంటుంది.

$M_2$లో పొదుపు ఖాతాలు, తపాలా కార్యాలయపు పొదుపు ఖాతాలు మరియు $M_1$ చేరి ఉంటాయి. $M_3$ను విశాల ద్రవ్య కొలమానం అంటారు. ఇందులో కాల పరిమితి డిపాజిట్లు (అంతరంగిక బ్యాంకు కాలపరిమితి డిపాజిట్లు మినహాయించి) మరియు $M_1$ కలిసి ఉంటాయి. సువిశాలమైన ద్రవ్య సరఫరా విధానంగా నిర్వచింపబడేది $M_4$. ఇందులో $M_3$ మరియు తపాలా కార్యాలయపు పొదుపు సంస్థ మొత్తం డిపాజిట్లు చేరి ఉంటాయి. $M_1$, $M_3$ ద్రవ్య సరఫరా 1985 మార్చి చివరి వరకు వారాంతంగా లెక్కించబడి ప్రచురించబడేది. అనంతరం 15 రోజులకు ఒకసారి ప్రచురించ బడేది. $M_2$, $M_4$ నెలకొకసారి లెక్కింపబడుతుంది.

### 8.4.4 బాంకుల ద్రవ్య సృష్టి : ద్రవ్య గుణకం

నిజానికి వాణిజ్య బ్యాంకులు సృష్టించే ద్రవ్యం గూఢమైనది (mystical) కాదు. ఏ ద్రవ్య మార్కెట్‌లోనైనా కేంద్ర బ్యాంకు, వాణిజ్య బ్యాంకులు, డిపాజిట్ దారులు, అప్పు తీసుకొనేవారు ఉమ్మడిగా కలసి పరపతి ద్రవ్యాన్ని సృష్టిస్తారు. స్థూల చలన విశ్లేషణ (macro dynamic analysis) లో ఆర్థికాభివృద్ధి, విత్తవృద్ధి, మొదలైనవి ద్రవ్య విధానం ఉండి అభివృద్ధి చెందినవే. అదే విధంగా ద్రవ్య సప్లయి పెరుగుదల లేక తరుగుదల కూడా ద్రవ్య విధానం పైనే ఆధారపడి ఉంటాయి.

వాణిజ్య బ్యాంకులు పరపతి ద్రవ్యాన్ని సృష్టించే పద్ధతిని బట్టి ద్రవ్య విధానం సంకోచ, వ్యాకోచాలు చెందుతూ ఉంటుంది. బ్యాంకులు డిపాజిట్లు సృష్టించే విధానాన్ని వివరంగా తెలుసుకొందాం. భారతీయ స్టేట్ బ్యాంకులో రూ. 1000 డిపాజిట్ చేయబడిందని అనుకొందాం.

BRAOU

## పట్టిక - I

భారతీయ స్టేట్ బ్యాంకు - ప్రాథమిక దశలోని పరిస్థితి

| | ఆస్తులు | రూ. | అప్పులు | రూ. |
|---|---|---|---|---|
| రిజర్వులు | | + 1,000 | డిపాజిట్లు | + 1,000 |
| | మొత్తం | + 1,000 | మొత్తం | + 1,000 |

పైన తెలిపిన విధంగా చట్టబద్ధమైన వాణిజ్య బ్యాంకులు తమ వద్ద 10% ద్రవ్యాన్ని అవసరాలకు రిజర్వు మొత్తంగా ఉంచుకొంటాయి. ఇప్పుడు భారతీయ స్టేట్ బ్యాంకు తన మొత్తం రూ. 1000లో రూ. 900 ను బయటకు అప్పుగా ఇవ్వడం జరుగుతుంది. ఋణ గ్రహీత తాను అప్పుగా తీసుకొన్న రూ. 900 ను మరొక బ్యాంకులో డిపాజిట్ చేస్తాడు.

## పట్టిక - II

భారతీయ స్టేట్ బ్యాంకు - చివరి దశ పరిస్థితి

| ఆస్తులు | రూ. | అప్పులు | రూ. |
|---|---|---|---|
| రిజర్వులు | + 100 | డిపాజిట్లు | + 1,000 |
| అప్పు, పెట్టుబడి | + 900 | | |
| మొత్తం = | 1,000 | మొత్తం = | 1, 000 |

రెండవ పట్టికలో చూపిన విధంగా రూ. 100 డిపాజిట్ అయితే, దానితో బాటు రూ. 900 అప్పుగా ఇచ్చిన సొమ్ము మరియు పెట్టుబడి ఇతరుల ఖాతాలో డిమాండ్ డిపాజిట్‌గా నమోదు అయి ఉంటుంది. కాబట్టి ద్రవ్యం మొత్తం అంటే రూ. 1,900 భారతీయ స్టేట్ బ్యాంకు కలిగి ఉన్నట్లు భావించాలి. అయితే నిజానికి రూ. 900 నూతన ద్రవ్యం కాబట్టి ఆ బ్యాంకు సృష్టించిన పరపతి ద్రవ్యం రూ. 900 ఇప్పుడు మరో ప్రభుత్వ రంగ వాణిజ్య బ్యాంకు పనిచేసే విధానం చూచినట్లయితే అది ఏవిధంగా డిపాజిట్లు సేకరిస్తుందో, ఏవిధంగా పరపతిని సృష్టిస్తుందో తెలుసుకోవచ్చు.

## పట్టిక - III

ఆంధ్రా బ్యాంకు ప్రాథమిక దశలో పరిస్థితి

| ఆస్తులు | రూ. | అప్పులు | రూ. |
|---|---|---|---|
| రిజర్వులు | + 900 | డిపాజిట్లు | + 900 |
| మొత్తం = | + 900 | మొత్తం = | + 900 |

ఈ బ్యాంకు కేవలం రూ. 810 మాత్రమే అప్పుగా ఇవ్వగలదు. మిగిలిన రూ. 90 చట్టబద్ధమైన రిజర్వుగా ఉంటుంది. చివరిగా ఈ ప్రభుత్వ రంగ బ్యాంకు పరిస్థితి క్రింది విధంగా వుంటుంది.

BRAOU

**పట్టిక - IV**

ఆంధ్రా బ్యాంకు చివరి పరిస్థితి

| ఆస్తులు | రూ. | అప్పులు | రూ. |
|---|---|---|---|
| రిజర్వులు | + 90 | డిపాజిట్లు | + 900 |
| అప్పు, పెట్టుబడి | + 810 | | |
| మొత్తం = | + 900 | మొత్తం = | + 900 |

మొదట ఉన్న రూ. 1000 ఇప్పుడు మొత్తం రూ. 2,710 బ్యాంకు ద్రవ్యాన్ని సృష్టించారు. ఆ తరువాత వచ్చే బ్యాంకులు నూతన బ్యాంకులుగా ఏర్పడి మూడవ తరం బ్యాంకులుగా చెలామణి అవుతాయి. ఈ పరపతి నియంత్రణ కార్యక్రమం అదేవిధంగా జరుగుతూ పోతుంది. చివరికి మొత్తం ద్రవ్యం 1000 + 900 + 810 + 729 + 656 + ......... పట్టిక 8.1 లో చూపించిన విధంగా పెరుగుతుంది.

**పట్టిక - 8.1 : బ్యాంకు విధానం ద్వారా బ్యాంకు డిపాజిట్లు అభివృద్ధి చెందే విధానం**

**(రూ.లలో)**

| S. No. | బ్యాంకు స్థితి | క్రొత్త డిపాజిట్లు | క్రొత్త రుణాలు | క్రొత్త రిజర్వులు |
|---|---|---|---|---|
| 01. | భారతీయ స్టేట్‌బ్యాంకు | 1,000 = 00 | 900 = 00 | 100 = 00 |
| 02. | ఆంధ్రా బ్యాంకు | 900 = 00 | 810 = 00 | 90 = 00 |
| 03. | బ్యాంక్ ఆఫ్ ఇండియా | 810 = 00 | 729 = 00 | 81 = 00 |
| 04. | ఇండియన్ బ్యాంకు | 729 = 00 | 656 = 00 | 72 = 90 |
| 05. | బ్యాంక్ ఆఫ్ ఇండియా | 656 = 10 | 590 = 00 | 65 = 61 |
| 06. | బ్యాంక్ ఆఫ్ బరోడా | 590 = 49 | 531 = 44 | 59 = 05 |
| 07. | పంజాబ్ నేషనల్ బ్యాంకు | 531 = 44 | 478 = 30 | 53 = 14 |
| 08. | UCO బ్యాంకు | 478 = 30 | 430 = 47 | 47 = 83 |
| 09. | సిండికేట్ బ్యాంకు | 430 = 37 | 387 = 47 | 43 = 04 |
| 10. | కెనరా బ్యాంకు | 387 = 42 | 348 = 68 | 38 = 74 |
| మొదటి 10 బ్యాంకులలో మొత్త ద్రవ్యం | | 6,513 = 12 | 5,861 = 90 | 651 = 31 |
| మిగిలిన బ్యాంకులలో మొత్తం ద్రవ్యం | | 3,486 = 88 | 3,138 = 10 | 348 = 69 |
| బ్యాంకింగ్ విధానం ద్వారా సృష్టింపబడిన మొత్తం ద్రవ్యం | | 10,000 =00 | 9,000 = 00 | 1,000 = 00 |

పైన వివరించిన అంశాలను బీజగణిత పద్ధతిలో ఋజువు చేయవచ్చు.

BRAOU

$100 + 900 + 810 + 729 + \dots\dots\dots$

$$= 1000 \left[1 + \frac{9}{10} + \left(\frac{9}{10}\right)^2 + \left(\frac{9}{10}\right)^3 + \dots\right]$$

$$= 1000 \left(\frac{1}{1 - 9/10}\right) = 1000 \text{x} \frac{1}{1/10}$$

= రూ. 10,000

ఈ ఉదాహరణ ప్రకారం బ్యాంకింగ్ వ్యవస్థ చాలా పెద్ద మొత్తంలో పరపతిని సృష్టించగలదని చెప్పవచ్చు. అంతేకాక అక్కడ ద్రవ్య సప్లయి గుణకం పనిచేయుచున్నట్లు మనం గమనించవచ్చు. బ్యాంకింగ్ విధానానికి సమకూర్చిన ప్రతి అదనపు రూపాయి 10 రూపాయల అదనపు పరపతి ద్రవ్యాన్ని లేక బ్యాంకు ద్రవ్యాన్ని సృష్టిస్తుంది. అదనపు మొత్తానికి, అదనపు రిజర్వులకు గల నిష్పత్తిని ద్రవ్య గుణకం (money multiplier) అంటారు. మన ఉదాహరణ ప్రకారం ద్రవ్య గుణకాన్ని క్రింది విధంగా సూచించవచ్చు.

$$= \frac{1}{\text{చట్టబద్ధమైన రిజర్వు నిష్పత్తి}} = \frac{1}{1/10} = 10$$

బ్యాంకు డిపాజిట్ల నుండి నగదును **తిరిగి** వెనక్కి తీసుకొన్నప్పుడు బ్యాంకు విధానం పైన చూపిన విధానానికి విరుద్ధమైన ప్రభావానికి గురి **అవుతాయి. అందువలన బ్యాంకు** ద్రవ్యం నాశనం చేయబడుతుంది. బ్యాంకు రేటును, ఓపెన్ మార్కెట్ **వ్యవహారాలను, రిజర్వు నిష్పత్తులను** మార్చడం ద్వారా ద్రవ్య విధాన సృష్టికర్తలు ద్రవ్య సప్లయిని తగ్గించడంకాని, **పెంచడం కాని చేస్తారు.** ద్రవ్య విధానం సంకోచించడం లేక వ్యాకోచించడం వలన దానితో బాటు విత్త అభివృద్ధి మరియు ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. ఈ అంశాలను రాబోయే పేజీలలో వివరించడం జరిగింది.

BRAOU

విస్తృత పరచిన ద్రవ్య సరఫరా గుణకంను క్రింద తెలిపిన విధంగా రాబట్టవచ్చు.

$N_M = K + I \dots\dots\dots\dots (1)$

ఇక్కడ $N_M$ = నామ మాత్రపు ద్రవ్య సరఫరా,

K = కరెన్సీ మరియు నాణేలు (ప్రజల వద్ద ఉన్నవి),

I = డిపాజిట్లు.

K లేక $M_1$ అని పిలువబడే మొత్తంలో పెరుగుదల ఏర్పడటం వలన నామమాత్రపు ద్రవ్య సరఫరా పెరుగుతుంది. వాణిజ్య బ్యాంకులు సేకరించే అదనపు డిపాజిట్లు పరపతి విస్తరణకు దారితీస్తాయి. అయితే వాణిజ్య బ్యాంకులు సృష్టించే ద్రవ్యాన్ని నియంత్రణ చేయడానికి ద్రవ్య విధానం, చట్ట బద్ధ రిజర్వు నిష్పత్తి నియంత్రణా సాధనాలుగా పనిచేస్తాయి. రిజర్వు అవసరాలలో ఏర్పడే మార్పులు ద్రవ్య సరఫరాపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయి. దాని ప్రకారం మనం ఒక నూతన సూత్రాన్ని చెప్పవచ్చు.

$P_M = K + S \dots\dots\dots\dots (2)$

ఇక్కడ $P_M$ = విశాల ద్రవ్యం, K = ప్రజల దగ్గర గల కరెన్సీ, నాణేలు, మరియు S = రిజర్వులు.

ద్రవ్య గుణకాన్ని రాబట్టడానికి (2) వ సమీకరణాన్ని $N_M$ ద్వారా చూపబడిన నామమాత్రపు ద్రవ్య సప్లయిచే గుణించవచ్చు.

$$\frac{P_M}{N_M} = \frac{K}{N_M} + \frac{S}{N_M} \quad \ldots (3)$$

ఇప్పుడు కుడిచేతి వైపున్న రెండవ పదాన్ని క్రింది విధంగా వ్రాయవచ్చు.

$$\frac{S}{N_M} = \frac{S}{I} - \frac{S}{I} + \frac{S}{N_M} \quad \ldots (4)$$

ఇప్పుడు 4వ సమీకరణానికి కుడివైపున ఉన్న మూడవ, నాల్గవ పదాలను (terms) తీసుకొని మూడవ పదాన్ని $\frac{N}{N}$ చేత, నాల్గవ పదాన్ని $\frac{I}{I}$ చేత, హెచ్చిస్తే

$$\frac{S}{N_M} = \frac{S}{I} - \frac{SN_M}{IN_M} + \frac{SI}{N_M I} \quad \ldots (5)$$

(5)వ సమీకరణాన్ని సంక్షిప్తీకరించినట్లయితే

$$\frac{S}{N_M} = \frac{S}{I} = \frac{S(N_M - 1)}{N_M I} \quad \ldots (6)$$

దీని ప్రకారం $N_M = K + I$

$$N_M - I = K \quad \ldots (7)$$

కాబట్టి (6) వ సమీకరణాన్ని క్రింది విధంగా వ్రాయవచ్చు.

$$\frac{S}{N_M} = \frac{S}{I} - \frac{SK}{N_M I} \quad \ldots (8)$$

(3) వ సమీకరణంలో (8) వ సమీకరణాన్ని ప్రతిక్షేపిస్తే, దాన్ని క్రింది విధంగా వ్రాయవచ్చు.

$$\frac{P_M}{N_M} = \frac{K}{N_M} + \frac{S}{I} - \frac{SK}{N_M I} \quad \ldots (9)$$

$\frac{K}{N_M}$ = కరెన్సీ నిష్పత్తి = Kt.

$\frac{S}{I}$ = రిజర్వు నిష్పత్తి = St.

(9) వ సమీకరణాన్ని క్రింది విధంగా వ్రాయవచ్చు.

$$\frac{P_M}{N_M} = K_t + S_t - K_t S_t \quad \ldots (10)$$

$S_t$ = చట్టబద్ధమైన రిజర్వు నిష్పత్తి + ఎక్కువగా ఉన్న రిజర్వు నిష్పత్తి.

BRAOU

కాబట్టి $S_t = SR_t + XR_t$ ... (11)

$SR_t$ = చట్టబద్ధమైన రిజర్వు నిష్పత్తి

$XR_t$ = ఎక్కువగా వున్న రిజర్వు నిష్పత్తి

(10) వ సమీకరణాన్ని (11) వ సమీకరణంలో ప్రతిక్షేపించి క్రింది విధంగా వ్రాయవచ్చు.

$$\frac{P_M}{N_M} = K_t + SR_t + XR_t - K_tSR_t - K_tXR_t \quad ...(12)$$

(12) వ సమీకరణాన్ని క్రింది విధంగా వ్రాయవచ్చు.

$$P_M = N_M(K_t + SR_t + XR_t - K_tSR_t - K_tXR_t) \quad ...(13)$$

ద్రవ్యం విశేషంగానూ, అపరిమితంగానూ సృష్టింపబడుతుంది. కాబట్టి కేంద్రీయ బ్యాంకు చట్టబద్ధమైన రిజర్వులను జాగ్రత్తగా మార్పు చేయడం ద్వారా ద్రవ్య సప్లయిని నిర్వహించాలి. కేంద్రీయ బ్యాంకు తన చర్యల ద్వారా లేక విధానాల ద్వారా ద్రవ్య సరఫరాను పెంపొందించడానికి లేదా తగ్గించడానికి చర్యలు తీసుకొంటుంది ఎక్కువ ఉన్నట్లయితే వీటిని సేకరించడం, తక్కువ ఉన్నట్లయితే కేంద్ర బ్యాంకు నుండి అప్పుగా ఇవ్వడం జరుగుతుంది. ఈవిధమైన చర్యలు గైకొని సృష్టించిన ద్రవ్యాన్ని నియంత్రించడానికి ఎప్పటి కప్పుడు ప్రయత్నిస్తుంది.

ప్రియమైన ద్రవ్య విధానం అమలులో ఉన్న కాలంలో బ్యాంకు కాష్ బాలెన్స్‌పై నియంత్రణలు విధించడం జరుగుతుంది. సులువైన ద్రవ్య విధానం అమలులో ఉన్న కాలంలో వినియోగదారులకు అప్పు చాలా సులభంగా ఇవ్వడం జరుగుతుంది. అయినప్పటికీ నామ మాత్ర ద్రవ్య సప్లయి సృష్టించడం లేక నాశనం చేసే విధానంలో బ్యాంకు రేటును, ఓపెన్ మార్కెట్ వ్యవహారాలను తక్కువగా అంచనా వెయ్యకూడదు.

## 8.5 ఆర్థికాభివృద్ధిలో విత్త సంబంధమైన మార్కెట్ల పాత్ర

ఆరోగ్యకరమైన, సమర్థవంతమైన విత్త మార్కెట్ ఆర్థికాభివృద్ధికి ఎన్నో విధాల దోహదం చేయగలదు. పొదుపులో ఎక్కువ భాగం కుటుంబ రంగం నుండి వస్తున్నది. ప్రభుత్వరంగం, కార్పొరేట్ రంగం ప్రధానంగా కుటుంబ రంగ పొదుపులను వినియోగించుకొంటున్నాయి. కుటుంబాలు చేసే చిన్న చిన్న పొదుపు మొత్తాలలో కొంత భాగాన్ని ప్రభుత్వం, మిగిలిన భాగాన్ని కార్పొరేషన్లు ఖర్చు చేస్తున్నాయి. వివిధ ఆదాయ వర్గాలలో ఉన్న పొదుపు చేసే వారిని నష్టభయం, ద్రవ్యత్వం, ప్రతిఫలం, పలురకాలైన వాటిని ఎంపిక చేసుకోమని చెపుతూ విత్తమార్కెట్లు మధ్యవర్తి విధిని నిర్వహిస్తున్నాయి. వడ్డీని ఇవ్వటంద్వారా ఎక్కువ పొదుపు మొత్తాలను ఆకర్షించడం జరుగుతుంది. అంతేకాక పొదుపు మొత్తాలకు భద్రత కల్పింపబడుతుంది. ఈ రకమైన చర్యల వలన పొదుపులు పెరిగి, పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. ప్రయోజనకరమైన విత్త మార్కెట్ విధానంలో ఆర్థిక వ్యవస్థకు కావలసిన అవసరాలను సమకూర్చడంతోపాటు ఆర్థికాభివృద్ధికి అవసరమైన పెట్టుబడులను పెంచడం జరుగుతుంది. జాతీయాభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా అవసరమైన వనరులను కేటాయిస్తూ విత్త మార్కెట్ ఆర్థికాభివృద్ధికి కృషి సల్పుతుంది.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో సమర్థవంతమైన విత్త విధానం వల్ల వచ్చే లాభాలు వాటంతట అవే వచ్చినవి కావు. జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆర్థికాభివృద్ధికి తగిన మార్గాన్ని సూచించడానికి

BRAOU

అధికారులు తగిన విధంగా కల్పించుకొని సలహాలివ్వడం వలన పై లాభాలు చేకూరుతున్నాయి. ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని స్వాభావికంగా ప్రతి స్థాయిలోనూ మధ్యవర్తిత్వాన్ని వహించడం జరుగుతుంది. విత్త వ్యవస్థ అభివృద్ధి చెందడానికి, ఆర్థిక వృద్ధి జరగడానికి అవినాభావ సంబంధం ఉన్నదా అనే అంశం ఆర్థికవేత్తల మధ్య చర్చనీయాంశంగానే మిగిలిపోయింది. విత్తం పెరుగుట వలన ఆర్థికవృద్ధి జరుగుతుందా లేదా అనే విషయంలో ఆర్థికవేత్తలలో ఏకాభిప్రాయం లేదు. ప్రస్తుతం మన ఎదుట కన్పించే పరిస్థితుల దృష్ట్యా పరిశీలించినట్లయితే, విత్తమార్కెట్లు అభివృద్ధి చెందడం వల్ల ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. విత్తమార్కెట్లు అభివృద్ధి చెందడం వల్ల ఆర్థికాభివృద్ధి పరస్పర పూరకాలుగా ఒక దానితో మరొకటి ముడి పడి ఉన్నాయి. అంతేకాక ఒక దాని అభివృద్ధికి మరొకటి దోహదపడుతుంది.

## 8.6 భారతదేశంలో విత్త మార్కెట్లు

ఇప్పుడు భారత దేశంలోని విత్త మార్కెట్లను పరిశీలిద్దాం. భారతదేశంలో ఎంతో పెద్దవైన, అధునాతనమైన, అభివృద్ధి చెందిన విత్త మార్కెట్లు ఎంతో కాలం నుండి పనిచేస్తున్నాయి. ఈ విత్త మార్కెట్లు ప్రధానంగా మనదేశంలో పబ్లిక్ రంగంలోనూ, సహకార రంగంలోనూ ఉన్నాయి. వీటితోబాటు భారతీయ రిజర్వు బ్యాంకు, వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు ఎంతో కృషి సల్పుతూనే ఉన్నాయి. అంతేకాక జాతీయ స్థాయిలోనూ, రాష్ట్రాల స్థాయిలోను వ్యవస్థాపరమైన సేవలను వివిధ రంగాలకు అంటే ఆర్థిక వ్యవస్థలో ప్రధాన రంగాలయిన వ్యవసాయరంగం, పరిశ్రమల రంగం, సేవల రంగం, ఎగుమతుల రంగం, గృహ రంగాల అభివృద్ధికి ఎంతగానో సహాయపడుతున్నాయి. వీటితోబాటు ప్రత్యేకతను సంతరించుకొని పనిచేస్తున్న విత్త సంస్థ లేకపోలేదు. అందులో ప్రధానమైనవిగా భీమా సంస్థలు, పెట్టుబడి కంపెనీలు, యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, మ్యూచ్‌వల్ ఫండ్స్ (mutual funds), హైర్ పర్చేజ్ సంస్థలు, చిట్‌ఫండ్‌లు పెట్టుబడి నిధులను పెంచడానికి ఎంతో కృషి చేస్తున్నాయి. ఈ సంస్థలన్నీ వనరుల సమీకరణకై ఎన్నో రకాలైన పనులను చేసి, స్వల్పకాలిక అప్పులుగా మార్చి విత్తమార్కెట్లను అభివృద్ధి చేస్తున్నాయి. మధ్యకాలిక, దీర్ఘకాలిక పెట్టుబడులను కూడా ఇవి అభివృద్ధి చేస్తున్నాయి. భారతీయ పారిశ్రామిక అభివృద్ధి బ్యాంకు (IDBI), భారతీయ చిన్న తరహా పారిశ్రామిక అభివృద్ధి బ్యాంకు (SIDBI), భారతీయ ఎగుమతి - దిగుమతుల బ్యాంకు (EXIM BANK), జాతీయ గృహ నిర్మాణ బ్యాంకు (NHB), మొదలైన బ్యాంకులు కూడా తమతమ రంగాలకు చెందినంత వరకు విత్తాభివృద్ధికి సహకరిస్తున్నాయి. ఇప్పటికే 20కి మించి స్టాక్ ఎక్ఛేంజ్ మార్కెట్లు భారత దేశంలో నెలకొల్పబడి పెట్టుబడి మార్కెట్‌ను అభివృద్ధి చేయడానికి ఎంతో వేగంగా కృషి చేస్తున్నాయి. అనేక రకాలైన ద్రవ్య మార్కెట్ సాధనాలు అభివృద్ధి చెందుతున్నాయి. విత్తరంగంలో అనేక సంస్థలు విత్త మార్కెట్‌ను అభివృద్ధి చేయడానికి కృషి చేయడంతో బాటు వడ్డీ వ్యాపారస్థులు, చిన్న చిన్న బ్యాంకు వ్యవస్థలు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయి. విత్త శాస్త్ర అధ్యయనం కూడా విత్త మార్కెట్ విస్తరణకు దోహదకారి కాగా భారతదేశంలో అతికొద్ది కాలంలోనే విత్త మార్కెట్, విత్త సంస్థలు అభివృద్ధి చెందగలవు.

ప్రస్తుత కాలంలో కుటుంబ పొదుపులు వేగంగా పెరుగుతున్నాయి. కుటుంబ రంగపు పొదుపులు ఇటీవలికాలంలో బాగా అభివృద్ధి అయినట్లు ఒక అంచనా. ఈ రంగంలో పొదుపు చేయబడిన మొత్తం 1980 - 81 వ సంవత్సరంలో రూ. 86.10 బిలియన్లు ఉండగా, 1989 -90 వ సంవత్సరం నాటికి ఈ పొదుపులు బాగా పెరిగి రూ. 411.73 బిలియన్లకు చేరింది. ఈ పొదుపులు ఇంకా పెరుగుదలను సూచిస్తూ 1990 - 91 నాటికి రూ. 455.92 బిలియన్లకు పెరిగింది. 1990 - 91 లో భారతీయ రిజర్వు బ్యాంకు తన వార్షిక నివేదికలో, కుటుంబ పొదుపుల నుండి, బ్యాంకు డిపాజిట్లనుండి షేర్లు, డిబెంచర్లలోనూ, యూనిట్ ట్రస్ట్ ఆఫ్

BRAOU

ఇండియా యూనిట్లలోనూ మదుపు చేయడం జరుగుతుందని తెలియజేసింది. విత్త విధానంలో అభివృద్ధి క్రమం ఒక రంగం నుండి మరొక రంగానికి బదిలీ చేయబడింది.

## 8.6.1 విత్త అభివృద్ధిలో వివిధ దశలు

1950 నుండి భారత దేశంలో విత్త మార్కెట్ల విస్తరణను, అభివృద్ధి క్రమాన్ని మూడు ప్రధాన స్థాయిలుగా విభజింపవచ్చు. మొట్టమొదటి రెండు దశాబ్దాలను, అంటే 1950 దశకం, 1960 దశకం - రెండింటిని కలిపి సంధి కాలం (phase of transition)గాను, 1969 నుండి 1985 మధ్య కాలాన్ని (ఒకటిన్నర దశాబ్దం) అభివృద్ధి, విభజన దశగాను, 1985 నుండి గల కాలాన్ని బలపడుట, నవకల్పన, సరళీకృత దశగాను చెప్పబడినాయి. చివరి దశ కాలానుగుణంగా మలచబడినదని భావించవచ్చు. విత్త విధానంలో అనేక సలహాలనిచ్చిన శ్రీ యం. నరసింహం కమిటీ కీలక సిఫారసుల మేరకు అమలు పరచాలని భావించబడింది. ఈ కమిటీలోని అన్ని అంశాలు కాకపోయినా, అవసరమైన వాటినైనా అమలు జరపడానికి ప్రయత్నించినప్పుడు పై దశ అంతరిస్తుంది.

ఈ మూడు దశలలో మొదటి దశ బ్యాంకు విధానాన్ని అభివృద్ధి పరచి, స్థిరత్వాన్ని చేర్చడానికి ప్రతీకగా చెప్పవచ్చు. ఏ స్థాయిలో బలహీనత ఉందో తెలుసుకొని, వీటిని కలుపుకొని, అభివృద్ధి పథంవైపు పయనించి, చిన్న చిన్న బ్యాంకు వ్యవస్థలు కూడా అభివృద్ధి చెంది ప్రముఖమైన సంస్థలుగా పెంపొందాయి. దానికి తోడు భారతీయ రిజర్వు బ్యాంకు జోక్యం కలిపించుకొని, వాటి అభివృద్ధికై అనూహ్యమైన పాత్రను నిర్వహించింది. ఈ దశలో సహకార పరపతి, విత్త నిర్మాణం బలపడే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగింది.

బ్యాంకులను జాతీయం చేసి, 'బిగ్‌పుష్'ను ఏర్పాటుచేయడంలోనూ, లీడ్ బ్యాంకు పథకాన్ని ప్రవేశ పెట్టడంతోనూ 1969 నుండి 15 సంవత్సరాల కాలంలోనే వాణిజ్య బ్యాంకుల పనితీరులోనూ, వీటి భౌగోళిక విస్తరణలోనూ గొప్ప మార్పు సంభవించింది. వాణిజ్య బ్యాంకుల సేవలు గ్రామాలకు కూడా విస్తరించి, అనేకులకు అందుబాటులోకి వచ్చాయి. వాటి విధి నిర్వహణలో కూడా ఎంతో మెరుగుదల కన్పించింది. పూర్వం భారతీయ రిజర్వు బ్యాంకులో అంతర్భాగంగా ఉన్న భారతీయ పారిశ్రామిక అభివృద్ధి బ్యాంకు (IDBI) రిజర్వు బ్యాంకు నుండి వేరుచేయబడి ప్రత్యేక స్వాతంత్ర్య ప్రతిపత్తిని పొందింది. నాబార్డ్ (NABARD), ఎక్సిమ్ బ్యాంకు (EXIM BANK) లు 1982లో ఏర్పడినాయి. 1969 నుండి బ్యాంకులు తమ శాఖలను ఎక్కువ సంఖ్యలో విస్తరింపచేయడమే కాక, గ్రామీణ ప్రాంతాలలో, చిన్న చిన్న పట్టణాలలో తమ శాఖలను నెలకొల్పి తమ కార్యకలాపాలను మెరుగు పరచినాయి. బ్యాంకులు తమ సేవల ద్వారా సాంఘిక, ఆర్థిక సంఘటితాభివృద్ధికి, జాతీయ భావనను పెంపొందించడానికి, అదే కాలంలో ప్రభుత్వ రంగపు ఆర్థిక అవసరాలు తీర్చడానికి ప్రయత్నం జరిగింది. ఈ పనులన్నింటిని చేయడం వలన అతి సామాన్య వ్యక్తికి కూడా బ్యాంకు సేవలు అందుబాటులోకి వచ్చాయి.

బ్యాంకు శాఖల కార్యాలయాలు 1969 జూన్ నెలలో 8,262 ఉండగా, 1991 మార్చి అంతం నాటికి 60,101 కి పెరిగాయి. ఈ విస్తరణలో కూడా గ్రామీణ ప్రాంతంలో నెలకొల్పబడిన శాఖల సంఖ్య ఎక్కువగా ఉంది. అంటే ఈ శాఖల వాటా 22 శాతం నుండి 58.4 శాతానికి పెరిగింది. ఒక బ్యాంకు ఆఫీసు 1969 జూన్‌లో 65,000 జనాభాకు సేవచేయగా, 1991 మార్చి నాటికి ఆ బ్యాంకు ఆఫీసు సేవచేసే జనాభా పరిమాణం 11,000 తగ్గింది. వాణిజ్య బ్యాంకులలో డిపాజిట్ల రూపంలో రిజిష్టర్ అయిన మొత్తం ద్రవ్యం జూన్ 1969లో రూ. 46.46 బిలియన్లు ఉండగా, 1991 మార్చి 22 నాటికి రూ. 1,925.42 బిలియన్లకు పెరిగింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు సమకూర్చిన మొత్తం పరపతిలో ప్రాధాన్యతా రంగాల వాటా 1969 జూన్‌లో 15 శాతం ఉండగా, 1991 లో అది 39.2 శాతానికి పెరిగింది.

BRAOU

వాణిజ్య బ్యాంకులు జాతీయం చేయబడిన తరువాత అనేక అంశాలలో అభివృద్ధి చెందినాయి. ఆ అభివృద్ధిలో 1985వ సంవత్సరం మరో మూలరాయి. 1985 నుండి అనేక విప్లవాత్మక మార్పులు బ్యాంకు వ్యవస్థలో చోటు చేసుకొన్నాయి. ఈ కాలం నుండి శాఖల విస్తరణలో వేగం కొంత తగ్గినప్పటికీ, పట్టణ ప్రాంతాలకు, గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకుల సేవలు విషయంలో గల ఖాళీ చాలావరకు పూరింపబడింది. విధి నిర్వహణలో వివిధ ప్రాంతాల నుండి వివిధ రకాలైన సేవలను అందించడం మొదలు పెట్టాయి. 1985 అనంతరం ఏకంగా ఎంపిక చేయబడిన బ్యాంకు విధి నిర్వహణలు అనేక అంశాలతో కూడుకొన్నాయి. అవి :

(i) కార్యక్రమ నిర్వహణా ప్రణాళికను నిర్దిష్ట రూపంలో తయారుచేసి, కార్యనిర్వాహణను కూడా ఏ బ్యాంకుకు ఆ బ్యాంకు వ్యక్తిగతంగా తయారు చేయాలి. దీనినే సాధారణ పరిభాషలో అభివృద్ధి ప్రణాళిక అంటారు. స్వభావికమైన అంశాలను, వ్యవస్థాపరమైన అంశాలను, విధానాలను పెంపొందించుటకు, మానవ వనరుల అభివృద్ధి మరియు శిక్షణ, ఖాతాదారుల సేవలు, గృహ నిర్వహణ, పరపతి యాజమాన్యం, అప్పులు లేక బకాయిలను తిరిగి రాబట్టుకోవడం సమర్థతను, లాభాలను చూపించుటకు చర్యలు తీసుకోవడం.

(ii) 'సర్వీస్ ఏరియా అప్రోచ్' పథకం ద్వారా అప్పులను అందజేసే పథకాన్ని ప్రత్యేకించి గ్రామీణ బ్యాంకులు ఏర్పాటు చేయాలి. బ్యాంకింగ్ కార్యకలాపాల విషయంలో ఖచ్చితమైన సంవిధానాన్ని ఏర్పాటు చేసుకోవడం.

(iii) బ్యాంకింగ్ కార్యకలాపాలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దశల వారీగా ప్రవేశపెట్టడం.

(iv) విత్త సంబంధమైన అభివృద్ధిని సాధించడాన్ని ప్రతిబింబించే విధంగా లాభదాయకమైన, నిర్దేశింపబడిన అంశాల సహాయంతో, బ్యాంకు పెట్టుబడి ఆధారంగా అభివృద్ధి చెందడం, సేవల చార్జీల విషయంలో బ్యాంకు కొంత సడలింపును ఇవ్వడం.

నరసింహం కమిటీ సిఫారసు చేసిన చర్యలను అమలు చేయడం వలన చివరి అంశం నెరవేరుతుంది.

ఇటీవలి కాలంలో బ్యాంకింగ్ వ్యవస్థలో అనేక మార్పులు చేయబడ్డాయి. విత్త సంస్థలు ఎక్కువ మొత్తంలో వివిధ రకాలైన పాత్రలను నిర్వహించడం జరుగుతున్నది. విత్త సంబంధ విషయాలలో మధ్యవర్తిత్వం వహించి, వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులలో సంభవించే మార్పులు అనేక లక్షణాలలో ప్రతబింబిస్తున్నాయి. అదేవిధంగా విత్తసంబంధమైన అంశాలలో సంభవించే మార్పులు కార్పొరేషన్ రంగంలో కూడా ప్రత్యేకంగా దీర్ఘకాలిక అప్పులు మరియు సమానత్వ పెట్టుబడి విషయంలో చోటు చేసుకొన్నాయి. అన్ని బ్యాంకులు, విత్త సంస్థలు వాటి ఉమ్మడి బ్యాలెన్సు పట్టికలలో విత్త సంస్థల వాటాను, మొత్తం విత్త సంబంధమైన ఆస్తులనుండి ప్రత్యేకంగా చూపించినాయి. వాటి ప్రకారం, విత్త సంబంధమైన ఆస్తులు 1990 మార్చి నాటికి 33.2 శాతానికి పెరిగాయి. భారతదేశం మొత్తంలో కల అన్ని ప్రధాన సంస్థల విత్త సంబంధమైన ఆస్తులు 1980 - 81 ఆర్థిక సంవత్సరానికి రూ. 61.43 బిలియన్లు ఉండగా, 1989-90 ఆర్థిక సంవత్సరానికి ఆ మొత్తం రూ. 449.41 బిలియన్లకు పెరిగింది. అదే విధంగా రాష్ట్ర స్థాయిలలో గల విత్త సంస్థల ఆస్తులు, అంటే రాష్ట్ర విత్త కార్పొరేషన్లు (SFCs), రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ల (SIDCs) ఆస్తుల మొత్తం 1980 - 81 లో రూ. 17.33 బిలియన్లు ఉండగా, 1989 -90 నాటికి రూ. 78.99 బిలియన్లకు పెరిగింది. పెట్టుబడి సంస్థ (LIC, GIC, UTI) ల ఆస్తులు 1980 - 81 లో రూ. 85.34 బిలియన్లు ఉండగా 1989 - 90 నాటికి రూ. 476.94 బిలియన్లకు పెరిగింది. అంతేకాక, విత్త సంస్థలు, బ్యాంకుల మధ్య విత్త ఆస్తుల నిష్పత్తి కూడా క్రమంగా పెరుగుతూ ఉన్నది.

BRAOU

1990 - 91వ సంవత్సరం అన్ని విత్త సంస్థల ద్వారా ఇవ్వబడిన సహాయం రూ. 199.17 బిలియన్లు. ఇది అంతకు క్రితం సంవత్సరం కంటే రూ. 42.69 బిలియన్లు ఎక్కువ. అంటే అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే, 27.3 శాతం పెరుగుదల కన్పిస్తుంది.

పెట్టుబడి మార్కెట్‌లో, కార్పొరేషన్ రంగంలో పెట్టుబడి మొత్తం అధికంగా పెరుగుతున్నది. ప్రైవేటు కార్పొరేషన్ రంగంలో పెట్టుబడుల మొత్తం రికార్డు స్థాయిలో రూ.64.74 బిలియన్లకు పెరిగింది. ఇందులో 408 ఇష్యూలు (issues)1989 - 90 లోనివే. ఈసంఖ్య 1990-91 కి (365 ఇష్యూలద్వారా) తగ్గి రూ. 42.01 బిలియన్లకు చేరింది. ఎక్కువ తరుగుదల ఈ కాలంలో ప్రాథమిక అంశాలలోనే జరిగింది. అయినప్పటికీ స్వాభావిక ప్రతిస్పందనలో స్థూల ఆర్థిక అసమానతలు ఏర్పడడానికి కారణం నాటి గల్ఫు సంక్షోభం, ఫోరెక్స్ రిజర్వులలో అసమానత మరియు ఆర్థిక వ్యవస్థలో సంభవించిన అసమానతలు. దీనిని పూరించడానికి సమాన స్థాయిలో నూతన పెట్టుబడి మార్కెట్ స్థాపింపబడటం గాని, అభివృద్ధి చేయబడటం గాని జరగలేదు. కాని నూతన పంథాలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో క్రొత్త వ్యవస్థలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. ఫలితంగా నూతన ప్రాజెక్టులు ఉద్భవించాయి. విత్త మార్కెట్ పెట్టుబడుల మొత్తాలు పెరగడం ప్రారంభించాయి. స్టాక్ మార్కెట్లు ఇటీవలి కాలంలో రికార్డు స్థాయిలో పెట్టుబడులను సేకరించాయి, ద్వితీయ మార్కెట్ వ్యవస్థను కూడా అభివృద్ధి పరిచాయి. మార్కెట్‌లో యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, మ్యూచువల్ ఫండ్స్, వాణిజ్య బ్యాంకుల ప్రధానమైన భూమికను నిర్వహించి, మార్కెట్‌ను విస్తరింపచేసి, ఆధునికతను సంతరింప జేసినాయి. ప్రభుత్వ చర్యల ద్వారా, సెక్యూరిటీలు మరియు భారతీయ ఎక్స్ఛేంజి బోర్డుల ద్వారా, ఇటీవలి కాలంలో పెట్టుబడిదారులకు పూర్తి భద్రత కల్పించడానికి చర్యలు తీసుకోబడ్డాయి.

## 8.6.2 సరళీకృత విధాన చర్యలు

ప్రస్తుతం జరుగుతున్న దశలో విత్త మార్కెట్ల అభివృద్ధి 1985 నుండి ప్రారంభమైంది. ఈ దశలో ముఖ్యంగా సామర్థ్యానికి, పోటీ విధానానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడి నవకల్పనలు ప్రవేశపెట్టబడ్డాయి. ఆధిపత్యం, ఆరోగ్యకరమైన పోటీ, విభజన మొదలైన లక్షణాలతో బ్యాంకులు, విత్త సంస్థలు పోటీపడటం ప్రారంభించాయి. విధానాలలో దశలవారీగా అనేక మార్పులు చేయబడి, అవి అమలు చేయబడుతున్నాయి. ఈ నూతన మార్పులు ప్రవేశపెట్టబడటం వల్ల విత్త విధానంలో అనేక రంగాలలో, ఎన్నో మార్పులు సంభవించాయి. క్రెడిట్, ద్రవ్య మార్కెట్లు, పెట్టుబడి మార్కెట్లు, సెక్యూరిటీ మార్కెట్లు ప్రత్యేకంగా ఏర్పడ్డాయి. సరళీకృత ఆర్థిక విధానం ద్వారా తీసుకోబడిన చర్యల వలన పరిశ్రమ, అంతర్జాతీయ వ్యాపారం మరియు సాంకేతిక రంగంలో అనూహ్యమైన మార్పులు సంభవించాయి.

విత్త విధానంలో సరళీకృత విధానం ప్రవేశపెట్టబడిన తరువాత, భారత దేశంలో గల విత్త మార్కెట్లు ఎంతో వేగంగా పనిచేయడం మొదలెట్టాయి. మన దేశంలో ప్రత్యేకంగా విత్త మార్కెట్లు ఎక్కువగా పబ్లిక్ రంగంలోనే ఉన్నాయి. విధాన సంబంధమైన నియమిత పని ప్రకారం పనిచేయడం మొదలు పెట్టి ఎక్కువ ప్రాముఖ్యత గల రంగాలకు అప్పులను మంజూరు చేయడం ప్రారంభించాయి. నియంత్రించబడిన వడ్డీరేటుతో ప్రాధాన్యత కలిగిన రంగాలకు కొంత రాయితీతో పరపతి సౌకర్యాలను కల్పిస్తున్నాయి. సమిష్టిగా అప్పు తీసుకొనే సంస్థలకు కూడా కొంత మినహాయింపు యివ్వబడుతున్నది. బ్యాంకుల వనరుల వలన రిజర్వు అవసరాలను తీర్చడం కోసం మార్కెట్ రేటు కన్నా తక్కువకే పరపతిని ఏర్పాటు చేయడం జరుగుతున్నది. బ్యాంకుల లాభాల మీద కూడా అనేక ఒత్తిడులు ఉన్నాయి. అంతర్జాతీయ చెల్లింపులలో లోటు ఏర్పడటం వలన, మరొకవైపు ఎక్స్ఛేంజి కంట్రోలు వలన, డి-రెగ్యులేషన్ వలన, సరళీకృత ఆర్థిక విధానాన్ని అనుసరించి 1992-93వ సంవత్సరపు బడ్జెట్

BRAOU

తయారుచేయబడింది. "వాటర్ షెడ్" అభివృద్ధి, "ఇపోక్" తయారీ మొదలైనవి స్వాభావికంగా ఏర్పాటు చేయబడ్డాయి.

## 8.7 ద్రవ్యం - ఆర్థికాభివృద్ధి

కేవలం ద్రవ్యం ఒక్కటే ఆర్థికవృద్ధికి సూచిక కాదు. ఉత్పత్తి, ఉద్యోగాలు, ధరలు పెరగడం వలన ద్రవ్య సప్లయి పెరుగుతున్నట్లు తరచుగా గమనించడం జరిగింది. 1980వ దశకంలో మరియు 1990 వ దశకంలో భారతదేశంలో ఎక్కువ ఉత్పత్తి వృద్ధిని సాధించడం జరిగింది. అంతకు పూర్వం దాదాపు 30 సంవత్సరాల నుండి 3.5 శాతం మాత్రమే అభివృద్ధి రేటు ఉండగా, ఈ కాలంలో 5.5 శాతం అభివృద్ధిని సాధించింది. అనేక పరిశ్రమలు, సంస్థలు నెలకొల్పబడి, ఎన్నో ఉద్యోగావకాశాలు పెరిగాయి. ఆర్థిక రంగంలో ఏవిధంగా అభివృద్ధి జరిగిందో అదే విధంగా ద్రవ్య సరఫరా కూడా పెరిగింది. ఈ సరఫరా గడిచిన 3 సంవత్సరాల కాలంలో ఎక్కువగా పెరిగిందనడానికి పట్టిక 8.2 తార్కాణం.

**పట్టిక - 8.2 : ద్రవ్యం రకాలు మరియు ద్రవ్యంలో తారతమ్యం**

| క్ర. సం. | ద్రవ్యం - రకాలు | 1991 - 92 | 1992 - 93 | 1993 - 94 |
|---|---|---|---|---|
| 01. | ద్రవ్య సరఫరా (M) | 19.4 | 14.1 | 14.1 |
| 02. | ప్రజల దగ్గర ద్రవ్యం | 15.2 | 12.4 | 16.1 |
| 03. | వాణిజ్య బ్యాంకుల డిపాజిట్లు మరియు అడ్వాన్సులు | 19.8 | 16.4 | 13.8 |
| 04. | ఫండ్ కాని అడ్వాన్సులు | 8.2 | 20.1 | 16.3 |
| 05. | రిజర్వు ద్రవ్యం | 12.4 | 11.5 | 20.4 |
| 06. | రిజర్వు బ్యాంకు నికరంగా కేంద్రానికి ఇచ్చిన క్రెడిట్ | 6.7 | 9.7 | 10.8 |

**ఆధారం :** GOI, ఆర్థిక సర్వే, 1993 - 94.

1950 - 51 లో స్థూల దేశీయ పొదుపు శాతం స్థూల దేశీయ ఉత్పత్తి (GDP)లో దాదాపు 10.2 శాతం ఉండగా 1978-79లో 23.2 శాతంగానూ, 1980 నాటికి 20 శాతంగానూ స్థిరీకరణ చెందింది. భారతదేశపు పొదుపుల చేత ఆశీర్వదింపబడి పొదుపు మొత్తాలు పెరిగాయి. ఇటీవలి కాలంలో ఈ మొత్తం రూ. 2000 బిలియన్లకు పెరిగింది.

1990 వ సంవత్సరం తరువాత అమలుగావింపబడుతున్న సరళీకృత ఆర్థిక విధానం వలన ద్రవ్య సరఫరా పెరిగింది. ఇవన్నీ కూడా కేంద్ర ప్రభుత్వం యొక్క నూతన ద్రవ్య విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయి. 1970వ దశాబ్దంలో స్టాక్ మార్కెట్‌లో ప్రజలు పాల్గొనడం వల్ల ప్రతి సంవత్సరం రూ. 90 కోట్లు లభించాయి. 1993-94 నాటికి ఈసంఖ్య రూ. 22,000 కోట్లకు చేరింది. మార్కెట్‌లోని పెట్టుబడులు కూడా ఎంతో మొత్తంలో పెరిగి 1980 వ సంవత్సరంలో రూ. 6,750 కోట్లు ఉండగా, 1993-94వ సంవత్సరం నాటికి రూ. 3,40,000 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో పెట్టుబడి చేసే ప్రజల సంఖ్య కూడా 1980లో 2 మిలియన్ల నుండి 1990 నాటికి 40 మిలియన్లకు పెరిగింది. ద్వితీయ మార్కెట్‌లో కూడా స్టాక్ ఎక్స్చేంజి సంఖ్య 21 కి పెరిగింది. కంపెనీల సంఖ్య కూడా 1980లో 2,300 ఉండగా 1990 నాటికి 7,500 కు పెరిగింది. 1979 - 80లో ప్రతిరోజు 'టర్నోవర్' రూ. 25 కోట్లు ఉండగా 1993 - 94 నాటికి రూ. 800 కోట్లకు పెరిగింది.

భారతదేశంలోని కుటుంబ వ్యవస్థలను, వారికి గల లోభత్వాన్ని (parsimony) నిందించవలసి ఉంది. అనేక మంది భౌతిక ఆస్తులు, అంటే బంగారం, వెండి, ఇతర వస్తువుల రూపంలో ఆస్తులు పెంచుకోవడంలో ఎక్కువ అభిలాష విశ్వాసాన్ని కలిగి ఉన్నారు. అంతేకాక తమ పొదుపులను పెంపొందించి, ఆర్థికాభివృద్ధికి కావలసిన పెట్టుబడులను అభివృద్ధి చెయ్యడానికి సిద్ధపడటం లేదు. ఆర్థిక శాస్త్రవేత్త V. K. R. V. రావు ప్రకారం "న్యాయం లేకుండా పొదుపు మరియు అభివృద్ధిలేని పెట్టుబడుల" ను భారతీయులు కలిగి ఉన్నారు. నూతన ఆర్థిక విధానం వలన, నూతన ప్రైవేటు పెట్టుబడుల వలన ఆస్తులు ప్రాథమిక మార్కెట్లులో రూ. 22,000 కోట్లకు పెరిగాయి.

మన దేశంలో వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని, జాతీయ భద్రతను కాపాడడానికి బ్యాంకులను 1969 మరియు 1980 లలో జాతీయం చేయడం జరిగింది. ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థ గురించి తెలియడం వలన బ్యాంకుల డిపాజిట్లు పెరగడమే కాక, ప్రాధాన్యత గల రంగాలకు ఋణాలు కూడా లభించాయి. భారతదేశంలో గ్రామీణ బ్యాంకు వ్యవస్థ నెలకొల్పడం వలన వాణిజ్య బ్యాంకులు మరో మెట్టు పైకెక్కినట్లు అయింది. నేడు గ్రామీణ బ్యాంకులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపు రేఖలు మార్చివేసి, గ్రామీణ ప్రజలలో పొదుపు అలవాటును కూడా పెంపొందించాయి. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, లీడ్ బ్యాంకు పథకం, వ్యవసాయ విత్త సంస్థలు నెలకొల్పబడి ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదం చేస్తున్నాయి.

## 8.8 సారాంశం

ద్రవ్య విధులను, ద్రవ్య పరిణామ క్రమాన్ని, ద్రవ్య ఆవశ్యకతను, ద్రవ్య సప్లయ్ అంశాలను భారత దేశాన్ని సోదాహరణంగా తీసుకొని ఇంతకు ముందే వివిధ పాఠాలలో చర్చించుకొన్నాం. అయినప్పటికీ, వీటిలో కొన్నింటిని ఈ పాఠంలో సంక్షిప్తంగా వివరించడం జరిగింది. ఈ చర్చను బట్టి తెలిసిందేమిటంటే ఆధునిక ఆర్థిక వ్యవస్థలలో నాగరికత పెంపొందడానికి అభివృద్ధి జరగడానికి, వివిధ మార్కెట్లు ఏర్పడడానికే గాకుండా అవి వ్యాప్తి చెందడానికి ద్రవ్యం ఎంతో దోహదపడింది. విత్త మార్కెట్, విత్త వ్యవస్థ ఏర్పాటుకు ద్రవ్యం ఎంతైన అవసరం. విత్త మార్కెట్లు అభివృద్ధి చెందడం వల్లే ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. ఈ రెండూ పరస్పర పూరకాలని చెప్పవచ్చు.

భారతదేశంలో విత్త మార్కెట్ల విస్తరణ మూడు దశలలో జరిగినట్లుగా చెప్పవచ్చు. మొదటి దశలో (1950వ, 1960వ దశాబ్దాలు) బ్యాంకింగ్ విధానం అభివృద్ధి చెంది, స్థిరత్వం చేకూరింది. ఈ దశను సంధి దశ అనవచ్చు. రెండవ దశ (1969 నుండి 1985 వరకు) లో బ్యాంకుల తీరు తెన్నులలో, విస్తరణలో ఎంతో మార్పు వచ్చింది. ఈ దశను అభివృద్ధితో కూడిన విస్తరణ దశ అంటారు. 1985 తర్వాత మూడవ దశ ఆరంభమైంది. ఈ దశను సరళీకృత దశ లేదా నవకల్పన దశ అనవచ్చు. 1985 తర్వాత బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు జరిగాయి. స్వాతంత్ర్యానంతరం దేశ ఆర్థికాభివృద్ధికి గాను, ముఖ్యంగా పారిశ్రామిక రంగాన్ని, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి గాను ఎన్నో విత్త సంస్థలు స్థాపించబడ్డాయి. IDBI, ICICI, SFCs & NABARD, LIC, GIC, UTI, IFCI, SIDBI, EXIM BANK వంటి విత్త సంస్థలతో బాటు మ్యూచ్‌వల్ ఫండ్లు, హైర్ పర్చేజ్ సంస్థలు, చిట్ ఫండ్లు, స్టాక్ మార్కెట్లు కూడా స్థాపించబడి విస్తరింపబడినాయి. భారతదేశంలో చేపట్టబడిన సరళీకృత విధాన చర్యలు కూడా విత్త సంస్థల అభివృద్ధికి, ఆర్థికాభివృద్ధికి దారి తీసాయని చెప్పవచ్చు.

BRAOU

## 8.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలలో ఒక్కొక్క దానికి సుమారు 40 పంక్తులలో జవాబులు రాయండి.**

1. ద్రవ్య పరిణామ క్రమాన్ని వివరిస్తూ, ద్రవ్యపు ప్రధాన విధులను చర్చించండి.
   **సూచన : మొదటి పాఠాన్ని కూడా చదివి ఈ ప్రశ్నకు జవాబును రాయగలరు.**
2. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో విత్త వ్యవస్థ పాత్రను వివరించండి.

**II. క్రింది ప్రశ్నలలో ఒక్కొక్క దానికి సుమారు 20 పంక్తులలో జవాబులు రాయండి.**

1. ద్రవ్య సప్లయ్‌లోని భాగాలను విశదీకరించండి.
2. బ్యాంకుల ద్రవ్య / పరపతి సృష్టి ఏవిధంగా జరుగుతుంది ?
3. ద్రవ్య గుణకాన్ని విపులీకరించండి.
4. భారతదేశంలో విత్త మార్కెట్ల విస్తరణ ఏ విధంగా జరిగిందో వివరించండి.

## 8.9 సంప్రదింపు గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | G. Crowther | : | An Outline of Money |
| 2. | Suraj B. Gupta | : | Monetary Economics |
| 3. | R.B.I. | : | Report on Currency and Finance |
| 4. | D.M. Mithani | : | Currency & Banking |


BRAOU

## 8.10 పదకోశం

| | | |
|---|---|---|
| Commodity money | : | వస్తు ద్రవ్యం |
| Paper money | : | కాగితపు ద్రవ్యం |
| Near money | : | సమీప ద్రవ్యం |
| Reserve money | : | సంచిత ద్రవ్యం |
| Time deposits | : | కాలపరిమితి డిపాజిట్లు |
| Base money | : | ఆధారిత ద్రవ్యం |
| Primary money | : | ప్రాథమిక ద్రవ్యం |
| Staff security deposits | : | ఉద్యోగ భద్రత డిపాజిట్లు |
| Macro dynamic analysis | : | స్థూల చలన విశ్లేషణ |
| Mystical | : | గూఢమైన |
| Salary earnings | : | వేతన సంపాదనలు |
| Money multiplier | : | ద్రవ్య గుణకం |

| | | |
|---|---|---|
| Phase of transition | : | సంధి కాలం |
| Shares | : | షేర్లు |
| Debentures | : | డిబెంచర్లు |
| Bonds | : | బాండ్లు |
| Mutual funds | : | మ్యూచ్‌వల్ ఫండ్లు |
| Hire purchase Companies | : | హైర్ పర్చేజ్ కంపెనీలు |
| Open market operations | : | బహిరంగ మార్కెట్ వ్యవహారాలు |
| Bank rate | : | బ్యాంకు రేటు |
| Statutary reserve ratio | : | చట్టబద్ధమైన రిజర్వు నిష్పత్తి |
| Barter system | : | వస్తు మార్పిడి విధానం |
| Deferred payments | : | వాయిదా చెల్లింపులు |
| Standard | : | ప్రమాణం |
| Policy measures | : | విధాన చర్యలు |
| Liberalised | : | సరళీకృత |
| Economic development | : | ఆర్థికాభివృద్ధి |
| Economic growth | : | ఆర్థిక వృద్ధి, ఆర్థిక పురోగతి |
| Parsimony | : | లోభత్వం |

- ఆచార్య సి. ఎస్. ఎన్. రాజు

BRAOU

## భాగం - 9: ప్రసార యంత్రాంగం

**విషయ క్రమం**


9.0 ఉద్దేశాలు

9.1 పరిచయం

9.2 ద్రవ్యరాశి సిద్ధాంతం ప్రకారం ప్రసార యంత్రాంగం

9.3 కేన్స్ సిద్ధాంతం ప్రకారం ప్రసార యంత్రాంగం

9.4 ద్రవ్యవాదం ప్రకారం ప్రసార యంత్రాంగం

9.5 సారాంశం

9.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు

9.7 సంప్రదింపు గ్రంథాలు

9.8 భావనలు

9.9 పదకోశం


### 9.0 ఉద్దేశాలు

ఖండం 2 లోని వివిధ భాగాల్లో ద్రవ్యానికి సంబంధించిన పలు సిద్ధాంతాలను వివరంగా తెలుసుకున్నాం. ద్రవ్య డిమాండును ప్రభావితం చేసే వివిధ కారకాలను కూడా అర్థం చేసుకున్నాం. ద్రవ్య డిమాండుకు సంబంధించి కేన్స్, ఫ్రీడ్‌మన్, బౌమోల్, టోబిన్ మొదలగు ఆర్థికవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాలను వివరించాం. ద్రవ్య సప్లైలోని మార్పులు వివిధ స్థూల ఆర్థిక చలరాశులపై తమ ప్రభావాన్ని ఎలా చూపుతాయో అధ్యయనం చేయడం ఈ భాగపు ముఖ్య లక్ష్యం. ఏదైనా ఒక కారణం వలన ద్రవ్య సప్లైలో మార్పులు వస్తే ఆ మార్పులు ఆర్థిక వ్యవస్థలో ఏవిధంగా ప్రసరించి ముఖ్యమైన స్థూల ఆర్థిక చలరాశులపై తమ ప్రభావాన్ని చూపుతాయో ఈ భాగంలో తెలుసుకుంటాం.

BRAOU

### 9.1 పరిచయం

స్థూల ఆర్థిక నమూనాల (macro economic models) లో ద్రవ్య సప్లైని బాహ్యాంశం (exogenous) గా పరిగణించినా, ద్రవ్య సప్లైని నిర్ణయించే అంశాలను తెలుసుకోవడం అత్యంత అవసరమని మొదటి ఖండపు మూడవ పాఠంలో తెలుసుకున్నాం. ద్రవ్య సప్లైకి సంబంధించి హెచ్ (H) సిద్ధాంతాన్ని ఆ యూనిట్‌లో తెలుసుకున్నాం. 'H' సిద్ధాంతం ప్రకారం సప్లైని ఆధార ద్రవ్యం, ద్రవ్య గుణకం కలిపి నిర్ణయిస్తాయి. ఆధార ద్రవ్యం (base money) లేదా అతిశక్తివంతమైన ద్రవ్యాన్ని (high powered money) ఆర్.బి. ఐ., కేంద్ర ప్రభుత్వం కలిసి నిర్ణయిస్తాయి. ద్రవ్య గుణకాన్ని (money multiplier) మూడు ప్రవర్తనా నిష్పత్తులు నిర్ణయిస్తాయి. అవి : 1. కరెన్సీ - డిమాండు డిపాజిట్ల నిష్పత్తి , 2. రిజర్వు - డిపాజిట్ల నిష్పత్తి , 3. కాల డిపాజిట్ల నిష్పత్తి. ద్రవ్య సప్లై సిద్ధాంతం ప్రకారం ద్రవ్య సప్లైని ఈదిగువ సమీకరణం తెలియజేస్తుంది.

M = V.H

పై సమీకరణంలో M = ద్రవ్య సప్లై,

H = ఆధార ద్రవ్యం,

V = ద్రవ్య గుణకం.

భారతదేశంలో గత నలభై ఏళ్ళలో ద్రవ్య సప్లై పెరుగుదలకు ఆధార ద్రవ్యపు పెరుగుదల, ద్రవ్య గుణకపు పెరుగుదల కూడా కారణాలు. ఆధార ద్రవ్యపు పెరుగుదలకు ప్రధాన కారణం ఆర్.బి.ఐ. నుంచి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న పరపతిలో పెరుగుదల. **1970 - 71 — 1991 - 92** మధ్య కాలంలో ద్రవ్య గుణకం **2.28** నుండి **3.17** కు పెరిగింది. ప్రవర్తనా నిష్పత్తులలో వస్తున్న మార్పులు ద్రవ్య గుణకపు పెరుగుదలకు కారణాలుగా పేర్కొనవచ్చు.

ద్రవ్య సప్లైని, ఆ సప్లైలో వచ్చే మార్పులకు గల కారణాలను ఇంతకుముందు తెలుసుకున్నాం. ద్రవ్య సప్లైని నియంత్రించడానికి ద్రవ్య విధానాన్ని (monetary policy) రూపొందించి అమలుచేసే బాధ్యత ఆర్.బి.ఐ. ది. అయితే ద్రవ్య సప్లైలో మార్పులు ఏవిధంగా ప్రసారం అయి ముఖ్యమైన స్థూల ఆర్థిక చలరాశులను ప్రభావితం చేస్తాయో ఈ భాగంలో తెలుసుకుంటాం. ఈ ప్రసారం యంత్రాంగం (transmission mechanism) వివిధ ద్రవ్య సిద్ధాంతాల (monetary theories) లో ఏ రూపం తీసుకుంటుందో వివరించడం ఈ భాగపు ముఖ్య లక్ష్యం.

## 9.2 ద్రవ్యరాశి సిద్ధాంతం ప్రకారం ప్రసార యంత్రాంగం (Transmission Mechanism According to Quantity Theory of Money)

వివిధ స్థూల ఆర్థిక సిద్ధాంతాలు వివిధ ప్రసార యంత్రాంగాలను సూచిస్తాయి. వివిధ స్థూల ఆర్థిక చలాంక రాశులను ద్రవ్య సప్లయ్‌లోని మార్పులు ఏవిధంగా ప్రభావితం చేస్తాయో చెప్పేది ప్రసార యంత్రాంగం. సంప్రదాయ ఆర్థికవేత్తల స్థూల ఆర్థిక నమూనా ప్రకారం ద్రవ్యం వినిమయ మాధ్యమం పాత్రనే (medium of exchange) ప్రముఖంగా పోషిస్తుంది. ద్రవ్యం కొరకు డిమాండు ప్రముఖంగా లావాదేవీల కొరకు డిమాండు (transaction demand) మాత్రమే. శ్రమ మార్కెట్టు స్థితులు, సాంకేతిక జ్ఞానం కలిసి సంపూర్ణోద్యోగిత ఉత్పత్తి (full-employment output) ని నిర్ణయిస్తే, సాధారణ ధరల స్థాయిని నిర్ణయించేది ద్రవ్య సప్లై అన్నది సంప్రదాయ ఆర్థికవేత్తల స్థూల ఆర్థిక నమూనా (macro economic model) సారాంశం. వాస్తవిక చలాంక రాశుల (real variables) ను ద్రవ్య సప్లై ప్రభావితం చేయలేదు అన్నది సంప్రదాయ ఆర్థికవేత్తల వాదన. సంప్రదాయ ఆర్థికవేత్తల ఆలోచన ప్రకారం ఈ దిగువ ప్రసార యంత్రాగం వర్తిస్తుంది.

$$M \uparrow \longrightarrow P \uparrow \quad \ldots\ldots\ldots\ldots \quad (1)$$

$$M \downarrow \longrightarrow P \downarrow \quad \ldots\ldots\ldots\ldots \quad (2)$$

పై సమీకరణాలలో 'M' ద్రవ్య సప్లైని, 'P' సాధారణ ధరల స్థాయి (general price level)ని తెలుపుతాయి. సమీకరణం (1) ప్రకారం ద్రవ్య సప్లై పెరుగుదల ధరల పెరుగుదలకు దారితీస్తుంది. సమీకరణం (2) ప్రకారం, ద్రవ్య సప్లై తగ్గినప్పుడు సాధారణ ధరల స్థాయి తగ్గుతుంది.

ద్రవ్యరాశి సిద్ధాంతం చెప్పే ప్రసార యంత్రాంగం ప్రకారం ద్రవ్య సప్లైలో మార్పులు ధరల స్థాయిలో మార్పులను తీసుకువస్తాయి. ద్రవ్యరాశి సిద్ధాంతపు ప్రముఖ ప్రాతిపదిక (proposition) ఇది. సంప్రదాయ ఆర్థికవేత్తల సిద్ధాంతాన్ని థామస్ ఎమ్ హంఫ్రీ ఈ దిగువ అయిదు ప్రాతిపదికల రూపంగా చెప్పినాడు.

BRAOU

1. ద్రవ్య సప్లైకి, సాధారణ ధరల స్థాయికి మధ్య అనుపాత సంబంధం (proportional relationship) ఉంటుంది. అంటే ద్రవ్య సప్లైలో 5శాతం పెరుగుదల వస్తే ధరల స్థాయి కూడా 5శాతం పెరుగుతుంది. ఇదే మనం పైన చెప్పుకున్న ప్రసార యంత్రాంగం ప్రాతిపదిక.

2. ద్రవ్యం తటస్థ స్వభావం (neutrality) ను కలిగి వుంటుంది. ఈ ప్రాతిపదిక చెప్పేదేమిటంటే, ద్రవ్యపు సప్లైలో మార్పులు ధరల స్థాయినే తప్ప వాస్తవిక చలాంక రాశులైన ఆదాయం, ఉద్యోగిత మొదలైన వాటిని ప్రభావితం చేయలేవు.

3. ధరలకు సంబంధించి ద్రవ్య సిద్ధాంతం (monetary theory of prices) ఉంటుంది. ఈ సిద్ధాంతం ప్రకారం కేవలం ద్రవ్య సప్లైలో మార్పులు మాత్రమే సాధారణ ధరల స్థాయి మార్పులకు కారణమవుతాయి.

4. ద్రవ్యం కారణ పాత్ర (causal rate of money) ను కలిగి వుంటుంది. ధరల మార్పుకు కారణం ద్రవ్య సప్లైలో మార్పు అన్నది ఈ ప్రాతిపదిక భావం.

5. నామ మాత్రపు ద్రవ్య సప్లై బహిర్గతంగా నిర్ణయింబడేది (exogeneity of the nominal stock of money).

ద్రవ్యరాశి సిద్ధాంతపు పై ప్రాతిపదికలను చాలావరకు ఖండించడమే కేన్స్ విప్లవపు ముఖ్య సారాంశం. చెప్పుకోదగినంత మేరకు నిరుద్యోగితతో ఆర్థిక వ్యవస్థ సమతౌల్యంలో ఉంటుందని కేన్స్ నిరూపణ నుండి పై ప్రాతిపదికలలో సత్యాన్ని ఖండించడానికి ఆధారం ఏర్పడింది. కేన్స్ జనరల్ థియరీ (General Theory) పుస్తకం నుండి అనుపాత ప్రాతిపదిక (proportionality proposition) కు వ్యతిరేకమైన ఈ దిగువ వాదనలు గమనార్హం.

1. అల్పోద్యోగితతో కూడిన సమతౌల్యం (under-employment equilibrium) ఉన్నప్పుడు ద్రవ్య సప్లై పెరుగుదల అదే అనుపాతంలో ధరలను పెంచడానికి బదులు ఉద్యోగితను, ఉత్పత్తిని పెంచుతుంది.

2. కేన్స్ ఉద్దేశంలో ద్రవ్య చలామణి వేగం (transaction velocity of money) అనిశ్చల చలాంకరాశి కాబట్టి ద్రవ్య సప్లైలో మార్పులను ఈ చలాంకం కొంత మేరకు గాని పూర్తిగా గాని రద్దు చేయవచ్చు. ఈ కారణంగా ద్రవ్య సప్లైలో మార్పులు ధరలపై అనుపాత ప్రభావాన్ని (proportional influence) చూపకపోవచ్చు.

3. వడ్డీరేటు వలన ప్రభావితం అయ్యే ద్రవ్య నిల్వలు (money holdings) ఉండడం కారణంగా, ద్రవ్యానికి ధరలకు ఉండే సంబంధం తొలగిపోవచ్చు.

తటస్థ ప్రాతిపదికను తీసుకుంటే అల్పోద్యోగితతో కూడిన సమతౌల్య స్థితిలో ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పుడు ద్రవ్య సప్లైలో పెరుగుదల ధరలనే గాకుండా ఆదాయం, ఉద్యోగిత మొదలైన ప్రముఖ స్థూల ఆర్థిక చలాంకాలను కూడా ప్రభావితం చేస్తుంది. అంటే ద్రవ్యం తటస్థంగా ఉండదు (money is not neutral). స్థిర - ధరల కేన్స్ నమూనాలో (fix price Keynesian model) ద్రవ్యం తటస్థం కాదు. అయితే ఈ దిగువ తెలిపిన రెండు స్థితులలో కేన్స్ నమూనాలో కూడా ద్రవ్యం తటస్థమయినదవుతుంది.

1. వడ్డీకి సంబంధించి ద్రవ్య డిమాండు అనంత వ్యాకోచత్వం కలిగినదైతే (demand for money is infinitely interest - elastic), ద్రవ్య సప్లైలో పెరుగుదల ద్రవ్య నిల్వలను అధికం చేయడమే తప్ప ఆదాయం, ఉద్యోగిత లాంటి స్థూల ఆర్థిక చలాంకాలలో మార్పు తీసుకు రాలేదు.

2. మార్కెట్ వడ్డీరేటును మార్చడం ద్వారా ద్రవ్య సప్లై మార్పులు వాస్తవిక రంగాలపై (real sectors) తమ ప్రభావాన్ని చూపుతాయి. అయితే సమష్టి డిమాండులోని వ్యయ వర్గాలు (spending categories)

వడ్డీరేటుకు సంబంధించి సున్నితమైనవి కాకపోతే (not sensitive) ద్రవ్యం తటస్థమైనదవుతుంది (వడ్డీరేటును తప్ప సమష్టి డిమాండును ద్రవ్య సప్లై ప్రభావితం చేయలేదు).

ధరలకు సంబంధించి ద్రవ్య సిద్ధాంతం ప్రాతిపదికను కూడా కేన్స్ త్రోసి పుచ్చాడు. ఈ అంశానికి సంబంధించి థామస్ టూకే (Thomas Tooke) సిద్ధాంతాన్ని కేన్స్ సమర్థించాడు. ఈ సిద్ధాంతం ప్రకారం ధరలు ఉత్పత్తి వ్యయాల ఆధారంగా నిర్ణయింపబడతాయి. ఉత్పత్తి వ్యయాల్లో ప్రముఖ భాగమైన చరవ్యయాలు (variable costs), శ్రమ వ్యయాల (labour costs) పై ఆధారపడి ఉంటాయి. కాబట్టి యూనిట్ శ్రమ వ్యయాల (unit -labour costs) మార్పులు ధరల మార్పులకు కారణం అవుతాయి. ద్రవ్య సప్లైలో మార్పులే కాకుండా వ్యయాలలో మార్పులు కూడా ధరలలో మార్పులను తీసుకువస్తాయి. కాబట్టి ద్రవ్య సప్లై ఒక్కటే ధరల మార్పుకు కారణం కాలేదు.

## 9.3 కేన్స్ సిద్ధాంతం ప్రకారం ప్రసార యంత్రాంగం (Transmission Mechanism According to the Keynesian Theory)

కేన్స్ సిద్ధాంతం ప్రకారం ద్రవ్య సప్లైలోని మార్పులు వడ్డీరేటులో మార్పులు తీసుకురావడం ద్వారా సమష్టి డిమాండును తద్వారా ఉద్యోగిత, ఆదాయాల్లో మార్పులు తీసుకువస్తాయి. కేన్స్ సిద్ధాంతం ప్రకారం ద్రవ్య రంగపు (monetary sector) పాత్ర వడ్డీరేటును నిర్ణయించడం. ద్రవ్య మార్కెట్‌లో ద్రవ్య డిమాండును, ద్రవ్య సప్లైని సంతులిత పరిచేది వడ్డీరేటు (interest rate balances suply of and demand for money). వడ్డీరేటు కేవలం ద్రవ్య అంశం అవుతుంది (rate of interest is a purely monetary phenomenon). వ్యక్తులను ద్రవ్యాన్ని వదులుకొని ద్రవ్యేతర ఆస్తుల (assets) ను కొనడానికి ప్రేరేపించేది వడ్డీరేటు.

ఈ ప్రమాణం ప్రకారం డిమాండు డిపాజిట్లు, కరెన్సీ మాత్రమే ద్రవ్య సప్లైలో భాగాలవుతాయి. ఈ కారణంగానే కీన్స్ వడ్డీరేటు సిద్ధాంతాన్ని ద్రవ్యాత్యాభిరుచి సిద్ధాంతం (liquidity preference theory) గా వ్యవహరిస్తారు. ఈ సిద్ధాంతానికి భిన్నంగా (in sharp contrast to this theory) సంప్రదాయ ఆర్థిక వేత్తల వడ్డీరేటు సిద్ధాంతం ప్రకారం, వడ్డీరేటు పొదుపును, పెట్టుబడిని సంతులిత పరుస్తుంది. భవిష్యత్తులో ఎక్కువ వినియోగానికై ప్రస్తుత వినియోగాన్ని మానుకునేటట్లు వడ్డీరేటు ప్రజలను పురికొల్పుతుందని సంప్రదాయ ఆర్థికవేత్తల ప్రతిపాదన.

BRAOU

కీన్స్ సిద్ధాంతం ప్రకారం ద్రవ్యపు ప్రసార యంత్రాగంను క్రింది విధంగా చూపవచ్చు.

1. విస్తరణాయుత ద్రవ్య విధానం (expansionary monetary policy)

$M\uparrow \rightarrow r\downarrow \rightarrow I\uparrow \rightarrow A.D.\uparrow \rightarrow Y,N\uparrow$

2. కుదింపు ద్రవ్య విధానం (contractionary monetary policy)

$M\downarrow \rightarrow r\uparrow \rightarrow I\downarrow \rightarrow A.D.\downarrow \rightarrow Y,N\downarrow$.

విస్తరణాయుత ద్రవ్య విధానానికి సంబంధించి సమీకరణం (1)లో చూపిన ప్రసార యంత్రాంగం ఈ దిగువ విధంగా పనిచేస్తుంది. ద్రవ్యత్వాభిరుచి లేదా ద్రవ్య డిమాండు తెలిసినప్పుడు, ద్రవ్యసప్లై (M) లో పెరుగుదల వడ్డీరేటు (r) ను తగ్గిస్తుంది. ఉపాంత పెట్టుబడి సామర్థ్యం (marginal efficiency of investment) తెలిసినప్పుడు, వడ్డీరేటులో తగ్గుదల పెట్టుబడి (I) ని అధికం చేస్తుంది. సమష్టి డిమాండు (A.D.) పెరగడం వలన ఉద్యోగిత (N) , ఆదాయం (Y) పెరుగుతాయి.

కుదింపు ద్రవ్య విధానానికి సంబంధించిన ప్రసార యంత్రాంగం సమీకరణం (2) లో చూపబడింది. ద్రవ్య

సప్లై తగ్గినప్పుడు వడ్డీరేటు పెరుగుతుంది. పెరిగిన వడ్డీరేటు కారణంగా సమష్టి డిమాండు తగ్గుతుంది. సమష్టి డిమాండు తగ్గడం వలన ఉద్యోగిత, ఆదాయం తగ్గుతాయి.

కేన్స్ సిద్ధాంతం ప్రకారం ద్రవ్య సప్లైకి సంబంధించి ప్రసార యంత్రాగం పై విధంగా పనిచేస్తుంది. ద్రవ్యవాద నమూనా లేదా ద్రవ్యవాదం (monetarist model or monetarism) తో సరిపోల్చేందుకుగాను కేన్స్ సిద్ధాంతపు ప్రసార యంత్రాగంను మరికొంత విశదీకరించుదాం. కేన్స్ అసలు (original) నమూనాలో ద్రవ్యానికి ప్రత్యామ్నాయ ఆస్థి (asset) బాండ్లు (bonds) మాత్రమే. కేన్సియన్లు (Keynesians) ఇతర ఫైనాన్సియల్ ఆస్తుల (financial assets) ను విశ్లేషణలో పొందుపరచి కేన్స్ సిద్ధాంతాన్ని విస్తరింపచేస్తారు. ఇతరఫైనాన్సియల్ ఆస్తులకు అతి సమీప ప్రత్యామ్నాయం ద్రవ్యమన్నది కేన్సియన్ల ప్రాతిపదిక. కాబట్టి వారి విశ్లేషణకు ప్రారంభం గృహాల ఆస్థి పోర్ట్‌ఫోలియోలు (households asset portfolios), తరువాత ద్రవ్య విధానపు ప్రభావం ఈ పోర్టు ఫోలియోలపై ఎలా పడుతుందో విశదీకరించండం. ద్రవ్య అధినేత అంటే ఆర్.బి.ఐ. (monetary authority i.e., RBI) ద్రవ్య సప్లైని అధికం చెయ్యడానికి బహిరంగ మార్కెట్ వ్యవహారాల ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేస్తుంది అనుకుందాం. అలా కొనడం వలన గృహాల తదితర ఆర్థిక ఏజెంట్ల పోర్ట్ ఫోలియోలలో ద్రవ్యం పెరుగుతుంది. ఈ కారణంగా పోర్ట్‌ఫోలియోలలో అసంతులిత (inbalance) ఏర్పడుతుంది. ఈ అసంతులితను తొలగించడానికి ద్రవ్యేతర ఫైనాన్సియల్ ఆస్తులను కొనుగోలు చేయనారంభమవుతుంది. ఈ విధంగా ద్రవ్యేతర ఫైనాన్సియల్ ఆస్తుల కొరకు డిమాండు పెరగడంతో వాటి ధరలు పెరుగుతాయి. ఈ ధరల పెరుగుదల కారణంగా వడ్డీరేట్లు తగ్గుతాయి. ఈ విధంగా ద్రవ్య విధానం వస్తు సేవలపై గృహాలు ఇతర ఆర్థిక ఏజంట్లు చేసే వ్యయం పై , ప్రత్యక్ష ప్రభావాన్ని చూపదు. అయితే ద్రవ్య విధానపు ఫైనాన్సియల్ ప్రభావం (financial effect) క్రమంగా ఆర్థిక వ్యవస్థలోని వాస్తవిక రంగాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఫైనాన్సియల్ ఆస్తుల ధరల పెరుగుదల ఉత్పత్తి సంస్థలను మూలధన వస్తువుల కొనుగోలును ప్రోత్సహించి అవి కొత్త ఫైనాన్సియల్ ఆస్తులను అమ్మేందుకు ప్రేరేపిస్తాయి. ఈవిధంగా ద్రవ్యరంగంలోని మార్పులు వాస్తవిక రంగాన్ని ప్రభావితం చేసే యంత్రాంగం (mechanism) అని టోబిన్ వివరించాడు. ద్రవ్య విధాన మార్పులలోని ప్రభావం ప్రథమంగా మూలధన వస్తువుల కొరకు డిమాండును ప్రభావితం చేసి తరువాత పెట్టుబడి పెరగడం కారణంగా గుణక ప్రభావ (multiplier effect) ఫలితంగా ఆదాయం, ఉద్యోగిత పెరుగుతాయి. పోర్ట్ ఫోలియో అసంతులితకు కారణమైన అధిక ద్రవ్య నిల్వల సమస్య ఈ దిగువ కారకాల వలన తొలగి తిరిగి పోర్టుఫోలియోలు సంతులిత స్థితిని చేరుకుంటాయి.

1. ఆదాయంలో పెరుగుదల వలన లావాదేవీలకు కావలసిన ద్రవ్య డిమాండు పెరుగుదల

2. ద్రవ్యము కొరకు స్పెక్యులేటివ్ డిమాండులో పెరుగుదల

పైవిధంగా విస్తరణాయుత ద్రవ్య విధానం ఆదాయ ఉద్యోగితల పెంపుకు దారితీస్తుందని కేన్సియన్ ప్రసార యంత్రాగం వివరిస్తుంది.

పై కేన్సియన్ యంత్రాంగం ఇంతకు ముందు చెప్పుకున్నట్లు రెండు సందర్భాలలో విఫలమవుతుంది.

1. ద్రవ్యత్వ వల (liquidity trap) సందర్భం. ద్రవ్య డిమాండు సంపూర్ణ వ్యాకోచత్వం కలదైనప్పుడు (తగు తక్కువ వడ్డీరేటు స్థాయి దగ్గర) ద్రవ్య సప్లయ్‌లో మార్పు వడ్డీరేటును ప్రభావితం చేయలేదు. ద్రవ్య సప్లై పెరిగినా వడ్డీరేటు తగ్గదు. వడ్డీరేటులో మార్పు రాకపోవడం వలన ప్రసార యంత్రాంగంలో ఇతర దశలు విఫలమవుతాయి. ఆర్థిక విస్తరణ సాధించడంలో ద్రవ్య విధానం పూర్తిగా విఫలమవుతుంది.

BRAOU

2. వినియోగ పెట్టుబడి డిమాండ్లు వడ్డీరేటుకు స్పందించినవి కానప్పుడు, వడ్డీరేటులో మార్పుకు వినియోగ పెట్టుబడులు మార్పు చెందనప్పుడు ద్రవ్య విధానం వడ్డీరేట్లలో మార్పు తెచ్చినా సమష్టి డిమాండులో మార్పు తీసుకురాలేదు. ఆ కారణంగా ఆర్థిక విస్తరణ సాధించడంలో ద్రవ్య విధానం విఫలమవుతుంది.

పైన చెప్పిన రెండు సందర్భాలలో ద్రవ్య విధానం విఫలమవుతుంది. కాబట్టి సాధారణ నిరుద్యోగిత సమస్యను పరిష్కరించడానికి కోశ విధానమే అనుసరించాలన్నది కేన్స్ చేసిన విధాన సిఫార్సు (policy recommendation).

## 9.4 ద్రవ్యవాదం ప్రకారం ప్రసార యంత్రాగం (Transmission Mechanism under Monetarism)

మిల్టన్ ఫ్రీడ్‌మన్ (Milton Friedman), ఆయన అనుయాయులు రూపొందించిన ద్రవ్యవాద నమూనా (monetarist model) ప్రకారం ద్రవ్య సప్లై మార్పులకు, సమష్టి డిమాండుకు మధ్య ప్రత్యక్ష సంబంధం (direct link) ఉంటుంది. ఈ నమూనా ప్రకారం ద్రవ్య సప్లైలో మార్పులు నామ మాత్ర లేదా ద్రవ్య రూప ఆదాయాన్ని (nominal or money income) పెంచుతుంది. అయితే ఈ ద్రవ్య రూప ఆదాయ పెరుగుదలలో ఎంత భాగం ధరల పెరుగుదల, ఎంత భాగము వాస్తవిక ఆదాయ పెరుగుదల కారణంగా ఏర్పడింది అనేది తేల్చలేని ప్రశ్న (open question). కొంత వరకు ఈ ప్రశ్నకు సమాధానం ఆర్థిక వ్యవస్థ ఏ స్థితిలో ఉన్నదన్న అంశంపై ఆధారపడుతుంది. ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగిత అధికంగా ఉన్నప్పుడు ద్రవ్య సప్లైలో పెరుగుదల వాస్తవిక ఆదాయ పెంపుదలకు ఎక్కువ మేరకు దారితీస్తుంది. అదే ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ ఉద్యోగిత స్థాయికి దగ్గరగా ఉన్నప్పుడు ధరల పెరుగుదలకు ఎక్కువ మేరకు దారితీస్తుంది.

ద్రవ్యవాద నమూనా ప్రకారం ప్రసార యంత్రాంగంను ఈ దిగువ విధంగా చూపవచ్చు.

ద్రవ్య సప్లై $\uparrow \rightarrow$ సమష్టి డిమాండు $\uparrow \rightarrow$ ద్రవ్యరూప ఆదాయం $\uparrow$, ఉద్యోగిత $\uparrow$

ద్రవ్య సప్లై పెరుగుదల సమష్టి డిమాండును తద్వారా ఆదాయ, ఉద్యోగితలను పెంచుతుందని పై ప్రసార యంత్రాంగం చెప్తుంది.

ద్రవ్యవాద ఆర్థికవేత్తల (monetarists) ఉద్దేశం ప్రకారం స్వల్ప కాలంలో ఆదాయం, ఉద్యోగితలను నిర్ణయించేది ద్రవ్య సప్లై. అదే ద్రవ్య సప్లై దీర్ఘకాలంలో సాధారణ ధరల స్థాయిని నిర్ణయిస్తుంది.

## 9.5 సారాంశం

ద్రవ్య సప్లైలోని మార్పులు ప్రముఖ స్థూల ఆర్థిక చలాంకాలను ఎలా ప్రభావితం చేస్తాయో తెలిపే ప్రసార యంత్రాంగంను ఈ యూనిట్‌లో తెలుసుకున్నాం. ద్రవ్యరాశి ప్రకారం ద్రవ్య సప్లైలో మార్పులు సాధారణ ధరల స్థాయిలో మార్పులను తీసుకువస్తాయి. ఈవిధంగా ద్రవ్యరాశి సిద్ధాంతం ప్రకారం ద్రవ్యం తటస్థంగా ఉంటుంది. అంటే ద్రవ్యంలో మార్పులు వాస్తవిక స్థూల ఆర్థిక చలాంక రాసుల్లో మార్పును తీసుకు రాలేదు. కేన్స్ సిద్ధాంతంలో ప్రసార యంత్రాంగం ప్రకారం ద్రవ్య సప్లైలోని మార్పులు వడ్డీరేటును మార్చడం ద్వారా సమష్టి డిమాండును తద్వారా ఆదాయ ఉద్యోగితలలో మార్పులు తీసుకువస్తాయి. ద్రవ్యవాద ఆర్థిక వేత్తల నమూనా ప్రకారం ద్రవ్య సప్లైలో మార్పులు సమష్టి డిమాండులోనూ, తద్వారా ఆదాయ ఉద్యోగితల్లోనూ మార్పులను తీసుకు వస్తాయి.

## 9.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలలో ఒక్కొక్క దానికి సుమారు 40 పంక్తులలో జవాబులిమ్ము**

1. ద్రవ్యరాశి సిద్ధాంతపు ప్రసార యంత్రాంగంను వివరించండి.
2. ద్రవ్యరాశి సిద్ధాంతానికి సంబంధించి కేన్స్ చేసిన విమర్శలను వివరించండి.
3. కేన్స్ సిద్ధాంతం తెలిపే ప్రసారం యంత్రాంగంను వివరించండి.

**II. ఈ క్రింది ప్రశ్నలలో ఒక్కొక్క దానికి సుమారు 20 పంక్తులలో జవాబులిమ్ము**

1. ప్రసార యంత్రాంగం భావనను సోదాహరణంగా వివరించండి.
2. కేన్స్ సిద్ధాంతం ప్రకారం ద్రవ్య విధానం ఏ పరిస్థితులలో విఫలమవుతుందో వివరించండి.
3. ద్రవ్యవాద ఆర్థిక వేత్తల దృష్టిలోని ప్రసార యంత్రాంగంను వివరించండి.

## 9.7 సంప్రదింపు గ్రంథాలు


1. Suraj B. Gupta : *Monetary Economics*
2. Lloyd B. *Thomas : Money, Banking and Economic Activity*
3. V. Lakshmana Rao : *Essays on Indian Monetory and BOP Experience, p p . 1-9.*


## 9.8 భావనలు

**ప్రసారం యంత్రాగం :** ద్రవ్య సప్లై మార్పు ఏవిధంగా వివిధ స్థూల ఆర్థిక చలాంకాలను ప్రభావితం చేస్తాయో చెప్పేది ప్రసార యంత్రాంగం.

**ద్రవ్యపు తటస్థత :** వాస్తవిక స్థూల ఆర్థిక చలాంక రాశులను ప్రభావితం చేయకుండా సాధారణ ధరల స్థాయిని మాత్రమే ద్రవ్యం ప్రభావితం చేయడం.

**ఫైనాన్షియల్ ఆస్తులు :** ద్రవ్యత్వం, ప్రతిఫల రేటునివ్వడం లక్షణాలుగా గలిగిన బాండ్లు, ప్రభుత్వ సెక్యూరిటీలు, షేర్లు మొదలైనవి.

**ద్రవ్యవాదం :** ద్రవ్యవాద ఆర్థిక వేత్తల (monetarists) ఉద్దేశాలను ద్రవ్యవాదంగా వ్యవహరిస్తారు. ఈ ఉద్దేశ్యాలలో ప్రముఖమైనది - స్వల్పకాలంలో ఆదాయ ఉద్యోగితలను, దీర్ఘకాలంలో సాధారణ ధరల స్థాయిని నిర్ణయించేది ద్రవ్య సప్లై.

## 9.9 పదకోశం

| | | |
|---|---|---|
| ద్రవ్య విధానం | : | Monetary policy |
| ప్రసార యంత్రాగం | : | Transmission mechanism |
| సంపూర్ణోద్యోగిత ఉత్పత్తి | : | Full - employment output |
| స్థూల ఆర్థిక నమూనా | : | Macro economic model |

BRAOU

| | | |
|---|---|---|
| ప్రాతిపదిక | : | Proposition |
| స్థిర ధరల కేన్స్ నమూనా | : | Fix - price Keynesian model |
| అనుపాత ప్రభావం | : | Proportional influence |
| వాస్తవిక రంగం | : | Real sector |
| యూనిట్ శ్రమ వ్యయాలు | : | Unit labour costs |
| ద్రవ్యరంగం | : | Monetary sector |
| ద్రవ్యవాదం | : | Monetarism |
| ద్రవ్యవాద నమూనా | : | Monetarist model |
| ఫైనాన్సియల్ ఆస్తులు | : | Financial assests |
| ద్రవ్య అధినేత | : | Monetary authority |
| గుణక ప్రభావం | : | Multiplier effect |
| ద్రవ్యత్వ వల | : | Liquidity trap |
| ద్రవ్యవాద ఆర్థిక వేత్తలు | : | Monetarists |
| నామ మాత్ర ఆదాయం | : | Nominal income |
| ఆసంతులిత | : | Inbalance |
| సున్నితమైన | : | Sensitive |
| కుదింపు ద్రవ్య విధానం | : | Contractionary monetary policy |
| విస్తరణాయుత | : | Expansionary |
| ద్రవ్యత్వాభిరుచి | : | Liquidity preference |
| ఉపాంత పెట్టుబడి సామర్థ్యం | : | Marginal efficiency of investment (M.E.I.) |
| సమష్టి డిమాండ్ | : | Aggregate demand (A.D.) |
| సమష్టి సప్లయ్ | : | Aggregate supply (A.S.) |
| తటస్థం | : | Neutral |
| అల్పోద్యోగిత | : | Underemployment |
| బాహ్యాంశం | : | Exogeneous |
| అతి శక్తివంతమైన ద్రవ్యం | : | High powered money |

**- ఆచార్య వి. లక్ష్మణరావు**

## భాగం - 10 : ద్రవ్యోల్బణం : సిద్ధాంతాలు, కారణాలు, ప్రభావాలు

**విషయ క్రమం**


10.0 ఉద్దేశం

10.1 పరిచయం

10.2 నిర్వచనాలు

10.3 ద్రవ్యోల్బణ రకాలు

10.4 ద్రవ్యోల్బణ సిద్ధాంతాలు

10.4.1 డిమాండు ప్రేరిత ద్రవ్యోల్బణం

10.4.2 వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం

10.5 ద్రవ్యోల్బణానికి కారణాలు

10.6 ద్రవ్యోల్బణ ప్రభావాలు

10.6.1 ఉత్పత్తిపై ప్రభావం

10.6.2 పంపిణీపై ప్రభావం

10.7 ద్రవ్యోల్బణ నియంత్రణ

10.7.1 ద్రవ్య పరమైన చర్యలు

10.7.2 కోశ పరమైన చర్యలు

10.7.3 ఇతర చర్యలు

10.8 ఫిలిప్స్ రేఖ

10.8.1 ఫిలిప్స్ రేఖ - ముఖ్యాంశాలు

10.9 భారత దేశంలో ద్రవ్యోల్బణం - చర్చ

10.10 భారత దేశంలో ద్రవ్యోల్బణానికి కారణాలు

10.10.1 డిమాండు వైపు అంశాలు

10.10.2 సప్లయి వైపు అంశాలు

10.11 సారాంశం

10.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

10.13 సంప్రదింపు గ్రంథాలు

10.14 పదకోశం


BRAOU

## 10 ఉద్దేశం

ద్రవ్యోల్బణ నిర్వచనాలు, రకాలు, ద్రవ్యోల్బణ సిద్ధాంతాలు, ద్రవ్యోల్బణానికి కారణాలు, భారత ఆర్థికవ్యవస్థలో ప్రణాళికలు ప్రారంభమైననాటి నుండి ద్రవ్యోల్బణ తీరుతెన్నులు, ద్రవ్యోల్బణ ప్రభావాలు, ద్రవ్యోల్బణాన్ని నివారించటానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించటం ఈ భాగపు ముఖ్య ఉద్దేశం.

## 10.1 పరిచయం

ప్రస్తుతకాలంలో మానవజాతిని పట్టి పీడిస్తున్న సమస్యలలో ద్రవ్యోల్బణం ఒకటి. రోజు రోజుకు ద్రవ్యోల్బణ సమస్య తీవ్రరూపం దాలుస్తూ మానవుల జీవనగతిని దుర్భరం చేస్తుంది. ప్రపంచంలో అన్ని దేశాల ప్రజలు ఏదో ఒకనాడు ద్రవ్యోల్బణ ప్రభావానికి గురియైన వారే అనటంలో ఏ మాత్రం సందేహం లేదు. ద్రవ్యోల్బణం ఆర్థికవ్యవస్థలో అస్థిరత్వ పరిస్థితులను సృష్టిస్తుంది. ఈ కారణంగా ఆర్థికవ్యవస్థ పనితీరుపై ప్రజలకు విశ్వాసం సడలుతుంది. ద్రవ్యోల్బణ కాలంలో కొన్ని వర్గాల ప్రజలు అధిక లాభాలు పొందుతూ ఉంటే, మరికొన్ని వర్గాల ప్రజలకు కనీస జీవన స్థాయిని కాపాడుకోవటం చాల కష్టతరమవుతుంది. దీని కారణంగా ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక, సాంఘిక సమస్యలు తలెత్తుతాయి. అనగా ద్రవ్యోల్బణం వివధ వర్గాల ప్రజల మధ్య ఆదాయ, సంపదలలో వ్యత్యాసాల పెంపుదలకు దారితీస్తుంది. అందుకే ద్రవ్యోల్బణాన్ని నియంత్రించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధానంతరం, అనేక దేశాలు ద్రవ్యోల్బణపు విషపు కోరలలో చిక్కుకోవటం మూలంగా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమై పోయినాయి.

## 10.2 ద్రవ్యోల్బణ నిర్వచనాలు

అనేక మంది ఆర్థికవేత్తలు ద్రవ్యోల్బణాన్ని విభిన్న రకాలుగా నిర్వచించారు. ఇప్పుడు కొంత మంది ఆర్థికవేత్తల నిర్వచనాలను పరిశీలిద్దాం.

1. డాల్టన్ ప్రకారం "తక్కువ వస్తురాశిని ఎక్కువ ద్రవ్యం తరమటమే" (too much money chasing too few goods) ద్రవ్యోల్బణం.
2. హాట్రే ప్రకారం "అధికంగా కరెన్సీని జారీ చేయటమే" ద్రవ్యోల్బణం (inflation means the issue of to much currecy).
3. క్రౌథర్ ప్రకారం " ధరల స్థాయి పెరిగిన కారణంగా ద్రవ్యం విలువ తగ్గటమే" ద్రవ్యోల్బణం (inflation is a state in which the value of money is falling i.e.prices are rising).
4. క్రెమ్మెర్ ప్రకారం " తక్కువ ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించటానికి అధిక మొత్తంలో ద్రవ్యం చలామణిలో ఉండటమే" ద్రవ్యోల్బణం (inflation means too much currency in circulation in relation to the physical volume of business being done).
5. మిల్టన్ ఫ్రీడ్‌మన్ ప్రకారం "ఉత్పత్తిలో పెరుగుదలకంటే, ద్రవ్యరాశిలో పెరుగుదల ఎక్కువగా ఉండటమే" ద్రవ్యోల్బణం (inflation is produced by a more rapid increase in quantity of money than output).
6. షాపిరో ప్రకారం "నిలకడగాను, నిరంతరంగాను సాధారణ ధరల స్థాయిలో వచ్చే పెరుగుదల" (persistent and appreciable rise in the general level of prices) యే ద్రవ్యోల్బణం.

BRAOU

పై నిర్వచనాలను బట్టి ద్రవ్యోల్బణం అంటే క్రమంగా పెరుగుతూ ఉండే ధరల స్థాయి అని చెప్పవలసి ఉంటుంది. ధరలు హెచ్చుగా ఉన్నంత మాత్రాన ద్రవ్యోల్బణం అని చెప్పటానికి వీలులేదు. ద్రవ్యోల్బణ కాలంలో ధరల స్థాయి క్రమంగాను, నిరంతరంగాను పెరుగుతు ఉంటుంది. కావున ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. అందువలన ద్రవ్యోల్బణ కాలంలో ద్రవ్యం విలువ కూడ క్షీణిస్తుందని అర్థం చేసుకోవలసి ఉంటుంది.

## 10.3 ద్రవ్యోల్బణ రకాలు

ప్రతి సంవత్సరం ధరల స్థాయిలో వచ్చే పెరుగుదలను ఆధారంగా చేసుకుని, ద్రవ్యోల్బణాన్ని అనేక రకాలుగా విభజించటం జరిగింది. ఇప్పుడు ద్రవ్యోల్బణంలో రకాలను తెలుసుకుందాం.

### 10.3.1 ప్రాకే ద్రవ్యోల్బణం (Creeping Inflation)

ప్రతి సంవత్సరం ధరల స్థాయిలో పెరుగుదల అతి తక్కువ మోతాదులో ఉంటే దానిని ప్రాకే ద్రవ్యోల్బణం అంటారు. సాధారణంగా ప్రతి సంవత్సరం సాధారణ ధరల స్థాయిలో పెరుగుదల 3 శాతం కంటే తక్కువగా ఉంటే ఈ కోవకు చెందుతుంది. ధరల స్థాయిలో ఈ మాత్రం తక్కువ పెరుగుదల ఆర్థిక వృద్ధి ప్రక్రియ నిరంతరంగాను, సాఫీగాను ముందుకు నడవటానికి అవసరం అని చెప్పబడుతుంది.

### 10.3.2 నడిచే ద్రవ్యోల్బణం (Walking Inflation)

ప్రతి సంవత్సరం ధరల స్థాయిలో పెరుగుదల 3 నుండి 10 శాతం మధ్యన ఉంటే దానిని నడిచే ద్రవ్యోల్బణం అంటారు. ప్రభుత్వం తగిన సమయంలో సరియైన చర్యలు తీసుకోకపోతే, ఆర్థిక పరిస్థితి అస్థవ్యస్థం అయ్యే ప్రమాదం ఉంటుంది.

BRAOU

### 10.3.3 పరుగెత్తే ద్రవ్యోల్బణం (Running Inflation)

ప్రతి సంవత్సరం సాధారణ ధరల స్థాయిలో పెరుగుదల 10 నుండి 20 శాతం వరకు ఉంటే దానిని పరుగెత్తే ద్రవ్యోల్బణం అంటారు. ఈ ద్రవ్యోల్బణం, ఆర్థిక వ్యవస్థలో పేద వర్గాల ప్రజలను అనేక కష్టాలకు గురిచేస్తుంది. దీనిని నియంత్రించటానికి ప్రభుత్వం సమర్థవంతంగా ద్రవ్య పరమైన, కోశ పరమైన చర్యలను తీసుకోవలసి ఉంటుంది.

### 10.3.4 అతి ద్రవ్యోల్బణం (Hyper Inflation)

ప్రతి సంవత్సరం సాధారణ ధరల స్థాయిలో పెరుగుదల 20 నుండి 100 శాతం వరకు ఉంటే దానిని అతి ద్రవ్యోల్బణం అంటారు. ఇటువంటి పరిస్థితిలో ధరల స్థాయిని అదుపు చేయటం దుస్సాధ్యం అవుతుంది. ఆర్థిక వ్యవస్థ అతి ద్రవ్యోల్బణ పరిస్థితికి గురియైనట్లయితే ద్రవ్య వ్యవస్థ (monetary system) కుప్ప కూలిపోతుంది. దీనికి కారణం ధరల స్థాయి ఒకే రోజులో అనేకసార్లు మార్పులకు గురిఅవుతుంది. దీని ఫలితంగా ద్రవ్య కొనుగోలు శక్తిలో హెచ్చు మొత్తంలో మార్పులు సంభవిస్తాయి. ధరల స్థాయి పెరుగుతూ ఉంటే ద్రవ్యం విలువ క్షీణిస్తుంది, వస్తువుల విలువలు పెరుగుతాయి. ప్రజలు విలువ క్షీణిస్తున్న ద్రవ్యాన్నిగాక వస్తువులను పొంది ఉండటం పట్ల మక్కువ చూపుతారు. అందువలన ద్రవ్యాన్ని త్వరితగతిన వస్తువులలోకి మార్చటం వల్ల ద్రవ్య ప్రసారవేగం పెరుగుతుంది. ఫలితంగా ధరల స్థాయిలోని పెరుగుదల, ద్రవ్యరాశిలోని పెరుగుదల కంటే హెచ్చుగా ఉంటుంది. ఈ స్థితినే అతి ద్రవ్యోల్బణం అంటారు.

పైన వివరించిన ద్రవ్యోల్బణ రకాలను రేఖాచిత్రం 10.1 సహాయంతో అర్థం చేసుకోవచ్చు.




పటం - 10.1 : వివిధ రకాలైన ద్రవ్యోల్బణం

పటం10.1లో 'H' అతి ద్రవ్యోల్బణాన్ని, 'R' పరుగెత్తే ద్రవ్యోల్బణాన్ని, 'W' నడిచే ద్రవ్యోల్బణాన్ని, 'C' ప్రాకే ద్రవ్యోల్బణాన్ని తెలియజేస్తాయి.

కేన్స్ పాక్షిక ద్రవ్యోల్బణాన్ని (semi inflation), వాస్తవ ద్రవ్యోల్బణాన్ని వివరించాడు. కేన్స్ ప్రకారం, ఆర్థిక వ్యవస్థలో ఉపయోగించబడని వనరులు ఉన్నంతవరకు, ఉత్పత్తి పరిమాణం పెరుగుతుంటే, ధరల స్థాయిలో పెరుగుదల రాదు. కాని ఈ పరిస్థితిలో ఆర్థికవ్యవస్థలో సమిష్టి డిమాండ్ పెరిగినట్లయితే, వస్తు సప్లయ్‌ను పెంచటానికి ఉద్యమదారులు ఉత్పత్తి కారకాలను ఎక్కువగా డిమాండ్ చేస్తారు. కొన్ని రకాల ఉత్పత్తి కారకాలను ప్రత్యామ్నాయం చేయటం సాధ్యం కాదు. అందువలన, ఉత్పత్తి కారకాల కొరత కారణంగా, ఉత్పత్తి కారకాల ధరలు పెరిగి, ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఈ కారణంగా ధరల స్థాయి పెరుగుతుంది. ఈ విధంగా సంపూర్ణోద్యోగితా స్థాయి చేరటానికి ముందుగా, కొన్ని రకాల ఉత్పత్తి సాధనాల కొరత కారణంగా, ఉత్పత్తి వ్యయం పెరిగి, సాధారణ ధరల స్థాయి పెరుగుతుంది. దీనినే కేన్స్ పాక్షిక ద్రవ్యోల్బణం (semi-inflation) అని వివరించాడు.

ఆర్థిక వ్యవస్థ సంపూర్ణోద్యోగితా స్థాయిని చేరుకున్న తర్వాత సమష్టి డిమాండ్‌లో వచ్చే పెరుగుదలకు అనుగుణంగా, ధరల స్థాయి కూడ పెరుగుతుంది. దీనికి కారణం, సంపూర్ణోద్యోగితా స్థాయిని చేరుకున్న తర్వాత ఉత్పత్తి కారకాల సప్లయ్‌ని, ఉత్పత్తిని పెంచటానికి వీలుండదు. ఇటువంటి పరిస్థితిలో, సమష్టి డిమాండ్ సమష్టి సప్లయ్‌ని మించి పెరిగిన కారణంగా, ధరలస్థాయిలో వచ్చే పెరుగుదలను వాస్తవ ద్రవ్యోల్బణం (true - inflation) అని కేన్స్ వివరించాడు.

పాక్షిక, వాస్తవ ద్రవ్యోల్బణ పరిస్థితులను పటం - 10.2 సహాయంతో అర్థం చేసుకోవచ్చు.




పటం-10.2 : పాక్షిక, వాస్తవిక ద్రవ్యోల్బణ పరిస్థితులు

పటం 10.2లో FE రేఖ సంపూర్ణోద్యోగితా స్థాయిని, $PQ_1$ రేఖ ధరల స్థాయిలో పెరుగుదలను సూచిస్తుంది. సమష్టి డిమాండ్ OP నుండి $OP_1$ కు పెరిగిన కారణంగా, కొన్ని రకాల ఉత్పత్తి సాధనాలకు కొరత ఏర్పడి, ఉత్పత్తి వ్యయం పెరిగి సాధారణ ధరల స్థాయి క్రమంగా P నుండి Q వరకు పెరుగుతుంది. ఈ పరిస్థితి పాక్షిక ద్రవ్యోల్బణాన్ని తెలియజేస్తుంది. సమష్టి డిమాండ్ $OP_1$ కంటె ఎక్కువగా పెరిగినట్లయితే, సమష్టి డిమాండ్‌లోని పెరుగుదలకు అనుగుణంగా, సాధారణ ధరల స్థాయి పెరగటాన్ని, సాధారణ ధరల స్థాయికి సంబంధించిన $PQ_1$ రేఖలో $QQ_1$ భాగం తెలియజేస్తుంది. $QQ_1$ వాస్తవ ద్రవ్యోల్బణాన్ని సూచిస్తుంది.

## 10.4 ద్రవ్యోల్బణ సిద్ధాంతాలు

ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన నాటినుండి ప్రపంచలోని అనేక దేశాలను ద్రవ్యోల్బణం ఒక అంటువ్యాధిలా వెంటాడుతుంది. అందువలన ఆర్థికవేత్తలు ద్రవ్యోల్బణానికి కారణాలను తెలుసుకుని, నివారణోపాయాలను సూచించటం పై దృష్టి కేంద్రీకరించారు. ఆర్థికవేత్తల ప్రకారం సాధారణ ధరల స్థాయి క్రమంగా పెరగటానికి కారణాలు (1) సమష్టి డిమాండ్ సమష్టి సప్లయ్‌కంటె ఎక్కువగా ఉండటం – దీనినే డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు. (2) ఉత్పత్తి వ్యయాలలో పెరుగుదల కారణంగా ధరల స్థాయిలో పెరుగుదల రావటం - దీనిని వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు. (3) సమష్టి డిమాండ్ సమష్టి సప్లయి కంటె ఎక్కువగా ఉండటం మరియు ఉత్పత్తి వ్యయంలో పెరుగుదల కారణంగా సాధారణ ధరల స్థాయిలో పెరుగుదల రావటం - దీనిని మిశ్రమ ద్రవ్యోల్బణం అంటారు. ఇప్పుడు వీటిని వివరంగా తెలుసుకుందాం.

### 10.4.1 డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం

సమష్టి సప్లయి కంటే సమష్టి డిమాండ్ ఎక్కువగా ఉన్న కారణంగా, సాధారణ ధరల స్థాయి క్రమంగా పెరిగితే దానిని డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు. సాంప్రదాయ ద్రవ్యరాశి సిద్ధాంతం ప్రకారం, ద్రవ్య సప్లయిలో పెరుగుదల అధికంగా ఉండడం వలన, సమష్టి డిమాండ్ పెరిగి సాధారణ ధరల స్థాయి పెరుగుతుంది.

BRAOU

మిల్టన్ ఫ్రీడ్‌మన్ ప్రకారం, ద్రవ్యోల్బణం ద్రవ్య సంబంధమైన దృగ్విషయం. ద్రవ్య సప్లయి వృద్ధిరేటు ఎక్కువగా ఉంటే, సాధారణ ధరల స్థాయిలో వచ్చే పెరుగుదల రేటు కూడ ఎక్కువగా ఉంటుంది.

సాంప్రదాయ ఆర్థికవేత్తలు వివరించిన డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణాన్ని పటం 10.3 సహాయంతో అర్థం చేసుకోవచ్చు.




పటం-10.3: డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం

పటం 10.3 ప్రకారం, ప్రారంభంలో డిమాండ్ (DD), సప్లయి (SS) రేఖలు E బిందువు వద్ద ఖండించుకోవటం వలన ధర OP గా నిర్ణయమైంది. ON సంపూర్ణోద్యోగితా సప్లయిను సూచిస్తుంది. ఈ పరిస్థితులలో ద్రవ్య సప్లయిలో పెరుగుదల కారణంగా, సమష్టి డిమాండ్ పెరిగినట్లయితే, డిమాండ్ రేఖ ($D_1D_1$) పైకి కదులుతుంది. E బిందువు తర్వాత సప్లయ్ రేఖ పూర్తి అవ్యాకోచంగా ఉంటుంది. అందువలన సమష్టి డిమాండ్ పెరిగినప్పుడు $D_1D_1$ రేఖ, అవ్యాకోచ సప్లయి రేఖను $E_1$ బిందువు వద్ద ఖండిస్తుంది. అందువలన ధరలస్థాయి OP నుండి $OP_1$ కు పెరుగుతుంది. ఒకవేళ ద్రవ్య సప్లయి ఇంకా పెరిగినట్లయితే, సమష్టి డిమాండ్ కూడ పెరిగి,డిమాండ్ రేఖ $D_1D_1$ కంటె పైకి కదులుతుంది. అందువలన ధరలస్థాయి $OP_1$ కంటె ఎక్కువగా పెరుగుతుంది.

కేన్స్ ప్రకారం, ఆర్థిక వ్యవస్థలో ఉపయోగించబడని వనరులు (ఖాళీగా) ఉన్నంత వరకు పెట్టుబడి వ్యయంలో పెరుగుదల వచ్చినట్లయితే, ఉద్యోగితా స్థాయి, ఉత్పత్తి, ఆదాయ స్థాయి పెరుగుతాయి. సంపూర్ణోద్యోగితా స్థాయి చేరిన తర్వాత, వనరుల కొరత ఏర్పడుతుంది. ఈ పరిస్థితుల్లో సమష్టి డిమాండ్‌లో పెరుగుదల వచ్చినట్లయితే, వస్తు సప్లయి పెంచటానికి వీలుండదు కావున, ధరలస్థాయి పెరిగి ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది.

### 10.4.2 వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం

ఉత్పత్తి వ్యయంలో పెరుగుదల కారణంగా, ధరల స్థాయి పెరిగినట్లయితే, దానిని వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు. శక్తివంతమైన శ్రామిక సంఘాలు, శ్రామికుల ఉత్పాదకతలో పెరుగుదలకంటే

ఎక్కువగా వేతనాలను పెంచుకోగలిగినప్పుడు, వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. వేతనాలు ఉత్పత్తి వ్యయంలో ఒక భాగం. ఉత్పాదకతలో పెరుగుదల కంటె ఎక్కువగా వేతనాలు పెరిగినప్పుడు ఉద్యమదారులు వస్తువుల ధరలను పెంచుతారు. ధరలు పెరిగినందువలన, శ్రామికులు తమ నిజ వేతనాలు పడిపోయినాయని, అందువలన తమ ద్రవ్య వేతనాలు పెంచవలెనని ఉద్యమదారులను కోరటం జరుగుతుంది. పటిష్టమైన శ్రామిక సంఘాల వత్తిడి వలన, ఉద్యమదారులు శ్రామికుల ద్రవ్య వేతనాలు పెంచటం జరుగుతుంది. అనగా శ్రామికుల వేతనాలు పెరగటం, అందువలన ఉత్పత్తి వ్యయం పెరగటం, ఈ కారణంగా సాధారణ ధరల స్థాయి పెరగటం నిరంతరంగా జరుగుతుంది.

వేతనాలలో పెరుగుదలతో పాటు, కొన్ని ముఖ్యమైన ముడిపదార్థాల (ఉదాహరణకు, ఇనుము-ఉక్కు) ధరలలో పెరుగుదలవలన ఆర్థిక వ్యవస్థలో వివిధ వస్తువుల ఉత్పత్తి వ్యయాలలో పెరుగుదల ఏర్పడి, ధరల స్థాయి పెరుగుతుంది. దీనికితోడు దిగుమతి చేసుకునే ముడిపదార్థాల ధరలలో వచ్చే పెరుగుదలవలన కూడ ఉత్పత్తి వ్యయం పెరిగి ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. ఈ విధంగా ఉత్పత్తి వ్యయంలో పెరుగుదల కారణంగా, సాధారణ ధరల స్థాయి పెరుగుతుంది కావున దీనిని వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు. వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణాన్ని పటం **10.4** సహాయంతో అర్థం చేసుకోవచ్చు.




పటం - **10.4**: వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం

పటం 10.4లో SS వస్తు సప్లయి రేఖ, DD డిమాండ్ రేఖ. SS మరియు DD రేఖలు E బిందువు వద్ద ఖండించుకోవటం వలన ధరల స్థాయి OP గా నిర్ణయమైంది. ON సంపూర్ణోద్యోగితా స్థాయి సప్లయి వేతనాలు, కొన్ని ముఖ్యమైన ముడిపదార్థాలు, దిగుమతి చేసుకునే ముడి పదార్థాల ధరలు పెరిగినట్లయితే, ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. అందువలన సప్లయి రేఖ $S_1S$ గా మారుతుంది. $S_1S$ రేఖ స్థిరంగా ఉన్న DD రేఖను $E_1$ బిందువు వద్ద ఖండిస్తుంది. అందువలన సాధారణ ధరల స్థాయి $OP_1$ కు పెరుగుతుంది. సమష్టి సప్లయి ON నుండి $ON_1$ కు తగ్గుతుంది. ఇంకా ఉత్పత్తి వ్యయం పెరిగితే, సప్లయిరేఖ ఇంకా పైకి కదలుతుంది. అందువలన ధరల స్థాయి ఇంకా పెరిగి, సమష్టి సప్లయి తగ్గుతుంది.

## 10.5 ద్రవ్యోల్బణానికి కారణాలు

సమష్టి డిమాండ్ సమష్టి సప్లయ్‌ను మించి ఉండటం వలన ద్రవ్యోల్బణం ఏర్పడుతుందని దాదాపుగా ఆర్థికవేత్తలు అందరూ అంగీకరించారు.

### 10.5.1 డిమాండ్ వైపు కారణాలు

డిమాండ్ వైపునుండి ద్రవ్యోల్బణాన్ని సృష్టించే అంశాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**A. ప్రభుత్వ వ్యయం పెరగటం :** ప్రస్తుతకాలంలో ప్రతి దేశం శ్రేయోరాజ్య స్థాపనవైపు మొగ్గు చూపుతుంది. అందువలన వివిధ సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి, వాటిపై పెద్దమొత్తంలో ఖర్చు చేయటం జరుగుతుంది. ప్రభుత్వం చేసే వ్యయం కారణంగా, ప్రజల ఆదాయ స్థాయి పెరిగి, సమష్టి డిమాండ్ పెరుగుతుంది.

**B. సులభ ద్రవ్య విధానం :** ప్రభుత్వాలు సులభ ద్రవ్య విధానాన్ని అనగా వడ్డీరేటును తగ్గించి, పరపతిని విస్తరించే కార్యక్రమాలను చేపట్టటం ద్వారా, ఆర్థికవ్యవస్థలో చలామణిలో ఉండే ద్రవ్య సప్లయి పెరిగి, సమష్టి డిమాండ్ పెరుగుతుంది.

**C. లోటు విత్తం :** ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఏర్పడిన లోటును సర్దుబాటు చేసుకోవటానికి నూతనంగా కరెన్సీని ముద్రించటం జరుగుతుంది. ఈ కారణంగా కూడ చలామణిలో ఉండే ద్రవ్య సప్లయ్ పెరిగి, సమష్టి డిమాండ్ పెరిగి, సాధారణ ధరల స్థాయి పెరుగుతుంది.

**D. యుద్ధాలు :** యుద్ధకాలంలో యుద్ధ అవసరాలను తీర్చుకోవడానికి వనరులను ఉపయోగించటం జరుగుతుంది. అందువలన వినియోగ వస్తువుల ఉత్పత్తి కొరకు తగినంతగా వనరులు లభ్యంకాక, వినియోగ వస్తువుల సప్లయ్ తగ్గిపోయి ధరల స్థాయి పెరగవచ్చు.

**E. ద్రవ్య సప్లయ్‌లో పెరుగుదల :** ద్రవ్య సప్లయ్‌లో పెరుగుదల కారణంగా సమష్టి డిమాండ్ పెరిగి, ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది.

### 10.5.2 సప్లయ్ వైపు కారణాలు

వస్తు సప్లయ్‌లో తగ్గుదల లేదా కొరత కారణంగా కూడ సమష్టి సప్లయ్‌ను సమిష్టి డిమాండ్ మించి పోయి ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. సప్లయ్ వైపునుండి ద్రవ్యోల్బణాన్ని సృష్టించే అంశాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**A. ప్రకృతి వైపరీత్యాలు :** వరదలు, కరవు కాటకాలు సంభవించినప్పుడు వ్యవసాయిక వస్తువుల సప్లయ్ తగ్గిపోతుంది. కాని వెంటనే డిమాండ్ తగ్గిపోదు. అంతేకాకుండా, ఈ పరిస్థితిలో పారిశ్రామిక రంగానికి అవసరమైన ముడిపదార్థాలకు కొరత ఏర్పడుతుంది. దీని కారణంగా వస్తు సప్లయ్ తగ్గిపోయి సాధారణ ధరల స్థాయి పెరుగుతుంది.

**B. ఉత్పత్తి కారకాల కొరత :** వస్తూత్పత్తికి అవసరమైన ఉత్పత్తి సాధనాలు ఉదాహరణకు, బొగ్గు, విద్యుచ్ఛక్తి ఇంకా ఇతర ముడిపదార్థాలు తగినంతగా లభ్యం కాకపోవటం వలన, ఉత్పత్తి తగ్గిపోయి ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది.

B R A O U

C. **కృత్రిమ కొరతలు :** నల్ల బజారు వ్యాపారం చేసే వ్యక్తులు, అంచనా వ్యాపారస్తులు, వస్తువులను దాచివేసి, కృత్రిమ కొరతలు సృష్టిస్తారు. అందువలన వస్తు సప్లయ్ తగ్గిపోయి ధరల స్థాయి పెరుగుతుంది.

D. **అంతర్జాతీయ అంశాలు :** ప్రస్తుత కాలంలో ప్రతి దేశం, ఇతర దేశాలనుండి తమకు కావలసిన కొన్ని వస్తువులను దిగుమతి చేసుకుంటుంది. ఉదాహరణకు భారత దేశం పెట్రోలును పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకోవటం జరుగుతుంది. పెట్రోలు ధరలో వచ్చే పెరుగుదల, ఆర్థికవ్యవస్థలోని అనేక వస్తువుల ధరల పెరుగుదలకు దారితీసి, ద్రవ్యోల్బణం ఏర్పడుటకు కారణభూతమవుతుంది.

వనరుల కేటాయింపులో అసమతౌల్యం వలన కూడా ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. వినియోగ వస్తువుల రంగాని కంటే పెట్టుబడి వస్తువుల రంగానికి అధిక నిష్పత్తిలో వనరులను కేటాయించటం వలన వినియోగ వస్తువుల కొరత ఏర్పడి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది.

## 10.6 ద్రవ్యోల్బణ ప్రభావాలు

ద్రవ్యోల్బణం వివిధ వర్గాల ప్రజలను విభిన్నంగా ప్రభావితం చేస్తుంది. ద్రవ్యోల్బణం ఏర్పడినట్లయితే, ద్రవ్యం కొనుగోలు శక్తి అనగా ద్రవ్యం విలువ పడిపోతుంది. ఈ కారణంగా సమాజంలోని కొన్ని వర్గాల ప్రజలు లాభం పొందితే, మరికొన్ని తరగతుల ప్రజలు నష్టాలను పొందటం జరుగుతుంది. ద్రవ్యోల్బణ కాలంలో ముఖ్యంగా స్థిర ఆదాయం కలిగిన వర్గాలు నష్టపోతారు. వ్యాపారస్తులు ఇంకా ఇతర చర ఆదాయం (flexible income) కలిగిన వర్గాలు లాభాలు పొందుతారు. మొత్తం మీద ద్రవ్యోల్బణం ఉత్పత్తి, పంపిణీ మరియు విదేశీ వ్యాపార చెల్లింపులను ప్రభావితం చేస్తుంది. ఇప్పుడు ద్రవ్యోల్బణ ప్రభావాలను విపులంగా తెలుసుకుందాం.

### 10.6.1 ఉత్పత్తి పై ద్రవ్యోల్బణ ప్రభావం

ద్రవ్యోల్బణ కాలంలో ధరల స్థాయి పెరుగుతుంది కావున ఉద్యమదారులకు ఇది ప్రోత్సాహకరంగా ఉంటుంది. అందువలన ఉద్యమదారులు అధిక లాభాలను ఆర్జించాలనే ఉద్దేశంతో పెట్టుబడిని పెంచుతారు. కనుక ఉత్పత్తి, ఉద్యోగిత పెరుగుతాయి. కేన్స్ ప్రకారం, ఈ పరిస్థితి సంపూర్ణోద్యోగితా స్థితి చేరుకునేంతవరకు మాత్రమే కొనసాగుతుంది. సంపూర్ణోద్యోగితా స్థాయిని చేరిన తర్వాత కూడ, ఇంకా పెట్టుబడి పెరిగితే, ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. దీనికి కారణం ఉత్పత్తిలో పెరుగుదల కంటే, ఉత్పత్తి వ్యయంలో వచ్చే పెరుగుదల ఎక్కువగా ఉండి, ధరల స్థాయి ఎక్కువ రేటులో పెరుగుతుంది. అందువలన సంపూర్ణోద్యోగితా స్థాయిని చేరిన తర్వాత, ద్రవ్యోల్బణం ఉత్పత్తిపై దుష్ప్రభావాన్ని చూపుతుంది. ద్రవ్యోల్బణం ఉత్పత్తిపై దుష్ప్రభావాన్ని ఏవిధంగా చూపుతుందో ఇప్పుడు విపులంగా పరిశీలిద్దాం.

A. ద్రవ్యోల్బణం వనరుల కేటాయింపును ప్రభావితం చేస్తుంది. ద్రవ్యోల్బణం కారణంగా వనరులు నిత్యావసర వస్తువుల ఉత్పత్తికి కాకుండా, లాభదాయకమైన విలాస వస్తువుల ఉత్పత్తికి, ఇతర అత్యవసరం కాని ఉత్పత్తులకు తరలించబడతాయి.

B. ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థలో అస్థిరత్వ పరిస్థితులను సృష్టిస్తుంది. ద్రవ్యోల్బణ కాలంలో ధరల పెరుగుదలతోపాటు ఉత్పత్తి వ్యయం కూడ పెరుగుతాయి. అందువలన వస్తూత్పత్తి పరిమాణం తగ్గిపోతుంది.

BRAOU

C. పొదుపు తగ్గిపోతుంది. ధరలు పెరుగుతున్న కాలంలో నిర్ణీత పరిమాణంలో వస్తురాశిని కొనుగోలు చేయటానికి ఎక్కువ ద్రవ్య ఆదాయం అవసరం అవుతుంది. కావున పొదుపు తగ్గి, పెట్టుబడి స్థాయి తగ్గి, ఉత్పత్తి పరిమాణం తగ్గిపోతుంది.

D. ద్రవ్యోల్బణం చీకటి బజారు వ్యాపారానికి దారితీస్తుంది. ద్రవ్యోల్బణ కాలంలో, ఎక్కువగా లాభాలు పొందాలనే ఉద్దేశంతో, వ్యాపారులు వస్తువులను దాచివేస్తారు. ఈ కారణంగా మార్కెట్‌లో వస్తువులకు కృత్రిమ కొరతలు ఏర్పడతాయి. ఈ పరిస్థితిలో వ్యాపారులు చీకటి బజారులో వస్తువులను ఎక్కువ ధరకు అమ్ముకుని లాభాలు పొందుతారు.

E. ధరల స్థాయి క్రమంగాను, నిరంతరంగాను పెరుగుతుంటే, మార్కెట్‌లో అమ్మకందారులదే పై చేయిగా ఉంటుంది. అనగా అమ్మకందారులు వస్తువు ధర నిర్ణయంపై, ఎక్కువ ప్రభావాన్ని చూపగలుగుతారు. ఈ కారణంగా అమ్మకందారులు తక్కువ నాణ్యత కలిగిన లేదా నాణ్యత లోపించిన వస్తువులను ఉత్పత్తి చేసి అమ్ముకోవటం ద్వారా ఎక్కువ లాభం పొందుతారు. దీనితోపాటు తక్కువ నాణ్యత కలిగిన వస్తువులను ఎక్కువ నాణ్యత కలిగిన వస్తువులలో కలిపివేసి (adulteration), ఎక్కువ ధరకు వస్తువును అమ్ముకుంటారు.

F. ద్రవ్యోల్బణం ఏర్పడినట్లయితే, విదేశీ మూలధన ప్రవాహం తగ్గిపోతుంది. దీనికి కారణం, ద్రవ్యోల్బణం వలన ఉత్పత్తి వ్యయం పెరిగి, పెట్టిన పెట్టుబడిపై విదేశస్తులకు ఎక్కువగా లాభాలు రావు. అందువలన విదేశస్తులు ఆర్థిక వ్యవస్థ పనితీరుపై విశ్వాసాన్ని కోల్పోయి, పెట్టుబడులను తగ్గిస్తారు.

### 10.6.2 పంపిణీ పై ప్రభావం

ద్రవ్యోల్బణం మూలంగా వివిధ వర్గాల ప్రజలమధ్య ఆదాయ సంపదల పంపిణీలో వ్యత్యాసాలు లేదా అసమానతలు పెరుగుతాయి. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఎక్కువగా కష్టాలకు గురిఅవుతారు. జీతం (salary) ద్వారా ఆదాయం సంపాదించేవారి నిజ ఆదాయం కొంతమేరకు పడిపోయి, వారి కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. అంచనా వ్యాపారస్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు ద్రవ్యోల్బణ కాలంలో ఎక్కువగా లాభం పొందుతారు. ద్రవ్యోల్బణ కాలంలో సంపద పేద, మధ్య తరగతి వర్గాలనుండి ధనిక వర్గాలకు బదిలీ అవుతుంది. ఈ కారణంగా ధనవంతులు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతుంటే పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు పేదరికంలోకి నెట్టివేయబడుతుంటారు. పంపిణీ విషయంలో వివిధ వర్గాల ప్రజలపై ద్రవ్యోల్బణ ప్రభావం ఏ విధంగా ఉంటుందో క్రింద వివరించటం జరిగింది.

BRAOU

A. స్థిర ఆదాయం కలిగినవారు అనగా భాటకం, వడ్డీ, పెన్షన్‌లను పొందేవారు ఎక్కువగా కష్టాలకు గురిఅవుతారు. ఈ వర్గాల ప్రజలకు వచ్చే ఆదాయాలు స్థిరంగా ఉంటాయి. కాని ధరల స్థాయిలో పెరుగుదల కారణంగా, ద్రవ్యం విలువ పడిపోతుంది. అందువలన ఈ వర్గాల కొనుగోలు శక్తి తగ్గుతుంది. సెక్యూరిటీలు, డిబెంచర్లు, డిపాజిట్ల పైన పొందే వడ్డీరేటు స్థిరంగా ఉంటుంది. ఈ కారణంగా పైన వివరించిన వర్గాల ప్రజలు ధరలు పెరిగే సమయంలో నష్టాలను అనుభవించవలసి వస్తుంది.

B. జీతాలను పొందే ఉద్యోగులు కూడ ద్రవ్యోల్బణ కాలంలో నష్టం పొందుతారు. దీనికి కారణం, ద్రవ్యోల్బణ కాలంలో ధరల స్థాయితోపాటు ఉద్యోగుల జీతాలు కూడ పెరిగినప్పటికీ, ధరలు పెరిగిన వెంటనే జీతాలలో పెరుగుదల రాదు. అంతే గాకుండా జీతాలలో పెరుగుదల ధరల స్థాయి పెరుగుదలతో సరితూగక పోవచ్చు.

C. ద్రవ్యోల్బణ కాలంలో ఋణదాతలు ఎక్కువగా నష్టం పొందుతుంటే, ఋణగ్రస్తులకు ఎక్కువ లాభం

కలుగుతుంది. ఋణదాతలు ఋణంగా యిచ్చిన మొత్తాన్ని, ప్రతిఫలంగా కొంత వడ్డీని పొందినప్పటికీ, ద్రవ్యోల్బణం కారణంగా ద్రవ్య విలువ పడిపోతుంది కావున, నిజ వనరుల రూపంలో తక్కువగా పొందినట్లు చెప్పవలసి ఉంటుంది. అనగా ద్రవ్యోల్బణ కాలంలో సంపద ఋణదాతల నుండి ఋణగ్రహీతలకు బదిలీ అవుతుంది.

D. వేతనాల ద్వారా ఆదాయాన్ని పొందే వ్యక్తులకు లాభం కలుగుతుందా లేక నష్టం కలుగుతుందా అనేది, పటిష్ఠమైన శ్రామిక సంఘాలు ఎంత త్వరితంగా వేతనాలను పెంచుకోగలుగుతాయి, ఎంత మొత్తంలో పెంచుకోగలుగుతాయి అనేదానిపై ఆధారపడి ఉంటుంది. వేతనాలలో సర్దుబాటుకు సంబంధించికూడ కాలవ్యవధి అవసరం అవుతుంది. కావున, శ్రామికులు కూడ మొత్తం మీద ద్రవ్యోల్బణ కాలంలో కష్టాలకు గురి అవుతారు.

E. షేర్లు కలిగిన వ్యక్తులు ద్రవ్యోల్బణ కాలంలో ఎక్కువగా లాభం పొందుతారు. ధరలు పెరుగుచున్న కాలంలో, ఆర్థిక కార్యకలాపాల స్థాయి హెచ్చుగా ఉంటుంది. అందువలన కంపెనీల లాభాలు పెరిగి, వాటాలపై చెల్లించే డివిడెండ్లు పెరుగుతాయి. డిబెంచర్లు, సెక్యూరిటీలు, బాండ్లలో పెట్టుబడి పెట్టినట్లయితే వీటిపై చెల్లించే వడ్డీరేటు స్థిరంగా ఉంటుంది కావున, సెక్యూరిటీలు, బాండ్లలో పెట్టుబడి చేసిన వ్యక్తులు నష్టాన్ని పొందుతారు.

F. వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవించే వివిధ వర్గాల ప్రజలపై, ద్రవ్యోల్బణ ప్రభావం విభిన్నంగా ఉంటుంది. వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవించేవారిని ముఖ్యంగా భూస్వాములు, వ్యవసాయదారులు, వ్యవసాయ కార్మికులుగా విభజించవచ్చు. భూస్వాములకు వచ్చే భాటకం స్థిరంగా ఉంటుంది కావున భూస్వామ్యవర్గం ఎక్కువగా నష్టపోతుంది. ద్రవ్యోల్బణ కాలంలో వ్యవసాయరంగంలో ఉత్పత్తి విలువలో పెరుగుదల, ఉత్పత్తి వ్యయంలో పెరుగుదలకంటె ఎక్కువగా ఉంటుంది. అందువలన వ్యవసాయదారులు ఎక్కువ లాభం పొందుతారు. ద్రవ్యోల్బణ కాలంలో వ్యవసాయ కార్మికుల నిజ వేతనాలు తగ్గిపోతాయి. పటిష్ఠమైన కార్మిక సంఘాలు లేనందువలన, వ్యవసాయ కార్మికులు తమ వేతనాలను ఎక్కువగా పెంచుకోలేరు. ఈ కారణంగా ద్రవ్యోల్బణ కాలంలో వారి కొనుగోలు శక్తి తగ్గి, ఎక్కువగా కష్టాలకు గురిఅవుతారు.

BRAOU

## 10.7 ద్రవ్యోల్బణ నియంత్రణ

పై వివరణను బట్టి ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థలో వివిధ వర్గాల ప్రజలపై విభిన్న రకాలుగా ప్రభావాన్ని కలుగజేస్తుందని తెలుస్తుంది. ఏది ఏమైనప్పటికీ, ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక, సాంఘిక, రాజకీయ అస్థిరత్వానికి దారితీస్తుంది. ధనిక, పేదవర్గాల మధ్య ఆదాయ సంపదలలో ఉన్న వ్యత్యాసాలను పెంచుతుంది. అందువలన ద్రవ్యోల్బణం తక్కువ స్థాయిలో ఉన్నప్పుడే ప్రభుత్వం సమర్థవంతంగా ద్రవ్య, కోశ విధాన పరమైన చర్యలను చేపట్టటం ద్వారా దానిని అరికట్టవలసి ఉంటుంది. అనగా ఒకవైపు ఆర్థిక వ్యవస్థలో సమష్టి డిమాండ్‌ను తగ్గించటానికి, మరియొకవైపు సమష్టి సప్లయ్‌ను పెంచడానికి తక్షణ చర్యలు చేపట్టవలసి ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని అరకట్టడానికి ప్రభుత్వం తీసుకునే చర్యలను ఇప్పుడు తెలుసుకుందాం.

### 10.7.1 ద్రవ్య పరమైన చర్యలు

ఈ చర్యలు, ఆర్థిక వ్యవస్థలో ప్రజల ద్రవ్య ఆదాయ స్థాయిని తగ్గించి, సమష్టి డిమాండ్‌ను తగ్గించటానికి తోడ్పడతాయి. ద్రవ్య పరమైన చర్యలలో ముఖ్యమైనవి ఏవనగా

A. **పరపతి నియంత్రణ :** ద్రవ్యోల్బణ కాలంలో, కేంద్రబ్యాంకు ద్రవ్య పరమైన చర్యలను తీసుకోవటం ద్వారా, ఆర్థిక వ్యవస్థలో మొత్తం పరపతిని నియంత్రిస్తుంది. పరపతి నియంత్రణ కోసం బ్యాంకురేటు విధానాన్ని, బహిరంగ మార్కెట్ చర్యలను, నగదు నిల్వల నిష్పత్తిలో మార్పులను చేస్తుంది. ఈ చర్యల ద్వారా, వాణిజ్య బ్యాంకులు అందించే మొత్తం పరపతి పరిమాణాన్ని క్రమబద్ధం చేస్తుంది. అదే విధంగా, మార్జిన్‌లను నిర్ణయించటం, వినియోగదార్ల పరపతి నియంత్రణ, రేషనింగ్, నైతికోద్బోధ, ప్రత్యక్ష చర్యల ద్వారా వాణిజ్య బ్యాంకులు అందించే పరపతి ప్రవాహ మార్గాన్ని నియంత్రిస్తుంది ( ఈ చర్యల ద్వారా ఏవిధంగా పరపతిని నియంత్రించటం జరుగుతుందో భాగాలు 21, 22లో వివరంగా చర్చించడం జరిగింది).

B. **అధిక విలువగల నోట్లను చలామణినుండి తీసివేయటం (demonetisation)** ద్వారా, చట్టబద్ధం కాని ద్రవ్య (black money)పరిమాణాన్ని తగ్గించటానికి వీలుంటుంది. ఈ చర్యలో భాగంగానే మన దేశంలో రూ.1,000 నోట్లను చలామణినుండి తొలగించటం జరిగింది.

### 10.7.2 కోశపరమైన చర్యలు

సార్థక డిమాండును, కొనుగోలుశక్తిని తగ్గించడం వంటి కోశపరమైన చర్యలను చేపట్టాలి. ఇందులో ముఖ్యమైనవి :

A. **అనవసర ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించటం :** ద్రవ్యోల్బణ కాలంలో అభివృద్ధేతర కార్యకలాపాలపై ప్రభుత్వం చేసే వ్యయాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించ వలసి ఉంటుంది. ప్రభుత్వం తన వ్యయాన్ని తగ్గించినట్టయితే ప్రయివేటు రంగంలో వ్యయంకూడ తగ్గిపోతుంది.

B. **పన్నులు విధించటం :** ముఖ్యంగా ప్రత్యక్ష పన్నుల రేట్లను పెంచటం ద్వారా వ్యయార్హ ఆదాయాన్ని తగ్గించవచ్చు. అందువలన వస్తువులకు ఉండే డిమాండ్ తగ్గుతుంది. పన్నుల రేట్లు ఎక్కువగా ఉంటే పొదుపు పెట్టుబడులు తగ్గిపోతాయి. అందువలన పన్నులరేట్లు ఎక్కువగా ఉండకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించవలసి ఉంటుంది.

C. **పొదుపును పెంచటం :** పొదుపును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవలసి ఉంటుంది. దీనికి కారణం ప్రజలు తమ ఆదాయాన్ని పొదుపు పెట్టుబడుల మధ్య విభజించటం జరుగుతుంది. పొదుపు పెరిగినట్లయితే, వినియోగం తగ్గి, సమష్టి డిమాండ్ తగ్గుతుంది.

D. **మిగులు బడ్జెట్ :** ప్రభుత్వం సాధ్యమైనంతవరకు మిగులు బడ్జెట్‌ను కలిగిఉండాలి. ఒకవేళ లోటు బడ్జెట్‌ను కలిగి ఉన్నట్లయితే, ఆ లోటు ద్రవ్యాన్ని ఉత్పాదక కార్యకలాపాలలో ఖర్చుపెట్టడం ద్వారా, ధరల స్థాయిని తగ్గించటానికి వీలుంటుంది.

### 10.7.3 ఇతర చర్యలు

వీటిలో ముఖ్యంగా

A. **ఉత్పత్తిని పెంచటం :** నిత్యావసర వస్తువుల సప్లయ్‌ను పెంచటం ద్వారా, ధరల స్థాయిని తగ్గించి, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించవచ్చు.

B. **హేతుబద్ధమైన వేతన విధానం** ద్రవ్యోల్బణ కాలంలో వేతనాలు ఎక్కువగా పెరగకుండా చూడవలసి ఉంటుంది. దీనికి కారణం వేతనాలు పెరిగితే, ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఉత్పత్తి వ్యయం పెరిగినందువలన ధరల స్థాయి పెరుగుతుంది. కనుక వేతనాలను అదుపులో ఉంచటం ద్వారా ధరల

స్థాయిని, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించటానికి వీలు కలుగుతుంది.

C. **ధరల నియంత్రణ :** ఈ పద్ధతిలో నిత్యావసర వస్తువులకు గరిష్ట ధరలను నిర్ణయించవలసి ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటె ఎక్కువ ధరలను వసూలుచేసిన వాళ్ళను శిక్షించటం ద్వారా, ధరలు ఒక స్థాయిని మించి పెరగకుండ అరికట్టవచ్చు.

D. **రేషనింగ్ :** ఈ పద్ధతిలో నిత్యావసర వస్తువులను, కొరతగా ఉన్న వస్తువులను ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయటం జరుగుతుంది. అందువలన అధిక మొత్తంలో ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటులోకి వస్తాయి. ఈ చర్యలద్వారా నిత్యావసర వస్తువుల సప్లయ్ సాఫీగా జరుగుతుంది కావున, వాటి ధరలను అదుపులో ఉంచటానికి వీలవుతుంది.

పై చర్చద్వారా తెలిసేదేమిటంటే, ఏదో ఒక చర్య (అనగా ద్రవ్యపరమైన లేదా కోశపరమైన) తీసుకోవటం ద్వారా ద్రవ్యోల్బణ నియంత్రణ సాధ్యంకాదు. అందువలన ద్రవ్యపరమైన, కోశపరమైన మరియు ఇతర చర్యలను ఒకేసారి తీసుకోవటం ద్వారా, ద్రవ్యోల్బణాన్ని సమర్థవంతంగా నియంత్రించటానికి వీలుంటుంది.

## 10.8 ఫిలిప్స్ రేఖ

A.W. ఫిలిప్స్ తను వ్రాసిన "The Relationship Between Unemployment and Rate of Change in Money Wage Rates in the U.K., 1862-1957" వ్యాసంలో నిరుద్యోగితా రేటుకు, వేతనాలలో పెరుగుదలకు మధ్య ఉన్న సంబంధాన్ని వివరించాడు. ఫిలిప్స్ విశ్లేషణ ప్రకారం నిరుద్యోగితా రేటుకు వేతనాలలో పెరుగుదలకు విలోమసంబంధం ఉంటుంది. అనగా నిరుద్యోగితా రేటు ఎక్కువగా ఉంటే వేతనాలలో పెరుగుదల రేటు తక్కువగాను, నిరుద్యోగితా రేటు తక్కువగా ఉంటే వేతనాలలో వచ్చే పెరుగుదల రేటు ఎక్కువగాను ఉంటుంది.

BRAOU

### 10.8.1 ఫిలిప్స్ రేఖ - ముఖ్యాంశాలు

A. నిరుద్యోగితా రేటుకు, వేతనాలలో మార్పు రేటుకు స్థిర (stable) సంబంధం ఉంటుంది.

B. నిరుద్యోగితా రేటుకు, వేతనాలలో మార్పు రేటుకు విలోమ సంబంధం (trade-off) ఉంటుంది.

C. నిరుద్యోగిత మరియు వేతన రేటులో మార్పుల మధ్య అసరళ రేఖాత్మక (non-linear) సంబంధం ఉంటుందని ఫిలిప్స్ రేఖ తెలియజేస్తుంది.

D. ఫిలిప్స్‌రేఖ 'X' అక్షాన్ని ఖండించిన బిందువు వద్ద, వేతనాలలో పెరుగుదల రేటు శూన్యంగా ఉంటుంది.

E. ఒక స్థాయిని మించి నిరుద్యోగితా రేటు ఎక్కువగా పెరిగినప్పటికీ, వేతనాలలో వచ్చే తగ్గుదల ఒక నిర్ణీత స్థాయికంటె ఎక్కువగా ఉండదు. ఈ పరిస్థితిలో ఫిలిప్స్ రేఖ 'X' అక్షానికి సమాంతరంగా ఉంటుంది.

నిరుద్యోగితా రేటుకు, వేతనాలలో మార్పు రేటుకు మధ్య ఉన్న విలోమ సంబంధాన్ని పటం-10.5లో వివరించిన ఫిలిప్స్ రేఖ సహాయంతో అర్థం చేసుకోవచ్చు.




పటం-10.5: ఫిలిప్స్ రేఖ

పటం 10.5 లో PC అనేది ఫిలిప్స్ రేఖ. నిరుద్యోగితా రేటు 5% ఉన్నప్పుడు ఫిలిప్స్ రేఖ 'X' అక్షాన్ని ఖండిస్తుంది. అనగా ఈ పరిస్థితిలో వేతనాలలో పెరుగుదల రేటు శూన్యంగా ఉంటుంది. నిరుద్యోగితా రేటు 4% గా ఉన్నట్లయితే వేతనాలలో పెరుగుదల రేటు 2% గా ఉంటుంది. నిరుద్యోగితా రేటు 6% గా ఉన్నట్లయితే వేతనాలలో వచ్చే తగ్గుదల -1% కు సమానం. నిరుద్యోగితా రేటు 6% కంటె ఎక్కువగా పెరిగినప్పటికీ, వేతనాలలో వచ్చే తగ్గుదల -1% కంటె ఎక్కువగా ఉండదు. అందువలననే పటం 10.5లో 6% నిరుద్యోగితా స్థాయి తర్వాత ఫిలిప్స్ రేఖ 'X' అక్షానికి సమాంతరంగా ఉంది.

ఫిలిప్స్ రేఖ తెలియజేసే విలోమ సంబంధానికి ముఖ్యకారణం పటిష్ఠమైన శ్రామిక సంఘాలు ఉండటంగా చెప్పవచ్చు. నిరుద్యోగితా పరిమాణం తక్కువగా ఉన్నప్పుడు, శ్రామిక సంఘాలకు బేరమాడే శక్తి ఎక్కువగా ఉంటుంది. అందువలన శ్రామిక సంఘాలు శ్రామికుల వేతనాలను సులభంగా పెంచుకోగలుగుతాయి. నిరుద్యోగితా పరిమాణం తక్కువగా ఉన్నప్పుడు, ఉద్యమదారులకు లాభావకాశాలు మెరుగవుతాయి. అందువలన ఉద్యమదారులు శ్రామికుల వేతనాలను పెంచటానికి ఎటువంటి వ్యతిరేకత చూపరు.

నిరుద్యోగితా రేటు ఎక్కువగా ఉన్నప్పుడు శ్రామిక సంఘాలకు బేరమాడే శక్తి తక్కువగా ఉంటుంది. అందువలన వేతనాలను పెంచుకోవటంలో శ్రామిక సంఘాలు సఫలీకృతం కాలేవు. నిరుద్యోగితా పరిమాణం ఎక్కువగా ఉన్నప్పుడు, ఉద్యమదారులకు లాభావకాశాలు ఎక్కువగా ఉండవు. అందువలన ఉద్యమదారులు సంస్థలను మూసివేయటానికైనా సిద్ధపడతారు కాని, వేతనాలను పెంచటానికి ఇష్టపడరు. దీనికి కారణం, సంస్థలను మూసి వేసినప్పటికీ, ఉద్యమదారులు పోగొట్టుకునే లాభం ఏమీ లేకపోవటమే.

ఫిలిప్స్ రేఖ తెలియజేసే విలోమ సంబంధం కేవలం స్వల్పకాలానికి మాత్రమే సంబంధించినదనీ, అనగా వక్రరేఖగా ఉండే ఫిలిప్స్ రేఖ కేవలం స్వల్పకాలానికి సంబంధించినదనీ, దీర్ఘకాలంలో నిరుద్యోగితా రేటుకు మరియు వేతనాలలో మార్పు రేటుకు విలోమసంబంధం ఉండదనీ మిల్టన్ ఫ్రీడ్‌మన్ (Milton Friedman) వివరించాడు. వాస్తవ ద్రవ్యోల్బణ రేటు (actual rate of inflation) కు, ఊహించిన ద్రవ్యోల్బణ రేటుకు (expected rate of inflation) మధ్య తేడా ఉన్నంత వరకు మాత్రమే నిరుద్యోగితా రేటుకు, వేతనాలలో మార్పు రేటుకు మధ్య విలోమ సంబంధం ఉంటుందని, వాస్తవ ద్రవ్యోల్బణ రేటు, ఊహించిన ద్రవ్యోల్బణ రేటు సమానమైనప్పుడు ఫిలిప్స్ రేఖ తెలియజేసే విలోమ సంబంధం అదృశ్యమవుతుందని (ceases to exist) ఫ్రీడ్‌మన్ వివరించాడు.

BRAOU

ఈ కారణంగానే దీర్ఘకాలంలో ఫిలిప్స్ రేఖ 'Y' అక్షానికి సమాంతరంగా ఉంటుందని ఫ్రీడ్‌మన్ అభిప్రాయం. దీర్ఘకాలిక ఫిలిప్స్ రేఖ సహజ నిరుద్యోగితా రేటు (natural unemployment rate) కు సమానంగా (corresponding) ఉంటుంది.

## 10.9 భారతదేశంలో ద్రవ్యోల్బణం - చర్చ

భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన నాటినుండి ప్రణాళికా బద్ధమైన ఆర్థికాభివృద్ధిని సాధించటానికి అనేక చర్యలు తీసుకోవటం జరుగుచున్నది. ముఖ్యంగా ద్రవ్యోల్బణ రహిత ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించటం జరిగింది. దీనిలో భాగంగానే, 1950లో ప్రణాళికా సంఘాన్ని నియమించి, 1951వ సంవత్సరం నుండి ప్రణాళికలను రూపొందించి, అమలు పరచటం జరుగుచున్నది. ప్రణాళికా కాలంలో, మొదటి ప్రణాళికను మినహాయించి, మిగిలిన అన్ని ప్రణాళికలలోను ద్రవ్యోల్బణ రేటు హద్దులుదాటి, ప్రణాళికా లక్ష్యాల సాధనలో అవరోధంగా తయారైంది.

టోకు ధరల సూచీలో వచ్చే పెరుగుదలను పరిగణనలోకి తీసుకుని, ప్రణాళికా వారిగా ద్రవ్యోల్బణ తీరును పరిశీలించి చూసినట్లయితే, మొదటి ప్రణాళికా కాలంలో టోకు ధరల సూచీ పెరగటానికి బదులు తగ్గిందని చెప్పవచ్చు. అనగా సాధారణ ధరల స్థాయి మొదటి ప్రణాళికా ప్రారంభంలో కంటె, చివరి నాటికి తగ్గిందని చెప్పవచ్చు. 1950-51లో టోకు ధరల సూచీ (1961-62=100) 89గా ఉన్నది. ఇది 1955-56 నాటికి 74కు తగ్గిపోయింది. అనగా మొదటి ప్రణాళికా కాలంలో మొత్తంమీద సాధారణ ధరల స్థాయి 17 శాతం తగ్గిపోయింది. 1956-57 — 1963-64 మధ్య కాలంలో సాధారణ ధరల స్థాయి ప్రతి సంవత్సరం 5.1 శాతం పెరిగింది. 1955-56లో 74 (1961-62=100) గా ఉన్న సాధారణ ధరల సూచీ, 1963-64 నాటికి 100.5 కు పెరిగింది. అనగా 1955-56 — 1963-64 మధ్య కాలంలో సాధారణ ధరల స్థాయి 49.4 శాతం పెరిగింది. 1964-65 — 1981-82 మధ్య కాలంలో సాధారణ ధరల స్థాయి సంవత్సరానికి 9.1 శాతం పెరిగింది. సాధారణ ధరల స్థాయిలో ఇంత మొత్తంలో పెరుదలవలన ప్రజలు అనేక కష్టనష్టాలకు గురియైనారని వేరే చెప్పనక్కరలేదు.

1971-72 — 1974-75 మధ్యకాలంలో మన ఆర్థిక వ్యవస్థ అతి ద్రవ్యోల్బణానికి చేరువైనది. 1970-71 ని ఆధార సంవత్సరంగా తీసుకుని, టోకు ధరల సూచీని పరిశీలించినట్లయితే, 1971-72లో 108.2 గా ఉన్న టోకు ధరల సూచీ 1974-75 నాటికి 174.9కి పెరిగింది. కాని 1975-76 — 1979-80 మధ్య కాలంలో సాధారణ ధరల స్థాయిలో వచ్చిన పెరుగుదల చెప్పుకోదతగినంతగా లేదు. 1979-80 — 1981-82 మధ్య కాలంలో కేంద్రంలో ఏర్పడిన రాజకీయ అస్థిరత్వ పరిస్థితుల దృష్ట్యా టోకు ధరల సూచీ గణణీయంగా పెరిగింది. 1979-80లో 185.8 (1970-71=100)గా ఉన్న టోకు ధరల సూచీ, 1981 మార్చినాటికి 256.2 కు, 1982 మార్చినాటికి 281.3 కు పెరిగింది. అనగా ఈ మూడు సంవత్సరాల కాలంలో ధరల స్థాయిలో సాంవత్సరిక పెరుగుదల 14.8 శాతంగా ఉన్నది.

1981-82 — 1991-92 మధ్య కాలంలో సాధారణ ధరల స్థాయి (1981-82=100) ప్రతి సంవత్సరం 8 శాతం చొప్పున పెరిగింది. 1991-92లో ద్రవ్యోల్బణ రేటు 12.1 శాతంగా ఉన్నది. 1992 నుండి 1994 సంవత్సరం మధ్యకాలంలో ద్రవ్యోల్బణ రేటు సాలుసరి 8 నుండి 9 శాతంగా ఉన్నది.

BRAOU

ప్రణాళికా కాలంలో ద్రవ్యోల్బణ రేటు ఏవిధంగా ఉన్నదో పట్టిక -10.1 సహాయంతో అవగాహన చేసుకోవచ్చు.

**పట్టిక - 10.1 : ప్రణాళికా కాలంలో ద్రవ్యోల్బణ రేటు**

| ప్రణాళిక | సాంవత్సరిక ద్రవ్యోల్బణ రేటు (%) |
|---|---|
| మొదటి ప్రణాళిక | - 3. 4 |
| రెండవ ప్రణాళిక | 5.1 |
| మూడవ ప్రణాళిక | 7.6 |
| నాల్గవ ప్రణాళిక | 9.9 |
| ఐదవ ప్రణాళిక | 10.2 |
| ఆరవ ప్రణాళిక | 14 |
| ఏడవ ప్రణాళిక | 6.8 |
| 1991 ఆగష్టు | 16.7 |
| 1992-1995 | 8 to 9 |

Source : Reserve Bank of India, *Report on Currency and Finanace*, various issues

Government of India, *Economic Survey*, various issues

B R A O U

## 10.10 భారతదేశంలో ద్రవ్యోల్బణానికి కారణాలు

మన దేశంలో కూడ డిమాండ్ వైపు అంశాలు మరియు సప్లయ్‌వైపు అంశాలు ద్రవ్యోల్బణానికి కారణభూతమవుతున్నాయి.

### 10.10.1 డిమాండ్‌వైపు అంశాలు

**A. ద్రవ్య సప్లయిలో పెరుగుదల :** మొదటి ప్రణాళికా కాలం నుండి ప్రభుత్వ వ్యయం ఆదాయాన్ని మించి ఉన్నందువలన, బడ్జెట్‌లో ఏర్పడిన లోటును పూడ్చుకోవటానికి ఎంతో కొంత మొత్తంలో నూతనంగా కరెన్సీని ముద్రించటం జరుగుతుంది. దీని కారణంగా చలామణిలో ఉండే ద్రవ్య సప్లయ్ పెరిగి, సాధారణ ధరల స్థాయి పెరుగుతుంది. (పట్టిక - 10.2 ను చూడండి).

**B. ప్రభుత్వ వ్యయంలో పెరుగుదల :** ప్రభుత్వం ప్రణాళికలలో అనేక ప్రజాసంక్షేమ పథకాలను ప్రకటించటం జరుగుచున్నది. ఈ పథకాల అమలుకోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో వ్యయం చేయవలసి వస్తుంది. ఈ కారణంగా ప్రస్తుత కాలంలో, ప్రతి సంవత్సరం ప్రభుత్వ వ్యయంలో వచ్చే పెరుగుదల చాల ఎక్కువగా ఉండి, ధరల స్థాయిలో పెరుగుదల ఏర్పడుతుంది.

పట్టిక -10. 2 : ప్రణాళికా కాలంలో ద్రవ్య సప్లయ్‌లో సాంవత్సరిక పెరుగుదల రేటు (%)

| ప్రణాళిక | ద్రవ్య సప్లయ్ పెరుగుదల రేటు(%) |
|---|---|
| మొదటి ప్రణాళిక | 2.1 |
| రెండవ ప్రణాళిక | 5.8 |
| మూడవ ప్రణాళిక | 9.06 |
| నాల్గవ ప్రణాళిక | 13.8 |
| ఐదవ ప్రణాళిక | 7.7 |
| ఆరవ ప్రణాళిక | 9.6 |
| ఏడవ ప్రణాళిక | 7.2 |
| 1990-91 | 12.1 |

Source :- Reseve Bank of India, *Report on Currency and Finance,* various issues.
Government of India, *Economic Survey, various issues.*

ప్రణాళికా కాలంలో ప్రభుత్వ వ్యయంలో పెరుగుదలను పట్టిక -10.3 సహాయంతో సులభంగా గ్రహించవచ్చు.

పట్టిక - 3 : ప్రణాళికా కాలంలో ప్రభుత్వ వ్యయం

| సంవత్సరం | ప్రభుత్వ వ్యయంలో పెరుగుదల కోట్ల రూ. (ప్రస్తుత ధరలలో) |
|---|---|
| 1950-51 | 900 |
| 1955-56 | 1,425 |
| 1960-61 | 2,631 |
| 1965-66 | 5, 381 |
| 1970-71 | 7, 483 |
| 1975-76 | 18, 933 |
| 1980-81 | 36, 845 |
| 1985-86 | 83, 961 |
| 1988-89 | 1, 30, 048 |
| 1989-90 | 1, 58, 107 |
| 1990-91 | 1, 79, 443 |

Source : Government of India, *Economic Survey,* various issues.
Reserve Bank of India, *Report on Currency and Finance,* various issues.

BRAOU

C. **లోటు ద్రవ్యం :** ప్రతి బడ్జెట్‌లోను ప్రభుత్వ ఆదాయం కంటె, ప్రభుత్వ వ్యయం ఎక్కువగా ఉంటుందనేది మనందరకు తెలిసిన విషయమే. లోటు ద్రవ్యం మూలంగా చలామణిలో ఉండే ద్రవ్య సప్లయ్ పెరిగి సాధారణ ధరల స్థాయి పెరుగుతుంది.

D. **గుప్త ధనం (Black Money) :** మన దేశంలో అధికారిక అంచనాలలోకి రాని ద్రవ్య పరిమాణం (unaccounted money) ప్రతి సంవత్సరం పెరుగుచున్నది. అనగా ఈ ద్రవ్య ఆదాయంపై, పన్ను చెల్లించకుండా తప్పించుకోవటం జరుగుచున్నది. ఈ ద్రవ్యంతో విలాసవంతమైన జీవితాన్ని గడపటానికి ప్రయత్నించటం వల్ల, విలాస వస్తువుల ధరలు పెరిగి, సాధారణ ధరల స్థాయిలో పెరుగుదలకు దారితీస్తుంది. పట్టణాలలో భూమి (ఇళ్ళ స్థలాలు) రేట్లు ఆకాశాన్నంటే విధంగా పెరగటానికి కారణం గుప్తధనమే అని ఆర్థికవేత్తల అభిప్రాయం.

### 10.10.2 సప్లయ్‌వైపు అంశాలు

A. **ప్రకృతి వైపరీత్యాలు (Natural Calamities) :** మనదేశ వ్యవసాయరంగం ఎక్కువ భాగం ప్రకృతిపై ఆధారపడి ఉన్నది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా, వ్యవసాయోత్పత్తిలో ఒడుదొడుకులు సంభవిస్తున్నాయి. వరదలు, కరవు కాటకాలు మొదలైన వాటి కారణంగా, కొన్ని సమయాలలో వ్యవసాయిక వస్తువులకు కొరత ఏర్పడుతుంది. వ్యవసాయ వస్తువుల కొరత కారణంగా, పారిశ్రామిక రంగంలో ముఖ్యంగా వ్యవసాయ ఆధార పరిశ్రమలలో ఉత్పత్తి తగ్గిపోతుంది. వీటన్నిటి ఫలితంగా, ఆర్థిక వ్యవస్థలో సాధారణ ధరల స్థాయిలో పెరుగుదల సంభవిస్తుంది.

B. **పరిపాలిత లేదా పూర్వ నిర్ధారిత ధరలలో పెరుగుదల (Hike in Administered Prices) :** ప్రభుత్వం ప్రతిసంవత్సరం తన నియంత్రణలో ఉన్న వస్తువుల (ఉదాహరణకు బొగ్గు, డిజిల్, పెట్రోల్) ధరలను పెంచటం జరుగుతుంది. ఈ కారణంగా, ఈ వస్తువుల ధరలలో పెరుగుదల వలన ఆర్థిక వ్యవస్థలోని మిగిలిన రంగాలలో ఉత్పత్తి అవుతున్న వస్తువుల ధరలలో పెరుగుదల వస్తుంది. దీనికి కారణం, బొగ్గు, డీజిల్, పెట్రోల్ వంటి వస్తువులను ఇతర రంగాలు ఉత్పాదకాలుగా ఉపయోగించటమే. ఉత్పాదకాల ధరలు పెరిగినప్పుడు, ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. కావున, అంతిమ వస్తువుల ధరలు కూడ పెరుగుతాయి.

BRAOU

C. **పారిశ్రామిక రంగంలో అశాంతి :** పారిశ్రామిక రంగంలో శ్రామికులకు, యాజమాన్యానికి మధ్య శాంతియుత పరిస్థితులు లేని కారణంగా, పారిశ్రామిక రంగంలో సమ్మెలు, సంస్థల మూసివేత (lock-out) మొదలైన వాటి మూలంగా ఎన్నో పనిదినాలను తద్వారా ఎంతో ఉత్పత్తిని నష్టపోవలసి వస్తుంది.

D. **నిత్యావసర వస్తువుల దాచివేత :** కొంత మంది వ్యాపారులు నిత్యావసర వస్తువులను పెద్దమొత్తంలో కొనుగోలు చేసి వాటిని దాచివేసి, మార్కెట్‌లో ఈ వస్తువులకు కృత్రిమ కొరతలు సృష్టించటం జరుగుతుంది. అందువలన నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి, సాధారణ ధరల స్థాయిలో పెరుగుదలకు దారితీస్తుంది.

E. **పెట్రోలియం ఉత్పత్తుల ధరలలో పెరుగుదల :** ముఖ్యంగా 1972వ సంవత్సరం తర్వాత పెట్రోలియం ఉత్పత్తుల ధరలు (oil prices) ఎక్కువ మోతాదులో పెరిగినందువలన, పెట్రోల్‌ను దిగుమతి చేసుకుంటున్న మనలాంటి దేశాలలో ద్రవ్యోల్బణం సర్వ సాధారణమైంది.

## 10.11 సారాంశం

ప్రస్తుత కాలంలో మానవజాతిని పట్టిపీడిస్తున్న సమస్యలలో ద్రవ్యోల్బణం ఒకటి. రోజు రోజుకు

ద్రవ్యోల్బణ సమస్య తీవ్రరూపం దాలుస్తూ, మానవుల జీవనగతిని దుర్భరం చేస్తుంది. ద్రవ్యోల్బణం అనగా క్రమంగాను, నిరంతరంగాను పెరుగుతూ ఉండే ధరల స్థాయి అని చెప్పబడుతుంది. ద్రవ్యోల్బణ కాలంలో ధరల స్థాయి పెరుగుతూ ఉంటుంది. కావున ద్రవ్యం విలువ క్రమంగా క్షీణిస్తుంది. ద్రవ్యోల్బణ కాలంలో భౌతిక వస్తువుల విలువలు పెరుగుతాయి. కావున ప్రజలు విలువ క్షీణిస్తున్న ద్రవ్యాన్ని గాక వస్తువులను పొంది ఉండటం పట్ల ఎక్కువ మక్కువ చూపుతారు. సమష్టి డిమాండ్, సమష్టి సప్లయ్ కంటె ఎక్కువగా ఉన్న కారణంగాను, ఉత్పత్తి వ్యయంలో పెరుగుదల మూలంగాను, సాధారణ ధరల స్థాయిలో పెరుగుదల ఏర్పడి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ద్రవ్యోల్బణం ఆదాయ సంపదలలో అసమానత్వాలు ఎక్కువ కావటానికి తోడ్పడుతుంది. ప్రభుత్వం ద్రవ్య పరమైన, కోశపరమైన మరియు ఇతర చర్యలను ఒకేసారి తీసుకోవటం ద్వారా ద్రవ్యోల్బణాన్ని సమర్థవంతంగా నియంత్రించటానికి వీలుంటుంది.

## 10.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 40 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. ద్రవ్యోల్బణాన్ని నిర్వచించి, డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణానికి కారణాలను వివరించండి.
2. ఉత్పత్తి పంపిణీలపై ద్రవ్యోల్బణ ప్రభావాన్ని వివరించి, ద్రవ్యోల్బణ నియంత్రణకు ఏ చర్యలు చేపట్టవలెనో సూచించండి.
3. భారత దేశంలో ద్రవ్యోల్బణ తీరును వివరించి, ద్రవ్యోల్బణానికి కారణాలను తెలియజేయండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు సమారు 20 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణాన్ని వివరించండి.
2. వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణాన్ని తెలియజేయండి.
3. ఫిలిప్స్ రేఖను చర్చించండి.
4. ద్రవ్యోల్బణ నియంత్రణ చర్యలు ఏమిటి ?

BRAOU

## 10.13 సంప్రదింపు గ్రంథాలు

1. Edward Shapiro : Macro Economic Analysis.
2. Branson : Macro Economic Theory
3. Willis.L.Peterson : Principles of Economics- Macro
4. M.C.Vaish : Monetary Theory

## 10.14 పదకోశం

| | | |
|---|---|---|
| Inflation | - | ద్రవ్యోల్బణం |
| Creeping inflation | - | ప్రాకే ద్రవ్యోల్బణం |
| Hyper inflation | - | అతి (పరమ) ద్రవ్యోల్బణం |

| | | |
|---|---|---|
| Monetary system | - | ద్రవ్య వ్యవస్థ |
| Semi inflation | - | పాక్షిక ద్రవ్యోల్బణం |
| Demand pull inflation | - | డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం |
| Cost push inflation | - | వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం |
| Aggregate demand | - | సమష్టి డిమాండ్ |
| Aggregate supply | - | సమష్టి సప్లయ్ |
| General level of prices | - | సాధారణ ధరల స్థాయి |
| Credit control | - | పరపతి నియంత్రణ |
| Monetary measures | - | ద్రవ్యపరమైన చర్యలు |
| Fiscal measures | - | కోశపరమైన చర్యలు |
| Rational wage policy | - | హేతుబద్ధమైన వేతన విధానం |
| Trade - off | - | విలోమ సంబంధం, వైరుధ్యం |
| Inverse relation | - | విలోమ సంబంధం |
| Expected rate of inflation | - | ఊహించిన ద్రవ్యోల్బణ రేటు |
| Actual rate of inflation | - | వాస్తవిక ద్రవ్యోల్బణ రేటు |
| Natural rate of unemployemnt | - | సహజ నిరుద్యోగిత రేటు |
| Wholesale price index | - | టోకు ధరల సూచీ |
| Deficit financing | - | లోటు ద్రవ్యం |
| Unaccounted or black money | - | గుప్త ధనం, నల్ల ధనం |
| Natural calamities | - | ప్రకృతి వైపరీత్యాలు |
| Administered price | - | పరిపాలిత ధరలు, పూర్వ నిర్ధారిత ధరలు |
| Lock-out | - | సంస్థల మూసివేత |

- డా॥ ఏ. నకులా రెడ్డి

BRAOU

# భాగం - 11 : సాధారణ ధరల స్థాయి గణన

విషయ క్రమం


11.0 ఉద్దేశం

11.1 పరిచయం

11.2 వివిధ భావనలు

11.2.1 ద్రవ్యం విలువ

11.22 సాధారణ ధరల స్థాయి

11.2.3 సూచీ సంఖ్యలు

11.3 సూచీ సంఖ్యల లక్షణాలు

11.4 సూచీ సంఖ్యల రకాలు

11.5 సూచీ సంఖ్యల నిర్మాణంలో దశలు

11.6 సూచీ సంఖ్యల గణన

11.6.1 సామాన్య సగటు పద్ధతి

11.7 సూచీ సంఖ్యల గణనలో సమస్యలు

11.8 సూచీ సంఖ్యల ప్రయోజనం

11.9 సారాంశం

11.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

11.11 సంప్రదింపు గ్రంథాలు

11.12 భావనలు

11.13 పదకోశం


## 11.0 ఉద్దేశం

ద్రవ్యం విలువ, సాధారణ ధరల స్థాయి, ద్రవ్యం విలువలోని మార్పులను సూచీ సంఖ్యల సహాయంతో కొలవడం, సూచీ సంఖ్యల లక్షణాలు, వాటి నిర్మాణంలో గల వివిధ దశలు, వాటి గణన, వాటి గణనలో వున్న ఇబ్బందులు, వాటి ప్రయోజనాలు, వాటిలో గల రకాలను వివరించడం ఈ భాగం ఉద్దేశం.

## 11.1 పరిచయం

వస్తువులకు విలువ ఉన్నట్లే ద్రవ్యానికి కూడా విలువ ఉన్నది. వస్తువుల విలువను ద్రవ్యంతో కొలుస్తాం. అంటే ద్రవ్యం కొలబద్దగా ఉపయోగపడుతుంది. వస్తువుల విలువలు తరచూ మారుతూ ఉంటాయి. వస్తువుల

BRAOU

విలువల వలెనే ద్రవ్యం విలువ కూడా స్థిరంగా ఉండక మారుతూ ఉంటుంది. ఈ మార్పులు ఆర్థిక వ్యవస్థపై విపరీత ప్రభావాన్ని చూపిస్తాయి. అందువలన ద్రవ్యపు విలువను, దాని విలువలో వచ్చే మార్పులను కొలిచే సాధనమైన సూచీ సంఖ్యలను ఈ భాగంలో సవివరంగా చర్చించడమైంది.

## 11.2 వివిధ భావనలు

సాధారణ ధరల స్థాయి కొలతకు సంబంధించి ద్రవ్యం విలువ, సాధారణ ధరల స్థాయి, సూచీ సంఖ్యలు అనే మౌలిక భావనలను దిగువ చర్చించడమైంది.

### 11.2.1 ద్రవ్యం విలువ (Value of Money)

ద్రవ్యం విలువ అంటే అది వస్తు సేవలను కొనగలిగే శక్తి అని అర్థం. ఇంకా విపులంగా చెప్పాలంటే ద్రవ్యం విలువను ద్రవ్యం కొనుగోలు శక్తిగా అర్థంచేసుకోవచ్చు. ఉదా : ఒక రూపాయితో రెండు ఆరంజ్ పండ్లను కొనుగోలు చేయగలమనుకుంటే ఒక రూపాయి ద్రవ్యం విలువ రెండు ఆరంజ్ పండ్లకు సమానం. అదే ఆరంజ్ పండ్ల ధర పెరిగి ఒక రూపాయికి ఒక ఆరెంజ్ పండు మాత్రమే లభ్యమవుతుందనుకుందాం. అప్పుడు ఒక రూపాయి ద్రవ్యం విలువ ఒక ఆరంజ్ పండుకు సమానమవుతుంది. దీనివలన మనకు అర్థం అయ్యేదేమంటే వస్తు సేవల ధరలు తక్కువగా ఉంటే ద్రవ్యం కొనుగోలు శక్తి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ద్రవ్యం వాటిని ఎక్కువ మొత్తంలో కొనగలదు. ఒకవేళ వస్తు సేవల ధరలు ఎక్కువగా ఉంటే ద్రవ్యం కొనుగోలు శక్తి తక్కువగా ఉంటుంది. కాబట్టి ద్రవ్యం వాటిని తక్కువ మొత్తంలో కొనగలదు. అంటే, ద్రవ్యం విలువకు, వస్తు సేవల ధరలకు మధ్య విలోమ సంబంధం ఉన్నదని మనకు అర్థమవుతున్నది.

### 11.2.2 సాధారణ ధరల స్థాయి (General Price Level)

ద్రవ్యం విలువను ద్రవ్యం కొనుగోలు శక్తి సూచిస్తున్నదని తెలుసుకున్నాం. ద్రవ్యం కొనుగోలు శక్తిని తెలుసుకోవడానికి ధరల స్థాయిని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. వస్తు సేవల విలువలను ద్రవ్య రూపంలో తెలియజేస్తే దానిని ధర (price) అని అంటారు. వినిమయంలో వస్తువు విలువకు ద్రవ్యానికి ఉండే నిష్పత్తే ధర. అనేక వస్తువుల సగటు ధరను ధరల స్థాయి (price level)అని అంటారు. దేశంలో ఎన్నో రకాల వస్తు సేవలు అధిక పరిమాణంలో ఉత్పత్తి జరుగుతున్నందున, ద్రవ్యం విలువను ప్రతి వస్తువు రూపంలో వ్యక్తం చేయడం కష్ట సాధ్యం. కాబట్టి అన్ని వస్తు సేవల ధరల సగటును లెక్కించడం జరుగుతుంది. ఈ సగటునే ధరల స్థాయి లేదా సాధారణ ధరల స్థాయి (general price level) గా వ్యవహరిస్తారు.

### 11.2.3 సూచీ సంఖ్యలు (Index Numbers)

ద్రవ్యం విలువను, ద్రవ్యం విలువలో వచ్చే మార్పులను కొలిచే సాధనమే సూచీ సంఖ్యలు (index numbers). ద్రవ్యం కొనుగోలు శక్తిని అంచనా వేయడానికి ధరల స్థాయిని తెల్పుకోవాల్సిన అవసరం ఉందనుకున్నాం. దీనిని ధరల సూచీ సంఖ్య (price index number) అనే సాంఖ్యక సాధనం సహాయంతో లెక్కిస్తారు.

ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ఇటలీ దేశస్థుడైన 'కార్లి' చే సూచీ సంఖ్యలు నిర్మించబడినాయి. అమెరికా ఉనికి ఇటలీ దేశంలోని ధరలపై ఎంత మేరకు ప్రభావం ఉన్నదో అధ్యయనం చేయడానికి అతను ఈ సూచీ సంఖ్యలను నిర్మించాడు. అతను క్రీ.శ. 1750 (ప్రస్తుత సంవత్సరం) ధరల్లోని మార్పులను క్రీ.శ. 1500 (ఆధార సంవత్సరం) లో ఉన్న ధరల స్థాయితో పోల్చి చూడటం జరిగింది.

BRAOU

ద్రవ్యం విలువకు, వస్తుసేవల ధరలకు మధ్య విలోమ సంబంధం (inverse relationship) ఉన్నదని తెలుసుకున్నాం. కాబట్టి ద్రవ్యం విలువలోని మార్పులను విభిన్న కాలాల్లో ధరల స్థాయిలలోని మార్పుల ఆధారంగా తెలుసుకోవాలి. దీనిని సూచీ సంఖ్యల ద్వారా చేయడం జరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ధరల స్థాయిలతో కూర్చిన పట్టీని సూచీ సంఖ్యలు అని అంటారు.

**నిర్వచనాలు :**

"ఆధార కాలంగా తీసుకున్న కాలంలోని ధరల స్థాయి ఉన్నతితో మరో కాలంలోని ధరల స్థాయి ఉన్నతిని సాపేక్షికంగా చూపే సంఖ్య ధరల సూచీ సంఖ్య" అని వి. చాండ్లర్ నిర్వచించాడు.

"ఒక కాలం నుంచి మరో కాలానికి, ఒక స్థలం నుండి మరో స్థలానికి ద్వ్యిషయ పరిమాణంలోని సాపేక్ష వైవిధ్యాలను అంచనా వేయడానికి సాంఖ్యక సాధనం ద్వారా లెక్కించిన సంఖ్య ధరల సూచీ సంఖ్య".

## 11.3 సూచీ సంఖ్యల లక్షణాలు

పైన పేర్కొన్న నిర్వచనాల ఆధారంగా సూచీ సంఖ్యలు కింది లక్షణాలను కల్గి వుంటాయని చెప్పవచ్చు.

i) సూచీ సంఖ్యలు ప్రత్యేక రకమైన సగటులు. ఇవి సాధారణ సగటులు చేయలేని పనిని కూడా చేస్తాయి. అనగా వివిధ యూనిట్లలో చెప్పబడిన శ్రేణులలోని మార్పులను సరిపోల్చడానికి సూచీ సంఖ్యలను సాధనంగా వాడతారు.

ii) సూచీ సంఖ్యలు ప్రత్యక్షంగా కొలవడానికి వీలు లేని అంశాల ప్రభావాన్ని అధ్యయనం చేస్తాయి. ఉదా: ఒక దేశంలో వ్యాపార కార్యకలాపాల్లోని మార్పులను ప్రత్యక్షంగా కొలవడం కష్టం. అయితే, ప్రత్యక్షంగా కొలవడానికి అవకాశమున్న వ్యాపార కార్యకలాపాలను ప్రభావితం చేసే అంశాల విలువలలోని తేడాలను అధ్యయనం చేయడం ద్వారా వ్యాపార కార్యకలాపాల్లోని సాపేక్ష మార్పుల (relative changes) ను అర్థం చేసుకోవడానికి సూచీ సంఖ్యలు ఉపకరిస్తాయి.

iii) సూచీ సంఖ్యలు ఒక సమూహపు ఉమ్మడి లక్షణాలను వెలికి తీయడానికి దోహద పడతాయి. ఉదా: ఒక దేశంలో సాధారణ ధరల స్థాయిలో మార్పులను ప్రత్యక్షంగా కొలువలేం. కాని, వివిధ వస్తువుల ధరల స్థాయిల మార్పులలోని ఏకత్వం కారణంగా, వివిధ వస్తువుల ధరల్లోని మార్పులను అధ్యయనం చేయడం ద్వారా సాధారణ ధరల స్థాయిలలోని మార్పులను అవగాహన చేసుకోవడానికి సూచీ సంఖ్యలు ఉపయుక్తంగా ఉంటాయి.

iv) కాలానికి సంబంధించిన లేదా స్థలానికి సంబంధించిన మార్పులను ఈ సూచీ సంఖ్యలు కొలుస్తాయి. ఉదా: కొంతమంది వ్యక్తుల సమూహపు జీవన ప్రమాణం రెండు కాలాలలో వేరు వేరుగా ఉండవచ్చు. లేదా ఒకే కాలంలో జీవన ప్రమాణం రెండు వేర్వేరు ప్రదేశాలలో భిన్నంగా ఉండవచ్చు. ఈ రెండు రకాల మార్పులను కొలవడానికి సూచీ సంఖ్యలు ఉపయోగపడుతాయి.

## 11.4 సూచీ సంఖ్యల రకాలు

సూచీ సంఖ్యలను వాటి ఉద్దేశం, ఉపయోగాలను బట్టి ఈ కింది విధంగా విభజించవచ్చు.

i) **ధరల సూచీ సంఖ్యలు (Price Index Numbers)**: ధరల సూచీ సంఖ్యలు ధరల్లోని సాధారణ మార్పులను కొలుస్తాయి. ధరల సూచీ సంఖ్యలను తిరిగి రెండు విధాలుగా విభజించవచ్చు. అవి :

(a) **టోకు ధరల సూచీ సంఖ్యలు (Wholesale Price Index Numbers) :** టోకు ధరల సూచీ సంఖ్యలు దేశంలోని సాధారణ ధరల స్థాయిలో వచ్చిన మార్పులను తెలియజేస్తాయి. టోకు మార్కెట్‌లో అమ్మే ముఖ్యమైన వస్తువుల ధరలలో మార్పులను కొలవడమే ఈ సూచీ సంఖ్యల ప్రయోజనం. అన్ని ఆచరణాత్మక ప్రయోజనాల కొరకు ఈ సూచీ సంఖ్యలు సాధారణ ద్రవ్యం కొనుగోలు శక్తికి ప్రాతినిధ్యం వహిస్తాయి.

b) **చిల్లర ధరల సూచీ సంఖ్యలు (Retail Price Index Numbers) :** వివిధ వస్తువుల చిల్లర ధరలలో వచ్చే సాధారణ మార్పులను ఈ సూచీ సంఖ్యలు ప్రతిబింబింపజేస్తాయి. ఉదా: వినియోగ వస్తువులు. చిల్లర మార్కెట్‌లో విక్రయమవుతున్న పూర్తి అయిన వినియోగ వస్తువుల పరంగా ద్రవ్యం విలువను కొలవడానికి ఈ సూచీ సంఖ్యలు వాడతారు. అయితే అన్ని వస్తువులకు అన్ని కాలాల్లో చిల్లర ధరలు లభ్యంకాకపోవచ్చు. అందువలన, చిల్లర ధరల సూచీల నిర్మాణంలో ఇది ఒక పరిమితిగా చెప్పవచ్చు.

ii) **సాధారణ ప్రయోజనాల సూచీ సంఖ్యలు (General Utility Index Numbers) :** ఈ సూచీ సంఖ్యలు సాధారణ ద్రవ్యం కొనుగోలు శక్తిని కొలుస్తాయి. టోకు ధరలు, చిల్లర ధరలు, వేతనాలు, లాభాలు, వడ్డీ మొదలైన వివిధ భారిత సగటు సూచీ సంఖ్యల కలయికచే ఇది గణన కెక్కింది.

iii) **వినియోగ వస్తువుల సూచీ సంఖ్యలు (Consumer Goods Index Numbers) :** ఈ సూచీ సంఖ్యలు వినియోగదారులు కొనుగోలు చేసే పూర్తి అయిన వినియోగ వస్తువులను, సేవలను పరిగణనలోకి తీసుకుంటాయి. ఈ సూచీ సంఖ్యల ముఖ్య ఉద్దేశమేమనగా వినియోగదారు ద్రవ్యం విలువలోని మార్పును కొలవడం. ఇది చాలా ప్రాముఖ్యమైన, ఉపయోగకరమైన సూచీ. అయితే దాని నిర్మాణం కూడా కష్టమే. ఎందుకంటే, వివిధ వినియోగ వస్తువుల ధరలు తెలుసుకోవడం వ్యయ ప్రయాసలతో కూడిన పని.

iv) **జీవన వ్యయ సూచీ సంఖ్యలు (Cost of Living Index Numbers) :** జీవన వ్యయ సూచీ సంఖ్యలనే వినియోగదారుని ధర సూచీ (consumer price index)అని కూడా అంటారు. ఇది కూడ ఒక రకమైన చిల్లర ధరల సూచీయే. ఈ సూచీలు ఒక ప్రత్యేక తరగతి ప్రజల జీవన ప్రమాణాన్ని అధ్యయనం చేస్తాయి. మనదేశంలో జీవన వ్యయ సూచీ సంఖ్యలు ప్రభుత్వ ఉద్యోగులకొరకు, కార్మికులు, మధ్యతరగతి వినియోగదారులు మొదలైన వారికొరకు లభ్యమవుతాయి. ముఖ్యంగా వీటిని కరువు భత్యం నిర్ణయించడానికి వాడతారు.

v) **వేతనాల సూచీ సంఖ్యలు (Wage Index Numbers) :** ఈ సూచీ సంఖ్యలు వేతనాలలో మార్పులను సూచించడానికి ఉపయోగపడతాయి. చాలాదేశాలు కాలానుగుణంగా వేతనాలలో వచ్చే మార్పులను చూపడానికి వేతనాల సూచీ సంఖ్యలను తయారుచేస్తున్నాయి. ఇవి శ్రామికుని వాస్తవిక వేతనాన్ని లెక్కించడానికి ఉపయోగపడతాయి.

vi) **విలువ సూచీ సంఖ్యలు (Value Index Numbers) :** ఈ సూచీ సంఖ్యలు ఉత్పత్తి మొత్తం విలువ (total value of production) తో వచ్చిన మార్పులను అధ్యయనం చేస్తాయి. ఉదా : చిల్లర అమ్మకాల సూచీలు, లాభాల సూచీలు, ఇన్వెంటరీల సూచీలు మొదలైనవి. అయితే ఇవి ధర, పరిమాణ సూచీలవలె సాధారణమైన సూచీలు కావు.

vii) **పరిమాణ సూచీ సంఖ్యలు (Quantity Index Numbers) :** పరిమాణ సూచీ సంఖ్యలు వస్తువుల ఉత్పత్తి, వినియోగం, పంపిణీ పరిమాణంలోని మార్పులను అధ్యయనం చేస్తాయి. ఉదా : వ్యవసాయ ఉత్పత్తి సూచీలు, పారిశ్రామిక ఉత్పత్తి సూచీలు, ఎగుమతి దిగుమతుల సూచీలు మొదలైనవి. ఈ సూచీ సంఖ్యలు ఆర్థిక వ్యవస్థలో భౌతిక ఉత్పత్తి స్థాయిని అధ్యయనం చేయడానికి సహాయపడతాయి.

BRAOU

## 11.5 సూచీ సంఖ్యల నిర్మాణంలో దశలు

వివిధ వస్తువుల ధరల్లోని మార్పులను గురించి తెలియజేసే సాంఖ్యక సాధనం ధరల సూచీ సంఖ్య అని తెలుసుకున్నాం. ఈ సూచీ సంఖ్యల నిర్మాణంలో అనేక దశలు ఉన్నాయి. వాటిని కింద ఇవ్వడమైంది.

i) **ఆధార సంవత్సరపు ఎంపిక :** ఆధార సంవత్సరపు ఎంపిక సూచీ సంఖ్యల నిర్మాణంలో మొట్టమొదటి దశ. ధరల స్థాయిలో వచ్చే మార్పులను ఎప్పుడూ ఆధార సంవత్సరంతోనే కొలవాల్సి ఉంటుంది. అంటే సూచీ సంఖ్యలను నిర్మించేటప్పుడు ఒక సంవత్సరాన్ని ఆధార సంవత్సరంగా ఎన్నుకొని ఆ సంవత్సరంలోని ధరల స్థాయితో ఏ సంవత్సరానికైతే సూచీ సంఖ్యలను లెక్కించాలనుకుంటామో ఆ సంవత్సరపు ధరల స్థాయిని పోల్చి చూస్తారు. ఆధార సంవత్సరం అన్ని విధాల ప్రమాణంగా ఉండాలి. ధరలు అధికంగా ఉన్న సంవత్సరాన్నిగాని, ధరలు అల్పగా ఉన్న సంవత్సరాన్నిగాని ఆధార సంవత్సరంగా ఎన్నుకోరాదు. ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని కల్గించే ఎట్లాంటి సంఘటనలు లేని సంవత్సరాన్ని, ధరల మీద ప్రభావం ఉండే సంఘటనలు లేని సంవత్సరాన్ని మాత్రమే ఆధార సంవత్సరంగా ఎన్నుకోవాలి. అంటే ఆధార సంవత్సరం తులనాత్మకంగా ధరల స్థిరత్వమున్న సంవత్సరంగా ఉండాలి. ఎందుకంటే, నిర్మించిన సూచీ సంఖ్యలు నమ్మదగినవిగా ఉండాలి.

ii) **వస్తువుల ఎంపిక :** ఆధార సంవత్సరపు ఎన్నిక తర్వాత వస్తువులను ఎంపిక చేసుకోవడం సూచీ సంఖ్యల నిర్మాణంలో రెండో దశ. సమాజంలో లభించే అన్ని వస్తువులను ఎంపిక చేసుకోలేం. సూచీ సంఖ్యల నిర్మాణంలో ధరల మార్పులలో ఖచ్చితమైన ఫలితాలు పొందడానికి సరిఅయిన వస్తువులను ఎంపిక చేసుకోవాలి. డిమాండ్, సప్లయిలు నిలకడగా ఉండే వస్తువులను, ఉత్పత్తి విధానాలలో మార్పులు వచ్చే అవకాశం లేని వస్తువులను మాత్రమే ఎంచుకోవాలి. ఉదా: బియ్యం, గోధుమలు, చక్కెర, వస్త్రాలు మొదలైన నిత్యావసర వస్తువులను సూచీ సంఖ్యల నిర్మాణానికి ఎన్నుకోవాలి.

iii) **వస్తువుల సంఖ్య :** సూచీ సంఖ్యల నిర్మాణంలో వస్తువుల సంఖ్య ఎంత ఉండాలి అన్నది కూడ ప్రధానమైనదే. సూచీ సంఖ్యల నిర్మాణానికి సాధ్యమైనన్ని ఎక్కువ వస్తువులను ఎన్నుకోవాలి. ఎందుకంటే ఎన్నుకొన్న వస్తువుల సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే, లెక్కించే సగటు ధర కూడా అంత ఖచ్చితంగా ఉంటుంది. అంతేగాక సూచీ సంఖ్యలు లోపరహితంగా కూడా ఉంటాయి.

iv) **ధరల సేకరణ :** వస్తువులను, వస్తువుల సంఖ్యను నిర్ణయించిన తరువాత సూచీ సంఖ్యల నిర్మాణానికి ఆ వస్తువుల ధరలను సేకరించాలి. వస్తువుల ధరలు రెండు విధాలుగా ఉంటాయి. అవి : చిల్లర ధరలు, టోకు ధరలు. చిల్లర మార్కెట్లలో లభ్యమయ్యే ధరలు చిల్లర ధరలు. ఇవి అంత నమ్మశక్యంగా ఉండవు. ఎందుకంటే వీటిలో వ్యత్యాసాలు ఎక్కువగా ఉంటాయి. అందువలన టోకు మార్కెట్లలో లభించే టోకు ధరలను లెక్కలోకి తీసుకోవాలి. ఈ ధరలను సేకరించడం సులభం. అంతేగాక, టోకు ధరలలో వ్యత్యాసాలు కూడ తక్కువగా ఉంటాయి. కాని టోకు ధరలు వినియోగదారులు చెల్లించే ధరలకంటే తక్కువగా ఉండాలి.

v) **సూచీ సంఖ్యల ఎంపిక :** ఫలితాలు యధార్థంగా ఉండటానికి సూచీ సంఖ్యల ఎంపిక సరైనదిగా ఉండాలి. ఎందుకంటే సూచీ సంఖ్యల నిర్మాణంలో సరియైన సూచీ సంఖ్యల ఎంపిక ధరల దత్తాంశ సేకరణను నిర్ణయిస్తుంది. ఉదా: శ్రామికుల జీవన ప్రమాణాన్ని అధ్యయనం చేయాలనుకుంటే జీవన వ్యయ సూచీ సంఖ్యల (cost of living index numbers) ను ఎన్నుకోవాలి. ఇంకా, టోకు ధరల సూచీ సంఖ్యలు, చిల్లర ధరల సూచీ సంఖ్యలు, పరిమాణ సూచీ సంఖ్యలు మొదలైనవి సూచీ సంఖ్యలలో కొన్ని రకాలు. సూచీ

BRAOU

సంఖ్యలలోని రకాలను ఈ పాఠంలోనే తరువాత పేజీలలో సవివరంగా చర్చించడమైంది.

vi) **భారాల ఎంపిక :** సూచీ సంఖ్యలు నమ్మదగినవిగా ఉండాలంటే, వస్తువులకు వినియోగంలో వాటికి ఉండే ప్రాముఖ్యాన్ని బట్టి భారాల (weights)ను నిర్ణయించాలి. ఉదా : వినియోగంలో బియ్యానికి, గోధుమలకు ఉన్న ప్రాముఖ్యత పంచదారకు, బంగారానికి ఉండదు. అందువలన పంచదార, బంగారం కంటే బియ్యానికి, గోధుమలకు ఎక్కువ ప్రాముఖ్యతను చూపడానికి వాటికి ఎక్కువ భారాలు ఇవ్వాలి. అట్లా ఇవ్వకపోతే సూచీ సంఖ్యలు సరి అయిన ఫలితాలను ఇవ్వలేవు. కాబట్టి, వస్తువులకు వాటి వినియోగ ప్రాముఖ్యాన్ని బట్టి భారాలు ఇవ్వనట్లయితే, సూచీ సంఖ్యల ప్రయోజనం శూన్యం. ఒక వస్తువుకు భారాన్ని నిర్ణయించేటప్పుడు, ఇతర వస్తువుల మొత్తం విలువలో ఆ వస్తువు విలువ ఏ అనుపాతంలో ఉంటుందో దాన్ని పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది.

ఉదాహరణకు, నెలలో ఒక కుటుంబ బియ్యం వినియోగం 25 కిలోలు, పంచదార వినియోగం రెండు కిలోలు అని అనుకుందాం. బియ్యం ధర కిలోకు రూ 6.00 లు, పంచదార ధర కిలోకు రూ. 10.00 గా భావిస్తే, ఆ వస్తువుల భారిత సగటు ధర కింది విధంగా ఉంటుంది.

| | | |
|---|---|---|
| 25 కిలోల బియ్యం ధర | = | 25 × రూ6.00 = రూ 150.00 |
| 2 కిలోల పంచదార ధర | = | 2 × రూ 10.00 లు = రూ. 20.00 |
| భారిత సగటు ధర | = | 170 ÷ 27 = రూ. 6.30 |

అదే సాధారణ సగటు ధర రూ. 8.00 (16 ÷2) అవుతుంది. దీనివలన మనకు అర్థమయ్యేదేమంటే సామాన్య సగటు కంటే భారిత సగటు గణన ఖచ్చితమైన ఫలితాలనిస్తుంది.

vii) **సగటు ఎంపిక :** సూచీ సంఖ్యల నిర్మాణంలో అనేక రకాలైన సగటులను ఉపయోగిస్తారు. ఉదా. అంకగణిత సగటు, గుణ, హర మధ్యమ సగటులు మొదలైనవి. సూచీ సంఖ్యలను నిర్మించేటప్పుడు సాధారణ సగటు గాక, భారిత సగటును లెక్కించడం సమంజసంగాను, యదార్థంగాను ఉంటుంది. ఈవిధంగా నిర్ణయించిన సగటు ధరయే ఆధార సంవత్సరపు ధరల స్థాయి. ప్రస్తుత సంవత్సరంలో ఇంతకు ముందు ఎంచుకున్న వస్తువులనే ఎన్నుకొని వాటి ధరలను సేకరించి, వాటికి కూడ భారాలను ఇచ్చి భారిత సగటును కనుక్కొంటే ప్రస్తుత సంవత్సరంలోని ధరల స్థాయి తెలుస్తుంది. ఆధార సంవత్సరంలోని ధరల స్థాయితో ప్రస్తుత సంవత్సరంలోని ధరల స్థాయిని పోల్చి చూస్తే ఎంత శాతం పెరిగిందో లేదా తగ్గిందో తెలుసుకోవచ్చు.

ధరల స్థాయి ఎంతశాతం పెరిగిందో ద్రవ్యపు విలువ అంతే శాతం తగ్గిందని భావించవచ్చు. ఇదే విధంగా ప్రస్తుత సంవత్సరంలోని ధరల స్థాయి తగ్గితే ద్రవ్యపు విలువ అంతే శాతం పెరిగిందని అర్థం చేసుకోవచ్చు. ఈ విధంగా ద్రవ్యపు విలువలోని మార్పులను నిర్ణయించడానికి, ఆధార సంవత్సరపు ధరల స్థాయితో ప్రస్తుత సంవత్సరంలోని ధరల స్థాయిని పోల్చి చూడటానికి ఈ సూచీ సంఖ్యలు ఉపకరిస్తాయి.

## 11.6 సూచీ సంఖ్యల గణన

సూచీ సంఖ్యల నిర్మాణంలో గల వివిధ దశలను పైన వివరించడమైంది. ఇప్పుడు సూచీ సంఖ్యల గణన ఏ విధంగా ఉంటుందో చూద్దాం ! ఉదాహరణకు ఒక దేశంలో బియ్యం, పంచదార, గోధుమలు అనే మూడు వస్తువులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయనుకుందాం. ఈ మూడు వస్తువుల ధరలను ఆధార సంవత్సరం (base year) లోనూ, ప్రస్తుత సంవత్సరం (current year) లోనూ లెక్కలోకి తీసుకోవాలి. ఆధార సంవత్సరంలోని

BRAOU

ధరలను ఎప్పుడూ 100కు సమానంగా పరిగణించాలి. ఆధార సంవత్సరపు ధరలతో ప్రస్తుత సంవత్సరపు ధరలను పోల్చి ధర సూచీ (price index) ని లెక్కించాలి. పైన పేర్కొన్న వస్తువుల ధరలు ఆధార, ప్రస్తుత సంవత్సరాలలో కింది విధంగా ఉన్నాయనుకుందాం.

(ధర యూనిట్‌కు రూ.లలో)

| వస్తువు | ఆధార సంవత్సరం (1990) | ప్రస్తుత సంవత్సరం (1994) |
|---|---|---|
| బియ్యం | 5 | 10 |
| పంచదార | 8 | 12 |
| గోధుమలు | 2 | 5 |

పై ఉదాహరణ నుండి సూచీ సంఖ్యలను నిర్మించడానికి ముందుగా సాపేక్ష ధరల (price relatives) ను లెక్కించాలి. దీనికి సూత్రం కింది విధంగా ఉంటుంది.

$$\text{సాపేక్ష ధర} = \frac{\text{ప్రస్తుత సంవత్సరంలో వస్తువు ధర}}{\text{ఆధార సంవత్సరంలో వస్తువు ధర}} \times 100$$

ఇప్పుడు సాపేక్ష ధరలను రెండు పద్ధతులతో లెక్కించవచ్చు. అవి : (1) సామాన్య సగటు పద్ధతి (simple average method), (2) భారిత సగటు పద్ధతి (weighted average method).

### 11.6.1 సామాన్య సగటు పద్ధతి

| వస్తువు | సాపేక్ష ధర (1990) | సాపేక్ష ధర (1994) |
|---|---|---|
| బియ్యం | 5/5 × 100 = 100 | 10/5 × 100 = 200 |
| పంచదార | 8/8 × 100 = 100 | 12/8 × 100 = 150 |
| గోధుమలు | 2/2 × 100 = 100 | 5/2 × 100 = 250 |
| మొత్తం | 300 | 600 |
| ∴ సామాన్య సగటు సాపేక్ష ధర | (300 ÷3) = 100 | (600 ÷3) = 200 |

పై ఉదాహరణలో ఆధార సంవత్సరమైన 1990లో సగటు సాపేక్ష ధర (average price relative) 100 కాగా, ప్రస్తుత సంవత్సరమైన 1994లో సగటు సాపేక్ష ధర 200 గా ఉన్నది. దీని అర్థమేమంటే 1990 సంవత్సరంతో పోలిస్తే 1994లో ధరల స్థాయి రెండింతలైంది (ఆధార సంవత్సరపు ధరను 100 కు సమానంగా భావించి, ప్రస్తుత సంవత్సరపు ధరను దాని శాతంగా సూచించడం చాలా సులభం). అంటే ద్రవ్యం విలువ సగానికి పడిపోయిందన్నమాట. దీనిని బట్టి మనం అర్థంచేసుకునేదేమంటే ధరల స్థాయి పెరిగితే ద్రవ్యం విలువ పడిపోతుంది. అలాగే ధరల స్థాయి తగ్గితే ద్రవ్యం విలువ పెరుగుతుంది. ఈ విధంగా సూచీ సంఖ్యలు ఒక కాలంలో ధరల పెరుగుదల, తరుగుదలలను సూచిస్తాయి. ధరల సూచీ సంఖ్యలు కొన్ని సంవత్సరాల ధరలలోని కదలికలను, పర్యవసానంగా ద్రవ్య విలువతో ఏర్పడిన మార్పులను ప్రతిబింబిస్తాయి. సూచీ సంఖ్యల నిర్మాణం ద్వారా ధరల స్థాయిలోని మార్పులను కొలవడానికి ఈ పద్ధతి చాలా సులభమైనది. అయితే ఈ పద్ధతిలో సూచీ



BRAOU

సంఖ్యలను నిర్మిస్తే యదార్థత లోపించడమేకాక ఏ ఉద్దేశంతో సూచీ సంఖ్యలను నిర్మిస్తున్నామో ఆ ఉద్దేశం నెరవేరకపోవచ్చు.

**11.6.2 భారిత సగటు పద్ధతి**

పై ఉదాహరణలో సూచించిన మూడు వస్తువులకు సమాన ప్రాధాన్యతనిచ్చి సామాన్య అంకగణిత సగటును లెక్కించి సాపేక్ష ధరలను కనుక్కొన్నాం. కాని ఇది సరి అయిన పద్ధతి కాదు. ఎందుకంటే కుటుంబం వివిధ వస్తువులపై చేసే వ్యయం వాటి వాటి ప్రాధాన్యతలను బట్టి ఉంటుంది. ఉదాహరణకు, దక్షిణ భారత దేశంలో ఒక కార్మికుని కుటుంబం బియ్యానికిచ్చే ప్రాధాన్యత పంచదారకు, పంచదారకు ఇచ్చే ప్రాధాన్యత గోధుమలకు ఇవ్వదు. ఒక ప్రత్యేక ప్రయోజనం ఆశించి సూచీ సంఖ్యలను నిర్మిస్తున్నప్పుడు (అంటే కార్మికుల జీవన వ్యయ సూచీ నిర్మాణంలో) బియ్యానికి అధిక ప్రాధాన్యత, తరువాత పంచదారకు, ఆ తరువాత తక్కువ ప్రాధాన్యతను గోధుమలకు ఇచ్చి ధరల సూచీని లెక్కించాలి. అంటే వస్తు వినియోగ ప్రాముఖ్యతను బట్టి భారాలు (weights) ఇవ్వాలి. సాపేక్ష ధరలను కింద చూపిన రీతిలో తగిన భారాలతో గుణించడం ద్వారా భారిత సూచీ సంఖ్యలను లెక్కించవచ్చు. వినియోగదారుని మొత్తం వ్యయంలో ఏయే వస్తువులపై ఎంతెంతశాతం ఖర్చుపెడతామో అను దాని ఆధారంగా వాటి భారాలు నిర్ణయించబడతాయి. ఉదా : బియ్యంపై 50%, పంచదారపై 30%, గోధుమలపై 20% ఖర్చుపెడతున్నట్లయితే బియ్యానికి 5, పంచదారకు 3, గోధుమలకు 2 భారాలు ఇవ్వాల్సి ఉంటుంది.

పై ఉదాహరణలో బియ్యానికి 5, పంచదారకు 3, గోధుమలకు 2 భారాలు ఇచ్చినట్లయితే, భారిత సూచీ సంఖ్య అనగా భారిత సగటు సాపేక్ష ధర (weighted average price relative) కింది విధంగా ఉంటుంది.

| వస్తువు | ఆధార సంవత్సరం (1990)<br>(సాపేక్ష ధర × భారం) | ప్రస్తుత సంవత్సరం(1994)<br>(సాపేక్ష ధర × భారం) |
|---|---|---|
| బియ్యం | 100 × 5 = 500 | 200 × 5 = 1,000 |
| పంచదార | 100 × 3 = 300 | 150 × 3 = 450 |
| గోధుమలు | 100 × 2 = 200 | 250 × 2 = 500 |
| మొత్తం | 1,000 | 1,950 |
| మొత్తం భారాలు | 10 | 10 |
| ∴భారిత సగటు సాపేక్ష ధర | (1,000 ÷10)=100 | (1,950 ÷10) = 195 |

BRAOU

భారిత సగటు ద్వారా సాపేక్ష ధరను లెక్కించినప్పుడు 1990 సంవత్సరంతో పోలిస్తే 1994 సంవత్సరంలో వస్తువుల ధరలు 95% మాత్రమే పెరిగినాయి. అదే సామాన్య అంకగణిత సగటు పద్ధతిలో వస్తువుల ధరలు 100% పెరిగినట్లుగా గమనించాం. కాబట్టి సరిఅయిన ఫలితాలు రావడానికి వివిధ వస్తువులకు వాటి వినియోగ ప్రాధాన్యతలను బట్టి సముచితమైన భారాలు ఇవ్వవలసి ఉంటుంది.

భారిత సూచీ సంఖ్యలలో అనేక పద్ధతులున్నాయి. అవి లాస్పియర్ పద్ధతి, ప్యాషే పద్ధతి, డార్బిష్ మరియు బౌలె పద్ధతి, ఫిషర్ పద్ధతి, మార్షల్ మరియు ఎడ్జ్‌వర్త్ పద్ధతి మొదలైనవి. అయితే వీటిలో ఫిషర్ పద్ధతిని ఆదర్శ పద్ధతిగా పరిగణించవచ్చు. ఎందుకంటే ఈ పద్ధతి కాల పరివర్తన (time reversal), కారక పరివర్తన (factor reversal)పరీక్షలను సంతృప్తి పరుస్తుంది. అందుకే ఫిషర్ పద్ధతి ద్వారా నిర్మించిన భారిత సూచీ సంఖ్యలను ఫిషర్ ఆదర్శ సూచీ సంఖ్యలు (Fisher's ideal index numbers) గా వ్యవహరిస్తారు. ఇప్పుడు ఫిషర్ పద్ధతిలో భారిత

సూచీ సంఖ్యలను ఏ విధంగా నిర్మిస్తారో దిగువ ఉదాహరణ ద్వారా అర్థం చేసుకోవచ్చు.

| వస్తువు | ఆధార సంవత్సరపు ధర ($P_0$) (రూ.లలో) | ప్రస్తుత సంవత్సరపు ధర ($P_1$) (రూ.లలో) | ఆధార సంవత్సరపు పరిమాణం ($Q_0$) (యూనిట్లలో) | ప్రస్తుత సంవత్సరపు పరిమాణం ($Q_1$) (యూనిట్లలో) |
|---|---|---|---|---|
| A | 6 | 10 | 40 | 50 |
| B | 2 | 2 | 50 | 70 |
| C | 4 | 8 | 30 | 60 |
| D | 10 | 12 | 60 | 20 |
| E | 8 | 10 | 40 | 30 |

ఫిషర్ పద్ధతిలో ప్రస్తుత సంవత్సరపు సూచీ సంఖ్యను (ధరల స్థాయిని) తెలుసుకోవడానికి కింది సూత్రాన్ని అన్వయించాలి.

$$P_{01} = \sqrt{\frac{\Sigma P_1 Q_0}{\Sigma P_0 Q_0} x \frac{\Sigma P_1 Q_1}{\Sigma P_0 Q_1}} x100$$

పై సూత్రంలో,

$P_{01}$ = ప్రస్తుత సంవత్సరపు ధరల సూచీ

$\Sigma P_1 Q_0$ = ప్రస్తుత సంవత్సరపు ధర, ఆధార సంవత్సరపు పరిమాణ లబ్ధాల మొత్తం

$\Sigma P_0 Q_0$ = ఆధార సంవత్సరపు ధర, ఆధార సంవత్సరపు పరిమాణ లబ్ధాల మొత్తం

$\Sigma P_1 Q_1$ = ప్రస్తుత సంవత్సరపు ధర, ప్రస్తుత సంవత్సరపు పరిమాణ లబ్ధాల మొత్తం

$\Sigma P_0 Q_1$ = ఆధార సంవత్సరపు ధర, ప్రస్తుత సంవత్సరపు పరిమాణ లబ్ధాల మొత్తం

**గమనిక :** ఆధార సంవత్సరాన్ని 1990 గాను, ప్రస్తుత సంవత్సరాన్ని 1994గా ఊహించి సూచీ సంఖ్యను కింద లెక్కించడమైంది.

| వస్తువు | $P_0$ | $Q_0$ | $P_1$ | $Q_1$ | $P_1 Q_0$ | $P_0 Q_0$ | $P_1 Q_1$ | $P_0 Q_1$ |
|---|---|---|---|---|---|---|---|---|
| A | 6 | 40 | 10 | 50 | 400 | 240 | 500 | 300 |
| B | 2 | 50 | 2 | 70 | 100 | 100 | 140 | 140 |
| C | 4 | 30 | 8 | 60 | 240 | 120 | 480 | 240 |
| D | 10 | 60 | 12 | 20 | 720 | 600 | 240 | 200 |
| E | 8 | 40 | 10 | 30 | 400 | 320 | 300 | 240 |
| | | | | | 1,860 | 1,380 | 1,660 | 1,120 |

$$P_{01} = \sqrt{\frac{\Sigma P_1 Q_0}{\Sigma P_0 Q_0} \cdot \frac{\Sigma P_1 Q_1}{\Sigma P_0 Q_1}} x100$$

$\Sigma P_1 Q_0$ = **1,860**

$\Sigma P_0 Q_0$ = **1,380**

BRAOU

$\Sigma P_1 Q_1 = 1,660$

$\Sigma P_0 Q_1 = 1,120$

$$\therefore P_{01} = \sqrt{\frac{1,860}{1,380} \times \frac{1,660}{1,120}} \times 100$$

$$= \sqrt{1.348 \times 1.482} \times 100$$

$$= 1.414 \times 100 = 141.4$$

∴ భారిత సూచీ సంఖ్య = 141.4

దాని అర్థమేమంటే 1990లో వున్న ధరలతో 1994లో ఉన్న ధరలను పోల్చితే 1994లో ధరలు 41.4% పెరిగినాయి.

జీవన వ్యయ సూచీ సంఖ్యలను కూడ వినియోగ వస్తువులకు వాటి ప్రాధాన్యాన్ని బట్టి భారాలు ఇచ్చి లెక్కించవచ్చని పైన పేర్కొన్నాం. ఇప్పుడు, ఒక మధ్య తరగతి కుటుంబం వివిధ వస్తుసేవలపై తన ఆదాయంలో ఎంతెంత శాతం వెచ్చిస్తున్నదో కింది ఉదాహరణలో చూపడమైంది. ఈ శాతాలను ఇక్కడ భారాలుగా భావించాలి.

| ఖర్చు అంశం | ప్రస్తుతపు సంవత్సరపు గ్రూపు సూచీ (I) | వివిధ అంశాలపై వెచ్చించే మొత్తం (శాతాల్లో) |
|---|---|---|
| ఆహారం | 410 | 45 |
| అద్దె | 150 | 15 |
| వస్త్రాలు | 343 | 12 |
| ఇంధనం | 248 | 8 |
| ఇతరాలు | 285 | 20 |

ఆ కుటుంబం ఆధార సంవత్సరంలో రూ.240 , ప్రస్తుత సంవత్సరంలో రూ. 430 ఆదాయాన్ని పొందుతున్నదని భావిస్తే ఆధార సంవత్సరంలోని జీవన ప్రమాణాన్ని కొనసాగించడానికి ఎంత ఎక్కువ మొత్తం భత్యం (allowance) పొందాలో కింద వివరించడమైంది.

పై లెక్కలో ప్రస్తుత సంవత్సరపు గ్రూపు సూచీ (group index) ని లెక్కించి ఇవ్వడం జరిగింది. దాన్ని లెక్కించడానికి సూత్రమేమనగా $P_1/P_0 \times 100$ . అంటే ప్రస్తుత సంవత్సర ధరకు, ఆధార సంవత్సర ధరకు మధ్యగల నిష్పత్తి అన్నమాట.

ఇప్పుడు జీవన వ్యయ సూచీని లెక్కించడం ఏవిధంగా ఉంటుందో చూద్దాం !

| ఖర్చు అంశం | భారాలు (W) | సూచీ (I) | భారాలు × సూచీ (IW) |
|---|---|---|---|
| ఆహారము | 45 | 410 | 18,450 |
| అద్దె | 15 | 150 | 2,250 |
| వస్త్రాలు | 12 | 343 | 4,116 |
| ఇంధనం | 8 | 248 | 1,984 |
| ఇతరాలు | 20 | 285 | 5,700 |
| | 100 | | 32,500 |

$$\text{జీవన వ్యయ సూచీ} = \frac{\Sigma IW}{\Sigma W}$$

పై సూత్రంలో, ε I W= సూచీ భారాల లబ్దాల మొత్తం

ε W = భారాల మొత్తం.

$$\therefore \text{జీవన వ్యయ సూచీ} = \frac{32,500}{100} = 325$$

ఆధార సంవత్సరంలో జీవన వ్యయ సూచీ 100గా ఉన్నప్పుడు ఆదాయం రూ. 240. మరి ఇప్పుడు జీవన వ్యయ సూచీ 325గా ఉన్నది అంటే ప్రస్తుత సంవత్సరంలో ఉండాల్సిన ఆదాయం రూ. 780. కాబట్టి ఆధార సంవత్సరపు జీవన ప్రమాణాన్ని కొనసాగించడానికి ఆ కుటుంబానికి అదనంగా రూ. 350 (780 - 430) లు అవసరం.

## 11.7 సూచీ సంఖ్యల గణనలో ఇబ్బందులు

సూచీ సంఖ్యలను నిర్మించడం అంత తేలికైన పనికాదు. వాటి నిర్మాణంలో అనేక చిక్కులు ఉత్పన్నమవుతాయి. ఆ చిక్కులను సవ్యంగా పరిష్కరించకపోతే సూచీ సంఖ్యలు ఆశించిన ఫలితాలనివ్వవు. సూచీ సంఖ్యల గణనలో ఎదురయ్యే సమస్యలను కింద చర్చించడమైంది.

i) **ఆధార సంవత్సరపు ఎంపిక :** సూచీ సంఖ్యలను నిర్మించేటప్పుడు ఆధార సంవత్సరం ఎంపికలో చాలా జాగ్రత్త వహించాలి. ఆధార సంవత్సరంలోని ధరల స్థాయిని ప్రామాణికంగా ఉపయోగిస్తారు. కాబట్టి ఎన్నుకొనే ఆధార సంవత్సరం సాధారణ సంవత్సరంగా ఉండాలి. ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని కల్గించే సంఘటనలు లేని సంవత్సరాన్ని మాత్రమే ఆధార సంవత్సరంగా ఎన్నుకోవాలి. అంటే సమ్మెలు, లాకౌట్లు, అతివృష్టి , అనావృష్టి ,యుద్ధాలు మొదలైన సంఘటనలు లేని సంవత్సరంగా ఆధార సంవత్సరం ఉండాలి. ఎందుకంటే ఈ సంఘటనలు ధరలపై విపరీత ప్రభావాన్ని చూపుతాయి. అయితే ధరల మీద ఒత్తిడిని కల్గించే సంఘటనలు లేని సంవత్సరాలు చాలా అరుదుగా ఉంటాయి. అందువల్ల అట్లాంటి ఆధార సంవత్సరం లభ్యం కావడం చాలా కష్టం.

BRAOU

ii) **వస్తువుల ఎంపిక :** సూచీ సంఖ్యల నిర్మాణానికి వస్తువులను జాగ్రత్తగా ఎంచుకోవాలి. వస్తువుల ధరలు వాటి డిమాండు, సప్లయిలపై ఆధారపడి ఉంటాయి. కొన్ని వస్తువులకు మాత్రమే డిమాండు, సప్లయిలు నిలకడగా ఉంటాయి. అట్లాంటి వస్తువులను మాత్రమే సూచీ సంఖ్యల నిర్మాణానికి ఎంచుకోవాలి. అంతేగాకుండా, ఉత్పత్తి పద్ధతులలో వచ్చే మార్పులకు కూడ ధరలు ప్రభావితం చెందుతుంటాయి. అట్లాంటి పరిశ్రమలలో తయారయ్యే వస్తువులను కూడా ఎంచుకోకూడదు. డిమాండు, సప్లయిలు నిలకడగా ఉండే వస్తువులు, ఉత్పత్తి పద్ధతులు స్థిరంగా ఉండే పరిశ్రమలు ఉండటం చాలా అరుదు. ఈ కారణాల వలన వస్తువుల ఎంపిక సమస్యగా మారుతుంది.

iii) **సూచీ సంఖ్యల ధ్యేయం :** సూచీ సంఖ్యలను ఏ ధ్యేయంతో నిర్మిస్తున్నామో, ఆ ధ్యేయాన్ని సంపూర్తిగా నిర్వచించి చెప్పడం కూడ కష్టమే.

iv) సూచీ సంఖ్యలను నిర్మించాలంటే చాలా వస్తువులను ఎన్నుకోవాలి. అయితే ఎక్కువ వస్తువులను ఎన్నుకోవడం కూడ ఒక సమస్యగా ఉంటుంది.

v) సూచీ సంఖ్యల నిర్మాణానికి వస్తువుల ధరల సేకరణ అత్యంత ఆవశ్యకం. అయితే ఈ ధరల సేకరణ అంత సులభమైన పని కాదు. టోకు ధరలను సేకరించాలా లేదా చిల్లర ధరలను సేకరించాలా అన్నది సమస్య. సూచీ సంఖ్యల నిర్మాణానికి చిల్లర ధరలను తీసుకుంటే మంచిది. కాని, ఈ ధరలు అంత నమ్మదగినవి కావు. ఎందుకంటే వీటిలో తేడాలు అధికంగా ఉంటాయి. టోకు ధరల విషయంలో కూడ అవి సంవత్సరంలో ఒకే మాదిరిగా ఉండక నెల నెలకూ మారుతూ ఉంటాయి. అంతేగాక వివిధ ప్రదేశాలలో టోకు ధరలు వేర్వేరుగా ఉంటాయి. అనేక ప్రదేశాలలో టోకు ధరలను సేకరించి, సగటును నిర్ణయించాలి. ఇది కష్టంతో కూడిన పని.

vi) వస్తువుల నాణ్యతలో మార్పులు, పర్యవసానంగా వచ్చిన ఉత్తమ సేవలను పరిగణించడంలో వినియోగదారు ధరల సూచీ విఫలమైంది.

vii) సూచీ సంఖ్యల నిర్మాణంలో మరో సమస్య ఏమంటే సగటు ఎన్నిక. అంకగణిత సగటు, గుణ మధ్యమం, మధ్యగతం అనే సగటులను సూచీ సంఖ్యల నిర్మాణంలో సాధారణంగా వాడతారు. అయితే వీటిలో దేనిని ఎన్నుకుంటే ఆశించిన ఫలితం వస్తుందో చెప్పడం కష్టం.

viii) ఆధార సంవత్సరాన్ని మార్చితే మనకు భిన్నమైన ఫలితం వస్తుంది. సూచీ సంఖ్యల గణనలో ఇది మరొక సమస్య.

ix) సూచీ సంఖ్యల నిర్మాణానికి ఎన్నిక చేసిన వస్తువులలో కొన్ని తరువాత సంవత్సరాలలో వినియోగం నుంచి కనుమరుగు అవ్వవచ్చు. అలాంటప్పుడు ప్రమాణంగా ఏర్పరచుకున్న ఆధార సంవత్సరంలోని ధరల స్థాయి నిరుపయోగమవుతుంది.

x) వస్తువుల వినియోగ ప్రాముఖ్యాన్ని బట్టి వాటికి భారాలు నిర్ణయించాలి. కొన్ని వస్తువుల విషయంలో భారాలు నిర్ణయించడం కష్టం. ఉదా: పంచదార కంటే బియ్యం ముఖ్యమైన వస్తువే. అయితే పంచదార ఎంత ముఖ్యమైనదో చెప్పడం కష్టం. కాబట్టి వస్తువుల ప్రాధాన్యాన్ని నిర్ణయించి భారాలు ఇవ్వడం సూచీ సంఖ్యల నిర్మాణంలో మరో సమస్య.

xi) సూచీ సంఖ్యల నిర్మాణంలో ఉపయోగించే సూత్రం మనకు లభించే దత్తాంశంపై ఆధారపడి ఉంటుంది. ఏ ఒక్క సూత్రాన్ని ప్రామాణికంగా తీసుకోలేం.

B R A O U

xii) ఒక దేశ సూచీ సంఖ్యను మరొక దేశ సూచీ సంఖ్యతో పోల్చడం అసాధ్యం. కారణం సూచీ సంఖ్యల గణనలో వివిధ దేశాలు వివిధ పద్ధతులను ఆచరిస్తూ వున్నాయి.

పైన పేర్కొన్న సమస్యల వలన సూచీ సంఖ్యల నిర్మాణం కష్టంగానే ఉంటుంది. అయితే ఆధార సంవత్సరాన్ని జాగ్రత్తగా ఎన్నుకొని, వస్తువుల సగటు ఎంపికలలో శ్రద్ధ వహించి, వస్తువులకు వాటి వినియోగ ప్రాముఖ్యాన్ని బట్టి భారాలు ఇచ్చి సూచీ సంఖ్యలను నిర్మిస్తే మనం ఆశించిన ఫలితాలను పొందవచ్చు.

## 11.8 సూచీ సంఖ్యల ప్రయోజనం

సూచీ సంఖ్యలు సాధారణ ధరల స్థాయిని కొలవడానికి, తద్వారా ద్రవ్య కొనుగోలు శక్తిని తెలుసుకోవడానికి ఉద్దేశించబడినవి. అయినప్పటికీ, ప్రస్తుతం అర్థ శాస్త్రంలోనూ, వ్యాపారంలోనూ, నిర్వహణలోనూ ఉత్పత్తి, వినియోగం, లాభాలు, ఆర్థిక, వ్యక్తిగత మొదలైన పరిమాణాత్మక దత్తాంశాన్ని రెండు కాలాల మధ్య లేదా ప్రదేశాల మధ్య సరిపోల్చి చూడడానికి వీటి ఉపయోగం విస్తృతంగా ఉన్నది. భౌతిక, సాంఘిక శాస్త్రాలలో ఈ సూచీ సంఖ్యలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అసలు సూచీ సంఖ్యలను నిర్మించకుండా పరిమాణాత్మక దత్తాంశాన్ని కొలవలేం. సూచీ సంఖ్యల ఉపయోగాలను కింద చర్చించడమైంది.

i) ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయం, ఉత్పత్తి వంటి ఆర్థిక దృగ్విషయాలను సూచీ సంఖ్యలు అధ్యయనం చేస్తాయి.

ii) ధరలు, ఉత్పత్తి, లాభాలు, దిగుమతులు, ఎగుమతులు, ఆర్థిక సంబంధమైన దత్తాంశ సూచీ సంఖ్యలు వ్యవస్థ ప్రణాళికీకరణలో, నిర్ణయాలను తీసుకోవడంలో మిక్కిలి ఉపయోగకరంగా ఉంటాయి. ఉదా: జీవన వ్యయ సూచీ సంఖ్యలను కరువు భత్యాన్ని నిర్ణయించడానికి, కార్మికులకు బోనస్‌ను మంజూరు చేయడానికి ప్రభుత్వ, పారిశ్రామిక, వ్యాపార సంస్థలు విరివిగా ఉపయోగిస్తాయి.

iii) ద్రవ్యం విలువలో మార్పులను, తద్వారా ద్రవ్య కొనుగోలు శక్తిని కొలవడానికి సూచీసంఖ్యలు ఉపయోగపడతాయి. వీటి సహాయంతో ద్రవ్య కొనుగోలు శక్తిలో స్థిరత్వాన్ని సాధించి తద్వారా దేశ ఆర్థిక నిర్మాణాన్ని పటిష్టం చేయడానికి అనేక దేశాలు చర్యలు తీసుకుంటున్నాయి.

iv) సూచీ సంఖ్యలు ఒక కాలంలో ఆర్థిక ప్రణాళిక ద్వారా సాధించిన అభివృద్ధిని చూపడానికి బాగా ఉపయోగపడతాయి.

v) జీవన వ్యయ సూచీ సంఖ్యల సహాయంతో కార్మికుల వాస్తవిక వేతనాల స్థాయిలోని మార్పులను అధ్యయనం చేయవచ్చు.

vi) సూచీ సంఖ్యలు రెండు దేశాల కరెన్సీల కొనుగోలు శక్తిని పోల్చి చూడటానికి ఉపయోగపడతాయి.

vii) సూచీ సంఖ్యలు వివిధ కాలాల్లో ప్రత్యక్షంగా కొలవడానికి వీలులేని అంశాల ప్రభావాన్ని అధ్యయనం చేస్తాయి.

viii) సూచీ సంఖ్యలు దేశానికి ఆర్థిక కొలమానాలుగా ఉపయోగపడతాయి.

ix) విదేశీ మారక ద్రవ్య రేట్లను నిర్ణయించడానికి సూచీ సంఖ్యలు ఉపయోగంగా ఉంటాయి.

x) జాతీయ, అంతర్జాతీయ వర్తకాల అభివృద్ధికి సూచీ సంఖ్యలు దోహదపడతాయి.

BRAOU

పైన తెల్పినట్లు సూచీ సంఖ్యలు అనేక రంగాలలో విరివిగా వాడబడుతూ బహుళ ప్రయోజకారిగా ఉన్నాయి.

## 11.9 సారాంశం

వివిధ కాలాల్లో వస్తువుల ధరలతో వచ్చే మార్పులను కొలవడం ద్వారా ఆర్థిక రంగంలోని ద్రవ్య కొనుగోలు
శక్తిని తెలుసుకునే సాధనాలే సూచీ సంఖ్యలు. సూచీ సంఖ్యలు ప్రత్యేక రకమైన సగటులు. ఇవి ప్రత్యక్షంగా
కొలవడానికి వీలులేని అంశాల ప్రభావాన్ని అధ్యయనం చేస్తాయి. కాలానికి, స్థలానికి సంబంధించిన మార్పులను
ఇవి కొలుస్తాయి. సూచీ సంఖ్యల నిర్మాణంలో ఆధార సంవత్సరపు ఎంపిక, వస్తువుల ఎంపిక, వస్తువుల సంఖ్యను
నిర్ణయించుట, ధరలను సేకరించుట, సూచీ సంఖ్యల ఎంపిక, భారాల ఎంపిక, సగటు ఎంపిక మొదలైన అనేక
దశలున్నాయి. సూచీ సంఖ్యలను గణన చేసేటప్పుడు వివిధ వస్తువులకు వినియోగంలో వాటికున్న ప్రాధాన్యతను
బట్టి భారాలు ఇవ్వాలి. అప్పుడే సూచీ సంఖ్యలు ఆశించిన ప్రయోజనాన్ని చేకూర్చుతాయి. సూచీ సంఖ్యల
గణనలో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా, ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి కల్గించే సంఘటనలు
లేని సంవత్సరాన్ని ఆధార సంవత్సరంగా ఎన్నుకోవాలి. ఇలాంటి సంవత్సరం ఉండటం అరుదు. వస్తువుల ఎంపిక
కూడా సమస్యే. డిమాండు, సప్లయి నిలకడగా ఉన్న వస్తువులను మాత్రమే సూచీ సంఖ్యల నిర్మాణానికి
ఎంచుకోవాలి. వస్తువుల ధరల సేకరణ కూడా అంత సులభమైన పనికాదు. వస్తువుల వినియోగ ప్రాముఖ్యాన్ని
నిర్ణయించడం, తరువాత వాటికి భారాలు నిర్ణయించడం కూడా కష్టమే. అయితే, ఆధార సంవత్సరపు ఎంపిక,
వస్తువుల ఎంపిక, సగటు ఎంపిక, వస్తువుల వినియోగ ప్రాముఖ్యాన్ని బట్టి భారాలు ఇవ్వడం విషయంలో జాగ్రత్త
వహించి సూచీ సంఖ్యలను నిర్మిస్తే ఆశించిన ఫలితాలు వస్తాయి. సూచీ సంఖ్యలలో టోకు ధరల సూచీ సంఖ్యలు,
చిల్లర ధరల సూచీ సంఖ్యలు, జీవన వ్యయ సూచీ సంఖ్యలు, వేతనాల సూచీ సంఖ్యలు, పరిమాణ సూచీ
సంఖ్యలు, విలువ సూచీ సంఖ్యలు మొదలైన రకాలున్నాయి. ఈ సూచీ సంఖ్యల ప్రయోజనం ప్రస్తుతం
అన్ని రంగాలలో విస్తృతంగా ఉన్నది. ఆర్థిక వ్యవస్థలో వివిధ కాలాల్లో ధరల స్థాయిని పోల్చి, ద్రవ్య కొనుగోలు
శక్తిని కొలవడంలో వీటి ప్రయోజనం ఎంతగానో ఉన్నది. వివిధ ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు జీవన వ్యయ
సూచీల ఆధారంగా కార్మికుల, ఉద్యోగుల కరువు భత్యం (dearness allowance), బోనస్ (bonus) మొదలైనవి
నిర్ణయిస్తాయి.

BRAOU

## 11.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి సుమారు 40 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. సూచీ సంఖ్యలను నిర్వచించి, వాటి లక్షణాలను, ఉద్దేశాలను విశదీకరించండి.
2. సూచీ సంఖ్యలు అనగానేమి ? సూచీ సంఖ్యల నిర్మాణంలో గల వివిధ దశలను పేర్కొనండి.
3. సూచీ సంఖ్యల నిర్మాణం ఎలా జరుగుతుంది ? వాటి గణనలో ఎదురయ్యే ఇబ్బందులేవి ?
4. వివిధ రకాల సూచీ సంఖ్యలను తెల్పుతూ, వాటి ప్రయోజనాలను చర్చించండి.

**II. ఈ కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి సుమారు 20 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. ద్రవ్యం విలువ అంటే ఏమిటి ?
2. సాధారణ ధరల స్థాయి అంటే ఏమిటి ?

3. సూచీ సంఖ్యల నిర్మాణంలో భారాలకున్న ప్రాముఖ్యత ఎట్టిది ?
4. సూచీ సంఖ్యల లక్షణాలను పేర్కొనండి.
5. సూచీ సంఖ్యలలో గల రకాలేవి ?

## 11.11 సంప్రదింపు గ్రంథాలు


1. తెలుగు అకాడమి : కరెన్సీ - బ్యాంకింగ్
2. తెలుగు అకాడమి : అర్థ శాస్త్రం
3. Jhingan, M.L. : Money, Banking and International Trade
4. P.S. Rao, M.M. Rao and V.S.P. Rao : Currency and Banking
5. Vaish, M.C. : Money, Banking and International Trade
6. Vaish, M.C. : Monetary Theory.


## 11.12 భావనలు

1. ద్రవ్యం విలువ : వస్తు సేవలను కొనడానికి ద్రవ్యాన్నికున్న కొనుగోలు శక్తినే ద్రవ్యం విలువగా చెప్పడం జరుగుతుంది.
2. సూచీ సంఖ్యలు : ధరలలో వచ్చే మార్పులను, తద్వారా ద్రవ్యపు కొనుగోలు శక్తిని తెలియజేసే గణాంక సాధనమే సూచీ సంఖ్యలు.
3. ఆధార సంవత్సరం : తరువాతి సంవత్సరాలలో వచ్చే ధరలలోని మార్పులను శాతంగా చెప్పడానికి ఆధారంగా ఉపయోగించే ప్రాతినిధ్య సంవత్సరాన్నే ఆధార సంవత్సరం అని అంటారు.
4. ప్రస్తుత సంవత్సరం : ఏ సంవత్సరానికైతే సూచీ సంఖ్యలను నిర్మిస్తామో ఆ సంవత్సరాన్ని ప్రస్తుత సంవత్సరం అని అంటారు.
5. భారాలు : వినిమయ ప్రాముఖ్యత దృష్ట్యా వివిధ వస్తువులకు ప్రాధాన్యతలను నిర్ణయించడం.
6. ధర : వినిమయంలో వస్తువు విలువకు ద్రవ్యానికి ఉండే నిష్పత్తి.
7. ధరల స్థాయి : అనేక వస్తువుల సగటు ధర.
8. సాపేక్ష ధర : ప్రస్తుత సంవత్సరపు వస్తువు ధరకు, ఆధార సంవత్సరపు వస్తువు ధరకు మధ్య గల నిష్పత్తి.

## 11.13 పదకోశం

| | | |
|---|---|---|
| సూచీ సంఖ్యలు | : | Index numbers |
| ధర | : | Price |
| ధరల స్థాయి | : | Price level |
| సాపేక్ష ధర | : | Relative price |

BRAOU

| | | |
|---|---|---|
| ప్రయోజనం | : | Utility |
| వస్తువులు | : | Goods |
| ఉత్పత్తి | : | Production |
| కొనుగోలు శక్తి | : | Purchasing power |
| జీవన వ్యయం | : | Cost of living |
| కరువు భత్యం | : | Dearness allowance |
| వినియోగదారుని ధర సూచీ | : | Consumer price index |
| టోకు ధరలు | : | Whole sale prices |
| చిల్లర ధరలు | : | Retail prices |
| సామాన్య సూచీలు | : | Simple indices |
| భారిత సూచీలు | : | Weighted indices |
| ఆధార సంవత్సరం | : | Base year |
| ప్రస్తుత సంవత్సరం | : | Current year |
| ప్రాతినిధ్య సంవత్సరం | : | Representative year |
| గణన | : | Measurement |
| సాపేక్ష మార్పులు | : | Relative changes |
| పరిమాణ సూచీ | : | Quantity index |
| సాపేక్ష ధర | : | Price relative |
| సామాన్యసగటు | : | Simple average |
| భారిత సగటు | : | Weighted average |
| కాల పరివర్తన | : | Time reversal |
| కారక పరివర్తన | : | Factor reversal |
| ఆదర్శ సూచీ | : | Ideal index |

- డా॥ ఎం. ప్రభాకర్ రెడ్డి

BRAOU

# భాగం -12 : కేన్స్ పరమైన వాదం, ద్రవ్య వాదం
## (పంథాలు, సమస్యలు, ఇమిడి ఉన్న విధానాలు)

విషయక్రమం


12.0 ఉద్దేశం

12.1 పరిచయం

12.2 ద్రవ్యవాదం నిర్వచనం, పుట్టు పూర్వోత్తరాలు

12.3 ద్రవ్య వాదం తెలిపే అంశాలు

12.3.1 నూతన ద్రవ్య వాదం - సారాంశం

12.4 ద్రవ్య, కేన్సియన్ వాదాలను సమర్థించే వారు

12.5 కేన్సియన్ల, ద్రవ్యవాదుల ప్రధాన చర్చనీయాంశాలు, దృక్పథాలు, భేదాలు

12.5.1 పరిశోధనా పద్ధతులు

12.5.2 సమష్టి వ్యయ సిద్ధాంతాలు

12.5.3 వినియోగ, ద్రవ్య డిమాండ్ ఫలాల స్థిరత్వాలు

12.5.4 ద్రవ్య డిమాండ్ స్థిరమా ? అస్థిరమా ?

12.5.5 ద్రవ్య ప్రసార యంత్రాంగం

12.5.6 ద్రవ్య సప్లయ్ బాహ్య చలాంకమా ? అంతర్గత చలాంకమా ?

12.5.7 వాస్తవ, నామ మాత్ర నిలువల డిమాండ్

12.5.8 ద్రవ్యం ప్రభావం యొక్క తీక్షణత, కాల విలంబన

12.5.9 ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం

12.5.10 ద్రవ్య విధాన సాధనాల ఎంపిక

12.5.11 ద్రవ్యోల్బణం - నిరుద్యోగిత : వైరుధ్యం

12.5.12 విధాన సలహాలలో భేదం - ప్రభుత్వ వ్యయం, నెట్టి వేత ప్రభావం

12.6 సారాంశం

12.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

12.8 సంప్రదింపు గ్రంథాలు

12.9 పారిభాషిక పదకోశం


BRAOU

## 12.0 ఉద్దేశం

కేన్సియన్లు, ద్రవ్యవాదుల మధ్య జరిగిన, జరుగుతున్న వాదోప వాదాలను, వారి దృక్కోణాలను, ప్రధాన చర్చనీయాంశాలను, వారి వాదాలలో ఇమిడి వున్న విధాన సలహాలను పరిచయం చేయడం ఈ పాఠం ముఖ్యోద్దేశం.

## 12.1 పరిచయం

అర్థశాస్త్రం తన దాదాపు $2\frac{1}{2}$ శతాబ్దాల జీవిత కాలంలో సుదీర్ఘంగా విస్తరింపబడి, శాఖోప శాఖలుగా విభజించబడింది. కాల ప్రవాహంలో జరిగిన మార్పులకు అనుగుణంగా సమస్యలను అర్థం చేసుకోవడానికి, పరిష్కరించడానికి అర్థశాస్త్రం ప్రయత్నిస్తుంది. నాలుగు దశాబ్దాల క్రితం, అర్థ శాస్త్రంలో ప్రధానంగా 4 శాఖలు గుర్తించబడినాయి. అవి : సంప్రదాయ అర్థశాస్త్ర శాఖ, నవ్య సంప్రదాయ అర్థశాస్త్ర శాఖ, కేన్సియన్ అర్థశాస్త్రశాఖ, ఉత్తర (లేదా నవ్య) కేన్సియన్ అర్థశాస్త్ర శాఖ. గత 4 శతాబ్దాలలో నవ్య సంప్రదాయ అర్థశాస్త్ర శాఖ విస్తరించబడి, దానిలోని కొన్ని అంశాలను స్వీకరించి ద్రవ్యవాద, ఇంకా నూతన ద్రవ్య వాద శాఖ ఏర్పడింది. ఈ పాఠంలో ద్రవ్య వాదులకు, కేన్సియన్లకు సంబంధించిన కొన్ని ప్రధానాంశాలను పరిశీలించాం.

## 12.2 ద్రవ్యవాదం - నిర్వచనం, పుట్టుపూర్వోత్తరాలు

ఇటీవల ప్రచారంలోకి వచ్చిన నూతన ద్రవ్యవాదాన్ని తెలుసుకోవడానికి ముందు, ద్రవ్యవాదాన్ని, దాని పుట్టుక, పరిణామాన్ని పరిశీలించుదాం. ద్రవ్యవాదం ఏదో ఒక రూపంలో 16వ శతాబ్దం నుంచి గుర్తించబడినప్పటికీ, దాని ప్రాబల్యం ఇంకా ప్రపంచ ఆర్థిక విధానాలలో దానికి గల ఉన్నత స్థానం 1950 ప్రాంతం మంచి మొదలైంది. ఈ వాదాన్ని ఒక ప్రాచీన భావంగా పరిగణించవచ్చు. ద్రవ్యమే సర్వస్వమని భావించే విచారణను ఒక విధంగా ద్రవ్యవాదమనవచ్చు. సంప్రదాయవాదానికి ముందు ప్రచారంలోనున్న వాణిజ్య వాదం, ద్రవ్యాన్ని లేదా బంగారం వెండి రూపాలున్న ధనాన్ని సంపదగా వర్ణించారు. వస్తువుల ఎగుమతుల ద్వారా దానిని సంపాదించడం వల్ల దేశం సంపన్నంగా మారుతుందని భావించారు. ఇట్లాంటి విచారణ ద్రవ్యవాదం యొక్క ప్రాచీన దశగా భావించవచ్చు. మరికొంత వాస్తవికతతో గమనిస్తే, 18వ శతాబ్ది చివరి భాగం నుంచి, ముఖ్యంగా డేవిడ్ హ్యూమ్ (అతని రచన : Of Money, 1753) కాలం నుంచి ద్రవ్యవాదం ప్రారంభమైంది. ముతక రూపంలో ద్రవ్యరాశి సిద్ధాంతానికి రూపకల్పన చేయబడింది. ఇట్లా ద్రవ్యవాదం పుట్టుకను సుప్రసిద్ధ అతి ప్రాచీనమైన ద్రవ్యరాశి సిద్ధాంతంలో గుర్తించవచ్చు. సంప్రదాయ వాదుల ద్రవ్య అర్థశాస్త్రంలో (Classical Monetary Economics) ద్రవ్యరాశి సిద్ధాంతం అంతర్భాగం. 1905 సంవత్సరంలో అమెరికన్ ఆర్థిక వేత్త ఇర్వింగ్ ఫిషర్ ద్రవ్య రాశి సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా సమీకరణ రూపంలో $\left(P = \frac{MV}{T}\right)$ ప్రతిపాదించాడు. ద్రవ్య సప్లయ్ ధరలను విశిష్టంగా ప్రభావితం చేస్తుందని భావించబడింది. కాని 1930 ప్రాంతంలో సంభవించిన భీకర మాంద్యం, 1936లో కేన్స్ ప్రకటించిన "సాధారణ సిద్ధాంతం " ద్రవ్యం పాత్రను ప్రక్కకు నెట్టి ప్రైవేటు పెట్టుబడికి, ప్రభుత్వ వ్యయానికి కీలక పాత్రలనిచ్చాయి. తిరిగి 1950 మధ్య ప్రాంతం నుంచి ద్రవ్యరాశి సిద్ధాంతానికి, దానితో ద్రవ్య విధానానికి ప్రాబల్యం సమకూరింది. క్లుప్తంగా చెప్పాలంటే 1936వ సంవత్సరానికి ముందు ద్రవ్యానికి ఇంకా ద్రవ్యరాశి సిద్ధాంతానికి ప్రాముఖ్య ముండేది (money did matter). ఆర్థిక కార్యకలాపాల, ధరల స్థాయిలను నిర్ణయించడంలో ద్రవ్య సప్లయ్ ముఖ్య కారకమని జె.యస్. మిల్ నుంచి మార్షల్, ఫిషర్

BRAOU

వరకు గుర్తించారు. 1936 నుంచి 1950 ప్రాంతం వరకు ద్రవ్యానికి ప్రాముఖ్యం లేకుండా పోయింది (money does not matter) . దీనికి ప్రధాన కారణం కేన్స్ పరమైన విప్లవం. సమష్టి డిమాండ్ పై ప్రభావం లేకుండా పెరిగిన ద్రవ్యం మొత్తాన్ని ప్రజలు నిలువగా ఉంచుకొంటారని భావించబడింది. ద్రవ్య సప్లయ్‌లోని మార్పులకనుగుణంగా ద్రవ్య చలామణి వేగం సర్దుబాటు చేసుకుంటుందని, ఫలితంగా ధరలు, కార్యకలాపాలు ప్రభావితం కావని కొందరు భావించారు. ఐతే తిరిగి 1950 మధ్య భాగం ప్రాంతం నుంచి ద్రవ్యవాదానికి విశిష్ట ప్రాముఖ్యం చేకూరింది (money does matter) . ఈ వాదానికి ఊపిరిపోసి ప్రాబల్యం సమకూర్చిన ఆర్థికవేత్త మిల్టన్ ఫ్రీడ్‌మన్. ద్రవ్యరాశి సిద్ధాంతాన్ని 1956లో పునః ప్రతిపాదించడం ద్వారా, ద్రవ్యవాదం పుంజుకొన్నది. " ద్రవ్యవాదం " అన్న పదాన్ని 1968లో కార్ల్ బ్రన్నర్ అను ఆర్థిక వేత్త మొదటి సారిగా ఉపయోగించాడు.

## 12.3 ద్రవ్యవాదం తెలిపే అంశాలు

ఇంతవరకు ద్రవ్యవాదం పుట్టుకను, పరిమాణాన్ని సమీక్షించాం. ద్రవ్యవాదం తెలిపే ముఖ్యాంశాలను ప్రస్తుతం తెలుసుకుందాం. ధరల - ఆర్థిక కార్యకలాపాల స్థాయిలను ప్రభావితం చెయ్యడంలో ద్రవ్య సప్లయ్‌కి ప్రభావం కలదనే అభిప్రాయాన్ని ద్రవ్యవాదమనవచ్చు. ద్రవ్య సప్లయ్ వృద్ధి రేటును ముందుగా నిర్ణయించడం (monetary targeting) ద్వారా, ద్రవ్యవిధాన లక్ష్యాలు ఉచిత రీతిలో సాధించబడతాయని ఈవాదం విశ్వసిస్తుంది. ద్రవ్యోల్బణం ఎల్లప్పుడూ అన్ని దేశాలలో ద్రవ్యపరమైన విషయాలని ద్రవ్యవాదుల నాయకుడైన ఫ్రీడ్‌మన్ వాదిస్తాడు.

### 12.3.1 నూతన ద్రవ్యవాదం - సారాంశం

సంక్షిప్తంగా తెలుపాలంటే, ఇటీవలి ద్రవ్యవాద రూపాంతరాన్ని, ముఖ్యంగా ఫ్రీడ్‌మన్ చికాగో విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర శాఖ వారి ద్రవ్యవాదాన్ని " నూతన ద్రవ్యవాదం " గా వ్యాఖ్యానించవచ్చు. నికోలస్ కాల్డార్ 1970లో నూతన ద్రవ్య వాదాన్ని తన వ్యాసంలో సమీక్షించాడు. అతని ప్రకారం నూతన ద్రవ్య వాదం 4 ప్రధానాంశాలను తెలుపుతుంది..

1. ద్రవ్య విషయాలను నిర్ణయించడంలో ద్రవ్యానికి మాత్రమే పాత్ర కలదు. ఉదా : ద్రవ్య వ్యయం, ధరలు, ద్రవ్య వేతనాల స్థాయి, రేటులను ద్రవ్యం మాత్రమే ప్రభావితం చేస్తుంది. వీటిపై కోశ విధానం, కార్మిక సంఘాలు, ఇతర విధానాల ప్రభావం ఉండదు.

2. ద్రవ్య సప్లయ్ లోని మార్పుల ద్వారా వాస్తవ కార్యకలాపాలను తాత్కాలికంగా మాత్రమే మార్చవచ్చు. కానీ దీర్ఘకాలంలో వాటిని ద్రవ్యం మార్చజాలదు. ఉదా : పెట్టుబడి, ఉత్పత్తి, ఉద్యోగితలను నిర్ణయించడంలో ద్రవ్యానికి స్థానం లేదు. ద్రవ్యాన్ని వాస్తవ వ్యవహారాలను మార్చడానికి సాధనంగా ప్రయోగిస్తే మేలు కన్నా కీడు ఎక్కువగా జరుగుతుంది. అట్లా చేసినప్పుడు ఆర్థిక వ్యవస్థను సరిదిద్దడానికి చాలా శ్రమించాల్సివుంటుంది.

3. ద్రవ్యం మాత్రమే ద్రవ్య కార్యకలాపాలను ప్రభావితం చేసినప్పటికీ, ఫలితాలు కాల విలంబనలో కనబడుతాయి. కాల విలంబనకు స్థిరత్వం లేకపోవడం శోచనీయం. అర్థ సంవత్సరం నుంచి రెండు సంవత్సరాలు పట్టవచ్చు. ఇట్లా ఎందుకు జరుగుతుందో ద్రవ్య వాదులు తెలుపలేకపోతున్నారు.

4. మరొక ఇబ్బందిని కలుగజేసే విషయమేమిటంటే నియంత్రించడానికి ద్రవ్యం మాత్రమే సాధనం కాగా, స్థిరత్వ విధానానికి అంటే వ్యాపార చక్రాల ఒడుదోడుకులను నివారించడానికి, ద్రవ్య అధికారులు ద్రవ్యం సాధనాన్ని సమర్థనీయంగా ఉపయోగించ వీలుపడదు. దానిని స్థిరత్వానికి వాడినచో, వ్యాధి నయం కాకుండా ఉద్రిక్తత పెరుగుతుంది. కాబట్టి సముచిత ద్రవ్య విధానంలో, ద్రవ్య సప్లయ్ పెరుగుదల రేటును ముందుగా నిర్ణయించాలి. ఉదా : ఏటేటా ద్రవ్య సప్లయ్‌ను 3% నుంచి 4% మేరకు పెంచడం ఉత్తమ ద్రవ్య విధాన లక్షణం.

పైన తెలిపిన వివరాలను ద్రవ్య వాదులు కేన్స్ వలే పరిణామాత్మక నమూనా ద్వారా ప్రకటించక, అంటే సైద్ధాంతికంగా ప్రధాన చలాంకాల నమూనా ద్వారా వివరించకుండా ఎకనామెట్రిక్స్ పద్ధతుల ద్వారా తెలిపారు. నూతన ద్రవ్యవాదులు, ద్రవ్య సప్లయ్‌ను బాహ్య నిర్ణాయకమని భావిస్తారు. నిజంగా ద్రవ్య సప్లయ్‌లో మార్పులు ఏ మాత్రంగా జరుగుతాయో తెలుపబడలేదు. ద్రవ్యానికి స్థిర డిమాండ్ ఉంటుందన్న ప్రమేయం, వారి వాదానికి పట్టుకొమ్మ.

## 12.4 ద్రవ్య, కేన్సియన్ వాదాలను సమర్థించే ఆర్థిక వేత్తలు

ఇంతవరకు ద్రవ్యవాదం, నూతన ద్రవ్యవాదాల పుట్టుకలను, వాటి ముఖ్యాంశాలను తెలుసుకున్నాం. ద్రవ్య, కేన్సియన్ వాదాలను సమర్థించిన వారిని ప్రస్తుతం తెలుసుకుందాం.

**ద్రవ్యవాదులు :** డేవిడ్ హ్యూమ్, ఇర్వింగ్ ఫిషర్, కేంబ్రిడ్జి ఆర్థిక వేత్తలైన డి.హెచ్.రాబర్ట్సన్, ఎ.సి.పిగూ, ఆల్‌ఫ్రెడ్ మార్షల్ ఇంకా జీవన్స్, కేరన్స్, క్యాసెల్, హెన్రీ సైమన్, జేమ్స్ ఆంజిల్, కార్ల బ్రన్నర్, అలన్ మెల్ట్జర్, లేడ్లర్, క్లార్క్ వార్ బర్టన్, ఏ.జె. శ్వార్ట్జ్, హారీ జాన్సన్, ఫిలిప్స్ కాగన్, అండర్‌సన్, మీజిల్‌మన్, జేమ్స్ టోబిన్, ఎన్.ఎ. వాల్టర్స్, మిల్టన్ ఫ్రీడ్‌మన్, మొదలగువారు.

**కేన్సియన్లు :** కేన్స్‌వాదం ప్రభావం సుదీర్ఘంగా ఉండడం వలన, కేన్సియన్ల జాబితాను కుదించ వీలుపడదు. ఉత్తర లేదా నవ్య కేన్సియన్ల శాఖకు చెందిన వారందరినీ (ఉదా : నికోలస్ కాల్డార్, ఆర్.ఎఫ్. ఖాన్) కేన్సియన్లుగా తెలుపవచ్చు. రాడ్‌క్లిఫ్ వాదాన్ని సమర్థించే వారిని కూడా జాబితాలో చేర్చవచ్చు. ఫిలిప్స్ రేఖా వాదాన్ని సమర్థించే వారిని కేన్సియన్లుగా, ఖండించే వారిని ద్రవ్యవాదులుగా తెలుపవచ్చు. ద్రవ్యవాద ప్రతినిధి మిల్టన్ ఫ్రీడ్‌మన్ కాగా, కేన్సియన్ వాదానికి ప్రధాన నాయకుడు నికోలస్ కాల్డార్.

## 12.5 కేన్సియన్ల, ద్రవ్యవాదుల ప్రధాన చర్చనీయాంశాలు, దృక్పథాలు, భేదాలు

ఈ ఇరుశాఖల వారు పాటించిన దృక్పథాలు, పరిశోధనా పద్ధతులు, స్థూల ఆర్థిక విశ్లేషణా సిద్ధాంతాలు, ఆర్థిక వ్యవస్థ, స్థిరత్వ వ్యూహాలకు సంబంధించి రెండు వర్గాల మధ్య వివాదాలు, భేదాలు, సమస్యలు ఏర్పడ్డాయి. సులభంగా పరిశీలించడానికి ఈ విషయాలను కింద తెలిపిన 9 ఉపశీర్షికలలో పొందుపరచవచ్చు.

(1) పరిశోధన పద్ధతి (2) సమష్టి వ్యయ సిద్ధాంతం (3) ద్రవ్య ప్రసార యంత్రాంగం (4) వాస్తవ, నామ మాత్ర విలువలు (5) ద్రవ్య ప్రభావం తీక్షణత, కాల విలంబన (6) విధాన లక్ష్య చలాంకం (7) ప్రభుత్వ వ్యయ 'నెట్టివేత' ప్రభావం (8) ద్రవ్య కోశ విధానాల ప్రభావాల యొక్క సాపేక్ష స్థోమత (9) ఆర్థిక వ్యవస్థ సుస్థిరత, స్థిరత్వ విధానాలు.

### 12.5.1 పరిశోధనా పద్ధతులు

ద్రవ్యానికి, ఆర్థిక కలాపాలకు గల సంబంధాన్ని అన్వేషించడానికి, ద్రవ్య వాదుల ఎకనామెట్రిక్స్ పద్ధతులను, కుదించబడిన సమీకరణాలను (reduced form of equations) పాటిస్తారు. వీటి ఫలితాల ద్వారా ద్రవ్యానికి, ఆర్థిక కలాపాలకు ప్రత్యక్ష సంబంధం కలదని వాదిస్తారు. ద్రవ్య వాదులు తమ పరిశోధనా పద్ధతులలో సైద్ధాంతిక ఆధారాన్ని స్వల్పంగా, ఆర్థిక గణాంక సాంఖ్యక పద్ధతిని విశేషంగా ఉపయోగిస్తారు. కేన్సియన్ల పద్ధతి ప్రధానంగా సైద్ధాంతికమైనది. సాంఖ్యక - గణాంక పద్ధతికి అంతగా ప్రాముఖ్యమివ్వరు. వీరు కూడా ఎకనామెట్రిక్స్ పద్ధతులను వాడినప్పటికీ, సమగ్ర ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన విడదీయబడిన నమూనాను ఉపయోగిస్తారు.

### 12.5.2 సమష్టి వ్యయ సిద్ధాంతాలు

కేన్సియన్లు Y=C+I+G సమీకరణ ఆధారంగా సమష్టి వ్యయం మూడు రకాల వ్యయాల ( C= ప్రైవేటు వినియోగం, I = ప్రైవేటు పెట్టుబడి, G = ప్రభుత్వ వ్యయం) కూర్పుగా తెలుపుతారు. ఈ మూడింటిలో ప్రైవేటు పెట్టుబడికి కాని మాంద్య స్థితిలో ప్రభుత్వ ప్రేరిత వ్యయానికి గాని జాతీయాదాయం, దాని ద్వారా జాతీయ వ్యయాన్ని నిర్ణయించడంలో కీలక పాత్ర ఉంటుందని కేన్సియన్లు వివరిస్తారు. వీరి వివరణకు విరుద్ధంగా ద్రవ్య వాదులు ద్రవ్య సప్లయ్ ప్రకారం ద్రవ్య ఆదాయ వ్యయాలు మారుతాయని వాదిస్తారు.

### 12.5.3 వినియోగ ఫలం, డిమాండ్ ఫలంల స్థిరత్వం (Stability of Consumption & Money Demand Functions)

ఇరు శాఖల వాదనల వెనక గల ప్రధాన పరికల్పనలను పరిశీలిద్దాం. కేన్సియన్ల సిద్ధాంతంలో ఆదాయ, వినియోగాలు స్థిర సంబంధాన్ని కలిగి ఉంటాయని భావించబడుతుంది. ద్రవ్యరాశి సిద్ధాంతం ప్రకారం, ద్రవ్య చలామణివేగం స్థిరంగా ఉంటుందని భావించి, ద్రవ్య డిమాండు ఫలం స్థిరమైనదని తెలుపడం జరిగింది. ఈ రెండు పరికల్పనలను ఫ్రీడ్‌మన్, మీజిల్‌మన్‌లు అమెరికా సంయుక్త రాష్ట్రాల దత్తంశాల ఆధారంగా పరీక్షించారు. వారి ఫలితాలు కేన్సియన్ల కన్న ద్రవ్యవాదుల రిగ్రేషన్ నమూనా ఉచిత రీతిలో కలదని సమర్థిస్తాయి. కేన్సియన్లు వారి ఫలితాలను సవాలు చేశారు. ఒక సమీకరణం మాత్రమే కల రిగ్రేషన్, కేన్సియన్ల సిద్ధాంతానికి న్యాయం చేయజాలదని తెలిపారు. కేన్సియన్ల వాదన ఔచిత్యాన్ని మూల్యాంకనం (assessing releavance) చేయడానికి, మొత్తం ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన పెక్కు సమీకరణలు అవసరమని పేర్కొన్నాయి.

### 12.5.4 ద్రవ్య డిమాండ్ స్థిరమా ? అస్థిరమా ?

ఈ సమస్యను ఇంతకు ముందు పాక్షికంగా చర్చించాం. కేన్సియన్ల ప్రకారం ద్రవ్య డిమాండు అస్థిరంకాగా, ద్రవ్య వాదుల ప్రకారం స్థిరమైంది. కేన్సియన్ల ప్రకారం వడ్డీరేటు, ద్రవ్య డిమాండుల సంబంధం స్థిరంగా ఉండనందువల్ల, జాతీయాదాయానికి, ద్రవ్యానికి మధ్య స్థిర సంబంధం ఉండదు. వడ్డీరేటు ద్రవ్య డిమాండు అస్థిరమైనదని కేన్సియన్లు వాదిస్తారు. దీనికి విరుద్ధంగా, ద్రవ్య వాదులు ద్రవ్య చలామణి వేగం దాదాపు స్థిరమైనదని భావించి లేదా చలామణి వేగంలో మార్పులను కలిగించే కారకాలను స్పష్టంగా గుర్తించవచ్చునని భావించి ద్రవ్య డిమాండ్ ఆదాయంలో స్థిర సంబంధాన్ని కలిగి ఉంటుందని తెలిపారు. స్థిరత్వం ఖచ్చితమైనది కానప్పటికీ, దాదాపు స్థిరంగా ఉంటుంది. స్థిర డిమాండ్ కలదన్న వాదనను సాంఖ్యక చారిత్రక విశ్లేషణ ద్వారా సమర్థిస్తారు. ఫ్రీడ్‌మన్ ప్రకారం, కేన్సు వినియోగ ఫలం కన్న ద్రవ్య డిమాండ్ ఫలం సాపేక్షంగా ఎక్కువ

స్థిరత్వ లక్షణాన్ని కలిగి ఉంటుంది. ద్రవ్యవాదుల విధాన సలహాల ఔచిత్యం స్థిర ద్రవ్య డిమాండ్ ప్రమేయంపై విశేషంగా ఆధారపడి ఉంటుందని గమనించాలి. అస్థిరంగా ఉంటుందని నిరూపిస్తే, ద్రవ్య విధానాల స్థోమత బలహీన మవుతుంది, ఇంకా వారి ఇతర సమాధానాలు సవాలు చేయబడతాయి.

### 12.5.5 ద్రవ్య ప్రసార యంత్రాంగం (Monetary Mechanism)

ద్రవ్య సప్లయ్ మార్పులు జాతీయాదాయాన్ని, జాతీయ వ్యయాన్ని ఏవిధంగా ప్రభావితం చేస్తాయో తెలుసుకుందాం. ద్రవ్య వాదులు ద్రవ్య ప్రసార యంత్రాంగాన్ని స్పష్టంగా వివరించలేదు. వారి ప్రకారం ద్రవ్య సప్లయ్‌లో మార్పులు మొదట వివిధ వడ్డీ, రాబడి రేట్ల సమితిని కూర్పు చేసి, వాటి ద్వారా జాతీయాదాయం, జాతీయ వ్యయం, సమష్టి డిమాండ్‌లను ప్రభావితం చేస్తాయి. కేన్సియన్లు వడ్డీరేటును ప్రత్యేకించి తెలుపుతారు. ద్రవ్య సప్లయ్ మార్పులు మొదట స్వల్పకాలిక వడ్డీరేటును, పిదప దీర్ఘకాలిక వడ్డీ రేటును ప్రభావితం చేసి, దాని ద్వారా పెట్టుబడిని, ఆదాయ - ఉద్యోగిత - ఉత్పత్తి - ధరలను ఇంకా సమష్టి డిమాండ్‌ను ప్రభావితం చేస్తాయి.

### 12.5.6 ద్రవ్య సప్లయ్ బాహ్యాంకమా ? అంతరంగికమా ? (Is Money Supply Exogenous or Endogenous ? )

పైన చర్చించిన దానికి సంబంధించిన మరొక అంశాన్ని పరిశీలిద్దాం. ద్రవ్యానికి ప్రాముఖ్యముందా లేదా అనే మీమాంస సుదీర్ఘంగా కొనసాగినప్పటికీ, అసలు ద్రవ్య పరిమాణం ఏవిధంగా మారుతుందో విశదీకరించడం జరగలేదు. ఫ్రీడ్‌మన్ ద్రవ్య సప్లయ్ చలామణిని ద్రవ్యం వర్షంగా లేదా ముద్రించబడిన కరెన్సీ నోట్లను హెలికాప్టర్ నుంచి వెదజల్లబడుతాయని వ్యంగ్యంగా చిత్రీకరించాడు. అంటే ద్రవ్య సప్లయ్ స్వతంత్ర బాహ్యాంకం. ఆర్థిక వ్యవస్థ అవసరాలను బట్టి కాకుండా బాహ్యకారణాలు ద్రవ్య సప్లయ్‌ని నిర్ణయిస్తాయి. మరొక విధంగా తెలుపాలంటే, ద్రవ్య అధికారులు దానిని ఏ రేటు చొప్పుననైననూ, ఏ స్థితిలో నైననూ మార్చవచ్చు. ద్రవ్య సప్లయ్ బాహ్యాంకంగా ఉండడం ద్రవ్యవాదుల సమాధానాలకు అత్యవసరం. కేన్సియన్లు వారి వాదాన్ని పాక్షికంగా మాత్రమే ఒప్పుకుంటారు. విత్తపరమైన సాంకేతిక పురోగతి విశేషంగా జరగడం వల్ల, దేనిని ద్రవ్య మనాలి, ఏ ద్రవ్యత్వ ఆస్తి ద్రవ్యం కాదో చెప్పడం సులభం కాదు. ద్రవ్య అధికారులే కాకుండా, ద్రవ్యాన్ని డిమాండ్ చేసే వారు కూడా ద్రవ్య సప్లయ్‌ని నిర్ణయిస్తారు. ద్రవ్య పరిమాణంలోని కొంతభాగం అంతరంగికంగా నిర్ణయింపబడుతుందని అందరూ అంగీకరించవలసి ఉంటుంది.

BRAOU

### 12.5.7 వాస్తవ, నామ మాత్ర విలువల డిమాండ్

దీనిని గురించి ఇరు పక్షాల మధ్య స్థూలంగా అంగీకారం కలదు. స్వల్ప కాలంలో ద్రవ్య సప్లయ్ మారినప్పుడు ధరలు - ఉత్పత్తి రెండూ మారతాయని ఇరు పక్షాల వారు ఒప్పుకుంటారు. కానీ ఈ మార్పును వివరించడంలో భేదాలున్నాయి. ద్రవ్యవాదుల ప్రకారం ధరలు ప్రత్యక్షంగా, కేన్సియన్ల ప్రకారం పరోక్షంగా ప్రభావితం అవుతాయి. ఇంతేగాకుండా కేన్సియన్ల ప్రకారం దీర్ఘ కాలంలో కూడా నిరుద్యోగిత ఉన్నప్పుడు, ధరలతో సహా ఉత్పత్తి కూడా మార్పు చెందుతాయి. ద్రవ్య వాదులు దీర్ఘకాలంలో సంపూర్ణోద్యోగిత తప్పనిసరిగా ఉంటుందని భావించి, ధరలు మాత్రమే మారుతాయని వాదిస్తారు. వారి ప్రకారం ఉత్పత్తి స్థాయిని మౌలిక వృద్ధికారకాలైన శ్రమ, మూలధనం, సాంకేతిక ప్రగతి, మొదలగునవి నిర్ణయిస్తాయి. ద్రవ్యం ఉత్పత్తిని ప్రభావితం చేయజాలదు.

### 12.5.8 ద్రవ్య ప్రభావం యొక్క తీక్షణత, కాల విలంబన

ద్రవ్య సప్లయ్ మారినప్పుడు, ఎంతకాలం తర్వాత ఏ మేరకు జాతీయాదాయం ప్రభావితం అవుతుంది అన్న ప్రశ్నలను పరిశీలించుదాం. ఈ ప్రశ్నల గురించి ఇరు పక్షాల మధ్య తీవ్రమైన భేదాభిప్రాయాలున్నాయి. ద్రవ్య పరిమాణంలోని మార్పు జాతీయాదాయం, జాతీయ వ్యయాలపై ప్రత్యక్ష ఇంకా గణనీయ ప్రభావం కలిగి ఉంటుందని ద్రవ్య వాదులు తెలుపుతారు. దీనికి దాదాపు విరుద్ధమైన సమాధానాన్ని కేన్సియన్లు ఇచ్చారు. కాల విలంబన అధికంగా ఉండటమే కాకుండా, ఖచ్చితంగా ఉండదు. దీనికి కారణం ఏమంటే, దీర్ఘకాలిక వడ్డీ రేట్ల మార్పుల వల్ల పెట్టుబడి మారి, జాతీయాదాయం మారుతుంది. కానీ దీర్ఘకాలిక వడ్డీ రేట్లు మారడానికి చాలా సమయం కావాలి.

ద్రవ్యవాదుల ప్రకారం మూడు నెలల తర్వాత గుణకం విలువ దాదాపు $1\frac{1}{2}$ కాగా, కేన్సియన్ల ప్రకారం $\frac{1}{4}$ మాత్రమే. రెండు సంవత్సరాల తర్వాత ఈ విలువ ఇరు శాఖల ప్రకారం వరుసగా **6.6, 2.2.** ద్రవ్య సప్లయ్ లోని మార్పు సంపూర్ణ ప్రభావం వారి ప్రకారం వరుసగా 1,3 సంవత్సరాలలో వ్యక్తమవుతుంది. ఇక్కడ సంప్రదాయ కోవకు చెందిన డేవిడ్ హ్యూమ్ అభిప్రాయాన్ని గుర్తు చేసుకుందాం. ద్రవ్య ప్రభావం ధరలపై దీర్ఘకాలంలో మాత్రమే కనబడుతుంది. స్వల్ప కాలంలో దాని ప్రభావం వ్యవహారాల స్థాయిపై, ఉత్పత్తిపై కనబడుతుంది. ధరలు ప్రభావితం కావడంలో ఇమిడి ఉన్న సుదీర్ఘ కాల విలంబనను అతను గుర్తించాడు. ఎస్. ఏ. వాల్టర్స్ ప్రకారం ద్రవ్య ప్రభావం ఉత్పత్తిపై 9 నెలల పిదప, ధరలపై రెండు సంవత్సరాల పిదప కనబడుతుంది. ఆశ్చర్యకర విషయం ఏమిటంటే ధరలు ద్రవ్య పరిమాణం ప్రకారం సర్దుబాటు కావడానికి కాల విలంబన అధికంగా ఎందుకు ఉంటుందన్న సత్యం ఇప్పటికీ మాయ (mystery) గా మిగిలి పోయింది. ఇంతేకాకుండా ద్రవ్య అర్థ శాస్త్రంలో మరొక అస్పష్టత కలదు. ద్రవ్య ప్రభావం వల్ల కలిగే మార్పును ఉత్పత్తి ధరల ప్రభావాల మార్పులుగా విడదీసి చూడడం ఎవ్వరికీ సాధ్యం కాలేదు.

### 12.5.9 ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం

మార్కెట్ వ్యవస్థ సహజంగా అస్థిరత్వాన్ని కలిగి ఉంటుందని, సంపూర్ణోద్యోగితతో కూడిన సమతుల్య స్థితిని దానంతటదే సాధించజాలదని కేన్సియన్ల ధృఢ విశ్వాసం. దానిని ప్రభుత్వం నియంత్రించనిచో అల్పోద్యోగిత స్థాయిపై సమతౌల్యం సమకూరవచ్చునీ, కాబట్టి స్థిరీకరణకు ప్రభుత్వ క్రియాశీలక జోక్యం అవసరమని కేన్సియన్లు సలహా ఇస్తారు. వీరికి విరుద్ధంగా బ్రన్నర్ వంటి ద్రవ్యవాదులు మార్కెట్ యంత్రాంగం స్వయం చాలకంగా ఒడుదొడుకులను తొలగించుకొనగల స్థోమతను కలిగిఉంటుందని పేర్కొన్నారు. కాబట్టి ప్రభుత్వ జోక్యం అనవసరమని, జోక్యం వల్ల అస్థిరత్వం ఇంకా తీవ్రమవుతుందని ద్రవ్యవాదులు హెచ్చరిస్తారు.

### 12.5.10 ద్రవ్య విధాన సాధనాల ఎంపిక

వడ్డీరేటు వంటి సాధనాల ఆధారంగా ద్రవ్య విధానాన్ని రూపొందించాలని కేన్సియన్లు సలహానివ్వగా, ద్రవ్యరాశి సాధనం ఆధారంగా ద్రవ్య విధానం అమలు చేయ్యాలని రెండవ పక్షం వారు తెలిపారు. ద్రవ్య వాదుల ప్రకారం ద్రవ్యాన్ని ముందుగా నిర్ణయించిన రేటు ప్రకారం స్థిరంగా పెంచడం శ్రేయస్కరం. దీనినే 'మానిటరీ టార్గెటింగ్ ' అంటారు. వారి దృష్టిలో ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు ప్రకారం ద్రవ్యరాశిని పెంచడం ఉత్తమం. వడ్డీరేట్ల మార్పుతో సహా ఇతర విచక్షణాత్మక ద్రవ్య విధానాలు ఆచరణ యోగ్యం కావని, వాటి ఆచరణ వల్ల

మేలుకన్నా కీడు ఎక్కువ వాటిల్లుతుంది.

### 12.5.11 ద్రవ్యోల్బణం - నిరుద్యోగిత : వైరుధ్యం (Trade - Off)

ఫిలిప్స్ రేఖ ప్రతిపాదనను కేన్సియన్లు స్వల్పకాలంలో సమర్థిస్తారు. అంటే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేస్తే నిరుద్యోగిత పెరుగుతుందని భావిస్తారు. ఆర్థిక వ్యవస్థలో వేతనాలు - ధరలు స్వల్పకాలంలో సరళత్వాన్ని కలిగి ఉండక పోవడం (wage - price rigidity) వల్ల, ఫిలిప్స్ రేఖ ఎడమ నుండి కుడికి వాలుతుంది. జె.ఎం.కేన్స్ ప్రకారం వేతన బేరాలు ద్రవ్యపరంగా జరుగుట వలన, శ్రామికులు ద్రవ్యోల్బణానికి పాక్షికంగా మాత్రమే స్పందిస్తారు. కాబట్టి ద్రవ్యోల్బణం, ద్రవ్య వేతనాలు పెరగడం వల్ల నిరుద్యోగితా స్థాయి అధికమవుతుంది. ఫిలిప్స్ రేఖా వాదాన్ని ఫ్రీడ్‌మన్ వంటి ద్రవ్య వాదులు ద్రవ్యోల్బణం, ఉద్యోగిత మధ్య వైరుధ్యం లేదని వాదిస్తారు. ఫిలిప్స్ రేఖ కింది వైపు వాలదని, రుజు రేఖ రూపంలో నిటారుగా ఉంటుందని తెలుపుతారు. అంటే ద్రవ్యోల్బణం రేటు ఎంత ఉన్నప్పటికీ, సహజ నిరుద్యోగిత రేటు స్థిరంగా ఉంటుంది. క్రింది రెండు రేఖా చిత్రాలు ఇరు శాఖల సమాధానాలను సూచిస్తాయి.

కేన్సియన్ల ఫిలిప్స్ రేఖ




ద్రవ్యవాదుల ఫిలిప్స్ రేఖ




BRAOU

ద్రవ్యవాదుల ప్రకారం సహజ నిరుద్యోగిత రేటు, వివిధ ద్రవ్యోల్బణ రేట్లలో మైత్రి కలిగి ఉంటుంది. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడూ, తగ్గినప్పుడూ నిరుద్యోగిత రేటులో మార్పు ఉండదు.

### 12.5.12 విధాన సలహాలలో భేదం - ప్రభుత్వ వ్యయం వెట్టివేత ప్రభావం

కేన్సియన్లు కోశ విధానానికీ, మాంద్యస్థితిలో ప్రభుత్వ వ్యయ విధానానికీ కీలక పాత్రనిస్తారు. ద్రవ్య వాదుల ప్రకారం కోశ విధానానికన్న ద్రవ్య విధానం మెరుగయినదని తెలుపుతారు. శోచనీయ

విషయమేమంటే ద్రవ్యవాదులు క్రియాశీలక కోశ విధానాన్ని (విచక్షణాత్మక) ద్రవ్య విధానాన్ని రెండింటినీ సమర్థించరు. కోశ విధానం వల్ల, ఇంకా ప్రభుత్వ రుణ నిధుల వ్యయం వల్ల ప్రైవేటు పెట్టుబడి తగ్గుతుందని, కాబట్టి సమష్టిగా, మొత్తం వ్యయంలో మార్పు ఉండదని వాదిస్తారు. ప్రభుత్వ వ్యయం పెరుగుదల వల్ల కలిగే ప్రైవేటు పెట్టుబడి క్షీణతను "నెట్టివేత " (crowding out) ప్రభావమని తెలుపుతారు. కేన్సియన్లు క్రియాశీలక జోక్య విధానానికి, ద్రవ్య వాదులు జడత్వ విధానానికి (activist, non - activist) మద్దతునిస్తారు.

## 12.6 సారాంశం

ద్రవ్య ప్రాముఖ్యతకు, ద్రవ్య వాదానికి శతాబ్దాల చరిత్ర ఉన్నప్పటికీ, 1950 ప్రాంతంలో మిల్టన్ ఫ్రీడ్‌మన్ చేపట్టిన రచనలవల్ల ద్రవ్య వాదానికి విశిష్ట ప్రాముఖ్యం లభించింది. కేన్సియన్ల వాదానికి కూడా కేన్సియన్ విప్లవ తొలిదశలోనే కాకుండా, ఇప్పటికీ ప్రాబల్యం కలదు. కనీసం 18వ శతాబ్దిలో ప్రచారంలో కల సంప్రదాయ వాదుల ద్రవ్య అర్థశాస్త్రంలో ప్రఖ్యాతి చెందిన ద్రవ్యరాశి సిద్ధాంతం అంతర్భాగం. ద్రవ్యవాదం పునాదులు ద్రవ్యరాశి సిద్ధాంతంలో కలదని గుర్తించారు. కేన్సియన్లను, ద్రవ్యవాదులను అప్పుడప్పుడు వరుసగా ఫిలిప్స్ రేఖ వాదాన్ని సమర్థించేవారని, ఖండించే వారని తెలుపడం జరిగింది. ఇంకా వారినే క్రియాశీలక జోక్యవాదులని, జడత్వ లేదా ప్రభుత్వ జోక్య విరోధులని కూడా తెలుపవచ్చు. ఇరు శాఖల మధ్య కొన్ని సమస్యల గురించిన అగాధం చాలా కలదు. వారి పరిశోధనా పద్ధతులు, వ్యూహాలు, ద్రవ్య సప్లయ్‌లోని మార్పుల ప్రేరణ, విధాన లక్ష్య చలాంకాలు, సమష్టి వ్యయ సిద్ధాంతాలు, ద్రవ్యప్రసార యంత్రాంగాలు, ముఖ్య పరికల్పనలు, సలహాలు చాలా భిన్నంగా కన్పిస్తాయి. కేన్సియన్లు ద్రవ్య నిలువలకు ఉపాంత ప్రాముఖ్యమిచ్చి సమష్టి వ్యయాన్ని నిర్ణయించే కారకాలకు ప్రథమ తాంబూలమిస్తారు. ద్రవ్యవాదుల ప్రకారం సమష్టి వ్యయం ప్రధానంగా ద్రవ్య సప్లయ్, డిమాండ్‌లపై ఆధారపడుతుంది. ఒకరు వినియోగ ఫలాన్ని, మరొకరు ద్రవ్య డిమాండు ఫలాన్ని స్థిరంగా ఉంటాయని భావిస్తారు. కేన్సియన్లు చాలా వరకు తమ వాదనలను సైద్ధాంతికంగా సమర్థించుకుంటారు. ద్రవ్య వాదులు సాంఖ్యకంగా, చారిత్రక దత్తాంశాల రిగ్రెషన్ విశ్లేషణ ద్వారా తమ సమాధానాలను సమర్థించుకుంటారు. ద్రవ్యరాశి లోని మార్పు ప్రభావం తక్కువ సమయంలో శక్తివంతమైన మార్పులను కలిగిస్తుందని ద్రవ్యవాదులు వాదించగా కాల విలంబన అధికమనీ, మార్పు తీవ్రత స్వల్పమనీ కేన్సియన్లు వివరిస్తారు. ద్రవ్య అంశాలపై సుదీర్ఘ చరిత్ర ఉన్నప్పటికీ, చర్చలు తీవ్రంగా జరిగినప్పటికీ కొన్ని ప్రధాన సమస్యలపై ఇప్పటికీ అంగీకారం లేదు. ఇంతే కాకుండా, కొన్ని పరిణామాలు ఎందుకు ఏవిధంగా జరుగుతాయో రహస్యంగానే ఉన్నాయి. పరిశోధనలవల్ల తెలిసిన సాంఖ్యక సంబంధాలను కార్యకారణ సంబంధాలుగా భావించవచ్చా అన్న ప్రధాన ప్రశ్నను కేన్సియన్లు లేవదీశారు. ఏ వర్గం వారు కూడా అసలు ద్రవ్య సప్లయ్ చలామణిలోకి ఎట్లా వస్తుందో శాస్త్రీయంగా తెలుపలేకపోతున్నారు. ద్రవ్య ప్రభావాన్ని ఉత్పత్తి - ధరల ప్రభావాలుగా విడదీసి చెప్పడం జరుగలేదు.

ఈ రోజు కొనసాగుతున్న చర్చ ద్రవ్యానికి ప్రాముఖ్యం కలదా, లేదా అన్న విషయం గురించి కాదు. చర్చ ప్రధానంగా ద్రవ్య ప్రభావం తీవ్రత గురించి, ఇంకా ప్రభావం ఏ ప్రక్రియ ద్వారా ప్రకటించబడుతుందనే దాని గురించి జరుగుతుంది. ద్రవ్యానికి, ధరలకు సంబంధం కలదని అందరూ అంగీకరిస్తారు. అయితే ఆ సంబంధం ప్రత్యక్షం కాదు. వెను వెంటనే ఒకటి మరొకదానిని ప్రభావితం చేయజాలదు. ద్రవ్య మార్కెట్, వస్తువుల మార్కెట్ పరస్పర సంబంధం కలిగి ఉంటాయని అందరూ ఒప్పుకుంటారు. అనేకుల ప్రకారం ద్రవ్యాన్ని ద్రవ్యోల్బణానికి ప్రధాన కారణమని భావించక, మద్దతునిచ్చే విస్తరింపచేసే కారకమని తెలుపడం ఉచితం.

ఆర్.ఎఫ్.ఖాన్ వంటి కేన్సియన్లు ద్రవ్య ప్రభావాన్ని తక్కువజేసి వర్ణించగా ఫ్రీడ్‌మన్ వంటి ద్రవ్యవాదులు ఎక్కువచేసి వర్ణిస్తారు. కేన్సియన్లు ద్రవ్యానికి ప్రభావం లేదని ఎన్నడూ తెలుపలేదు. ద్రవ్యం మాత్రమే ప్రాముఖ్యమైనదన్న విషయాన్ని వారు అంగీకరించరు. ద్రవ్యం అనేక కారకాల్లో ఒకటి. ఎవరూ కూడా సమగ్ర పరిశోధనలు చేసి కేన్సియన్లు లేదా ద్రవ్య వాదుల సమాధానాలు లోపభోయిష్టమైనవని నిరూపించలేదు. చారిత్రకంగా పరిశీలిస్తే రెండు రకాల వాదాలకు వేరు వేరు స్థితులలో ప్రాధాన్యతను కల్పించవచ్చు. ద్రవ్యానికి, స్వయం ప్రేరిత పెట్టుబడికి (ప్రభుత్వ వ్యయం) ఆర్థిక కార్యకలాపాల స్థాయిని నిర్ణయించడంలో కీలక పాత్రలు కలవు. నిరుద్యోగిత స్థితిలో స్వయం ప్రేరిత పెట్టుబడికి (కేన్సియన్ల వాదానికి) ఇతర స్థితులలో ముఖ్యంగా దీర్ఘకాలంలో ద్రవ్యానికి (ద్రవ్య వాదానికి) ప్రధాన పాత్రనివ్వవచ్చు. ఇట్లా స్వల్ప కాలంలో కేన్సుపరమైన నమూనాలకు, దీర్ఘకాలంలో ద్రవ్యవాదుల నమూనాలకు, సముచిత పాత్రలనిచ్చి, వాస్తవ ప్రపంచ నియంత్రణను, వృద్ధికి ఉపయోగించుకోవచ్చు. గమనించవలసిన ప్రధాన విషయమేమంటే, ద్రవ్యవాదుల ప్రకారం ఆర్థిక వ్యవస్థలో స్వత : సిద్ధంగా స్థిరత్వాన్ని కలిగి సంపూర్ణోద్యోగితను సాధిస్తాయని, కోశ ఇతర ప్రత్యక్ష విధానాలు అనవసరమని భావిస్తారు. వీరు " అదృశ్య హస్తం " యొక్క స్థోమతను అతిశయోక్తి చేసి వర్ణిస్తారు. కేన్సియన్లు కూడా అదృశ్య హస్తానికి మార్కెట్ యంత్రాంగానికి కల పాత్రలను గుర్తిస్తారు. కానీ అవి అన్ని సందర్భాల్లో సమర్థనీయంగా పని చేయవని, కాబట్టి ప్రభుత్వ జోక్యం అవసరమవుతుందని వాదిస్తారు. చివరలో గుర్తుంచుకోవాల్సిన సత్యమేమంటే, ఇరు వర్గాల మధ్య అనుకున్నంత అగాధం లేదు. ఇరుపక్షాల వారు ద్రవ్య, కోశ విధానాల పాత్రలను గుర్తిస్తారు. కానీ వాటికి వారు ఇచ్చే సాపేక్ష ప్రాధాన్యతలు వేరు వేరుగా ఉంటాయి.

## 12.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలలో ఒక్కొక్క దానికి సుమారు 40 పంక్తులలో జవాబులు రాయండి.**

1. కేన్సియన్లు, ద్రవ్య వాదుల మధ్యగల భేదాలను, చర్చనీయాంశాలను, విధానాలను నిశితంగా పరిశీలించండి.

2. ద్రవ్య వాదం, కేన్సియన్ వాదం అంటే ఏమిటి ? ఫిలిప్స్ రేఖ తెలిపే విరుద్ధ సమస్యను, అదృశ్య హస్తం పాత్రను, ఇరు పక్షాల వారు ఏవిధంగా వివరిస్తారు ?

3. ద్రవ్యవాదం అంటే ఏమిటి ? అది పాటించే పంథా, పరిశోధనా పద్ధతులు, విధాన సలహాలు, కేన్సియన్ల వాదానికి ఏవిధంగా భిన్నంగా ఉంటాయి ?

**II. క్రింది వాటిలో ఒక్కొక్క దానికి 20 పంక్తులలో జవాబులు రాయండి.**

1. ద్రవ్య, కేన్సియన్ వాదాల సారాంశాన్ని వివరించండి.

2. ద్రవ్య, కేన్సియన్ వాదాల మధ్య భేదాలను, పోలికలను తెలుపండి.

BRAOU

## 12.8 సంప్రదింపు గ్రంథాలు


1. The New Palgrave - *Dictionary of Economics*, Vol. III, Macmillan, London, 1987, pp. 492-6
2. G. Koul, *Monetarism Vs Keynesianism in India*, Himalaya, Bombay, 1988, Ch. III.
3. C.L. Jain, " *Monetarism Vs Keynesianism*" , *Indian Economic Journal*, Oct - Dec, 1976.
4. N. Kaldor, " The New Monetarism, " *Lloyd's Bank Review*, July 1970 (Reprinted in A A Walters (Ed), *Money & Banking*, Penguin, Harmondsworth, 1973.


## 12.9 పారిభాషిక పదకోశం

| | | |
|---|---|---|
| Nominal & Real Balances | : | నామమాత్ర, వాస్తవ ద్రవ్య విలువలు |
| Hypothesis | : | పరికల్పన |
| Discriminatory | : | విచక్షణాత్మక |
| (New) Monetarism | : | (నూతన) ద్రవ్యవాదం |
| Stability | : | స్థిరత్వం |
| Stabilisation Policy | : | స్థిరీకరణ విధానం |
| Mercantilism | : | వాణిజ్య వాదం |
| Inflation | : | ద్రవ్యోల్బణం |
| Velocity of Circulation of Money | : | ద్రవ్య చలామణి వేగం |
| Under - Employment Equilibrium | : | అల్పోద్యోగిత సమతుల్యం |
| Trade Cycles | : | వ్యాపార చక్రాలు |
| School | : | శాఖ |
| Ambiguity | : | అస్పష్టత |
| Depression | : | మాంద్యం |
| Endogenous | : | అంతరంగిక |
| Exogenous | : | బాహ్యాంగ |
| Invisible hand | : | అదృశ్య హస్తం |
| Mystery | : | మాయ, విచిత్రం |

BRAOU

| | | |
|---|---|---|
| Relevance | : | ఔచిత్యం |
| Implications | : | ఇమిడి ఉన్న విషయాలు |
| Normal Rate of Unemployment | : | సహజ నిరుద్యోగిత రేటు |
| Aggegate / Macro | : | స్థూల/సమష్టి/ సమగ్ర |
| Multiplier | : | గుణకం |
| Quantity Theory of Money | : | ద్రవ్యరాశి సిద్ధాంతం |
| Autonomous | : | స్వయం ప్రేరిత |
| Crowding Out | : | నెట్టివేత |
| Self-regulating | : | స్వయం చాలక నియంత్రణ |
| Theoretical | : | సైద్ధాంతిక |
| Data | : | దత్తాంశాలు/దత్తాంశం |
| Statistical | : | సాంఖ్యక |
| Historical& Empirical | : | చారిత్రిక, వ్యవహారిక |
| Trade - off | : | వైరుధ్యం |
| Active | : | క్రియాశీలక |
| Passive | : | జడత్వం |
| Policy Suggestions | : | విధాన సలహాలు/సూచనలు |

- ఆచార్య ఎస్. కిషన్ రావ్

BRAOU

# భాగం - 13 : హేతుబద్ధ అంచనాల పరికల్పన/సిద్ధాంతం

## (Rational Expectations Hypothesis / Theory)

విషయక్రమం


13.0 ఉద్దేశం

13.1 పరిచయం

13.2 సిద్ధాంత పుట్టుక, పరిణామం, ఇతర శాఖలతో సంబంధం

13.3 హేతువాద అంచనాల శాఖకు చెందిన ఆర్థికవేత్తలు

13.4 ఊహలు, భవిష్యత్తు ఆలోచనలు, ఉజ్జాయింపులు, అంచనాల విభజన - అడాప్టీవ్ (adoptive), హేతుబద్ధ (rational) అంచనాలు

13.4.1 అడాప్టీవ్ అంచనాల పరికల్పన

13.4.2 హేతుబద్ధ అంచనాల పరికల్పన

13.5 అడాప్టీవ్, హేతువాద అంచనాల పరికల్పనల మధ్య గల భేదాలు - రేఖాచిత్రాల ద్వారా వివరణ

13.6 విధాన సాధనాల బలహీనత ప్రతిపాదన, సలహాలు

13.7 పరివర్తన రహిత లేదా ఇన్‌వేరియన్స్ ప్రతిపాదన : లుకాస్ - సార్జెంటుల (సప్లయ్) ప్రమేయం

13.8 నిష్పాక్షిక విమర్శ

13.9 సారాంశం

13.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

13.11 సంప్రదింపు గ్రంథాలు

13.12 పారిభాషిక పదకోశం


## 13.0 ఉద్దేశం

ఇటీవలి కాలంలో ప్రచారంలోకి వచ్చిన హేతుబద్ధ అంచనాల సిద్ధాంతాన్ని తెలిపే అంశాలను, దాని విధాన సూచనలను, ఈ సిద్ధాంతానికీ కేన్సియన్ - ద్రవ్యవాదుల సిద్ధాంతాలకు మధ్యగల భేదాలను పరిశీలించడం ఈ పాఠం ఉద్దేశం.

## 13.1 పరిచయం

దీనికి ముందు పాఠంలో ద్రవ్య, కేన్సియన్ వాదాలను పరిశీలించాం. ద్రవ్యవాదంతో సంబంధం గల

ఇటీవల ప్రచారంలోకి వచ్చిన మరొక పరికల్పనను తెలుసుకుందాం. దీనిని హేతువాద లేదా హేతుబద్ధ అంచనాల 'సిద్ధాంతం' అని కొందరు 'పరికల్పన' అని మరికొందరు తెలుపుతారు. సిద్ధాంతానికి పరికల్పనకు మధ్య భేదం విశేషంగా లేదు. సిద్ధాంతం యొక్క ప్రారంభం లేదా తొలిదశను పరికల్పనగా తెలుపవచ్చు. విషయాలను కార్యాకారణ సంబంధంలో సమగ్రంగా, శాస్త్రీయంగా, తార్కికంగా తెలిపే దానిని సిద్ధాంతమని గమనించాలి.

హేతుబద్ధ అంచనాల సిద్ధాంతం ప్రధానంగా ద్రవ్యోల్బణం గురించి, ప్రభుత్వ విధానాల స్తోమత, ఆచరణీయత గురించి తెలుపుతుంది. కాబట్టి ఈ పాఠాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ద్రవ్యోల్బణం, ఫిలిప్స్‌రేఖ, ద్రవ్యవాదుల - కేన్సియన్‌ల చర్చ, సహజ నిరుద్యోగిత రేటు, ప్రభుత్వ క్రియాశీలక, జడత్వ విధానాల గురించిన విషయాలను పునరావలోకనం చేసుకోవాలి.

## 13.2 సిద్ధాంత పుట్టుక, పరిమాణం, ఇతర శాఖలతో సంబంధం

1970 ప్రాంతంలో స్థూల అర్థ శాస్త్ర పరిధిలో " స్టాగ్‌ఫ్లేషన్ " అనే నూతన సమస్య ప్రవేశించింది. స్టాగ్ ఫ్లేషన్ అనే సంకర పదాన్ని స్టాగ్నేషన్ + ఇన్‌ఫ్లేషన్ పదాలుగా విడదీసి అర్థం చేసుకోవాలి. వీటి అర్థం మాంద్యంతో సహా ద్రవ్యోల్బణం కల స్థితి. ఇంకొక రీతిలో వివరించాలంటే, అధిక (లేదా పెరుగుతున్న) నిరుద్యోగిత, అధిక (లేదా పెరుగుతున్న) ద్రవ్యోల్బణంగల ప్రత్యేక స్థితి. ఈ సమస్యను అర్థం చేసుకోవడానికి చేసిన ప్రయత్నం హేతుబద్ధ అంచనాల సిద్ధాంతం అనే నూతన శాఖ ఆవిర్భావానికి దారితీసింది (నిఘంటువు ప్రకారం రాషనల్ అంటే హేతుబద్ధ లేదా కారణాన్ని తెలిపే గుణం లేదా బుద్ధి వంతమైన). మరికొంత వివరంగా తెలపాలంటే కేన్స్‌పరమైన ఫిలిప్స్ రేఖ ప్రచారం చేసిన వైరుధ్య సమస్యను ఖండిస్తూ, ఫ్రీడ్‌మన్ నాయకత్వాన ద్రవ్యవాదుల ప్రతికూల విప్లవం ప్రారంభమైంది. ద్రవ్యవాదుల ఈ ప్రతికూల విప్లవం సహజ నిరుద్యోగిత రేటు భావనను ప్రచారం చేసి, ఫిలిప్స్ రేఖ వృత్తాంతాన్ని ఖండిస్తుంది. స్టాగ్‌ఫ్లేషన్ సమస్య పారిశ్రామికంగా వృద్ధిచెందిన దేశాలలో 1970 సంవత్సరం ప్రాంతాన గుర్తింపబడిన పిదప, ఆ విచిత్ర సమస్య కారణాన్ని శోధించుటకు చేసిన ప్రయత్నం ఒక నూతన శాఖ జననానికి సహకరించింది. ఈ నూతన శాఖను హేతుబద్ధ అంచనాలు అని ఇంకా నూతన సంప్రదాయ స్థూల అర్థ శాస్త్రమని (Neo - Classical Macro Economics) కూడా పరిగణిస్తారు. ఒక విధంగా హేతుబద్ధ అంచనాల సిద్ధాంతం ద్రవ్యవాదుల రెండవ ప్రతికూల విప్లవంగా పేర్కొనవచ్చు. ఈవాదం ద్రవ్యవాదుల సూచనలకు సాధనాలకు కొత్త బలాన్ని ఇస్తుంది. దీనిని ద్రవ్యవాదం యొక్క తీవ్ర రూపాంతరం (radical version) గా పరిగణించవచ్చు. ఈ శాఖ వారు ద్రవ్య వాదుల, సంప్రదాయ వాదుల కొన్ని ప్రధాన భావాలను, పంథాలను పాటించుట వలన ద్రవ్యవాదం యొక్క తీవ్రవాదమనీ, నూతన సంప్రదాయ వాదమని తెలుపవచ్చు.

ఈ నూతన శాఖ ద్రవ్యవాది అయిన ఫ్రీడ్‌మన్ యొక్క కొన్ని విషయాలను అనుకరిస్తుంది, మరి కొన్ని విషయాలలో అతనిని విమర్శిస్తుంది. సంప్రదాయవాదుల ద్వైవిధ్యాన్ని (Classical dichotomy) పున : ప్రతిపాదిస్తుంది. సాంప్రదాయ విశ్లేషణలో ఆర్థిక కార్యకలాపాలు రెండు భాగాలుగా విడదీయబడుతాయి. వాస్తవ, నామ మాత్ర విలువలు, సంప్రదాయ వాదంలో ద్రవ్యం పాత్ర తటస్థంగా (neutrality of money) వర్ణించబడింది. అంటే ద్రవ్యం కేవలం మాధ్యమమనీ, ద్రవ్య సప్లయ్ లోని మార్పులు వాస్తవికాంశాలను ప్రభావితం చేయవని తెలుపబడింది. హేతుబద్ధ అంచనాల ఆర్థికవేత్తలు కూడా పైన తెలిపిన భావాలను సమర్థిస్తారు. వీరిది ఒక రకమైన చలనాత్మక స్టోకాస్టిక్ నమూనా (dynamic stochastic model) అంటే చలన

స్థితిలో అంచనాలు వేసేటప్పుడు తప్పులుండవచ్చునని హేతుబద్ధ అంచనాల సిద్ధాంతం భావిస్తుంది. వ్యక్తులు, ఇతర ఆర్థిక యూనిట్లు సేకరించిన సమాచారం ఆధారంగా గత అనుభవాన్ని పురస్కరించుకుని, చేసిన తప్పులు పునరావృత్తం కాకుండా జాగ్రత్త పడతారనీ, దాని ద్వారా తమ ప్రయోజనాన్ని గరిష్ఠం చేసుకోవడానికి ప్రయత్నిస్తారనీ ఈ నూతన వాదం వివరిస్తుంది. ఒక ఉత్తమ అభిలషణీయ సూత్రంపై ఈ సిద్ధాంతం ఆధారపడి ఉంది. ఈ సూత్రమేమంటే, ప్రజలు భవిష్యత్తు గురించి ఆలోచించేటప్పుడు, క్రమబద్ధమైన (systematic) తప్పులు చేయరు. చూడడానికి ఇంకా సైద్ధాంతికంగా వీరి భావాలు సామాన్యంగా, ఆకర్షణీయంగా కనబడినప్పటికీ, గణాంక సాంఖ్యాకంగా వారి నమూన సంకీర్ణంగా (complex) ఉంటుంది. గణిత శాస్త్రంలో ప్రావీణ్యం లేని వారు దానిని అర్థం చేసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది.

## 13.3 హేతువాద అంచనాల శాఖకు చెందిన ఆర్థిక వేత్తలు

ద్రవ్యవాదుల ప్రతికూల విప్లవాన్ని ప్రారంభించిన వారిని, నూతన సంప్రదాయ శాఖ వారిని హేతువాద అంచనాల శాఖలో చేర్చవచ్చు. వీరు కాకుండా ఈ వాదానికి ముఖ్యులు : జాన్.ఎఫ్.ముల్, ఫిలిప్స్ కాగన్, ఎం. నర్లోవో, రాబర్ట్ లుకాస్, థామస్ సార్జంట్, నీల్ వాలెస్, ఎం.ఎచ్. విల్లెన్ మొదలగువారు. వీరందరి రచనల వల్ల తెలిసేదేమంటే, అంచనాలు ఏవిధంగా రూపొందించబడుతాయో తెలుపకుండా, స్థూల అర్థ శాస్త్రాన్ని సమర్థవంతంగా చర్చించడం సాధ్యపడదు. అంటే స్థూల ఆర్థిక సిద్ధాంతానికి అంచనాల నమూనా (లు) తప్పని సరిగా ఆధారంగా ఉండాలి.

## 13.4 ఊహలు, భవిష్యత్ ఆలోచనలు, ఉజ్జాయింపులు, ఇంకా అంచనాల విభజన- అడాప్టీవ్, హేతువాద అంచనాలు

అనాదిగా ఆర్థిక వేత్తలు కార్యకలాపాల పరిశీలనకు, అధ్యయనానికి తమ విశ్లేషణలో భవిష్యత్ గురించిన ఊహలకు ప్రాముఖ్యం ఇవ్వడం జరిగినట్లు చరిత్ర పుటల నుంచి గమనించవచ్చు. ప్రజలు తమ భవిష్యత్ గురించి శ్రద్ధ వహిస్తారన్న సత్యం అందరికీ తెలుసు. కాబట్టి ఊహించిన, అంచనా వేసిన వాటికి సంబంధించిన ఏదో ఒక నమూనా లేనిదే, స్థూల ఆర్థిక అర్థశాస్త్ర పరిశీలన అర్థవంతంగా ఉండదు. ఇటీవలి 2,3 దశాబ్దాలలో ఈ నమూనాలకు విశేష ప్రచారం లభించినప్పటికీ, అంతకు పూర్వం కూడా ఆర్థిక వేత్తలు ఊహలకు, జరుగవచ్చునన్న భావాలకు, ఉజ్జాయింపులకు (guess) ఆర్థిక విశ్లేషణలో చోటు కల్పించారు. సంప్రదాయ శాఖకు చెందిన డేవిడ్ రికార్డో దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థ స్తబ్దత స్థాయికి చేరుకుంటుందని జోస్యం చెప్పాడు. ఆల్‌ఫ్రెడ్ మార్షల్ ధరల విశ్లేషణలో సమయానికి, భవిష్యత్ సంఘటనలకు ప్రాముఖ్యతనిచ్చాడు. హారడ్, డోమర్ వంటి ఉత్తర కేన్సియన్లు దీర్ఘకాలిక చలన స్థితిలో సంభవించే ఒడుదొడుకులు, మాంద్య నిరుద్యోగిత సంవృద్ధి స్థితులు, సమతౌల్యం గురించి ఊహాగానాలు చేసారు. జె.ఎం. కేన్స్ తన ఉపాంత మూలధన సామర్థ్యం భావనలో, ద్రవ్యత్వాభిరుచి సిద్ధాంతంలో, ప్రధానంగా చట్టా వ్యాపార ద్రవ్య డిమాండ్ విశ్లేషణలో భవిష్యత్‌కు చాలా ప్రాముఖ్యమిచ్చాడు. అయితే వీరందరూ అంచనాల సంబంధిత శాస్త్రీయ నమూనాల రచనలకు కృషి చేయలేదు. అంటే వీరందరూ అంచనాలు, ఊహలు ఏవిధంగా రూపొందించబడతాయో అన్న విషయం గురించి, తార్కిక - శాస్త్రీయ సిద్ధాంతాన్ని లేదా నమూనా రచనకు ప్రయత్నం చేయలేదు. అంచనాలు బాహ్యంగా నిర్ణయించబడుతాయని భావించి, విశ్లేషణలను చేపట్టారు. ఎం.హెచ్. విల్లెన్ ప్రకారం కేన్స్ నమూనాలో అంచనాలు అహేతుకమైనవి (irrational ). బాహ్యంగా కాకుండా,

BRAOU

అంచనాల నిర్ణయం అంతరంగికంగా భావించి ద్రవ్యోల్బణాన్ని ప్రభుత్వ విధాన ఫలితాలను హేతుబద్ధ అంచనాల సైద్ధాంతికులు విశ్లేషిస్తారు.

అంచనాల నమూనాలు (expectations models) స్థూలంగా రెండు రకాలు - అడాప్టీవ్, హేతుబద్ధ (adoptive & rational) అంచనాలు.

### 13.4.1 అడాప్టీవ్ అంచనాల నమూనా

మొదట దీనిని 1956, 1958 సంవత్సరంలో వరుసగా, పి.కాగన్, ఎం.నర్లోవ్ లు ప్రతిపాదించారు. నిఘంటువు ప్రకారం అడాప్టీవ్ (adoptive) అంటే ఒకటి ఇతరులతో సర్దుబాటు కావడం లేదా ఉచిత రీతిలో సవరించబడడం. ఈ నమూనాను తప్పుల అధ్యయన పరికల్పన (Error - Learning Hypothesis) అని కూడా తెలుపడం జరిగింది. దీని ప్రకారం, వ్యక్తులు చారిత్రక అంటే భూతకాలంలో గమనించిన ద్రవ్యోల్బణ రేట్లకు భారితాల (weights) నిచ్చి భవిష్యత్ ద్రవ్యోల్బణం గురించి ఊహలు ఏర్పరచుకొంటారు. అంటే ప్రజలు యాంత్రికంగా భూతకాల అనుభవాలను భవిష్యత్‌కు అనువర్తింపజేస్తారు.

ఈ పరికల్పన ప్రకారం, రాబోయే సంవత్సరంలో ద్రవ్యోల్బణం గురించిన అంచనా గత అనుభవంపై అంటే భూతకాలంలో (క్రితం 10, 15 సంవత్సరాలలో) గమనించిన ద్రవ్యోల్బణం రేట్లపై ఆధారపడి ఉంటుంది. గతంలోని ఇటీవల సంవత్సరాల ద్రవ్యోల్బణ రేట్లకు ఎక్కువ భారితాన్ని, అంతకు ముందున్న సంవత్సరాలకు తిరోగామిగా తక్కువ భారితాలనిచ్చి, సగటు(భారిత) ద్రవ్యోల్బణాన్ని లెక్కించి, రాబోయే సంవత్సరాలలో ఉండబోయే ద్రవ్యోల్బణ రేటును అంచనా వేస్తారు. ఇట్లా గత అనుభవ ఆధారంగా అంచనా వేసిన భవిష్యత్ రేట్లు తప్పు అని తెలిసిన పిదప వాటిని కాలానుగుణంగా సవరిస్తారు. ఈ పరికల్పన ప్రకారం, ఆర్థిక ఏజంట్లు కాల విలంబనతో జరిగిన తప్పులను దిద్దుకుంటారు. ఫ్రీడ్‌మన్ మొదట ఈ పరికల్పన ఆధారంగా తాత్కాలిక అసమతౌల్యాన్ని ప్రతిపాదించాడు.

ఈ పరికల్పనపై గల ఒక విమర్శను తెలుసుకుందాం. ప్రజలు భూతకాల అనుభవాన్నే కాకుండా, వర్తమాన సమాచారానికి కూడా ప్రాముఖ్యమిస్తారు. భవిష్యత్ గురించి ప్రత్యక్షంగా కూడా విచారిస్తారు. ఈ పరికల్పన భూత, భవిష్యత్ కాలాల సమష్టి చలాంకాల మధ్య స్థిర సంబంధం కలదని భావిస్తుంది. స్థిర సంబంధం లేనప్పుడు పరికల్పన తెలిపే సమాధానాలు దోషయుక్తంగా ఉంటాయి.

### 13.4.2 హేతుబద్ధ అంచనాల పరికల్పన ( సిద్ధాంతం)

దీనిని మొదట 1961లో జాన్. ఎఫ్. ముత్ చలనాత్మక స్టోకాస్టిక్ నమూనా రూపంలో ప్రతిపాదించాడు. ప్రకటించిన పిదప 10 సంవత్సరాల వరకు దానిని ఆర్థికవేత్తలు పట్టించుకోలేదు. 1960 దశాబ్దం చివరి భాగంలో ఫ్రీడ్‌మన్ తన " సహజ నిరుద్యోగిత " భావన ద్వారా, ఇంకా ఇ. ఫేల్ప్స్ తన " సమతౌల్య సంపూర్ణ ఉద్యోగిత రేటు " ద్వారా ఫిలిప్స్ రేఖా వృత్తాంతాన్ని ఖండించినప్పటినుంచి, ఆర్థిక చర్చలలో అంచనాలకు ముఖ్య స్థానం లభించింది. ముత్ తర్వాత లుకాస్, సార్జంట్, వాలెస్ మొదలగు వారు మరికొన్ని వివరాలతో హేతువాద అంచనాల ప్రతిపాదనను వృద్ధి పరచి దానికి సిద్ధాంత హోదా కల్పించారు. ఈ నూతన శాఖ కేన్స్ తన కాలంలో ఆకర్షించిన విధంగా, యువకులపై ఎక్కువ ప్రభావాన్ని చూపింది. నూతన సంప్రదాయ (New Classical if not " Neo" Classical) ఆర్థిక వేత్తలు అడాప్టీవ్ అంచనాల పరికల్పనను ముత్ హేతువాద పరికల్పన ద్వారా ప్రతిస్థాపన (substitute) చేశారు.

B R A O U

1973లో ప్రకటించబడిన లూకాస్ వ్యాసం, నూతన సంప్రదాయ అర్థశాస్త్రానికి జన్మనిచ్చింది. సైద్ధాంతిక ఇంకా వ్యవహారిక (empirical) స్థూల ఆర్థిక విశ్లేషణ మౌలికాంశాలను పున : పరిశీలించవలసిన అవసరాన్ని, ఈ నూతన శాఖ నొక్కి చెపుతుంది. 1970 ప్రాంతంలో అర్థశాస్త్ర పరిశోధనలలో ఈ పరికల్పన ప్రధానాంశంగా మారింది. ముతక రూపంలో ప్రతిపాదించబడిన ఆడాప్టీవ్ పరికల్పన హేతుబద్ధ అంచనాల పరికల్పనలలో ఒక అంతర్భాగం. హేతువాద అంచనాలు చేసేవారు అన్ని రకాల సమాచారాలను, అంటే భూత, వర్తమాన సమాచారాలను, సంభవించగల భవిష్యత్ మార్పులను లెక్కలోనికి తీసుకుంటారు. సమీకరణ రూపంలో ఈ వివరాలను కుదించవచ్చు.

హేతువాద అంచనాల పరికల్పన = ఆడాప్టీవ్ పరికల్పన + ఆర్థిక వ్యవస్థ పరిణామ సమాచారం + ప్రజలకు తెలిసిన సమాచారంపై ప్రభుత్వ ప్రతిచర్య (feed back).

పాల్‌గ్రేవ్ నిఘంటువు ప్రకారం, హేతువాద అంచనాల పరికల్పన ఒక సమతౌల్య భావన. స్వయం సంప్రదింపు (self - reference) అంశాలుగల చలన ఆర్థిక నమూనాలకు దీనిని వర్తింపచేయవచ్చు. అంటే నమూనాలోని ఆర్థిక ఏజంట్లు భావించిన చలాంకాల భవిష్యత్ విలువల అంచనాలు, అంతరంగిక చలాంకాలను మార్పు చేస్తాయి. ఊహించిన అంచనాలు భవిష్యత్ ఫలితాలను ప్రభావితం చేస్తాయని, తిరిగి వాస్తవంగా గమనించిన పరిణామాలు భవిష్యత్ అంచనాలను మార్చవచ్చని ఈ నమూనా తెలుపడం జరిగింది. ఇట్లా ప్రతిచర్య (feed back) ప్రక్రియను వివరించి, నిరంతరం మారే అంచనాలను, ప్రభుత్వ విధానాలపై వాటి ప్రభావాన్ని హేతువాద అంచనాల సిద్ధాంతం వివరిస్తుంది.

హేతువాద అంచనాల శాఖవారు ఫ్రీడ్‌మన్ ప్రతిపాదించిన కొన్ని భావాలను అనుకరిస్తారని, మరి కొన్నింటిని విమర్శిస్తారని క్రితం తెలుసుకున్నాం. ఫ్రీడ్‌మన్ ప్రచారం చేసిన మార్కెటు క్లియరింగ్ భావన, సరళ ధరలు, వాస్తవాంకాలపై ద్రవ్యం ప్రభావం శూన్యమన్న విషయాలను హేతువాద అంచనాల వారు అంగీకరిస్తారు. ఆడాప్టీవ్ అంచనాల పరికల్పనను ఫ్రీడ్‌మన్ సమర్థించినందుకు, అతనిని వీరు విందించారు. ఫ్రీడ్‌మన్ తన నమూనాలో ప్రభుత్వానికి ఇచ్చిన ప్రాముఖ్యం కన్నా తక్కువ స్థాయిని వీరు కల్పిస్తారు. క్రమబద్ధ ప్రభుత్వ విధానం మార్కెటు ఏజంట్లకు కనీసం తాత్కాలికంగా పెడత్రోవ చూపించే అవకాశం ఫ్రీడ్‌మన్ నమూనాలో కలదు. కానీ హేతువాద అంచనాల వారి ప్రకారం, ప్రభుత్వ క్రమబద్ధ విధానాలు స్వల్పకాలంలో కూడా వాస్తవ కారకాలను ప్రభావితం చేయజాలవు. దీనికి కారణమేమిటే, హేతుబద్ధంగా నిర్ణయాలు తీసుకునేవారు, ప్రభుత్వం క్రమబద్ధంగా తలపెట్టే విధానాలను ఇదివరకే గుర్తించి, తగు విధంగా ప్రతిచర్య తీసుకుని ఉంటారు.

## 13.5 ఆడాప్టీవ్, హేతువాద అంచనాల పరికల్పనల మధ్యగల భేదాలు - రేఖా చిత్రాల ద్వారా వివరణ

ఆడాప్టీవ్, హేతువాద అంచనాల పరికల్పనలు రెండు కూడా ప్రధానంగా ద్రవ్యోల్బణం, ద్రవ్య సప్లయ్ ప్రభావాల గురించి తెలుపుతాయి. ఇంతకు క్రితం తెలిపిన ప్రకారం, ఆడాప్టీవ్ పరికల్పన కేవలం భూతకాల వర్తమానంపై ఆధారపడగా, హేతువాద అంచనాల పరికల్పన వివిధ రకాల, కాలాల సమాచారాన్ని ఆర్థిక యూనిట్లు ప్రోగు చేసి, ఉపయోగించుకొంటాయని భావిస్తుంది. మొదటి దాని ప్రకారం ధరలు మందకొడిగా , రెండవ దాని ప్రకారం త్వరితంగా సర్దుబాటు చేసుకుంటాయి. మొదటి పరికల్పన ప్రకారం ప్రజలు సాధారణ ధరలను (general prices ) అంటే అన్ని వస్తువుల సగటు ధరలను బట్టి నిర్ణయాలను మార్పు

BRAOU

చేసుకుంటారు. రెండవ దాని ప్రకారం, ప్రజలు సాధారణ ధరల మార్పులకు ప్రాముఖ్యమివ్వక, సాపేక్ష లేదా స్థానిక ధరలను (సాపేక్షికంగా తమ వస్తువుల ధరలలో మార్పులను) బట్టి సరిదిద్దుకుంటారు. మరొక ప్రధాన భేదాన్ని పరిశీలించుదాం. మొదటి దాని ప్రకారం క్రమబద్ధ దోషాలకు (errors) తావు కలదు. రెండవ దాని ప్రకారం, హేతువాదులు క్రమబద్ధంగా తప్పులు చేయరని (అంటే గమనించిన తప్పు, మళ్ళీ పునరావృతం జరుగదు), కానీ క్రమరహిత లేదా యాదృచ్ఛిక (random) తప్పులు చేసే సంభావ్యత కలదని అంగీకరిస్తుంది. కింద చిత్రించిన రెండు రేఖా చిత్రపటాలు (13.1, 13.2) ఈ విషయాన్ని సులభశైలిలో తెలుపుతాయి.

ఆడాప్టివ్ పరికల్పన



పటం - 13.1 : క్రమబద్ధ దోషాలు

హేతువాద అంచనాల పరికల్పన



పటం - 13.2 : యాదృచ్ఛిక దోషాలు

ఆడాప్టివ్ అంచనాల పరికల్పనను సులభంగా అర్థం చేసుకోవడానికి, రేపటి ద్రవ్యోల్బణం రేటు నిన్నటి ద్రవ్యోల్బణం రేటుకు సమానమని భావించుదాం. అంటే గత 10, 15 సంవత్సరాలుగా గుర్తించిన వివిధ ద్రవ్యోల్బణ రేట్లను ఉపేక్షించి, కేవలం ఇటీవలి గత సంవత్సరాలలోని ద్రవ్యోల్బణ రేటుకు మాత్రమే 100% భారితానిచ్చి, మిగతా సంవత్సరాలకు శూన్య భారితం ఇవ్వడమని గమనించాలి. గీయబడిన రెండు రేఖా చిత్రాలు నిరవధికంగా పురోగామిగా పెరుగుతున్న ధరలను ప్రతిబింబిస్తాయి.

ఆడాప్టివ్ అంచనాల ప్రకారం, ఇవ్వబడిన (పెరుగుతున్న ధరల) స్థితిలో, అన్ని కాలాల్లో, వాస్తవంగా గమనించిన ద్రవ్యోల్బణ రేట్లు అంచనా ద్రవ్యోల్బణ రేట్ల భిన్నంగా ఉన్నాయి. ఇంతే కాకుండా క్రమబద్ధంగా తప్పుడు అంచనాలు వేయబడినాయి. అన్ని కాలాల్లో అంచనా ద్రవ్యోల్బణం చారిత్రక ద్రవ్యోల్బణానికన్న తక్కువ ఉన్నట్లు మొదటి రేఖా చిత్రం స్పష్టం చేస్తుంది. ఇట్లా తప్పులు నిరంతరంగా దొర్లడానికి కారణమేమంటే, ఆడాప్టివ్ పరికల్పనలో ధరలలోని ఆకస్మిక హెచ్చు తగ్గులను లేదా వేతనాల పెద్ద స్థాయి పెరుగుదలను ఉపేక్షించడం. హేతువాద అంచనాల వారి ప్రక్రియలో కూడా వాస్తవ, అంచనా ద్రవ్యోల్బణ రేట్లు అన్ని సందర్భాలలో ఏకీభవించక పోవచ్చు. కానీ క్రమబద్ధ దోషాలు కనబడవు. అంచనాలు వాస్తవ రేట్లకు సమానంగా, ఎక్కువగా, తక్కువగా ఉండవచ్చు. రెండవ రేఖా చిత్రం క్రమబద్ధం గాని కొన్ని తప్పు అంచనాలను అంటే యాదృచ్ఛిక దోషాలను వ్యక్తం చేస్తుంది. ఒకవేళ క్రమబద్ధ తప్పు అంచనాలు వేయబడినచో, అందుబాటులో

వున్న పెక్కు రకాల సమాచారం ఆధారంగా, సాపేక్షికంగా , ఖచ్చితమైన అంచనాలు వేసుకుని, తప్పులను సవరించుకోవడానికి హేతువాదులు ప్రయత్నిస్తారు. హేతువాద అంచనాలు వేసే వారికి సంపూర్ణంగా భవిష్యత్తు సంఘటనలు తెలిసి ఉంటాయని భావించడం సత్యం కాదు. వారు కూడా తప్పులు చేస్తారు. కానీ చేసిన తప్పులు తిరిగి చేయరు. ఒకవేళ విధానాలలోని మార్పులను వారు వెనువెంటనే గమనించకపోతే, విధానాల ప్రభావం వాస్తవ అంశాలపై ఉండవచ్చు. ఇట్లా విధానాలలో కలిగే, కలుగుతాయని భావించే మార్పులను సాధారణంగా హేతువాదులు విస్మరించరు. ఇట్లా హేతువాద అంచనాలు ఒక ఉత్తమ అభిలషణీయ సూత్రంపై ఆధారపడి ఉన్నాయి. ఆ సూత్రమేమనగా, " భవిష్యత్ అంచనాలు వేసేటప్పుడు, హేతువాద వ్యక్తులు క్రమబద్ధ దోషాలకు గురికారు. తప్పుల అధ్యయనం (error-learning) ద్వారా తిరిగి వాటిని చేయకుండా వివిధరకాల సమాచారం ఆధారంగా జాగ్రత్త పడతారు, తద్వారా ప్రయోజనాన్ని గరిష్ఠం చేసుకుంటారు.

## 13.6 విధాన సాధనాల బలహీనత ప్రతిపాదన, పలహోలు

హేతువాద అంచనాల సిద్ధాంతకర్తల ప్రకారం, ఎడ తెరిపి లేకుండా సమాచారాన్నిచ్చే వాల్రాసియన్ ప్రకటనదారుడు (Walrasian auctineer) లేకున్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థ సమతౌల్య స్థితి వైపు పయనిస్తూ, వృద్ధి చెందుతుంది. ప్రభుత్వ క్రియాశీలక జోక్యం అనవసరమని తెలుపుతూ, కేన్సియన్ స్థూల ఆర్థిక విధానాన్ని విమర్శిస్తుంది. ప్రజలకు స్వేచ్ఛగా, పుష్కలంగా సమాచారం సమకూరినప్పుడు, ఆర్థిక వ్యవస్థ పై ద్రవ్య ప్రభావం చాలా అనుమానస్పదం. వీరి నమూనాలలో ధరల గురించిన ఊహలు ముందుగా నిర్ణయించబడినవి కావు, స్థిరమైనవి కావు. ద్రవ్య సప్లయ్, ఇతర విధానాల మార్పులకు అనుగుణంగా ధరలు సవరించబడుతాయి. ద్రవ్య సప్లయ్ లోని ఊహించని మార్పులు మాత్రమే ఉత్పత్తిని తాత్కాలికంగా మార్చవచ్చు. ద్రవ్య సప్లయ్‌లోని అంచనా వేయవీలుగల మార్పులు ఉత్పత్తిని మార్చజాలవు, ధరలను మాత్రమే ప్రధానంగా మార్చుతాయి. సంపూర్ణోద్యోగితా స్థాయి ప్రాంతంలో ఉత్పత్తి హెచ్చుతగ్గులతో కొనసాగుతుంది.

హేతువాదుల ప్రకారం, ప్రభుత్వం తన విధానాల ద్వారా ప్రజలను శాశ్వతంగా, మోసపుచ్చ (fool) జాలదు. మొదట పరిమిత లేదా అసంపూర్ణ సమాచారం వల్ల అంచనా దోషాలు దొర్లవచ్చు. కాని, అవి పునరావృతం కావు. అనుభవం ప్రకారం ద్రవ్యోల్బణాన్ని ప్రభావితం చేసే క్రమబద్ధ అంశాలన్నీ తెలిసిన సమాచారంగా మారుతాయి. కాబట్టి ప్రభుత్వ క్రమబద్ధ చర్యలు, ఇంకా అంచనా వేయుటకు వీలుకల సంభావ్య విధాన మార్పులు, స్వల్ప కాలంలో కూడా వాస్తవ అంశాలను మార్పు చేయజాలవు. డిమాండ్ నియంత్రణ వాస్తవ చలాంకాలను ప్రభావితం చేయదు. అది పనికిరాని సాధనమని తెలిపారు.

దీర్ఘకాలంలో కోశ విధానానికి కొంత ప్రభావం ఉంటుందని వారు అంగీకరిస్తారు. క్రమబద్ధం కాని ద్రవ్యకోశ విధానాల వల్ల అనిశ్చిత అధికమై ఆర్థిక వ్యవస్థ ఒడుదొడుకులకు గురి అవుతుంది. కాబట్టి విధానాలలోని మార్పులు సాధ్యమైనంత వరకు లెక్కించడానికి వీలుగా ఉండాలి. ఈ పలహా ఆధారంగా వారు ద్రవ్య వాదుల మానిటరీ టార్గెటింగ్ (నిశ్చిత ద్రవ్య సప్లయ్ వృద్ధి రేటు) ను సమర్థిస్తారు. స్వల్పకాలంలో క్రమబద్ధ కోశ విధానం ఉత్పత్తి ఉద్యోగిత స్థాయిలను మార్చజాలదు. స్థిరీకరణ విధానాల ప్రభావం అడాప్టివ్ అంచనాల స్థితిలో ఉండవచ్చు. హేతు వాద అంచనాల స్థితిలో వాటికి ప్రభావం ఉండదని తెలిపారు. హేతువాదుల ఈ సమాచారాన్ని "పరివర్తన రహిత (invariance) ప్రతిపాదన " గా వ్యవహారంలో కలదు. 1976లో

BRAOU

సార్జంట్, లూకాస్‌లు దీనికి సంబంధించిన నమూనామ రూపకల్పన చేసారు. మరికొన్ని వివరాలతో ఈ ప్రతిపాదనను రాబోయే పుటలలో చర్చించడం జరిగింది.

ద్రవ్యవాదులు శోధిస్తున్న ప్రమేయాలు హేతువాద అంచనాల సిద్ధాంతంలో తార్కికంగా నమోదు చేయబడినాయి. ద్రవ్య వాదులు మార్కెటు క్లియరింగ్ భావనను విశ్వసిస్తారు. అట్లాంటి స్థితిలో ద్రవ్యవాదులు యాదృచ్ఛికంగా విశ్వసించిన (intensitive beliefs) పరిణామాలను, హేతువాద సిద్ధాంతం చక్కని శాస్త్రీయ పద్ధతి ద్వారా నిరూపిస్తుంది. ద్రవ్యవాదులవలె హేతువాదులు కూడా ఫిలిప్స్ రేఖ వృత్తాంతాన్ని సవాలు చేసారు. నిరుద్యోగిత ద్రవ్యోల్బణాల మధ్య తప్పుగా భావించిన " కఠోర ఎంపిక సమస్య " లేదని (no cruel choice) తెలుపుతుంది. ఇవన్నీ ద్రవ్య వాదులు క్రితం తెలిపినప్పటికీ శాస్త్రీయంగా వాటిని తెలుపలేకపోయారు.

## 13.7 పరివర్తన రహిత లేదా ఇన్‌వేరియన్స్ ప్రతిపాదన : లుకాస్ - సార్జెంటుల (సప్లయ్) ప్రమేయం

పరివర్తన రహిత ప్రమేయాన్ని కొందరు లుకాస్ సప్లయ్ ప్రమేయమని లేదా లుకాస్ సమీకరణం అని, మరికొందరు ఎల్.ఎస్.డబ్లు (Lucas - Sargent -Wallace) సిద్ధాంతమని పేర్కొంటారు. ఇంతకుముందు తెలిపిన ప్రకారం అంచనా వేయుటకు వీలుగల ద్రవ్య సప్లయ్ లోని (ఇంకా ఇతర విధానాలలోని) మార్పులు వాస్తవికాంశాలపై ఎట్టి ప్రభావం చూపజాలవు. కారణమేమంటే విధాన మార్పుల కనుగుణంగా ధరలు సవరించబడి వాస్తవ ఉత్పత్తి (సప్లయ్) లోని మార్పులు సహజ లేదా సంపూర్ణోద్యోగితా స్థాయి ఉత్పత్తికి సమానమవుతుంది. ఫలితంగా ప్రభుత్వ విధానాల పరిణామం శూన్యమవుతుంది. ఈ విషయాన్ని లుకాస్ సప్లయ్ ప్రమేయం (సమీకరణం) ద్వారా సూచించవచ్చు. క్రింది సమీకరణంలోని చలాంకాలన్నీ లాగరితం విలువలలో వారు తెలిపినప్పటికీ సౌకర్యానికై చలాంకాలను ముందు లాగ్ పదం మలిపి వేయడం జరిగింది.

$$\theta_t - \theta_n = f\left(\wp_t + \frac{e}{\wp_t}\right) \qquad \ldots I$$

ఇచ్చుట $\theta_t$, $\theta_n$ లు వాస్తవ, సహజ నిరుద్యోగితా స్థాయి ఉత్పత్తులను వరుసగా తెలుపుతాయి.

$f$ = ప్రమేయం

$\wp_t$ = వాస్తవ ధరల స్థాయి

$\frac{e}{\wp_t}$ = అంచనా ధరల స్థాయి

I వ సమీకరణాన్ని క్రింది విధంగా కూడా తెలుపవచ్చు.

$$Y_t = Y_p + \beta\left(\wp_t - {}_{t-1}\wp_t^e c\right) \qquad \ldots II$$

లేదా

$$Y_t = Y_n + \alpha_1\left(\wp_t - {}_{t-1}\wp_t^e\right) + \Sigma_{it} \qquad \ldots III$$

ఇచ్చుట $\alpha_1$ > శూన్యమని భావించారు.

Yt = వాస్తవ లేదా నిజంగా ఏర్పడిన ఉత్పత్తి,

Yp లేదా Yn = సంపూర్ణోద్యోగితా స్థాయి లేదా స్థాపిత స్థోమత (capacity) స్థాయి ఉత్పత్తి లేదా సహజ ఉత్పత్తి,

$\beta$ లేదా $\alpha_1$ = ధనాత్మక గుణకం లేదా పరామితి,

$\Sigma_{it}$ = సగటు విలువ శూన్యంగా గల, సహ సంబంధం లేని యాదృచ్ఛిక దోష చలాంకం (serially uncorrelated random disturbance, with zero mean value),

$\wp$ = ధర, ద్రవ్యోల్బణ స్థాయి,

t = ఇవ్వబడిన ఒక సమయం,

t -1 = ఇవ్వబడిన సంవత్సరానికి ఒక సంవత్సరం ముందు

e = అంచనా వేసిన (expect) .

I వ సమీకరణం ఆధారంగా లూకాస్ తెలిపేదేమంటే, వాస్తవ అంచనా ధరల స్థాయిలు హేతువాదుల పరికల్పనలో సమానంగా ఉంటాయి $\left(\wp_t = \frac{e}{\wp_t}\right)$ కాబట్టి వాస్తవ, సహజ ఉత్పత్తులు కూడా సమానం ($\theta_t = \theta_n$). పర్యవసానంగా ద్రవ్య సప్లయ్ పెరిగినపుడు సహజ ఉత్పత్తి నుంచి వాస్తవ ఉత్పత్తి వైదొలగకుండా ఉంటుంది. ప్రభుత్వ విధానాలు (ముఖ్యంగా ద్రవ్య విధానం) అంచనా ధరలను వాస్తవ ధరలకు భిన్నంగా మార్చగలిగినప్పుడు, ఉత్పత్తి ఉద్యోగితలు మార్పు చెందవచ్చు. ప్రభుత్వం ఇట్లాంటి మార్పులను తాత్కాలికంగా మాత్రమే చేయవచ్చు. ఉదా ॥ శ్రామికులు పెరిగిన ధరలను కొంతకాలం ఉపేక్షించి వేతనాలు పెరిగాయన్న భ్రమకలిగి, శ్రామిక సప్లయ్ పెంచుతారు. దీనివల్ల వాస్తవికంగా సాధించబడిన ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. సహజ నిరుద్యోగిత కన్నా వాస్తవ నిరుద్యోగిత తక్కువగా ఉంటుంది. కానీ హేతువాదుల ప్రకారం $e/\wp_t, \wp_t$ తో ఏకీభవిస్తాయి. కాబట్టి ఒకవేళ వాస్తవ ధరలు పెరిగితే అంచనా ధరలు కూడా పెరుగుతాయి. దీనివల్ల ద్రవ్య సప్లయ్ పెరిగినప్పుడు వాస్తవ ఉత్పత్తి, సహజ ఉత్పత్తికి భిన్నంగా ఉండదు. అంటే $\wp_t = \frac{e}{\wp_t}$ ఉన్నప్పుడు $\theta_t = \theta_n$ .

II,III సమీకరణాలు కూడా పైన తెలిపిన విధంగా కొద్ది మార్పులతో తెలుపుతాయి. $\wp t$ అంటే ఇవ్వబడిన ఉదా ॥ 1994 సంవత్సరంలోని ధరలు $_{t-1}\wp^{e}_{t}$ అంటే 1993 సంవత్సరంలో (t-1) ప్రజలు నివసిస్తూ రాబోయే 1994 (t) సంవత్సరం గురించి ఊహించిన ధరలు. అంటే t గురించిన అంచనాలు t-1 సంవత్సరంలోనే వేయబడినాయి. ఒకవేళ అనుకున్న ధరలు నిజమైనప్పుడు $Y_t = Y_p$ లేదా $Y_t = Y_n$ . హేతువాద అంచనాల సైద్ధాంతికుల ప్రకారం t-1 సమయంలో ఊహించజాలని యాదృచ్ఛిక కారణాల వల్ల మాత్రమే $Y_t$, $Y_n$ (లేదా $Y_p$) లు భిన్నంగా ఉంటాయి. ఒకవేళ అనుకొన్న ధరలకన్న వాస్తవ ధరలు అధికంగా ఉన్నచో, పెరిగిన ధరలలోని కొంతభాగం, సాపేక్ష ధరల పెరుగుదలగా (అంటే తమ వస్తువుల ధర ఇతర వస్తువులకన్న అధికంగా పెరిగాయని) భావించి, ఉత్పత్తిని (సహజ స్థాయి మించి) పెంచుతారు. దీనికి విరుద్ధంగా భావించిన ధరలు వాస్తవ ధరల కన్న తక్కువగా ఉన్నప్పుడు, తగ్గిన ధరలలోని కొంత భాగం, తమ వస్తువుల సాపేక్ష ధరల తగ్గుదలగా భావించి, ఉత్పత్తి స్థాయిని (సహజ స్థాయి కన్నా) తగ్గిస్తారు.

ధరలు పెరిగినప్పుడు, ఆ పెరుగుదల సాధారణ ధరలలోనా లేదా సాపేక్ష ధరలలోనా అన్న నిజం ఉద్యమ దారులకు కొంతకాలం వరకు తెలియదు. డిమాండ్ మార్పులో మార్పులవల్ల సాపేక్ష ధరలు మారతాయని ఫ్రీడ్‌మన్ భావించాడు. లుకాస్ విభేదించిన ధరల స్థాయి మార్పు, స్థానిక లేదా సాపేక్ష ధరల మార్పును 1977లో ఫ్రీడ్‌మన్ అనుకరించి తన సహజ నిరుద్యోగిత భావనను, ద్రవ్యసప్లయ్‌కి తటస్థ పాత్రను సమర్థించాడు.

## 13.8 విశ్లేషణాత్మక విమర్శ

హేతువాద అంచనాల సిద్ధాంతం యొక్క ప్రధాన భావన సాధారణంగా కనబడుతూ అందరికీ తెలిసిన అందరూ దైనందిన జీవితంలో అమలు చేస్తున్న ఊహలపై పలురకాల విమర్శలు కలవు. అంచనాలు ఏ మేరకు ద్రవ్యోల్బణాన్ని ప్రభావితం చేస్తాయి, ఏ యంత్రాంగం ద్వారా అంచనాలు వేయబడతాయి, ఎట్లా సవరించబడతాయి అన్న సమస్యలపై ఏకాభిప్రాయం లేదు, స్పష్టంగా సమాధానాలివ్వబడలేదు. ఆర్థిక ఏజంట్లు పెక్కు సంఖ్యలో ఉంటారు. కాబట్టి స్థూల స్థాయిలో ఏ వ్యక్తి, ఏ సమూహం అంచనాలు గణించాలి అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఒక వ్యక్తి మరొక వ్యక్తి తెలివి, సందర్భం కలిగి వున్న ప్రోగు చేయగలిగే సమాచారాలు ఒకేవిధంగా ఉండవు. స్థూల వ్యవస్థకు అనువర్తింప చేయడానికి వ్యక్తిగత అంచనాలకు భారితాలివ్వాలి. కానీ ప్రశ్న ఏమంటే భారితాలకు ఏ ప్రాతిపదికలు ఉపయుక్తం ? ఇంతేకాకుండా ప్రతివ్యక్తి కావలసినంత సమాచారాన్ని సేకరించడం నిశుల్కంగా ఉండదు, నిశుల్కంగా ఉన్ననూ దానిని అర్థం చేసుకునే శక్తి అందరికీ ఉండదు. కాబట్టి ప్రజలు హేతుబద్ధులుగా నిర్ణయాలు తీసుకుంటారని, విధానాలను నిర్వీర్యం చేస్తాయని తెలుపడం శాస్త్రీయంగా కనబడదు. సమాచార లోపం లేదా సమాచారాన్ని ఉచిత రీతిలో అవగాహన చేసుకోనప్పుడు, దోషయుక్త అంచనాల వల్ల మార్కెట్లు సాఫీగా కొనసాగక నిజమైన అంటే అనైచ్ఛిక (involuntary) నిరుద్యోగిత ఏర్పడవచ్చు. సైద్ధాంతికంగా, కనీసం స్వల్ప కాలంలో సహజ నిరుద్యోగిత భావనను సవాలు చేసి, స్థూల ఆర్థిక విధానాలకు పాత్ర నివ్వవచ్చు.

ప్రారంభంలో తెలిపిన ప్రకారం హేతువాద అంచనాల సిద్ధాంతం ద్రవ్యవాదం యొక్క ఒక తీవ్ర రూపాంతరం. కాబట్టి ద్రవ్య వాదంపై గల విమర్శలను దీనికి వర్తింపజేయవచ్చు. ద్రవ్యవాదం భావించే మార్కెటు క్లియరింగ్ వాదం ఈ సిద్ధాంతానికి పట్టుకొమ్మ. నిజంగా వివిధ మార్కెట్లు అన్ని స్థితులలో ప్రభుత్వ జోక్యం లేకుండా సప్లయ్, డిమాండులను సమతౌల్యం చేసుకొనగలవా ? ఇది వివాదస్పదమైన ప్రశ్న. ద్రవ్యవాదులవలె హేతువాదులు ప్రభుత్వానికి తక్కువ స్థానం కల్పిస్తారు. స్వయంచాలకంగా ఆర్థిక వ్యవస్థ పనిచేస్తూ సంపూర్ణోద్యోగితతో సమతౌల్యంలో ఉంటుందని భావిస్తారు. చారిత్రక సత్యాలు వీరి సమాధానాలకు విరుద్ధం. ద్రవ్యోల్బణానికి కారణం కేవలం ద్రవ్య సప్లయ్ అన్న వాదనను పెక్కువ ఆర్థిక వేత్తలు సమర్థించరు. ఆర్.ఎఫ్.ఖాన్, జె.ఎం.కేన్స్, ఎఫ్. మాచ్లప్‌లు ద్రవ్యంలోని పెరుగుదల ద్రవ్యోల్బణానికి కారణం కాదని, ద్రవ్య సప్లయ్ పెరుగుదల ఆవశ్యక నియమం మాత్రమేనని, ఆవశ్యక మరియు పర్యాపక (necessary & sufficient) నియమం కాదని తెలిపారు. ధరల స్థాయి నిర్ణయం ఒక సంకీర్ణ ప్రక్రియ, బహుముఖ దృగ్విషయం. కాబట్టి, ద్రవ్య సప్లయ్‌తో పాటు, ఇతర పెక్కు కారకాలు ద్రవ్యోల్బణాన్ని నిర్ణయిస్తాయి. హేతువాదులు భావించిన ద్రవ్య కోశ విధానాలు నిజంగా అసమర్థమైనవి కావు. వాటికి ఆర్థిక వ్యవస్థ ప్రగతి పథంలో స్థానం కలదు.

హేతువాద అంచనాల సిద్ధాంతం లేదా నూతన సంప్రదాయ అర్థశాస్త్రంపై ప్రధానంగా రెండు రకాల

విమర్శలు కలవు. (a) హేతువాదం వాస్తవ ప్రవర్తనను సముచితంగా (plausible) తెలుపదని కొందరు విమర్శించారు. ఇతరులకు ఈ సిద్ధాంతం ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, మార్కెటు క్లియరింగ్ నేపథ్యంలో ఈ సిద్ధాంతం తెలిపే పరిణామాలు విరుద్ధంగా కనబడతాయి.

హేతువాదులు విరివిగా ఎకనామెట్రిక్స్ నమూనాలను ఉపయోగిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ గమనాన్ని వివరంగా తెలుపడానికి, సమాధానాలను పొందడానికి గణిత శాస్త్ర జ్ఞానం అవసరం. ఈ శాస్త్రంలో ప్రవేశం లేనివారికి, వారి నమూనాలు అర్థం కావు. భవిష్యత్ అంచనాలు హేతుబద్ధంగా ఉన్నప్పటికీ, విధాన మూల్యాంకనానికి ఎకనామెట్రిక్స్, ఇతర సాంఖ్యక - వ్యావహారిక పద్ధతులు వాడినప్పుడు తెలిపే విషయాలు తప్పు ఫలితాలకు గురి అవుతాయి. విధానాలలో నిరంతరం కలగే మార్పులను ఎకనామెట్రిక్స్ అభ్యాసాలు / నమూనాలు గమనించక సవరణలు చేయబడినప్పుడు, తీసుకోబోయే నిర్ణయాలకు ఈ అభ్యాసాలు తోడ్పడవు, హాని కలుగుతుంది.

ద్రవ్య వాదులతో సహా హేతువాదులు క్రమబద్ధ ఇంకా ప్రచారం చేయబడిన విధానాలకు అమలు చేయాలనీ, అట్లా చేస్తే ఆర్థిక ఏజంట్లు హేతుబద్ధంగా నిర్ణయాలు తీసుకుంటారని, విధానాల ఫలితం వాస్తవాంశాలపై ఉండదని తెలిపారు. క్రమబద్ధంకాని, ఊహించుటకు వీలులేని (non - predictable) విధానాలు అమలు చేస్తే వాస్తవ ఉత్పత్తి - ఉద్యోగితలు ప్రభావితమవుతాయి. కానీ దానివల్ల ఆర్థిక వ్యవస్థ అస్థిరత ఎక్కువవుతుంది. కాబట్టి వారి విధాన సలహా ఏమంటే, అంచనా వేయుటకు వీలుకల క్రమబద్ధ విధానాలు ఉచితమైనవి. ఈ సలహా ఆధారంగా 1980లో మొదటి సారి ఇంగ్లాండ్‌లో మార్గరెట్ థాచర్ ప్రభుత్వం రాబోయే సంవత్సరాలకి ద్రవ్యం సప్లయ్ వృద్ధిని నిర్ణయించి ప్రకటించింది. దీనివల్ల ద్రవ్యోల్బణం నియంత్రించబడుతుందని భావించడం జరిగింది. కానీ నిజంగా జరిగిందేమంటే, వెనుకటి కన్న కఠోర పరిస్థితి ఏర్పడింది. ద్రవ్యోల్బణ నియంత్రణ ప్రయత్నం తీవ్ర మాంద్య స్థితికి దారితీసింది. హేతువాద అంచనాల సిద్ధాంతం తెలిపిన దానికి విరుద్ధంగా, ద్రవ్య సప్లయ్ తగ్గుదల కేవలం ధరలను తగ్గించకుండా, నిరుద్యోగితను పెంచింది, అల్ప ఉత్పత్తికి కారణంగా మారింది. వారు ఈ నగ్న సత్యాన్ని తమ సిద్ధాంత దోషంగా ఒప్పుకోలేదు. ప్రకటించిన ద్రవ్యం కోతను ప్రజలు అనుమానించారని, అంచనాల సవరణలు చేయక పోవడం వల్ల అట్లా జరిగిందని తెలివిగా వారు తెలిపారు. ఏది ఏమైనప్పటికీ, అంచనాల ప్రకారం ఫలానా అంశం X % మేరకు మారుతుందని కచ్చితంగా తెలుపకూడదు, ఒక అవధి (range) లో మార్పులుంటాయని తెలుపడం సమంజసం. ఉదా : ద్రవ్య సప్లయ్‌ను తగ్గిస్తే ధరలు ఖచ్చితంగా X % తగ్గుతాయని తెలుపకుండా, దాదాపు Y % (20%) ధరలు పెరగవచ్చునీ, Z % (10%) మేరకు ధరలు అంతే ఉండవచ్చునీ, ఇంకా K% (70%) మేరకు ధరలు తగ్గే సంభావ్యత కలదనీ తెలుపడం ఉత్తమం.

ఏ ప్రక్రియ ద్వారా, ఏవిధంగా అంచనాలు వేయబడతాయి అన్న ప్రశ్నకు వారు విశ్వసించ గల సమగ్ర సమాధానం ఇవ్వలేదు. ఈ ప్రశ్నకు వారు తెలిపిన కొన్ని సమాధానాలను తెలుసుకుందాం. (a) భవిష్యతు గురించిన లెక్కలు ఆర్థిక నమూనాలను ఉపయోగించి గణించబడతాయి. (b) ప్రజలు ఆర్థిక నమూనాలను రచించే వారినుంచి వార్తా పత్రికలు, ఎలక్ట్రానిక్ ప్రసార సాధనాల (టీ.వీ., వీడియో) ద్వారా సమాచారం ప్రోగుచేస్తారు. (c) మరొక సమాధానం ఏమంటే హేతువాదుల భావన ప్రవర్తనను వర్ణించేది కాదు, ఆర్థిక నమూనాల నిర్మాణానికి వారి భావన ఒక ఉత్తమ నియమం మాత్రమే.

ఈ మూడు సమాధానాలలో మొదటిది సరి అయినది కాదు. ఎందుకంటే, సాధారణ ప్రజలు నమూనాలను నిర్మించలేరు. రెండవ జవాబు ఆకర్షణీయంగా కనబడినప్పటికీ అసంగతమైనది (inconsistent).

BRAOU

ఎందుకంటే వారి ప్రకారం వాటాల మార్కెటు గురించి నిపుణులు తెలిపేది చాలా తప్పుగా ఉంటాయి. మూడవది కూడా అసంబద్ధమే (absurd). అంచనాలకు, నమూనాలు తెలిపే భవిష్యత్ సంభావ్యత (forecasts) మధ్య మైత్రిలేదు. ఇంకా, ప్రజలు ఊహాగానాలు కలిగి లేనిదే, నమూనాల నిర్మాణం సాధ్యం కాదు. ఇట్లా అంచనాల రూపకల్పన, నిర్మాణం ఎట్లా జరుగుతుందో శాస్త్రీయంగా, తార్కికంగా ఎవరూ తెలుపలేదు.

వారి ప్రకారం ప్రజలు విజ్ఞానులైనప్పుడు క్రమబద్ధ తప్పులు చేయరు. పెట్టుబడిదారీ వ్యవస్థలో వృద్ధి, మాంద్యం ఒకదాని పిదప మరొకటి ఏర్పడతాయి. ఊర్థ్వగమనంగా కార్యకలాపాలు జరుగుతున్నప్పుడు పెట్టుబడి పెరుగుతుంది. పోటీని తట్టుకోవడానికి, స్వలాభాల గరిష్ఠతను (సంఘ శ్రేయస్సుకు కాదు) పెట్టుబడిని పెంచవలసిన అవసరం ఉంటుంది. అట్లాగే మాంద్య స్థితిలో వ్యక్తిగత నష్టాలను తగ్గించుకోవడానికి (సంఘ శ్రేయస్సుకు కాదు) పెట్టుబడిని తగ్గించవలసి ఉంటుంది. సంఘ పరంగా పైన తెలిపిన రెండు స్థితుల్లో వరుసగా పెట్టుబడిని తగ్గించాలి, పెంచాలి. కానీ దానికి విరుద్ధంగా జరుగుతుంది. ఇట్లా వ్యాపార చక్రాల కాలంలో పెట్టుబడి దారులు క్రమబద్ధంగా చేసిన తప్పులను తిరిగి చేస్తారు. గమనించవలసిన విషయమేమంటే, ప్రభుత్వం చెడు త్రోవను చూపించే విధానమేదీ అమలు చేయనప్పటికీ, దోషాలు క్రమబద్ధంగా దొర్లుతాయి. ఈ విమర్శను హేతువాద అంచనాల వారు కింది విధంగా ఎదుర్కొనుటకు ప్రయత్నించారు. వ్యాపార చక్రాల కాలంలో ప్రజలకు సంపూర్ణ సమాచారం లభ్యం కానందున, ఇంకా ఆకస్మిక సంఘటనల (shocks) వల్ల అంచనాలు తప్పుతో వేయబడతాయి. ఇంతేకాకుండా, ఒక వ్యక్తి కలిగి ఉన్న, సేకరించిన సమాచారం ఇతరులకు లభ్యం కానందువలన, దోషాలు పునరావృత్తమవుతాయి.

హేతువాద అంచనాల ప్రజలు వేసే స్థోమత కలిగి ఉన్నప్పటికీ ప్రభుత్వ విధానాలకు స్థానం కలదు (వారి ప్రకారం స్థానం లేదని జ్ఞప్తికి చేసుకోవాలి). గేమ్స్ సిద్ధాంతాన్ని పురస్కరించుకుని, పోటీలో పాల్గొనే ఏజంట్లలో (లక్షలాది వ్యక్తులు, సంస్థలు) ప్రభుత్వ ఏజంటును శక్తివంతమైన భాగస్వామిగా (dominent player) చిత్రీకరించవచ్చు. సాధారణ ప్రజానీకానికి లభించని సమాచారాన్ని ప్రభుత్వం సులభంగా పొందగలుగుతుంది. కాబట్టి ప్రభుత్వం సందర్భానుసారంగా అంచనాల దోషాలను నియంత్రించి, విధానాలను సమర్థవంతం చేయవచ్చు. ఇట్లా పరివర్తన రహిత లేదా ఇన్‌వేరియన్స్ ప్రతిపాదనను సవాలు చేసి, ప్రభుత్వానికి పాత్రనివ్వవచ్చు.

మరొక విషయం - మార్కెట్ క్లియరింగ్ ప్రమేయాన్ని సడలిస్తే (సమంజసమైనది కాదని), ప్రభుత్వ స్థిరీకరణ విధానాలు, కేన్సియన్లు తెలిపిన విధంగా ప్రామాణిక ఫలితాలనిస్తాయి.

హేతువాద అంచనాల వారు తెలిపిన " విధానాల నిస్సహాయత (irrelevance) ప్రతిపాదన " నుంచి మంచి, చెడు వార్తలను (good and bad news) ఉత్పన్నం చేయవచ్చు. వారి ఈ ప్రతిపాదన ఒక స్థితిలో ఆశాజనకమైన, మరొక స్థితిలో విరుద్ధ ఫలితాలను కలుగచేస్తుంది. ద్రవ్య సప్లయ్‌ను తగ్గిస్తున్నామని అధికారులు ప్రకటించి, సులభంగా ప్రయాస లేకుండా, ద్రవ్యోల్బణాన్ని (సంవృద్ధి స్థితిలో) తగ్గించవచ్చు. లేదా అదుపు చేయవచ్చు. కారణమేమంటే హేతువాద ప్రజలు ధరలు తగ్గుతాయని భావించి, తమ ఉత్పత్తి ధరలను, వేతనాలను అధో ముఖంగా సవరించుకుంటారు. ఇట్లా ద్రవ్య సప్లయ్ తగ్గినప్పుడు కేవలం ధరలు తగ్గి ఉద్యోగిత - ఉత్పత్తి స్థిరంగా ఉంటాయి.

$\downarrow$ ద్రవ్య సప్లయ్ $\rightarrow$ ధరలు $\downarrow \rightarrow$ ఉత్పత్తి - ఉద్యోగిత స్థిరం.

ధరల తగ్గుదల నిరుద్యోగితకు (ఫిలిప్స్ రేఖ వృత్తాంతం) దారితీయదు. ఇది సువార్త. ద్రవ్యోల్బణాన్ని

BRAOU

తగ్గించుటకు, సార్జంటు - వాలెస్‌ల వాదన, ద్రవ్య విధానాన్ని క్రితం కన్న ఎక్కువ సమర్థనీయ విధానమని తెలుపుతుంది. సువార్తతో సహా వారి ప్రతిపాదన కఠోర వార్తను కూడా అందిస్తుంది. మాంద్య స్థితి రాబోతున్న స్థితిలో, ద్రవ్య సప్లయ్ పెంచబడునని ప్రకటించినను, ఆ చర్య స్వయం ఓటమికి దారి తీయడం శోచనీయం. ద్రవ్య సప్లయ్ లోని పెరుగుదల కేవలం ధరలను పెంచుతుంది ఉద్యోగిత క్షీణతను అదుపు చేయదు.

↑ ద్రవ్య సప్లయ్ → ↑ ధరలు → ↓ ఉద్యోగిత

ఇట్లా హేతువాద అంచనాల సిద్ధాంతం కొన్ని శోచనీయమైన, అసంగతమైన, విరుద్ధ, అసాధారణ పరిణామాలకు తావు ఇస్తుంది. లభ్యమైన పరిశోధనల ఫలితాలవల్ల తెలిసిన సత్యమేమంటే, వారి వాదన ఆధారంగా ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన "ఉదాత్త" పరిశోధనలు చేయటానికి వీలు లేదు. వారి ప్రతిపాదనలను పూర్తిగా అంగీకరించలేం, తిరస్కరించలేం.

## 13.10 సారాంశం

స్థూల అర్థ శాస్త్రంలో అనాదిగా భవిష్యత్తు గురించిన అంచనాలకు ప్రాముఖ్య మివ్వబడింది. చాలాకాలం వరకు అంచనాల నిర్ణయం బాహ్యంగా జరుగునని భావించబడింది. 1960 ప్రాంతం నుంచి అంచనాలకు సంబంధించిన రెండు పరికల్పనలు ప్రచారంలోకి వచ్చాయి : అడాప్టీవ్, హేతువాద అంచనాలు. కాగన్, నర్లోవ్‌లు మొదటి పరికల్పనను ; జాన్‌ముల్, లుకాస్, సార్జెంటు, వాలెస్ మొదలగు వారు రెండవ పరికల్పనను ప్రతిపాదించారు. ఈ రెండవ పరికల్పనను ప్రతిపాదించిన పిదప, లుకాస్ వ్యాసం ప్రకటనలో నూతన సంప్రదాయ అర్థ శాస్త్ర శాఖ జన్మించినట్లు తెలుపడం జరిగింది. హేతువాద అంచనాల సిద్ధాంతాన్ని ద్రవ్య వాదుల సిద్ధాంతం యొక్క తీవ్ర రూపాంతరంగా గుర్తించవచ్చు. హేతువాద అంచనాల సిద్ధాంతం వల్ల ద్రవ్య వాదానికి మరింత బలం చేకూరింది. హేతువాదులు ఫ్రీడ్‌మన్‌ను అనుకరిస్తారు, ఖండిస్తారు. హేతువాదులు అందరికీ తెలిసిన కొన్ని సత్యాలను తేటతెల్లంగా వివరిస్తారు. తెలివితేటలు ఉన్న వారు తప్పులు చేసిననూ వాటిని పునరావృతం కాకుండా జాగ్రత్త పడతారని వాదిస్తారు. కాబట్టి, ప్రభుత్వ విధానాలకు, ముఖ్యంగా ద్రవ్య విధానానికి, వాస్తవ అంశాలను మార్చే శక్తి లేదని తెలిపారు. హేతువాదులు మార్కెట్ క్లియరింగ్ భావన ఆధారంగా విధానాల ' పరివర్తన రహిత ప్రమేయాన్ని ' ప్రచారం చేసారు.

ఈ వాదంపై సైద్ధాంతిక, వ్యవహారిక విమర్శలు చాలా కలవు. వారి వాదం అంతరంగికంగా మైత్రిలేని అసంగతాలకు, ఆశ్చర్యకర ఫలితాలకు, స్వయం విరుద్ధ భావాలకు తావిస్తుంది. హేతువాద అంచనాలు ఎట్లా, ఏ యంత్రాంగం ద్వారా వేయబడతాయో స్పష్టంగా శాస్త్రీయంగా తెలుపబడలేదు. వారు తెలిపిన దానికి విరుద్ధంగా "ఆట సిద్ధాంతం" (Game Theory) ఆధారంగా ప్రభుత్వానికి ఆర్థిక కలాపాలలో ఉచిత స్థానాన్ని కల్పించవచ్చు. స్థిరీకరణ విధానాలకు, వ్యాపార చక్రాల నియంత్రణకు, ద్రవ్య కోశ విధానాలకు పాత్ర కలదు. చివరిగా వారి సిద్ధాంతం చూడడానికి సాధారణమైనదిగా కనిపించినను, వారి ప్రతిపాదనలను పూర్తిగా అంగీకరించ వీలుపడదు, ఉపేక్షించడం కూడా సబబు కాదు.

BRAOU

## 13.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది వాటిలో ఒక్కొక్క దానికి 40 పంక్తులలో జవాబులు రాయండి.**

1. అడాప్టివ్, హేతువాద అంచనాల పరికల్పనలకు మధ్య భేదాలను వివరించి, హేతువాద అంచనాల పరికల్పన ప్రధానాంశాలను పరిశీలించండి.

2. హేతువాద అంచనాలంటే ఏమిటి ? వాటిని ఏవిధంగా సిద్ధం చేస్తారు ? ఈ వాదనపై కల ప్రధాన విమర్శలేమి ?

**II. క్రింది వాటిలో ఒక్కొక్క దానికి 20 పంక్తులలో జవాబులు రాయండి.**

1. అడాప్టివ్, హేతువాద అంచనాల పరికల్పనల భేదాలను వివరించండి.

2. హేతువాద అంచనాల సిద్ధాంతం యొక్క ముఖ్య ప్రతిపాదనలను తెలియజేయండి.

## 13.12 సంప్రదింపు గ్రంథాలు


1. K.H. Begg, *Rational Expectations in Macro Economics : Theories & Evidences,* Heritage, Delhi, 1982.

2. A Matyas, *History of Modern Non-Marxian Economics,* Macmillan, London, 1985, pp. 543-73.

3. J.F. Muth, " Rational Expectations & The Theory of Price Movements, " *Econometrica,* 29(3), 1961.


## 13.13 పారిభాషిక పదకోశం

| | | |
|---|---|---|
| Rational | = | హేతుబద్ధ |
| Adoptive | = | ఒకటి మరొక దానితో సరిదిద్దుకోబడుట, సవరించుకొనుట |
| Hypothesis | = | పరికల్పన |
| Boom | = | సంవృద్ధి |
| Depression | = | మాంద్యం |
| Debate | = | చర్చ |
| Counter - revolution | = | ప్రతికూల విప్లవం |
| Radical variant | = | తీవ్ర రూపాంతరం |
| Empirical | = | వ్యావహారిక |
| Shocks | = | ఆకస్మికాలు |
| Systematic errors | = | క్రమబద్ధ దోషాలు |

BRAOU

| | | |
|---|---|---|
| Invariance proposition | = | పరివర్తన రహిత ప్రతిపాదన |
| Cruel choice | = | కఠోర ఎంపిక (సమస్య) |
| Natural rate of unemployment | = | సహజ నిరుద్యోగిత రేటు |
| Potential | = | సంభావ్యత |
| Absurd | = | అసంబద్ధం |
| Theoretical | = | సైద్ధాంతికం |
| Upwards | = | ఊర్ధ్వ ముఖంగా |
| Downwards | = | అధోముఖంగా |
| Standard | = | ప్రామాణికం |

- ఆచార్య ఎస్. కిషన్ రావ్

BRAOU

# ఎం.ఎ. అర్థశాస్త్రం ( రెండవ సంవత్సరం)

## కోర్సు - X : ద్రవ్యం, బ్యాంకింగ్

### పాఠ్య ప్రణాళిక

| | | |
|---|---|---|
| **ఖండం I** | **:** | **ద్రవ్య సప్లయ్** |
| భాగం : 1 | : | ద్రవ్యం : పరిణామం, స్వభావం, ప్రాధాన్యత |
| భాగం : 2 | : | భారతదేశంలో ద్రవ్య సప్లయ్ కొలమానాలు |
| భాగం : 3 | : | ద్రవ్య సప్లయ్‌కి సంబంధించి 'H' సిద్ధాంతం - ద్రవ్య గుణకం |
| భాగం : 4 | : | ద్రవ్య సప్లయ్‌ని ప్రభావితం చేయు కారకాలు - భారతీయ రిజర్వు బ్యాంకు వివరణ |
| **ఖండం II** | **:** | **ద్రవ్య డిమాండ్** |
| భాగం - 5 | : | ద్రవ్యరాశి సిద్ధాంతాలు : సాధారణ ధరల స్థాయిపై ఫిషర్, కేంబ్రిడ్జ్ దృక్పథాలు |
| భాగం - 6 | : | ద్రవ్య డిమాండ్ దృక్పథాలు : సంప్రదాయ వాదులు, కేన్స్ |
| భాగం - 7 | : | కేన్సియన్ల, ఉత్తర - కేన్సియన్ల, ఫ్రీడ్‌మన్‌ల ద్రవ్య డిమాండ్ దృక్పథాలు |
| **ఖండం III** | **:** | **ద్రవ్యం : సమస్యలు, దృక్పథాలు** |
| భాగం - 8 | : | ద్రవ్యం - విత్తాభివృద్ధి |
| భాగం - 9 | : | ప్రసార యంత్రాంగం |
| భాగం - 10 | : | ద్రవ్యోల్బణం : సిద్ధాంతాలు, కారణాలు, ప్రభావాలు |
| భాగం - 11 | : | సాధారణ ధరల స్థాయి గణన |
| భాగం - 12 | : | కేన్స్ పరమైన వాదం, ద్రవ్య వాదం |
| భాగం - 13 | : | హేతుబద్ధ అంచనాల పరికల్పన |
| **ఖండం IV** | **:** | **వాణిజ్య బ్యాంకింగ్** |
| భాగం - 14 | : | విత్త వ్యవస్థ : ద్రవ్య, మూలధన మార్కెట్లు |
| భాగం - 15 | : | భారత దేశంలో వాణిజ్య బ్యాంకుల విధులు, పురోగతి |
| భాగం - 16 | : | బ్యాంకేతర పరపతి సంస్థలు |
| భాగం - 17 | : | భారత దేశంలో అభివృద్ధి బ్యాంకులు |
| భాగం - 18 | : | భారతదేశంలో గ్రామీణ బ్యాంకింగ్ |

BRAOU

భాగం - 19 : వాణిజ్య బ్యాంకుల పరపతి సృష్టి విధానం

**ఖండం V : కేంద్ర బ్యాంకింగ్**

భాగం - 20 : కేంద్ర బ్యాంకులు : లక్ష్యాలు, విధులు

భాగం - 21 : పరిమాణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు

భాగం - 22 : గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు

భాగం - 23 : భారత దేశంలో పరపతి ప్రణాళిక

**ఖండం VI : విత్త వ్యవస్థ, సంస్కరణలు**

భాగం - 24 : భారతదేశ ద్రవ్య వ్యవస్థపై చక్రవర్తి కమిటీ నివేదిక

భాగం - 25 : భారతదేశ విత్త సంస్కరణలపై నరసింహం కమిటీ మరియు ఇతర కమిటీల నివేదికలు

భాగం - 26 : అంతర్జాతీయ ద్రవ్య, విత్త సంస్థలు

BRAOU

# డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## ఎం.ఎ. అర్థ శాస్త్రం (రెండవ సంవత్సరం)

## మాదిరి పరీక్షా పత్రం

## కోర్సు - X : ద్రవ్యం, బ్యాంకింగ్

సమయం : 3 గంటలు

మార్కులు : 100

**విభాగం - A (15 × 4 = 60 మార్కులు)**

క్రింది ఎనిమిదింటిలో ఏవైనా నాలుగు ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 40 పంక్తుల చొప్పున జవాబులు రాయండి.

1. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య విధులను చర్చించండి.
2. ద్రవ్య వ్యవహారాల సిద్ధాంతానికీ, ద్రవ్య నిల్వల సిద్ధాంతానికీ మధ్య గల పోలికలను, తారతమ్యాలను పరిశీలించండి.
3. సూచీ సంఖ్యల నిర్మాణం ఎలా జరుగుతుంది ? వాటి గణనలో ఎదురయ్యే ఇబ్బందులేమి ?
4. హేతువాద అంచనాలంటే ఏమిటి ? వాటిని ఏవిధంగా సిద్ధం చేస్తారు ? ఈ వాదనపై కల ప్రధాన విమర్శలేమి ?
5. బ్యాంకేతర పరపతి సంస్థలు అంటే ఏమిటి ? పరపతి కల్పనలో వాటి పాత్రను వివరించండి.
6. సహకార పరపతి సంస్థల పాత్రను విమర్శనాత్మకంగా తెలుపండి ?
7. భారతదేశంలో పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు ఎంతవరకు ఆశించిన లక్ష్యాలను సాధించగలిగాయి ?
8. భారత దేశ ద్రవ్య వ్యవస్థపై చక్రవర్తి కమిటీ సిఫారసులను పరిశీలించండి.

**విభాగం -B (8 × 5 = 40 మార్కులు)**

క్రింది పదింటిలో ఏవైనా ఐదు ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 20 పంక్తుల చొప్పున జవాబులు రాయండి.

9. $M_1$ ద్రవ్య సప్లై కొలమానాన్ని వివరించండి.
10. ద్రవ్య సప్లయ్‌ని ప్రభావితం చేయు కారకాలేవి ?
11. ద్రవ్య గుణకాన్ని విశదీకరించండి.
12. కేన్స్ సిద్ధాంతం ప్రకారం ప్రసార యంత్రాంగం ను తెలియజేయండి.
13. ఫిలిప్స్ రేఖను విమర్శనాత్మకంగా పరిశీలించండి.
14. విత్త వ్యవస్థలోని అంతర్భాగాలేవి ?
15. వాణిజ్య బ్యాంకుల ఆస్తి - అప్పుల పట్టీని విపులీకరించండి.
16. NABARD విధులేమిటి ?
17. గుణాత్మక పరపతి నియంత్రణ ఆవశ్యకతను వివరించండి.
18. ప్రపంచ బాంకు పనితీరును పరిశీలించండి.

BRAOU

# ఎం.ఎ. ఆర్థశాస్త్రం ( రెండవ సంవత్సరం)

## కోర్సు - X : ద్రవ్యం, బ్యాంకింగ్

### అభ్యాసం (Assignment) - I

**గమనికలు :**

- పుస్తకాలను చూచి, జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలిండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి, రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

**I. క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 40 పంక్తులలో జవాబులు రాయండి.**

1. ద్రవ్య సప్లయ్‌కి సంబంధించి ద్రవ్య గుణక సిద్ధాంతాన్ని వివరించండి.
2. ఫ్రీడ్‌మన్ ద్రవ్య డిమాండ్ సిద్ధాంతాన్ని పరిశీలించండి.

**II. క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 20 పంక్తులలో జవాబులు రాయండి.**

3. ద్రవ్య పరిణామ క్రమాన్ని చర్చించండి.
4. ఫిషర్, కేంబ్రిడ్జ్ సిద్ధాంతాల మధ్య తారతమ్యాలను తెలుపండి.
5. భారతదేశంలో ద్రవ్య సప్లయ్ పోకడలను నిర్ణయించు కారకాలను వివరించండి.

BRAOU

# ఎం.ఎ. అర్థశాస్త్రం ( రెండవ సంవత్సరం)

## కోర్సు - X : ద్రవ్యం, బ్యాంకింగ్

### అభ్యాసం (Assignment) - II

**గమనికలు :**

- పుస్తకాలను చూచి, జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలిండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి, రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

**I. క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 40 పంక్తులలో జవాబులు రాయండి.**

1. కేన్స్ సిద్ధాంతం తెలిపే ప్రసార యంత్రాంగాన్ని వివరించండి.
2. ద్రవ్యోల్బణం అంటే ఏమిటి ? ద్రవ్యోల్బణ ప్రభావం ఏ విధంగా వుంటాయి ?

**II. క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 20 పంక్తులలో జవాబులు రాయండి.**

3. భారతదేశంలో విత్త మార్కెట్ల విస్తరణ ఏ విధంగా జరిగింది ?
4. సూచీ సంఖ్యల నిర్మాణంలో గల వివిధ దశలను తెలుపండి ?
5. హేతువాద అంచనాలను ఏ విధంగా సిద్ధం చేస్తారు ?

BRAOU

# ఎం.ఎ. అర్థశాస్త్రం ( రెండవ సంవత్సరం)

## కోర్సు - X : ద్రవ్యం, బ్యాంకింగ్

### అభ్యాసం (Assignment) - III

**గమనికలు :**

- ✡ పుస్తకాలను చూచి, జవాబులను రాయకూడదు.
- ✡ సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- ✡ జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- ✡ అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- ✡ మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలిండి.
- ✡ ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి, రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

**I. క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 40 పంక్తులలో జవాబులు రాయండి.**

1. వాణిజ్య బ్యాంకులు అంటే ఏమిటి ? వాటి ప్రధాన విధులను విశదీకరించండి.
2. పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలను విపులీకరించండి.
3. విత్తరంగంలో నరసింహం కమిటీ సిఫారసులను తెలియజేయండి. వాటి అమలు ఏ విధంగా వుందో విమర్శనాత్మకంగా వివరించండి.

**II. క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 20 పంక్తులలో జవాబులు రాయండి.**

4. ద్రవ్య విధానపు అమలులో బ్యాంకేతర సంస్థల పాత్రను అంచనా వేయండి.
5. పెట్టుబడి సంస్థల విధులను, అవి పరిశ్రమల కందించే సేవలను సమీక్షించండి.
6. బ్యాంకు ఋణాలు డిపాజిట్లను ఎలా సృష్టిస్తాయి ?

BRAOU